
శ్రీసాయీ మాస్టర్ ప్రవచనములు




శ్రీసాయి మాస్టర్ ప్రవచనములు
పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ



అధ్యాయం-1



సద్గురువు

గురుమధ్యే స్థితం విశ్వం, విశ్వమధ్యే స్థితోగురుః।
గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురువే నమః॥

గురువే విశ్వం. గురువుకన్యంగా మరొకటి లేదు. అంటే గురువు అంతటి గొప్ప మహనీయుడన్నది సుస్పష్టం. అటువంటి గురువు సకల దేవతా స్వరూపి. బాగా అవగాహన చేసుకుంటూపోయేవారికి ఈ చరాచర విశ్వమంతా గురువు యొక్క స్వరూపమే. అంతకు భిన్నంగా మరొకటి లేదు. ఈ శ్లోకం వల్ల తెలిసేదేమిటంటే - ఈ చరాచర విశ్వమంతా తమ రూపమేనని ఎవరైతే నిరూపణ యివ్వగలరో వారే నిజమైన, సిసలైన, సంపూర్ణమైన గురువు అని.

ఉదాహరణకు శ్రీ కృష్ణుడు జగద్గురువుగా, యోగీశ్వరుడిగా, గీతాచార్యుడుగా లోకంలో ఇంతటి కీర్తి గడించడానికి కారణం భగవద్గీతోపదేశం కాదు. ఎందుకంటే అదే భగవద్గీతను అనేకసార్లు చదివినటువంటి మామూలు వ్యక్తి గూడా శ్రీ కృష్ణుడు చెప్పినంత గొప్పగానూ ఉపన్యాసం ఇవ్వగలడు. కానీ, మామూలు వ్యక్తి చేయలేని పని ఒకటుంది అదే విశ్వరూప సందర్శనం. శ్రీ కృష్ణుడు అర్జునునికి విశ్వరూప సందర్శనం కలిగించాడు. తాను చెప్పినదంతా నిజమని నిరూపించాడు. ఆ పని మామూలు వ్యక్తి ఎలా చేయగలడు? తాను చెప్పినది నిజమని అర్జునుడికి అనుభవపూర్వకంగా నిదర్శనమిచ్చాడు శ్రీ కృష్ణుడు. ఈ సృష్టి అంతా తన రూపమేనని చెప్పాడు. అప్పటిదాకా శ్రీకృష్ణుడు ఎంతగా చెప్పినా, 'ఏమిటబ్బా! ఇట్లా చెప్పాడీయన' అని అర్జునుడికి అనిపిస్తుంది. కానీ, విశ్వరూప సందర్శనమయ్యేసరికి అర్జునునికి అప్పటివరకు తాను చెప్పిన విషయాలు మొత్తం (అంటే విశ్వరూప సందర్శనం ఇచ్చేటప్పటికి ఎన్ని అధ్యాయాలు గీతలో వున్నాయో అన్నీ) సమన్వయమై, అనుభవమై, దర్శనమయ్యాయి. అదే కృష్ణుని యొక్క గొప్పతనం. అందువలననే ఆ విషయంలో శ్రీకృష్ణునికి సాటి ఎవరూ లేరు. మరలా అదే విషయం అంత సంపూర్ణంగానూ పామరులైన మానవులకు గూడా ఈ విశ్వమంతా తన రూపమేనని అనుభవపూర్వకంగా నిరూపించిన వారు శ్రీ శిరిడీ సాయి నాథుడు.

ఎంతోమంది మహాత్ములు వచ్చారు, పోయారు. ఇందులో ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ, అన్నది ప్రశ్న కాదు. కాని మనకు అనుభవపూర్వకంగా నిరూపించడంవల్ల మార్గం సులభమవుతుంది. మన మనస్సు తేలిక అవుతుంది. ఏ మహాత్ముడైనా, శ్రీ కృష్ణుడైనా, ఏ దైవమైనా చెప్పేది ఒక్కటే. **"క్షణకాలమైనా విడవకుండా ఎల్లప్పుడూ మనసులో నన్నే చింతన చేస్తూ వుండండి. గుర్తు పెట్టుకోండి. మీ క్షేమ సమాచారాలన్నీ నేను కనిపెడుతుంటాను,"** అనే. భక్తుల యోగక్షేమములు వహిస్తానని శ్రీ కృష్ణుడు చెప్పాడు. అదే సాయిగూడ చెప్పారు. ఎంతమంది మహనీయులు వచ్చారో, అంతమందీ ఇదేమాట చెప్పారు. ఎంత మంది చెప్పినా ఒకటి మాత్రం మనవల్లకాదు. అదేమిటంటే అంతా ఆయన రూపమేనని అనుకోవడం. కుక్క కుక్కగా కనపడుతుంటే, మనిషి మనిషిగా కనపడుతుంటే, వీళ్ళంతా ఆయన రూపమేనని అనుకోవడం ఎట్లా? ప్రక్కవారి మీద మనకు ఆగ్రహం వస్తుంది, అనుగ్రహమూ వస్తుంది. కోపము, అసూయ, ద్వేషం, భయము మొదలైనవన్నీ వస్తుంటాయి. కానీ, ఇవన్నీ కల్గించేటటువంటి మానవాకృతులన్నీ పరమేశ్వరుని రూపమని అనుకోవడమెట్లా? ఇంట్లో నిశ్చలంగా కూర్చొని భగవంతుని కోసం ధ్యానం చేస్తూ వుంటే ఎంతో ప్రయత్నంమీద ఆ ధ్యాన మందిరంలో కూర్చొన్నంతసేపు భగవంతుడి మీద మనస్సు నిలిస్తే నిలిచి యుండుగాక. కానీ ఎల్లప్పుడూ నిలవదు. ఉదాహరణకు ఒకడు ఆ ప్రయత్నం చేస్తూవుంటే (అంతా భగవత్స్వరూపమేనని) ఇంట్లోని పిల్లవాడు వచ్చి విపరీతంగా అల్లరి చేశాడనుకోండి. వాడిమీద కోపం వచ్చి వాడిని చావబాదాడనుకోండి. అప్పుడు ఏమయిందన్నమాట? అంతకుముందు వరకు తను చేసే ధ్యానంలో అతడు ఈ ప్రపంచంలోవున్న నామరూపాలన్నీ నీవేనయ్యా! అని నమస్కారం చేసుకొన్నాడు. వెంటనే ఆ పిల్లవాడిని పట్టుకుని చావబాదాడు. అప్పుడు ఎవర్ని పట్టుకొని చావబాదినట్లు? ఒకవేళ బాదకపోయినా, తీవ్రమైన ఆగ్రహం వచ్చి 'ఈ ఇల్లు నరకంరా!' అన్నాడనుకోండి. అప్పుడు ఏమయింది? ఏ పరాత్పరుడు తన చుట్టూ ఉన్నాడో, అన్ని రూపాలలోనూ ఉన్నాడో అదే వీడికి నరకమయింది. అంటే జగత్తు రూపంలో బ్రహ్మము ఉంది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" కానీ మనస్సులో నరకమే ఉన్నదని అర్థం. చూడగలిగే వాళ్ళకి అదే భగవత్స్వరూపం. చూడలేని వారికి అదే మామూలు గృహం. చికాకులో వుండేవారికి అదే నరకం. మన దృష్టిని బట్టే అంతావుంది. కాబట్టి మనదృష్టిమారాలి. పూజా గృహాలలోనుంచి ఇవతలకు

రాగానే నిత్యజీవితంలో అవతలవారి పనులవల్ల, మాటలవల్ల రాగద్వేషాలు ప్రకోపిస్తాయి. అందుకని మనం గుర్తుపెట్టుకోవడం కోసం మనం చేసే ప్రయత్నం వెంటనే ఎగిరిపోతుంది. వాడిట్లా చేశాడు, వీడిట్లా అన్నాడు అని, యిదే జాబితా చదువుతుంది మనస్సు. మనం ఇంక దైవాన్ని గుర్తుపెట్టుకొనేది ఎక్కడ? కనుక ఇది మానవజాతికి అంత సులభం కాదు. అంత తేలికగా రాదు. ఇది మామూలు మానవులకే గాదు. గొప్పగొప్ప ఋషీశ్వరులకు గూడ చాలా కష్టమయిన విషయం. ఆ ఋషీశ్వరులు మామూలు కార్యక్రమాలన్నింటినీ మానుకొని అరణ్యాలలో వుంటూ ఘోరతపస్సు చేసుకొంటూ అంతర్ముఖులై వుంటారు. ఎంతో ధ్యాన నిష్ఠతో, తపస్సుతో పైకి వచ్చిన మహనీయులుకూడా ఏ కారణం చేతనైనా ఆ తపస్సులోంచి లేచి ఇవతలకు వచ్చిన క్షణాలలో వారిమనస్సు చంచలమవు తున్నది, ప్రక్కకే పోతున్నది. ఒకరికి కామంవల్ల కావచ్చు, మరొకరికి మరొక కారణం కావచ్చు. ఆయా పనులద్వారా వారి తపస్సు వ్యర్థమయిపోయి మరలా తపస్సు చేసుకోవడమనే కర్మ పట్టడం మన పురాణాలలో చెప్పబడ్డది. ఒక ఋషీశ్వరుడు తపస్సు చేసుకొంటున్నాడు. ఎవరో ఏదో చేశారు. వారికి ఆగ్రహం వచ్చింది. "ఒరేయ్ నీవిట్లా అయిపో!" అని శాపం పెట్టాడు. ఆ శాపం రూపంలో, ఆగ్రహరూపంలో వాడికి పతనం వస్తుంది. అప్పుడు అవతలివాడికి కూడా కొద్దో గొప్పో సామర్థ్యం వుంటే వాడి తపస్సుతో వాడూ శాపం పెట్టాడు. అప్పుడు ఏమ యిందన్నమాట? వాడి శాపం తీరేదాకా వీడా శాపఫలాన్ని అనుభవించవలసిందే. అప్పుడు ఇంతకుముందు చేసిన తపస్సంతా వ్యర్థమయిపోయినట్లే గదా!

ఇదంతా ఎందుకు చెప్పానంటే, అంతటి మహాత్ములకే, తపస్వులకే అంతర్ముఖులై నిశ్చలంగా అదే నిష్ఠలో ఉండడం సాధ్యపడలేదు. కాసేపు తెరిపి కోసం బయటికొస్తే ఆ కాసేపటిలోనే బోల్తాకొట్టి పోయినవాడే వున్నాడు. తపస్సు భగ్నమైన వాళ్ళూ వున్నారు. అది అంతటి కష్టమైన పని. అది ఋషీశ్వరులకే సాధ్యపడలేదంటే ఇంక మనం ఎంత జాగ్రత్తగా వుండాలో తెలుసుకోవాలి.

ఉదాహరణకు ఒకరోజు ఒక భక్తురాలు బాబా వద్దకు వచ్చి బాబాను తన యింటికి భోజనానికి రమ్మంది. "అలాగే తల్లీ! తప్పకుండా వస్తాను. భోజనం కూడా చేస్తాను. కాని నేను వస్తే మాత్రం ఛీ కొట్టి తరిమేయకు సుమా!" అని అన్నారు బాబా. బాబా! "నేను మిమ్మల్ని అలా యెందుకు చేస్తాను? మీరు తప్పక రావాలి" అని ప్రార్థించి ఆమె ఇంటికి వెళ్ళింది. బాబాకు అతిథ్యమివ్వ

డానికి వంటకాలను సిద్ధం చేసి బాబా కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. భోజన సమయం దాటిపోతున్నా బాబా మాత్రం రాలేదు. కానీ ఒక కుక్కవచ్చి బాబా కోసం వండి వడ్డించడానికి సిద్ధంగా వున్న వంటకాలను ముట్టుకోబోయింది. అది చూచిన ఆమె పొయ్యిలో వున్న కట్టెనుతీసి ఆ కుక్కపైకి విసిరింది. ఆ కుక్క తప్పించుకొని వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆమె చాలాసేపు బాబాకోసం వేచి చూచిందిగాని బాబా రాలేదు. తర్వాత ఎంతో బాధగా మశీదుకు వెళ్ళి బాబా తన యింటికి భిక్షకు రానందుకు నిష్ఠూరమాడింది. అప్పుడు బాబా ఆమెతో, "నేను వస్తే మండుతున్నకట్టె నాపై విసిరావు గదమ్మా! నువ్వే నన్ను గుర్తుపట్టలేదు. సర్వజీవుల రూపాలలో నేనేవున్నానని గుర్తుంచుకో" అని చెప్పారు.

అలాగే హంసరాజ్ అనేవాడు చాలాకాలంగా ఉబ్బసవ్యాధితో బాధ పడుతుండేవాడు. ఎన్ని వైద్యాలు చేసినా తగ్గక పోయేసరికి బాబా దగ్గరకు వచ్చి శిరిడీలోనే కొంతకాలమున్నాడు. అతనిని బాబా పుల్లపెరుగు తినవద్దన్నారు. కానీ అతడికి పుల్లపెరుగంటే చాలా ఇష్టం. అందుకని బాబా తినవద్దన్నా కూడా భార్యచేత బలవంతాన తోడు పెట్టించుకొని తినేవాడు. కానీ సర్వజ్ఞుడైన బాబాకు తెలియనిదేమున్నది? బాబా చిత్రమైన లీల చేశారు. ప్రతిరోజూ ఆ దంపతులు మశీదులో మధ్యాహ్నాహారతికి హాజరయ్యేవారు. వారు అక్కడకు వచ్చిన సమయంలో ప్రతిరోజూ వీళ్ళ రూములోకి ఒక పిల్లి వచ్చి పెరుగు తినిపోయేది. మొదటి రోజలా జరిగేసరికి పొరపాటు అనుకొని అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు. కాని అదేమి చిత్రమో వీరెన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆ పిల్లి రావడం, పెరుగు తినిపోవడం ప్రతిరోజూ జరుగుతూనే వుంది. చివరకు అతనికి విసుగుపుట్టి, కోపం వచ్చి హారతికిగూడ పోకుండా దాన్నెలాగైనా రాకుండా చూడాలని, వస్తే కొట్టాలనీ నిర్ణయించుకొని ఒక కర్ర చేత్తో పట్టుకొని కాపలా కూర్చున్నాడు. సరిగా సమయానికి ఆ పిల్లి రానే వచ్చింది. "రోజూ పెరుగుతిని పోతావా"? అని అతడు దానిని కర్రతో కొట్టాడు. తర్వాత అతడు మశీదుకు రాగానే బాబా అన్నారు: "ఇక్కడొక పనికిమాలినవాడు ఉబ్బసంతో బాధపడు తున్నాడు. వాడిని పుల్లపెరుగు తినవద్దని చెప్పాను. ఎంత చెప్పినా వినకుండా అతడు తింటూనే వుంటే నేనే పిల్లి రూపంలో వెళ్ళి తిని అతడా పెరుగు తినకుండా చూస్తున్నాను. చివరకు వాడు నన్నీరోజు కర్రతో కొట్టాడు" అన్నారు.

అలాగే బల్వంత్ నాచ్నే అన్నగారు బొంబాయిలో శస్త్రచికిత్సకని ఆస్పత్రిలో వున్న సమయంలో వాళ్ళింటికి ఒక సాధువు వచ్చి భిక్ష అడిగాడు. అతని వదినగారు అన్నం పెట్టింది. ఇంట్లో బెండకాయకూర వుందిగానీ అది అందరూ తినగా మిగిలినది కదా! అని అయనకు వెయ్యలేదు. వేరే కూర వేసింది. కానీ ఆ సాధువు ఆ కూరే అడిగి వేయించుకొని మరీ తిన్నాడు. ఆ తర్వాత 4 సం॥ల తర్వాత అతడు శిరిడీ మొట్టమొదటసారి వెళ్ళినప్పుడు బాబా ఆ సాధువు తానేనని అతనికి తెల్పారు.

ఇలాంటి ఎన్నో సంఘటనల ద్వారా ఏ సాధువుకు పెట్టినా తనకే చెందుతుందని, ఏ ప్రాణిని ఆదరించినా, హింసించినా తనకే చెందుతుందనీ నిరూపించారు బాబా.

ఏ దైవానికైనా మ్రొక్కుకొని ఆ మ్రొక్కు ఎగ్గొడితే వాళ్ళు రాగానే వాళ్ళు మ్రొక్కుకున్నంత డబ్బూ అడిగి పుచ్చుకునేవారు. అలాగని ప్రక్కవాడు డబ్బు లిస్తే తీసుకునేవారు కాదు. "ఏమయ్యా! వాడిస్తే తీసుకొంటివి, వీడిస్తే తీసుకో లేదేమని అడిగితే "వాడు మ్రొక్కుకొని ఎగ్గొడితే అడిగి తీసుకున్నాను. వీడు మ్రొక్కుకోలేదు గనుక వీడి దగ్గర తీసుకోలేదు"అనేవారు. కాబట్టి ఏ దేవత కర్పించినా తనకే చెందిందని, చివరకు మానవమాత్రుణ్ణి గూడ ఏ విధంగా చూచుకున్నాగూడ అది ఆయనకే చెందిందని భక్తులకు అసంఖ్యాకంగా అటు వంటి అనుభూతులను యిస్తూనే వచ్చారు. అంతటా అన్నిరూపాలలో వ్యాపించి వున్నవాడు అంతటా వున్నాడుగనుక ఎప్పుడూ ఆయనకు అన్నీ తెలుస్తూనే వుంటాయి. కారణం అన్ని రూపాలలో ఆయనే వున్నారు గనుక.

ఉదాహరణకు చంద్రాబాయి బోర్కర్ అనుభక్తురాలు శిరిడీలో కొంత కాలమున్నారు. అప్పుడామె భర్త పండరీపురంలో వున్నాడు. ఒకరోజు బాబా ఆమెతో పండరిపురంలోని ఆమె భర్తవద్దకు వెళ్ళమని చెప్పారు. ఆమె వెంబడే తానుంటానని గూడ చెప్పారు. కాని ఆమె అక్కడకు వెళ్ళేసరికి ఆయనక్కడ లేరు. ఎక్కడికి వెళ్ళారో గూడ తెలియలేదు. ఏమి చేయాలో తోచని పరిస్థితు లలో ఆమె వుండగా, ఒక ఫకీరు ఆమె వద్దకువచ్చి, మీవారు ధోండ్ స్టేషన్‌లో వున్నారు. వెంటనే వెళ్ళమని చెప్పి టికెట్టు గూడ యిచ్చారు. అంతేగాక ఆమె భర్తకుగూడ కలలో ఒక ఫకీరు కన్పించి నీ భార్య ఫలానా రైలులో వస్తున్నదని చెప్పారు. తర్వాత ఆ ఫకీరు సాయిబాబానేనని వాళ్ళు తెలుసుకున్నారు.

బాబా ఆదేశం ప్రకారం ఖండోబా ఆలయంలో వున్న ఉపాసనీ బాబా, బాబాకు నైవేద్యమిచ్చిన తరువాత తను భోజనం చేసేవారు. ఒకరోజు ఉపాసనీ ఆ నైవేద్యాన్ని తీసుకొనిపోతూ వున్నప్పుడు ఒక నల్లకుక్క తోకాడిస్తూ వెంట పడింది. దీనికి పెట్టిన తరువాత బాబాకు నైవేద్యం పెట్టడం ఎట్లాగా అని దానిని ఛీ కొడుతూ, కసిరికొడుతూ మసీదుకు వెళ్ళారు. వీరు మసీదుకు వెళ్ళి బాబాకు నైవేద్యం యివ్వబోతే, "ఇక్కడికెందుకు తీసుకువచ్చావు? నేనక్కడ నల్లకుక్క రూపంలో వున్నాను గదా!" అన్నారు బాబా. కాబట్టి యికనుండి గుర్తుపెట్టు కోవడానికి ప్రయత్నిద్దామని అనుకొన్నాడు. అంతగా ప్రయత్నించినప్పటికీ, అంత జాగ్రత్తగా వుంటున్నప్పటికీ మరలా ఏమారాడతను. ఒకరోజు యితను వంట చేసుకుంటుంటే బిచ్చమెత్తుకునే వాడొకడు ఆశగా నిలబడి దానివైపు చూస్తు న్నాడు. నైవేద్యం పెట్టకముందే యితడు చూస్తున్నాడు కాబట్టి అది అపవిత్ర మౌతుందని తలచి అతనిని కసిరికొట్టాడు. నైవేద్యం మసీదుకు తీసుకెళ్ళగానే మరలా బాబా కోప్పడ్డారు. "ఇప్పటినుండి గుర్తు పెట్టుకో. ఎక్కడ నీ దృష్టి పడు తుందో, అక్కడ నేనున్నా"నని చెప్పారు బాబా. ఈ విధంగా సకలచరాచర విశ్వమంతా తమ రూపమేనని నిరూపించిన శ్రీసాయిబాబా సమర్థ సద్గురువు.



అధ్యాయం-2



ఉగాది

ఉగాది అనేదానికి మన పెద్దలు యుగాది అన్నారు. అంటే క్రొత్త యుగం ఆరంభం కావడం. అంటే సమాజంలో వుండే వ్యక్తుల అభిప్రాయాలు, వాళ్ళ చేతలు నూతన ప్రజ్ఞతో పని చేయడాన్ని క్రొత్తయుగం అంటారు. అలాగే వ్యక్తి జీవితంలోగూడ యుగాది జరుగుతుంది. అంతవరకూ వాళ్ళ శరీరంలో వుండే జీవకణాలన్నీ ఒకరీతిన పనిచేస్తూ ఒకరకమైన భావాన్ని ప్రేరేపిస్తూ వుండడం ఒక రకమైనయుగము. వాటియొక్క క్రియ యింకా సంకీర్ణమై యింకా నిర్దుష్టంగా ఎప్పుడైతే పనిచేయడం మొదలుపెడుతుందో, అప్పుడు శరీరగతంగా వుండే అన్ని జీవకణాలకు ఒక నూతన యుగాది. అలాగే ఒక సమాజంలో వుండే వ్యక్తులందరూ ఆ సమాజమనే దేహంయొక్క జీవకణాలైతే, వారందరియొక్క యోచన, ఒక నూతనమైన క్రియాధర్మాన్ని ఎప్పుడైతే వహిస్తుందో అది సమిష్టిగా సమాజమంతటికీ యుగాది. ఈ రెండింటికీ సంకేతంగానే మనం బాహ్యమైన ఉగాది చేసుకుంటున్నాము. ఈ ఉగాదిని చేసుకునేటప్పుడు వేపపూతను ప్రాధాన్యంగా తీసుకుంటున్నాము. కనుక ఈ వేపచెట్టుయొక్క సంకేతం ఏమిటి అనేది తెలుసుకుందాము.

శిరిడీ సాయినాథుని కృపవల్ల మహాత్ముడిగా రూపొందిన ఉపాసనీ మహరాజ్, సాయినాథుని స్తుతిస్తూ, "***సదా నింబవృక్షస్య మూలాధివాసాత్***" అని వ్రాశారు. శ్రీ సాయినాథుడు మొట్టమొదటగా శిరిడీ గ్రామంలో వేపచెట్టు క్రింద కూర్చుని కనిపించారు, ఎప్పుడూ వేపచెట్టుపైనే వుండేవారు. ఎండ, వాన అనక, రాత్రి, పగలనక, తుఫాను వచ్చినాసరే ఆయన అక్కడే వుండేవారు. అందుకని ఆయనను "***సదా నింబవృక్షస్య మూలాధివాసాత్***" అని అన్నారు. అయితే ఎప్పుడూ వుండేదానికి నింబవృక్షాన్ని, అంటే వేపచెట్టునే ఎందుకు ఎన్నుకున్నారు? దీనికి సంకేతమే ఈ మొత్తానికి అర్థం. వేపచెట్టుకు చేదుఅనే ధర్మం వున్నది. ఈ చేదును మాత్రమే గుర్తించే పామరుడైన మానవునికి దానియొక్క ప్రాధాన్యత తెలియదు. కాని దాని ఉపయోగం తెలిసిన వాడికి శరీరంలో వుండే రుగ్మతలను పోగొట్టేగుణం దాని చేదులో వుంది. ఆయుర్వేదరీత్యా, ఆరోగ్యరీత్యా అందులో

పనికిరాని భాగమే లేదు. అలాగే ఈ సృష్టికంతా ఆధారంగా ఒక దైవత్వం వున్నది, ఒక ఏకత్వం వున్నది. ఇది తెలిసిన వాడికేమో ఈ వేపచెట్టు వైద్యానికెలా ఉపయోగ పడుతుందో అలాగే ఈ సృష్టి గూడ సకలశ్రేయస్సును చేకూరుస్తుంది. చేదుగా వుంటే వుండవచ్చుగాని అన్ని రకాల రుగ్మతలకూ అందులో విరుగుడు వున్నది. ఈ విషయం దానిని సక్రమంగా వినియోగించుకునేవాడికి మాత్రమే తెలుస్తుంది. అది తెలియని వాడికి ఎందుకూ పనికిరాదు. అలాగే సృష్టిలోని అన్ని రూపాలలో వున్న ఒక దైవత్వం మనను యిలాగే కలుపుతుందని తెలుసుకున్నవాడు నానాత్వానికి మూలమైన ఏకత్వంయందు సాయివలె వృక్షమూలంలో కూర్చుని వుండగలడు. సృష్టి లేక కల్పమనే మహావృక్షంయొక్క మూలంలో ఆయన (సాయి) వున్నాడన్న సంగతి ఎవరైతే గుర్తుపెట్టుకుంటాడో, వాడికి సకలజన్మ వాసనలు, పూర్వకర్మవాసనలు నశించి వివేక వైరాగ్యాలనేటటువంటివి మనస్సులో కలిగి పరమార్థం చెందడానికి కారణమవుతుంది. ఆ చెట్టుమూలంలో కూర్చుని ఆయన దానిని కల్పవృక్షంగా చేసారట. చిత్రమేమంటే ఆయన ఏ కొమ్మ క్రింద నైతే కూర్చున్నారో, ఆ కొమ్మయొక్క ఆకులు చప్పగా వుంటాయి. ఇటు తీపిగానూ వుండవు, అటు చేదుగానూ వుండవు. ఆ కొమ్మ ఆకులు మాత్రమే అలా వుంటాయి. తీపేమో సుఖానికి, సంతోషానికి, పుణ్యానికీ సంకేతం, చేదు పాపానికీ, దుఃఖానికీ సంకేతం. పుణ్యం చేసినా కర్మ బంధమే, పాపం చేసినా కర్మ బంధమే. అందుకని పుణ్యపాపాలకు అతీతంగా నిష్కర్మను ఎవరైతే పొందుతాడో వాడికి పరమ ప్రయోజనం నెరవేరుతుంది. వాడిపట్ల ఆ చెట్టు కల్పవృక్షం అయి వుంటుంది అన్నది ఆ సంకేతం. అక్కడ ఆయన వున్నారని తెలియకుండా తక్కిన శాఖలను చూస్తుంటే అది చేదురూపమై, దుఃఖరూపంలో వుండే ఈ సంసార చక్రంలో పడి మనం పరిభ్రమిస్తూ వుండాల్సిందే. ఈ సంసారం దుఃఖమయ మని చెప్పారు. సంసారమంటే భార్యా పిల్లలనేది కాక సృష్టిలో కనిపించే నానాత్వమే సంసారమని చెప్పారు. నేను వేరు, నీవు వేరు అని అంటూ రాగము, భయము, అసూయ, ద్వేషము అనేవి ఎందులో వుంటాయో అట్టి భావాన్ని సంసారం అంటారు. దానివల్ల వేరువేరనే భావము, ద్వేషము, మమకారము మొదలైనవి పెరుగుతూ పోతుంటాయి. కాని వాటంతట అవి తరగడం అంటూ జరుగదు. మమకారం తరగడం అంటూ ఏనాటికైనా జరిగితే ద్వేషంగామారి తరగడం తప్ప ఇంకోరీతిన తటస్థంగా అవదు. అలాగాక అన్ని రూపాలలోనూ ఒక్కటే వున్నదనే

జ్ఞానం కలిగినపుడు దేనియందు దేనికి మమకారం? మమకారము, ద్వేషము లయించి అన్నింటిలో నేనే వున్నాననే భావం కలగడమే ప్రేమ అంటే. అట్లా సర్వత్రా, అన్నింటా తానేవున్నానని తెలిసిన వాడికి నానాత్వం గోచరించదు గనుక సంసారం అనే వృక్షం కల్పవృక్షంగా తయారవుతుంది. వాడికి సకల శ్రేయస్సును గూర్చిన తలంపులు కలిగి, ఆ ఆలోచనలనన్నింటినీ నెరవేర్చుకుంటూ, సకల సృష్టికీ, తనకూ శ్రేయస్సు చేకూర్చుకుంటూ పోతుంది వాడి జీవితం. ఇది ఈ నానాత్వం అనే దుఃఖమయమైన ఆ వేపచెట్టుమూలంలో సర్వమూ తానే అయినవాడు కూర్చుని వున్నాడన్న సంగతి గుర్తించినపుడు కలుగుతుంది. ఆయన దృష్టివల్లనే ఈ సృష్టిమొత్తం కల్ప వృక్షంగా మారుతుంది. ఏ సమాజంలో అయితే ఈ సత్యాన్ని గుర్తిస్తారో దానికి యుగారంభం గనుక ఆ పచ్చడి తీసుకోవడం దానికి సంకేతమన్నమాట.

కాబట్టి దీనిలో వుండే ఈ సంకేతాన్ననుసరించి సహజంగా మనలో వుండే నానాత్వభావం తొలగించుకుంటూ అందరిలో ఒక్కడే వున్నాడన్న భావం పెంపొందించుకుంటూ రావాలి. ఇది అన్నింటికంటే కష్టమైనది. ఎందుకంటే పుట్టినప్పటినుంచీ అన్నింటినీ చూస్తున్నాము. గాని అన్నింటిలో వున్న ఏకత్వాన్ని గమనించనూ లేదు. ఎవరికీ అనుభవంలోనికిరానూలేదు. అందుకే యిది అన్నింటికంటే చాలా కష్టమన్నమాట. ఒకవేళ దానిని సాధించడం కోసం ప్రయత్నం చేసినా, అంటే అన్నింటిలోను, అందరిలోనూ సాయినాథుడే వున్నాడని ప్రయత్నం చేసినా తక్కినవాళ్ళు మనపట్లచేసే పనులవల్ల ఈ భావం చెదురుతూ వుంటుంది. ఎదుటివాడిలో నేను బాబాను చూడడానికి ప్రయత్నిస్తుంటే వాడు అహంకరించి నన్ను తూలనాడాడే అంటుంది మనస్సు. దీనికి సాయి చెప్పారు - వారి గురువు వారిని రెండుపైసలు దక్షిణ అడిగారని.

అదేమిటంటే, ఒకటి నిష్ఠ, రెండు సబూరి. అన్ని రూపాలలో ఆయనే వున్నాడు. అన్ని రూపాల్లో ఆయన కార్యాన్నే నిర్వహించుకుంటున్నాడు అని. చివరకు తన రూపాన్ని కూడా అందులో సమన్వయం చేసుకోవడాన్ని, ఆ దృష్టిలో నిలిచి వుండడాన్ని నిష్ఠ అంటారు. అట్లా నిలిచి వుండడానికి - ఓరిమి కావలసి వస్తుంది. అవతలవాడు మనపట్ల చెడుగా ప్రవర్తిస్తున్నా గూడా ఆ రూపంలో గూడా ఆయన మనకు ఓరిమి నేర్పించడానికి అలా జరుగుతున్నదని అనిపిస్తుంది. ఆ విషయాన్ని గుర్తించినప్పుడు అక్కడ ఆ ప్రయోజనం మాత్రం నెరవేరుతుంది.

ఉదాహరణకు ఏ మరణమయితే మనకు భీతిని గొలుపుతుందో ఆ మరణమే బుద్ధునికి ప్రభోదం చేసింది. ఏదో ఒకరోజున మరణం తప్పదుకదా అని మనకు కూడా తాత్కాలిక వైరాగ్యం వస్తుంది. అట్టి శ్మశాన వైరాగ్యం ఆత్మీయులు చని పోయినపుడు ప్రతివారికీ వస్తుంది. కారణం-అంతరాంత రాళాలలో నా పరిస్థితి గూడ ఒకనాటికి యింతేగదా అని మనసుకు వస్తుంది. ఇన్ని ఆశలు పెట్టుకుం టున్నాము గదా, వీటిని ఎప్పుడు వదలిపెడతాను అనిపిస్తుంది. కాని దానికంటే బలీయంగా పోయిన వాడిమీద దుఃఖము, ఈ భయము రెండూ ఎక్కువ అవు తాయి. అట్లాగాక యిది ఏమిటన్న ప్రశ్నగా పరిణమించి ఇక్కడ మరణించేదేమీ లేదని, ఎప్పుడూ నిత్యంగా వుండే దేవుడున్నాడన్న జ్ఞానం పొందేదాక బుద్ధుణ్ణి తీసుకుపోయింది. అలాగే సర్వత్రా తన గురువును చూడగలిగినవాడికి తనతో ఎవరు ఏ రీతిన వ్యవహరించినా గూడ ఆ రూపంలో తన గురువే అలా వ్యవహ రించాడని తెలిసి పూర్ణఆత్మజ్ఞానం కలిగేవరకు జీవితమే వాడికి గురువై నడిపిస్తుంది. ఇది తెలియనివాడికి యింకా రాగద్వేష భయాలలోకి త్రోసి యింకా అధోగతికి దిగజారుస్తుంది. అందుకనే భగవద్గీతలో కృష్ణుడు, ఈ జగత్తు అందరికీ భగవంతుని సృష్టిని మరిపింపజేస్తుంది అనీ చెప్పాడు. కాని అవధూతకు 24 గురువుల రూపంలో ప్రబోధం చేస్తుంది అని చెప్పాడు. ఒకసారి యదుమహా రాజు వేటకు వెళ్ళాడు. అక్కడ అడవిలో ధూళిలో పడుకునివున్న ధృఢ కాయుణ్ణి చూచి ఎందుకిలా అడవిలో వున్నారని అడిగితే అతడు తాను ఈ సృష్టిలోని 24 మంది గురువులనుండి జ్ఞానమార్జించాననీ అందుకే యిలా వున్నాననీ చెప్పాడు.

కాబట్టి ఆయనకు గురువు కానిదేదీ లేదు. ఆయనకు పంచ భూతాలూ గురువే. అవే పంచభూతాలు సృష్టికి ప్రతి సృష్టి చేసిన విశ్వామిత్రుణ్ణి తలక్రిందులు చేసాయి. ఈ సృష్టి ఈ విధంగా పడవేయనూ గలదు, ఆ విధం గా ఉద్ధరించనూగలదు. "సర్వంలోనూ గురువును చూసావంటే నీకు, గురువుకు భేదంలేకుండా నీవు గురురూపమైనదానిలో నిమగ్నమవుతావు. లేకపోతే నానాత్వంలో, దుఃఖంలో కొట్టుకుంటావు. ఏ తపస్సయితే చేస్తావో, ఆ తపస్సు ను కించపరచేవారు వచ్చినపుడు 'ఔరా! నా తపస్సును కించపరుస్తావా? అని మరలా మొదటికి వస్తావు' అన్నాడు కృష్ణుడు. అందుకని గురువే బ్రహ్మం, ఆ గురువే భ్రమ, మాయ గూడ. ఈ జగత్తే బ్రహ్మము, ఈ జగత్తే మాయ, ఈ జగత్తే గురువు. ఈ జగత్తే మనపాలిటి రాక్షసుడు. అలాగే మనస్సే మనపట్ల

గురువు. మనస్సే మనపట్ల రాక్షసుడు. నానాత్వంనైపు రాగ ద్వేషాలు కలుగ జేసేదదే. జ్ఞానాన్నిచ్చి సంతోషాన్నిచ్చేదీ అదే. అందుకని అందరిలో ఆయన వున్నాడని గుర్తు పెట్టుకోవడంలో ఎప్పుడైనా అవతలి వాడినుండి కొస్త విరుద్ధంగా వున్న ప్రవర్తన వచ్చినప్పటికీ మనకు ఓరిమి నేర్పడంకోసం బాబానే మనకోసం ఈ రూపంలో వస్తున్నారని మనకు గుర్తుంటుంది. అప్పుడు ఈ జగత్తు రూపంలో గురువే వచ్చి తర్ఫీదునిచ్చి మనలను తప్పకుండా కృతార్థులను చేస్తారు. చివరకు ఎంతదాకానంటే జవహర్ ఆలీలో గూడా బాబా తన గురువునే చూచుకునేంతవరకు.

రహాటాలో జవ్హార్‌ఆలీ అనే ముస్లింఒకడు వుండేవాడు. తన మాట కారితనంతో అక్కడి ప్రజలను బాగా ఆకట్టుకుని ముస్లిములకు ఒక ప్రార్థనా స్థలము కట్టించసాగాడు. అవిషయంలో వివాదాలు చెలరేగి ప్రజలు ఇతనిని వెళ్ళగొడితే శిరిడీ వచ్చి తలదాచుకున్నాడు. అక్కడగూడ తన మాటలతో శిరిడీ ప్రజలను, భక్తులను ఆకట్టుకుని సాయి తనశిష్యుడని వాళ్ళతో చెప్పడం ప్రారంభి ంచాడు. అప్పుడు జరిగిన తమాషా ఏమిటంటే సాయి గూడా ఆయన శిష్యుని లాగా మెలగడమే. వినయవిధేయతలతో మసలుకొనేవారన్నమాట. అతను అంతటితో ఆగక సాయినిగూడ తీసుకుని మళ్ళీ రహాతావెళ్లి అక్కడే వుండ సాగాడు. శిరిడీలో భక్తులు అది భరించలేకపోయారు. ఎలాగైనా ఆయనను శిరిడీకి తెచ్చుకోవాలని రహాతా వెళ్తే ఆలీ లేడు. ఆలీ ముక్కోపి అనీ, అతని అనుమతి లేనిదే తాను రాకూడదని చెప్పి, బాబా వాళ్ళను పంపేశారు. కానీ వాళ్ళు ఆలీ వచ్చేవరకు ఆగి ఎలాగో ఆలీని ఒప్పించి ఇద్దరినీ శిరిడీ తీసుకొచ్చారు. కాని వాళ్ళకు ఆలీ ప్రవర్తన ఏమాత్రం నచ్చలేదు.అందరూ ఆలోచించి వయస్సులో చిన్న వాడైన దేవీదాసుకు, వృద్ధుడైన ఆలీకి వేదాంతచర్చ ఏర్పాటుచేసారు. కానీ దేవీదాసు ముందు ఆలీ ఓడిపోయాడు. ఆ పరాభవం భరించలేక అతడు శిరిడీ విడిచి వెళ్ళిపోయాడు. తర్వాత అతను పరివర్తనచెంది మళ్ళీ వచ్చి పశ్చాత్తాపంతో సాయి కాళ్ళు పట్టుకున్నాడు. కాని బాబా మాత్రం ఎప్పుడూ అతని పట్ల ప్రేమ గానే వ్యవహరించారు.

ఎందుకలా జరిగిందంటే మొత్తం జగత్తురూపంలో బాబా తమ గురువునే చూచుకుంటున్నారు. తమ గురువుకు నిష్ఠ, సబూరీలనే రెండు పైసలు దక్షిణగా సమర్పించారు. అన్ని రూపాలలోనూ తమ గురుదేవుడే

వున్నాడనే దృష్టిలో వున్నారు. అప్పుడేం జరుగుతుందంటే అంతటా వున్న ఆ గురువే అక్కడేదన్నా మార్పురావాలంటే అట్టి మార్పును ఆయనే చేసుకుంటారు.

ఇందుకు ఉదాహరణగా బాబా చరిత్రలో మరొక సంఘటన గూడ వుంది. బాబాను సకల దేవతా స్వరూపుడని భక్తులందరూ కొలుస్తున్నారు. శిరిడీలోని .నానావల్లీ అనే పహిల్వాను ఒకడుండేవాడు. సాధువేగాని, తిక్క తిక్కగా ప్రవర్తించే వాడు. బాబాను యింతమంది పూజిస్తున్నారుగదా! ఈయన భావం ఎలా వుందో పరీక్షిద్దామనుకున్నాడు. భక్తులు అందరూ ఆయనను సేవిస్తుండగా వచ్చి, "లే! ఆసనం మీదనుంచి, నేను కూర్చోవాలి" అన్నాడు. బాబా మెదలకుండా వెంటనే లేచి క్రింద కూర్చున్నారు. అతను కొద్దిసేపు ఆసనం మీద కూర్చుని బాబాకు సాష్టాంగ నమస్కారంచేసి వెళ్ళిపోయాడు. బాబా అందరిలోనూ తమ గురువునే చూచుకున్నారు గనుక నానావల్లీ తనను లేవమన్నా, అతను కూర్చున్నా ఏమీ అనిపించలేదు. ఆ భావం నుంచి ఏమారకుండా ఆయన ఆ పైన దక్షిణ సమర్పించుకున్నారు.

అలాగే ఒకసారి శిరిడీలో పెద్ద వర్షమొచ్చింది., బాబా ఆ వేపచెట్టు క్రింద కూర్చుని సమాధినిష్టలో వున్నారు. నీటి ప్రవాహవేగానికి ఆయన ఒక ప్రక్కకు ఒరిగిపోయారు. చెత్తంతా ఆయనమీద పడివున్నది. వర్షమంతా తగ్గి పోయాక ఊరి ప్రజలు వచ్చి చూచి చెత్తంతా తొలగించారు. ఆయనను అక్కడ వుండ వద్దని, మశీదుకు రమ్మని బ్రతిమిలాడి జబ్బలు పట్టుకుని తీసుకుని పోయి మశీదులో కూర్చోబెట్టారు. అప్పటినుంచి ఆయన మశీదులో నివసించసాగారు. తమను జబ్బలు పట్టి తీసుకుపోయి మశీదులో కూర్చోబెట్టిన వాళ్ళ రూపంలో వున్నది తమ గురువేనని, నానావల్లీ రూపంలో వచ్చి పరీక్ష చేసిందీ తమ గురువేనని, జవహర్ఆలీ రూపంలో సేవ చేయించుకున్నదీ తన గురువేననీ బాబా భావించారు. కనుకనే యితర మహాత్ములంతా 'కోహినూర్' అని పొగిడే స్థితిలో అయన వున్నారు. ముస్లిం సాంప్రదాయకులైన గురువులంతా ఆయనను గొప్ప గురువుగా అంగీకరించారు.

ముస్లిమ్‌లు తమవద్దకు వచ్చినపుడు సాయి వారికి అరబ్బీలో ఖురాన్ చెప్పేవారు. హిందువులువస్తే వేదం చెప్పేవారు. భక్తులకు వారివారి ఇష్టదేవతల రూపంలో దర్శనం యిచ్చేవారు. హిందువులంతా ఆయనను దత్తాత్రేయుల

అవతారంగా కొలిచేవారు. ఇంతా చేస్తే ఆయన భిక్ష చేసుకుని జీవించేవారు. ఇదంతా తను గురువు చలవేనని, తనదేమీలేదనీ అనేవారు. అదే నిష్ఠ అంటే. ఆ నిష్ఠలో ఓరిమి అనేది లేకపోతే మనస్సు ప్రక్కకుపోతుంది. ఎవరైనా ఏదైనా అంటే వీడెవడు నన్ననడానికి అన్నామంటే మన సాధన దెబ్బ తింటుంది. కాని లౌకికంగా ఏమీ కాకపోవచ్చు. పూర్వజన్మ ప్రకారం ఎవరెవరికి ఏమేమి యివ్వాలో, పుచ్చుకోవాలో ఆ ప్రకారమే జరుగుతుంది. అందుకని మన మనస్సు అందరిలో తన గురువును చూచి ఓర్పు వహించిందంటే ఒడ్డుకొచ్చి బయటపడుతుంది. లేకపోతే నది లోపలకు లాగేస్తుంది. ఈ సృష్టి అనేది మహా ప్రవాహం లాంటిది. వరద నీరొచ్చినపుడు మొత్తం కొట్టుకుపోతున్నద్, అందులో ఒక పెద్ద త్రాడు గూడ కొట్టుకునిపోతున్నది. ఆ త్రాడు ఒక పెద్ద వృక్షం యొక్క మానుకు తగులుకున్నదనుకోండి. చెట్టుకు చుట్టుకున్నది గనుక అది కొట్టుకుపోదు. ఆ వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఒకడికి భగవంతుని కృపవల్ల ఆ తాడు యొక్క రెండు కొసలు చిక్కాయనుకోండి. ఏ ఒక్క కొస పట్టుకున్నా ప్రమాదమే. ఎందుకంటే ఒక కొస పట్టుకుంటే నీటి ప్రవాహవేగానికి రెండవకొస జారిపోతుంది. అందుకని రెండుకొసలు కలిపి పట్టుకోవాలి. నిష్ఠ, సబూరీలనే రెండు కొసలు పట్టుకున్న అతడు నీటి సారుదలకు ఒడ్డుకు వచ్చిపడతాడు. అదే బయట పడేస్తుంది. అది పట్టుకోకుండా వున్నవాడు ప్రవాహంలో కొట్టుకుపోతాడు. ఒకటి పట్టుకోడానికి ప్రయత్నించినా జారిపోతుంది. అలాగే నిష్ఠను నిలుపుకోడానికి ప్రయత్నించినా ఓరిమి లేకపోతే నిష్ఠగూడా పోతుంది.

అందుకని నిష్ఠ లేకపోతే సబూరిలేదు, సబూరి లేక నిష్ఠలేదు. ఈ రెండూ పట్టుకున్నవాడు ఒడ్డుకుపోయి చేరుతాడు. ఆ రెండు పైనలు కలిగి వుండడాన్నే వృక్షమూలంలో బాబా వున్నారని తెలుసుకోవడం అన్నమాట. అంటే మన మందరము పరస్పరం ఒకరి రూపాల్లో ఒకరు ఆయనే, ఆ బాబానే వున్నారని గుర్తుపెట్టుకోవడమన్న మాట. ఇది గుర్తు పెట్టుకోవడానికి సృష్టికి, భగవంతుడికి వున్న సంబంధం గుర్తు పెట్టుకుంటే సరిపోతుంది. ఇంకా సూక్ష్మంగా చెప్పాలంటే మనస్సుకూ, మనస్సులో ఉత్పన్నమయ్యే ఊహల రూపాలకు ఎటువంటి సంబంధమున్నదో, అట్టిసంబంధమే అన్ని రూపాలలో వున్న భగవంతునకు, అన్ని రూపాలు ధరించిన జగత్తుకూ వున్నదన్నమాట. ఊహాలలో ఎన్ని రకాల ఆకారాలున్నా సరే, ఆ ఊహాలలో ఒకే మనస్సు ఎట్లాగైతే వున్నదో, ఈ సృష్టిలో ఎన్ని

రూపాలు కన్పించినా సరే, వాటన్నింటి లోనూ ఏకత్వంగల భగవత్ చైతన్యం ఒకటే వున్నది. ఆ ఒక్కటి ఏదైతే వున్నదో, అదే గురువంటే. అందుకని అదే తాను అని ఎవరైతే నిరూపించారో, అట్టి సాయినాథుని గుర్తుపెట్టుకున్నపుడు మన మనస్సు నిలుస్తుంది. అట్లా మనస్సును నిలుపుకుంటూ, అందరి రూపాలలో ఆయననే చూసుకుంటూ ఏ మహా చైతన్యంలో అయితే మనకు కనిపించే నానారూపాలు ఊహాలుగా వున్నాయో, అన్ని రూపాలలోనూ అదే వున్నదని గుర్తుపెట్టుకున్నప్పుడు అదే కల్పవృక్షం. అంటే ఈ సృష్టే కల్పవృక్షం. దానితో ఐక్యత కుదిరిన తర్వాత మన మనస్సులో వచ్చే ప్రతిపవిత్ర సంకల్పమున్నూ చదరంగపు ఆటలాగ దానికై అదే సాగడం చూస్తామన్నమాట. ఎప్పుడైతే మనలో పవిత్రత లోపిస్తుందో, అప్పటినుంచి మన పతనం మొదలవుతుందన్నమాట. ఈ ప్రవాహంలో ఒక గొప్ప విషయం వున్నది. ఈ శరీరంలోవుండే జీవకణాలన్నీ కలిసి ఒక శరీరంగా పని చేయడంలో వాటి గొప్పతనమున్నది, అలా పనిచేయడం మానేసినపుడు ఏ పదార్థానికా పదార్థం నిర్జీవమై శవమై పడిపోతుంది.

అలానే ఈ సమాజంలోని వ్యక్తులు ఎవరికి వారు వేరనే భావం వున్నపుడు ఆ సమాజం నాశనమైపోతుంది. అలాగాక అన్ని రూపాలలోనూ వున్న దొక్కటేనని గుర్తుపెట్టుకొనిపోతున్నపుడు ఈ సమాజం ఎప్పుడూ బాగుంటుంది. అందుకని ఈ సమాజాన్ని భగవంతునియొక్క రూపంగా చూచి, అందులోవున్న వ్యక్తులందరినీ శరీరంలోవుండే జీవకణాలుగా వీళ్ళందరి రూపంలో తన కార్యం నిర్వర్తించుకుంటూ వున్న ఆ ఒక్కదానిమీద దృష్టివుంచుకుంటూ వున్నప్పుడు వాడు ఆ మహత్తర చైతన్యరూపమే అవుతాడు. అప్పుడు అట్టివాడు ఎవరిని తాకినా తననుతాను తాకినట్లే ఆ భగవంతుని తాకినట్లే ఈ ఐక్యత కలిగివుండడంతో ఆ సహకారం వుంది. ఈ ఐక్యతలేక పోవడంలో అంతటి వినాశం వుంది. ఈ ఐక్యతతో శరీరం ఎప్పుడైతే పని చేస్తుందో, అప్పుడు ఆ శరీరంలో వుండే జీవకణాలు కొన్ని వాటిపని అయిపోయిన తర్వాత నశించిపోయినప్పటికీ ఆ శరీరంలో జరిగే ఏ క్రియా చెడదు. ఎందుకంటే ఆ కణాలు నశించిపోయే లోపల ఆ స్థానంలో కొత్త కణాలను కూర్చిపోతాయి. అందుకని పనిమాత్రం నిశ్చయంగా కొనసాగుతుంది. ఎలాగంటే మఱ్ఱివృక్షం మొలిచింది. దానికి పెద్ద పెద్ద కొమ్మలు వచ్చాయి. ఆ పెద్దకొమ్మలు విరిగిపడిపోతాయనుకున్నపుడు వాటి కొమ్మలనుండి ఊడలు పుట్టుకొస్తాయి. తర్వాత అవి క్రిందికి

దిగి నేలలోకి చొచ్చుకునిపోయి ఒక్కొక్కటి ఒక్కొక్కమానుగా తయారవుతాయి. అలా చెట్టు ఎంతకాలం జీవిస్తుందంటే మొదటిమూలం నశించిపోయినప్పటికీ అది కొనసాగుతూనే వుంటుంది. అలాగే ఈ సృష్టిలో ఈ సాంప్రదాయం కొనసాగుతూ యింకాయింకా మహనీయుల రూపాలు ధరిస్తూ సృష్టియొక్క ఏకత్వంవైపుకు కొనసాగుతూ వుంటుంది. దానినే గురుసాంప్రదాయమని అంటారు. అది ఎల్లప్పుడూ సమాజానికి శ్రేయస్సు చేకూరుస్తుంది. అందుకని ఈ విషయంలో దేవతలను ఆశ్రయించేవారికి, సద్గురువును ఆశ్రయించిన వారికీ తేడా వస్తుంది. దేవతలను ఆశ్రయించుకునే వాడెలాంటి వాడంటే ఏ జీవ కణానికా జీవకణం తనకు కావలసిన వాటిని జాగ్రత్త చేసుకుంటూ మిగతా వాటిని వదులుకుంటూ వున్న జీవకణంలాంటి వాడన్నమాట. సద్గురువును ఆశ్రయించిన వాడెట్లాంటివాడంటే శరీరంలో వుండే అన్ని జీవకణాలను సామరస్యంగా పనిచేయించేదాన్ని ఆశ్రయించినవాడన్నమాట. గురువు సకలదేవతా స్వరూపుడని అన్నారు. ఏ దేవతలను స్తోత్రం చేయమని శాస్త్రాలు చెప్పి వున్నాయో, ఆ శాస్త్రాలే గురువే సాక్షాత్తు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడని చెప్పాయి.

ఆయన యోగులకు, ఋషులకు మాత్రమే నిరాకార తత్త్వంలో దర్శనమిస్తాడు. మామూలు వాళ్ళకోసం మహనీయుల రూపంలో భూమిమీద సంచరిస్తుంటాడు. దీనినే వివరిస్తూ ఏకనాథుడు ఆవుకు కొమ్ముచివరినుంచి తోక చివరివరకూ ఆవే అయినప్పటికీ పాలు కావాలంటే మాత్రం పొదుగు నుండే పితుకుకోవాలి అని చెప్పాడు. అలాగే విశ్వమంతా భగవంతునిచేత వ్యాపించబడి వున్నప్పటికీ ఆయన కృప కావాలంటే మాత్రం మహనీయులను ఆశ్రయించాలి అని చెప్పారు. ఇది సత్యము అని చెప్పడానికి భగవద్గీతలో శ్రీకృష్ణుడు, అనేకములైన తత్త్వాలు వివరించినప్పటికీ, అది మాత్రమే చాలదన్నట్లు "**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**" అనిగూడా చెప్పాడు. 'నేను చెప్పినదానికి ఇది సరిపోతుంది. నీకు ముక్తినిస్తుంది' అని ఆయన చెప్పలేదు. నీవు తెలుసుకోదలచుకుంటే తత్త్వద్రష్టలైన బ్రహ్మజ్ఞానుల దగ్గరకువెళ్ళి, పరిప్రశ్న చేసి, సేవచేసి, వాళ్ళదగ్గర ఈ జ్ఞానాన్ని పొందవలసింది' అని చెప్పాడు. అదెంత అవశ్యకమో తెలుపడానికి ఆయనే ఆచరించి చూపాడు. ఎవరైతే తాను జన్మించకముందే తల్లిదండ్రులకు తన అవతారాన్ని చూపించాడో, ఎవరైతే చతుర్దశ భువనాలను తన నోట్లో చూపిం

చాడో, ఎటువంటి యోగసాధన లేకుండానే రాక్షసులను సంహరించాడో, అటువంటి కృష్ణుడు 12 సం॥ల పాటు గురువువద్ద యోగా భ్యాసంచేసి ఎందుకొచ్చాడంటే, మనమందరమూ తప్పనిసరిగా ఆవిధంగా చేయాలని చెప్పడానికే. రాముని రూపంలో వచ్చినపుడు గూడ విశ్వామిత్రాదులవద్ద సేవ చేసారు. అలాగే మహనీయులు రూపంలో వచ్చిన శిరిడీ సాయి నాథుడు గూడ గురువును సేవించి 'ఇదంతా నా గురువు చలవే''నని చెప్పారు. అందుకని గురువుకు నమస్కరించినవాడు సర్వదేవతలకు నమస్కరించినట్లేనని చెప్పారు. ధర్మశాస్త్రాలలోగూడ ఫలానా పాపానికి ఫలానా ప్రాయశ్చిత్తం అని చెప్పుకుంటూ వచ్చి సకలపాపాలకు ప్రాయశ్చిత్తం తను మన ధవాలతో సద్గురువును సేవించడమేనని చెప్పారు. సద్గురువుకు అంకితమైపోతే సర్వపాపాలన్నీ క్షాళనమైపోతాయని చెప్పారు. ఆ సద్గురుసేవ ఎట్లాగంటే నిష్ఠ, సబూరీలు కలిగి వుండడమే. ఆ భావన, మనము ఎప్పుడైతే ధరిస్తామో అప్పుడు ఈ శరీర మనే బ్రహ్మాండానికి ఒక యుగ ఆది. అంటే యుగాది! అటువంటి మనందరి సమిష్టి జీవితంలో గూడా ఒక యుగాది అవుతుంది.

సాయి సర్వదేవతలుగా ఎందుకు నిరూపణ యిచ్చారంటే మరే వేదాంతం మనకు తెలియకపోయినాసరే ఈ చరిత్ర పారాయణ చేసుకుంటూ ఈ భావాన్ని రంగరించి మనస్సులో నిలుపుకోవడంద్వారా మన ప్రవర్తనను మార్చుకొనడం మొదలుపెడతాము. అప్పుడు మనజీవితం ఒకగాడిలోకి వస్తుంది. ఏ ధర్మశాస్త్రాలలో చెప్పిన వాటిని ఆచరించడానికి వీలుపడక ఫలితం పొందలేక విఫలమవుతున్నామో అది దానికై అదే ఆచరణకొస్తుంది.

అందుకని సద్గురువుయొక్క సేవ ఆవశ్యకమని కృష్ణుడు, రాముడు గూడ తమ ఆచరణద్వారా చెప్పారు. సర్వశాస్త్రాలు, ఉపనిషత్తులు, నిష్కామ కర్మ, ఉపాసన అయిన తర్వాత సమిత్పాణియై శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువును ఆశ్రయించవలసిందని శృతులు, ఉపనిషత్తులు గూడ చెబుతున్నాయి. ఋషి సాంప్రదాయమంతా గురుశుశ్రూష, తర్వాత వేదాధ్యయనం, తర్వాత బ్రహ్మజ్ఞానం బోధింపబడడము అని చెప్పబడి వుంది. అన్ని మతాలలోనూ అదే సాంప్రదాయం చెప్పబడివున్నది. అందుకని సద్గురుసేవ ఈ జగత్తు అంతటిలోనూ ఒకటే వున్నదన్న సత్యాన్ని చెబుతుంది. కనుక మనకు తరుణోపాయం సద్గురుసేవవల్ల సులభంగా దొరుకుతుంది. అందుకని అవతలివాడు

పూర్తిగా భిన్నమైన దృక్పధం కలిగివున్నాసరే, ఆ రూపంలో మనకు గురువు ఓరిమి నేర్పుతున్నాడు, నమ్రత నేర్పుతున్నాడు అనే హెచ్చరికతో మాత్రం మనం నడుచుకుంటూంటే అదే కల్పవృక్షమై మనలను తరింపజేసేటటువంటి గురు స్వరూపమై మనలను గూడా తన రూపంగా మారుస్తుంది. కనుక యిప్పటి నుండి యీ విషయాన్ని బాగా గుర్తుపెట్టుకుని, సాయి చరిత్రను పారాయణ చేసుకోవడము, అందరిలోనూ బాబాను చూసుకొనడము, కొనసాగించు కోవడానికి మన శరీరంలోనూ, సమాజంలోనూ నవయుగ ఆది(యుగాది) ఆరంభం కావాలని మీ అందరిలో వున్న సాయికి నమస్కరిస్తున్నాను.



అధ్యాయం-3

విశ్వాసం



"నీవెవరికేసి చూస్తావో, నీవు దేనికేసి చూస్తావో అందులోనే నేనున్నా వని తెలుసుకో", అని సాయిబాబా ఉపాసనీబాబాతో చెప్పారు. దానినతడు దృఢంగా హృదయంలో గుర్తుపెట్టుకొవడములో కొంతవరకూ కృతార్థు డయ్యాడు. అప్పటికీ పూర్తిగా కృతార్థుడవలేదనడానికి చరిత్ర జాగ్రత్తగా చూస్తే తెలుస్తుంది. "నాలుగు సం॥లు ఖండోబా ఆలయంలో వుండు. నా అంతటి వాడవవుతావు" అన్నారు బాబా. $3\frac{1}{2}$ సం॥ల్లోనే మౌనముగా శెలవు తీసుకొని వెళ్ళారాయన. ప్రత్యక్షంగా వెళ్ళి, నేను వెడుతున్నానంటే బాబా వద్దంటారు. ఈ సంగతి అతనికి స్పష్టంగా తెలుసు. కారణం ఆయన ఎన్నోసార్లు అడిగారు, బాబా వెళ్ళవద్దని చెప్పారు.

అందుకని అడిగితే వద్దంటారనేది తథ్యం అనుకున్నారు. తను వెళ్ళ దలచుకున్నారు కాబట్టి అక్కడనుండే మనసులో శెలవు తీసుకొని వెళ్ళి పోయారు ఉపాసనీ బాబా. అంటే విశ్వాసం సరిగా ధృడతరం కాలేదని అర్థం. అంటే మొదట బాబా గురువు బాబాకు, "నేను చెప్పినదానిని సంపూర్ణంగా విశ్వసించిన వాడే కృతార్థుడౌతాడ"ని చెప్పినదానిలో 95శాతం దాకా వచ్చి ఆగు తుంది. మనవైపునుంచి చూస్తే అది చాలా గొప్పదే. కాని బాబాయొక్క విశ్వాసంతో అది పోలిస్తే, నిలుస్తుందా? ఎవరైతే ముందు అవిశ్వాసం వుండి, సాయియొక్క ప్రత్యక్ష సాన్నిధ్యం చూచి తర్వాత పూర్ణ విశ్వాసంలోకి వచ్చాడో, ఎవడు సాయియొక్క కృతార్థతని, గొప్పతనాన్ని శ్లోకంలో గానం చేసాడో, మనస్సులో సాయి ముస్లిం అన్న సంకోచం పెట్టుకొన్న ఒకడిని తన కాళ్ళకు నమస్కరించనీయకుండా తిప్పికొట్టేసిన ఆ ఉపాసనీ బాబానే, బాబా చెప్పిన ఆ మాటమీద నిలువలేకపోయాడు. అటువంటప్పుడు మనకా ప్రత్యక్ష సాన్నిధ్యం దొరికినా మనమెంత విశ్వాసం నిలుపుకోగలము? ప్రత్యక్ష అనుభవం లేదు కాబట్టీ ప్రత్యక్ష సాన్నిధ్యం లేదు కాబట్టి మనకీ అనుభవం లేదనుకోవడానికి వీలు కాదు. నిత్యజీవితంలో కొన్ని అనుభవాలు జరుగుతుంటాయి. వాటిని మననం

చేసుకొని ఆచరణలో పెట్టుకోవడంవల్ల గుర్తుంటాయేగాని అనుక్షణం అనుభవాలు జరుగవలసిన అవసరమేమీ లేదు.

ఉదాహరణకు ఒక మనిషిని అతని మంచితనము వల్ల మరొకడు మోసం చేసాడు. అయినప్పుడు అతడు మళ్ళీ మళ్ళీ మోసపోయేట్లు చేసుకోవడం లేదు. ఒకసారి జరిగాక దానిని గుర్తుపెట్టుకుంటూ, జాగ్రత్తపడతాడు. ఎక్కడో, ఎప్పుడో ఒక్కసారి మరలా ఆ విధంగా మోసపోవడానికి ఆస్కారంవున్నది కాని, సామాన్యంగా అలా జరగడానికి ఆస్కారం యివ్వం. జాగ్రత్తగా వుంటాం. అలాగే ఒక్క అనుభవాన్ని చవిచూచినా దానిని మననం చేసుకోవడంవల్ల, హృదయంలో గుర్తు చేసుకోవడంవల్ల లేదా యింకొకరి అనుభవాలుచూచి మనం తెలుసుకుంటూ వుండటంవల్ల విశ్వాసం దృఢపడుతుంది.

ఉదాహరణకు ఒకడికి ఒక వ్యాధి వచ్చింది. ఒకచోటికిపోయి చికిత్స చేసుకుంటున్నాం. ఫలానా చోట వ్యాధి తగ్గినది అని తెలుసుకుంటున్నాం. అలాగే ప్రత్యక్షానుభవమైన తర్వాతనే తెలుసుకోవడమనేది ఎప్పుడూ, ఎక్కడా, ఎవరికీ జరుగదు. అలాగే పదేపదే అలా జరగాలన్నా జరగదు. అంతవరకు ఆలావుండి నేర్చుకోవాలన్నా ఆ జీవితం గడవదు. కాబట్టి వీటి దృష్ట్యా చూచినట్లయితే ప్రత్యక్ష సాన్నిధ్యంలో వున్న వాళ్ళకంటే మనం అదృష్టవంతులము. వాళ్ళను అంటే అట్టి మహాత్ములను మరుగుపరిచేటటువంటి మానవత్వం అడ్డురాకుండా గమనించవలసిన అంశాలు మాత్రమే గుర్తుకొస్తాయి.

ఉదాహరణకు ఒక మహాపండితున్నాడు. అతని ఖ్యాతి దశదిశలా వ్యాపించింది. దేశం నలుమూలలనుండి చాలామంది వచ్చి వారివద్ద విద్యాభ్యాసం కోసం పాటుపడుతున్నారు. ఆ పండితుని కోరిక ఏమంటే తన కొడుకు, మనుమడు యిటువంటి పాండిత్యాన్ని సేకరించుకొని తన వంశప్రతిష్ఠను నిలబెట్టాలని. కాని వాళ్ళకా శ్రద్ధ లేదు. పైగా ఎందుకొచ్చిన తద్దినంయిది అనుకునేవారు. దానినుండే వచ్చింది "పండిత పుత్రః" అనే సామెత. లోకమంతా తనను పండితుడని గుర్తిస్తుంది, దానికోసం తన పిల్లవాడిని మాటి మాటికి రుద్దేది నిజం. అలా అతిగా రుద్దేసరికి వాడికి మొహం మొత్తిపోతుంది. సాధ్యమైనంత వరకు ఓ పట్టాన నేర్చుకోరు. లోకములో యిది పరిపాటి.

అదే రీతిన ప్రత్యక్ష సాన్నిధ్యం లేకపోవడంచేత వారి లీలలలో ప్రకట

మైన నిజతత్త్వమేదైతో వుందో దానినిమాత్రం అనుభవించే అదృష్టం, మహా భాగ్యం మనకు కలిగింది. కాబట్టి దానిని మననం చేసుకోవడంలో కూడా మనం దీనినే పొందగలగాలి. నిష్ఠ, సబూరి అన్నప్పుడు ఈ నిష్ఠ అంటే ఏది? ఆయన లీలలు చదివాం, ఒకటికి పదిసార్లు చదివాం. పదకొండోసారి చదివినపుడే మౌతుంది? గ్రంథం అంతా పరిచయమౌతుంది. ఆ పేరాగ్రాఫ్ చూస్తేనే ఈ లీల ఫలానాకదా అనిపిస్తుంది. అపుడు లైన్ బై లైన్ చదివేదెట్లా?

ఉదాహరణకు ఒకడికి దోసె అంటే ప్రీతి. వాడు మాటిమాటికీ దాన్నే చేయమని యింట్లో గొడవచేస్తుంటాడు. వాడు కాలేజీలో చేరాడు. వాడదృష్టం బాగుండి హాస్టల్‌లో వారానికి మూడుసార్లు చేస్తున్నారు ఆ అయిటమ్‌నే. కాలేజీకి వచ్చినప్పుడు మన పంట పండింది, మనకేది ఇష్టమో అదే చేస్తున్నారు అనుకొన్నాడు. అలా మూడు, నాలుగు నెలలు తిన్నాడు. ఎన్ని రోజులట్లా తింటాడు? తినితిని వాడికి విసుగు పుట్టింది. మనిషీ వాడే, జిహ్వా అదే, వంటకమూ అదే, అప్పుడంత ఇష్టం కావడమేమిటి? ఇప్పుడంత ఇష్టం కాకపోవడమేమిటి? మొదట్లో తినేటప్పుడు ప్రత్యక్షంగా వుండే రుచిని అనుభవిస్తున్నాడు. ఇన్ని రోజులు గడిచిన తరువాత, ఇన్ని రోజులుగా తింటున్నాననే మనోభావములోంచి విడగొట్టి మనస్సు రుచిచూస్తున్నది. రంగు కళ్ళజోడు పెట్టుకుని చూస్తే ఏ వస్తువైనా, రంగుగా కనబడుతుంది. అట్లాగే అప్పుడప్పుడు తినేప్పుడు ప్రత్యక్షంగా తినే రుచిని మాత్రమే మనస్సు తీసుకొంటుంది. కొన్నాళ్ళు తినేసరికి, ఇన్నాళ్ళుగా తింటున్నామబ్బా! అనే రంగు కళ్ళజోడునుంచి మనసు చూస్తుంది. మెస్‌బెల్ వినగానే యిన్నాళ్ళుగా తింటున్న రుచిని మనస్సు తెచ్చుకొని వదిలేస్తుంది. అలాగాక యిలాంటి మనోభావాలను పేరుకోనీయకుండా ప్రత్యక్షంగా నాలుకమీద వున్న వస్తువు రుచినే గమనించినప్పుడు 365 రోజులు తిన్నా వాడికి నిత్యనూతనంగానే వుంటుంది. అట్లాంటి స్థితి మనసుకు కలగాలనే బాబా, బడేబాబాతో అంటారు- "రుచులకు పోవద్దు, ఒక్క వంటకం చాలు"అని. అంటే యిన్ని రోజులుగా తింటున్నాననే స్మృతులలో వుండకూడదు. ప్రత్యక్షానుభవంలో మనస్సు వుండాలి. అట్లా ఎప్పుడైతే ప్రత్యక్షానుభవాన్ని చూడడం మనస్సుకు అలవాటవుతుందో అప్పుడు ప్రత్యక్షంగా వుండే 'నేను' 'నేను' అనే ఒక్కదానిమీద మనస్సు నిలిచిపోతుంది.

మనలో 'నేను' ఉన్నాననే అనుభవముంది. ఇది అన్నింటికంటే

ప్రత్యక్షం. ప్రత్యక్షానికి, పరోక్షానికి తేడా ఏమిటి? ఎవరి గురించో చెప్పడంగాని, ఫోటోగ్రాఫ్ చూచిగానీ వాటిని పరోక్షం అంటాము. అలాగాక స్వయంగా మనకు అనుభవమయ్యే వాటిని ప్రత్యక్షం అంటాం. నేను అనే అనుభవం ఏ ఇంద్రియాల ద్వారా కనపడదు. కాబట్టి ముందు మనమున్నామని ఋజువయ్యాక ఇంద్రియాలద్వారా అవి పనిచేస్తాయి. ఈ లౌకిక అనుభవాలన్నీ పరోక్షాలు. కళ్ళు పనిచేస్తుంటే వస్తువులు కంటిద్వారా కనపడాల్సిందే. ఈ నేననేది ఇంద్రియాలు లేకపోయినా అనుభవమవుతుంది. అందుకనే ఎవడైతే ప్రత్యక్ష అనుభూతిమీద ఇంద్రియాలను నిలపడం నేర్చుకుంటాడో, ఎవరియొక్క ఇంద్రియాలు ప్రత్యక్షమైన అనుభవాన్ని మాత్రమే తీసుకుంటుంటాయో వాడు ఈ ప్రత్యక్షమైన 'నేను' 'నేను' అనే అనుభవంమీద నిలవడంకూడా అలాగే నేర్చు కుంటాడు. అంటే అదే కుదిరిపోతుంది. అంటే ఆత్మనిష్ఠకుదురుతుంది. అంటే సాయి సూక్తుల్లో కేవలం ఆనందంగా ధ్యానించమని, అదీ చేతగాకపోతే కనపడు తున్న ఈ రూపాన్ని నఖశిఖ పర్యంతం అహర్నిశలు చింతన చేయమనీ చెప్పారు. మొదట కేవలం ఆనందంగా ధ్యానించాలి. అంటే ఈ 'నేను' అనే దానిమీద పరోక్షంగా నిలపాలి. ఎలాగైతే వాడికి దోసెరుచిని చూడకుండా దానికిముందు యింత కాలంగా తింటున్నామనే విసుగు మనసుకు రావడం మొదలుపెట్టిందో, అదే రీతిన ప్రత్యక్షంగా ఎదురుగుండా వుండే గ్రంథంలో లీలలను చదువుతున్నప్పుడు యిన్నాళ్ళుగా నేను చదువుతున్నాననే భావన వచ్చి అడ్డుకొంటుంది. అలాగే మనకు బాబా ప్రత్యక్ష సాన్నిధ్యం దొరికితే రోజూచూచే బాబాయే గదా ఒక గంటాగిపోదాం అనిపిస్తుంది. ఇది శిరిడీలో వుండే వాళ్ళని చూస్తే తెలుస్తుంది. రెండురోజులుండి పోయేవాళ్ళు అక్కడక్కడే తిరుగు తుంటారు. పదిరోజులుండే సరికి దానిలో సర్దుబాటు వచ్చేస్తుంది. అక్కడ కూర్చునప్పుడు గూడా ఇంట్లోని కబుర్లన్నీ వస్తాయి. ఇంత దూరం వచ్చింది దేనికి? ఎందుకు చెబుతున్నానంటే, ధర్మం అనేది మనస్సుకు తెలిసినా ప్రత్యక్షానుభవం కలిగితే ఆయనమీద ఎందుకు మనస్సు నిలవలేక పోతున్నామనే దానికి ఉదాహరణ మాత్రమే. ఆయన వున్నప్పుడు ఆయన మీద ప్రత్యక్షానుభవం ఏవిధంగానైతే నిలవనివ్వదో యిదే కారణంగా మనస్సు ఈ చరిత్ర పారాయణలో కూడా కలుగుతుంది. అందుకని లీల చదివేటపుడు మనమేరీతిన చదవాలంటే, అదే అనుభవం మనకు జరుగుతూ వుంటే ఎలా వుంటుందో దానిని గమనిస్తూ చదవాలి.

అప్పుడు ఎన్నిసార్లు చదివినా పాత పడదు.

ఉదాహరణకు అవతలివాడు మనల్ని పదిసార్లు బాధపెట్టాడనుకోండి. పదకొండోసారి బాధపెడితే మనస్సు బాధపడకుండా వుంటుందా? తప్పక బాధపడుతుంది. వాడు రెండుసార్లు బాధపెట్టి మూడవసారి బాధపెట్టబోయి నప్పుడు, వీడిలా నన్ను బాధపెడ్తాడనే దానికి ముందుగానే మనస్సు సిద్ధమై పోతుంది. అలాగే అదే అనుభవం మనకు జరిగితే ఎలా వుంటుందనే భావంతో దానిని తీసుకొని చదవగలిగితే, అప్పుడు 101వ సారి కూడా మొదటిసారి మనం చదవగలిగినట్లు చదవగలుగుతాము. అప్పుడు మన మనస్సు సాత్వికమవు తున్నట్లు గుర్తు. లేకపోతే, కుశాభావుచేత 108 సార్లు బాబా పారాయణ చేయిం చారంటే వాడి మనస్సు బండబారిపోయుండాలి. ఎవరికైనా విసుగు పుడితే క్షణం సేపు కూడా బాబా పూరకుండేవారు కాదు. తన గదిలో కూర్చొని యోగ వాసిష్టం చదువుకుంటున్నాడొకడు. పిలిచి రూ.15/- దక్షిణ యిమ్మ న్నారు. మరలా మరలా పిలిచి దక్షిణ యివ్వమన్నారు. "ఏమిటి బాబా! యిన్ని సార్లు అడుగు తున్నావు"? అంటే నీవు 15వ అధ్యాయం చదువుతున్నావే దానిలోని విషయం చక్కగా గుర్తుపెట్టుకో! నేను దక్షిణడిగినా రూపాయలు మాత్రమే యిచ్చావుగానీ నేనడిగింది నాకు యివ్వలేదుగదా - అందుకని నాకది చేరిం దాకా అడుగుతున్నాను' అన్నారు. నేనడిగిందది, నీవు యిచ్చేదిది. అంటే వీడు యింట్లో కూర్చుని పారాయణ చేస్తున్నా వీడిబుద్ధి దానిమీద వుంచి చేస్తున్నాడా, లేదా అని బాబా గమనిస్తుండేవారు. ఒకడికి అలాగే గురి కుదరలేదు. శ్రద్ధ కుదరలేదు, అన్వయం సరిగ్గా కుదరలేదనుకుంటే వెంటనే వాణ్ణి మరొకరి దగ్గరకు పోయి $16^1/_2$ రూ. దక్షిణ తీసుకురా, అని చెప్పారు. వాళ్ళక్కడ తాపీగా తత్త్వాలు లెక్క పెట్టుకుంటున్నారు. లెక్క పెట్టుకోవటంలో లెక్క తప్పు వస్తోంది. అందుకని $15^1/_2$ అనే లెక్కనే తీసుకుంటున్నారు. అప్పుడే దక్షిణ $16^1/_2$ తెమ్మని చెప్పి దానినిసరిగ్గా అన్వయంచేసుకో అని యిక్కడినుంచే వాళ్ళకు చెబు తున్నారు. అలాగే కుశాభావు 108 పారాయణలు చేసేటప్పుడు యిది చేసిందే గదా! ఎన్నిసార్లు చేస్తామని అనుకునేటట్లయితే వెంటనే పట్టుకునేవారు బాబా. కాబట్టి మనం బాబాను పట్టుకున్నప్పుడు ఆయన చెప్పిన నిష్ఠ సబూరీలు ఎంత వరకు గుర్తు పెట్టుకుంటామో అంత మేరకు ధర్మసూత్రాన్ని అచరించ డానికి వీలవుతుంది, లేకపోతే కాదు. సాటి జీవులపట్ల మన భావం మార్చుకోవడం అనే

అంశంలో అంత మేరకు మాత్రమే మనం మారతాము. ఎంత మేరకు మనం మార్చుకోమో అంతమేరకు మనం వారి బోధపట్ల మనకు శ్రద్ధ లేనట్లు లెక్క. అంటే అంత మేరకు సకల ఆధ్యాత్మిక గ్రంథాలయందు శ్రద్ధ లేనట్లు లెక్క.

అంతమేరకు అధ్యాత్మికతయందే శ్రద్ధ లేనట్లు గుర్తు. అంతమేరకు లౌకికత, సాంసారికత పట్ల లోపల గుర్తున్నట్లు లెక్క. అప్పుడు దానిని మనం ఎలా పొందుతాము? అది తెలుసుకోలేక మనం యింతకాలం జపం చేస్తున్నాం కాని యింకా మన చిత్తం స్థిరం కాలేదేమిటి, బాబా అనుగ్రహం యింకా కలుగ లేదేమిటి అనుకుంటాము. నీవు రోజూ నన్ను 5 నిఃలు తల్చుకుంటే నిన్ను ఆదుకుంటానని భగవద్గీతలో కృష్ణుడు ఎక్కడైనా చెప్పాడా? "అనన్యాశ్చింత యంతో మాం" అనే కండీషన్ ఆయనకూడా పెట్టాడు. "అనన్యమైన చింత కలిగి వుంటేనే, నీ యోగక్షేమాలు నేను చూచేది, లేకపోతే తక్కిన సమయమంతా నీవే చూచుకుంటున్నావు గదా! నీకు తెలుసని గదా నీ వుద్దేశం. కాబట్టి నీవే చూసుకో. అలాగాక ఎప్పుడైతే నీవు అనన్యమైన చింతలో నామీద నిలచావో అప్పుడు నిన్ను చూస్తాను" అన్నారు. అయితే బాబా అందులో కొంచెం కన్‌సెషన్ యిచ్చారు. అనన్యమైన చింత చేయమంటే యిబ్బంది పడ్తాడని 'నీ దృష్టి నామీద నిలుపు, నా దృష్టి నీమీద నిలుపుతాను' అన్నారు.

"సాధ్యమైనంత వరకు క్రమంగా పెంచుకుంటూ వెళ్ళు", అని కన్‌సెషన్ యిచ్చారు. ధర్మాచరణ గురించి మళ్ళీ మళ్ళీ ఎందుకు మాట్లాడుతున్నానంటే అది లేక ఆధ్యాత్మికత లేదు. ఎందుకని? అన్ని మతాలలోని మహనీయు లందరూ ఏకగ్రీవంగా ఒక్క విషయం చెప్పియున్నారు. మనకు కనిపించే ఈ విశాల విశ్వం గూడా ఒకే పరమాత్మమయము అనేది స్పష్టంగా చెప్పి 'అల్లా' ఒక్కడే సత్యం తక్కిందేదీ కాదు అని. మనం సోహం సోహం అని ఎలా చేస్తామో వాళ్ళు ఉచ్ఛ్వాస, నిశ్వాసాలతో కలిపి వాళ్ళది చేస్తారు. అయనొక్కడే సత్యం యింకేమీ లేదు. అదే సత్యాన్ని అన్ని అద్వైత గ్రంథాలూ చెబుతున్నాయి.

భక్తిపరమైన భాగవతాది గ్రంథాలు, భగవద్గీత కూడా "వాసుదేవ సర్వం" అని చెబుతున్నాయి. విష్ణుసహస్రనామంకూడా అదే చెపుతున్నది. ఉన్నది యావత్తూ పరమాత్మ తత్త్వమే. భిన్నంగా ఏమీలేదక్కడ. తద్భిన్నంగా ఏది కనపడుతుందో అది మన దృష్టిలోని లోపం. ఎందువల్ల? అంటే ప్రత్యక్ష అనుభూతి అది మనకు కలుగలేదు. కనుక అన్యత్వమే భాసిస్తుంది. అప్పుడు

మనమేం చేయాలంటే, మహాత్ముల వాక్యాలే శరణ్యం. మహనీయులందరూ ఏకగ్రీవంగా ఏమి చెప్పారో చూడాలి. అదీ చాలదనుకుంటే, ఆ మహనీయుల వద్దనున్న భక్తులకు కలిగిన అనుభవాలను చూడాలి. అన్నింటిలో ఒక్కటే వుందన్న మాట నిజం కాకపోతే ఎక్కడ ఏమి జరిగినా సాయికి ఎలా తెలుస్తుంది? అంతేకాక దానికి సరిపోయేటట్లు ఆయన చెప్పిన వాక్యాలే వున్నాయి. "నీవు కలిసి చూసేదంతా నేను", "ఈ విశ్వమంతా నాలోనే వున్నది". విశ్వమంతా నాలోనే వున్నదన్నారు గాని విశ్వమే నేనని చెప్పలేదు. అయితే, 'నీవు చూచే దంతా కలిసి నేనన్నారుగా' అని అంటే ఈ విశ్వమూ, ఈ విశ్వమును చూచే నీవు కలిసి ఆయన అని అర్థం. అంటే దృక్కు, దృశ్యము ఏకమైన స్థితిలో వేరు అనేది వుండదన్నమాట. దానిని మొత్తం సాక్షీభూతమై చూచేదే "త్రిపాదస్యామృతం దివి". అవ్యక్తరూపంలో మూడు పాదాలుండి ఒక్క పాదమే ఈ చరాచర విశ్వమైంది. కాబట్టి నీవు చూచేదంతా కలిసి నేనన్నప్పుడు-నువ్వు చూచేదంతా కలిసి నేను. ఆ చూచే దానిసంగతి ఆలోచిస్తే ఈ చూడబడే దాని క్రిందకు యావత్తూ వెళ్ళిపోతుంది. విశ్వమంతా చూడబడేది. చివరకు తన దేహం, చిత్తంలో వచ్చే ప్రవృత్తుల వరకు అంతా చూడబడేదే. కాబట్టి ఎక్కడైతే మనకు అనుభవం కావడంలేదో మహాత్ములను శరణుపొందడమొక్కటే మనము చేయవలసినది.

జ్ఞానం కలిగిన మహనీయులందరూ, యిదే చెప్పారు. మనం పరమాత్మ తత్త్వమని, బ్రహ్మమని, ఆత్మ అనీ దేనినైతే అంటున్నామో, దానినే బుద్ధత్వం అంటారు వాళ్ళు. అందుకనే వాళ్ళ గ్రంథాలలో కుక్క, నక్క ప్రతి ప్రాణిలో బుద్ధత్వం వుంటుందని, వుందని చెప్పారు. ఆ స్థితికి వచ్చినవాడు అంటే ఆ బుద్ధత్వం పొందినవాడు - సంసారం, నిర్వాణం ఒక్కటేనంటాడు. అంటే **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** అని, బ్రహ్మం జగత్తుకు భిన్నంగాదని అంటాడన్న మాట. దురదృష్టవశాత్తూ బౌద్ధం మన దేశంలో లుప్తమైన తర్వాత చాలా గ్రంథాలు చైనీస్, జపనీస్, టిబెటిన్ భాషల్లోకి అనువాదం అయ్యాయి. ఆ తర్వాత, విదేశీ పరిపాలకుల సమయంలో ఈ గ్రంథాలు నశించిపోయాయి. అందుకని యిది ఫలానా గ్రంథంనుండి అనువాదం చేసామని రాసారు. ఇది పాళిగ్రంథం నుండి అనువాదం చేసామని రాసారు. వాటిని చూస్తే శంకరుడు బౌద్ధాన్ని ఖండించి వుండడని తెలుస్తుంది. అందులో వుండే ఒక అంశం మాత్రం మన దేశంలో వుండి ఆయన చెప్పిన దానిని మరొకరకంగా అర్థం చేసుకొని ప్రక్క దారి పట్టించిన

దానిని మాత్రమే ఖండించాడని తెలుస్తుంది. ఇక్కడ ఏమి చెప్పివుందో అక్కడా అదే చెప్పియుంది. కాబట్టి బుద్ధుణ్ణి చూసుకున్నా అదే తెలుస్తుంది. మహనీయులందరూ అదే చెబుతున్నారు. కాబట్టి వాటినైనా తీసుకోవాలి. లేదంటే మహాత్ముల సమక్షంలో భక్తులకయిన అనుభవాలనన్నా తీసుకోవాలి. అప్పుడు అట్లాంటి అనుభవం కలగాలంటే సర్వగతమైనది ఒకటి వుండాలి అని అన్వయించుకొని మననం చేసుకోగలిగితే, విశ్వాసం కలుగుతుంది.



అధ్యాయం-4

తత్త్వచింతన



తత్త్వచింతన చేయాలి. ఈ తత్త్వచింతన చేయాలని బాబా సూచించారు. మనలో వుండే వికారాలన్నీ జయించాలని ఆయన చెపుతున్నారు. ఉదాహరణకు ద్వారకామాయిలో ప్రసాదం పంచుతున్నారు. 'ప్రసాదం తిన్నావా'? అని బాబా ఒకడిని అడిగారు. నాకూ వాడికీ పడదన్నాడు వాడు. అప్పుడు బాబా, "ఇచ్చేవాడెవరు? ఇవ్వబడే పదార్థమేది? పుచ్చుకునే వాడెవ్వడు? అన్యం లేదు. అంతా ఒక్కటే, తీసుకో"మన్నారు. బాబా వేసిన ప్రశ్నలు జాగ్రత్తగా చూడండి అంటే యిలా ప్రశ్నించుకోవాలి అని చెబుతున్నారన్నమాట. ఆ రీతిన నీవూ ఆలోచించమని చెప్తున్నారు. వూరికే వల్లించకు, మనస్సులో బాగా ఆలోచించు. ఒక్కొక్క భాగం పీరుకుంటూ వస్తే ఎక్కడుంటుంది శత్రుత్వం అని పదే పదే ఆలోచించి, పీరి పారేస్తే శాశ్వతంగా అది నీలో గుర్తుండిపోతుంది. మనకు శత్రుత్వం పోయినా, అవతలి వాడికి పోకపోతే ఏం చేయాలి? అందుకాయన, "ప్రపంచం తలక్రిందులుగానీ, నీ మార్గాన నీవు పో" అన్నారు. అవతలివాడు పెట్టుకుంటానంటాడూ, వాడి యిష్టం. నీకూ అలా వుండడమే బాగుంటే అలాగే పెట్టుకో.

ఉదాహరణకు ఒకడు చదువుకోదల్చుకున్నాడు. డిస్టిన్క్షన్ తెచ్చుకోదల్చుకున్నాడు. యింకొకడు ఫెయిలవ్వదల్చుకున్నాడు. ఫెయిలవనీ, వాడికది బాగుంది. అలాగే వాడు శత్రుత్వం పెట్టుకుంటానంటే వాడికి అలాగే బాగుంటే పెట్టుకోమను. వాడు పెట్టుకున్నాడని నీవు పెట్టుకోకు అని చెబుతూ ఎలా ఆలోచించాలో ముందుగా జాగ్రత్త చెబుతున్నారు. ఈ విధంగా ఆలోచిస్తే భక్తిభావం కలుగుతుంది, శ్రద్ధ కలుగుతుంది. ఈ విధంగా ఆలోచించలేక ప్రపంచంలోని మత సాంప్రదాయాలన్నీ మానవాళికి శ్రేయస్సు చేసే బదులు చెరుపు చేసిపోతున్నాయి. అప్పుడు ఏమౌతుంది? చేసుకునే పద్ధతిలో భిన్నం రాగానే మనిషి మనిషికీ తేడా వచ్చేస్తుంది. ఇక అక్కడ్నుంచి తేడా ప్రధానం అవడం మొదలు పెడ్తుంది. వాడొచ్చి ఈ పద్ధతి మొదలుపెట్టాడు గనుక వాడికంటే 5ని॥లు ముందొచ్చి ఈ పద్ధతి మొదలుపెడితే సరిపోతుందనిపిస్తుంది.

ఈవేళ యితడు 5ని॥లు ముందొచ్చి ఈ పద్ధతి చేసాడు గనుక రేపు నేను 10ని॥లు ముందొచ్చి ఆ పద్ధతి చేస్తే సరిపోతుందనిపిస్తుంది. ఇక అన్నింట్లో బాబాను చూచే ప్రశ్న ఎక్కడి నుంచి వస్తుంది? అన్ని మతాలలో ఒకేసారం వుందని చూడడం ఎలా? అన్ని జీవుల్లో ఒకటుందని తెలుసుకోవడం ఎలా? ఒకే దైవాన్ని కొలిచే యిద్దరిమధ్య సామరస్యం లేకపోతే ఇకవీమి నేర్చుకొంటున్నట్లు? అందుకని భక్తితో పాటు తత్త్వచింతన అవసరం, ఆవశ్యకం అని బాబా చెబుతున్నారు.

ఉదాహరణకు శ్రీరంగన్నబాబుగారు, అవధూత పిచ్చమ్మగార్ల నడవడి ఎలా వుందో చూడండి. వాళ్ళని కించపరిచిన వాళ్ళు, ద్వేషించినవాళ్ళు, నెత్తిమీద పెట్టుకున్నవాళ్ళూ వున్నారు. నీవే దైవం అని ఒకాయన రంగన్న బాబుగారిని నెత్తిమీద పెట్టుకున్నాడు. ఉన్నట్లుండి , ఒకరోజు నోటికొచ్చినట్లు తిట్టాడు రంగన్న బాబుగారిని. "నీవొచ్చి యిలా కూర్చుంటావు, నీకోసం వచ్చే జనానికి వేళాపాళా లేకుండాపోయింది'' అని అన్నాడాయన. "ఏమయ్యా! నేను కూర్చుంటే నీకిబ్బందిగా వుందా''అని అడిగారు బాబుగారు. "అవును, లేకుండా ఎట్లా వుంటుంది" అన్నాడాయన. "అయితే రాకుండా చేయమంటావా"? అని బాబుగారు, లేచి తాళంచెవి ఆయన చేతిలో పెట్టి 'ఇక రారులే' అని వెళ్ళారు. ఒక పూట, రెండు పూటలు జనం ఆ గదికి వెళ్ళారు. ఆపైన ఎవరూ వెళ్ళడం మానేసారు. అక్కడ్నుంచి బాబుగారివల్ల ఏం మేలైతే జరిగిందో అదిపోయే పరిస్థితులేర్పడ్డాయి. అప్పుడు పోయి బాబుగారి కాళ్ళు పట్టుకున్నాడు. ఏముంది! బాబుగారు వెంటనేవెళ్ళి వారింట్లో కూర్చున్నారు. తత్త్వచింతన పరిపూర్ణమై ఈ రాగ, ద్వేష, అసత్యమైన భావాలకు తావులేకుండా రాములువారే సత్యము, అనే దానిమీద మననం చేస్తూ వున్నారు. కాబట్టి వారు కృతార్థులయ్యారు.

అలాగే అవధూత పిచ్చమ్మ విషయంలో కూడా. ఆమె చాలా కష్టాలు పడింది. కూలి నాలి చేసుకొని జీవించేది. ఉన్న ఒక్క కూతురూ బావిలో పడి చనిపోయింది. అప్పుడు అమె కోసం శోకించింది. అపుడు ఎవరో ఒక సాధువు వచ్చి 2 ని॥లు మాట్లాడి వెళ్ళిపోయారట. అప్పటినుండి ఆమె పరమాత్మ కోసం దుఃఖించింది.

మన జీవితంలో ఎంతోమంది ఆత్మీయులు చనిపోతున్నారు. మనం ఎన్నో శాస్త్రగ్రంథాలను చదువుతున్నాము. అయినా మనకలా కలుగదు.

ఆమెకంటే మనమే కాస్త ఎక్కువ గ్రంథాలు చదివివుంటాం. ఎన్నో ప్రసంగాలు వినివుంటాం. ఆప్తులైన వారి యిద్దరి ముగ్గురి చావులుకూడా చూసివుంటాం. అయినా గాని యివన్నీ సమన్వయపడటం లేదు. ఆమె అలా అయిందంటే ఒక్కటే గుర్తు. ఇదివరకే ఎప్పుడో వీటిగురించి ఆలోచించడంవల్ల ఆమె మనస్సుకు వివేక,వైరాగ్యాలు వచ్చేసాయన్నమాట. చివరికి ముగ్గిపోయిన వెలగ పండు చెట్టుకు అంటిపెట్టుకుని వుండడానికి కొంచెం బలం ఎలాఅయితే వుంటుందో, కొద్ది గాలికి మాత్రమే అది ఎట్లా అయితే రాలిపడుతుందో, అలాగే ఆమె చివరికొచ్చేసింది గనుక ఆ చివరి తాకిడి తగిలేసరికి పరిపూర్ణమై పోయింది. ప్రకాశానంద, నిత్యానంద అనే ఆత్మవేత్తలు మాట్లాడుకుంటుంటే అనేకమంది భక్తులు వచ్చి అనేక ప్రశ్నలు వేసేవారు. వారు యిచ్చిన సమాధానాలు 'వార్తా లాపం' అనే ఉత్తమోత్తమమైన గ్రంథం అయింది. దానిలో, రామరామ, కృష్ణ కృష్ణ అని అనుకుంటూ వుంటే సరిపోతుంది గదా, ఈ తత్త్వచింతన ఎందుకు? అని ఒకరు అడిగితే దానికి వాళ్ళు తత్త్వచింతన లేకపోతే ఏమీ లాభం లేదని స్పష్టంగా చెప్పారు. అందుకని భక్తి తత్త్వచింతన చేసితీరాలి. ఆ తత్త్వచింతన శ్రవణం అయితే తప్ప మనలో వుండే వికారాలు తొలగవు. ఉదాహరణకు ఒక సంఘటన జరిగింది. లేక ఒకవ్యక్తి గురించి సంఘర్షణ జరిగిందనుకోండి. అప్పటికప్పుడు మనమేం చేయాలో తెలుపుతుంది తత్త్వచింతన. తత్త్వచింతన లేకుండా, యోచన లేకుండా ఆ వికారాన్ని హృదయంనుండి తొలగించుకొనే మార్గం లేదు.

అలాగాక నామస్మరణచేస్తే బాధ పోతుంది గదా? అంటే చేస్తే పోతుంది. కాని బాధ కలిగినప్పుడు దానిని (అంటే ఆ బాధను) మాత్రమే మనస్సు జపిస్తుంది కానీ పెదిమలు మాత్రం నామాన్ని జపిస్తాయి. ఈ నొప్పి కంటే పరమాత్మ ధ్యానం కుదిరే స్థితికి మనస్సు వచ్చినట్లైతే నొప్పి కలగకుండా వుంటుంది. ఉదాహరణకు చీట్ల పేకలో మనస్సులగ్నం అయితే కంటిమీదకు కునుకురాదు. చదువుకుందామని ప్రయత్నిస్తే పుస్తకం ఎదురుగుండా పెట్టుకొని టీ త్రాగాలి. అంటే ఆటయందుండే ప్రీతిచేత నిద్రరాదు. అలాగే భగవన్నామం యందు యివేవి సోకని ప్రీతి యేర్పడియుంటే యిలాంటి వ్యసనాలు సోకనే సోకవు. ఆదే రంగన్న బాబుగారిని నీవే దైవమని నెత్తిమీద కెక్కించుకొని గది యిచ్చాడు. తర్వాత ఘోరంగా మాట్లాడాడు. "నావల్ల యింత లాభం

పొందావు" అని ఆయన ఒక్కమాట కూడా అనలేదు. ఎవరినైతే సాక్షాత్తు శ్రీరామచంద్రుడని లోకమంతా అనుకుంటుందో, ఎంతమంది భక్తులొచ్చి ఆయనకు పాదాక్రాంతులౌతున్నారో, యిదంతా కళ్ళారాచూస్తూ కూడా అతడు ఆయనను అన్నన్ని మాటలంటే, అన్ని బాధలు పెడితే, ఆయన ఏ విధంగానూ రియాక్ట్ అవలేదు. ఆయనే మనకుండా 'అంత బాధగా వుందా, అయితే యిక రాకుండా చేయమంటావా?' అని వచ్చేసారు. అదే సంఘటన మనకు జరిగితే ఆ సందు మలుపు తిరిగితే సరి, గుర్తొస్తుంది వీడిట్లా అన్నాడని. అందుకని వాళ్ళు తత్త్వచింతన లేకుండా భక్తితో మాత్రం వచ్చారని అనుకోవడం భ్రమ. గీతలో కర్మ, భక్తి, జ్ఞానయోగాలు ఎందుకు చెప్పారంటే ఎవరెవరి అర్హతను బట్టి అధికారాన్నిబట్టి ఆయా యోగాలు వారు చేసుకోగలగడానికి అలా చెప్పారు. మూడు యోగాలూ చేసుకున్నాక అనుకుంటే భగవద్గీత అర్థం కానట్లే లెక్క. భారతంలో అధ్యాయాల పేర్లులేవు. అంతా కలిసి సమగ్రంగా ఒక బోధే. అందులో- ఆ పరమాత్మ తత్త్వం. దానికి సంబంధించి సృష్టి తత్త్వంతో, నీ ధర్మాన్ని యెలాంటి భావంతో అనుష్ఠించుకొంటూపోతే నీకు పరమార్థం వస్తుందో చెప్పారు. అదే దాని సారాంశం. అనుష్ఠించుకుంటూ పోవలసిన వాటిలో మూడూ యిమిడి వుంటాయి. నేను తప్ప యింకేమీ లేదనేది రెండవ అధ్యాయంలో ఒకరకంగా చెప్పుకొచ్చాడు. విభూతియోగంలో ఒక రకంగా, విశ్వరూప సందర్శనంలో మరొక రకంగా చెప్పాడు. దానిని గుర్తుపెట్టుకొని ఆచరించేవానికి భక్తియోగంలో ఒకరకంగా చెప్పారు. దానినే ప్రక్కదానిలో తాత్త్వికంగా వివరించి చెపుతున్నాడు. కర్మలో ఎలా నిలుపుకోవాలో కర్మయోగంలో చెపుతున్నాడు. అన్నింటి సమన్వయం ఒక్కటిగానే వుంటుంది.

ఉదాహరణకు లడ్డూలో చక్కెర వున్నది, శనగపిండి వుంది. అన్నీ వున్నా లడ్డు తయారు చేయడానికి ఒక పద్ధతి వున్నది కదా! వాటి సమన్వయం కుదిరితే గాని, లడ్డూ తయారవదు. అలాగే తత్త్వచింతన వలన వివేకం, వివేకం వలన భక్తి, అన్యమైన వాటియందు విరక్తీ కలుగుతాయి.

చరిత్ర రూపంలోనైతేనేమి, వారి సాన్నిధ్యంలో అయితేనేమి భగవద్గీతలో చెప్పిన దానియొక్క సారాంశాన్ని ఈ కారణంచేత విస్మరిస్తాము. బాబా తన చిత్రానికీ, తనకూ భేదం లేదని చెప్పారు. మనం కూర్చున్నంత సేపు వారే అక్కడ కూర్చున్నారనే భావనలో ఎంత సేపు కూర్చోగలుగుతామో అంత మేరకు మనము

ఆయననుంచి ఫలితాన్ని పొందుతాము. అందుకని మన పెద్ద వాళ్ళు పూజా గృహం ప్రత్యేకించి యిందుకోసమే పెట్టేవారు. సాధ్యమైనంత మేరకు పూజకు వేరే గృహం వుంచుకోమని, అందులోకి విడిసమయాలలో వెళ్ళవద్దని, అక్కడ నిద్రించడం వంటి వాటిని చేయవద్దని ఎందుకు చెప్పారంటే, ఎదురుగుండా వున్నది ఆ దైవమే అనే భావనా సామర్థ్యాన్ని మనం ఎక్కువసేపు నిలువు కోవడానికి. ఏ ఒక్క భావాన్నిగూడా మనం పొడుగునా నిలుపుకోలేము. ఒక్క రాగద్వేషాలు తప్ప; అది మన దురదృష్టం. వాటిని తొలగించలేము, వీటిని నిలపలేము. అంటే అట్లా ఎంత సేపు నిలపగలవో అంతసేపే అక్కడ కూర్చోమని, దానిని విస్తరింపచేసుకోడానికి ప్రయత్నించమనీ చెప్పారు. నిన్న పది నిమిషాలు చేసావనుకో, 20 రోజులు అలా చేస్తూపోవాలి. తర్వాత 20 నిమిషాలపాటు చేయడానికి ప్రయత్నించాలి. అలా రోజులో దానియొక్క సాన్నిధ్య ప్రభావాన్ని విస్తరింప చేసుకుంటూ పోవాలి. ఎప్పుడైతే దానిని పొడుగునా నిలుపుకుంటూ వస్తావో, అప్పటినుండి నీకు ఉపాసన చేతిలో చిక్కినట్లే లెక్క. అంటే ఏమిటి? మనం ఉపాసన చేయడం లేదు. ఉపాసన చేయడానికి అభ్యాసం చేస్తున్నాము. ఎప్పుడూ గుర్తుండటం మొదలు పెట్టాక ఉపాసన బాగుండడం మొదలు పెడుతుంది. అది లోతుగా, ఇంకా లోతుగా వచ్చి, 'అది-నేను' వేరుగా వున్నాననే స్థితి, సమాధి స్థితికి కొద్ది దూరం ముందు వుంటుంది. ఉదాహరణకు రామకృష్ణ శిష్యులైన బ్రహ్మానంద సరస్వతి, యిలా అంటుంటారు: "సమాధ్యవస్థను చేరడానికి సాధన చరమదశ" అని, సాధన సమాధి స్థితితో ప్రారంభమవుతుంది, అనీ అంటారు.

ఇప్పుడు మనం చేసే జపాలు, తపాలు కూడా సాధన చేయడానికి మన మనస్సును సంసిద్ధం చేసుకోవడమే. ఉదాహరణకు బజారుకుపోయి బియ్యం కొనుక్కోవడం, రాళ్ళు ఏరుకోవడం, కడుక్కోవడం, వంటచేయడం మొదలైన పనులు చేసేటప్పుడు భగవంతుని స్మరించుకుంటూ, ఆయనకు చేస్తున్నాననే భావంతో చేయమన్నారు. అంటే అనన్యచింతన చేయమన్నారు. అది నీకు అప్పుడే మొదలవుతుంది. రాగద్వేషాలయందు సమభావం కలిగివుండడం కూడా నీకప్పటినుండే కుదురుతుంది. అంటే గీతలో పరమార్థానికి ఏమేవి అవసరమని చెప్పాడో అవన్నీ ఆచరణలోనికి వచ్చేది నాటినుంచే. ఈ లోపల ఆచరణలో తెచ్చుకోవడానికి ప్రయత్నం మాత్రం చేస్తూ వుంటాము. ఎంత

వరకు దానిని మనం గుర్తు పెట్టుకుంటామో అంతవరకు పొందగలుగుతాము. ఎంత మేరకు మనం దానిని మరిచిపోతామో అంతమేరకు శ్రేయస్సును కోల్పోతాము.

ఉదాహరణకు ప్రత్యక్షంగా మనం ఒక మహనీయుని దగ్గరకెళ్ళాం, వారి వద్ద కూర్చున్నాం. గమనించండి. మన పద్ధతులన్నీ మారిపోతాయి. ఆయన సమక్షంలో మనం కూర్చునే పద్ధతి, మాట్లాడే పద్ధతి, మొదలైన అన్ని పద్ధతులు మారిపోతాయి. దానినే శ్రద్ధ అంటాము, నిష్ఠ అంటాము. ఎంతసేపు పెద్దల సన్నిధిన కూర్చుంటామో అంతసేపు మన దృష్టంతా వారిమీదనే వుంటుంది. అనుచిత భావమేదైనా వస్తుందేమోనని మనం జాగ్రత్తగా వుంటాము.

దీనినే బాబా, సాయి శరణానందులతో 'దక్ష' అన్నారు. దక్ష అంటే జాగ్రత్త అని అర్థం. అతనికిచ్చిన ఉపదేశం ఆ ఒక్కమాట మాత్రమే. 'జాగ్రత్త'? అంటే ఏమిటి? తంతాడా జాగ్రత్త లేకపోతే?ఆయన ఏమీ అలా చేయడు. కానీ, వీడి అజ్ఞానం వీడిని తప్పకుండా తంతుంది. తన ఎదుట వున్నపుడు ఎలా వుంటాడో అలా ఎక్కడున్నా ఆయన సన్నిధిలో వున్నాననే దానిని గుర్తుపెట్టుకొని నిలువగలిగితే, ఆలోచించగలిగితే, అలాగే వ్యవహరించగలిగితే అదే దక్ష, అదే నిష్ఠ. అది చేయాలంటే ఎంత ఓరిమి కావాలి? అవతలివాడు మనపట్ల ఎంత అసభ్యతగా ప్రవర్తించినా మనం ఓరిమి కలిగి వుంటే తట్టుకొని నిలబడగలుగుతాము. అందుకనే బాబా, నిష్ఠ, ఓరిమి - అప్పచెల్లెళ్ళ వంటివి అంటారు. అంటే ధర్మాచరణ అన్నది నిత్య జీవితంలో సాటి మానవులపట్ల వుండాల్సిన భావం మారటంవద్ద ఆరంభమై, అనన్య చింతనతోను, అట్టి నిశ్చలమైన నిష్ఠతోనూ, గురువుదగ్గర కూర్చుండగలగడం దగ్గర చరమావస్తకు చేరుతుంది. అప్పటికి ధర్మం పూర్తవుతుంది. అప్పుడు అది పరమధర్మం అవుతుంది. ఆ సమన్వయం లోంచి మాత్రమే సర్వధర్మాలు పుట్టాయి. ఆ పరమధర్మం వాస్తవం కాబట్టే, యిది వాస్తవం, సార్థకం అవుతున్నాయి. ఆ పరమ ధర్మాన్ని ఎప్పుడైతే మరుస్తున్నామో, అప్పుడు తక్కినవన్నీ పిల్లల ఆటలవలె అవుతున్నాయి. పెద్దలు చేసిన వాటిని పిల్లలు ఆడుకోవడంలో ఏమిటర్థం? అలాగే ఈ అవగాహన లేకుండా ఈ తత్త్వచింతనతో పెనుగులాడకుండా, పరమధర్మం సాధ్యంగాదు. అయితే ఆ పెనుగులాటలో గెలువవచ్చు, ఓడవచ్చు. అది వేరే సంగతి. పదిసార్లు ప్రయత్నిస్తే పదిసార్లు జయించలేక పోవచ్చు. ఒక్కసారి జయించవచ్చు. ఫర్వా లేదు,

జయాపజయాలు, లాభనష్టాలు అనే భేధం వదిలిపెట్టి యుద్ధంచేయి అని చెప్పారు. పదిసార్లు చేసాను, నావల్ల కాదు అని నిస్పృహ చెందకుండా చేయమనే బాబా చెప్పేది. "వాడాలో దొంగ లున్నారు జాగ్రత్త". "మనలో వున్న వాళ్ళందరినీ తెలుసుకోవాలి". "మనలో ప్రతి వాడిలో ఒక హీనజాతివాడు వున్నాడు. వాడిని వెడలగొట్టాలి" అనే సూక్తులు చెప్పారు బాబా. అంటే యీ మొత్తం కురుక్షేత్రం అవుతుందన్న మాట. ఇది మనలో జరిగేటటువంటి ఘర్షణ అన్నమాట. ఘర్షణలో ఎన్నిమార్లు ప్రయత్నించాం, ఎన్నిమార్లు విఫలంచెందాం అని కాదు. నీవు ప్రయత్నం వదలకుండా చేయగలగడమన్నదే ప్రధానం అక్కడ.

ఉదాహరణకు చేస్తున్నాం, చేయిస్తున్నాం, యింకా మాకు ఏమీ కుదరడం లేదు. ఏమీ నిదర్శనం కనిపించడంలేదు అని కొందరంటారు. కండలు పెరగాలని ఒకడు వ్యాయామం చేస్తున్నాడు, లోడీలు తిప్పుతున్నాడు, బస్కీలు కొడుతున్నాడు. చెమటలు పడుతున్నాయి, కండలు పులుస్తున్నాయి. ఎప్పుడూ శ్రమే కనపడుతుంది అనుకున్నాడనుకోండి. అక్కడ బలం అనే వస్తువు కనపడుతోందా?

నీవు రోజా పట్టుదల వదలక చేస్తున్నావు చూశావా, ఆ పట్టుదల పెరగడంలో, ఆ సామర్థ్యం చూపడంలో బలం పెరగడం గుర్తించవచ్చు. ఈ వేళ లోడీలు 20 తిప్పావు, రేపు వద్దులే అబ్బా! అనిపించిందంటే బలం రాలేదని అర్థం. ఇంకా బలహీనంగా వున్నదని అర్థం. కాని పట్టుదల వదలకుండా పది నుండి పదకొండుకు తిప్పుతున్నావు చూశావా! అదీ బలం పెరుగుతున్నట్లు గుర్తు. నీకు యిక్కడ కండ కనిపించలేదంటే ఎట్లా..... అందుకని వదలకుండా చేస్తున్నావంటే నీవు సాధన గాడిలోకి వచ్చావని అర్థం. అలాగే మనలో వికార భావాలు కలిగినపుడు చెంపలు వేసుకొని, ఛా, ఛా నేను చదివిందేమిటి? చేసేదేమిటి? అని గుర్తుపెట్టుకొని మనస్సు వెనక్కితిరిగి ఆలోచించిందంటే గాడిలోకి వస్తున్నదని అర్థం.

కాబట్టి మహాత్ములయొక్క ప్రత్యక్ష్య సాన్నిధ్యంలో ఏ విధంగానైతే మనస్సు ఉత్తమోత్తమమైన రీతిలో వుండాలని చెప్పారో, అలాగే పరోక్షంలో కూడా వుంటే, పరోక్షంలోనూ వారి సన్నిధి వుంటుంది. ఉండడం చేతకాకపోతే, అప్పుడూ వుండదు, యిప్పుడూ వుండదు. కుదిరితే అప్పుడూ యిప్పుడూ ఒక్కటే. ప్రయత్నం చేయడానికి అప్పుడూ, యిప్పుడూ ఒక్కటే కష్టం. చేసే పూజ కాని,

పారాయణగానీ, భజనగానీ, మందిరములో కూర్చొనిగానీ, పటం సాన్నిధ్యంలోగానీ, వీటన్నింటిలో సాయిబాబా లీలలన్నింటిలో- ఏ తత్త్వమైతే బోధించబడిందో, దానిని మనస్సుకు ఆకళింపు చేసుకొని ఎంత జాగ్రత్తగా వుండగలుగుతున్నామో అదే గుర్తు. ఎప్పుడైతే మన దృష్టి దానిపైన పడిందో అప్పుడు చదువుతున్న లీల మనస్సుకు వంటబట్టలేదనిపిస్తుంది గాని యిన్నిసార్లు చదివేశాను గనుక వచ్చేసిందనిపించదు. నాలో వ్యతిరేకమైన వికారాలతో పోరాడడంలో ఎంతో పట్టుదల కన్పించడమే నా మనస్సు ఆ తత్త్వాన్ని ఆకళింపు చేసుకుంటున్నట్లు గుర్తు. అప్పటికి నాకా లీల పట్టుబడ్డట్లు లెఖ్ఖ. 108 సార్లు చరిత్ర పారాయణ అయిన తర్వాత - ఒకసారి మననం చేసుకోవడం అవసరం. అపుడు మందిరానికి వచ్చి కూర్చుంటే, కనీసం మందిరంలో వున్న సమయంలోనైనా సరే, ఆ సంగతి గుర్తుపెట్టుకుంటానికి ప్రయత్నించినట్లయితే చాలు. వచ్చి కూర్చుని ఎవడితో మాట్లాడకుండా, ఏం చేయకుండా అలా చూస్తూ కూర్చొని వున్నామనుకోండి. బాబా ప్రత్యక్ష సన్నిధిలో అదే తప్పకచేసి వుండేవాళ్ళము. ఆయనను అక్కడ కూర్చోబెట్టి ప్రక్కవాడితో మాట్లాడతామా? మహనీయుడి దగ్గర అట్లా వుండడానికి వీలవుతుందా? అయితే యిది అందరికీ వర్తించదు. వాళ్ళ దగ్గరే వుండి సేవచేసే వాళ్ళుంటారు. వాళ్ళు ప్రక్కవాడికి ఆ పని చేయరా, ఈ పని చేయరా అని చెప్తుంటారు, అది విస్మరణ క్రిందికిరాదు. విస్మరించి మాట్లాడుతున్నాడా లేదా అనేది వేరే విచారణ క్రిందికి వస్తుంది. దగ్గరుండే వారికి మాట్లాడవలసి వస్తుంది, వ్యవహరించాల్సి వస్తుంది. గుర్తుపెట్టుకొని వ్యవహరిస్తున్నాడా అనేది వేరే పరీక్ష. మరలా మాట్లాడినా పరీక్షే, కూర్చున్నా పరీక్షే, వ్యవహరించినా పరీక్షే, వ్యవహారం లేకుండా కూర్చున్నా పరీక్షే. గుర్తుంచుకొనే వ్యవహారము, గుర్తుంచుకోని వ్యవహారమూ వుంటుంది. కాబట్టి ఎక్కడికీ పరీక్ష అంతం? అసలిదంతా మన తరింపుకోసం మనం చేస్తున్నాం కానీ, ఎవడి మెప్పుకోసం కాదు. అందుకని ఆయన సన్నిధికి వచ్చినప్పుడుగాని, ఇంటి దగ్గర పటం ముందు కూర్చున్నపుడుగాని, ఆయన సన్నిధిలోనే కూర్చున్నాను అనే భావనను గుర్తుపెట్టుకోవాలనే పట్టుదలతో మనం ఎప్పుడైతే ఆరంభిస్తున్నామో అప్పటి నుండి మనకు వారి చరిత్ర చదువుతుంటే రక్తి కడుతుంది. మనస్సుకు పడుతున్నదనడానికి అదే గుర్తు. అప్పటికి ధర్మాచరణ పరమ ధర్మాచరణగా మారుతుంది. మామూలుగా ఈమాట లౌకికంగా అర్థం చేసుకోబడుతుంది.

ఇది లౌకికం మాత్రమే కాదు. లౌకికంగా సరియైన ధర్మం అంతఃకరణంగా ఎప్పుడైతే వచ్చిందో అప్పుడు దైవీసంపద, సాత్వికతవచ్చి జీవితం పరమ ధర్మంగా, ఆధ్యాత్మికంగా మారుతుంది. అందుకని ధర్మం, పరమార్థం వేరు కాదు. అర్థకామాలు అంతకంటే వేరు కావు.

ఉదాహరణకు ఒక నిచ్చెన వున్నది. దానికి ఇటోగడ, అటోగడ వుంటాయి. మధ్యలో మెట్లువుంటాయి. అందులో వున్న ఒక గడ ధర్మం, మరొక గడ మోక్షం. అర్థ కామాలు మధ్యలో వున్న కర్రలు. అంతా కలిసి ఒక నిచ్చెన. అలా ఉత్తమోత్తమంగా జీవించడం ఒక పద్ధతి.

పరమార్థానికి వెళ్ళడానికి ధర్మం పాటించాలి. దానిమీద ఆధారపడి అర్థకామాలు నెరవేర్చుకోవాలి. దానివలన వచ్చే పరిపూర్ణతపట్ల అవగాహన పెంపొందించుకున్నప్పుడు, అదే పారమార్థికత. అందుకని భగవంతుణ్ణే ధర్మం అని అన్నారు. ఎందుకని? పశుప్రాయంగా వుండవలసినవాడు జీవితంలో ఈ విషయంలో ఆలోచన కలిగి ఎప్పుడైతే పరిణతి తెచ్చుకుంటున్నాడో, అప్పుడు వాడు సమగ్రమైన తత్వంగా వికసించబోతున్నాడు. కాబట్టి దానిని ఉత్తమ ధర్మం, ఉత్తమ జీవితవిధానం, ఉత్తమ సంస్కరణ అని అన్నారు. ఒక్క మనస్సు, వాక్కు, శరీర సంస్కరణ మాత్రమే కాదు. సంపూర్ణమైనటువంటి మానవ హృదయం మొత్తం నఖశిఖపర్యంతం పరివర్తన కలగడమని అన్నారు.

దీనిద్వారా మనం తెలుసుకోవలసిన, ఆలోచించుకోవలసిన విషయ మేమంటే, దైవంకంటే కూడా మానవ జాతికి మహనీయులు సన్నిహితులు, ఆత్మీయులు. ఇది ముఖ్యమైన విషయం. దీని గురించే నామదేవ్ ఒకచోటం టాడు: "భగవంతుడు సకల చరాచరమంతా వ్యాపించి ఎల్లెడలా వున్నాడు. కాని ఎక్కడంటే అక్కడ, ఎవరికంటే వారికి లభ్యమౌతాడా?'' లభ్యమవడు. ఉదా హరణకు కొమ్ము చివరినుంచి తోక చివరివరకు ఆవే అయినా, పాలు పితకా లంటే పొదుగు దగ్గరే పితకాలి కానీ చెవి దగ్గర, కొమ్ము దగ్గర రావు. అలాగే ఆవు యొక్క ప్రాణం కొమ్ము చివరినుంచి తోకదాకా ఎలా వ్యాపించివుందో, అలాగే ఈ చరాచర విశ్వమంతా భగవంతుడు వ్యాపించి వున్నాడు. కాని మనలాంటి వారు ఆయనను పొందాలంటే ఎక్కడంటే అక్కడ దొరకడు. ఆ భగవత్ స్వరూపులైన మహాత్ములెవరైతే వున్నారో - వారి ద్వారా మనకు దొరకవలసిందే.

ఉదాహరణకు గంగానది వున్నది, యింకొక నది వున్నది. ఎవరంటే వాళ్ళం ఎక్కడంటే అక్కడ దానిలో దిగి స్నానంచేసి బ్రతికి బయటికి రాగలమా? మనకోసం మెట్లు (సోపానాలు) వేయబడి వుంటాయి. అవి వుండబట్టి ఎవరమైనా దిగి స్నానం చేసుకొని భద్రంగా బయటికి రాగలుగుతున్నాం. ఎక్కడ అడుగుపెడితే ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంలేకుండా మెట్ల సదుపాయం వుంటుంది. వుంటేనే అక్కడికి భద్రంగా పోయిరాగలం. అదే రీతిన భగవంతుడొక్కడే చాలదు మనకు. ఆయనున్నాడని, ఎలా చేరుకోవాలో తెలియని పక్షంలో ఆయన వున్నాడని తెలిపి ఎలా చేరుకోవాలో చెప్పి నడచి చూపించే మహాత్ములు, భగవంతునికంటే కూడా మనకు అధికులు, ఆత్మీయులు, దైవంకంటే గొప్పవారు. అట్లా దైవం గురించి తెలిపి, దైవాన్ని చేరుకునే మార్గం తెలిపి ఆచరింపజేసి, ఆ గమ్యాన్ని చేర్చేటటువంటి వారిని సద్గురువులు అన్నారు మన పెద్దవాళ్ళు. అందుకని ఈ సద్గురువు సాక్షాత్ భగవత్ స్వరూపుడే. ఆయనే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు. ఆయనే పరబ్రహ్మ స్వరూపము. ఆయనే సకలము. దీనినే గురుగీత - ఈ చరాచర విశ్వమంతా ఆయన రూపమే అని చెబుతుంది.

కనుక ఈ చరాచర విశ్వమంతా తన రూపమేనని అనుభవమిచ్చిన సాయిబాబా సమర్థ సద్గురువు. పైన ఇప్పటివరకూ చెప్పుకున్నటువంటి పరమార్థాన్ని చేరుకోవడానికి ఆయనను సేవించడమొక్కటే మార్గము.



అధ్యాయం-5



నిష్ఠ

ఎక్కడెక్కడ ఏమి జరిగేది ఆయనకు తెలుసు! అన్ని రూపాల్లోను ఆయనే వున్నారు. ఏదైనా చేయగలనని కొన్ని వేల, లక్షలమంది భక్తులకు నిరంతరం అనుభవాలిస్తూ వచ్చారు. ఇదీ ఆయనలో వున్న విశేషం. ఆయన ఊరికే సిద్ధాంతపరంగా ఒకటిరెండు మాటలు చెప్పలేదు. 'అన్నింటిలో భగవంతుడొక్కడే వున్నాడు. కాబట్టి ఏ జీవినీ హింస పెట్టకండి' అని మాటలుగా మాత్రమే చెప్పలేదు. అనాదిగా మహాత్ములందరూ ఈ మాటలు చెబుతూనే వున్నారు. ఎవరూ మారడం లేదు. ఎవరు నడిచే నడక వాళ్ళు నడుస్తూనే వున్నారు. అందుకని అట్లా గాదు, అనుభవపూర్వకంగా చూపిస్తేనే గాని దారికి రారనే భావంతో, పామరులకు గూడ అర్థమయ్యేటట్లు అనుభవమనే భాషతో, భక్తుల హృదయాలతో మాట్లాడారు. ఇపుడు వారి చరిత్రను మనం జాగ్రత్తగా చూసుకుంటే ఒక్క విషయం గమనించ వచ్చు. వంద సం॥ల పైబడ్డవారు , సాయిని చూసి సేవించిన వాళ్ళు యిప్పటికీ శిరిడీలో వున్నారు. వాళ్ళతో నేను మాట్లాడినపుడు "సాయినాథునిలో మీకు అత్యంత విశేషంగా కనబడేది ఏమిటి?" అని అడిగేవాణ్ణి. అప్పుడు వాళ్ళిలా చెప్పారు. "ఎందరో మహానుభావులున్నారు. వారినెంతోమంది దర్శించి వుంటారు. వారి వద్ద కొంత మందికి కొన్ని దివ్యమైన అనుభూతులు కలిగివుండవచ్చు. అందరికీ కలుగుతాయని చెప్పలేము; వారి పరిపాకం, పూర్వకర్మ విశేషం మొ॥న వాటివల్ల కలగవచ్చు. మేము 4 సం॥లుగా బాబా సాన్నిధ్యంలో పగలనకా, రాత్రనకా వున్నాము. కాని విశేషమేమంటే, ఆయన తన దగ్గరకు వచ్చినవాడు అజ్ఞానా, దుర్మార్గుడా, అనర్హుడా అనే ప్రశ్న లేకుండా అందరికీ గూడ తాను అన్ని చోట్ల, అన్ని రూపాలలోనూ వుండి, సర్వమూ ఎప్పుడూ తెలుసుకుంటాననే అనుభవం మాత్రం యిచ్చేవారు. కొంతమందిని ఆయనుండే మశీదులోకి కాలు గూడా పెట్టనిచ్చేవారు కాదు. కొంతమందిని వారు చెప్పులు విప్పుతుండగానే, 'ఒరే, లోపలికొచ్చావంటే చంపేస్తాను, పో బయటకు!'అని అరిచేవారు. అరుస్తూ తిట్టేవారు కూడా. ఆ తిట్టేటప్పుడు వాళ్ళు చేసేపనులు, వారి ఆలోచనలు

అన్నింటినీ కలిపి మరీ తిట్టేవారు. దాని వల్ల వాడు 'అరే! మనం శిరిడీ వచ్చి ఎదురుపడ్డప్పుడే గాదు, ఎక్కడున్నా మనం ఏమేమి చేశామో, ఎక్కడెక్కడ మనం ఏమేమి అనుకున్నామో, అన్నీ తెలుస్తాయి ఈయనకు' అని హృదయంలో విశ్వాసం నింపుకొని వెళ్ళేవారు. వాడు మశీదుకు వెళ్ళకపోయినా మశీదు వాడి హృదయంలో జొరబడేది. వాడు సాయి సమీపంలో లేకపోయినా సాయియే వాడి హృదయంలో జొరబడేవారు" అని చెప్పేవారు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే ఇటువంటి అనుభవాలు భక్తులకు కలిగిన తర్వాత ఏ ప్రాణిని చూచినా దీనిని కొట్టామంటే బాబాకు తగులుతుంది అని వెంటనే జ్ఞాపకం వస్తుంటుంది. బాబా చరిత్ర శ్రద్ధగా చదువుకుంటూ మనస్సును బాగా అందులో రంగరించినట్లయితే, ఇందాక చెప్పుకున్నట్లు ఋషీశ్వరులకు గూడ సాధ్యంకానిది మనకు సాధ్యమవుతుంది. ఎందుకంటే ఏ జీవిని చూచినా, ఎవరిని చూచినా, వాటిని బాధించినా, కించపరచినా, ఏమైనా చేసినా అందరిలో వున్న ఆయనకు తగులుతుందని జ్ఞాపకం వస్తుంది గనుక. అలా ఆ జీవి మనకు బాబాను జ్ఞాపకం చేస్తుంది. అటువంటి సద్గురువుయొక్క కృపకు పాత్రులం కానపుడు ఆ భగవంతుణ్ణి గుర్తుపెట్టుకోవడంకోసం ఎంత పాటుపడ్డా వెంటనే ఏదో ఒక సన్నివేశం మనలను భగవంతుణ్ణి మరిపించేలా చేస్తుంది.

ఉదాహరణకు ఒకడు నిరంతరం భగవన్నామ జపంలో వుండడం కోసం ప్రయత్నం చేస్తున్నాడనుకొందాం. అతడా విధంగా జపం చేసుకొంటూ అన్నింటిలో భగవంతుడే వున్నాడు అని అనుకుంటూ ఒక రైల్వేస్టేషన్‌లో సంచి పెట్టుకొని కూర్చొని వున్నాడు. రైలు వచ్చేలోపల వృధాగా వుండడం ఎందుకని మనస్సులో భావం నిలుపుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతలో ఒక కుక్క వీడి సంచీ వాసన చూస్తున్నది. అప్పుడతడి ధ్యాస భగ్నమవుతుంది. అసలది ఏం చేయబోతోందో తెలియదు. ఒకవేళ ఆ సంచిలో మిఠాయి వుండలే వుండివుంటే దానిని చీల్చి బయటకు లాక్కుంటుందేమో! లేకపోతే దాని మీద మూత్ర విసర్జన చేస్తుందేమో! మరెందుకు వాసన చూస్తుంది? అనే సందేహం అతడికి రాగానే అతని ధ్యాస కాసేపు ఎక్కడకు పోయిందో చూడండి! అందుకని ఆ ధ్యాస ప్రక్కకు మళ్ళడానికి విపత్తులు రానక్కరలేదు, రాక్షసులు రానక్కరలేదు, మరణము, దారిద్ర్యము రానక్కరలేదు. పెద్ద కష్టమేమి లేకుండానే సంచి దగ్గరకు కుక్క వచ్చేసరికి మనస్సు ఎక్కడకో పోతుంది! అది ఎంతో చిన్న సన్నివేశమైనా

అపుడు అనన్యచింతన ఎలా వీలవుతుంది? అంటే కుక్కను తరమకుండా వుండాలని కాదు, కుక్కను తరుముతున్నప్పుడు గూడా అందులో భగవంతుడే వున్నాడన్న గుర్తు వుంటుందా, వుండదా అన్నదే ప్రశ్న.

ఉదాహరణకు మన జేబును దొంగ కొట్టేయకుండా జాగ్రత్త పడుతూ, వాడిలో గూడ సాయి వున్నారని గుర్తు పెట్టుకోవడానికి ఏమన్నా ఆటంకమా? కొన్ని విషయాలు మనం ఆలోచించకపోతే ఆటంకమేమో అనిపిస్తుంది. వాడు దొంగ అనుకొంటూ వాడిలో సాయి వున్నారని అనుకోవడమెలా? సాయి వున్నాడని అనుకొని వూరుకొంటే దొంగతనం చేస్తాడు. దొంగ అని గుర్తు పెట్టుకుంటే సాయి అనే ధ్యానం తప్పిపోతుంది. దీని సంగతి ఎట్లా అనుకొంటాము. కాని నిజంగా ఆలోచిస్తే మన జీవితమే మనకు దానిని నేర్పిస్తున్నది.

ఉదాహరణకు మంచి ఆత్మీయులైన స్నేహితులు ఇద్దరున్నారను కొందాము. వాళ్ళిద్దరూ చదరంగమో, పాచికలో ఆడుతున్నారు. అలా ఆడు తున్నప్పుడు ఒకడి రాజు, మంత్రితో మరొకని రాజు, మంత్రిని కట్టేయాలని చూస్తాడు. అవతలివాడి పావులను చంపాలనుకొంటాడు. ఒకరికి మరొ కరు శత్రుపక్షం. ఎవడికున్న సామర్ధ్యం వారుమొత్తం ఉపయోగించి మరొకరిని ఓడించాలని చూస్తారు. అంత మాత్రంచేత వాళ్ళిద్దరిమధ్యా స్నేహం నశి స్తుందా?

అలాగే జీవితం ఒక క్రీడ వంటిది. ఎవడికుండే సామర్ధ్యంతో వాడు వ్యవహరిస్తాడు. క్రీడ ప్రతి వాడిలోనూ ఉన్నది. కాని ఆ క్రీడతో సంబంధంలేని ఆత్మాభిమానం అలానే నిలుస్తుంది. అందుకనే కృష్ణుడు తాను స్వయంగా యుద్ధమూ చేయగలడు. అవతలి వాడిని ఏ అస్త్రంతో ఛేదించాలి, ఏ విధంగా ఎదుర్కోవాలి అని సలహాలిస్తూనూ వుండగలడు. "దానిని గుర్తు పెట్టుకొని యుద్ధం చేయి" అని అర్జునునితో చెబుతున్నాడు. "శత్రుపక్షం వాడు నీవాడు గాబట్టి మమకారపడి వాడు ఎంత అన్యాయం చేసినా చంపక నీవు గాండీవం క్రింద పారేస్తే నీకు పాపమొస్తుంది. చేసినది అధర్మమైన తర్వాత నీవాడు చేస్తే ఒకటి, బయటవాడు చేస్తే ఒకటీనా? నీవాడు కాబట్టి మమకారం చేత ఊరు కుంటావా? వాళ్ళు చేసింది అధర్మం కాబట్టి, నువ్వు యుద్ధం చేసి తీరాలి. అట్లా కాదంటే మొదట యుద్ధానికి ఎందుకు దిగావు? కాబట్టి ఇక్కడ ధర్మా ధర్మాల ప్రసక్తి, నీ, నా అనే ప్రసక్తీ లేనే లేదు. ఈ విధంగా నీవు ఎప్పుడైతే అను కుంటావో

అప్పుడు నీకు రాగమూ లేదు, ద్వేషమూ లేదు. కర్తవ్యం కనుక చేస్తావు" అని చెప్పాడు. అలా 'కర్తవ్యం కాబట్టి మాత్రమే చేస్తున్నాను' అని అనుకున్నప్పుడు అందరిలో ఒకటే అని గుర్తు పెట్టుకోడానికి ఆటంకమేమీ ఉండదు. ద్వేషము, మమకారము, అసూయ, భయాదులుంటే అటువంటి భావముంటుంది. ఆ భావాలేవీ లేకుండా ధర్మనిర్మహణ ఎప్పుడైతే వుంటుందో తప్పకుండా అది నిలుస్తుంది. కాబట్టి సాయినాథుడేమి చేసారంటే- ఆయన చరిత్ర రూపంలో ఆయనను క్షణం కూడా మరచిపోవడానికి వీలులేని ఉపాయాన్నిచ్చారు. వారి చరిత్రను జాగ్రత్తగా చదవడము, వినడము, దానిని గురించి బాగా యోచించడము ఎప్పుడైతే చేస్తామో ఏ జీవిని చూసినా, ఏ వ్యక్తిని చూసినా, ఏ సన్నివేశాన్ని చూసినా బాబానే జ్ఞాపకం వస్తారు. ఇక్కడ బాబా అంటే సకల దేవతా స్వరూపము. ఆయనకన్యంగా - విఘ్నేశ్వరుడు, శివుడు, విష్ణువు, ఎవరూ వేరుగా లేరు. అన్నీ ఆయనే. అలా అనుకున్నవాడికి విష్ణువు, శివుడు, గణేశుడు వేరుగా తెలియదు. ఏది విష్ణువుగా, గణేశుడిగా, శివుడుగా తెలియబడుతుందో అదే ఆయన.

దేశంలో కొన్ని వేల విష్ణ్వాలయాలున్నాయి. వాటిల్లో ఎవరు ఆవాహన చేస్తే ఎందులోకివచ్చి తీసుకోవాలి? ఒక్కసారి ఆలోచించండి. ఒకే భగవంతునికి ఒకేసారి యిన్నిచోట్లకు వెళ్ళడం ఎలా సాధ్యం? అది ఎలా సాధ్యమో సాయి చెప్పగలరు. మన ఇంట్లో విష్ణుమూర్తి యొక్క విగ్రహం వున్నట్లయితే నైవేద్యం పెట్టకపోతే ఆయన చెప్పగలరు. అలాగే ఒకని యింట్లో వున్న విగ్రహానికి తండ్రి నైవేద్యం పెట్టడం అశ్రద్ధ చేస్తే, "ఆ దుర్మార్గుడు విష్ణువుకూ, నాకూ ఏమీ పెట్టకుండా వస్తుంచాడురా!"అని అతని కొడుకుతో అన్నారు. ఇంకొక దైవవిగ్రహాన్ని మరొకడు అశ్రద్ధ చేస్తే దాని విషయం గూడ అలానే చెప్పారు. కాబట్టి ఏ దేవతకు ఎవరు మొక్కుకున్నా సరే ఎవరికైతే చెందుతుందో, ఏ దేవతకు ఎవరు మొక్కు ఎగ్గొట్టినా ఎవరికైతే తెలుస్తుందో, ఆయనే సాయి! అందుకని 'సాయి' అనేది వారి పేరుగాదు. పేరు లేని వస్తువుకు పేరులేని వస్తువని మనం పేరు పెట్టుకున్న లాంటి పేరు అది. ఏదైతే విష్ణువో, శివుడో, గణేశుడో, మారుతో ఇంకేదైనా దేవతో - అన్ని రూపాలలో వున్న దానిని మనం 'సాయి' అంటున్నాం. కాబట్టి సాయికి చేసిన నమస్కారం సకల దేవతలకూ చెందుతుంది. దానిని (సాయిరూపాన్ని) గుర్తుపెట్టుకోవడానికి లోకంలోని రూపాలన్నీ మనకు ఉపయోగపడేలా తన రూపాన్ని సాయి యిచ్చారు. ఆయన లీలలను మననం చేసుకుంటే ఏ ప్రపంచం

అయితే మహాతపస్వులకు సైతం భగవంతుణ్ణి మరచిపోయేలా చేసిందో, ఆ ప్రపంచం మనకు ఆత్మీయుడైన గురువును నిరంతరం గుర్తు పెట్టుకునే ధ్యానంలో మనం వుండేలాగా సహాయపడుతుంది. అటువంటి సాటిలేని సాల భ్యాన్ని చరిత్ర రూపంలో ఆయన మనకిచ్చి వెళ్ళారు. అందుకని చరిత్రను స్మరించుకుంటూండాలి. అందులోని ఒక విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి.

ఆయన తనకూ, తన పటానికీ భేదం లేదని చెప్పారు. ఏ వూరిలో ఏ యింట్లో పటానికి నైవేద్యం పెట్టినా శిరిడీలో కూర్చుని చెప్పేవారు. "నేను ఫలానా చోటికి వెళ్ళాను. వాడు ఫలానా నైవేద్యం పెట్టాడు'' అని చెప్పేవారు. ఒకవేళ ఎవరైనా మరచిపోతే, "నాకు వాళ్ళేమీ పెట్టలేదు. ఆకలితో తిరిగి వచ్చాను'' అనేవారు. కాబట్టి యిక్కడ మనం పెడుతున్నది పటానికా అంటే, మన దౌర్భాగ్యం కొద్దీ మనకాభావన వుంటే వుండొచ్చుగాక, శిరిడీలో ఆ విషయం ఆయన స్పష్టంగా చెప్పేవారు. "వాడి దుంపతెగా! వాడు నాకేమీ పెట్టలేదురా'' అని బాబా అన్న సంగతి మనం గుర్తుపెట్టుకుంటే, మనం మందిరానికి వచ్చినా సరే, ఇంట్లో మన పూజా గృహంలో వున్నా సరే, సాయినాథుని సన్నిధిలో వున్నా సరే ఆయనే వున్నారు, వారి పటానికి, వారికీ భేదం లేదనే విషయం ఎంత బాగా మనం గుర్తు పెట్టుకోగలుగుతామో అంత బాగా మనం ధ్యానంలో వున్నామని అర్థం. వారి సాన్నిధ్యంలో వున్నామని అర్థం. దానినే 'నిష్ఠ' అన్నారు. అదెంత వరకూ కుదిరితే మనం అంతవరకూ భగవత్స్వరూపులుగా మారుతాము. అందుకు మనకు సులభంగా వుండడం కోసం ఆ లీలలు చేసారాయన. అటు వంటి సద్గురువైన సాయినాథునియొక్క సాన్నిధ్యం చేతనే ధర్మం సిద్ధిస్తుంది. ఈ విషయం ఇంతకు ముందు చెప్పుకున్నాము.

అయితే ఈ ధర్మంలో నిష్ఠ, ఓరిమి రెండూ కలిసి ధర్మానికి రెండు చక్రాలవంటివి. నిష్ఠ అంటే జీవితంలో మనం పెట్టుకున్న లక్ష్యంపట్ల ఈషణ్మాత్రం గూడా ప్రక్కకు తొలగకుండా వుండడం. సద్గురువు యొక్క కృప కావాలి అని మనం అనుకొని బయలుదేరితే మధ్యలో తాత్కాలికంగా ఒక కష్టం రావచ్చు. అది తీరితే బాగుండునని అనిపించకూడదు. అవసరాలురావచ్చు, అనుకోని పరిస్థితులు రావచ్చు, అందుకు మనం ప్రయత్నాలు చేసుకోవచ్చు. కానీ ఎప్పుడూ కూడ "సాయీ! నీవు నాకిది చేసి పెట్టు, దీనిని తొలగించిపెట్టు'' అని అడగ కూడదు. ఎందుకంటే నీ లక్ష్యమేమిటి? నీకు ఆయన కృప కావాలి. నీ లక్ష్యమదే

కదా! మరి సాయినాథునికి నీ శ్రేయస్సేమిటో తెలియదని అనుకుంటున్నావా లేదా? ఆయన ఏదైనా చేయగల సమర్థుడని అనుకుంటున్నావా లేదా? ఆయన సర్వ సమర్థుడని, మన శ్రేయస్సేమిటో ఆయనకు తెలుసుననీ అనుకున్నప్పుడు, ఆయనను ఏమని అడుగుతావు? అయితే తక్కిన ప్రయత్నాలు మాత్రం ఎందుకు చేయాలి? అంటారేమో! మనం సాయివంటివారము కాదు గనుక. గీత గూడ నీ ప్రయత్నం నీవు చేయమని చెప్పింది గాని నీ యత్నంమాని కూర్చోమని చెప్పలేదు. యత్నం మానవద్దని సాయి గూడ చెప్పారు. పోనీ యత్నం మాన దలుచుకుంటే ముందుగా ఉఛ్వాస నిశ్వాసాలను మానుకో. తర్వాత మరొక యత్నం సంగతి చూద్దాం. మనస్సులో కలిగే లేనిపోని ఆలోచనల యత్నం మానుకో కాసేపు. అవి ఆపగలిగితే మొత్తం ఆపినట్లే. మన శరీరంలో జరిగే కర్మను ఆపలేవు. శరీరంలోకి తీసుకోబడిన ఆహార పదార్థాన్ని మలరూపంలో విసర్జించే కర్మను ఆపలేవు. నిద్ర వస్తే ఆపలేవు. రాకపోతే రప్పించుకోనూ లేవు. అంటే నీకు అనుగుణంగా వుండేవి మాత్రమే నీవు చేసి, అనుక్షణం విజయం (Success) లభించాలనేది నీ వుద్దేశ్యమా? Guess Questions నీకు తెలియాలా? రేపు, ప్రొద్దున్న ప్రశ్నాపత్రంలో ఏం ప్రశ్నలు వస్తాయో నీకు తెలిస్తే అవే చదువుతావా? అలా కాదు, చదువుకొని వెళ్ళాలి. ఏది నీకు వస్తే అది వ్రాయాలి. అంతేగాని రేపు పరీక్ష పేపర్లో ఏది ఇస్తారో అది ఈ రోజు తెలుసుకొని అది మాత్రమే చదువు కోవడమేమిటి? రేపు నీకేమి జరగబోతోందో, ఏ ఉద్యోగం రాబోతోందో అది చెబితే దానికి దరఖాస్తు పెట్టు కుంటావా? నీవు అడిగింది, నీవు చేసింది మాత్రం బాగా జరుగుతుండాలి. తక్కినవాళ్ళు ఏమైపోయినా సరే! అలా ఏమీ కాదు. భగవంతు నికి అందరూ ఎంతో, నీవూ అంతే. నీ దారిని నీవు నడుస్తూ వెళ్ళు. నీ ప్రయత్నాలు నీవు చేస్తూ వుండు. దక్కింది దక్కుతుంది. దక్కనిది దక్కదు. నీకు లభించిన దానిని సంతోషంగా ఎలా తీసుకుంటావో, లభించనిదాని గురించి అసంతృప్తి చెందకుండా అలాగే తీసుకోవడం నీవు నేర్చుకున్ననాడు నీవు నావాడివి అన్నారు సాయి.

ఉదాహరణకు ఒక తల్లీ బిడ్డల సంబంధం తీసుకుందాం. తల్లికి ఒక రోజు తీరిక దొరుకుతుంది. ఆమె హృదయంలో వుండే భావం వ్యక్తం చేసుకునే సమయం వచ్చింది. 'నాన్నా, రారా, కూర్చోరా' అని సంతోషంగా కబుర్లు చెప్పి వాడిని ఆదరంగా చూసింది. ఇంకొకరోజు పని ఒత్తిడిలో వుండి 'పో వెధవా! అలా గొడవ

చేస్తావేం?' అని విసుక్కుంటుంది. అంతమాత్రాన నువ్వు నాతల్లివి గాదని అంటాడా? ఆదరిస్తేనే నా తల్లి అనేటట్లయితే కాఫీ త్రాగితే రూ. 25/-లు బిల్లు చెల్లించాల్సిన హోటల్లో చాలాబాగా ఆదరిస్తారు. కానీ అక్కడ ఎంత సేపు కూర్చోగలుగుతాము? నగరాల్లో చాలా పెద్ద పెద్ద హోటల్స్ వుంటాయి. వాటిల్లో ఒక గ్లాసు నిమ్మరసం యిచ్చి ఎక్కువ ఖరీదుకే బిల్లు యిస్తాడు. అంతేగాక తెచ్చిచ్చిన వాడికి మళ్ళీ టిప్ యివ్వాలి. అది యిచ్చిన తర్వాత వాడు సలామ్ కొడతాడు. దానికర్థమేమంటే 'నీకు తలకాయ లేదురా!' అని. జేబులో చిల్లరలేదని తెలిసిందంటే వాడు మెడ పట్టుకొని ఎలా గెంటుతాడో తెలుస్తుంది. ఆ ఆదరణ అట్లాంటిది మరి. పోరా వెధవా అన్నప్పుడూ తల్లే, 'మా నాయన, బంగారు కొండా'! అన్నప్పుడూ తల్లే. అలాగే మనమనుకున్నవి నెరవేరినప్పుడూ ఆయన మనకు గురువే, తండ్రే. నెరవేరనినాడూ ఆయన మనకు తండ్రే. ఈ రెండింటిలోనూ ఆయన ప్రేమను మనమెప్పుడైతే తీసుకున్నామో ఆయన ప్రేమకు మనమర్హులమవుతాము. మనమనుకున్నది జరగడంలో ఆయన ప్రేమ మన పట్ల వున్నట్లుగానీ, జరగకపోతే మనపట్ల అయన ప్రేమ లేకపోవడంగానీ వుండదు. ప్రేమకు, దీనికి ఎట్టి సంబంధమూ లేదని ఎవడైతే తెలుసుకున్నాడో వాడు ఆయన ప్రేమకు అర్హుడు.

ఉదాహరణకు ఒక కుటుంబం యొక్క ఆర్థిక పరిస్థితి ఏమీ బాగా లేదు. అందువలన కుటుంబమంతా పస్తుండవలసి వచ్చింది. అప్పుడు ఆ యింటి యజమాని కొడుకొకడు మమ్మల్ని పోషించలేని నీవు ఏమి తండ్రివి? నీవసలు తండ్రివేగాదు పొమ్మన్నాడనుకోండి. అప్పుడు వాడు కొడుకు అనిపించు కుంటాడా? "అరె! నాన్నకెంత యిబ్బంది వచ్చిందో కదా! మన మంతా ఆకలితో అలమటిస్తూంటే ఆయన మనస్సుకు ఎంతటి బాధ, ఒత్తిడి కలుగుతోందో కదా! అందుకని మనం బాధపడకూడదు, మన బాధను బయటకు వ్యక్తం చేయకూడదు, మనం బాధపడితే ఆయన మరీనలిగి పోతాడ"ని జాగ్రత్తగా ఎవడైతే వుంటాడో ఆ పరిస్థితిని అధిగమించడానికి మనమూ సహాయపడదాం, అని ఏ కొడుకైతే ప్రయత్నిస్తాడో, వాడే కొడుకు. అందుకని కష్టసుఖాలకు-ప్రేమకు ఎట్టి సంబంధమూ లేదు. ప్రేమదేబిరించదు, ప్రేమ అడగదు. ఎందుకని? బాబాకు నీపై ప్రేమ వుందని నీకెప్పుడైతే తెలుసో, నీకేది అవసరమో అది తప్పక వస్తుందని తెలుస్తుంది. ఒక వేళ రాకపోతే అది నీకు హితవు కాదు కనుక రాలేదనిపిస్తుంది. అందుకని

అసంతృప్తి వెలితి అనేదే వుండదు. అయితే మనకవసరమైనది ఆయనే చేస్తాడులే అని ప్రయత్నం మాత్రం మానకూడదు. ఒకవేళ ప్రయత్నం మానాలనుకుంటే, ఎప్పుడు మానాలంటే నీవు సర్వజ్ఞుడైనపుడు మానాలి. ఇంకొంచెం సేపటికి నీకు త్రేణుపు వస్తుందో లేదో నీకు తెలిస్తే, కాసేపటికి నీవు కాఫీ త్రాగుతావో లేదో నీకు తెలిస్తే, లేకపోతే నీ గుండె ఎప్పుడు ఆగిపోతుందో తెలిస్తే అప్పుడు ప్రయత్నం మానాలి. అంతవరకూ పామరుడెలా ప్రయత్నం చేస్తాడో అలాగే ప్రయత్నం చేయాలి. "లాభాలాభౌ జయాజయౌ" అని భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్లు లాభాలాభాల యందు, జయాపజయాలందు, మానావమానాలయందు సముడవై ప్రయత్నం చేయాలి. కర్తవ్యం నెరవేర్చాలి. ఇప్పుడు ఒకదాని కోసం ప్రయత్నం చేయాలి అనుకుందాం. నీకు పది అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పుడు నీవు పది అవకాశాలలో నీవు ఎంత యత్నంచేయగలవో అంత యత్నమూ చేయాలి. నిజమైన కర్మయోగి ఎలా చేస్తాడంటే - ఆపని జరగకపోతే ప్రాణత్యాగానికైనా సిద్ధపడేవాడు ఎలా చేస్తాడో అలా చేస్తాడట. కాని ఆ పని జరగకపోతే ఏమీ చింతపడడు. ఆ పని జరగకపోతే చనిపోవాలి అని అనుకొని వానిలాగానే వుంటాడట. కాని ప్రయత్నంలో మటుకు ఏ మాత్రం లోపం రానివ్వడు.

ఉదాహరణకు - క్రీడలనే తీసుకుందాం. పరుగుపందెంలో పరుగెత్తే వాడు మిగతా వాళ్ళెవరూ పరిగెత్తలేనంత వేగంగా పరిగెత్తడానికి ప్రయత్నం చేస్తాడు. కారణం పతకం సాధించడం కోసం మాత్రమే అలా పరుగెత్తుతాడు. కాని ఎవరైనా చంపుతారని గాని, ప్రాణంమీది కొచ్చిగానీ కాదు. కాని ప్రాణం మీదికొచ్చిన వాడెట్లా పరుగెత్తుతాడో, అంతకంటే ఎక్కువగానే పరుగెత్తు తాడు. అలాగే ఒక ఆట ఆడుతున్నామనుకోండి. ఆ ఆటయందు మనకు ఆసక్తి వుంది కాబట్టి మన సామర్థ్యాన్నంతటినీ పెట్టి ఆడుతాం. ఎందుకని? మన ప్రాణాలు పోతాయనా? కాదు. సామర్థ్యం అంతా పెట్టి ఆడటంలో ఒక మజా వుంది, రంజు వుంది. ఆట యొక్క ప్రాణమదే. ఆసక్తి లేకపోతే ఎట్లా అంటే అట్లా ఆడుతాం. అవతలి వాడు బాధపడవచ్చు కూడా. ఆసక్తే వుంటే మన సామర్థ్యాన్నంతటినీ పెట్టి ఆడుతాం. ఆడటంలో ఆ విధమైనటువంటి గొప్పదనం వుంది. అంతేగాక జయాపజయాలను సమంగా తీసుకొనే సామ ర్థ్యాన్ని పెంచుకోవడానికి ఉపయోగంగా మాత్రమే ఆడుతాం. అదే ఆటలోని

గొప్పతనం.

అలాగే చదరంగం ఆడుతున్నాము. గెలిస్తే రాజ్యాలు వస్తాయని గాదు, ఓడితే మనలను జైలులో పెడతారనీ గాదు. ఆటలో మన శక్తినంతటినీ పెట్టి ఆడుతాము. అలా ఆడగా ఆడగా నానాటికీ బుద్ధిశక్తి, ఆటలో కౌశల్యము పెరుగుతుంది. గెలిస్తే గెలిచాము, ఓడితే ఓడాము అన్న భావన కలిగి దేనినైనా సమంగా తీసుకోగలుగుతాము.

అలాగే కర్మయోగంలో బాగా నిర్దుష్టత రావడం కోసం కర్మ యందు నిమగ్నులు కావాలి. జయానికి, అపజయానికి అవకాశాలుండేటటువంటి కర్మను అందరిలాగానే చేయాలి. ఎలా చేయాలంటే ఇది లేకపోతే వీడు బ్రతక లేడేమో! దీని మీద వీడికి ఎంతటి ఆశ! ఇంత కాపీనమా వీడికి? అన్నట్లు చేయాలి. నీ కర్తవ్యం నిర్వర్తిస్తుంటే చూచేవాడికి వీడికి డబ్బు కాపీనం పట్టిం దిరా లేకపోతే ఈ పనికి వీడు ఎందుకు బయలుదేరుతాడు? అన్నట్లు చేయాలి. ఆటల్లో దిగితే వీడికి కీర్తి కాపీనం పట్టింది లేకపోతే వీడికి ఆటలతో ఏమి పని? అన్నట్లుగా వుండాలి. విద్య గడించి విజ్ఞానాన్ని పెంచుకోవడంలో క్రొస్తే వీడికేరకమైన జాడ్యం పట్టిందని అవతలి వాళ్ళకనిపించాలి. పూజా పునస్కారాలకొస్తే వీడికి పిచ్చి పట్టిందిరా అని అనిపించాలి. ఏదైనా సరే, ఇది లేకపోతే వీడికి ప్రాణం లేదన్నట్లు చేయగలిగిన వాడేయోగి అవుతాడు. వాడి కిష్టమైనది చేసి, ఇష్టం లేనిది మానేవాళ్ళు లోకంనిండా చాలామంది వున్నారు. కనుక ఏ ఆశయంతో బయలుదేరితే ఆ ఆశయం కోసం నిర్దుష్టంగా ప్రయ త్నించాలి. అందుకే నిష్ఠ, సబూరీ అవసరమన్నారు సాయి.

నిష్ఠ అంటే తాను మొదట ఏ ఆశయంతో బయలుదేరాడో, అంటే గురువు యొక్క కృప పొందాలని, పరమార్థం పొందాలని, మోక్షాన్ని పొందాలని బయలుదేరాడో ఆ లక్ష్యానికి భిన్నమైన మరొక కోరిక వైపుకు మనస్సు పోనీయ గూడదు. అదే కోరిక మీద నిలవాలి. మనం ఏ లక్ష్యం కోసమయితే ఈ ఆధ్యాత్మికత లోనికి దిగుతున్నామో, ఏ లక్ష్యంకోసమే ప్రయత్నిస్తూ చివరి దాకా వెళ్ళగలమో, ఏ లక్ష్యంకోసం ప్రక్క ప్రక్క కోరికలు కోరమో అదే నిష్ఠ అంటే. అయితే నిష్ఠ అంటే అంత మాత్రమే కాదు. ఎట్లాగంటే నడకలాగానే. నడవడ మంటే అంతకు ముందు అడుగువేసిన నేలమీద అడుగువేయక పోవడమన్న మాట. అంతేకాదు. ఇంతకు ముందు వేసేసిన దానిని వదిలి వేస్తుండడం గూడ.

అదే రీతిన 'నిష్ఠ' అంటే మననుకున్న దాని మీద మనస్సు నిలపడం మాత్రమే కాదు. తద్భిన్నమైన దాని మీదకు మనస్సు చలించకుండా వుండడం కూడా. మొదటి దానికంటే రెండవ క్రియ ఎక్కువ ముఖ్యం. ఎందుకంటే కష్ట సుఖాలు, రాగ ద్వేషాలు, మానావమానాలు మొదలైనవన్నీ మనలను లక్ష్యాన్నుంచి మరిపిస్తూ వుంటాయి. అవరోధాలవుతూ వుంటాయి. మరిపించడమే గాక తర్వాత బలపడతాయి గూడ. ఎందుకంటే బలపడడం వేరు, మరిపించడం వేరు, మరువకుండడం వేరు.

ఉదాహరణకు మనకు అప్పులుండడం వేరు, అప్పులు లేకపోయినా మిగులుగూడా లేకపోవడం వేరు, మిగులు వుండడం వేరు. ముందు అప్పులు లేకుండా వుంటేచాలు. మన లక్ష్యాన్ని మరిపించేటటువంటి వికల్పాలు లేకుండా పోవడమే మొదటిది. అందుకని రాగద్వేషాలను ముందుగా జయించమని గీతలో చెప్పారు. శీతోష్ణాలను జయించమని చెప్పాడు. ముందు వికల్పాలను ఆపుకోవాలి. మన లక్ష్యాన్ని మందంగానైనా సరే పొడుగునా మన మనస్సులో వుంచుకోగలిగితే చాలు, తర్వాత తీవ్రతరం చేసుకోవచ్చు. అందుకని ఆ లక్ష్యానికి అవరోధాలుగా వుండే రాగద్వేషాదులను సమంగా చూడడం నేర్చుకోవాలి. తర్వాత తత్త్వచింతన సంగతి గురించి, బ్రహ్మజ్ఞానం సంగతి, ప్రాణాయామము, జపతపాదుల సంగతి చూసుకోవచ్చు. అందుకని ముందు రాగ ద్వేషాలయందు సమంగా వుండడం అలవరుచుకుంటే, రజోగుణ తమో గుణాలు నిగ్రహించుకోగలిగితే, దైవీ సంపద, సత్వగుణం అలవడితే అప్పుడు నీవు చేసేటటువంటి నయాపైసా యెత్తు సాధనా ప్రయత్నమైనా ఫలిస్తుంది.

ఉదాహరణకు సిమెంటు తొట్టిలో గ్లాసెడు నీళ్ళు పోసినా నిలుస్తాయి. అందుకని ముందు గ్లాసెడు నీళ్లైనా పోయడానికి ప్రయత్నించాలి. తొట్టి నింపడం సంగతి తర్వాత చూసుకోవచ్చు. తొట్టి నిండా రంధ్రాలు పెట్టుకొని ఎన్ని బిందెలు నీళ్ళు పోస్తే మాత్రం ఏం లాభం? అందుకని తొట్టికి రంధ్రాలు లేకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. అపుడు కొద్ది కొద్దిగా నీళ్ళు పోసినా నిండుతుంది. కాబట్టి ముందు వికల్పాల సంగతి చూసుకోమన్నారు. నిష్ఠ నుంచి తొలగించే వాటి పట్ల జాగ్రత్త పడమన్నారు. సాయిచేసిన బోధఅంతా యిదే. అంటే అందరిలో, అన్నింటిలో ఆయనే వున్నాడు అన్న భావన మీద 'నిష్ఠ' నిలువు కుంటూ తద్భిన్నమైన సంకల్పాలను హృదయంలోకి ఎన్నడూ రానీయకుండా

చూసుకోమన్నారు. మన సంకల్పం సరిగా వున్నప్పటికీ అంటే మనమెవ్వరికీ హాని చెయ్యాలని తలచనప్పటికీ ఒక్కొక్కప్పుడు మనవలన కొన్ని పొరపాట్లు అనుకోకుండా జరగవచ్చు. అప్పుడు మనకేమీ దోషం రాదు.

ఉదాహరణకు మనం ఒకచోట కూర్చొని వుండి గబుక్కున లేస్తున్నామనుకోండి. అడుగు ప్రక్కకుతూలి అనుకోకుండా ప్రక్కనున్న వాడి చేతిమీద మన కాలు పడింది. అది మనం కావాలని చేసింది కాదు గదా! అందుకని పాపం రాదు! అలాగాక అవతలివాడి మనస్సు నొచ్చుకోవాలని మనం ఒక పని చేసామనుకోండి. మన అదృష్టం బాగుండి వాడు నొచ్చుకోకపోవచ్చు. కాని మన సంకల్పం మంచిది కాదు గనుక దాని ఫలితమే మనకు దక్కుతుంది. ఉదాహరణకు ఒకడున్నాడు. వాడికి మరొకరిపైన ద్వేషంవుంది. కాని అతనిని కొట్టేందుకుగాని, తిట్టేందుకు గాని వీడికి ధైర్యం లేదు. కాని ఎప్పుడైనా అవకాశం వస్తే వాడికి విషం పెట్టి చంపుదామని ఆలోచిస్తున్నాడు. అందుకని విషం తెచ్చి తన దగ్గర పెట్టుకున్నాడు. కారణం యితను తేలు కుట్టినవాళ్ళకు మందు యిస్తుంటాడు. అందుకని తేలు కుట్టినవాళ్ళు ఇతని దగ్గరకు వచ్చి మందు తీసుకుంటారు. అలాగే ఒకసారి వీడి శత్రువుకు తేలు కుట్టింది. అర్ధ రాత్రి వాడిని వీడి దగ్గరకు తీసుకువచ్చారు. దొరికింది అవకాశం అనుకొని తేలు మందుకు బదులు తన దగ్గరున్న విషంతీసి అతనికి మందుగా యిచ్చాడు. వాడు తప్పక చస్తాడనీ, పీడ విరగడైపోయిందనీ అనుకున్నాడు. కాని ఆశ్చర్యంగా అతడు శుభ్రంగా లేచి కూర్చున్నాడు. ఎందుకలా జరిగిందని విచారిస్తే అది మామూలు వాళ్ళకు విషమే గాని, ఆ జాతి తేలు కుట్టిన వాళ్ళకి మాత్రం అది అమృతంగా పనిచేస్తుందని తెలిసింది. తేళ్ళన్నీ ఒకే రకంగా వుండవు. వాటిల్లో అనేక జాతులుంటాయి. కొన్ని జాతుల తేళ్ళు కుడితే బ్రతికే ప్రశ్నే లేదు. అందుకని తేలు కుట్టినవాడి లక్షణాలనుబట్టి మందివ్వాలి. అలాగే వాడిని చంపడానికని విషమిచ్చి నప్పటికీ వాడు బ్రతికాడు. కానీ వీడికి మాత్రం వాడిని బ్రతికించిన పుణ్యం మాత్రం రాదు. చంపడానికి ప్రయత్నం చేసినటువంటి వీడి సంకల్పాన్ననుసరించి ఆ పాపమే వీడికి వస్తుంది. వాడి పూర్వపుణ్యంవల్ల వాడు రక్షింపబడ్డాడు. అలాగే ఇంకొకడి దగ్గర కూడా తేలు మందున్నది. వాడు తనకెప్పుడైనా అవసరమొస్తుం దేమోనని దగ్గర వుంచుకున్నాడు. తేలుకుట్టిన వాడొకడు వస్తే తనకోస ముంచుకున్న దానిని గూడ వాడు ఆపదలో వున్నాడు గదా. మనకవ

సరము వచ్చినప్పుడు చూసుకోవచ్చులే అని వాడికి వేసాడు. కాని వాడికి అది వికటించి మరణించాడు. వాడికి పాపం ఆ మందు ఆ తేలుకుట్టిన వాడికి వేయ కూడదని తెలియదు. వాడిని బ్రతికించాలనే ఉద్దేశ్యంతోనే యిచ్చాడు. అప్పుడు వాడికి పాపం వస్తుందా? రానే రాదు. కారణం వాడు తనశాయశక్తులా అవతలి వాడు బ్రతకాలనే తపనతో తన కోసం అట్టిపెట్టుకున్న మందును వాడికిచ్చాడు. కనుక వాడిని బ్రతికించాలని అనుకున్నందుకు పుణ్యమే వస్తుంది.

అలాగే మనం చేసిన పనివల్ల అవతలి వాడి మనస్సుకు బాధ కలగక పోవచ్చుగాక! మన ఉద్దేశ్యంలో వాడు బాధపడాలనే సంకల్పం గనుక వుంటే, మనం బాధపెట్టడాని కోసం చేసిన ప్రయత్నం యొక్క ఫలితం మాత్రమే దక్కుతుంది. దానికి తోడు అట్లా సంకల్పించే గుణం మనస్సుకు సంస్కారమై మరింత బలంగా పట్టుకుంటుంది. ఏ పనైనాసరే ఒకసారి చేసినట్లు రెండవ సారి చేస్తే అభ్యాసమెక్కువ. మళ్ళీ మళ్ళీ చేస్తే అంతకంతకూ అభ్యాసం బల పడుతుంది.

ఉదాహరణకు చిన్నప్పుడు చదువుకునే పిల్లవాడు 8×8 = 64 అన బోయి 56 అన్నాడనుకోండి. మనం యాధాలాపంగా వూరుకుంటే ఆ తర్వాత వాడదే చెప్తుంటాడు. మనం ఎన్నిసార్లు సరిగా చెప్పడానికి ప్రయత్నించినా సరే వాడికి 56 అనే వస్తుంటుంది. అట్లా అలవాటు అవుతుంది. అలాగే దుష్ట సంకల్పం, వక్ర సంకల్పం అలవాటైతే తర్వాత ఎన్నిసార్లు వంకర తీద్దామన్నా ఆ గుణం తొలగిపోదు. అందుకని విష్ణ నుంచి ప్రక్కకు తొలగించే వాటిని నిగ్రహించుకోవడం ముందు అవసరం. కాబట్టి మనకు తెలిసి సంకల్ప పూర్వకంగా ఎవరికీ ఎప్పుడూ చెడు తలపెట్టకుండా వుండడం అలవరచు కోవాలి. మరి అవతలి వాడినుండి మనకు బాధ కలిగినవుడు ఏం చేయాలి? అంటే అప్పుడు బాబా చెప్పిన 'ఋణానుబంధాన్ని గుర్తుపెట్టుకో' అన్న సూక్తిని గుర్తు తెచ్చుకోవాలి. అవతలి వాడివల్ల నీకు చెడు, బాధ కలిగిందంటే మీ యిద్దరికీ వున్న ఋణానుబంధం చేత పరిస్థితి ఆ విధంగా వచ్చి ఆ సన్నివేశం జరిగింది. ఈ విషయాన్ని మనం ఎంతవరకూ గుర్తు పెట్టుకోగలుగుతామో అంతవరకూ ప్రపంచమనే మాయాబజారులోంచి బయటపడతాము. అంత వరకూ బయటపడే ప్రశ్నే లేదు. అందుకని ఋణానుబంధాన్ని గుర్తుపెట్టుకో అన్నారాయన. ఆయన ఒకసారి చెప్పారు. ఆయన ముందు గిర్నార్‌లో

వున్నారట. అక్కడ ప్రజలందరూ ఆయనను హింస పెట్టేవారట! అందుకని అక్కడి నుంచి పారిపోయి నరసోబావాడీ వచ్చారట. అక్కడా ఆయనను హింస పెట్టారట. అక్కడినుండి మాణిక్యనగర్ వచ్చారట. అక్కడ కూడా అదే పరిస్థితి. అందుకని అక్కడ నుంచి అక్కల్కోట వచ్చారట. ఆ తర్వాత శిరిడీ వచ్చారట. ఇవి సాయి స్వయంగా చెప్పిన మాటలు.

మరి వాళ్ళు అంతగా ఆయనను హింస పెడితే ఆయన అంత శక్తిమంతుడై వుండి గూడా వాళ్ళను భస్మం చేయలేదెందుకని? వాళ్ళను ఏమీ చేయలేదెందుకని? దానికి ఆయనే చెప్పారు: "ఎవడైనా నిన్ను హింసిస్తే అక్కడి నుంచి తొలగిపో!". ఇది ఆయన చెప్పిన సూక్తులలో ఒకటి. "అవతలి వాడు చెప్పింది దుర్భరంగా వుంటే నీకు చేతనైతే ఒక్క మాటలో చెప్పు. లేకపోతే భగవంతుణ్ణి స్మరించి ప్రక్కకు తొలుగు. కాని 'వీడు నాకు శత్రువు' అనే భావానికి గురి కాబోకు" అని, "ఋణానుబంధాన్ని గుర్తు పెట్టుకో" అనీ అన్నారు. ఎక్కడికక్కడ ప్రతీదానికీ సరిపోయేటట్లు ఆయన సూక్తులు వున్నాయి. జీవితంలో మనకు ఎన్ని సంఘటనలు జరగడానికి అవకాశం వున్నదో, అన్నింటికీ కావలసిన మందులపెట్టె మొత్తం ఆయన సూక్తుల్లో వున్నది. కాకపోతే (combination) మార్చుకోవాలి అంతే! అందుకని ఎవడైతే అసూయ, ద్వేషము వహించకుండా వున్నాడో వాడు చరితార్థుడవుతాడు. ముందు జన్మలలో వాడికి ముక్తి లభ్యమవుతుంది. ఎందుకంటే వాడు 'నిష్ఠ' తొలగిపోకుండా చూసుకున్నాడు గనుక. ఉదాహరణకు ఒకనిచేత అష్టావధానం చేయిస్తున్నారనుకోండి. వాణ్ణి మరిపించడం కోసం ఒకడు అప్రస్తుత ప్రసంగం చేస్తాడు. ఇంకొకడు వాడికే తగిలివచ్చేలా పద్యం చెప్పమని కొస్త చుట్టెక్కేటట్లు అడుగుతాడు. కాని అవధానం చేసేవాడికి అప్పుడు కోపం వస్తే ఏమవుతుంది? అవధానం చేయలేకపోతాడు. అందుకని అవతలివాడు ఎంత రొష్టు పెట్టినా సరే ఓర్పు వహించి తన పనిని మాత్రం గుర్తుపెట్టుకునే వుంటాడు. లేకపోతే అవధానం పోతుంది. అలాగే ఈ ప్రకృతి అంతా గూడ లక్ష్యాన్ని వీడు ఎలా మరిచిపోతాడా? ఏం చేస్తాడా? అని ఎప్పుడూ చూస్తూనే వుంటుంది. కాని మన అవధానాన్ని మాత్రం మనం వదిలి పెట్టగూడదు. "జీవితంలో ఏదైనా వస్తే వస్తుంది. పోతే పోతుంది. వస్తేరానీ, పోతే పోనీ. మన లక్ష్యం పోతే ఎట్లా? ఇలాంటివి ఎన్ని వచ్చాయో, ఎన్ని పోయాయో

అనుకొని నిష్ఠలో, మనం పెట్టుకున్న లక్ష్యంపట్ల మన అభిప్రాయాన్ని బలపరచు కొంటూపోవాలి. ఇది ఒకటి. దానికి విఘ్నకారణాలైన వికారాలను ఈ భావంతో తొలగించుకొంటూ పోవడం రెండవది. ఈ రెండూ కలిసి 'నిష్ఠ' అనబడే దాంట్లో ఒక అంశం మాత్రమే. ఒక బండికిగల ఒక చక్రం గురించి ఇప్పటివరకూ కొద్దిగా మాత్రమే చెప్పుకొన్నాం. ఇక రెండవది ఓరిమి. ఈ నిష్ఠను కాపాడడానికి ఓరిమి అవసరం.



అధ్యాయం-6

సబూరి



ఉదాహరణకు ఒకడు మనకు కోపం తెప్పించాడనుకోండి. వెంటనే మనకు కూడా కోపం తెప్పించే సన్నివేశమే అది. ఓర్చుకోవడం కష్టమే కావచ్చు, కాని అటువంటి సమయాలలో ఎంతగా ఓర్పు వుంటే అంతగా మనం ఆలోచించుకోవడానికి కాస్త ప్రజ్ఞ మిగులుతుంది. అలాగాక ఓరిమి వహించలేదనుకోండి. వెంటనే వాడిపై కోపగించుకుంటాము. వాడిపట్ల ద్వేషం పెంచుకుంటాము. అప్పుడు వాడింకా కోపం తెచ్చుకుని పదిరెట్లుగా అరుస్తాడు. మనమింకా కోపం తెచ్చుకుని పదిరెట్లుగా అరుస్తాము. అప్పుడు వాడికింకా కోపం వస్తుంది. చివరకు మనం తెలుసుకునేసరికి Situation అంతా అయిపోతుంది. మనకు ఓర్పు తక్కువగాబట్టి అవతలి వాడు అనీఅనక ముందే మనకు పదింతలుగా కోపం వచ్చేసింది. అందుకని పదింతలుగా అనేసాము. మనం అన్నాము గాబట్టి వాడికీ కోపం వచ్చి వాడూ పదింతలుగా అంటాడు. అప్పుడు మనకింకా కోపం వచ్చి లక్షరెట్లు వాణ్ణి అంటాము. ఇక ఇందులోంచి బయటపడేది చాలా కష్టం.

అలాగాక మనకు ఓరిమి ఎప్పుడైతే వున్నదో అప్పుడు 'వాడట్లా అన్నా సరే మనం ఓర్పు వహించాలి, మన మనస్సును లక్ష్యం వైపునుంచి చలించనివ్వకూడదు' అని ఆలోచిస్తాము. మన లక్ష్యాన్ని గుర్తుపెట్టుకోడానికి ప్రయత్నిస్తాము. గుర్తుపెట్టుకోడానికి కావలసిన పట్టుదలను పెంచుకోడానికి ప్రయత్నిస్తాము. చికాకు పెట్టినా మనస్సు చలించకుండా వుండడానికి పట్టుదల అవసరం. ఉదాహరణకు ఒక దొంగ వున్నాడు. వాడు ఒకడి పక్కన చేరి, 'అదిగో అక్కడ చూడు, ఎలా కొట్టుకు ఛస్తున్నారో'! అన్నాడు. వాడు అటు చూసేసరికి వీడి జేబు కొట్టేసి వుంటుంది. అలాగాక, 'ఆహా, అట్లాగా! చూస్తాను లెండి' అని జేబులో చెయ్యిపెట్టుకుని చూసాడనుకోండి. అప్పుడు దొంగ, జేబు కొట్టేయలేడు. అవధానం చేసేవాడు సన్నివేశాన్ని గురించి అప్పటికప్పుడే ఆలోచిస్తాడు-అలవాటు కొద్దీ. అలాగే ఓరిమి వున్నవాడికి నిష్ఠ కుదురుతుంది. ఓరిమి వున్నప్పుడు, "ఈ సన్నివేశమేమిటి, ఇది ఋణానుబంధం వల్లనే జరిగింది గదా!

మరి ఆగ్రహం నాలో రాబోతున్నదే! రానిస్తే ఎట్లా"? అని ఆలోచిస్తాడు. ఒకవేళ వచ్చినా, "ఎంత తెలివి తక్కువగా ఆగ్రహం తెచ్చుకున్నాను. ఆగ్రహాన్ని లోపల నిలవనివ్వకూడదు" అని ఆలోచించుకుంటాడు. ఇలా ప్రయత్నము చేస్తే చెయ్యవచ్చు. లేకపోతే వాడితో పోటీపడితే పడవచ్చు. యుద్ధం గూడ చేయవచ్చు. కానీ వాడిపై ద్వేషం మాత్రం వహించగూడదు. అసలు ముఖ్య సూత్రమిది. లోపల ద్వేషం గాని, చాంచల్యం గాని రానివ్వగూడదు. అలా వుండాలంటే ఓరిమి అవసరం. ఈ విధమైన ఓరిమి ఎంతగా వుంటే అంతగా నిష్ఠ కుదురుతుంది. కాని నిష్ఠ ఎంతగా కుదిరితే ఓరిమి అంతగా కుదురుతుంది. అందుకని బాబా ఏమన్నారంటే 'ఓరిమి-నిష్ఠ', సోదరీ సోదరుల వంటివని, ఒకదాని నొకటి పెంపొందించుకుంటాయనీ చెప్పారు. అందుకని ఓరిమి సహాయంతో నిష్ఠ, నిష్ఠ సహాయంతో ఓరిమి పెరుగుతూ పోతాయి. ఒకే బండికి ఎడమ ప్రక్కనున్న చక్రం సహాయంతో కుడి ప్రక్క నున్న చక్రం బండిని లాగుతుందా? కుడిప్రక్కనున్న చక్రం సహాయంతో ఎడమప్రకనున్న చక్రం బండిని లాగుతుందా? అలాగాదు. రెండూ కలిసి బండిని లాగుతాయి. ఒకదానికొకటి సహకరించుకొని ముందుకు నడవడానికి వెనుకకాలు ముఖ్యమా? ముందు కాలు ముఖ్యమా? అంటే ఏం చెప్పినా తప్పే అవుతుంది. ఒకటి యిప్పుడు ముందు కాలు ఆయితే మరొకటి కాసేపటికి ముందు కాలు అవుతుంది. అందుకని అవే చెబుతాయి-రెండూ ముఖ్యమేనని. ఒక రూపాయి బిళ్ళకు బొమ్మ ముఖ్యమా? బొరుసు ముఖ్యమా? అలాగే నిష్ఠ సబూరీలనేవి రెండు ప్రక్కల కలిగినటువంటి ఒకే దక్షిణ. అటువంటి 'దక్షిణ'ను బాబా మననుంచి కోరుతున్నారు. ఆటువంటి దక్షిణను మననుంచి పొందడానికి ఆయన మనకు ఆలంబనం యిచ్చారు. **ఆదేమిటంటే అందరిలో ఆయనను చూచుకునే ఆలంబనం.**

అందుకని మనం చెప్పుకునేదేమిటంటే సద్గురువు యొక్క సాంగత్యము, సాన్నిధ్యము, అనుగ్రహమూ లేకుండా ధర్మం యొక్క స్వరూపం తెలియడానికి గాని, అచరణలోకి రావడానికి గాని అవకాశమే లేదు. ఏ రీతిన అంటే, ఉదాహరణకు - ఒకడు నేలమీద నిలబడి వంట చేస్తున్నాడు. పెద్ద బాణలిలో సలసలా నూనె మరిగిపోతున్నది. వీడు అటు తిరిగి ఏదో పని చేసుకుంటూండేసరికి ఆ నూనె బాండీ ఒక్కసారి దొర్లి గదంతా చిమ్మింది. సలసలాకాగే నూనె! ఒక్క క్షణంలో చూసుకున్నాడు. నూనె కాళ్ళ దగ్గరకు వస్తున్నది. అప్పుడు వాడేం

చేస్తాడు? అన్ని వైపుల నుంచీ మూనె కమ్ముకుని వస్తున్నది. నిలబడితే మూనె వస్తున్నది. కనుక నిలబడలేడు. పోనీ అని ఎగిరితే తిరిగి ఆ మూనెలోనే పడతాడు. అలాగని నిలబడితే కాళ్ళే పోతాయి. పోనీ అని ఎగిరితే కాలు జారితే క్రిందపడి ఒళ్ళంతా కాలిపోతుంది. కాబట్టి ఎగరడం మార్గం కాదు. కాని నిలబడి వుండ గలడా? నిలబడి వుండలేడు. కాబట్టి ఏం చేయాలి? తనకంటే పైన ఏదైనా అలంబనం చిక్కితే దానిని పట్టుకుని కాళ్ళను పైకి లేపుకోవాలి. ఇంతకంటే ఏమైనా మార్గం వున్నదా? మన కాళ్ళను పట్టుకుని మనం పైకి లేపుకోగలమా? వీలుగాదు. అది ఎలాగైతే వీలుగాదో, రాగద్వేషాల యొక్క భూమ్యాకర్షణ మనలను క్రిందికి గుంజుతుంటే మన యత్నంతో మాత్రమే మనం పైకి లేపుకోవాలి. ఎలా అంటే ఇంకొకదాన్ని అలంబనం చేసుకుని పైకి లేపుకోవాలి. పైన దూలాన్ని పట్టుకుందీ మన చేతులే. దాని అలంబనంతో కాళ్ళు పైకి తీసుకుంటు న్నదీ మనమే. కాని దూలం లేకపోతే ఆ పని నెరవేరదు.

అలాగే గీతలో "ఉద్ధరేత్ ఆత్మనాత్మానాం" అన్నాడు శ్రీకృష్ణుడు. జటిలమైనటు వంటి, మహత్తరమైనటువంటి, వజ్రాయుధంవంటి ప్రశ్న యిది. దీనికి వివరణ తెలియకపోతే సమాధానం తెలియడం కష్టమే. కాని దీని వివరణ తెలిసాక "అవును, ఈ వివరణ కరెక్టుగా వుంది" అనిపిస్తుంది. "ఉద్ధరేత్ ఆత్మనాత్మానాం" 'ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి' అని ఒక బాణం విసిరాడు శ్రీకృష్ణుడు. మళ్ళీ "మోక్షయిష్యామి మా శుచః" 'నీకేమీ దిగులు లేదు, నేను మోక్షం ప్రసాదిస్తాను' అని రెండవ బాణం విసిరాడు. ఇంతకూ ఆయన చెప్పేది మొదటిదా? లేక రెండవదా? ఆయన ముందే మోక్షమిస్తా నంటే నేను యిక అనన్య చింతన చేయడం ఎందుకు? అలాగాక అనన్య చింతన చేస్తేనే మోక్షం యిస్తా నంటున్నాడు. నేను ఆత్మ సమర్పణ చేసుకుంటేనే నాకు మోక్షం యిస్తానంటు న్నాడు; ఆత్మ సమర్పణ చేసుకుంటే ఆయన యిచ్చేదేమిటి? అసలప్పుడు నాదంటూ ఒకటి వుంటే గదా! అప్పుడు నేనే ఆయన వాడినవుతాను గదా! కాబట్టి కర్తవ్యం నాదేనన్నమాట. అంటే మోక్షమిచ్చేది ఆయన గాదు, నేను ఆత్మ సమర్పణ చేసుకునే క్రియే నాకు మోక్షమిస్తుందన్నమాట. అనన్యచింతన చేస్తే ఆయన యిస్తానన్నాడు. అనన్యచింతన చేసి సంపాదించుకున్నది నేనే గదా! అంటే నాకిచ్చింది ఆయన గాదు. కాబట్టి ఆయన యిచ్చేదయితే యివ్వాలి. అలాగాక నేను తెచ్చుకునేదయితే చెప్పాలి. నేను అనన్యచింతనే చేసుకుంటానో, లేక

శరణాగతే చెందుతానో, ఆత్మ సమర్పణే చేసుకుంటానో నా తిప్పలు నేను పడతాను. ముందు ఆయన యిస్తాడో లేదో తేల్చి చెప్పాలి. కాబట్టి మనం సంపాదించుకోవడమా? లేక ఆయన యివ్వడమా? ఈ రెండింటికీ సమన్వయం ఎట్లా? అంటే అందుకే సాయినాథుడు మనం చరమ శ్లోకాలనుకునేవి చరమ శ్లోకాలు కావని చెప్పారు. ఆ మాట ఆయన తన నోటితో చెప్పకుండా ఆ శ్లోకాలను ఆచరణలో పెట్టడం ఎలాగో చెప్పారు. "అనన్యాశ్చింతయంతో మాం" ఈ శ్లోకం కరెక్టే కాని "అనన్య చింతన చేయడం ఎట్లా?" అన్నది ప్రశ్న. "నీవు అనన్యంగా భగవంతుని శరణువేడు, నిన్ను రక్షిస్తాడు" అంటున్నారు. ఇది ఎలా వుందంటే ఉదాహరణకు ఒకడు ఈతరాక నీళ్ళలో మునిగిపోతున్నాడు. ఒడ్డున వున్నవాణ్ణి 'ఒరేయ్! నన్ను రక్షించరా' అని అరుస్తున్నాడు. అప్పుడు ఒడ్డున వున్నవాడు, "ఒరేయ్ ఈత కొట్టరా, బ్రతుకుతావు" అన్నాడట. ఈత వస్తే వాడట్లా అరవడం ఎందుకు? వీడు సమాధానం చెప్పడమెందుకు? ఈత వస్తే సమస్యే లేదు. రాకపోతే చెప్పి ప్రయోజనం లేదు. అలాగే అనన్యచింతన కుదిరితే వాళ్ళు చెప్ప నక్కరలేదు. కుదరకపోతే చెప్పి ప్రయోజనం లేదు. అందుకని మళ్ళీ కర్తవ్యం మనదే అయింది. ఇక ఆయన రక్షించేందుకేముంది? అందుకని ఆయన "మోక్షయిష్యామి మా శుచః" అన్నా తప్పే అవుతుంది. "అనన్యాశ్చింతయంతో మాం" అన్నా తప్పే అవుతుంది. అందుకని మనం దానిని ఎలా సాధించాలో మనకు సాయిలాంటి మహనీయులు చెబుతారు. అయితే సాయివంటి మహనీయులు చెప్పేదానికీ, లోకంలో భగవద్గీత చదువుకున్న వాళ్ళు చెప్పేదానికీ హస్తిమశకాంతర తేడా వుంటుంది.

ఉదాహరణకు ఎవడో విదేశీయుడొకడు కొత్తగా ఒంగోలు వచ్చాడనుకుందాం. అతడు ఒంగోలు పట్టణం అంతా చూద్దామనుకున్నాడు. టూరిజం వాళ్ళ దగ్గరో, మునిసిపాలిటీ వాళ్ళ దగ్గరో ఒంగోలు మ్యాప్ చూసాడు. మ్యాప్ లో ఒంగోలు చూసిన అతడు ఒంగోలు గూర్చి చెప్పేదానికి, నిజంగా ఒంగోలు చూసినవాడు చెప్పేదానికి ఎంత తేడా వుంటుందో, పండితులు (భగవద్గీత చదివినవారు) చెప్పినదానికీ, సాయిబాబా వంటి మహనీయులు చెప్పినదానికీ అంతటి తేడా వుంటుంది. కాబట్టి ఆ రెండింటికీ సమన్వయం ఎట్లా? అంటే 'ఇట్లా' అని మనకు అనుభవాన్నిచ్చి చూపించేది సద్గురువు యొక్క బోధ. ఎట్లా? అని అడిగితే, గంటసేపు నోటితో ఉపన్యాసం యిచ్చేది పండితుని బోధ. కాబట్టి

అనన్యచింతన ఎలా చేయాలి? అంటే చరిత్ర పారాయణ శ్రద్ధగా చేసుకుని, దానిని మననం చేసుకుంటే అనన్యచింతన అదే జరుగుతుంది. అయితే యిప్పుడు అనన్యచింతన ఎవరు చేసినట్లు? నీవు ప్రయత్నంతో సాధించుకున్నదే కదా! అంటే చరిత్ర పారాయణ చేసింది నువ్వే. అనన్య చింతన చేసిందీ నువ్వే. కాబట్టి నువ్వే సంపాదించుకున్నావు.

కాని మరొక విధంగా ఆలోచిస్తే ఆయనకు అటువంటి చరిత్రే గనుక లేకపోతే నీవు ఏం చదువుతావు? ఏమి మననం చేస్తావు? కాబట్టి అనన్యచింత ఆయన యిచ్చేదా? నీవు పొందేదా? అని అడిగితే దీనికి సమాధానం ఏమి టంటే ఈ నీవు-నేను అనే భేదం ఎక్కడైతే కలుస్తుందో, అంటే ఆయన దగ్గర నుంచీ అభయహస్తము, మన దగ్గర నుంచి ఆశ్రయించుకున్న మన హస్తమూ - ఈ రెండు హస్తాలూ ఒక దగ్గర కలిసి ఎప్పుడైతే పట్టుకున్నాయో అప్పుడు తెలుస్తుంది. అప్పుడు ఏ చేతిని ఏ చేయి పట్టుకున్నట్లు? ఈ పట్టు వుండడానికి ఏ చేయి కారణం? అంటే రెండు చేతులూ కారణమే. అదే రీతిన సద్గురువు యొక్క సాన్నిధ్యం ఆ శ్లోకాలన్నింటిలోని చరమావస్థను అనుభవంలోకి తీసు కొస్తుంది. సద్గురువు యొక్క బోధ అంటే అట్టిది. అందుకని 'ఉద్ధరేదాత్మ నాత్మానాం' అన్నదానికీ, "అనన్యాశ్చింతయంతో మాం..." అన్న దానికీ "మోక్ష యిష్యామి మా శుచః" అన్నదానికీ వైరుధ్యమే లేదు. ఆయనను త్రికరణ శుద్ధిగా, యథాశక్తితో ఆశ్రయించుకోవడం అనేది నిన్ను నీవు ఉద్ధరించుకోవడానికి నీవు చేయగలిగిన క్రియ. ఆపైన నీలో జరిగే పరివర్తన "మోక్షయిష్యామి మా శుచః" అన్నమాట. "శిరిడీలో సాయినాథుడు వున్నాడు. ఆయన చరిత్ర గొప్పగా వుంది. దానిని చదువుకుని మననం చేసుకుంటే బాగుంటుంది" అన్నప్పుడు ఆ పుస్తకం తెచ్చుకుని, చదువుకుని మననం చేసుకోవడానికి ప్రయత్నించడము, ఆ పైన అవకాశం దొరికితే ఆయన నామం చేసుకోవడానికి ప్రయత్నం చేయడము, తర్వాత శిరిడీ దర్శించాలని ప్రయత్నం చేయడము, ధ్యానం చేసుకోడానికి ప్రయత్నం చేయడమూ- ఇదంతా "ఉద్ధరేదాత్మనాత్మానం" అన్నదానికి వర్తిస్తుంది. అందరిలో ఆయనే వున్నాడనే భావాన్ని గుర్తుపెట్టుకుని, మనలో రాగద్వేషాదులను జయించు కోవడానికి కావలసిన నిగ్రహం తెచ్చుకోవడానికి చేసే ప్రయత్నమంతా "ఉద్ధరేదాత్మ నాత్మానాం"లోకి వస్తుంది. కాని ఇదంతా గూడ ఆయన చరిత్రలో అట్టి లీలలుండబట్టే గదా సాధ్యమవుతుంది. లేకపోతే

సాధ్యంకాదు గదా! అందుకని "మోక్షయిష్యామి మా శుచః" అన్నారు. కాబట్టి "ఈ రెండింటికీ సమన్వయం వుంది" అని ఆయన చెప్పారు. ఆ సమన్వయాన్ని సద్గురువు యొక్క చరిత్ర చూపిస్తుంది. ఈ రెండూ ధర్మం అనేటటువంటి బండికి గల రెండు చక్రాలకూ సమానంగా వుండే ఒక ఇరుసు వంటిది. ధర్మమనేది కమ్మి. ఆ కమ్మికు ఒక ప్రక్క సబూరీ, మరొక ప్రక్క నిష్ఠ రెండూ కలిసిన నిష్ఠ అనేటటువంటి బండి మోక్షం దగ్గరకు నడచి వెళుతుంది. అందుకని సర్వ ధర్మాలూ అందులో చెప్పబడే వున్నాయి.

అందుకని చివరకు అంటే ఆయన ఆశీర్వదించబోయే ముందు గురుదక్షిణగా అడిగిందేమిటంటే -"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"అని. అలా అన్నప్పుడు దేనిని పరిత్యజించమన్నారో అది సర్వసమర్పణ లోకి వస్తుంది. ఆ శ్లోకానికి వ్యక్తరూపం ఆ మాట. అంటే ఆ శ్లోకమనే భాండాగారానికి తాళం తీయడానికి కావలసిన తాళం చెవి అదొక్కటే. అలా గాక 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అన్న శ్లోకానికి అర్థం తెలియడానికి ఎంత చెప్పినా ఆ శ్లోకం యిరకాటంలో పెడుతుంది. ఒక ప్రక్క నుంచి చెబితే మరొక ప్రక్క నుంచి ప్రక్కకు పడుతుంది. మనస్సు, శ్వాస, జిహ్వ, వాక్కు, శరీరం-అన్నీ వాటి వాటి ధర్మాలను వుడిగి ఏ ధ్యేయాకృతియందు లగ్నమవుతాయో అదీ ఆ శ్లోకానికి అర్థం. సాయికి తన గురువు ఎదుట కూర్చుంటే ఆయనకు ఏమి జరిగిందో ఆ శ్లోకానికి అర్థం అదన్న మాట! గురువు ఎదుట కూర్చుంటే ఆయనకు ఆకలి దప్పికలు గుర్తులేవు. అమ్మ, నాన్నలు గుర్తులేరు. లోకమే గుర్తులేదు. మనస్సు క్షణకాలం గూడా ఆయన ఎడబాటును భరించలేదు. "నా ప్రాణమంతా నా కళ్ళల్లో కేంద్రీకృతమై, నా దృష్టి వారి ముఖం మీద కేంద్రీకృతమై అట్లా వుండిపోయింది" అని చెప్పా రాయన. అప్పుడు ఆయన వున్న స్థితే ఆ శ్లోకానికి అర్థం. అప్పుడు ఈ లౌకిక ధర్మం ఆగిపోతుంది. మనస్సు నిశ్చలమైనపుడు శ్వాస సమర్పణ జరుగుతుంది. అప్పుడు శరీరం నిష్ఠయందు లగ్నమవుతుంది. కాబట్టి మూడూ ఏకమవుతాయి. అప్పుడు అన్నీ వాటి వాటి ధర్మాలలో అంటే లోకంలో మనకు కనిపించే ధర్మాలలో వుడిగి వుంటాయి. అదీ "సర్వధర్మాన్ పరిత్యజ్య" అన్నదానికి అర్థం. అలాగాకపోతే మామూలుగా వుండే లౌకిక ధర్మాలను విడిచిపెట్టినట్లయితే వీడికి మోక్షం లభించదు. ఉత్తమగతులూ లభించవు. అదీగాక ఆయనను శరణు పొందడం అనేదే ఒక ధర్మం. ఆ ధర్మాన్ని పరిత్యజించడము ఎట్లా? అందుకని యింకే

విధంగా చెప్పినాగాని అన్వయానికి దోషం తగులుకోకుండా అన్వయం చెప్పడానికి వీలుగాదు. అందుకని నిష్ఠ, సబూరీలనే దక్షిణ అడగడం రూపంలో ఆ శ్లోకానికి స్రక్రమమైన వివరణ యివ్వడానికి వుండేటటువంటి ఏకైక మార్గాన్ని చెప్పాడాయన. చేతనైతే సమన్వయం చేసుకోమన్నాడు. మాస్టర్ కీ యిచ్చాను, తాళం తీసుకోమన్నాడు. ప్రపంచమనే ఖజానాలో నుంచి కావలసినది తీసుకోమన్నాడు. కాబట్టి ధర్మాచరణకు, సద్గురువు యొక్క అనుగ్రహానికి అంతటి విడదీయరాని సంబంధం వుంది. నాటితో ఆధ్యాత్మిక జీవితం నిజంగా ఆరంభమవుతుంది. ఆనాటి నుంచి అనుష్ఠించడానికి ప్రయత్నం ఆరంభమవుతుంది. అంతకు ముందు అందుకు కావలసిన అవగాహన వుండదు. నిష్ఠ, సబూరీలకు అవసరమైన అనుభూతి మనకు రాకపోవడం వలన మనస్సుకు చాంచల్యం ఏర్పడుతుంది. అందుకని ఏది ఎందుకు చేస్తున్నామో, ఎటు పోతున్నామో తెలియదు. ఎట్లా దారికి వస్తుంది అనే సంగతి గూడ తెలియదు. అందుకని భగవద్గీతలో కూడా చరమ శ్లోకాలన్నీ చెప్పి, "మోక్షయిష్యామి మా శుచః" అని అంతటి అభయమూ యిచ్చాడు. అయినప్పటికీ "మోక్షయిష్యామి" అని చెప్పిన శ్లోకానికంటే గూడా "తద్విద్ధి ప్రణిపాతేన" అనే శ్లోకానికి మాత్రమే అన్నింటికంటే ప్రాధాన్యతను యిచ్చారు. అందుకని ఆ శ్లోకాన్ని మాత్రమే చెప్పి వదలి పెట్టేసాడు. కారణం అంత మహత్తరమైన భగవద్గీతోపదేశమూ "తద్విద్ధిప్రణిపాతేన" అన్న శ్లోకంలో చెప్పబడింది గాబట్టి దానిని అర్జునుడు కృష్ణుని పట్ల అచరించబట్టి అది లభ్యమైంది. అసలు భగవద్గీత పుట్టుకే అది. ఆ శ్లోకంలో చెప్పిన పని చేయడం వల్లనే గీత పుట్టింది గాబట్టి ఆ శ్లోకంలోనే గీత యావత్తూ ఇమిడివుంది-మఱ్ఱి విత్తనంలో మఱ్ఱి చెట్టంతా దాగి వున్నట్లు. అందుకనే ఇంకే శ్లోకంలోనూ లేని రీతిన ఆ ఒక్క శ్లోకంలోనే భగవద్గీత యావత్తూ ఇమిడి వున్నది" అనేది తెలుపడానికే వారాశ్లోకాన్ని మాత్రమే తీసుకుని, నానా చందోర్కర్‌కు వివరించి చెప్పారు. కానీ ఆ చెప్పడంలో ఎంతటి వ్యంగ్యం వున్నదంటే ఆచార్యత్రయ భాష్యంవున్న గీతను కాచి వడపోసి చదివిన నానాసాహెబ్ చందోర్కర్‌కు ఆ శ్లోకంలో చెప్పిన దానిని ఏం చేయాలో ఎలా చేయాలో చెప్పినట్లున్నది.

ఒకరోజు నానా బాబా సన్నిధిలో కూర్చుని ఆ శ్లోకం వల్లించుకుంటున్నాడు. ఆ శ్లోకం ఎందుకు చదువుకుంటున్నాడంటే బాబా సన్నిధిలో తన మనస్సులో చెడు సంకల్పాలు కలిగితే నలుగురిలో పరువుపోయేటట్లు సాయి

తిడతారు, కొడతారు గూడ. అదీ సాయి యొక్క గుణం. నలుగురిలో పరువు పోతే తాను తలెత్తుకుని తిరగలేడు కనుక ఎట్టి వికల్పాలూ మనస్సుకు కలుగకుండా వుండగలందులకు ఆ శ్లోకాలను చదువుకుంటున్నాడు. "నానా, ఎంత తెలివితక్కువగా ఆలోచిస్తున్నావు! నీకు భగవత్సాక్షాత్కారము, గుర్వనుగ్రహమూ కలిగి, నీకు ఆత్మ ప్రాప్తి కలగాలని చెప్పినటువంటి శ్లోకాన్ని తీసుకొచ్చి నలుగురిలో పరువుపోయేటట్లు తిట్టకుండా వుండడానికి వాడుకుంటున్నావా? నలుగురిలో పరువు, తిట్లు, స్తుతులుఅనేవి ఎటువంటి దౌర్భాగ్యపు స్థితులో తెలిపి, వాటిని విడిచి పెట్టాలని మొదటి అధ్యాయంలో చెప్పివున్నది గదా! నిందాస్తుతులకు సమంగా వుండాలి, ఉచ్చనీచాలు, మానావమానాలపట్ల సమంగా వుండాలి అన్నదానిని చదివి గూడా ఈ శ్లోకాన్ని ఈ విధంగా వాడుకుంటున్నావా! వంద రూపాయల కాగితాన్ని స్టౌవ్ వెలిగించుకోడానికి వుపయోగించుకుంటున్నావా? ఏ ఇంద్రుడో, పరమేశ్వరుడో సాక్షాత్కరిస్తే బీడీ వెలిగించుకోడానికి అగ్గిపెట్టె అడుగుతున్నావా? నీవు చదువుకునే శ్లోకం జాగ్రత్తగా చదివితే వికల్పాలు పోయి, మనోనాశనమై జ్ఞానం కలుగుతుంది. అందుకని అంతటి గొప్ప శ్లోకాన్ని ఇందుకు వుపయోగించుకుంటావేమిటి"? అన్నారు సాయి. గీతయొక్క జనవాన్ని తెలిపిన శ్లోకమేదైతే వుందో, గీత యొక్క తత్వాన్ని మొత్తాన్ని మజ్జిగచెట్టు మజ్జి విత్తనంలో పొందు పరచుకున్నట్లు ఏ శ్లోకంలో వున్నదో, ఏ ఒక్క శ్లోకం తెలిస్తే, ప్రపంచంలో ఆధ్యాత్మికత గూర్చి ఇక తెలుసుకోవలసిన అవసరం ఉండదో, ఆ శ్లోకాన్ని సరిగా అర్థం చేసుకోమని ఆయన చెప్పారు. "శాస్త్రషట్కం అక్కర్లేదు, సాధన చతుష్టయం అవసరం లేదు. నీ గురువును నిశ్చలంగా నమ్ముకో. ఆయనే సకల దేవతలు" అని ఆయన చెప్పినవి నాలుగు సూక్తులు వున్నాయి. "గురువే సకల దేవతా స్వరూపి. నీ గురువును సంపూర్ణంగా నమ్ముకో, శాస్త్ర షట్కము, సాధన చతుష్టయము అక్కర్లేదు" అని చెప్పారాయన. అంటే సాధన చతుష్టయం అదే వస్తుంది, నీవు తెచ్చుకోవడం కాదు అన్నారు.

ఉదాహరణకు చిన్న పిల్లలు పెద్ద పెద్ద వేషాలు వేయాలంటే గడ్డాలు, మీసాలు తగిలించుకోవాలి. అలా అక్కర్లేకుండానే సహజంగానే వస్తే ఎలా వుంటుందో, అలా సద్గురువు యొక్క సాన్నిధ్యంచేత - శరీరం నుంచి చెమట సహజంగా ఎలా పుడుతుందో - అలా సాధన చతుష్టయం కలుగుతుంది. ఆ

సాన్నిధ్య ప్రభావంచేత అందరిలో ఆయనే వున్నారన్న గుర్తు మనస్సుకు వచ్చిన కొద్దీ వాడిలో వివేకం, వైరాగ్యం కలుగుతుంది. ద్వంద్వాతీత స్థితి కలుగుతుంది. అందుకని ధర్మాచరణకు దగ్గరవుతాడు. కాబట్టి నీ ఆరోగ్యానికి మంచిది కాబట్టి కాస్త చెమట పట్టించుకోమని ఇతరులు చెప్పటం ఒక తీరూ, అలా గాక నీకు చెమట పోసేలాగ గదిలో తలుపులుమూసి పెట్టడం ఒక ఎత్తు. సద్గురువు యొక్క ఆశ్రయం ఎలాంటిదంటే నీకు చెమట పోయడం ఆరోగ్యానికి మంచిదై నపుడు గాలి తగలకుండా తలుపులన్నీ మూసివేసి నిన్ను అందులో కూర్చో బెట్టడంలాంటిది. అప్పుడు చెమట పట్టేస్తుంది. అంతే! అది చేతగాని వాడికి ప్రాణాలు కడబట్టేదాకా గుంజీళ్ళు తీస్తేగాని, చలికాలంలో చెమట పట్టదు. అందుకని వారి సాన్నిధ్యంలో సాధన చతుష్టయం దానికదే కలుగుతుంది అని చెప్పారు. నీవు చేసే యోచన, నీవు మాట్లాడే మాట, నీవు చేసేచేత అంతటి సమన్వయం కలిగివుంటుంది అని చెప్పారు. అందుకని "సద్గురువును ఆశ్ర యించుకో, చాలు" అని చెప్పారు. ఈ ఒక్క సూత్రాన్ని - ఆధ్యాత్మిక ధర్మానికి మొత్తానికి మూలమైనటువంటి ఈ ఒక్కదాన్ని గీతలోని ఆ ఒక్క సూక్తి చెబుతుంది. గీత పుట్టుకే అది. ఆ ఒక్క శ్లోకంలో ఆధ్యాత్మికత యావత్తూ ఇమిడి వున్నది. అటువంటి శ్లోకాన్ని వ్యాఖ్యానాలన్నింటిలో గూడ చదువుకుని, అంతటి మహాత్ముని దగ్గర కూర్చొని చదువుకునేటప్పుడు గూడ నానా బుద్ధి వుండవలసినది అలాగేనా? ఎంతోమంది మహాత్ముల దర్శనం చేసుకుంటూ, మహాత్ముని సన్నిధిలో వుంటూ, గీతను వ్యాఖ్యానంతో చదువుతూ వుండే ఆ నానాకే ఆ క్షణంలో తనలో కలుగుతున్న మనోభావాలకు దానిని అన్వయించు కోవడం తెలియలేదంటే ఇక మనం ఎంత జాగ్రత్త పడవలసి వుంటుందో ఆలో చించవలసిందే. నానా తక్కువైన వాడేమీ కాదు. భాష్యత్రయంలో భగవద్గీత బాగా చదువుకున్నవాడు. ఇంకొకళ్ళకు చెప్పగలిగినవాడు. పోనీ, మహాత్ములను చూడని వాడా అంటే అనేక మంది మహాత్ములను చూసాడు. సాయినాథుని చూసాడు. సాయి వద్దకొచ్చిన తర్వాత గూడ ఆయన ఆశీస్సులతో అనేకమంది మహాత్ములను చూసాడు. అతడు బన్నూమాయి అనే మహాత్మురాలిని చూడడం గురించి మనం 'సాయి లీలామృతము' లో చదివాము. అంతేగాక అతడు మరికొంతమంది మహాత్ములను గూడ దర్శించాడు. అంటే అతనికి మహాత్ముల దర్శనమూ వున్నది, శాస్త్ర పఠనమూ వున్నది. అయినా గూడ నోట్లో మెదులుతూ

వున్న ఆ శ్లోకానికి - మూడు వ్యాఖ్యానాలూ తెలిసి గూడా - అప్పటి తన మనో భావన అందుకు సరియైనది కాదన్న విషయం అతనికి తట్టలేదంటే మరి ఇక మనం సాయినాథుని పట్టు కుని ఏ నాటికైనా పైకి పోగలమా? ఆ శ్లోకంలో చెప్పిన దానివల్ల అంటే బాబా చెప్పినట్లు, నిష్ఠ-సబూరీలనే దాంట్లో ఆధ్యాత్మికత యావత్తూ వచ్చింది. అందుకని ధర్మానికి గాని, ధర్మబద్ధమైన అర్థకామాలకు గాని, మోక్షానికి గాని, సకల మానవ జీవితమూ చరితార్థమై సఫలం కావడానికి గాని సద్గురువును సేవించడమొక్కటే మార్గం. సద్గురువును ఆశ్రయించడం వల్ల ధర్మం సిద్ధిస్తుంది. కామమూ సిద్ధిస్తుంది, మోక్షమూ సిద్ధిస్తుంది - అంటే నాలుగు పురుషార్థాలూ సిద్ధిస్తాయి. అవి సిద్ధించడానికి మూలధర్మం మాత్రం ఒక్కటే - అదే సద్గురు సమాశ్రయం. అందులో రెండు చక్రాలున్నాయి. అవే నిష్ఠ సబూరీలు. నిష్ఠ సబూరీలు సాధించడం ఎలా? అంటే అందరిలో, అన్ని రూపాలలో ఆయనే వున్నారని చరిత్రను మననం చేసుకుని మనస్సులో ముద్రింపజేసుకోవడం వల్ల అనుక్షణం మనకు అందరిలో ఆయనే వున్నారని తెలిసి, తద్భిన్నమైన సంకల్పం మనస్సులో ఎప్పుడూ గూడ కలుగకుండా జాగ్రత్త పడడమే!

ఇప్పటికి-అంటే యిప్పటి వరకూ, మనం చెప్పుకున్న దాంట్లో-ధర్మంలో ఒక భాగానికొచ్చాము. అంటే ధర్మం యొక్క తత్త్వంలో-సిద్ధించేటటువంటి పద్ధతి గురించి మాట్లాడుకున్నాము-ఇది ఒక భాగం. దీనికి రెండవ భాగం ఒకటున్నది! దానికిగూడ సాయి తమ ఆచరణద్వారానే చెప్పారు. ఆయన వద్దకు దాసగణు మహరాజ్ వచ్చారు. ఆయనను హరికథ చెప్పడాని కోసం శిరిడీ తీసుకొచ్చారు. ఆ తర్వాత బాబా ఒకసారి ఆయనతో, "నువ్వు పోలీసు ఉద్యోగం మానేసి హాయిగా నాందేడులో వుండు'' అని చెప్పారు. హరి కథా గానం చేసుకుంటూ వుండమన్నారు. "అయితే తిండి ఎవరు పెడ్తారు?'' అన్నాడతను. "నేనే పెడతాను'' అన్నారు బాబా. దాసగణు ఎక్కడ హరికథ చెప్పినా సరే, మొట్టమొదటగా సద్గురుస్తుతి క్రింద సాయిలీలలు పాడి, తర్వాతనే ఏ కథైనా చెప్పేవాడు. సాయిలీలామృతము చదువుతుంటే మనకు తెలుస్తుంది - అనేక మంది సాయి గురించి వూరికే సాయి పేరు మాత్రమే విని, ఎక్కడో ఒకచోట దాసగణు యొక్క కీర్తనలో సాయి మహిమలు విని సాయి వద్దకు వెళ్ళామని చెప్తారు. కాని దాసగణు చెప్పేవి వేరే కథలే. పాండురంగ విజయము, భాగ

వతము, రామాయణము మొ॥నవి చెబుతూండేవాడు. ఏ హరికథ చెప్పినా ముందుగా గురుస్తుతి, గణపతి స్తుతి చేస్తారు గదా! గురుస్తుతి క్రింద అతడు ముందుగా సాయి లీలలను కొన్నింటిని గానం చేసి తర్వాత హరికథను ప్రారంభించేవాడు. అంటే శిష్టమైన పద్ధతిలో చేసేవాడన్న మాట. అయితే అతడు చెప్పేవి వేరే కథలైనా అవి సద్గురువును మరిపించేవి కావు. అసలు సద్గురువు అనుగ్రహంతో మాత్రమే వాటిలో ఏమి చెప్పబడి వుందో బాగా అర్థమవుతుంది.

ఆవతలి వాళ్ళు హృదయంలో పక్వం చేసుకున్న పదార్థాన్ని మనము, మన హృదయంలో పక్వం చేసుకున్న పదార్థాన్ని వాళ్ళు-అంటే గ్రహించుకున్న విషయాలను పరస్పరం చెప్పుకుంటూ, సంతోషపెట్టుకుంటూ, మనస్సు నెప్పుడూ సద్భావనలయందు, సద్గోష్ఠులయందు లగ్నమవడానికి ప్రయత్నం చేసుకోవాలి. అప్పుడు నానాటికీ మనలో సత్వగుణం వృద్ధి పొందుతుంది. అలాగాక అది ఎప్పుడైతే మరుగునపడి యింకొక విషయం వచ్చిందో, నానాటికీ అసురీ స్వభావము, రజస్తమోగుణాలూ మనలో పెల్లుబుకడం మొదలుపెడతాయి. సద్గురు సాన్నిధ్యాన్ని వినియోగించుకునే మార్గాలలో సత్సంగమొకటి.

మనం సత్సంగం పెట్టుకోవడంలో గూడ ముఖ్యోద్దేశ్యమిదే. మనం సాయినాథుని యొక్క చరిత్ర చదువుకుంటున్నాము, పారాయణ చేసుకుంటు న్నాము. వారి సూక్తుల గురించి మననం చేసుకుని, చింతన చేసుకుని, మన ఆచరణను నిర్దుష్టం చేసుకుందామని ప్రయత్నం చేస్తున్నాము. కాని సత్సంగం ద్వారా యిటువంటి సంతోషాన్నీ, యిటువంటి అవగాహననూ ప్రక్కవారితో గూడ పంచుకుంటూండడం ద్వారా వ్యర్థమైన ఆలోచన, వ్యర్థమైన మాట మనస్సులోకి రాకుండా చేసుకోగలుగుతాము. మొదట ఇది కేవలం డిఫెన్స్ మెకానిజం క్రింద మాత్రమే నా జీవితంలో ఆరంభమైంది. నేను మొట్ట మొదట్లో విద్యానగర్‌లో కాలేజీలో పనిచేసేటప్పుడు ఎవరైనా వచ్చి కూర్చుంటే వాళ్ళు వాళ్ళ యిష్టమొచ్చిన లోకాభిరామాయణం మొదలు పెడతారేమోనన్న భయంతో, వాళ్ళు లోకాభిరామాయణం మాట్లాడకుండా వుండేందుకు డిఫెన్స్ క్రింద 'ఒన్‌వే ట్రాఫిక్'గా మాట్లాడేవాళ్ళి. ఎవరైనా వచ్చి కూర్చున్న తర్వాత మొహమాటం క్రింద "ఏమిటండీ విశేషాలు" అన్నామనుకోండి. ఇక ఆ టాపిక్ అయిపోయేదాకా వాళ్ళే దారికి తేలేము. అందుకని ఎవరైనా వచ్చి కూర్చోగానే, "వీడు ఈ పటాలన్నీ పెట్టుకున్నాడేమిటీ? చాదస్తం! అనుకుంటారేమో!" అంటూ నేనే టాపిక్ కల్పించు

కునేవాళ్ళి. "ఎవరో మనవాడు కొత్తగా కాలేజీలో చేరాడు కదా, ఒకసారి చూసి వద్దాం' అని ఎవరైనా నా గదికి వచ్చాడనుకోండి. వచ్చి కూర్చున్న తరువాత నా భయం ఒక్కటే - మన కాలేజీలో ఫలానా వాళ్ళు అట్లా, ఇంకొకడు ఇట్లా అని మొదలు పెడతాడేమోనని. అందుకని వాడు వచ్చి కూర్చోగానే ఏం చేసేవాణ్ణంటే - "ఏమండి, ఇక్కడ ఇన్ని పటాలున్నాయేమిటి? ఈ సాయిబాబా ఫోటోలు ఏమిటి? వీడికి వెఱ్ఱి ఏమిటి? అని మీరనుకుంటారేమో. అసలు ఈ పటాలను నేనెందుకు పెట్టానంటే అంటూ 1963లో నేను శిరిడీ వెళ్ళినప్పటినుంచీ మొదలు పెట్టేవాణ్ణి. ఇక 'ఒన్ వే ట్రాఫిక్' అన్నమాట. అవతలి వాడికి మాట్లాడే ఛాన్సే లేదు. నేను సాయిని ఎందుకు కొలుస్తానో, అసలు సాయిని ఎందుకు సేవించాలో, అలా సేవించక పోతే మనిషి ఏమవుతాడో - ఇవే మాటలు మాట్లాడేవాణ్ణి. సరే, అప్పుడు వాడు ఒకసారి చూస్తాడు, రెండుసార్లు చూస్తాడు, మూడుసార్లు చూస్తాడు. "వీడు విసుగుబోతువాడురా, వీడి దగ్గరకు పోతే బోరు, వీడి దగ్గరకు వస్తే పోకూడదు" అనుకుంటాడు. అలా అనుకున్నాడంటే వాడు నానెత్తి మీద పాలు పోశాడన్న మాటే. వాడికి నా మీద సద్భావం కలగడం కంటే అట్లాంటి భావం కలగడమే మంచిది. అంటే వాడి ఉద్దేశ్యమేమంటే - నీ బ్రెయిను న్యూసెన్సు చేస్తాను. లేకపోతే తిడతాను అంటాడన్న మాట. న్యూసెన్స్ చేయడం కంటే తిట్టడం మంచిది. అలాగాక అదృష్టం బాగుందనుకోండి "ఇతని దగ్గర బాగుంది. కాసేపు ఇక్కడ కూర్చుంటే మంచి మాటలు మాట్లాడుకోవచ్చు" అనుకున్నా డంటే, మన దగ్గరకు వచ్చేస్తాడు. అంతే! ఇక - ఈ ప్రపంచంలోపల వేరే ప్రపంచం ఒకటి మనకు ఏర్పడిపోతుంది. ఈ విధంగా చేయడంవల్ల నాకు సత్సంగం యొక్క సౌలభ్యమేమిటో అనుభవంలోకి రావడం మొదలు పెట్టింది. "ఓహో! ఇందుకోసం కాబోలు మనవాళ్ళు సత్సంగం చేయమని చెప్పింది" అనిపించింది. ఇది 'స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం' అనే దానికి సరిపోతుంది. ఎందుకంటే సాయి యొక్క ఆచరణలోను, సూక్తులలోనూ, బోధలలోనూ - అన్నింటిలోకూడా వాటియొక్క సారాంశమే వ్యాఖ్యానంగా యివ్వబడుతోంది. కాబట్టి వాటిని మనం మననం చేయాలి. అధ్యయనం చేయాలి. ప్రవచనం చేయాలి. 'బోధయంతం పరస్పరం' అన్నట్లు మనం మాట్లాడుకోవలసిందే. 'తుష్యంతి చ రమంతి చ' అన్నట్లు ఆయన మహిమలను గూర్చి, ఆయన అనుగ్రహంగూర్చి చెప్పుకుని మనం సంతోషాన్ని పంచుకో వలసిందే. అలా చేయడంవల్ల మన మనస్సు చెడుఆలోచనలు చేయకుండా

సత్వగుణాన్ని పెంపొందింప చేసుకుంటుంది. అందుకోసమే ఈ సత్సంగాన్ని మన పెద్దలు ఏర్పాటు చేసారు అని అర్థమైంది. అందుకని ఈ స్వాధ్యాయ ప్రవచనాలు అనివార్యంగా తీసుకోవలసిన అంశాలు గనుక సాయి చరిత్ర పారాయణ చేసుకోవడంతో పాటు సోదర బృందమంతా కలసి సత్సంగాలు చేసుకోవడం ప్రారంభించాము. దీని వలన ఫలితం మనమెంత వరకూ చేస్తే అంతవరకూ దక్కుతుంది. అందుకని మనం ఆయన చరిత్రను బాగా మననం చేసుకోవాలి. లీలలను జాగ్రత్తగా మననం చేసుకోవాలి. బోధలను జాగ్రత్తగా మననం చేసుకోవాలి. మనలో నిష్ఠ, సబూరీలు జాగ్రత్తగా గమనించుకుంటూ వుండాలి. అలా మనం జాగ్రత్తగా గమనించుకుంటూ వుంటే సకల ధర్మశాస్త్రాలను పాటించిన వాళ్ళమవుతాము. ఈ భావన, ఈ అవగాహన లేకపోతే ఉపచారాలన్నీ కేవలం యాంత్రికంగా జరుగుతాయి. సరైన భావం లోపించినట్లయితే బాబానే గాదు, మరెవ్వరూ గూడ రక్షిస్తారని అభయం యివ్వలేరు, యివ్వబోరు కూడా.

ఇంత వరకూ మనం సద్గురువును సేవించడం అనే దాంట్లో సాయి గురువు సాయి నుండి నిష్ఠ, సబూరీలనే దక్షిణను కోరడంలోని ఆంతర్యము గూర్చి, 'నిష్ఠ' అంటే ఏమిటి? 'సబూరీ' అంటే ఏమిటి? అనే విషయాల గురించి స్వల్పంగా వివరించుకున్నాము. నిర్దుష్టంగా మన లక్ష్యమేమిటో మన మనస్సుకు అవగాహన అయిన తర్వాత ఆ లక్ష్యం కోసం మాత్రమే జీవించడము, దాని కోసమే ప్రయత్నించడము, దాని యందు శ్రద్ధ, లక్ష్యమూ నిశ్చలంగా విలవడమనేది 'నిష్ఠ' అని అనుకున్నాం.



అధ్యాయం-7

దక్షిణ



ఇప్పుడు దక్షిణ గూర్చి కొంచెం వివరించుకుందాము. ప్రతి వ్యక్తికీ గూడ కొన్ని కొన్ని సమయాలలో ఫలానిది లక్ష్యం అని, ఫలానిది ఉత్తమమైన శ్రేయస్సు అనీ, దానిని పొంది తీరాలనే శుభాకాంక్ష కలుగుతుంటుంది. మనం శాంతిని పొందాలి, ఉత్తమమైన వ్యక్తిగా జీవించాలి అనే శుభమైన కోరిక దాదాపు అందరికీ వుంటుంది. అయితే దానిని ఆచరణలోనికి రానివ్వడానికి వీలులేకుండా మనలోని అరిషడ్వర్గాలనే పాశాలు అడ్డుకుంటాయి. ఆ పాశాలనుండి మన యోచన ఎప్పుడైతే విడివడుతుందో, నాటినుండీ మన యోచన సక్రమంగా జరుగుతుంది. అటువంటి ఆలోచనల యొక్క బలం నానాటికీ తగ్గుతూ వుండడమే నిష్ఠలో ముఖ్యమైన భాగం. లేకపోతే అవి ప్రబలమై మన లక్ష్యాన్ని మరపించి, వాటి దారిలోకి మనలను త్రిప్పుతుంటాయి. దీనికి తాత్వికంగా ఒక కారణమున్నది. సృష్టిలో ప్రతిదీ త్రిగుణాత్మకము. నామరూపాలైన ప్రతీదీ సత్వరజస్తమో గుణాలుగా త్రిగుణాత్మకమైనది. అలాగే మన దేహము, మనస్సు గూడ సత్వ, రజస్తమో గుణాలుగా పనిచేస్తాయి. కొన్ని కొన్ని సమయాలలో రజోగుణం ప్రధానంగా వుంటుంది. అప్పుడు ఇంద్రియ సుఖాలయందు మనస్సు పోతుంది. అధిక న్యూనతల భావాలమీదకు పోతుంది. కీర్తి ఆడంబరాల మీదకు పోతుంది. ప్రపంచంలోని అనేక విషయాల గూర్చి మనస్సుకు ఆసక్తి కలుగుతుంది. సరిగా ఆలోచిస్తే ఏదైతే నిష్ప్రయోజనమని మనస్సుకు తెలుస్తుందో, దేనిమీద ఆసక్తి వుండడం వల్ల ఎట్టి లాభమూ లేదని యోచన ద్వారా తెలుస్తుందో దానియందే మనస్సుకు కుతూహలం జనిస్తుంది. అది గూడా రజోగుణ ప్రధానమైనదే. అలాగాక తమోగుణ ప్రధాన మైన సమయాలు కొన్ని వుంటాయి. అసూయ పడేటటువంటి సమయాలూ వుంటాయి. మనస్సులో కినుక వహించే సమయాలూ వుంటాయి. అలాగాక వీటన్నింటిలోంచి మనస్సును ఉపసంహ రించుకుని "మనం పెట్టుకున్న ఇష్ట దైవాన్ని లేక సద్గురువును జ్ఞాపకం చేసుకుని ఆ ఉత్తమమైన పంథాలో ఆలోచించి జీవించుదాం" అనే సంకల్పం అప్పుడప్పుడు కలుగుతుంటుంది.

ఈవిధమైన మూడు రకాల సంకల్పాలూ కలగడానికి కారణమేమి టంటే మన మనస్సు త్రిగుణాత్మకమైనది. ఎప్పుడైతే సత్వగుణం మనలో బలంగా వుంటుందో, అప్పుడు మనకు, "ఏంటబ్బా, ఇలా యాంత్రికంగా బ్రతుకుతున్నాము? ఇలాగాక మన మనస్సును ఒక క్రమపద్ధతిలో తీర్చిదిద్దుకొని, దీనిని ఉత్తమమైన భావాలు, ఆలోచనల వైపుకు తీసుకుపోవాలి, అలాగాకపోతే మనస్సులో మాలిన్యం పేరుకుంటుంది. దానిని తొలగించుకొని ఈ రోజు మంచి క్రమబద్ధంగా ఉత్తమమైన అభ్యాసం పెట్టుకుందాం. కాసేపు ఏదైనా మంచి పుస్తకం చదువుకుందాము, వినదాము, కాసేపు ధ్యానం చేద్దాము" అని అనిపిస్తుంది. మనస్సు సాత్వికంగా వున్నప్పుడు యిలాంటి భావాలు కలుగుతాయి. అదే మరొకరికి, "ఏమిటబ్బా యిది. ఇన్ని కోట్లమంది వున్నారు, తినడము, నిద్రపోవడము, పనిచేయడము, దుఃఖపడడము, రాగద్వేషాలు పెట్టుకోవడము, చివరకు చనిపోవడము - ఇదంతా ఏమిటి? దీని అర్థమేమిటి? మనిషి యొక్క జీవితానికి లక్ష్యమేమిటి?" అనే ఆలోచనలుగా రావచ్చు. మరొకడికి, "ఈ సృష్టి తత్వం ఏమిటి?ఇన్ని రకాల నామరూపాలు, గుణాలు ఏమిటి? వీటిల్లో ఏ రెండూ కూడ ఒకే రకంగా వుండకపోవటమేమిటి? ఈ సృష్టి యిలా అనంతంగా కొనసాగటమేమిటి? ఏమిటి ఈ సృష్టివైచిత్రి? ఏమిటి ఈ సృష్టిరహస్యం? దీనికి కర్త ఎవరు? దీని గమ్యమేమిటి? ఎందుకిలా జరుగుతున్నది?" అనేటటువంటి విచికిత్స ప్రారంభమవుతుంది. ఇలాంటి భావాలన్నీ గూడ సాత్వికమైనటువంటివే. కాబట్టి సాత్వికంగా వుండే సమయంలో మనలో శుభేచ్ఛ కలుగుతుంది. జీవితాన్ని నిర్దుష్టంగా చేసుకోవడానికి అవసరమైనటువంటి భావం కలుగుతుంది. అది నిలవకుండా పోవడానికి కారణం మనలో రజస్తమో గుణాలు వుండడమే. మనలో ఆశమొదలైన పాశాలు యింకా మనలను పట్టుకొని వుండడమే కారణమని మనం ఇంతకు ముందు చెప్పుకున్నాము. అయితే మనలో యోచన యొక్క బలము ఈ ఆశా, పాశాల కంటే ప్రధానంగా ఎప్పుడైతే వుంటుందో, అప్పుడు మనలో సత్వగుణం కలుగుతుంది.

ఈ సత్వగుణం మనలో కలిగినపుడు ఏ వాసనైతే మనలో కలిగిందో, దానికోసం ప్రారంభించిన మన ప్రయత్నాన్ని రజోగుణ, తమోగుణ ప్రధానంగా వున్న సమయాలు వచ్చినప్పుడు సత్వగుణ ప్రధానమైన శుభవాసనల నుంచి రజో, తమో,గుణ వాసనలోకి వెళ్ళిపోతుంది. ఎలాగంటే ఉదాహరణకు మనం నిష్ఠగా

జపం చేసుకుంటున్నామనుకోండి, ఎప్పుడైనా ఒకసారి పాలుమాలి అలా కూర్చొని పేపరు చదవడంగాని, రేడియో పెట్టడంగాని చేసామనుకోండి, ఇంకొక సారి అలా చేద్దామనిపిస్తుంది. అప్పుడప్పుడు అలా చేస్తుండడం వల్ల త్వరలో - ఈ వార్తల సమయం అయిపోయిన తరువాత జపం చేసుకుంటే బాగుంటుందనిపిస్తుంది. ఆ వార్తలు వినడంవల్ల నిజంగా మనం చేయగలిగిందేమీ లేదు. కానీ గోళ్ళు కొరుక్కోవడంలాగ అదొక అభ్యాసమై, అది జరిగిన తర్వాతగాని తక్కిన కార్య క్రమాలు ఆరంభం కాకుండా వుంటాయి-అంటే రజోగుణ ప్రధానంగా మనస్సు తయారవుతున్నది అని అర్థం. వార్తలు వినడం నిష్ప్రయోజనమా? వినగూడదా? అంటే అలా అని గాదు, వినకూడదని, నిష్ప్రయోజనమని ప్రసక్తి ఏమీ లేదు. ఎన్ని విన్నా, ఏమి జరిగినా గూడ-సత్వగుణ ప్రధానమైన భావాలు అందరిలోనూ వున్నప్పుడే అన్నీ సక్రమంగా జరుగుతాయి. లేకపోతే ఏవీ సక్రమంగా జరుగవు. అలాగాక ఒకవేళ అవన్నీ సక్రమంగా జరగడం ఎలాగో తెలిసినవాడు ఎవడైనా చెప్పినప్పటికీ ఏమీ జరుగదు. అదెలాగంటే సాయి చెబుతూనే వున్నారు గదా- "అందరిలో ఒకే ఆత్మ వున్నది, కాబట్టి అనవసరమైన బేధాలు ఎప్పటికీ పెట్టు కోవద్దు, మత బేధాలు పెట్టుకోవద్దు"అని. కాని మానవాళి ఎందుకు ఆచరించ లేకపోతున్నది? ఎందుకంటే - ఆయన సత్వగుణ ప్రధానుడే కాని వీళ్ళు సత్వ గుణ ప్రధానులు కారు కదా! అందుకని వినేవారికి గూడ సత్వగుణ ప్రధానమైన భావముండి, "అరె! దేశంలో పరిస్థితులు యిలా వున్నాయి కదా! దేశం యిలా వుంటే బాగుండేది కదా" అన్న ఆలోచనలు వస్తేగాని అన్నీ సవ్యంగా జరుగవు. ఒకవేళ ఒకడికి అలాంటి సత్వప్రధానమైన ఆలోచన వచ్చినా ప్రక్కవాడే వినడు. అసలు వాడికే మరొక భావం వచ్చిన సమయంలో ఈ భావం నిలవదు కూడా. అలాంటప్పుడు వార్తలు వినడంవల్ల ప్రయోజనమూ లేదని తెలుస్తుంది. అందుకని అప్పుడు ఏమవుతున్నదంటే మనకు ప్రధానం కానటువంటి విషయాల మీద మనస్సుకు ఆసక్తి కలుగుతున్నదన్నమాట.

తీరిగ్గా కూర్చున్నామనుకోండి. లోకంలో మామూలుగా ఏం జరుగు తుందంటే ఎవరో ఒకరు వచ్చి కూర్చొని, 'వాడలా చేశాడు, వీడిలా చేశాడు' అని అంటాడు. అసలు వాడక్కడ ఏంచేస్తే వీడికెందుకు? వాడు పనికి మాలినవాడని తెలిస్తే వీడికేమి ఒరుగుతుంది? ఒకవేళ వాడు పనికి వచ్చే వాడని తెలిస్తే మాత్రం వీడికేదైనా ఉపయోగపడవచ్చు. కాని అలాంటి వ్యర్థమైన సంభాషణల వల్ల పూరికే

కాలయాపన జరుగుతుంది. అప్పుడు రజోగుణ ప్రధానంగా మనస్సు పని చేస్తున్నదని అర్థం. అలాంటప్పుడు, 'కాలక్షేపం కావాలి. ఏదో ఒక విధంగా ప్రొద్దుపోవాలి' అనేది వుంటుంది తప్ప, 'ఇది ఉత్తమమైన రీతిన వున్నదా, లేదా?' అని తనను తాను నియమించుకొని, నిగ్రహించుకొని, సరియైన భావనను, యోచనను చేసే యత్నము, పట్టుదల చచ్చిపోయి వుంటాయి. కాబట్టి సత్వ గుణ ప్రధానమైన సమయంలో ఏ భావమైతే మనస్సులో కలిగిందో, అప్పుడు 'నిర్దుష్టంగా మన జీవితాన్ని, యోచనమూ సక్రమంగా చేసుకుందామని ఏ నిర్ణయమైతే తీసుకున్నామో, ఆ నిర్ణయం మీద నిలబడనీయకుండా మరుక్షణమే యింకొక గుణం వచ్చి దానిని ప్రక్కకు నెడుతున్నది' అన్న సంగతి బాగా గమనించుకొని దానిని మార్పు చేసుకోవడానికి ప్రయత్నం చేసుకోవడమే నిష్ఠను కాపాడుకోవడమంటే. ఇది నిష్ఠ చెల్లింపులో ఒక భాగం. అలా యిచ్చిన 'నిష్ఠ' అనే దక్షిణను, దక్షిణగా యిచ్చిందిగా గుర్తుపెట్టుకోవాలి. భగవంతునికి గాని, బాహ్యరూపంలో వున్న గురువుకు గాని దక్షిణ సమర్పించడం-అనే నియమాన్ని ఎందుకు పెట్టారంటే - ఒకసారి దీనిని ఆయనకు యిచ్చేసామంటే మళ్ళీ తీసుకోవడానికి కాదు. ఇవ్వడంలో ఉద్దేశ్యమేమిటి? "ఇది నేను నీకు యిచ్చేస్తున్నాను, నీ యిష్టం వచ్చినట్లు చేసుకో" అని అర్థం. కానీ మనకు తెలియకుండానే ఏం జరుగు తుందంటే ఈ రోజు మనకు శ్రద్ధ' అనే సాత్వికమైన భావం వచ్చింది కనుక యిచ్చేస్తున్నాం. రేపో, ఎల్లుండో మనకు రజోగుణ ప్రధానమైన భావం నిలుస్తుంది. కాబట్టి దానిని ఉపసంహరించుకొంటున్నాము. కాబట్టి నిష్ఠలో ప్రధాన మైన అంశం ఏమిటంటే ఏ భావంలోనైతే ఒక ఉత్తమమైన కార్యక్రమాన్ని ఈ రోజున ఉపక్రమించుకొని, ఒక తీర్మానం చేసుకొని, ఒక క్రమబద్ధమైన జీవితాన్ని ఏర్పరుచుకున్నామో, ఏమైనా సరే, దానిని మాత్రం అలాగే కొన సాగించాలి. దీనిని సాయి ఎంత బాగా చెప్పారో తెలుసుకుందాము.

ఒక దీపావళినాడు బాబా ధునిముందు కూర్చున్నారు. ఆయన ధునిలో కట్టెలు వేస్తూ వాటిని సవరిస్తూ సవరిస్తూ అందులో తను చేయి పెట్టారు. అది చూచి భక్తుడు శ్యామా వెనుకనుంచి ఆయనను గట్టిగా వాటేసుకొని వెనుకకు లాగేశాడు. ఎందుకంటే ఆయన మన స్వభావాల్లో లేరని స్పష్టంగా అతనికి తెలిసిపోయింది. లేకపోతే నిప్పులో పెట్టిన చేతిని అంతసేపు అలా ఎలా వుంచ గలరు? బాబా తమచేతిని ధునిలో పెట్టేసి అలానే వుంచేసారు. 'ఇదేమిటి, యిలా

చేస్తున్నారు బాబా' అంటూ అతడు ఆయనను వెనుకకు లాగేసాడు. ఆయన వైఖరి ఏదో పరధ్యానంలోనుంచి మేలుకున్నట్లు వున్నది. అప్పుడు శ్యామా బాబాను అడిగాడు: "ఏమిటి బాబా, ధునిలో చేయి పెట్టారు, కాలిపోదలుచుకున్నారా ఏమి?" అని. ఆయన చెయ్యి కమిలిపోయి వున్నది. అప్పుడు బాబా యిలా చెప్పారు:

"ఏమీ లేదు! దూరంలో ఫలానా గ్రామంలో ఒక కుమ్మరి వున్నాడు. అతడు మహా పేదవాడు. ఏ పూట కాపూట కొలిమి వేసుకుంటే తప్ప కుటుంబం గడవదు. వాడికి జబ్బు చేసి మంచం పట్టి వున్నాడు. అందుకని అతని భార్య కూర్చొని కొలిమి వేస్తున్నది. ఆమె కొలిమి వేస్తున్నదే కాని భర్త సంగతే ఆలోచిస్తూ అతడు పిలుస్తాడేమోనని ఒక చెవి అటు వేసివున్నది. ఇంతలో ఆమె భర్త త్వరగా రమ్మని ఆమెను పిలిచేసరికి ఏమవసరమోనని తొందరలో తన ఒడిలోని బిడ్డను మరిచి లేచింది. అందుకని ఆ బిడ్డ కొలిమిలో పడిపోయాడు. ఆ బిడ్డ నా భక్తుడు. అందుకని అతనిని రక్షించడానికై నేను యిలా చేయి పెట్టాను."

ఆ తరువాత జరిగినదేమిటంటే - భాగోజీ అనేవాడు - కుష్ఠువ్యాధి పీడితుడొకడు బాబా దగ్గర వుండేవాడు. అతడు కాలిన బాబా చేతికి నెయ్యి-నవనీతం అంటామే మనం-దానిని రాసి, దానిమీద ఒక పట్టీలాగ ఆకు వేసి దానిపైన కట్టు కట్టేవాడు. రెండు మూడు రోజులపాటు ఒకే సమయానికి అతడు ఆ కట్టు కట్టడం చేసేవాడు. ఏ రోజు నుండి అయితే అతడు ఆ కట్టు కట్టడం ప్రారంభించాడో ఆ రోజునుంచి ఆ పనిని -ఆ సేవను - అతని జీవితంలో ఒక భాగంగా చేసేసారు బాబా. అంటే అతడొచ్చి ఆ సేవ చేసేదాక ఆయన మరొక పనికి వెళ్ళకుండా వేచి వుండేవారు. అంటే రోజు 8గం॥కు చేసే ఆ సేవ ఒకరోజు 8.30 గం॥ల దాకా చెయ్యడనుకోండి వాడు వచ్చేవరకు బాబా తాము చేసుకోవలసిన కార్యక్రమాలు చేసుకోకుండా అతని కోసం ఎదురుచూస్తూ వుండేవారు. అందుకని "అరెరె! బాబాను నా కోసం ఎదురు చూసేటట్లు చేశాను కదా!" అని అతడు బాధపడి, ఆ మరుసటి రోజు నుంచి 8 గం॥ల కల్లా నియమంగా ఆ సేవకు పుప్రక్రమించేవాడు. ఆ పని అతనే చేయాలంటే ప్రతిరోజు సరిగ్గా 8గం॥కు ఆ పని చేయడానికి తీరుబాటు (స్వేచ్ఛ) వుండేలాగ తక్కిన పనులన్నింటినీ అతడు సరిచూసుకోవలసి వస్తుంది. ఎందుకారీతిన బాబా చేశారంటే - కరెక్టుగా ఆ సమయం వచ్చేసరికి ఆ పనినే నిర్వహించడం, ఆ పనిని నిర్వహించేటప్పుడు

ఆయన పట్ల వున్న భక్తి శ్రద్ధలు - ఇవి నిత్యము అభ్యాసం కావడంతో, ఆ యిచ్చిన రూపాయి - అంటే 8 గం॥ల నుంచి 8.30 దాకా అనేటటువంటి ఆ సమయం, ఆ సమయంలో అతనికి వుండే మనోభావం-అనేటటువంటి రూపాయిని దక్షిణగా యిచ్చేటట్టు చేసేశారు బాబా. అదే నిష్ఠ అంటే. అంటే నిష్ఠను అతనికి అభ్యసింప చేస్తున్నారు బాబా. దాని వలన ఒక కార్యక్రమం నిర్ణయమైపోయింది. రోజులో ఒక అరగంట సేపు ఉదయాన్నే తప్పని సరిగా సద్గురువు సన్నిధిలో సాటి భక్తుల అనుభవాలను, లీలలను గమనిస్తూ ఆ కార్యక్రమం చేస్తూవుంటా డన్నమాట. అందుకు ఆ సమయం వాడి జీవితంలో కేటాయింపు అయిపోయింది. యిక ఆ సమయం అతనిది కాదు, సాయిది. అది సాయి మహిమలను, లీలలను గుర్తు పెట్టుకునేది. అది 'నిష్ఠ'కు వ్రాసి యిచ్చి వేయబడిందన్నమాట. ఇక అది తిరిగి తీసుకోబడదు. అదీ 'నిష్ఠ' అంటే. 'దక్షిణ' అంటే దానిని వ్యక్తం చేసే రూపం. ఏ రకంగా వ్యక్తం చేసినా అది దక్షిణే అవుతుంది. అందుకని నానా తాను చదివే గ్రంధం మీద శ్రద్ధపెట్టి చదువగలందులకై అతనిని ఆ శ్లోకానికి అర్థం చెప్ప మన్నారు బాబా.

ఎప్పటికప్పుడు మన మనస్సు ఏ పని చేస్తుందో నిశితంగా గుర్తుపట్ట గలగాలి. మనస్సు లొంగుబాటుకు రానవచ్చు, రాకపోవచ్చు గాక! అసలు మొట్ట మొదటి మెట్టు దానిని గుర్తుపట్టడం. ఉదాహరణకు పూజ చేసుకుందామను కున్నామనుకోండి. ఇదిగో ఈ పేపరు చదివేసి, ఇదిగో ఈ పని చేసేసి, లేకపోతే కాసేపు మాట్లాడేసి చేద్దామనిపిస్తుంది. దానిని బలవంతంగా లాక్కొచ్చి పూజకు కూర్చోబెట్టకపోయినా పర్వాలేదు. ఎందుకంటే మనం పూజలో కూర్చున్నా అది - అంటే మనస్సు అక్కడ నిలవక అనవసరమైన ఎన్నో యితర విషయాల గూర్చి ఆలోచిస్తూ వుంటుంది. అందుకని మనస్సును అలా బలవంతం చేయకుండా గుర్తుపట్టాలి. అప్పుడు పనిచేస్తున్నది రజోగుణము అని భగవద్గీతలో నీవు చదివినది గుర్తుపట్టాలి. ఈ గుర్తుపట్టడంలో ఒక తమాషా అయిన యుక్తి వుంది.

ఉదాహరణకి- ఒకనికి మంచి రుచికరమైన వంటకం పెట్టామను కోండి. దాని చల్లదనంగాని, వెచ్చదనంగాని పోయింది అంటే దాని రుచి పోతుంది. కనుక వాడు దానిని గబగబా తింటానికి ప్రయత్నం చేస్తున్నా డనుకోండి. ఆ తినడంలో వాడు తన్మయుడై వున్న సమయంలో మనం వాడితో, "ఏమిటో! నీవెప్పుడు ఏ పదార్థం నోట్లో పెట్టుకున్నా కుడిప్రక్కనే ఎందుకు నములుతావు?" అని అడిగా

మనుకోండి. అంతకుముందు అతడు తనకు తెలియకుండానే కుడిప్రక్కనే నములుతున్నాడు. కాని మనం గుర్తుపట్టి అడిగేసరికి ఆ కుడిప్రక్కనే అనే క్రియను గమనిస్తూ వుండడంలో అతనికి ఆ రుచిలోని భావం పోయి వుంటుంది.

అలాగే నలుగురు కూర్చుని జోక్స్ వేసుకుంటూ నవ్వుకుంటూ వున్నారనుకోండి. ఎవడి స్వభావసిద్ధంగా వాడు నవ్వుతాడు. కాని అందులో ఒకడు మరొకడిని, "ఏమిటి అట్లా నవ్వుతావ్!"అని అడిగామనుకోండి. "ఓహో, నేను ప్రత్యేకించి యిలా నవ్వుతాను కాబోలు" అని అతడనుకోగానే నవ్వడంలోని తాదాత్మ్యం పోతుంది. అందుకని మనలో ఒక గుణం పనిచేస్తున్నప్పుడు నిగ్రహించకపోయినా పర్వాలేదు. మనలో పనిచేస్తున్నది ఈ గుణం కదా! అని గుర్తుపట్టి ఆలోచిస్తూంటే చాలు, ఆ గుణంలో తాదాత్మ్యం తొలగిపోతుంది. తాదాత్మ్యం ఎప్పుడైతే తొలగిపోయిందో దానికి 'కీ' పోయిందన్నమాట!

అన్ని వికారాలకు, అన్ని భావాలకూ మన మనస్సులో వుండే తాదాత్మ్యం 'ఎలక్ట్రిక్ వైర్' లాంటిది. అది ఆ ప్లగ్‌లో వుండే కరెంటును అను క్షణం బల్బుకో, లేక మరొకదానికో సోకింపజేస్తుంటుంది. అలాగే ఎంతసేపైతే మనం తాదాత్మ్యం చెంది వున్నామో, అంతవరకూ మనలో వుండే రజోగుణ, తమోగుణాలను నిగ్రహించే భాగం మనలో లేకుండాపోతుంది. దేనియొక్క సహాయంతో రజో గుణాన్ని తీసుకువచ్చి సత్వగుణంలో పెట్టాలో, ఆ పెట్టేటటువంటి పనిముట్టు విషయాలలో నిమగ్నమై వుంటుంది గనుక గుణాలను నిగ్రహించలేము. అలాగాక 'ఇది రజోగుణము' అని గుర్తు పట్టామనుకోండి, అప్పుడేం జరుగుతుందంటే - తక్కిన సమయమంతా అలా వుండి యువత లకు లాగవలసిన మనస్సు మాత్రం బయటకు వచ్చి ఇది రజోగుణమని గుర్తుపడుతుంది. ఇది రజోగుణమని ఎప్పుడైతే గుర్తు పడుతుందో సత్వగుణమెలా వుంటుందో తెలుస్తుంది. రజో గుణం వల్ల నష్టమేమిటో, సత్వ గుణంవల్ల లాభమేమిటో తెలుస్తుంది. అప్పుడు మనం పెట్టుకున్న 'నిష్ఠ' ఏమిటో, ఆ నిష్ఠకు యిది ఎలా విఘాతం కలిగిస్తుందో తెలుసుకొని, దాని యందు ఆత్మీయంగా ప్రవర్తించే ఆ దుర్గుణం నుండి విడివడి, వేరు భావంతో దానిని దొంగను పట్టించే ఆ దుష్టమైత్రి నాటినుంచి మనపట్ల అనుమానించవలసిన దొంగగా అయిపోతుంది. మన యింటికి వచ్చే ఒకనికి దొంగతనం చేసే గుణము వున్నదని మనకు తెలిసిందనుకోండి. మనం అనుక్షణం అతనిని కనిపెడుతున్నపుడు వాడు చేయగలిగేదేముంది? వాడు ఎంతటి దగ్గర

బంధువైనా ఇంట్లో అంతా తిరగనిస్తేగదా నష్టం? అతని సంగతి తెలిసి ఏమార కుండా వున్నాక వాడు చేయగలిగిందేమీ లేదు. మనం అజాగ్రత్తగా వున్నదీ లేదు.

అందుకని ఏ గుణమైనా పనిచేసే సమయంలో ఆ గుణాన్ని గుర్తు పట్ట గలిగితే దానికి మనమీద వుండే పట్టుతొలగిపోతుంది. అసలు భగవద్గీతలో శ్రీకృష్ణుడు గుణత్రయ విభాగం చెప్పిన కారణమే యిది. అందులో ఆయన ఏం చెప్పాడంటే-"నీకు రజోగుణం పనిచేస్తున్నప్పుడు నీవట్లాగే పనిచేస్తావు. అలాగే తమోగుణం పనిచేస్తున్నప్పుడు తమోగుణ ప్రధానమైన కర్మలే చేస్తావు" అని. అలాంటప్పుడు ఆయన ఆ విషయం చెప్పడమెందుకు? అన్నది ప్రశ్న. అలా గాదు, ఆయనలా చెప్పడంలో ఒక సూక్ష్మమున్నది. ఒళ్ళు తెలియకుండా విరగబడి నవ్వుతున్నవాడిని, 'అదేంటిరా, అలా నవ్వుతావ్!' అని అడిగినప్పుడు అతడు మొదట నవ్వడం ఆపేస్తాడు. తర్వాత తనెట్లా నవ్వు తున్నాడో గమనించు కుంటాడు. నవ్వడానికి గల కారణాన్నుంచి, నవ్వులో వుండే తాదాత్మ్యం నుంచి విడివడి, ఇంకొకణ్ణి చూచినట్లు తాను నవ్వడమనే క్రియను చూస్తూ, 'అరే, ఏమిటింత వింతగా నవ్వుతున్నాను!' అని ఆలోచిస్తాడు.

మన మనస్సు తనలో వుండే గుణాలతో తాదాత్మ్యాన్ని వీడి దానిని వేరే వ్యక్తిని చూచినట్లు చూడడం ఎప్పుడైతే మొదలు పెట్టిందో, ఆ గుణానికి ఆయువు పట్టుపోయిందన్నమాట. దానికి అంతిమ ఘడియలు వస్తాయన్న మాట. అంటే కృష్ణపక్ష పాడ్యమి ప్రారంభమైనదన్నమాట. ఆ గుణంతో మనస్సుకు తాదాత్మ్యం వున్నంత వరకు నానాటికీ పౌర్ణమి దగ్గర పడుతుంది. ఆ దుర్గుణం నానాటికీ వృద్ధి చెందుతుంది. దానిని గుర్తుపట్టాలి. సత్త్వగుణ ప్రధానంగా మనము నడుస్తున్నప్పుడు సత్త్వగుణానికి ప్రోత్సాహమివ్వాలి. అలా సత్త్వగుణం పనిచేస్తున్నప్పుడు, "ఈ సత్త్వగుణం వున్నప్పుడే చింతన చేస్తే బాగుంటుంది. కనుక ఇప్పుడే ధ్యానం చేసుకోవాలి. ఇప్పుడే ఎక్కువగా జపం చేసుకోవాలి" అనే దృష్టితో వుంటే సత్త్వగుణం మరింత బలం పుంజు కుంటుంది.

ఉదాహరణకు సైకిల్‌గాని రిక్షాగాని త్రొక్కేటప్పుడు ఎత్తు రాబోయే ముందు గనుక పల్లం వస్తే దానిని ఉపయోగించుకుంటాము. ఆ ఎత్తును సులభంగా ఎక్కటానికి ఈ పల్లాన్ని ఉపయోగించుకుంటాము. అంటే సత్త్వ గుణం అనే మూడ్‌లో మనమున్నామని తెలుసుకున్నప్పుడు అపుడే ఇంకొంచెం

ఎక్కువగా జప ధ్యానాదులు చేసుకోవాలి. మనం 9గం॥ల నుంచి 10 గం॥ల వరకు ధ్యానం చేద్దామని పెట్టుకున్నామనుకోండి. అలాగాక 8గం॥లకే సత్త్వ గుణమనే మూడ్ లభ్యమై ధ్యానం కలుగుతున్నదనుకోండి. అప్పుడు 'ఇప్పుడు కాదుగదా మనం ధ్యానం చేసుకుందామనుకున్నది' అని అనుకోకుండా 'ఈ సత్త్వగుణం రోజూ కుదరక ఇబ్బంది పడుతున్నాం కదా. ఇది వున్నప్పుడే మనం దీనిని ఉపయోగించుకోగలిగితే రేపు ధ్యానం యింకా సులభమవుతుంది' అనుకొని 9గం॥లకు చేయాలనుకున్న పనిని వాయిదా వేసుకోవాలి. అలా ఒకరోజు ఎప్పుడైతే చేస్తామో, ఆ సత్త్వగుణానికి శుక్లపక్షమి ప్రారంభమైనదన్నమాట. భగవద్గీతలో గుణత్రయ విభాగంలో గుణాల గురించి చెప్పిన ఉద్దేశ్యం యిదే. ఇది తెలియకపోతే పెద్ద లోపం జరిగిపోతుంది. అదేమిటంటే ఇతరులలోని రజో, తమో గుణాలను గుర్తించడం అనే పెద్ద లోపం. 'వీడు రజోగుణ ప్రధానుడు, వీడు తమోగుణ ప్రధానుడు, వీడిట్లా చేసాడు, వాడిట్లా చేసాడు' అని యితరుల లోని గుణాలను గుర్తుపడుతుంటాడన్న మాట. ఇలా ఆలోచించడం వల్ల ఏమీ ప్రయోజనం లేదని మనం యింతకుముందు అనుకున్నాం. అలాంటి భావాలు మనస్సులోకి వచ్చినప్పుడు సత్వ గుణ భావాల కోసం ప్రయత్నం చేయాలి. నిష్ఠ నిలుపుకునే ప్రయత్నం చేయాలి. మనస్సులోకి ఒకవేళ వాడిట్లా గదా, వీడిట్లా గదా అనే ఆలోచన వచ్చిందనుకోండి. వెంటనే ఇది రజో గుణం మూడ్ గదా అని తెలుసుకొని జాగ్రత్త పడాలి. "ఇది రజోగుణమని గుర్తుకు రాగానే, ఇది పనికి రాదు. సత్త్వగుణం ముఖ్యం" అని మనసుకు గుర్తు వస్తుంది. ఆ సమయంలో మనస్సు సత్త్వగుణ ప్రధానం కాకపోయినప్పటికీ సాత్త్వికమైన భావాన్ని గుర్తు తెచ్చుకుంటుంది. 'ఇది రజోగుణమైన భావం. అన్నింటిలో నేనున్నాని బాబా చెప్పారు గదా! ఇది తెలియక మనకు సృష్టి నానాత్వంగా గోచరమవుతున్నది. కాబట్టి మనిషిలో వుండే గుణగణాలు, నేను వేరు - వాడు వేరు అనే అడ్డు గోడను నిలుపు తుందని, దానిని కూలదోయమనీ బాబా చెప్పారు గదా! కాబట్టి అలా అందరిలోనూ వున్న అడ్డుగోడ నాలోనూ వుండబట్టి 'నేను వేరు - వాడు వేరు'అనే భావన కలుగుతున్నది. అలాంటి భావాన్ని రానివ్వడంవల్ల అన్నింటిలో బాబా వున్నారనే భావన చెడగొట్టు కుంటున్నాము కదా'' అని గుర్తొస్తుంది. అయితే 'అవతలివాడు మనపట్ల వేరుభావం పెట్టుకుంటున్నాడు గదా, మరి అప్పుడెలా?' అంటే వాడికి అ

భావం కుదరకపోవచ్చు. మనకేమి? మనం అందరిలో బాబా వున్నాడనే భావాన్ని పెంపొందించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాము. అవతలి వాడు చేయకపోతే మనకేమి? మనం చేస్తే మనకే మేలు. అవతలి వాడు చేయకపోతే వాడికే నష్టం అని వివేకంతో ఆలోచించాలి.

అవతలి వాడు మనమీద వేరనే భావాన్ని కలిగి వున్నాడు. మనం వాడి పట్ల అట్టి భావాన్ని తొలగించుకున్నప్పటికీ వాడు పోగొట్టుకోవడం లేదు. అప్పుడెలా అనే సందేహం రావచ్చు. అంటే వాడికది నచ్చింది కాబట్టి వాడు అలా వుంటున్నాడు. కానీ మనం పెట్టుకున్న లక్ష్యానికి యిది సరియైనది గనుక మనం యిలా వుందాము అనే వివేకాన్ని పెంచుకోవాలి. అప్పుడు "నా అజ్ఞానం చేతనే యివన్నీ వేరు వేరని అనిపిస్తున్నాయి. అన్నింటిలో బాబానే వున్నారని ఎల్లప్పుడూ ధ్యానిస్తూ వుంటే అలానే అవుతారని బాబా చెప్పి వున్నారు. హామీ గూడ యిచ్చి వున్నారు; నిరూపణ గూడ యిచ్చి వున్నారు. కాబట్టి నా అజ్ఞానం ఛేదించుకోవడమనేది నా లక్ష్యం. దానికి అవతలి వాడు ఏం చేసాడు? అన్నది నాకు ప్రధానం కాదు. కనుక నేను నా లక్ష్యాన్ని గుర్తు పెట్టుకునే వుండాలి. ఇతరులు ఎలా వున్నారనేది పట్టించుకోగూడదు అనే తీవ్రత మనసుకు కలుగుతుంది. అప్పుడు రజోగుణ, తమోగుణాలతో ప్రారంభమైన కృష్ణపక్షం పూర్తవుతుంది. సత్వ గుణమనే శుక్ల పక్షంలో వుండే పాడ్యమి, విదియ ప్రారంభమవుతాయి. అందుకని మనలో పనిచేసే గుణాలను గుర్తుపట్టాలి. వాటిని మనం గుర్తుపట్టగలందులకే సాయి ద్వేషం ఎలా వుంటుందో, వేరు వేరనే భావం ఎలా వుంటుందో, ఈ వాడా అనే దానిలో దొంగలెలా వుంటారో, అందులో పనికిరాని వాడెలా వుంటాడో, వాడినెలా నెట్టివేయాలో పామరభాషలో మనకర్థమయ్యేలా చెప్పారు. ఈ విషయాలు సాయి ఎందుకు చెప్పారంటే, భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఎందుకు చెప్పారో అందుకే చెప్పారు.

ఇప్పటిదాకా మనం సాయియొక్క తత్వాన్ని, మన జీవిత లక్ష్యాన్ని - ఆ రెండింటినీ గుర్తుపెట్టుకునే ప్రయత్నమే - అంటే ఆ జాగరూకతే - 'దక్ష' అనీ, దానిని ప్రకటించుకునే విధానమునే దక్షిణ అనీ చెప్పుకున్నాం. ఆ ప్రకటించు కునేది మానసికము, శారీరకమూ గూడ. అంతేగాని, ఈ రెండింటిలో ఏ ఒక్కటి మాత్రమే గాదు. 'భజనకు సత్సంగానికి వెళ్తే మనస్సు హాయిగా వుంటుంది.

పవిత్రమవుతుంది' అనే అనుభూతి మనకు కలుగుతున్నదనుకోండి. ఆ సమయం కాగానే అక్కడకు పోవాలనే బుద్ధి పుట్టి, శరీరం అక్కడకు బయలుదేరాలని సన్నాహాలు చేసుకుంటుంది. కాబట్టి ఈ దక్షిణ శారీరకము, మానసికమూ గూడాను. అక్కడకు వచ్చి విని, అందులో పాల్గొని ఆ పవిత్రతను లోపలకు తీసుకుని ఆనందం పొందుతుంది కాబట్టి అందులో శరీరమూ వున్నది, మనస్సూ వున్నది. రెండూ దక్షిణే. అందుకని యిందాక చెప్పిన భాగోజీ అనేవాడు సాయికి కాలిన బొబ్బ తగ్గిపోయిన తర్వాత గూడ ప్రతి రోజూ వచ్చి కట్టు కడుతూనే వుండేవాడు. వాడు వచ్చేదాకా ఆయనవుండి ఆ సేవ చేయించుకుంటుండేవారు. కాబట్టి భాగోజీ తనలో వుండే నిష్ఠకు, తనలో వుండే దక్షిణను సమర్పిస్తూనే వున్నాడు.

అధ్యాయం-8



సద్గ్రంథపఠన



మన లక్ష్యంలోనుంచి యువతలకులాగి వెనుకకు పడేసేటటువంటి, ఇందాకటినుంచి మనం చెప్పుకున్నటువంటి రజోగుణ, తమోగుణాలను సత్వ గుణంలోటి త్రోసి పారేసుకోవడానికి అవకాశం వుండేలా వాటిని గుర్తుపడుతూ వుండాలి. ఇవన్నీ తెలుసుకోమనే బాబా చెబుతున్నారు. "గురువును నమ్ముకో చాలు" అని బాబా చెప్పారు. ఒక ప్రక్క, బాబా సాధన షట్కము, షట్‌శాస్త్రాలూ అవసరం లేదన్నారు. ఇంకొక ప్రక్క - పనిచెయ్యి, దేవుని నామము ఉచ్చరించు, సద్గ్రంథాలు చదువు అన్నారు. శాస్త్రాలు అక్కర్లేదంటూ, సద్గ్రంథాలు చదవడ మేమిటి? ఆయన ఆ పదాలు వాడడంలోనే చాలా గొప్ప తనమున్నది. "సద్గ్రంథాలు పఠించు" అంటే మనం భగవద్గీత చదివేటప్పుడు అందులో గుణత్రయ విభాగం వ్రాసింది యిందుకోసం గదా! అని తెలుసుకుంటే చాలు- ఇక దాని ప్రయోజనం అయిపోయినట్లే.

ఒక చోట వేడుకలు జరుగుతున్నాయి. అక్కడి వాళ్ళు ఫలానా పోలిక లున్న మనిషి ఒకడు వస్తాడు. వాడు వస్తే వస్తువులు పోతాయి, జాగ్రత్త అని చెప్పాడనుకోండి, అప్పటిదాకా ఎవరినీ పట్టించుకోనివాళ్ళం అప్పటినుండి అటువంటి లక్షణాలున్న మనిషికోసం చూస్తాం. ఇక ఏమరుపాటుగా వుండే ప్రశ్నే లేదు. అలాగే భగవద్గీత ఏం చెబుతుందంటే - మన మనస్సులో వుండే అనేక మైన అంతరంగిక భావాలలో రజో, తమోగుణాలనే రెండు భావాలున్నాయి. వాటిని జాగ్రత్తగా కనిపెట్టమని చెబుతుంది. అంతవరకే దాని యొక్క ప్రయోజనం. అది చదివి ఆ ప్రయోజనాన్ని వెంటనే ఆచరించడానికి ఆరంభిస్తే అది సద్గ్రంథ పఠనమవుతుంది. అయితే ఆయన రెండింటినీ ఎందుకు చెప్పారు? ఒక ప్రక్క, సద్గ్రంథపఠన చేయమన్నాడు, ఇంకొక ప్రక్క, శాస్త్రపట్కం అక్కర్లేదన్నాడు. రెండింటికీ ఏమిటి సంబంధం? అవి రెండూ పరస్పర విరుద్ధమా? - అంటే ఎలా కాదో ఆయన చెప్పిన దానిలోనే వున్నది.

భారతంలో ఒక కథ వున్నది. పన్నెండు సం॥లపాటు భయంకరమైన

డొక్కల కరువు వచ్చింది. ఎవరైనా ఏదైనా తింటే వాడి కడుపు చీల్చుకునైనా తన ఆకలి తీర్చుకుందామనుకునే రోజులవి. ఎక్కడ చచ్చిన జంతువు దొరికినా పీక్కు తినే పరిస్థితిలో వుంది మానవాళి. అటువంటి సమయంలో ఆకలివల్ల ఒక ఋషికి తపోభంగమైంది. ఆయన వెంటనే ఆకలి తీర్చుకోవడానికి ఏదైనా దొరుకుతుందేమోనని అన్వేషిస్తూ బయలుదేరాడు. చివరకు కొన్ని యిళ్ళ మధ్య నుంచి వెళ్తుంటే ఒక పూరింటినుంచి దుర్గంధం వస్తున్నది. అప్పుడాయన అక్కడ చనిపోయిన మాంసం ఏదో వుంది తిందామని అనుకున్నాడు. తడిక తలుపు తీసుకొని లోపలికి వెళ్ళాడు. ఆ అలికిడి విని, ఇంట్లోవాడు లేచి, "ఎవడురా వాడు, ఈ కరువులో యింతకాలానికి ఒక చచ్చిన జంతువు దొరికితే దానిని తినగా మిగిలినదానిని రేపటికని దాచుకుంటే, దానిని తింటానికి వచ్చావుటరా" అని దుడ్డుకర్ర తీసుకొని కొట్టడానికి వచ్చాడు. కాని తీరాచూస్తే ఆయన మహర్షి! "ఎవరు మీరు? ఇలా ఎందుకు వచ్చారు?" అని అడిగాడు. తాను ఫలానా అని చెప్పి, "ఆకలి దహించుకు పోతున్నది, తినడానికి ఏదైనా పెట్టు" అని అడిగాడు మహర్షి. "నా వద్ద ఏమీ లేదు, ఈ చచ్చిన కుక్కమాంసం మాత్రం వున్నది - అదీ మేము తినగా మిగిలినది" అన్నాడతడు. "అదే పెట్టు తింటాను" అన్నాడు మహర్షి. వాడు ముద్ద పెట్టాడు. ఆయన తిన్నాడు. రెండవ ముద్ద పెట్టాడు, తిన్నాడాయన. మూడవ ముద్ద గూడ తిన్నాక, "ఇక చాలురా!" అన్నాడు మహర్షి. అప్పుడతడు ఆయనకు మళ్ళీ ఆహారం దొరకదేమోననే ఉద్దేశ్యంతో, "ఇంకొంచెం తినండి స్వామీ!" అన్నాడు. ఆయనకు కోపం వచ్చింది. "ఓరి వెధవా! నన్ను చచ్చిన కుక్క మాంసం తినమంటావుటరా!" అన్నాడు. "నేను ఋషీశ్వరుణ్ణి, కంద మూలాలు తిని తపోనిష్ఠలో వుండేవాణ్ణి, నన్ను కుక్క మాంసం తినమం టావుటరా?" అని మండిపడ్డాడు. అతడు, "ఇందాకటినుంచి మీరు తిన్న దేమిటి? ఇప్పుడు మీరు అంటున్నదేమిటి?" అని అడిగితే ఆ ఋషి, "ఇందాకటినుంచి తిన్నది ఆహారం, ఇక నుంచి అది చచ్చిన కుక్కమాంసం" అన్నాడు. క్షుత్తు నివారణై ప్రాణము నిలిచి, ధ్యానం అంతర్ముఖం కావడానికి సరిపోయేంత వరకు ఆవశ్యకమైనది ఆహారం. అది ఏ పదార్థమైనా సరే. ఆ పైన యిష్టంగా తింటామే, అప్పటినుంచి అది మంచిదా, చెడ్డదా అనే ధర్మ సూత్రం యిమిడి వుంటుంది. అలాగే భగవద్గీత చదువుతున్నప్పుడు గుణత్రయ విభాగంలో చెప్పినదానిని అవగాహన చేసు కున్నామనుకోండి. "ఓహో! మనం జాగ్రత్తగా గుర్తుపట్టినట్లయితే మనలో ఎప్పుడే

గుణం పనిచేస్తున్నదో తెలుసుకొని, వాటిని ఈ విధంగా నివృత్తి చేసుకోవచ్చు గదా!" అనుకొని ఆరోజు నుండే మనస్సును జాగ్రత్తగా గమనిస్తున్నామనుకోండి. "ఇది రజోగుణం కాబట్టి ఇది ఈ విధంగా పని చేస్తున్నది, అని గుర్తుపట్టడం ఎప్పుడైతే ప్రారంభిస్తామో, అప్పుడు మనం చేసేది సద్గ్రంధపఠన - అట్లాగాక, అదే భగవద్గీతను చదివి ఇది ద్వైతమా, అద్వైతమా, విశిష్టాద్వైతమా, ఏ శాస్త్రము? అని ఆలోచించామనుకోండి. అది శాస్త్రం-సాంఖ్యమా, వైదేశికమా, మీమాంసా?- ఇందులో ఏ సిద్ధాంతం సరియైనది? ఏది కాదు? అని ఆలోచించడం మొదలు పెట్టామంటే మనకు శాస్త్రపాండిత్యం తగులుకున్నది అని అర్థం. ఇక అందులో నుంచి బయటపడడం కష్టం. మామూలు మనిషికి ప్రాపంచికమైన రాగద్వేషమైన భావాలనుండి బయటపడడమనేది ఎలాగైతే వుండదో, అలాగే ఇది గూడా.

ఉదాహరణకు ఒకచోట ఇద్దరు కూర్చొని మూడవవాని గూర్చి చర్చించుకుంటున్నారనుకోండి-"ఒకడు వాడిట్లా చేసాడురా, అలా చేసాడురా, చాలా మంచివాడురా" అని అన్నాడనుకోండి. "ఛ, ఛ, వాడు చెడ్డవాడు, నీకేమీ తెలియదు" అని అవతలివాడన్నాడనుకోండి. వీడు మళ్ళీ వాడిలాంటి మంచి పనులు చేసాడు అని వీడంటాడు. 'లేదు, దొంగవేషం' అని వాడంటాడు. ఇక సూర్యచంద్రాదులున్నంత వరకూ వాడెలాంటి వాడోనన్న విషయాన్ని వాళ్ళిద్దరూ తేల్చుకోలేరు. ఎందుకంటే వాడు చెప్పేది వాడికెంత నిజమనిపిస్తుందో, వీడు చెప్పేది వీడికంతే నిజమనిపిస్తుంది. వీళ్ళిద్దరూ కూడా వాళ్ళ అంతర్యాలలోంచే మూడవ వాడిని చూస్తున్నారు గనుక ఆ మూడవ వాడి యొక్క అంతర్యం వీళ్ళిద్దరికీ తెలిసే అవకాశమే లేదు-

అందుకని బైబిల్‌లో ఒక అద్భుతమైన మాట చెప్పారు. - "Judge not, lest thou be Judged" 'దేనినీ అంచనా వేయకు జాగ్రత్త, నీవు అంచనా వేయబడతావు' అన్నాడు. వాడు దుష్టుడు, వీడు దుర్మార్గుడు అని అవతలి వాళ్ళను నీవు అంచనా వేస్తే, నిన్ను భగవంతుడు అంచనా వేస్తాడు. 'ఒరేయ్! నీ అర్హత ఎంతరా!' అని అడుగుతాడు. రూల్స్ మాట్లాడినవాడిని ఏంచేస్తాము, వెంటనే వాడిని రూల్‌తోనే పట్టుకుంటాము.

ఇతరులలోని లోపాలను ఎంచరాదనే దానిని మన పెద్దలు యింకొక రకంగా గూడ చెప్పారు: "ప్రక్కవాడి కంటిలోని నలుసు తీసేముందు నీకంట్లో వున్న దూలాన్ని తొలగించుకో" అని. ప్రక్కవాడి కంటిలోని నలుసుతీయడం

మంచిదే కాని ప్రతివాడి కంటిలోవుండే నలుసును వెతకటమనే గుణం అనే దూలం నీ కంటిలో వుంది తెలుసుకో అన్నారు. కంటిలో దూలం వుంటే ఏమవుతుంది? ఇక లోకం కనబడదు వాడికి. ఎక్కడ చూచినా దూలమే కనబడుతుంటుంది. అలాగే తప్పులెన్నే గుణంవుంటే ఏమౌతుంది? లోకంలో అన్నీ తప్పులే కనబడతాయి. చివరకు యితరులలోని తప్పులెన్నుట అనే గుణంవల్ల తనలోని తప్పులెన్నటం మానుకున్నాడు. తనలోని తప్పులెన్నడం ప్రారంభించగానే యితరులలోని తప్పులెన్నడం అనే గుణం తనలోని మొదటి తప్పుగా అర్థమవుతుంది. అందుకని మొదటగా దానిని తనలోనుండి తీసివేయాలి.

అలాగే భగవద్గీతలోని గుణత్రయ విభాగయోగం చదివినటువంటివాడు సాత్వికభావంగలవాడైతే తనలో వుండే రజోగుణ, తమో గుణాలను గుర్తుపట్టి సక్రమంగా వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తాడు. సాత్వికభావప్రధానుడు కానివాడు అవతలివాళ్ళ గురించి వీడు రజోగుణ ప్రధానుడు, వాడు తమోగుణ ప్రధానుడు అని చెప్తుంటాడు. అంతేగానీ తాను రజోగుణ, తమో గుణ ప్రధానుడవునోకాదో మాత్రం గమనించుకోడు. అలాగే మనం బ్రహ్మ తత్వానికి, ధ్యాన తత్వానికీ దగ్గరగా వెళ్తున్నామా లేదా, నిష్ఠ, సబూరీలు బాగా కుదురుతున్నాయా లేదా అనేది చూచుకునే బదులు, వీడిట్లా, వాడిట్లా అని వ్యాఖ్యానించడంలో మన బ్రతుకు తెల్లవారిపోతుంది. ఎందుకని? ఉన్న కాలమంతా వాటి గురించి ఆలోచించినా అది నిజమో, అబద్ధమో తేలదు. అది నిజమైనా, అబద్ధమైనా వీడికి ఒరిగేదేమీలేదు. ఇది ఎంతో ప్రమాదకరమైన విషయం! అందుకనే దేవతలుగూడ యిలా ప్రార్థన చేస్తారుట - "మా చెవులు ఎప్పుడూ శుభమునే వినుగాక!, మా కళ్ళు ఎప్పుడూ శుభమునే చూచుగాక!, మా జిహ్వా ఎప్పుడూ శుభమునే మాట్లాడుగాక! ఈ విధముగా మమ్ములను అనుగ్రహించు తండ్రీ!" అని మొరపెట్టుకుని ప్రార్థన చేసుకుంటారుట. అలా ఎందుకు ప్రార్థించాలి అంటే ఆలా శుభమైన విషయాలలోనే మనస్సు నిమగ్నమవడం వలన మనం బ్రతికి బయటపడడము, నిమగ్నం కాకపోవడం వలన మనం నాశనమై పదిమందిని నాశనం చేయడానికి తప్ప ఎందుకూ పనికిరాము కనుక. అందుకని వేదఋషులు ఏదైతే జాగ్రత్త అని చెప్పారో, అదే గీతాచార్యుడూ చెప్పాడు, మళ్ళీ సాయినాథుడు గూడా దానినే సూచిస్తున్నారు.

ఈ దక్షిణ, ఈ నిష్ఠ గురించి ఇప్పుడు క్రమంగా, జాగ్రత్తగా ఆలోచిస్తే

మనకేం తెలుస్తున్నదంటే ఈ నిష్ఠ, సబూరీలో ఒక్కదానిని సమర్పించినా చాలు- మన మనస్సు మొత్తాన్నీ ఆయన ఆక్రమిస్తాడు - వామనుడికి మూడు అడుగులే యిస్తానన్నా ఒక అడుగు భూమిని, మరొక అడుగు ఆకాశాన్ని ఆక్రమించి, మూడవ అడుగు, అతని నెత్తిమీదే పెట్టాడట! అలా మొత్తం ఆక్రమించాడట. అలాగే ఈ నిష్ఠ, సబూరీలు కూడా. ఇవి రెండు పైసలే గదా, అవేం చేస్తాయిలే అనుకోవడం పొరపాటు. ఒకసారి ఆయనకు నమస్కరించి, "నీవు సద్గురువువు. నీవు అంతటా నిండివున్నావు, నన్ను రక్షించు తండ్రీ!" అని ఎప్పుడైతే నమస్కారం చేశామో ఆయనకు మనం దక్షిణ సమర్పించామన్న మాట. దీనికి గుర్తెలాగంటే అది సాయి సూక్తుల్లో వుంది.

ఒకడికి భగవంతుడంటే అసలు విశ్వాసమే లేదు. అలాంటి వాడికి ఒక అనుభవం కలిగి బాబామీద విశ్వాసం కలిగింది. తర్వాత వాడు శ్రద్ధగా ఒక్కసారి నమస్కారం చేసాడు. తర్వాత వాడు తనలో కలిగిన భక్తి భావానికి తట్టుకోలేక అటుపోయినపుడు, యిటు పోయినపుడు వచ్చి నమస్కారం చేసుకుంటున్నాడు. జనం ఎక్కువగా వున్న సమయంలో తోసుకుని అవస్థపడుతున్నాడు. అప్పుడు వాడితో బాబా అన్నారు. "ఎందుకురా అలా తోసు కుంటావ్? నీవు భక్తిశ్రద్ధలతో చేసిన ఒక్క నమస్కారం చాలు" అని. అంటే బాబా అలా అనడంలోని ఉద్దేశ్యమేమిటి? అంటే నీవు నా గురించి ఏమి తెలుసుకుని నీవే సర్వస్వమని మనస్సులో ఏ భావాన్నయితే ఏర్పరచుకొన్నావో, అదే భావంతో నీవింతసేపు నిలుస్తావో, అంతసేపూ నీ జీవితమంతా కలిసి ఒక నమస్కారము. చేతులు కలిపినంత మాత్రాన నమస్కారం కాదు. వాడు కూర్చున్నా, నడచినా, నిలిచినా, లోపల అదేభావం వున్నంతసేపూ అదే మొట్ట మొదటి నమస్కారం. దానిలోనుంచి చలించవద్దనే ఆయన చెప్పేది. ఈ 'చలించవద్దు' అనేదానికి యింకా చెప్పారు బాబా. "ఆ విధమైన శ్రద్ధా భక్తులను చీపురు పుల్లమీద పెట్టుకున్నాసరే నీవు భగవంతుని చేరుతావు" అన్నారు. దక్షిణ సమర్పించగలగడం, నిష్ఠ మనస్సులో ఒక్కసారైనా భాసించడం సత్వ ప్రధానమవడం చేత జరుగుతుంది. అది స్థిరపడితే చాలు, రజోగుణ, తమో గుణాలు నశించిపోతాయి. అవి నశించి, సత్వగుణం స్థిర పడితే చాలు, జ్ఞాన మార్గానికి సరిపోయిన సంస్కారవంతుడైతే తీవ్రమైనటువంటి, పిదురిడికి కలిగినటువంటి చక్కని యోచన కలిగి, ఒక నిర్ణయానికి వచ్చి జీవితం దానికి అంకితం చేస్తాడు- బుద్ధుడిలాగా. అలాగాక భక్తి ప్రధానమైన సంస్కారం

కలవాడయితే రంగన్నబాబుగారిలాగా భగవంతుడు తప్ప మరేమీ లేదనే నిర్ధారణకు వచ్చి ఆ భగవంతుని మీదే ప్రాణమంతా పెట్టి నిలుస్తాడు. ఈ రెండు స్థితులూ వారికెలా కలిగాయంటే వాళ్ళ హృదయమంతా సత్వ ప్రధానంగా అయిపోయింది గనుక. రజోగుణానికి స్థానం లేకుండా చేసుకున్నారు గనుక. దానికే బాబా - "నీవు సరైన భావంతో నమస్కారం పెట్టావే, అది చాలు" అన్నారు.

అలాగే ఒకడు బొంబాయినుండి వస్తే, "నీడు నాకు నాలుగు సంవత్సరాలనుండీ తెలుసు" అన్నారు బాబా. అతడు శిరిడీ రావడం, బాబాను చూడడం అదే మొదటిసారి. "ఏమిటీ, ఈయన యిలా మాట్లాడుతున్నారు" అని వాడు జ్ఞాపకం చేసుకుంటే సరిగ్గా నాలుగు సం॥ల క్రితం మొట్టమొదటి సారిగా బాబా గురించి, వారి లీలలగురించి విని, "అబ్బ! ఇంత గొప్ప మహాత్ముడా ఈయన! ఈయనను తప్పకుండా దర్శించుకోవాలి" అని మన స్ఫూర్తిగా నమస్కారం చేసుకున్నాడు. అంతే, అయిపోయింది వాడు చేయవల సినది. ఇక అతడు బాబా లెఖ్ఖలోకొచ్చాడు. అంటే బాబా యిక్కడ చెబుతున్నదేమిటంటే, 'నీవు నిష్ఠలోకొచ్చావు, దక్షిణ సమర్పించావు. ఆ విధంగా నీవు 'ఎంట్రీఫీజు' కట్టావు గనుక నీపేరిక్కడ రిజిష్టర్ అయింది. 'ఇక కోడ్ ఆఫ్ కాండక్టు' చూడడం మొదలవుతుంది' అని. నీవు చేరకపోతే అడిగేవాడే లేడు. అందుకని ఆయనలోని పవిత్రత, ఉత్తమగుణాలు, సామర్థ్యం, ఆయనే విశ్వం అనే భావాలను హృదయ పూర్వకంగా నీవెప్పుడైతే పొందావో, ఆయనకు దక్షిణ యిచ్చేసావన్నమాట. ఇక దానినుంచి చలించకుండా వుండాలి.

"శ్రీగురుచరిత్ర" లో ఒకడు శ్రీ నృసింహ సరస్వతీస్వామి వద్దకు వచ్చి, 'నాగురువు కఠినాత్ముడు, నన్నెంతగానో వేధించాడు. నేను భరించలేక ఆయనను వదలిపెట్టి వచ్చేశాను. నాకు తరించడానికి మార్గం చెప్పండి' అన్నాడు. అప్పుడు శ్రీగురుడు, "గురువును కాదని వచ్చేసిన నీవు పనికిరావు, నీ ముఖంగూడ చూడకూడదు పో" అని అన్నారు. అంతేగాక తిరిగి ఆ గురువు వద్దకే వెళ్ళి ఆయననే సేవించుకోమన్నాడు. అపుడతడు, 'క్షమించలేనంతగా ఆయనను తిరస్కరించి వచ్చాను, ఇప్పుడు నా గతేమిటి" అని వాపోయాడు. అపుడు శ్రీగురుడతనిని అనుగ్రహించారు. అతడు ఆ గురువును వదలినా సద్గురువును ఆశ్రయించాడు గనుక సరైన మార్గం ఆయన చూపారు. లేకపోతే అతనికి అధోగతి తప్పదు. ఒకసారి ఒక గురువును ఆశ్రయించాక ఇక అతడు ఆయన సొత్తే. ఇక

ఆ నాణెం ఎక్కడా చెల్లదు. మనం చట్టంలోగూడ ఏమి చూస్తున్నాము? -'ఇది వీడిది' అని పట్టాగాని, రిజిష్టర్ కాగితంగాని వుంటే 'అది వాడిది' అని అంగీకరిస్తున్నాము. దానిమీద Violation అంతా Illegal క్రిందే లెఖ్ఖ.

దీనికి మిలారేపా అనే టిబెట్‌యోగి అద్భుత చరిత్రలో చక్కని ఉదాహరణ వున్నది. మిలారేపా గొప్ప కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి చనిపోయేసరికి మిలారేపా, అతని చెల్లెలు చాలా చిన్నవాళ్ళు. వాళ్ళ అమ్మ చాలా అమాయకురాలు, లోకజ్ఞానంలేని మనిషి. అందుకని మిలారేపా తండ్రిగారు తాను చనిపోబోయే ముందు తన బంధువులనూ, ఊరి పెద్దలనూ సమావేశపరచి, వారందరి సమక్షంలో దగ్గరి బంధువైన మిలారేపా పిన్ని, బాబాయిలకు ఆస్తి వ్యవహారాలను అప్పగించి తన పిల్లలు పెద్దవారయ్యేంత వరకూ ఆస్తిపాస్తులను సంరక్షించమనీ, తర్వాత వారికి అప్పగించవలసిందనీ చెప్పి మరణించాడు. కానీ ఆయన భయమే ఆ తర్వాత నిజమైంది. ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని వారిద్దరూ ఆస్తిని చేజిక్కించుకొని వాళ్ళే అనుభవిస్తూ వీళ్ళకు ఏమీ పెట్టకుండా చివరకు వీళ్ళను యింట్లోనుంచి వెళ్ళగొట్టారు. ఆమె తన సోదరుని సహాయంతో, కష్టపడి కూలీపనులు చేసు కుంటూ పిల్లలను పోషించుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నది. కాని ఆమె తన పిల్లలను చూసి, వీళ్ళిలా అయిపోయినారే అని హృదయంలో విపరీతమైన బాధ పడుతూండేది. తన పరిస్థితి గురించి ఎప్పుడూ దుఃఖిస్తూ వుండేది. అలాగే మిలారేపా 16 సం॥ల వాడయ్యాడు. ఒకనాడు వాళ్ళ అమ్మ బాధ పడుతుంటే, "యుక్త వయస్కుడనైన నేనుండగా నువ్వెందుకు బాధపడతావు? నీ బాధ ఏమిటో చెప్పు, నేను తీరుస్తాను" అన్నాడు. అప్పుడామె, 'నాకొక కోరిక వున్నది. వాళ్ళు మనలను ఎలాంటి క్షోభ అయితే పెట్టారో, అలాంటి క్షోభే వాళ్ళూ అనుభవిస్తుంటే చూడాలని వున్నది. చేతనైతే నా కోరిక తీర్చు' అన్నది. అతడు అలానే చేస్తానన్నాడు. వెంటనే ఆమె అతడు క్షుద్రవిద్యలు నేర్చుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసి పంపింది. అతడు క్షుద్ర విద్యలు నేర్చుకొని వచ్చి బంధువులను నాశనం చేసి తల్లి కోరిక తీర్చాడు. కాని అప్పటి నుంచి అతనికి ఆలోచన మొదలైంది. పూర్వం చేసిన పాపాలవల్ల మనమిలాంటి కర్మ అనుభవిస్తున్నాము గదా! మరి యిప్పుడు ద్వేషం పెంచుకొని మరల ప్రతీకారం తీర్చుకొనడంవల్ల మరల యిలాంటి కర్మ చుట్టుకొని అనుభవించవలసినదే గదా! మరి యిక నా గతి ఏమిటి? ఇలా అంతకంతకూ అంతం లేకుండా విజృం

భించి పోతున్నటువంటి చెడుయొక్క వలయంలోనుంచి బయట పడేదెలా? ఇప్పుడు నేను ఈ క్షుద్రవిద్యల గురువును ఆశ్రయించాను. ఇప్పుడు ఆయన వెళ్ళమంటే తప్ప వెళ్ళగూడదు కదా? ఇప్పుడిక ఏం చేయాలి?" అని ఆలోచిస్తుండేవాడు.

అప్పుడు వాడి అదృష్టంకొద్దీ ఒకానొకరోజున ఆ గురువు ఊరికిపోయి వచ్చి విచారంగా కూర్చున్నాడు. అప్పుడు మిలారేపా ఆయన విచారానికి కారణమేమిటని అడిగాడు. అప్పుడాయన యిలాఅన్నారు. "నాకు ఆత్మీయుడైన మిత్రుడు చనిపోయాడు. అతని భార్యాబిడ్డలు దిక్కులేనివాళ్ళై అలమటిస్తున్నారు. అతని మరణం నాకెంతో బాధను కలిగించింది. ఇప్పుడు నాకనిపిస్తున్నది - అసలు ఈ ప్రపంచం దుఃఖమయము. అసలే ఈ ప్రపంచం దుఃఖమయమై అంతా అలమటించిపోతుంటే, నేను క్షుద్రవిద్యలు నేర్చుకుని లోకంలో ఎంతమందిని చంపానో, ఎంతమంది నావల్ల దిక్కులేని వారయ్యారో గదా! అంతేగాక నన్నాశ్రయించిన వారికిగూడా యీ క్షుద్ర విద్యలు నేర్పి, వారిచేతగూడా దుఃఖమయమైన పనులు చేయించానే, ఇక నేను బాగుపడేదెలా? ఇతరులను బాగుపరచేదెలా? అని చాలా బాధకలుగుతున్నది. పోనీ యిప్పుడేదన్నా చేద్దామన్నా వయసు మళ్ళిపోయింది. ఈ ముసలితనంలో నేను చేయగలిగినదేమీ లేదు. కనుక నువ్వైనా యిక ఈ క్షుద్రవిద్యనుమానేసి ముక్తి పొందడానికి ప్రయత్నించు" అన్నారు. మిలారేపా కోరుకుంటున్నదిగూడా అదే గదా! "అలాగే చేస్తాను, ఆ మార్గమేదో మీరే తెలుపండి" అన్నాడు మిలారేపా. ఆయన తనకు తెలిసిన, గురువైన మార్పాగారి దగ్గరకు పంపాడు. మిలారేపా మార్పాగారి వద్దకు వెళ్ళి దాపరికం లేకుండా తన సంగతంతా చెప్పుకుని, తనకు ముక్తిమార్గాన్ని చెప్పమని వేడుకున్నాడు. ఆయన అంగీకరించారు. కాని వెంటనే ఉపదేశమివ్వక కష్టమైన పనులు చేయించసాగారు. ప్రతీసారి ఈ పనిచేస్తే నీకు ఉపదేశమిస్తానని చెప్పడం, ఆ పని పూర్తిగాకుండానే మరొక పని చెప్పడం యిలా యెంతో కష్టపెట్టసాగారు. ఆయన అందరి పట్లా ఎంతో దయగలిగి వుండేవారు కాని యితని పట్ల ఎంతో కఠినంగా ప్రవర్తించేవారు. చివరకు గురుపత్ని గూడా అతను పడే కష్టం చూడలేక గురువుగారు వ్రాసినట్లు ఒక కాగితం వ్రాసి గురువు పంపిన గుర్తుగా కొన్ని వస్తువులిచ్చి గురువుగారికి ముఖ్యశిష్యుడైన గోగ్డన్ వద్దకు ఉపదేశానికి పంపింది.

గురువుగారి ఆజ్ఞను గోగ్డన్ ఎంతో సంతోషించి అద్భుతమైన సాధనలు మిలారేపాకు నేర్పాడు. కాని ఎన్నిరోజులైనా ఫలితం రావడంలేదు. అతడాశ్చర్య పోయి, "ఏమిటి? నువ్వింత కష్టపడి సాధన చేస్తున్నా ఫలితం రాకపోవడం ఆశ్చ ర్యంగా వున్నది. పోనీ గురువుగారి అనుమతి లేదేమోననుకుంటే అదీ వున్నదిగదా! నాకేమీ అర్థంగావడం లేదు" అన్నాడు. అప్పుడు మిలారేపాకు భయమేసి జరిగిన సంగతి మొత్తం చెప్పేశాడు. అప్పుడు గోగ్డన్, "ఎంతపని చేశావు మిలారేపా! ఒకసారి ఒక గురువువద్ద, 'నీవే నా గురువు, నా సర్వస్వం' అని ఎప్పుడైతే చెప్పావో, ఇక ఆయన వద్దనుండి అభయము, అనుమతీ వస్తే తప్ప - ఇక నేను గాదు, ఈ ముల్లోకాలలోనూ ఎవరి వద్ద ఏమినేర్చినా రాదు, కనుక నీవు తిరిగి ఆయన వద్దకే వెళ్ళు" అన్నాడు. కాని వీడికి అక్కడికి వెళ్ళడానికి ధైర్యం చాలలేదు. చెప్పకుండా దొంగతనంగా వచ్చాడు. ఎట్లా వెళ్తాడు అక్కడికి? తాను అక్కడ వుండి గురువు గారు చెప్పినట్లు చేస్తుంటేనే ఆయన తన మీద కారాలు, మిరియాలూ నూరు తున్నాడే, ఇక యిప్పుడు తానువెళ్తే అసలు రానిస్తాడా? గురువుగారి సంగతి గోగ్డన్‌కూ తెలుసు! అతడూ ధైర్యంచేసి మిలారేపాను పంపలేకపోతున్నాడు.

ఇలా వున్న సమయంలో ఒకరోజు మార్పాగారి వద్దనుంచి కబురు వచ్చింది. తన కొడుకు ఉపనయనానికి గోగ్డన్‌ను రమ్మనీ, అతనితో ఆ వెధవ మిలారేపాను కూడా తీసుకొని రమ్మనీ కబురు చేసారు. ఇంకేం? మిలా రేపాను తీసుకుని అతడు ఉపనయనానికి హాజరయ్యారు. ఒకరోజు గురువు గారు అందరినీ సమావేశపరచారు. మిలారేపాకు ఎందుకు ఉపదేశం చేశావని గోగ్డన్‌పై విరుచుకుపడ్డారు. అందులో తన తప్పేమీలేదని, తమరు పంపిన చీటి, వస్తువులు ఆధారంగా తానాపని చేసాననీ చెప్పాడతడు. అప్పుడు మిలారేపాను పిలచి ఆ వస్తువులు నీకెక్కడివని అడిగారు. అమ్మగారిచ్చారని అతడు చెప్పాడు. ఆయన ఆమెను కొట్టడానికై ఆమెమీదకు పరిగెత్తేసరికి ఆమె తప్పించుకొని దాక్కుంది. తర్వాత కొంతసేపటికి ఆయన శాంతించి అందరినీ పిలిచి యిలా అన్నారు: "ఇందులో ఎవరి తప్పూ ఏమీలేదు. మిలా రేపా దొంగతనంగా వెళ్ళింది ఉపదేశం కోసమే గదా! వాడిలోని ఆత్మ, జ్ఞానం పొందాలనే జిజ్ఞాస ఆపని చేయించింది. కనుక వాడిదేమీ తప్పులేదు. ఇక గోగ్డన్ తప్పుకూడా ఏమీలేదు. అతడు నా ఆజ్ఞ వున్నదనుకునే ఉపదేశమిచ్చాడు. ఇక నా భార్య విషయానికొస్తే, ఆమె గూడ ఉత్తముడైన బిడ్డకు ఉత్తమమైన మార్గాన్ని పొందడానికి మాతృప్రేమతో దోహదం

చేసింది. కనుక ఆమెదీ తప్పులేదు. అప్పుడు మరి ఎవరిది తప్పు?" అని మిలారేపాతో ఈ విధంగా అన్నారాయన, ఇందులో నువ్వు అర్థం చేసుకోవలసిన విషయమొకటి వున్నది:

గత జన్మలో నువ్వు చేసిన దోషాలుగాని, ఈ జన్మలో క్షుద్రశక్తులవల్ల నువ్వు చేసిన ఘోరమైన కర్మల ఫలంగాని, నేను నిన్ను 9 సార్లుగా చిత్ర హింసలు పెట్టినట్లయితే ఆ పాపాలు క్షాళన అయిపోయి తర్వాత సునాయాసంగా నీ సాధన పూర్తయివుండేది. కాని నేనెంత ప్రయత్నించినా 8 సార్లు మాత్రమే చేయగలిగాను. కాని అంతకంటే చేయలేకపోయాను. ఎందుకనంటే - నీ కర్మ బలంగా వుండడం వల్ల నేను 9వ సారి నిన్ను కష్టపెట్టబోయినప్పుడు, నేను తప్ప నిన్ను ఆత్మజ్ఞానాన్ని పొందేలాగా చేసేవారు యింకెవరూ లేరని తెలిసినప్పటికీ గూడ, ముక్తిని సునాయాసంగా పొందడానికి వీలులేని నీ దుష్కర్మ, నాభార్య (గురుపత్ని) లో చొరబడి నిన్ను నానుంచి దూరమయ్యేలా చేసింది. కాబట్టి నేను చేయగలిగినంత వరకూ చేసాను. ఇక మిగిలినది నువ్వు అనుభవించవలసినదే" అని చెప్పారు. ఆ తర్వాత అతడు మంచుకొండలలో, గుహలలోవుండి ఎన్నో కష్టాలకోర్చి తపస్సు చేయవలసి వచ్చింది.

దీనిని బట్టి మనం తెలుసుకోవలసినదేమిటంటే ఒకసారి శ్రద్ధాభక్తులతో నమస్కరించినా, దక్షిణ సమర్పించినా, నీవే దిక్కని మనస్ఫూర్తిగా శరణు పొందినా, మనం ఆయనకు దక్షిణ సమర్పించామని అర్థం. ఇక మనం ఆయన సొత్తు అన్నమాట. ఆ దక్షిణ యివ్వడం అంటే తిరిగి తీసుకోకపోవడం అన్నమాట. అందువల్ల క్రమంగా మన జీవితంలో ఒక గంటో, రెండు గంటలో మనం సాధనకు దగ్గరవడమనేది క్రమంగా మనలను అల్లుకుంటూ ఆక్రమించి వేస్తుంది. తర్వాత మన ప్రతి ఆలోచనలోనూ, చర్యలలోనూ సదా అన్నింటి లోనూ అయనే వున్నాడనే భావం నిలిచిపోతుంది. వామనుడికి మూడడుగుల స్థలమిస్తే అంతటా ఆక్రమించినట్లు రోజులో మనం ధ్యానం చేసుకొని, చరిత్ర చదువుకునేటందుకు ఒక గంటో, రెండు గంటలో పెట్టుకున్నందుకుగాను, ఆయన మన జీవితమంతా ఆక్రమించేస్తాడు. చివరకు మన జీవితమంతా విష్ణను నిలుపుకునే ప్రయత్నంగా మారుతుంది. సాయి, "నీకు వున్న లౌకిక ధర్మాలన్నింటినీ నిర్వర్తించుకో, నీ కర్తవ్యాలను నిర్వర్తించుకో, యిన్నింటిలోనుంచి స్మరణను మాత్రం గుర్తు పెట్టుకుంటూ వుండు, స్మరణను తొలగించేటటువంటి రజో, తమోగుణాల వంటి,

యితర వికారాలను గుర్తించేటటువంటి ఈ వాడాలోని దొంగలను గుర్తుపట్టు. ఆ విధంగా నీవు జాగరూకుడవై వుండగలిగితే నామీద నీదృష్టి నిలుపగలుగుతావు. అలా నిలుపగలిగితే నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను; మధ్యలో విడువను" అన్నారు. "అయితే ఒక్క షరతు, నీవు నాపై దృష్టి నిలిపితే, నాదృష్టి నీపై నిలువుతా, నీ దృష్టి ప్రక్కకు తొలగించే 'వాడాలో దొంగలున్నారు జాగ్రత్త' అని హెచ్చరిక చేస్తున్నా" అన్నారు. అంటే Total teaching యిచ్చారన్నమాట. "శాస్త్రపట్కాం అక్కర్లేదు, సద్గ్రంధాలు చదువు" అన్నారు. అంటే భగవద్గీతవంటివి చదువుతున్నపుడు, అందులో వుండే గుణత్రయ విభాగంలాంటివి చదువుతున్నపుడు అందులో చెప్పినదానిని గుర్తుపట్టి ఉపయోగించుకోడానికి చేసే పఠన మాత్రమే సద్గ్రంధ పఠన. అలాగాక సిద్ధాంతాల వలయంలో, మమకారాల వంటి వానిలో యిరుక్కుని ఆ భావంతో చదువుతున్నాడంటే అవి శాస్త్రపట్కాం అవుతుంది. సద్గ్రంధ వాసన-శాస్త్రవాసన వేరు. సద్గ్రంధవాసన సత్తుకు తీసుకుపోతుంది. దానిని మరొకదానికి వినియోగించుకొంటే అది శాస్త్రపట్కాం అవుతుంది. దీనినే గురుగీతలో ఇలా చెప్పారు: "తేనెటీగ పువ్వులో వున్న తేనెను మాత్రమే తీసుకొని పువ్వును ఎలాగైతే విసర్జిస్తుందో, అలాగే సకల శాస్త్రాలు చదువు. వాటిని చదివేటప్పుడు ఏవిధంగా నీ మనస్సును వుంచుకుంటే సాధన మీద గురి కుదిరి ప్రయోజనం కలుగుతుందో తెలుసుకొని అందుకు కావలసిన యత్నాన్ని నీవు చేసుకుంటూ వెళ్ళు"

ఉదాహరణకు మనం ఒక గడియారం కొన్నప్పుడు, ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే అది చెడిపోకుండా వుంటుందో అటువంటి సూచనలు వున్న కాగితం షాపువాళ్ళు యిస్తారు. దానిని చూడకుండా అలాగే పెట్టి గడియారాన్ని వాడుతున్నామనుకోండి. మనకు ఎలా వాడాలో తెలియకపోవడం వల్ల అది చెడిపోతుంది. అలాగాక Instruction కాగితంలో వుండేది చదువుకొని, మొదటినుండి జాగ్రత్త పడి ఆరోజునుండే ఆ ప్రకారం చేస్తే మూడో రోజునుండి యాంత్రికంగా ఆ పనిని చేసేస్తాము. అప్పుడు మనకు ఆ సూచన కాగితంతో ఏమి పని? అలాగే నీలో వుండే గుణాన్ని గుర్తుపట్టి, జాగ్రత్తపడడం తెలిసినప్పుడు ఇక ఆ అధ్యాయంలో వుండే శ్లోకాలతో మనకేమి అవసరం? విష్ణుసహస్రనామం భావయుక్తంగా కంఠస్థమైన తర్వాత ఆ పుస్తకంతో మన కేమి పని? అంతఃశుద్ధి కలిగిన తర్వాత బాహ్యాచరణాలలో వుండే భేదాలపట్ల అసహనం దేనికి? అన్నిం

టిలో బాబా వున్నారని ఆయన చేసిన లీలలను ప్రత్యక్షంగా చూచినవాడికి అవతలి వాడి మీద కోపంవల్ల వాడు పెట్టిన ప్రసాదం తీసుకొనకపోవడమెందుకు? అంటే బాబా సూక్తులు, లీలలలో నిరూపణ అయిన సత్యాలు-మొత్తం శాస్త్రవాసనగా, లంపటంగా మారిపోయిందన్న మాట. మళ్ళీ వాణ్ణి కదిలిస్తే చాలు - బాబా సామాన్యుడు గాడు, ఆయనకన్నీ తెలుస్తాయి, నాకు యిట్లా జరిగింది, అట్లా జరిగింది అని చెబుతాడు. కానీ, "వాడు పెట్టింది నేను తినను" అంటాడు. అప్పుడు మాత్రం యిది పని చెయ్యదు, ఆ రెండింటికీ సమన్వయం కుదరదు. అందుకని ఈ విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలి. ఇది ఎవరికి వాళ్ళు తీసుకో వలసిన జాగ్రత్త మాత్రమే. అది పూర్తిగా కుదిరిన తర్వాత మాత్రమే ఎవరికైనా సాధన పూర్తవుతుంది.

జేబులో పర్సుపెట్టుకొని ఎవరూ జేబు కొట్టేయకుండా రైల్లో ప్రయాణించడమనేది ప్రతివాడూ తెలుసుకోవలసిన విషయం. అలాగే అందరిలో బాబా వున్నాడన్న విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ వుండాలి. ఇది జాగ్రత్తపడకపోతే ఏం జరుగుతుందో, నేటి ఆశ్రమాలను చూస్తే తెలుస్తుంది. అక్కడ ప్రతి వాడూ తమ గురువు సర్వత్రా నిండివున్నాడనే చెబుతూ వుంటాడు. కాని తానెంతగా ఆ భావాన్ని నిలుపుకుంటున్నాడో చూసుకోకుండా ప్రక్కవాడు అలా వుండడంలేదని అంటూ వుంటాడు. నేను అనేక ఆశ్రమాలలో వుండి చూచాను గనుక నాకు తెలిసింది. అందుకని నేను ఏ ఆశ్రమంలోనూ వుండడాన్ని యిష్టపడను. అసలు వుండకూడదు కూడా. ఎందుకంటే అలాంటి వాళ్ళవల్ల క్రమంగా మనకుగూడ అదే అభ్యాసమవుతుంది. అందుకని ఆశ్రమాలకు వెళ్ళినప్పుడు దర్శనం చేసుకురావాలి, ధ్యానం చేసుకునిరావాలి, పారాయణ చేసుకుని రావాలి. అంతేగాని అక్కడ ఎక్కువ కాలం వుండకూడదు. బాబా తాను అన్నింటిలో వున్నానని నిరూపించినా గూడ ఎవరితోనైనా భేదాభిప్రాయం వచ్చినప్పుడు ఆ సంగతి ఏమరుపాటు వస్తుంది. వాడు శాస్త్రాధ్యయనం చేసినప్పుడు, శాస్త్రాన్ని ఎక్కడపడితే అక్కడ చెప్పగలడు కాని ఆచరణలోకి రాదు. ఇదే విషయాన్ని దెబ్బకొడుతూ బాబా ఒక విషయం చెప్పారు:

రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేసే ఠాకూర్ అనువతడు అప్పా అనే కన్నడ మహాత్ముణ్ణి దర్శించాడు. ఆయన అతనితో, "నీవు ఉద్యోగరీత్యా ఉత్తర దిశకు వెళ్తావు. అప్పుడొక మహాత్ముని దర్శిస్తావు" అని చెప్పారు. 'విచార సాగరము'

అనే గ్రంథాన్ని అతనికిస్తూ దానిని చదవమని గూడ చెప్పారు. ఆ తర్వాత అతడు ఉత్తర దిశగా వున్న జున్నూరుకు బదలీ చేయబడ్డాడు. అక్కడకు వెళ్ళేదారిలో నాన్నేఘాట్ అనే పర్వతకనుమ దాటాలి. అది మామూలుగా ఎవ్వరూ దాటలేరు. దున్నపోతుమీద ప్రయాణం చేయవలసిందే. అది యెంతో కష్టంతో కూడినపని. ఆ తర్వాత ఒకసారి బాబా గురించి విని బాబాను దర్శించాడు. అప్పుడు బాబా అన్నారు: "ఇక్కడ మార్గం అప్పా చెప్పినంత తేలిక కాదు. దున్నపోతుమీద నాన్నేఘాట్ దాటడం కంటే గూడ కష్టం" అని. అంటే అతడు అప్పా అనే మహాత్ముణ్ణి దర్శించాడని, దున్నపోతు మీద నాన్నేఘాట్ దాటి, ఒళ్ళంతా హూనం చేసుకున్నాడనీ బాబాకు తెలుసు. ఆ సంగతి మనం తెలుసుకుని ఆయన సర్వజ్ఞులని మనం గ్రహించవలసిందే. కాని ఆయన అప్పా చెప్పిన మహాత్ముడివి నేనే అని చెప్పలేదు. అందుకని అనుక్షణం మన హృదయంలో వచ్చే భావాలను గుర్తుపట్టి సరిచేసుకోవడంలోనే మన సాధన వుంది. అందుకే సాయి సూక్తుల్లో ధ్యానం గురించి తన గురువు గురించిన సందర్భాలలో మాత్రమే రూపంతో గాని, రూపంలేకగాని ధ్యానం చేయి, 'సాయి సాయి' అంటూ వుండు అని, ఒకటి రెండు సూక్తులు మాత్రమే వున్నాయి గాని ఎప్పుడూ మన భావాలను సరిజేసుకునే సూక్తులే ఎక్కువ వుంటాయి. ఈ భావాలను సరిజేసుకునేసరికి సర్వదా, సర్వత్రా ఆయనే వున్నారనే భావం నిలుస్తుంది. ఆ భావం నిలిచాక అనన్యమైన చింత, సత్వగుణం, దైవీసంపద కలుగుతాయి. ఇంక ఇంతకంటే చేయవలసిన సాధన ఏమున్నది? అందుకే బాబా "నేను చెవిలో ఉపదేశించను, మా సాంప్రదాయం వేరు' అన్నారు. 'మరెలా ఉపదేశిస్తారు?' అంటే జీవితంలోని సంఘటన లన్నింటి ద్వారా ఉపదేశిస్తానన్నారు. నీ మనస్సులో సందేహం వస్తే ఫలాని దేవాలయానికి వెళ్ళి పురాణం విను. నీవు వెళ్ళేసరికి నీ శ్లోకానికి వివరణ అక్కడ దొరుకుతుంది. వినే సామర్ధ్యం నీకుండాలి గాని ఎన్ని నోళ్ళు, ఎన్ని రూపాలు వున్నాయో అన్నింటిలోంచి నేనే మాట్లాడుతాను. ఒక టైములో, ఒక నోటితో, ఒక మంత్రం, ఒకప్పుడు చెప్పడం కాదు. వినే సామర్థ్యం నీకుండాలే గాని పురుషసూక్తంలో పురుషుని సహస్రముఖునిగా చెప్పినట్లు సహస్రముఖాల నుండి, వ్యక్తులనుండి, సహస్రవిధాల నిత్యబోధ జరుగుతూనే వుంటుంది. అందుకని నా బోధ ఒక ప్రక్క నుంచి రాదు అని చెప్పారు బాబా. కాబట్టి సాయి ఏమీ బోధించలేదా? అంటే ఆయన బోధించనిదే లేదక్కడ. ఆయన చెప్పినదాంట్లో రానిదే లేదు. అయితే ఆయన చెప్పినదేమిటి? నీ గురువు

మ సంపూర్ణంగా నమ్ముకో చాలు అని చెప్పారు. అంటే నిష్ఠ, సబూరీలు అని చెప్పుకున్నామే, దానిని గుర్తుపెట్టుకొని ఆచరణలో పెట్టుకో అన్నారు. అప్పుడు జీవితం నిరంతర నిష్ఠగా సాగుతుంది. ఆయన చెప్పిన దృష్ట్యా ప్రపంచాన్ని చూడడం నేర్చుకోవాలి. దానికి అడ్డం వచ్చే వాటన్నింటినీ సద్గ్రంథపఠన ద్వారా, బాబా చెప్పిన సూక్తుల సమన్వయం ద్వారా వాటిని గుర్తు పట్టి రజో, తమో గుణాలను తొలగించుకునే ప్రయత్నం చేయాలి.



అధ్యాయం-9

శ్రద్ధ



మన లక్ష్యంకోసం నిరంతరం ప్రయత్నం చేయడానికి మనకు ఆ లక్ష్యం మీద శ్రద్ధ వుండాలి. మనకు వెంటనే కుదరవచ్చు, కుదరకపోవచ్చు. కాని ప్రయత్నం చేస్తున్నది, పట్టుదలగా ప్రయత్నిస్తున్నది దానికోసమే గదా! ఏ లక్ష్యంకోసం ఆయననాశ్రయించామో ఆ లక్ష్యం కొనసాగుతుంటే మనం ఆయనకు దక్షిణ యిచ్చినట్లే లెక్క. "మనకు కోపం రాకుండా వుందా? అసూయ రాకుండా వుందా? ద్వేషం రాకుండా వుందా?' అని ఆయన అడగడం లేదు. అవి అడ్డుపడుతున్నప్పుడు దాన్ని తొలగించుకోవడానికి నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నావా? దానికి నేనిచ్చిన సౌలభ్యాన్ని ఉపయోగించుకుంటున్నావా? నీ మనస్సు ఆ విధంగా నిన్ను సంస్కరించుకునే వైపుకు మ్రొగ్గుతున్నదా? లేక నీలో వుండే భావాలను కొనసాగించుకునే వైపు మ్రొగ్గు తున్నదా? నీకు మనస్సులో వుండే వాటిపై మ్రొగ్గే కనుక వుంటే నీ మనుస్సుకు నీవే దక్షిణ సమర్పించుకుంటున్నావన్నమాట. నేను చెప్పిన మార్గం వైపుకు మొగ్గుచూపితే దక్షిణ నాకు సమర్పించుకుంటున్నావని అర్థం" అని చెబుతున్నారు బాబా.

అందుకని అనుక్షణం సాటిజీవులపట్ల, మానవుల పట్ల మనకుండే భావం పరమ పవిత్రమై, మనలో ఏమి వున్నదో వాళ్ళలోనూ అదే వున్నది: వాళ్ళ కష్ట సుఖాలు, శ్రేయస్సు నా కష్టసుఖాలు, శ్రేయస్సువంటివేనని ఒకరికొకరు గుర్తుపెట్టుకొని అందరిపట్ల ఆత్మీయతనువహించి ఉత్తమమైన ప్రవర్తన, ఉత్తమమైన భావాలు అలవరచుకోవాలి.

మనం సద్గురు సాన్నిధ్యానికొచ్చాము. అయన సన్నిధిలో అనేక అనుభవాలు మనకు కలిగాయి. నీపాటి వారికి గూడ కలిగాయి. వాటివల్ల అన్ని రూపాలలో ఆయనే వున్నాడని అవగాహన ఏర్పడింది. సద్గురువు యొక్క మహిమ వల్ల, ఆయన బోధనా దక్షతవల్ల నీకు శ్రద్ధ ఏర్పడింది. ఆయన ఆచరణద్వారాను, వాక్కు రూపంగా బోధించినవాటిని ఆచరణలో పెట్టుకునే ప్రయత్నం ఆరంభించాము - ఈ మొత్తమంతా కలిసి మనకు గురువుమీద వుండే శ్రద్ధలో ఒక

భాగము. ఆ శ్రద్ధను చలించనివ్వగూడదు. చలించనిచ్చామంటే యివన్నీ మధ్యలోనే ఎగిరిపోతాయి. సద్గురువు యొక్క సాన్నిధ్యం వలన మాత్రమే సాధన నిర్దుష్టంగా జరుగుతుంది. ఎందుకంటే జీవితంలో అనుక్షణం వచ్చే భావాలను ఎలా సంస్కరించుకోవాలో, నిష్ఠను పాడుచేసే భావాలను ఎలా తొలగించు కోవాలో సద్గురువు బోధలద్వారానే తెలుస్తుంది. కొందరు, 'ఇదిగో! ఈ లక్ష జపం చేస్తే సిద్ధిస్తుంది' అంటారు. లక్షే కాదు, అక్షరలక్షలు చేసినా సిద్ధించదు. ఎలా సిద్ధిస్తుంది? దానికి ఒక కండిషన్ వుంది. నీలో దైవీ సంపద, సత్వగుణం వుంటే తప్పక సిద్ధిస్తుంది. అదిలేకపోతే సిద్ధించే ప్రశ్నే లేదు. ఉదాహరణకు నీవీమందు తీసుకో, రోగం తగ్గిపోతుందన్నారనుకోండి. నీవు ఆ మందు తీసుకుంటే కొండ మీదనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటే బ్రతుకుతావని కాదు. అలాంటి వేమీ చేయకుండా మందు తీసుకుని పథ్యం చేస్తే తప్పక రోగం తగ్గుతుంది అని అర్థం. శాస్త్రంలో చెప్పిన సదాచరణకు ఆయువుపట్టు ఆంతరంగిక శుద్ధి. ఇప్పుడు మనం చెప్పుకున్నవన్నీ వేదాలలో చెప్పినవే. వేదవిదులు ఏం చెబుతున్నారంటే - పతివ్రత యైన స్త్రీ తన సౌందర్యాన్ని తన భర్తకు మాత్రమే ఎలాగైతే సమర్పి స్తుందో, అలాగే అర్హుడైన ఏ ఒక్కనికో వేదం తనఅంతరంగాన్ని ఎరుక పరుస్తుంది. వాడే వేద విదుడు. అంటే వేదాలలో చెప్పబడివున్న దాని ఆయువు పట్టును పట్టుకొని ఆచరించాలి అని చెబుతున్నారు. ఒకటి మాత్రం స్పష్టం. ఉన్నది బ్రహ్మమే. మన అజ్ఞానంవల్ల జగత్తుగా గోచరిస్తుందన్నది స్పష్టం. అయినప్పుడు మన మనస్సు యొక్క స్థాయిలో మార్పేగాని వున్న వస్తువులో మార్పు వుండడం కాదు. మన సాధనవల్ల అది దైవ స్వరూపంగా మారడంగాదు, వున్న దైవ స్వరూపం అంతకు ముందు జడస్వరూపంగా అనిపించింది, శ్రద్ధగా మననం చేయడం వలన యిప్పుడు దానిని గుర్తుపట్టడం జరిగింది అని మనకు తెలుస్తుంది. ఇది తెలియక ప్రాణ ప్రతిష్ఠ చేస్తే దానిలో ప్రాణం వస్తుందంటారు. ప్రాణం విశ్వవ్యాప్తంగా ఎప్పుడూ వున్నది. అందులోనూ ప్రాణమున్నదని మనం అనుభవ పూర్వకంగా దానిని గుర్తించగలిగినపుడు అందులో వున్న ప్రాణం మనపట్ల జాగృతమవు తుంది. విశ్వమంతా ప్రాణమయమైవుంటే మనం ప్రతిష్ఠ చేయడమేమిటి? ఇక్కడవున్న ఖాళీస్థలంలో మనం మందిరాన్ని ప్రతిష్ఠ చేసు కున్నామనుకోండి. అక్కడ ఖాళీగావున్న ఆ ప్రదేశాన్ని మనం ప్రతిష్ఠ చేసు కున్నట్లా? అలాగే విశ్వమంతా వ్యాపించివున్న ప్రాణశక్తిని ఎప్పుడు ఎలా ప్రతిష్ఠ

చేయుగలము? అంటే ఇక్కడ జరగవలసినదేమిటంటే అందులో వున్నది ప్రాణశక్తి అనే భావాన్ని యిక్కడ ప్రతిష్ఠ చేసుకోవడము, దానిని అనుభవంలో గుర్తించడమూ మాత్రమే.

సాధనంతా మన భావం మారడము, సృష్టిపట్ల మన వైఖరి మారడమే. మన భావన మనోమయం కాబట్టి మార్పు మనస్సులో రావాలి, అంతరంగంలో రావాలి. సాధనయొక్క విలువ మనఅంతరంగాన్ని మార్చడమే అవాలి. ఉన్నది యావత్తూ భగవన్మయం, మన అజ్ఞానం చేత జగత్తుగా కనబడుతున్నది. జ్ఞానం కాని, అజ్ఞానంగానీ చైతన్యాన్ని ఆశ్రయించి వుండగలదు. చైతన్యంలేని వస్తువు ఎలా వుండగలదు? కాబట్టి జ్ఞానాజ్ఞానాలు రెండూ చేతనామయం. మనలో వుండే చైతన్యం అజ్ఞాన స్థాయిలో వున్నది గనుక మనకిది జగత్తుగా గోచరమవుతున్నది. అది జ్ఞాన స్థాయికి వచ్చినప్పుడు బ్రహ్మమయంగా గోచరమవుతుంది. కాబట్టి చైతన్యంలో మార్పుతేవడం కోసమే సకల సాధనలు, సకల ఆచారాలూ వున్నాయి. కాబట్టి ఆచారకాండయొక్క ప్రయోజనం చైతన్యంలో పరివర్తన తేవడమే. అంతఃశుద్ధి ప్రధానంగాను, లక్ష్యంగానూ వున్నదే ఆచారము అనే సంగతి మరుగునపడి, బాహ్యా చరణ ప్రధానమవడం ఎప్పుడైతే ప్రారంభమైందో అప్పుడు అంతరంగ శుద్ధికి బదులు బాహ్యమైన శుద్ధి మొదలవుతుంది. ఇక ఆధ్యాత్మికతకు అక్కడ తావేలేదు.

మనకు అంతఃశుద్ధి కలిగించే అచారాన్ని బాహ్య శుద్ధి లేక బాహ్యా చరణ కోసమే వాడినపుడు ప్రయోజనం ఎలా కలుగుతుంది? అసలు శాస్త్ర మేమిటో, వాటి పరమార్థమేమిటో తెలియదు. వాటి పరమార్థం మన దృష్టి, మన చైతన్య స్థితిలో మార్పు రావడమనే ఫండమెంటల్ ట్రూత్‌ను మరిచిపోయి ఎవరు చెప్పినా అది సత్యం అవుతుందా?

ఉదాహరణకు ప్రతి 5 ని॥లకు ఒకడికి వాంతులు అవుతున్నాయనుకోండి. అది గుడ్డలమీద పడి చాలా అసహ్యంగా తయారవుతున్నదనుకోండి. డాక్టరు దగ్గరకెళితే వాంతి అయినప్పుడల్లా ఒంటిపైన క్రిందినుంచి పైదాకా గుడ్డ కప్పుకుంటే సరిపోతుందని చెప్పాడనుకోండి. అది సరైన పరిష్కారం ఎలా అవుతుంది? అలాగాక లోపలకు ఒక మాత్రయిస్తే వాంతులు అవడమే ఆగుతాయి. అలాగే సకలశాస్త్రాల ప్రయోజనం ఒక్కటే - మన అంతరంగాన్ని మార్పు చేయడం. అజ్ఞాన దృష్టి నుండి జ్ఞాన దృష్టిలోకి తీసుకొని రావడం. కాబట్టి ప్రతి

ఆచరణగూడ మన అంతరంగాన్ని మార్పుచేసే పనిముట్టన్నమాట. ఆచరణకు, అంతరంగానికి సంబంధమేమిటో అర్థంకాకపోతే ఆంతరంగిక మార్పురావడం అసంభవం.

ఆధ్యాత్మిక విషయాలు ఎంతోసేపైనా వినగలగడమే శ్రద్ధ అని ఒకరు అనుకున్నారనుకోండి. వాడికి ఆధ్యాత్మికతను గూర్చి ఎంతవరకూ అవగాహన వున్నట్లు? అలాగైతే ఆధ్యాత్మిక ఉపన్యాసాలు గంటల తరబడి చెప్పేవారూ వున్నారు - వినేవారుగూడ వేలమంది వుంటున్నారు. వారిలో ఎంతమందికి ఆంతరంగిక మార్పు వస్తోంది? విన్నదానిని ఏ కొద్దిగానైనా,కొద్దిగా విన్నప్పటికీ దానిని ఆచరించడానికి ప్రయత్నిస్తే దానివల్ల ఫలితం వుంటుంది గానీ పూరికే 24 గంటలూ ఆ ఆధ్యాత్మికత గురించి విని, 'ఆహా! ఆయన ఎంత బాగా చెప్పాడు!' అనుకుంటే ఏమీ లాభము వుండదు. అంతేగాక చెప్పేవారు గూడ ఏది ఎందుకు చేయాలో, ఎందుకు చెప్పబడిందో అర్థమయ్యేలా చెపితే వాళ్ళు ఆచరించ గలుగుతారు. ధర్మశాస్త్రంలో బాహ్యాచరణ ఎందుకు చెప్పబడిందో, అది అంతఃశుద్ధికి ఎలా దోహదపడుతుందో తెలిస్తే అది ఉపయోగపడుతుంది కానీ, లేకపోతే ఉపయోగపడదు. సృష్టిలో ఒక ధర్మమున్నది. ఉపయోగపడని ఏదైనా చెడుకు దారితీస్తుంది, జీర్ణమవడం కోసం వెళ్ళిన ఆహారం జీర్ణమై ఒంటికి పడితే సరి, లేకపోతే అది ఆరోగ్యాన్ని చెడగొట్టడం మొదలుపెడుతుంది. అది ఉపయోగ పడనన్నాపడాలి లేకపోతే చెడగొట్టనన్నా చెడగొట్టాలి. అట్లాగే ప్రకృతిలో ప్రయోజనం కానిది యావత్తూ నష్టానికి దారితీస్తుంది. అలాగే ఆచరణ ఎందుకో మన కర్థమై అంతఃశుద్ధిని కలిగించకపోతే చెడుకు దారితీస్తుంది. ఈ అంతఃశుద్ధి అనేది దక్షిణ సమర్పించడంలో నిష్ఠను సమర్పించడంలో ఒక భాగము.

పరిపూర్ణుడైన సిద్ధపురుషుడు ఇటువంటి అప్రధానమైన వాటిమీద ఆకర్షింపబడడు. ఉత్తమమైన లక్ష్యం సహజంగా, స్థిరంగా నిలిచివుంటుంది. ఈ విషయమే భగవద్గీతలో చక్కగా చెప్పాడు. భగవంతుని ఆశ్రయించే వాళ్ళు నాలుగురకాలుగా వుంటారు. "ఆర్తో అర్థార్థి జిజ్ఞాసీ జ్ఞానీచ భరతర్షభ" అని నాలుగు రకాలు. ఆర్తుడు అంటే కష్టాలను తొలగించమని అడిగేవాడు. "అర్థార్థి" అంటే నాకు 'ఈ కోరికలు తీర్చు, ఆ కోరికలు తీర్చు' అని అడిగే వాడు. 'జిజ్ఞాసువు' అంటే తెలుసుకోవడానికి ప్రయత్నించేవాడు, తెలుసుకోవడానికి యిష్టపడేవాడు. అయితే దేనిని తెలుసుకోవడానికి? అంటే సృష్టి రహస్యాన్ని తెలుసుకోవడానికి.

సృష్టి రహస్యం ఏది? అంటే సృష్టికర్త మనస్సు లోని సంకల్పము. అంటే సృష్టికర్తను గురించి తెలుసుకోవడన్నమాట.

'జ్ఞాని' - అంటే అజ్ఞానం నశించినవాడు, పరిపూర్ణుడైన వాడు జ్ఞాని. అజ్ఞానం నశించిన తర్వాతగాని జ్ఞాని కాడు. జీవాత్మ వేరుగా వుందనే భ్రమ నశిస్తేగాని జ్ఞాని కాడు. తనకూ - పరమాత్మకూ భేదం లేదని తెలిసినవాడు మాత్రమే జ్ఞాని. అయితే భగవంతుని ఆశ్రయించినవారిలో జ్ఞానిని గూడ లెఖ్ఖలో వేశారు. జ్ఞాని గూడ భగవంతుని ఆశ్రయించిన వాడవడమేమిటి? ఈ విషయము గూర్చి ఆలోచించాలి. కొంతమంది దీనినిలా వివరించారు-అక్కడ జ్ఞాని అంటే అద్వైతానుభూతిని పొందినవాడు కాడని, దానిని పొందడానికి అవశ్యకమైన తత్త్వ జ్ఞానాన్ని బాగా పొందినవాడు అని వారు వివరించారు. భక్తి గొప్పదా? లేక జ్ఞానం గొప్పదా? అని చర్చించే వాళ్ళలో జ్ఞానం గొప్పదని చెప్పే వాళ్ళు గూడా ఎంత జ్ఞాని అయినా సరే భగవంతుని ఆశ్రయించవలసినదేనని వ్యాఖ్యానించారు. ఈ రెండింటికీ మధ్యేమార్గంగా మరొక సమన్వయం వున్నది. భక్తి అంటే ప్రేమ, అనన్యమైన ప్రేమ. దేనియందు భక్తి? భగవంతునియందు భక్తి. భగవంతుడు తనకంటే అన్యంగా వున్నాడనుకొని భగవంతుని ప్రేమించే వ్యక్తి కూడా భగవంతుణ్ణి ప్రేమించడంకంటే గూడ తనను తాను ఎక్కువగా ప్రేమించుకుంటాడు. కారణం తనకు శ్రేయస్సు చేకూర్చి ఉత్తమమైనటువంటి దుఃఖరాహిత్యాన్ని కలుగజేస్తాడు. కనుక భగవంతుణ్ణి ప్రేమిస్తాడు. కాబట్టి భగవంతుడు వాడికి సాధనము మాత్రమే అయ్యాడు. దేనికి సాధనమయ్యాడు? తన దుఃఖ నివృత్తికి సాధనమయ్యాడు. కాబట్టి అగ్రతాంబూలం దేనికన్నమాట - తనకు, తన దుఃఖనివృత్తికీ, తర్వాత దీనికి అత్యావశ్యకమైనది గనుక భగవంతుని మీద ప్రేమ. ఇంతకుమించి ఎవడూ భక్తి కలిగివుండటానికి అవకాశంలేదు. అలాగాక భగవంతుణ్ణి భగవంతుడుగానే ప్రేమిస్తే, ప్రేమించగలిగితే గొప్ప విషయమేగాని అలా ప్రేమించడం సాధ్యంగాదు. ఎందుకనంటే ఎన్నడైనా భగవంతుని ఒక్క సారైనా చూచివుంటే ఆయనయందు అపారప్రేమ కలుగవచ్చు. ఎప్పుడైనా అలాంటి అనుభూతి కలిగితే కదా! సామాన్యంగా ఎవరికీ ఎప్పుడూ అలాంటి అనుభూతి కలుగదు. ఒక్కసారి అది కలిగితే తర్వాత జీవితంలో అతనిని యింకేమీ ఆకర్షించలేదు.

దీనికి ఉదాహరణ సాయి చరిత్రలో వున్నది. బాలాభాటే అనువాడు

బాబా అంటే గౌరవం లేకుండా వుండేవాడు. అతనికి ఎవరైనా శిరిడీ వెళ్తున్న వాళ్ళు కనిపిస్తే చాలు, 'ఎందుకురా అక్కడకు వెళ్తావు? ఆ సాయి ఒట్టి పిచ్చి ఫకీరు, వాడు ఒట్టి దొంగ' అని యిలా పిచ్చిపిచ్చిగా మాట్లాడుతుండేవాడు. ఒకసారి వాడికి ఆత్మీయుడైన ఒక మిత్రుడు శిరిడీ వెళ్తున్నాడు. ఆయన దగ్గరకు వెళ్ళవద్దని బాలాభాటే అతనిని గట్టిగా పట్టుబట్టాడు. అప్పుడా స్నేహితుడు, "నువ్వెప్పుడైనా బాబాను చూచావా?" అని బాలాభాటేను అడిగాడు. లేదన్నాడు భాటే. "అయితే ఒకసారి ఆయనను చూసిరా, ఆ తర్వాత మాట్లాడు" అని తన వెంట శిరిడీ తీసుకువెళ్ళాడు. వారు నాలుగైదు రోజులు శిరిడీలో వున్నారు. నాలుగవ రోజునో, అయిదవ రోజునో అందరూ బాబా సన్నిధిలో కూర్చునివుంటే భాటే దూరంగా కూర్చుని వున్నాడు. బాబా అతనిని దగ్గరకు రమ్మని పిలిచి తన భుజం మీద వున్న వస్త్రాన్ని తీసి అతని భుజం మీద కప్పారు. వెంటనే అతనిలో మార్పు వచ్చింది. అంతకు ముందు తనకు బాబాపై వున్న అభిప్రాయమేమిటో అతనికి స్ఫురణ లేదు. అప్పటినుంచి అతను ఇంటికి కూడా వెళ్ళనన్నాడు. తక్కిన వాళ్ళంతా ఇంటి ముఖం పట్టారు. అతని స్నేహితుడు యిలా అడిగాడు, 'అప్పుడు బాబాను అలా తిట్టావుగదా, యిప్పుడిలా అంటావేమిటి?' అంటే 'ఏమో నాకు తెలియదు, బాబా నామీద వస్త్రాన్ని వేసినప్పటినుంచి లౌకిక జీవితం మీద విరక్తి కలిగింది' అని చెప్పి, తానికరానని మొండిపట్టు పట్టాడు. చివరకు అతని చేత ఎలాగో ఒకసంవత్సరము సెలవు పెట్టించారు. కాని సంవత్సరం తర్వాత గూడా అతనిలో మార్పే రాలేదు. భాటే, 'నేనిక్కడే జీవితాంతం బాబా సేవలో వుంటాను, ఇక్కడే మట్టిలో కలిసిపోతాను' అని అన్నాడు. అప్పుడు ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుంటే, అప్పటివరకూ అతను చేసిన సేవలకు ఫలితంగా ప్రభుత్వం వారు అతనికి నెలకు రు. 30/-చొ॥న మంజూరు చేసారు. దీని వలన మనకేం తెలుస్తున్నదంటే భగవదనుభూతి ఒక్కసారి కలిగితే చాలు, అటువంటి స్థితి కలుగుతుంది. ఇక ప్రాపంచిక విషయాలపట్ల ఆసక్తి కలుగనే కలగదు.

ఇటువంటిదే మరొక ఉదాహరణ - శ్రీ రామకృష్ణ పరమహంస వద్దకు వివేకానందుడనేవాడు వచ్చాడు. అందరిలోకి వివేకానందుడు మంచి అవగాహన కలవాడనే అభిప్రాయం రామకృష్ణ పరమహంసకు వుండేది. అందుకని ఆయన ప్రత్యేక అభిమానంతో అతనిని చూచేవారు. వివేకానందునికి శ్రీరామకృష్ణ పరమహంస వద్ద ఎక్కువ సమయం గడపాలనే వుండేది. కాని అతని కుటుంబ

ఆర్థిక పరిస్థితి బాగుండకపోవడంవల్ల అలా వేయలేకపోయేవాడు. ఒకసారి పరమహంసను అతడు, "మీకు అమ్మ దర్శనమవుతుంది గదా! నా దారిద్ర్యం తీర్చమని ఆమెను అడిగితే నా సమస్య పరిష్కారమైపోతుంది. నేను ఎప్పుడూ మీ సన్నిధిలో గడపగలను గదా! అందుకని నా దారిద్ర్యాన్ని పోగొట్టమని అడగండి" అన్నాడు. అప్పుడాయన తనకు అమ్మ దర్శనమైతే ఏమీ అడగాలనిపించదని చెప్పారు. కానీ వివేకానందుడు వినకపోయేసరికి ఆయన, 'అమ్మ సాక్షాత్కారం నీకు కలిగేలా చేస్తాను. నువ్వే అడుగు' అని చెప్పారు. సరేనన్నాడు వివేకానందుడు. అమ్మదర్శనమిప్పించాడు పరమహంస. అమ్మ అతనిని, "నీకేం కావాలి?" అని అడిగింది. అప్పుడు వివేకానందుడు, "అమ్మా! నీ దర్శనం ఎప్పుడూ కలిగేలా అనుగ్రహించు" అన్నాడు. కాసేపటికి అతనికి బాహ్యస్మృతి కలిగింది. 'అమ్మను అడిగావా?' అని అడిగారు పరమహంస. అప్పుడు వివేకానందుడు, 'అమ్మను ఏమీ అడగాలనిపించలేదు. ఈసారి కనిపిస్తే అడుగుతాను' అన్నాడు. అలా మూడు సార్లు దర్శనమిప్పించాడు, మూడుసార్లు ఏమీ అడుగలేకపోయాడు వివేకానందుడు. "ఎందుకని అడుగలేదు" అని పరమహంస అడిగితే, "అమ్మను చూచేసరికి నాకేమీ అడుగాలనిపించడం లేదు. ఆమెను లౌకిక విషయాలను గూర్చి అడగడం నావల్ల కాదు" అన్నాడు. అప్పుడు పరమహంస అన్నారు; "కేవలం మూడుసార్లు అమ్మ దర్శనమైతేనే ఏమీ అడుగలేకపోతున్నావే. నిరంతరం ఆమె దర్శనం పొందే నేను ఏమి అడుగగలను?" అని. భగవదనుభూతి కలిగితే అలా వుంటుంది పరిస్థితి.

ఈ రెండు దృష్టాంతాలూ ఎందుకు చెబుతున్నానంటే అటువంటి అనుభూతిని చవిచూచిన తర్వాత మనస్సు వెనుకకు మళ్ళదు. ఈ లౌకికమైన వస్తువులు, విషయాలూ అన్నీ కలిపి చూపించినా సరే వాడికి కొంచెం కూడా రుచించవు. వాటిని చూస్తే వాడికి యివన్నీ కలిపి మనకా ఆనందాన్ని యివ్వవు గదా? వీటితో మనకేమి పని? అనిపిస్తుంది.

ఒక సాధకుడు సాయి అనుగ్రహాన్ని చవిచూచాడు. ఆ తర్వాత యింకా ఎక్కువగా సాధన చేసుకునేటందుకు అనేకమంది మహాత్ముల దర్శనం చేసుకుంటున్నాడు. కాని వీడికి కావలసినది మాత్రం వాళ్ళదగ్గర దొరకలేదు. వారిలో కొందరు అతనితో, 'నీవు ఆధ్యాత్మికంగా ముందుకు పోవడానికి గాని, దానిద్వారా లోకానికి సేవ చేయడానికి గాని నీకు కొన్ని విద్యలు నేర్పుతా' మన్నారు. అతను

అదృష్టవంతుడు, లేకపోతే గంగలో దూకేవాడే. అందుకే అతడు వాళ్ళ మాటలను అంగీకరించలేదు. ఇన్ని అవస్థలూ పడి అవన్నీ నేర్పేకంటే మనస్సు ఆ భగవంతునిపై నిరంతరం లగ్నమయ్యే ఆ ఒక్క విద్య నేర్పగూడదా? అని అడిగాడు. కాని ఆ విద్యను నేర్పడానికి వాళ్ళ దగ్గర స్థోమత లేదు. వాడి పూర్వజన్మ సంస్కారాల బలంచేత వాడికిలా అనిపించింది - ఇవన్నీ యిస్తామన్నారు, బాగానే వుంది. యివన్నీ యిచ్చే బదులు ఆ ఒక్కటీ యిస్తే చాలదా? ఇవన్నీ కలిపి గూడా దాన్నీమీ యివ్వలేవుగదా! కాబట్టి యిక అవి దేనికి? అని.

నచికేతుడు జనన మరణ రహస్యాన్ని గూర్చి యముణ్ణి అడుగు తాడు. అప్పుడు యముడు అది మాత్రం కాకుండా నీకేది కావాలంటే అది యిస్తానంటాడు. అనంతమైన రాజ్యభోగాలు, చిరంజీవత్వము - మొదలైనవెన్నో యిస్తానని ఆశ చూపుతాడు. కానీ యివన్నీ ఎన్ని యిచ్చినా ఆ జ్ఞానం లభించదు గదా! కనుక నాకవన్నీ అక్కర్లేదు. నాకు ఆ జ్ఞానమే కావాలని అతడు పట్టుబట్టాడు. ఒక్కసారి గూడా ఆ అనుభూతి పొందని అతనికే లౌకిక విషయాలపై ఆసక్తి లేకపోయినప్పుడు, జ్ఞానంమీద అంతటి తీవ్ర జిజ్ఞాస కలిగినప్పుడు, ఒకసారి ఆ భగవదనుభూతిని చవిచూచిన వాడికి లౌకిక విషయాలపై ప్రీతి కలుగడానికి అవకాశమే లేదు. అప్పుడు వాడికి భగవంతునిపై నిజమైన ప్రేమ కలుగుతుంది. ఈ లోపల దుఃఖనివృత్తికి సాధనంగా మాత్రమే వాడికి భగవంతుడు ఉపయోగపడతాడు. భగవంతుడు ఎవరికి సహకరిస్తాడంటే, ఎవరికి మేలు చేస్తాడంటే ఈ దుఃఖాన్నుంచి నివృత్తి చేసుకునేవాడికి సహకరిస్తాడు. కాబట్టి వాడికివాడే అందరికంటే ప్రధానమైనవాడు. కాబట్టి ప్రతి వాడూ తనమీద తనకు అనన్యమైన భక్తి కలవాడు. అలాగాక తన సుఖాన్ని, దుఃఖాన్ని సర్వాన్నీ త్యాగం చేసేవాడు గూడ విజ్ఞానం కోసమో, ధర్మంకోసమో, లేక తన వాళ్ళకోసమో త్యాగం చేస్తున్నాడు. ఉదాహరణకు ఒకడు ధర్మంకోసం తన యావత్తూ పణంగా పెట్టాడనుకుందాం- మరివాడి సంగతేమిటి? అంటే వాడికి అన్నింటికంటే ధర్మంమీద ప్రీతి, శ్రద్ధ ఎక్కువవున్నాయి గనుక తనకు ప్రీతికరమైన ధర్మంకోసం తక్కిన వాటన్నింటినీ వదలివేశాడన్నమాట. కాబట్టి అన్నింటికంటే ప్రీతికరమైనది ఆత్మ. ప్రతివాడికీ అన్నింటికంటే ప్రీతికరమైనది 'తాను' అంటే 'నేను' అనేది. దానిలో పరమాత్మను దర్శించి, అదే పరమాత్మగా తెలుసుకొంటాడు. భగవంతుని అనుభూతిని చవిచూచిన వాడికి మామూలుగా తనమీద తనకుండే ప్రేమకుతోడు భగవంతుని

మీద వుండే ప్రీతి కూడా ఆ భగవంతుడిని తనలోనే దర్శించిన తర్వాత దానియందే లీనమైపోతుంది. అంటే భగవంతుని అనన్యంగా ఆశ్రయించినవాడు తనను తానే అర్పించుకున్నవాడవుతాడు. కనుక అందరికంటే భక్తుడు శ్రేష్ఠుడు. వాడికెంత భక్తి అంటే వాడి మనస్సు భగవంతుని నుండి క్షణం గూడ విడిచి వుండదు. భగవంతుని యందే లీనమైపోయి వుంటుంది. అంటే వీడు భగవంతునిలో లీనమై వున్నాడని కూడ చెప్ప లేనంతగా కలిసి వుంటుంది. తాను, భగవంతుడు వేరుగా లేనంతగా ఐక్యమైపోతాడు.

కనుక సద్గురువును మనం ఆశ్రయించినప్పుడు ఆ సద్గురు సాన్నిధ్యంలో మనకు భక్తిశ్రద్ధలేర్పడుతాయి. మనలో సత్వగుణం బలపడుతుంది. ఆయన బోధవల్ల, లీలలవల్ల, ప్రేమవల్ల మనలో వుండే శుభ సంస్కారాలు బలీ యమై మనలో వుండే నిష్ఠ యింకా బలీయమైపోతుంది. దానిమీద రుచి ఎంతవరకూ ఏర్పడుతుందో అంతమేరకు నిష్ఠను బలపరచుకునేటందుకు పట్టుదల ఏర్పడుతుంది. చెదరగొట్టే విషయాలనుండి రక్షించుకోవడమెలాగో యింతకుముందు వివరించుకున్నాం. కాబట్టి 'నిష్ఠ' అంటే మొదట 'పరమార్థం పొందాలి' అనే లక్ష్యం. దాని యందుండే తీవ్ర తపన చేత ఎవరు అందుకు దోహదం చేస్తారు? ఎవరు మార్గం చూపిస్తారు? అవి వెతుక్కోవడం ప్రారంభిస్తాము. ఆ తర్వాత దోహదం చేసేవారు దొరకడం, దొరికారు కనుక దాని మీద అపారమైన ప్రేమ ఏర్పడడం, దానిమీద వుండే శ్రద్ధచేత అనన్యమైన గురుభక్తి ఏర్పడడం, దానినింకా నిర్దుష్టం చేసుకోవాలి అనే కోరిక చేత అందుకు ప్రతిబంధకాలైన వికారాలను ఆయన చెప్పిన బోధలద్వారా తొలగించుకోవడం జరుగుతుంది.



అధ్యాయం-10

అనన్యచింతన



ఇంతకు ముందు మనం అనుకున్నట్లు, నిష్ఠ అనే కానుకుగాను, ఆయన మన జీవితం మొత్తం ఆక్రమించేస్తాడు. ఆ నిష్ఠ అనేది జీవితంలో సర్వకాల సర్వావస్థలయందు చెదరడానికి వీలులేనటువంటి స్థితికి మన జీవితాన్ని మలచి వేస్తుంది. అంతవరకూ మనం తీసుకోవలసిన జాగ్రత్త ఏమిటంటే నిష్ఠను యింకా బలీయం చేసుకోవడమెలాగో, దాని విఘాతాల నుండి తొలగించుకోవడమెలాగో ఆలోచించి తెలుసుకోవాలి. నిరంతరం నామస్మరణ చేస్తే సరిపోతుందంటారు కొందరు. కాని పూరికే నామస్మరణ చేస్తే చాలదు. అనన్యచింతన వుండాలి. ఆ నామస్మరణ అనన్యచింతకు దోహదం చేసినట్లయితే అప్పుడు సరిపోతుంది. అంటే భగవద్గీతలో గూడ అనన్యచింతన చేయమనే చెప్పబడి వుంది. అంటే అనన్యచింత వేరు, నామస్మరణ వేరు. నామస్మరణ చేస్తు న్నప్పుడు ఆ నామి అయినవాడి గుణగణాలను మనస్సుకు తెచ్చుకొని ఒకానొక పవిత్ర భావాన్ని పొందుతూ వుండడ మన్నమాట. అంటే అనుక్షణం నామి అయినవాడు గుర్తుకు రావడమన్నమాట. ఈ నామస్మరణ ఆ అనన్యమైన చింతకు, ఈ అనన్యమైన చింత ఆ నామస్మరణకు ఒకదానికొకటి పెనవేసుకుపోతాయి. కాబట్టి నామ స్మరణ లోపల జరుగుతూవుంటే, ఆ నామం అంటే ఏమిటో అది సమగ్రంగా అర్థం మనస్సులో నిలవాలి.

ఉదాహరణకు సర్వజ్ఞుడు బాబా అనుకున్నామనుకోండి. సర్వజ్ఞుడంటే ఆయన సర్వజ్ఞుడని నిరూపించే కొన్ని ఉదాహరణలున్నాయిగదా! అవి మొదట్లో ఉదాహరణలుగా మాత్రమే జ్ఞాపకం వస్తాయి. కాని కొన్ని రోజులు పోయేటప్ప టికి అవి విడివిడిగా జ్ఞాపకం రావడం మానేసి ఆయన సర్వజ్ఞుడనే భావం కలగడం మొదలవుతుంది. మొదట అధ్యాయాలలోని లీలలు ఉదాహరణలు విడివిడిగా అనిపించినప్పటికీ కొన్ని రోజులు అవన్నీ చదివిన తర్వాత అవి జ్ఞాపకం రావడం మానేసి ఆయన సర్వజ్ఞుడనే భావం కలుగుతుంది. ఒక్కొక్క లీల చదువుతుంటే హృదయం ఒక్కొక్కరకంగా స్పందించి ఒక్కొక్క భావం వస్తూ వుంటుంది.

హృదయం బాబాకు దగ్గరవడమంటే అదే. చివరకు ఆయన నామాన్ని స్మరిస్తూనే ఒళ్ళు పులకరించి మరచిపోయే స్థితికి వస్తుంది. ఒక్కసారి నామం తలచుకుంటే అందుకు దోహదం చేసే నామస్మరణే అనన్యచింతంటే. అట్లా దోహదం చెయ్యనిది అనన్యచింతన కాదు, నామస్మరణ మాత్రమే. ఇదీ రెండింటికీ తేడా! భగవద్గీతలో శ్రీకృష్ణుడు అనన్యచింతన చేస్తే రక్షిస్తానన్నాడు గాని నామస్మరణ చేస్తే రక్షిస్తాననలేదు. అందుకే సాయిగూడా అన్నారు: "ఎవరైతే ఎల్లప్పుడూ సాయి, సాయి అని భక్తి ప్రపత్తులతో అంటాడో వాడిని రక్షిస్తాను" అని. అంటే వట్టి నామస్మరణ గాకుండా అనన్యమైన చింతన వుండాలి. అది ఎట్లా ? బాబా చెప్పారు, భక్తుల అనుభవాలు సేకరించి వ్రాయమని చెప్పారు. అలా వ్రాసుకుని లీలల గురించి చింతనచేస్తూ వుంటే అమూల్యమైన ఆధ్యాత్మిక నిధులు దొరుకుతాయి. అందులోని వజ్రాలు దొరుకుతాయి. లీలల గురించి చింతన చేస్తూ వుంటే ఆ లీలలలో ప్రకట మయ్యే ఆయన తత్త్వం హృదయంలో నిలుస్తూ వుంటే ఆ భావం నానాటికీ మనలో బలీయమవుతూంటే నామస్మరణ కూడా నానాటికీ బలీయమవుతూ వుంటుంది. కాబట్టి వేదాంతంలో శ్రవణ, మనన, నిధిధ్యాసలు జ్ఞానానికి మార్గాలని ఏవిధంగా అయితే చెప్పారో, అవే భక్తికి గూడా మార్గాలని చెప్పారు. భాగవతాది కథలు గానం చేయమని చెప్పారు. అలా ఎందుకు చెప్పారంటే భగవంతుని లీలలుగానం చేయడంద్వారా అంతటి మహిమాన్వితుడైన భగవంతుని యొక్క గుణాలు మనస్సులో నిలుస్తాయి. ఉదాహరణకు మనకు పరిచయం లేని వ్యక్తిని ఒకరిని తీసుకు వచ్చి వీడు మంచి వాడని చెప్పారనుకోండి. కాని ఆ మంచివాడు అనే దానికి చాలా అర్థాలున్నాయి. తన ప్రాణం పోయినా, నీ ప్రాణంపోయినా 'రూల్' తప్పని వాడని ఒక అర్థం. ఇంకొకటి, ఇది నీధర్మం అని ఒకరూల్ అతడికి చెపితే తన ప్రాణంపోయినా సరే తనవాళ్ళ ప్రాణం పోయినా సరే ఆ ధర్మం తప్పడు హరిశ్చంద్రుడిలాగా. అది ఒక రకమైన మంచితనం. మరొకడు ఎంతటి కష్టమైనా, త్యాగమైనా తాను మాత్రం భరిస్తాడుగాని యింకొకణ్ణి మాత్రం క్షమించేస్తాడు. మొదటి వాడు తనకేది రూలో ఎదుటివాడికీ అదే రూల్ అప్లై చేస్తాడు. వీడలా కాదు. కాఠిన్య మంతా తన విషయంలోనే. మాట అన్నాడంటే ఆ మాట నిలుపుకోవడానికి ప్రాణం పోవలసి వచ్చినా వెనుకాడడు. అదే యింకొకడు ఎన్నిసార్లు మాట తప్పినా

పాపం వాడి సామర్థ్యం అంతేనని అనుకుంటాడు. అలా అనుకుని అవతలివాడిని అనంతంగా క్షమిస్తాడు. తనను మాత్రం క్షమించుకోడు. ఇది మరొక రకమైన మంచితనం. ఇలాంటి మంచితనాలు చాలా రకాలున్నాయి. ఒకడు మంచివాడు అని అవతలి వాడు చెప్పినప్పుడు మన మనసుకొచ్చే ఆలోచన ఎలాంటిదంటే, వూరికే నామస్మరణ చేసేటపుడు మనస్సులో జరిగే నామస్మరణ వంటిది. అలా గాక వాడితో కలిసి కొన్నాళ్ళుండడంవల్ల వాడిలో ఎన్నిరకాల మంచితనముందో చూచినప్పుడు వాడి మంచితనం మీద వుండే అభిప్రాయం వేరు. అంతకు ముందున్న అభిప్రాయం వేరుగా వుంటుంది. అవతలివాడు చెప్పినప్పుడు మంచి వాడు కాబోలు అనిపిస్తుంది. అట్లాగాక వాడితో కొన్నాళ్ళు కలిసి వుండడంవల్ల వాడిలో ఎంత మంచితనం వుందో అన్ని కోణాలలో చూచినపుడు వాడి మంచి తనంపైనున్న అవగాహన వేరుగా వుంటుంది. అప్పుడు వాడి గుణగణాలు మన హృదయంలో ముద్రించబడుతాయి.

అలాగే బాబా లీలలను నిరంతరం స్మరిస్తూండడంచేత ఆయన గుణ గణాలు, అలాగే భాగవతం చదువుతుంటే భగవంతుని యొక్క గుణ గణాలు హృదయంలో ముద్రించబడతాయి. ఆ తర్వాత చేసే నామస్మరణలో వాడికుండే శ్రద్ధ వేరుగా వుంటుంది. ఈ విధంగా భక్తికి గాని, జ్ఞానానికిగాని, శ్రవణ, మనన, నిధి, ధ్యాసలు మార్గాలు. "నా కథలనే ఎవడైతే గానం చేస్తూ వుంటాడో, వింటూ వుంటాడో, చింతన చేస్తూ వుంటాడో వాడు నేనుగా మారిపోయి, వాడికి కర్మ రాహిత్యమవుతుంది" అని బాబా సూక్తులలో గూడ వుందిగదా! భగవంతుణ్ణి గురించి యిలాగే చేస్తూ చేస్తూపోతే చివరకు భగవంతునితో తాదాత్మ్యం చెందు తారని భాగవతంలో గూడ స్పష్టంగా చెప్పబడివున్నది.

కాబట్టి చెప్పినదానిలో శ్రవణము చేయడమూ వున్నది. పారాయణ చేస్తున్నప్పుడూ, వూరికే కూర్చున్నప్పుడు గూడ క్షుద్రమైన తలంపుల వైపుకు మనస్సును పోనీయకుండా ఆ కథలనే చదువుతూ, భగవంతుని గుణాలనే చింతన చేస్తూ వుండడంవల్ల ఆ రసానందాన్ని గ్రోలుతూ వుండి ఆనందాన్ని పొందుతూండడం జరుగుతూ వున్నది. అందుకని మననము వున్నది. నిధి ధ్యాసనమూ వున్నవి. అలా మననం చేయడంవల్ల దివ్యమైనటువంటి ఆ గుణాల వైపు ఆకర్షింపబడి అందులోనే నిమగ్నమైపోయి దానిదృష్ట్యానే లోకం గురించి

ఆలోచిస్తూ వుంటుంది. కాబట్టి భక్తి మార్గంలోనూ శ్రవణ మనన నిధి ధ్యాసలున్నాయి.

అదేవిధంగా సాయి చరిత్రలోనూ వున్నది. సాయి చరిత్ర పఠన (అంటే పారాయణ) వున్నది. సాయి చరిత్ర శ్రవణమున్నది. సాయి చరిత్ర మననమున్నది. సాయిచరిత్ర నిధి ధ్యాసనమున్నది. అలాగే సాయి బోధ యొక్క పఠన, శ్రవణ, మనన నిధి ధ్యాసనాలున్నాయి. వీటిని సమన్వయం చేసుకుంటూపోతే, అనన్య చింతన అదే కుదురుతుంది.



అధ్యాయం-11

యోచన-భావోద్రేకాలు



మానవునికి మనస్సు వుంది. వాడిలో యోచన వుంది, భావోద్రేకాలూ వున్నాయి. ఈ రెండూ ఒకటి కావు. వీటి రెంటింటికీ తేడా తెలియాలంటే మనకు ఒకటే గుర్తు. జీవితంలో ప్రతివాడికీ మంచి ఏమిటో తెలుసు. ఆ తెలుసుకొనేదేమో ఆలోచన. అయినప్పటికీ బుద్ధిమాత్రం అప్పుడప్పుడు వద్దని అనిపించిన వాటిమీదకు కాస్త ఎక్కువగానో, తక్కువగానో పీకుతుంటుంది. ఈ బుద్ధిపీకే వాటిని ఏమంటామంటే - భావోద్రేకము అంటాము. ఈ రెండూ ఒక తాటి మీద నడువవు. భావోద్రేకాలననుసరించి మనం వెళ్తూ వుంటే ఎక్కడో మనం చేసేవి సరియైనవి కావని లోపల ఒక భావం కలుగుతూ వుంటుంది. పోనీదాని ప్రకారం పోదామా అంటే అవి ఒకపట్టాన విడిచి పెట్టవు. మన యిష్టాయిష్టాలూ వదలవు. ఈ రెండూ కలిసి మనలను ఏ బాటకూ అంటిపెట్టుకోనీయకుండాచేసి, దేనినీ సాధించనీయకుండా చేస్తాయి. ఈ రెండింటినీ ఒక్క త్రాటిమీదకు తీసుకు రావాలంటే రెండు రకాల ప్రయత్నం కావాలి. ఇటు మన యోచనను, అటు మన భావోద్రేకాలనూ రెండింటినీ గూడ దారిలో పెట్టుకోవాలి. అలా తెచ్చుకున్నాక యోచన, భావోద్రేకం - రెండూ కలిసి సామరస్యంతో ఒకే పనిచేసేలాగా చేయాలి. ఇదొక ఎద్దు, అదొక ఎద్దు - ఒక ఎద్దు ఒకవైపు లాగితే, ఇంకొక ఎద్దు మరొక వైపు లాగుతుంది. ఈ రెండింటినీ ఒక కాడికి కట్టి, ఒక బండికి కట్టి కలిసి నడవడమనే అభ్యాసం చేయాలి. అందుకని యోచన ఏమి చెబుతుందో, దానినే భావోద్రేకం చేయాలి. ఆ భావోద్రేకాన్ననుసరించి ఈ యోచన నడవాలి. మామూలువాడి జీవితంలో యిందుకు తలక్రిందులుగా జరుగుతుంది. మంచి ఏమిటో యోచనకుతెలుస్తుంది. కాని అది భావోద్రేకాలు చెప్పేమాట వింటుంది. అది చెప్పినంత సేపూ నోరు మూసుకుపడి వుంటుంది. అందువల్ల భావోద్రేకాల కనుగుణంగా, యిష్టాయిష్టాల కనుగుణంగా పనులు చేస్తూ, వాటిని సమర్థించుకోవడానికి తయారవుతుంది యోచన. తనకుగాని, యితరులకుగాని సమర్థించి చెప్పుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకలవాటుపడిన తర్వాత యోచన గూడా భావోద్రేకాలు చెప్పిన యిష్టాయిష్టాల వైపుకు లాగేస్తుంటుంది. ఇష్టా

యిష్టాలేమో యింకా తన యిష్టానుసారంగా లాగేస్తాయి. అలాగాక మనం పైన చెప్పుకున్న విధానంలో సరిగా దీనికి తలక్రిందులైనటువంటి క్రియ జరుగుతుంది. దేనిని సవ్యమైనదని యోచన తెలిపిందో, దానిని నిగ్రహంతో భావోద్రేకాలు అనుసరించడం అలవాటు చేయాలి. మెల్లమెల్లగా అనుసరించడం మొదలు పెట్టి సద్గురువు ఆశ్రయానికి వెళ్ళినప్పుడు భావోద్రేకాలు కొద్దో గొప్పో అటువైపుకు లాగబడతాయి. అప్పుడు ఇంతకుముందు మనలోవున్న భావోద్రేకాలన్నీ ఆశమీదకు, కామం మీదకు, క్రోధం మీదకు-కేవలం లౌకికమైన విషయాల మీదకు-పనికిరాని విషయాల మీదకుపోతూ వచ్చాయి.

ఉదాహరణకు ఎప్పుడూ మంచి మంచి కబుర్లు మాత్రమే చెప్పు కోవడం యందు ప్రీతి వుండవలసిన మనస్సుకు ఎందుకూ పనికిరాని విషయాలయందు గూడ ఆసక్తి అలాగే వుంటుంది. పనికిరాకపోవడమే గాదు, మనకు, యితరులకూ గూడ చెరుపు చేసే విధంగా గూడా దురభ్యాసంవల్ల వాటియందు ప్రీతి ఏర్పడుతుంది. అలా వుండే భావోద్రేకాలు సద్గురువు యొక్క సేవచేత, సాంగత్యంచేత ఎక్కువగా మంచివైపుకు మళ్ళించబడతాయి. మాటిమాటికీ ఆయన గుర్తుకు రావడం, చరిత్ర చదవాలనిపించడం, వినాలనిపించడం, ఆటువంటి సాంగత్యాన్ని కోరుకొని అక్కడకు వెళ్ళాలనిపించడం-యిటువంటివి ప్రారంభమవుతాయి.

ఇక అక్కడనుంచి "ఉద్ధరేత్ ఆత్మనాత్మానాం"లో ఒక భాగంలో ఇంతకుముందు మనం చెప్పుకున్నట్లు దానిలోని సౌలభ్యాన్ని తీసుకుని యింకా ముందుకు తీసుకుపోవాలి - అదెలాగంటే సత్వగుణం పనిచేస్తున్నప్పుడు "ఇది సత్వగుణ ప్రధానంగా పని చేస్తున్నది గదా! ఇప్పుడే కృషి తీవ్రంగా చేసుకున్నట్లయితే -ఈ గుణం మనలో బలపడుతుంది"అనుకుని వాటియందే భావాలను నిలుపుకోవడానికి ప్రయత్నిస్తే సత్వగుణంపోయి యింకొక గుణం వచ్చే లోపల ఈ భావాలు యింకాస్త బలపడివుంటాయి.

ఉదాహరణకు రిక్షాగాని, సైకిల్‌గాని త్రొక్కుతున్నప్పుడు పల్లం వచ్చింది, తర్వాత ఎక్కుడు వచ్చిందనుకోండి. అవుడు వాడు పల్లం వచ్చినపుడే యింకా నాలుగు తొక్కులు ఎక్కువ తొక్కేస్తాడు - స్పీడు పెంచుతాడు. అప్పుడు ఎక్కువ కష్టపడనక్కరలేకుండానే ఎక్కుడును సులభంగా ఎక్కేస్తాడు. అట్లాగే సత్వగుణం నడుస్తుండే సమయంలో ధ్యానం మామూలుకంటే లోతుగా జరుగుతున్నప్పుడు యిప్పుడే యింకాస్త లోతుగా ధ్యానంచేద్దాం అనేటటువంటి దీక్షలో ఎప్పుడైతే

దిగుతున్నాడో, అట్లాంటి దీక్షతోనే యిందులో గూడా దిగాలి. అప్పుడు యోచన శ్రేయస్కరమని చెప్పే విషయానికి భావోద్రేకాలు గూడా చెప్పినమాట వినడం మొదలెడతాయి. ఇష్టాయిష్టాలు తనకు మంచి అని తెలిసిన దానికి బానిసత్వం చేయడం మొదలు పెడతాయి. ఎప్పుడైతే అలా చేయడం మొదలుపెట్టాయో అపుడు యింకా బలాన్ని పుంజుకున్న యోచన యింకా అటువైపుకు సంతోషంగా పరుగులు తీయడం మొదలుపెడుతుంది. కనుక ఈ భావోద్రేకాలు యింకా క్రమంగా చెప్పిన మాట వింటాయి. చివరకు నిర్దుష్టమైన యోచనవల్ల భావోద్రేకాలన్నీ సంస్కరింపబడి శుభాన్ని మాత్రమే కాంక్షించే గుణం మనలోపల ఏర్పడుతుంది. అశుభమైన వాటిని తాకనుగూడా తాకను వీలులేని నిర్లిప్తత ఏర్పడుతుంది. 'నిర్లిప్తత' అంటే ఏమిటంటే ద్వేషం అనే స్థాయిదాటి ఒక దారికి రావడ మన్నమాట. ముందు చెడును ద్వేషిస్తూ పోవడం, మంచిని యిష్టపడుతూ పోవడం, తర్వాత చివరకు మంచి మీద మాత్రమే మనస్సు నిలిచి చెడుమీద మనస్సు ఆలోచించకుండా పోవడం జరుగుతుంది. ఆ తర్వాత ద్వేషించడం వుండదు. అంతమాత్రం గూడా దానికి మనస్సులో తావివ్వడం వుండదు. దానినే నిర్లిప్తత లేక నిస్పృహ అంటారు. అంటే చెడును కలిగించే ఆలోచనలకు తావిచ్చే పరిస్థితులనుగాని, కొన్ని ప్రాకృతికమైన సత్యాలుగాని, వున్నాయనే సంగతి జ్ఞాపకం గూడా లేకుండాపోతుంది. తనకున్న సమయంలో మంచి విషయాలను గూర్చి ఆలోచించుకోవడంలో నిమగ్నమైపోతుంది. అదే నిర్లిప్తత అంటే, అది ఆ స్థితికి వచ్చిందంటే నిర్దుష్టమైన యోచనకు ఏది శ్రేయస్కరమని తోచిందో దానికి వాడిలోని భావోద్రేకాలన్నీ సంపూర్ణంగా అన్వయమైపోయాయన్నమాట.

అంటే తనలోవుండే నవవిధ భావాలన్నీ నవవిధభక్తులుగా మారిపోయాయన్నమాట. నవరసాలు గూడా నవవిధ భక్తుల రూపం ధరించాయన్నమాట. ఉదాహరణకు మనలో ద్వేషం వున్నదనుకోండి. అది పనికిరాని విషయాలమీద ద్వేషంగా మారుతుంది. అజ్ఞానం మీద ద్వేషంగా మారుతుంది. ఆ అజ్ఞానాన్ని నిలిపి మనలో పాతుకు పోయేటట్లు చేసే మానవతా సంబంధమైన బలహీనతల మీద ద్వేషంగా మారిపోతుంది. ఇలా జరగడంవల్ల ద్వేషం యొక్క అవశ్యకత లేకపోవడం వల్ల ఆ ద్వేషంగూడా ఆ భగవంతునియందు ప్రీతిచేత లేకుండా పోతుంది. అప్పుడు మానవతా సంబంధమైన బలహీనతలయందు అసహ్యం ఏర్పడుతుంది. ఆ ద్వేషం యొక్క స్పృహ లేకుండా పోయినప్పుడు దాని

బలంకూడా ఆ బలంలో కలిసిపోతుంది. చివరకు తొమ్మిది భావాలూ కలిసి ఏకరసమైనటువంటి అనన్యభక్తిలో కలిసిపోతాయి. ఆ భక్తి అవిభక్తి క్రింద మారి ఆయననుంచి మనం భేదమనే భావం నుంచి తొలగిపోయి చివరకు ఏకమైన స్థితిలో నిలిచిపోతుంది. అంటే ఈ ప్రక్రియలో ఏం జరుగవలసి వున్నదన్నమాట? యోచన, భావోద్రేకాలూ చెరొక ప్రక్కాలాగేవిగా అవడం మానేసి రెండూ కలిసి ఒక్కటైపోవాలన్న మాట. ఎలాగంటే రెండుకాళ్ళు కలిసి ఒక నడక, రెండు కళ్ళు కలిసి ఒక చూపు అయినట్లన్నమాట. అపుడు భావోద్రేకాలూ, యోచనా కలిసి నిర్దుష్టమైన ఒక జీవిత సంధానం, ఒక ఆశయాన్ని సాధించడానికి ఏకథాటిన ఏకత్వంలో పనిచేస్తాయి. అక్కడ ఈ సబూరీ పని చేయడం మొదలుపెడు తుంది. అంటే నిష్ఠను బలపరుచుకునే ప్రయత్నం చేసేటప్పుడు ఆది బలపడే లోపల ఆ నిష్ఠను చలింపజేసే పరిస్థితులు తప్పక కలుగుతుంటాయి. అవి కలిగి నప్పుడు ఈ ఓరిమి అనే దానిని మనం పెంచుకోవడం మొదలుపెడితే నిష్ఠను బలపరచుకోవడానికి కావలసిన ప్రజ్ఞ మనలో మిగులుతుంది.

ఉదాహరణకు మనకు కొంచెం బాధాకరమైన సన్నివేశం జరిగిందను కోండి. మనస్సు బాధపడింది. వెంటనే బాధపడే గుణం వున్నవాడికేమో ప్రజ్ఞ నశించిపోతుంది. సంఘటనంతా అయిపోయి, మనం అనరాని మాటలన్నీ అనేసి, చేయరాని పనులన్నీ చేసేసి, అప్పుడు పశ్చాత్తాపపడతాము - "ఏమిటి! యిలా చేసాము? మనం పెట్టుకున్న లక్ష్యమేమిటి? మనం ఆ సంగతి మరచి పోయి, యింతదూరం వెళ్ళిపోయి చర్య తీసేసుకుంటామే, యింత నిగ్రహం కోల్పోయామేమిటి"? అని పశ్చాత్తాపం చెందుతాము. తర్వాత అట్లాంటి పరి స్థితి రాకుండా మనలో ఓరిమి అనే గుణాన్ని పెంచుకున్నట్లయితే, మనస్సును చంచలం చేసే సంఘటన జరిగినప్పుడు వెంటనే చలించకుండా తమాయించు కునే గుణం ఏర్పడుతుంది. బాధ కలిగినా ఓర్చుకునే గుణం ఏర్పడుతుంది. సుఖమొచ్చినా, దుఃఖమొచ్చినా తమాయించుకునే గుణము ఏర్పడుతుంది. సుఖమొచ్చిందిగదా అని వెంటనే సంతోషించే మనస్సు, దుఃఖమొచ్చినప్పుడు వెంటనే అవతలివాడిమీద ద్వేషంపెంచుకునే గుణాన్ని కలిగివుంటుంది. అందుకని భగవద్గీతలో ద్వేషాన్ని మాత్రమే జయించమని చెప్పలేదు. రాగాన్ని గూడా జయించమని చెబుతాడు. ఎందుకనంటే రాగమనేది అదుపులోకి వస్తేగాని ద్వేషం అదుపులోకి రాదు. ద్వేషం అదుపులోకి వస్తేగాని రాగం

అదుపులోకి రాదు.

ఉదాహరణకు గడియారంలో లోలకం వుంటుంది. అది కుడి ప్రక్కకూ ఎడమ ప్రక్కకూ పోతూ వుంటుంది. కుడిప్రక్కకు ఎంతదూరం పోతుందో, ఎడమ ప్రక్కకూ అంతే దూరం పోతుంది. అలాగాక ఒక ప్రక్కకు తగ్గించి పెడితే అటు ప్రక్కా, యిటుప్రక్కా తగ్గుతూవచ్చి ఆగిపోతుంది. ఇటు ఎంత పోతుందో, అటూ అంతే పోయేటట్లు ఏర్పాటు చేస్తే ఆగకుండా తిరుగుతుంది. అలాగే రాగమనే వైపుకు ఊగకుండా చేసుకుంటే ద్వేషమనే వైపుకు ఊగకుండా ఆగిపోతుంది. ఎందుకంటే రాగము, ద్వేషము-ఒకే దోషం యొక్క బొమ్మ బొరుసులు. కాబట్టి ఓరిమి ఏం చేస్తుందంటే మనలో వచ్చేటటువంటి ఏ వికారాన్నైనా సరే వెంటనే లొంగి పోకుండా కొంచెం తమాయించుకునేటటువంటి గుణాన్ని యిస్తుంది. ఓరిమిచేత వీడికి ఆలోచించుకునేందుకు అవ కాశం చిక్కుతుంది. అవకాశంచేత ఓరిమి పెరుగుతుంది, ఓరిమి వల్ల ఆలోచించుకునే గుణం పెరుగుతుంది. ఈ రెండూ కలిసి నిష్ఠ నిశ్చలమవడానికి ఉపయోగ పడుతున్నాయి. అలా ఒకదానికొకటి పెనవేసుకుంటూపోవలసిందే.

అయితే ఏ వికారమైనా వచ్చినప్పుడు తమాయిస్తే ఆలోచిస్తామంటున్నాముకదా! అయితే వచ్చినప్పుడు తమాయిస్తే తర్వాత ఆలోచిస్తాడా, ముందు ఆలోచిస్తే తర్వాత తమాయిస్తాడా? ఉదాహరణకు ఒక బాధాకరమైన సన్నివేశం జరిగింది. కోపమో, ఆవేశమో వచ్చేసింది. వచ్చినప్పుడు తమా యించుకోగలిగిన వాడు ఆలోచించుకుంటాడా? ఆలోచించుకోగలిగిన వాడు తమాయించుకుంటాడా? ముందు ఆలోచనా? లేక ముందు ఓరిమా? ఏది ముందైనా ఫర్వా లేదు. ఎందుకంటే రెండూ కలిసి ఒకదాని బొమ్మా, బొరు సులే. అవతలి వాడు రూపాయి యిచ్చేటప్పుడు బొమ్మ పైకివున్నా ఫర్వా లేదు. బొరుసు పైకి వున్నా ఫర్వాలేదు. కాని ఒకదానితో రెండవది గూడా కలిసి రావలసి వుంటుంది. కాసులో బొమ్మ, బొరుసులు మాత్రమేగాక బోడిఅంచుకూడా వుంటుంది. ఈ బోడి అంచు నిష్ఠ. ఈ నిష్ఠ ఓరిమిని తీసుకొచ్చి మనకు యిస్తుంది. కారణం, అన్నింటిలో ఆయనే వున్నాడు. ఆయన యొక్క లీలలు స్మరించడం మొదలైన భావాలవల్ల వచ్చే నిష్ఠ ఈ ఓరిమికి సహాయం చేస్తుంది. అందుకని ఆగ్రహించి తమాయించుకునే ముందు, అంతకు ముందు మననం చేసుకొని మనస్సులో పెట్టుకున్నటువంటి విషయాలను-అంటే అన్నింటిలో తానే వున్నానని ఆయన

చెప్పిన విషయాలను గుర్తుకు తెచ్చి, "వీడిలా అన్నాడుగదా! మరి వీడివి యిప్పుడేం చేయాలి? అన్నింటిలో ఆయనే వున్నాడనుకొని వదలిపెట్టేటట్లా, లేక పోతే వీడిమీద చర్య తీసుకునేటట్లా? అనేటటువంటి విచికిత్సలోకి మనలను తీసుకొచ్చి పడేసేటంత సహాయం చేస్తుంది. అందుకని నిష్ఠ ఏం చేస్తున్నదంటే ఓరిమిని బలపరుస్తున్నది. ఓరిమి ఏం చేస్తున్నదంటే వీటిలో మనం పడిపోయే సమయంగాని, శక్తిగాని ఖర్చయిపోనీయకుండా నిష్ఠను పెంచుకోవడానికి దోహదం చేస్తుంది. ఈ రెండూ ఒకదానిని పెంచుకోవడానికి మరొకటి పనికి వస్తాయి. గనుకనే ఈ రెండూ వీడని సహచరులవంటివి అని సాయి అన్నారు. అప్పుడు జీవితంలో కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా ఆ కష్టాలను కష్టాలు గానూ తీసుకోడు, సుఖాన్ని సుఖంగానూ తీసుకోడు. ఎందుకంటే ఈ కష్టాలు గాని, సుఖాలుగాని తనకు కావలసిన అనుభూతిని యివ్వడానికి మాత్రం ఎందుకూ పనికిరావు.

ఉదాహరణకు తాను దిగవలసిన స్టేషన్ రాలేదనుకోండి. ఈ లోపల రమణీయమైన ప్రకృతివస్తే దిగిపోతాడా, భయంకరమైన, ఏమీ interest లేని చోటు వస్తే దిగిపోతాడా? ఒకడు రైలులో ప్రయాణం చేస్తున్నాడనుకోండి. కొన్ని కొండలు, కొన్ని గుట్టలు బాగున్నాయి కాబట్టి తాను దిగవలసిన స్టేషన్ వచ్చే లోపల దిగిపోతాడా, లేక నిరాసక్తిగా ఎంతదూరం పోయినా గుట్టలు, గుట్టలుగా ఏమీ చెట్లుకూడా లేకుండా వుందనుకోండి - విసుగు పుట్టింది గనుక రైలు దిగిపోతాడా? దిగి పోడు గదా! అలాగే వీడి లక్ష్యం ఒకచోట కుదురుపడినప్పుడు ఈ రెండింటినీ పెద్దగా పట్టించుకోవలసిన అవసరం రాదు.

ఉదాహరణకు - మనం ఒక ఊరికి వెళ్ళాలి. తప్పని సరిగా హాజరు కావలసిన పరిస్థితి అది. అప్పుడు బస్సు దొరకకపోతే ఏం చేస్తున్నాము? లారీయో, ట్రాక్టరో, గుఱ్ఱపుబండో - ఏదో ఒకటి పట్టుకొని వెళ్తాము. అప్పుడు ఆ ప్రయాణంలో వున్న కష్టసుఖాలేవీ మనకు పట్టవు. అట్లాగే మనం పెట్టుకున్న లక్ష్యంమీద మనకెంతలైతే ప్రీతి ఏర్పడుతుందో, అంతమేరకు అందులో వుండే కష్ట సుఖాలను భరించేటటువంటి ఓరిమి అలవడుతుంది. అందువలన ఆయన మీద భక్తి విశ్వాసాలు మనకు ఎంతమేరకు కలుగుతాయో, ప్రీతి ఎంతమేరకు కలుగుతుందో ఆయన చెప్పినటువంటి బోధలు, ఆయన చేసినటువంటి పనులు, ఎంతవరకైతే శ్రవణంచేసి మననం చేసుకుంటున్నామో, మనకు లక్ష్యంమీద ప్రీతి

ఎంతవరకు ఏర్పడిందో, ఇవి అంతమేరకు అప్రధానమవడం ప్రారంభిస్తాయి. లక్ష్యంమీద ప్రీతి లేనివాడికి యివి ప్రధానమవడం మొదలుపెడతాయి. చదువు మీద ప్రీతి వుండి Distinction తెచ్చుకోవాలనుకున్నవాడికి దానిని చెడగొట్ట నంత వరకు మాత్రమే యివి పరిమితమైపోతాయి. త్రాసు ఏటు మొగ్గు తుంది? అనేదే ప్రశ్న. ఇక్కడ "ఉద్ధరేదాత్మ నాత్మానాం" అని గీతలో చెప్పినదానికి యిక్కడ మనం చేసుకోదగిన కృషి ఏమిటంటే ఒకసారి సద్గురునియొక్క సన్నిధికి వెళ్ళిన తర్వాత, దర్శనమైన తర్వాత, ఆయన యొక్క మహిమ మన హృదయం లోకి సోకిన తర్వాత, ఆయన గొప్పతనం యందు మనకు హృదయస్పందన కలిగాక, మనలో వుండే రజోగుణ, తమోగుణాలు వచ్చి ఈ దీపాన్ని మాటి మాటికీ చలింపజేయకుండా జాగ్రత్తగా కాపాడుకోవడమే మనం చేయవలసినది. మనింట్లో అగ్గిపెట్టె అయిపోయింది, లైట్లు అకస్మాత్తుగా ఆరిపోయాయి. అప్పుడు మనం చమురు వేసుకుని మనింట్లో దీపాన్ని తీసుకుపోయి ఎదురింట్లో దీపం వెలిగించు కుంటాము. కాని రోడ్డుదాటి యివతలకు వచ్చేసరికి మధ్యలో గాలివీస్తే ఏం చేయాలి? అందుకని గాలి తగలకుండా చేయి అడ్డం పెట్టుకుని తీసుకు వెళ్తాము. లేకపోతే ఆ దీపాన్ని ఒక పళ్ళెంలో పెట్టుకుని దానిమీద లాంతరు గ్లాసు వంటిది పెట్టుకుని తీసుకు వెళ్తాము.

అదేరీతిన మన హృదయం ఆ స్పందనను పొందినప్పుడు, దానిని జాగ్రత్తగా చెదరగొట్టుకోకుండా సాధ్యమైనంతవరకూ రక్షించుకోవాలి. సాధ్యమై నంత బాబా ఔన్నత్యాన్ని గూర్చిన ఆ హృదయస్పందనను బలీయం చేసుకునే ప్రయత్నం చేయాలి. ఆ ప్రయత్నమే మనం చేసే కృషి అంతా. అయితే అది ఎలాంటి కృషి అంటే - భావయుక్తంగా పూజ చేసుకోవడం, భావయుక్తంగా ఎందుకు చేయాలో, ఎలా చేయాలో తెలుసుకొని నామస్మరణ చేయడం, చరిత్ర పారాయణ ఎలా చేయాలో తెలుసుకొని అలా చేయడం, సత్సంగాలు ఎలా చేయాలో తెలుసుకొని ఆ రకంగా చేయడమన్నమాట. ఇవి సక్రమంగా జరిగినట్లు గుర్తెట్లాగంటే - ఒక ఉదాహరణ : బోర్డుమీద టీచరు ఒక లెక్కవేసి చూపిస్తున్నాడు. ఆ లెక్క పిల్ల వాడు జాగ్రత్తగా విన్నాడని, వాడికి అర్థమైందనీ అనడానికి గుర్తేమిటంటే యింటికివెళ్ళి మరికొన్ని లెక్కలు Home work చేసుకురమ్మని టీచరు యిచ్చినవి వాడు చేయగలుగుతాడు. ఒకని దగ్గర 10 అణాలున్నాయి. ఇంకొకనిదగ్గర 8 అణాలు వున్నాయి, మరొకని దగ్గర 6 అణాలున్నాయి- మొత్తం

కలిపి ఎంత? అని అంటే కూడికవేసి తెలుసుకున్న లెఖ్ఖను ఇంటికి వెళ్ళిన తర్వాత యింట్లోవున్న యిద్దరిముగ్గురి దగ్గరనున్న చిల్లర తీసుకుని లెక్క పెడుతున్నాడనుకోండి. వాడలా చేస్తున్నాడంటే అర్థమేమిటి? అంటే వాస్తవిక జీవితంలో వున్న దానికి తనకు తెలిసినటువంటి దానిని అప్లై చేసుకోవడమనే నాలెడ్జి వాడిలో మేలుకుంటున్నది అని అర్థం. అదే రీతిన యిక్కడ గూడ యీ నిష్ఠను, సబూరీని పెంచుకోవడమెట్లా అనే దానిని మన జీవితానికి అన్వయించుకోవడం ప్రారంభిస్తామన్నమాట. మనలో రాగం గాని, ద్వేషంగాని, అసూయగాని, భయంగాని - వీటిని రేకెత్తించేటటువంటి ఒక్కొక్క సంఘటన జరుగుతుంటే మనం నిష్ఠను, సబూరీని అభ్యసించటానికి వచ్చిన అవకాశంగా దానిని మనం చూడడం మొదలు పెడతాము. అయితే ఒకసారి విఫలం గావచ్చు. రెండవసారి విఫలం గావచ్చు. అక్కడ విఫలం కావడమా, సఫలం కావడమా? అన్నది ప్రశ్న కాదు. వాటిని చక్కటి అవకాశంగా తీసుకోగల సామర్థ్యం క్రమంగా వస్తుంటుంది. ఇదే సాధకునికి, సాధకుడు కానివాడికీ వుండే వ్యత్యాసం. సాధకుడు కాని వాడికి భయము వస్తే భయమేస్తుంది. ద్వేషం వస్తే ద్వేషమే వస్తుంది. అసూయ వస్తే అసూయే వస్తుంది. అదే గురు కృపకు పాత్రుడై ఆయన చరిత్రను, బోధను మననం చేసుకోవడం మొదలుపెట్టిన వాడి పరిస్థితి వేరుగా వుంటుంది. అని మనస్సుకు సోకినట్లు గుర్తేమిటంటే - ఒక సంఘటన జరిగి ఒక భావం మనసులో కలుగగానే, " ఈ భావం నాలో కలిగింది గదా, ఇలా కలుగుతుందని బాబా చెప్పారు గదా" అనుకొని దానిని తొలగించుకోవడానికి ప్రయత్నం ఆరంభమవుతుంది. అయితే అది కుదరచ్చు, కుదరకపోవచ్చు.

ఉదాహరణకు ఒకడికి మరొకడి మీద అసూయ కలిగిందనుకోండి. అది కలిగినప్పుడు 'వాడి పూర్వపుణ్యం వల్ల వాడి స్థితి మెరుగైంది, వాడు నా సొమ్మేమీ తీసుకుపోలేదు గదా!' అని ఎన్నిసార్లు సమాధానం చెప్పుకున్నా లోపల యింకా అతనికి బాధగానే వున్నదనుకోండి. అంటే, యింకా అతని ఆలోచన సరైన పాటుకు రాలేదన్నమాట. అలా పదే పదే ప్రయత్నం చేసిన తర్వాత, 'అది నిజమే కదా! యిందులో నాకు కలిగే నష్టమేమీ లేదు కనుక ఈ అసూయ అర్థంలేనిది' అనే స్థితికి వస్తుంది మనస్సు. కాని మొట్టమొదటగా ప్రయత్నం ఆరంభమైతే క్రమంగా ఆ స్థితి వస్తుంది. అదే మామూలువాడైతే అసూయ అనే ప్రవాహంలో వాడికి తెలియకుండానే పడి కొట్టుకుపోతాడు - దానికి అనుగుణ మైన చర్యలు చేసెయ్యడం గూడ మొదలు పెడతాడు. ఈ విషయంలో బాబా చెప్పిన

మాటలు - అద్భుతమైనవి వున్నాయి. ఒక్కొక్కమాట ఒక్కొక్క కాంబినేషన్‌లో పెట్టినప్పుడు ఒక్కొక్క Ray of light యిస్తుంది. అదీ వారిలోని గొప్పతనం. ఒక సూక్తిని మరి రెండు సూక్తులతో కలిపి చూసామనుకోండి. ఈ సూక్తికి ఒక అర్థమొస్తుంది. ఈ సూక్తినే తీసుకుపోయి మరో రెండు సూక్తులతో కలిపి చూసినప్పుడు ఈ సూక్తికే మరొక అర్థమొస్తుంది. అదీ తమాషా.

"మన వాడాలో దొంగలున్నారు జాగ్రత్త" అన్నారు బాబా. ఇక్కడ వాడాలో దొంగలంటే ఏమిటి? ఇంటి దొంగలు అని అర్థం. బయటి దొంగను పట్టగలం కాని యింటిదొంగను పట్టడం చాలా కష్టం అన్నారు. మన పెద్దలు చెప్పిన మాటే యిది. అట్లాగే బయటనుంచి వచ్చే వంచనను తట్టుకోగలం కాని మన స్వభావంలోనుంచి వచ్చే వంచనను తట్టుకోవడం చాలా కష్టం. ఎందుకనంటే అది ఆత్మవంచనతో ప్రారంభమవుతుంది గనుక. ఉదాహరణ: అసూయ మన హృదయంలో కలిగిందనుకోండి. 'ఇది అసూయ, ఇది తగని గుణము' అని మనస్సుకు అనిపించదు. అనిపించకపోవడమేగాక అవతలి వాడికి ఏదో విధంగా న్యూనత కలిగించి సంతోషించే గుణం మనలో వుండి యిది యిట్లాంటి గుణం అని గూడా తెలుసుకోదన్నమాట. ఈ విషయాన్ని గుర్తించ కుండానే మనస్సు చర్యకు దిగుతుంది. 'వాడిట్లా, వీడిట్లా' అని వాడి మీద లేని పోనివి ఏవేవో కల్పించి చెప్పడం ప్రారంభిస్తుంది. ఒక మిత్రుడు ఒకసారి చెప్పాడు, 'వాడిట్లాట, వీడిట్లాట' అని ఒక 'ట' తగిలిస్తే చాలురా ఎంత పుకారైనా పుట్టించవచ్చు అన్నాడు. ఎవర్నీ ఎవరు పట్టుకోలేరు అన్నాడు. ఎవరైనా 'ఏమిటిది?' అని నిలదీస్తే, 'నేను నిజమని అన్నానా? వాడెవడో చెబితే తెలిసింది' అంటే చాలుట. ఆ 'వాడెవడు?' అని నిలదీస్తే 'ఏమో' అని బుకాయించవచ్చుట. అంటే ఏమిటి? ఇలా ఎవరైనా ఏ మాటైనా చెలామణీ చేయవచ్చన్నమాట. ఆ 'ట'కారం అంత గొప్పది.

'వాడట్లాట' అన్నప్పుడు హృదయంలో ఏం జరుగుతున్నది? వాడి మీద మనకు అసూయ కలుగుతున్నదని, అందుకని అనవసరంగా అవతలివాణ్ణి ఆ మాటలు అంటున్నామని ఆలోచన రాదన్నమాట. అతడేదో బాగుపడడమే మనకు ఓర్వలేనితనంగా వచ్చి వాడేదో మనకు శత్రువు అనిపిస్తుంది. వాడు పెరిగి పోతుంటే తానేదో తరిగిపోతున్నట్లు అనిపిస్తుంది. ఎట్లాగంటే నది ప్రవహిస్తుంటే బోటు ముందుకుపోతున్నట్లు అనిపించినట్లు, బోటు ముందుకు పోతుంటే ఒడ్డు వెనక్కు పోతున్నట్లు అనిపించినట్లు, మనకున్న పరిస్థితులతో వాడి కున్న

పరిస్థితులను పోల్చుకొని చూసుకుంటాము. ఆ తారతమ్యం అలాగే వుంటే ఫరవాలేదుగాని వాడి పరిస్థితి మెరుగవుతుంటే, వాడి పరిస్థితి మెరుగవుతున్నట్లు అనిపించక, మన పరిస్థితి దిగజారుతున్నట్లు అనిపిస్తుంది. ఆలోచిస్తే మాత్రమే తెలుస్తుంది - మన పరిస్థితి తరుగవుతున్నదేమీ లేదని, వాడి పరిస్థితి మెరుగవుతున్నది మాత్రమేనని. పడవలో వున్నవాడు గమనించి ఆలోచిస్తేనే తెలుస్తుంది- నది ప్రవహిస్తోందిగాని, పడవ స్థిరంగానే వున్నదని, లేదా పడవ ముందుకు పోతోందిగాని, ఒడ్డు వెనుకకు పోవడంలేదనీ. వాడు పెరిగితే పెరుగుతున్నాడు యిందులో మనదేం పోయింది? అనుకునేటటువంటి స్థోమత మనకు రావాలి. అలా రావాలంటే మన హృదయంలో జరిగే క్రియను మనం గుర్తుపట్టాలి. అంటే ఇంటిదొంగను కనిపెట్టినట్లు కనిపెట్టాలన్నమాట. మన హృదయంలో వచ్చే ఏ భావాన్నీ మనం నమ్మడానికి వీలులేదు. ప్రత్యేకించి నెగెటివ్‌గా వచ్చేవాటిని అసలు నమ్మడానికి వీలులేదు. పాజిటివ్‌గా వచ్చేవాటిని నమ్మడంవల్ల మహా అయితే లౌకికంగా కొంచెం నష్టపోతాము. ఒక మంచివాడు కానివాడిని మంచివాడనుకుని నమ్మి రూ. 100/- యిచ్చామనుకోండి. మోసపోతే ఆ వందరూపాయలతోనే పోతుంది. అంత వరకే. అది ఫర్వాలేదు. కాని నెగెటివ్‌గా ఎవరి గురించి ఆలోచన వచ్చినా జాగ్రత్తగా వుండాలి. పాజిటివ్‌గా వచ్చినప్పుడు గూడా జాగ్రత్త పడడంలో తప్పులేదుగాని నెగెటివ్‌గా వచ్చినదాని గురించి జాగ్రత్త పడకపోతే ఆధ్యాత్మికలో పాకుడుజారి ఎన్నిసార్లయినా పడవలసిందే! అదే బాబా చెప్పిన "వాడాలో దొంగలున్నారు జాగ్రత్త" అనే సూక్తికి అర్థం. "నా చెవులెప్పుడు శుభమునే వినుగాక! నా కళ్ళెప్పుడూ శుభమునే చూచుగాక! నా జిహ్వ ఎప్పుడూ శుభమునే మాట్లాడుగాక!" అని ప్రార్థన చేసే మంత్రాలు వేదంలో వున్నాయి. అంటే 'నెగెటివ్ ఆలోచనలకు బలం రాకుండుగాక!" అని వాళ్ళ భావం. ఎందు కంటే అలా నెగెటివ్‌గా రానివ్వడం మొదలుపెడితే మనకు వచ్చిన భావం సరైనదో కాదో చెప్పడం చాలా కష్టం. అక్కడ నిజం అది కాకపోయినా మన మనస్సుకు అలా అని పిస్తున్నదేమో ఎలా తెలుసుకోవడం? అందుకని ఎవరిపైనైనా నెగెటివ్‌గా ఆలోచన రాగానే తమాయించడం, తమాయించి హృదయంలో అన్వేషణ మొదలుపెట్టడం చేయమన్నారు. ఆ విధంగా ఇంటి దొంగను పట్టడానికి ప్రయత్నం చేయమన్నారు.

మన మనస్సులో వున్నది మనలో వుండేటటువంటి వికారంవల్ల మనకు కలిగిన నెగెటివ్ భావమా, లేక అవతలివాడిలో వున్న దోషాన్ని నిష్పాక్షికంగా న్యాయ బుద్ధితో మనం గమనించామా? అనేది తెలుసుకోవడానికి ఒకే సౌలభ్యం వుంది.

'నెగెటివ్ ఫీలింగ్' (Negetive feeling) ను నమ్మవద్దు అన్న దానికి సూచనగా ఋణానుబంధాన్ని గుర్తుపెట్టుకో', అందరిలో నేనున్నానని గుర్తు పెట్టుకో అని ఈ రెండు మాటలలో సూచించారు బాబా. అందరిలో ఆయనే వున్నారని గుర్తుపెట్టు కుంటే నెగెటివ్‌గా భావన రావడానికి వీలవదు. "అందరిలో ఆయనే వుంటే వాడెందుకు నాకీ చెడు చేయాలి?" అంటే అందుకే "ఋణాను బంధాన్ని గుర్తు పెట్టుకో" అన్నారు బాబా. కాబట్టి నా అజ్ఞానం చేత ఈ జగత్తు నానాత్వంగా అనిపించి, ఈ నానాత్వంవల్ల ఆ వ్యక్తులు వేరుగా అనిపించి వారిపట్ల రాగం ద్వారా గాని, ద్వేషం ద్వారాగాని బంధం బలపడి, వాటివల్ల కర్మబంధం యేర్పడి, ఈ కర్మ బంధం వల్ల నేను, నాది అనే భావాలు యింకా బలపడతాయి. అందువల్ల రాగద్వేషాలు గూడా బలపడుతూపోతాయి. దానికి ఉదాహరణగానే చెన్నబసప్ప, వీరభద్రప్పల కథ చెప్పారు బాబా.

మామూలుగా ప్రకృతిలో అధోగతికి పోతుండే జీవులన్నీ ఈ కారణం గానే దిగజారిపోతుంటాయి. అలాగాక, అందరిలో బాబా వున్నాడనీ, అందులో అనుమానం లేకుండా ఆయన అనుభవపూర్వకంగా నిరూపించాడని, మన కంటే ఆయనకు బాగా తెలుసనే విశ్వాసంతో ఆయన చెప్పిన మాటలను గుర్తుపెట్టు కోవాలి. ఎలా? ఋణానుబంధం వల్ల వాడికి మనపట్ల అలాంటి బుద్ధి పుట్టింది అని గుర్తుపెట్టుకోవాలి. అలాగని యితరులపట్ల జాగ్రత్త పడకూడదని అర్థం గాదు. పడవచ్చు, తప్పులేదు. కానీ, ద్వేషం పెట్టుకోకూడదు. మనం జాగ్రత్తపడినా మోసపోయామనుకోండి. అప్పుడు ఋణానుబంధాన్ని గుర్తుపెట్టుకుని వాడిపట్ల ద్వేషం వహించకుండా, ఇకముందు అలా జరుగకుండా జాగ్రత్తపడాలి. బాబా చరిత్ర చదువుకోవడం, బాబా సూక్తులు స్మరించుకోవడం, బాబా గురించి చెప్పు కోవడంవల్ల క్రమంగా అది కలుగుతుంది. ఉదాహరణకు ఇలా మనం ప్రయత్ని స్తున్నప్పుడు మనం ఒకరికి కొంత డబ్బిచ్చి మోసపోయామనుకోండి - అప్పుడు మనకు, వాడికీ వున్న ఋణానుబంధం వల్ల ఆలా జరిగింది అనిపించి అవతలి వాడిపట్ల ద్వేషం వహించము. అప్పుడు మనకు నిష్ఠ సబూరీలను నిలుపుకోవడం చేతనవుతున్నదన్నమాట. ఇలా జీవితంలో జరిగే ప్రతి సన్నివేశాన్ని బాబా చెప్పిన నిష్ఠ సబూరీలను సిద్ధం చేసుకోవడానికి, అభ్యసించడానికి వచ్చిన ఒక అవకాశంగా తీసుకోవడం ప్రారంభిస్తాము. కష్టంగాని, సుఖంగాని - ఈ రెండింటిలోనూ నిష్ఠ, సబూరీ లను నిలుపుకోవడం మనకెంత చేతనయింది, ఎక్కడ పోయింది, ఎందుకు పోయింది, ఏమి చేసి వుంటే ఆ నిష్ఠ నిలిచివుండేది, ఏమి గుర్తుపెట్టుకుని

వుంటే బాగుండేది?-అని యిలా ఆలోచిస్తూ, ఆ ప్రయత్నం యింకా ధృఢ పరచుకునే ప్రయత్నం చేస్తాము.

ఉదాహరణకు మనలో ఒకడిపట్ల ఒక భావం కలిగిందనుకోండి. ఎంతగా గుర్తుపెట్టుకుందామనుకున్నా వాడితో కాసేపు మాట్లాడితే చాలు ఆ భావమే వస్తుందనుకోండి. 'దీనిని జయించడం ఎట్లా?' అని ఆలోచిస్తే వాళ్ళి పలకరించేటప్పుడు ముందుగా 'సాయిరామ్' అని మొదలు పెడదామా? లేక బాబా ఉంగరం వేలుకు పెట్టుకుని ఆయనను తలచుకొని గుడ్‌మార్నింగ్ అందామా? - అలా చేస్తే ఆ భావం పోతుందేమో? అని వాడిపట్ల ఆ భావాన్ని పోగొట్టుకోవడానికి ఉపాయాలు ఆలోచించడం మొదలుపెడతామన్నమాట.

అలా చేస్తుంటే మన ప్రయత్నమంతా ఎటునైపు తిరుగుతున్నదో గమనించండి. వెంటనే సిద్ధించిందా లేదా? అన్నది ప్రశ్న గాదు. మనలో వుండే దొంగను పట్టాలి అనే దృష్టికి వచ్చామా లేదా అన్నదే ప్రశ్న. అప్పుడు ప్రతి సంఘటనా మనలోని రాగద్వేషాలను నిగ్రహించుకుంటూ, నిష్ఠ, సబూరీలను అలవరచుకోవడానికి మనకొక చక్కటి అవకాశంగా పరిణమిస్తుంది. అలాగే జీవితంలో జరిగే ఒక్కొక్క సన్నివేశం జరుగుతూ వుంటే మనలోని రాగద్వేషాలను చలింపచేస్తూ, నిష్ఠ, సబూరీలను దెబ్బకొట్టే సంఘటనలను ఛాలెంజ్‌గా తీసుకొని, పై విధంగా పెనుగులాడే దృష్టి ఎప్పుడైతే వస్తుందో అప్పుడు మనం సాధకావస్థకు వచ్చామన్నమాట. నిష్ఠ, సబూరీలనే దక్షిణను కొద్దో గొప్పో ఆయనకు సమర్పించడం ప్రారంభించామన్న మాట. ఇక్కడ ఈ విధంగా నిష్ఠ సబూరీని, సబూరీ నిష్ఠనూ యిస్తాయి. అలాగే బాబాయొక్క లీలలను మహిమలను శ్రవణము, మననము చేసుకుంటూ పోతూవుంటే భావోద్రేకాలు సరియైన దారికొస్తుంటాయి. ఆయన సూక్తులలో వున్న విషయాలను మన భావాలకు అన్వయించుకొని ఆలోచిస్తూ పోతున్నపుడు యోచనలు సక్రమంగా వుంటాయి.

ఉదాహరణకు 'అల్లామాలిక్' అన్నదానిని మనస్సుకు బాగా అన్వయించుకొని ఆలోచిస్తూవుంటే నిష్ఠ, సబూరీలు రెండూ కుదురుతాయి. ఎందువల్లనంటే ముందు వివేకం కలుగుతుంది. ఆ వివేకంతో ఎంతవరకూ మనస్సులో భావాలను మలచుకుంటామో అంతమేరకు మనలో నిష్ఠ పెరుగుతుంది. నిష్ఠ పెరిగినకొద్దీ ఓరిమి పెరుగుతుంది. కాబట్టి మనం- సాయి

యొక్క, బోధలయొక్క తత్త్వాన్ని, అర్థాన్నీ ఆలోచించడం వల్ల యోచనను బలపరచుకుంటున్నాము; నిర్దుష్టం చేసుకుంటున్నాము. లీలలలోని మహిమను స్మరించడం వలన, భావోద్రేకాలను సరియైన కేంద్రానికి తెచ్చుకుంటున్నాము. సాయి బాబా తత్త్వానికి చెందుతున్నాయి గనుక నిష్ఠ, సబూరీలు అనే రెండు కాసులూ కలిసి ఒకే కాసుగా దక్షిణగా ఆయన చేతుల్లోకి వెళ్ళిపోతాయి. అంటే జీవితం యావత్తూ సాధనగా మారిందన్న మాట.

సాయి లీలలను స్మరిస్తూ భక్తిభావంతో ఆయనను గుర్తు పెట్టుకుంటూ వున్నప్పుడు, దానిని చెదరగొట్టే సన్నివేశం వచ్చిందనుకోండి. అప్పుడు మనం పెట్టుకున్న నిష్ఠను చెదరగొట్టడానికే ఈ సన్నివేశం వచ్చిందని తలచి, ఎలా చెదురుతున్నదో, చెదరకుండా ఎలా వుండాలో తెలుసుకొని నిష్ఠను అభ్యసించడానికే ఈ సన్నివేశం వచ్చిందనే భావన కలిగి, ఆ ప్రయత్నం చేయడం ఎప్పుడైతే ప్రారంభిస్తామో, అప్పుడు మనమొకదారికి వస్తున్నట్లు లెక్క. అంటే నిత్య జీవితంలో మన మనస్సులో కలిగే భావాలతో మనం పెనుగులాడడం ప్రారంభించామన్న మాట. అదే 'ఉద్ధరేదాత్మనాత్మానం' అని గీతలో చెప్పినది. సాయి చరిత్రను, సాయి లీలలను, సాయి బోధలనూ పట్టుకొని ఎంత వరకూ మన భావాలను మార్చుకోగలమో అదే "ఉద్ధరేదాత్మ నాత్మానం" అంటే.

యోచనతో, నిర్ణయంతో, అవగాహనతో ఏది శ్రేయస్కరమో దాని యొక్క విలువను గుర్తించి, దానియందు ప్రీతిని ఏర్పరచుకొని ఏది లోపభూయిష్టమైనదని అనుకున్నామో, దానిని లోపభూయిష్ఠమైనదని మనస్సుతో గ్రహించి, దానిని వదలిపెట్టే స్థితికి మనస్సును తెచ్చుకోవాలి. అదే సాధన చేసే ప్రయత్నం. అంటే చరిత్ర, బోధ - వీటి గురించి శ్రవణ మనన నిది ధ్యాసలు చేస్తుండడం ద్వారా నిష్ఠ సబూరీలను మనలో అభ్యసించడానికి ప్రయత్నం చేస్తూ మన వాడాలోని అంతరంగికమైన దొంగలను గుర్తుపట్టాలి. అందుకు దోహదంగా ఈ రెండు సూక్తులను ఉదాహరణగా తీసుకోవాలి. "ఋణాను బంధాన్ని గుర్తుపెట్టుకో", "నీవు చూసేదంతా కలిసి నేను" . ఈ రెండు సూక్తులనూ జాగ్రత్తగా గుర్తుపెట్టుకోవాలి. మరీ ప్రాణాపాయం వచ్చినప్పుడు, మనం సర్వం కోల్పోయే విషయంలో ఈ భావనను కొంచెం సడలించి తగవు పడవచ్చు. కాని మరీ చిన్న చిన్న విషయాలలో, ఏమీ లేనటువంటి, ఎందుకూ పనికిరానటువంటి వాటిల్లోనన్నా మనభావాలను సరిదిద్దుకోవడానికి ప్రయత్నించాలి.



అధ్యాయం-12

లక్ష్యము - అవగాహన



సద్గురువు యొక్క ఆశ్రయం చేతనే నాలుగు విధాలైన పురుషార్థాలు సమకూడటానికి నిర్దుష్టమైనటువంటి అవకాశమేర్పడుతుందని, మానవుడు తాను ఏ గమ్యాన్నైతే చేరదలచుకున్నాడో ఆ గమ్యం వాస్తవము అన్న సత్యము, విశ్వాసము సామాన్యమానవునికి కలగడానికి యిటువంటి మహాత్ములే ఆధారమని ఇంతవరకూ మనం చెప్పుకున్నాము.

ఈ పరమార్థమైనటువంటి లక్ష్యం కోసం మనం కృషిచేస్తూ పోతున్నాము, వెళ్ళామనుకుంటున్నాము. అయితే సామాన్య మానవునికి ఆ కృషిలో తన యావచ్ఛక్తినీ వినియోగించి నిమగ్నమవడానికి ఎందుకు అవకాశ ముండదు? ఇలా ఎందుకు సాధ్యపడదు? అన్న విషయము ఇక్కడ ప్రధానాంశము. ఇంతకు ముందు చెప్పుకున్నటువంటి ఒక లీలలో బాబా దానినే సూచించారు. ఒక భక్తుడు అప్పా అనే సాధువును దర్శించినపుడు ఆయన అతనికి చెప్తారు - నువ్వు వృత్తిరీత్యా ఉత్తరదిక్కుగా వెళ్ళినప్పుడు నీకక్కడ ఒక మహాత్ముడు దర్శనమిస్తారు, ఆయనే నీకు పరమార్థానికి దారి చూపుతారు అని. తర్వాత విచారసాగరమనే గ్రంథాన్ని చదువుతూండమని, అందువల్ల చాలా మేలు జరుగుతుందనీ గూడా ఆయనే అతనికి చెప్తారు. తర్వాత అతడు కళ్యాణ్‌కు బదిలీ అవుతాడు. అక్కడికి వెళ్ళడానికి నాన్హేఘాట్ అనే చాలా కష్టమైన పర్వత కనుమ దాటవలసి వస్తుంది. ఏ వాహనమూ పనిచేయనటువంటి భయంకరమైనటువంటి కనుమ అది. అందుకని దున్నపోతునెక్కి ఆ దుర్గమమైన కనుమను అతడు దాటవలసి వస్తుంది. ఆ తర్వాత అతడు సాయినాథుని గూర్చి విని ఆయన దర్శనానికై శిరిడీ వెళ్తాడు. అతనిని చూస్తూనే సాయి "అప్పా నీకు చెప్పిన మాట నిజమే" అంటారు. అంటే 'నీవు ఉత్తర దిక్కుగా వెళ్ళినప్పుడు నీకొక మహాత్ముడు దర్శనమిస్తాడు' అని అప్పా చెప్పినది వాస్తవమే అని ఆ మొదటి మాటకు అర్థం. ఆ తర్వాత, "ఆధ్యాత్మిక మార్గం అంత సులభమైనదేమీ కాదు, నాన్హేఘాట్ అనే దుర్గమమైన కనుమను దున్నపోతుమీద దాటటంకంటే గూడా కష్టం" అని స్పష్టంగా చెప్పారు. కాబట్టి దీనిని బట్టి మనకు తెలుస్తున్నది ఏమిటంటే - దేనిని ఆశించి మనం దైవాన్ని పూజిస్తున్నామో

దానిని-అంటే ఆ లక్ష్యాన్ని చేరాలంటే యావచ్ఛక్తినీ వినియోగించి కృషి చేయవలసిన ఆవశ్యకత వున్నది అనేది యిందులోని సారాంశం.

ఇది తెలియక లౌకిక అవసరాలు, యిబ్బందులు, కష్టాలు, అన్నీ గూడా ఈ పూజలు, పునస్కారాల ద్వారానే మనం సాధించుకోవచ్చు అని అందరూ ఆశపడతారు. ఈ ఆశ సఫలమయ్యే సందర్భాలు కొన్ని వుంటాయి. సఫలం కాకుండా వుండే సందర్భాలూ కొన్ని వుంటాయి. కాని ఆ సంగతిని పూర్తిగా గుర్తించక, అంతకంటే చేయగలిగిందేమీ లేదు గాబట్టి దానినే కొనసాగించుకుంటూపోతారు. ఆలోచించకుండా ముందుకు సాగిపోవడంవల్లనే వాడు అనుకున్న గమ్యాన్ని చేరుకోలేకపోతాడు అని మనం యింతకుముందు చెప్పుకుంటూ వచ్చాము. మానవ మాత్రుడుగా లౌకికంగా తాను దేనిని సాధించాలనుకున్నాడో, ఏ సమస్యలను తీర్చుకుందామనుకున్నాడో, దానిని సాధించలేనపుడు దైవాన్ని ఆశ్రయిస్తాడు. మామూలుగా లోకంలో మానవుడు చేసేది అదే. తన ప్రయత్నాలకు అలివి అయ్యేదయితే తన ప్రయత్నంతో మామూలుగా సాధించుకుంటాడు కాని, తన ప్రయత్నం మాత్రమే చాలక తన చేతిలోలేని అంశాలేవైతే వున్నాయో వాటిని చక్కదిద్ది తన సమస్యలు సాఫీగా తీరిపోయేటట్లు చేయమని భగవంతుని ప్రార్థిస్తాడు. అంటే వాడి కష్టాలు తొలగించమని ప్రార్థించడమే వాడి లక్ష్యం. ఇక్కడ వాడి ఆశ బాగానే వున్నది గాని, అవి నెరవేరేటటువంటి పద్ధతి ఏమిటి? సూత్రమేమిటి? అనేది స్పష్టంగా ఆలోచించడు. అది ఆలోచించక పోవడంచేత ఎక్కువమందికి మతము, ఆధ్యాత్మికత, దైవము అనేటటువంటి అంశాలపై స్పష్టమైన అవగాహన వుండదు. ఎంతమేరకు అవగాహన వుండదో, అంతమేరకు వాడి మనస్సులోనే ఒకానొక ద్వయీభావం వుండి పోతుంది.

ఎలాగంటే - మనం యిబ్బందిలో వున్నప్పుడు ఒక మనిషి దగ్గరకు వెళ్ళాము. ఆర్థికంగా సహాయం చేయమని అడిగాము. వెంటనే అతడు సహాయం చేసాడు. కాబట్టి వీడు మంచివాడు, మనకు ఎప్పుడన్నా యిబ్బంది వచ్చినప్పుడు సహాయము చేస్తాడు - అని ఒక ఆశ మనలో కలుగుతుంది. మళ్ళీ రెండవసారి ఎప్పుడో అవసరమొచ్చింది, మళ్ళీ వాడిదగ్గరకే వెళ్ళాము. అప్పుడు వాడికొక భయం కలుగవచ్చు. వీడి దుంపతెగ, ఒకసారి సహాయం చేయబట్టిగదా, మళ్ళీ మళ్ళీ వస్తున్నాడు, ఒకసారి లేదని చెబితే గొడవ వదిలిపోతుందని అనుకొని లేదని చెప్తాడు. తర్వాత మూడవసారి అవసర మొచ్చినప్పుడు గత్యంతరంలేక వాడి

దగ్గరకే వెళ్ళే అవసరం రావచ్చు. కాని మూడుసార్లు వెళ్ళడంలోనూ మన దృష్టిలో మార్పు వుంటుంది. మొట్ట మొదటిసారి వెళ్ళేటప్పుడు వాడు యిస్తాడో లేదో, యిస్తే బాగుంటుంది అనే ఆశతో వెళ్తాము. వాడు యిచ్చిన తర్వాత 'అమ్మయ్య యిస్తాడు' అనే విశ్వాసం ఏర్పడుతుంది. ఆ విశ్వాసంతో రెండవసారి వెళ్తాము. రెండవసారి వాడు యివ్వకపోయేసరికి ఆశ్చర్యపోతాము. అప్పుడు మనం పెట్టుకున్న విశ్వాసం దెబ్బతినడం జరుగుతుంది. మూడవసారి వెళ్ళే టప్పుడు మొదటిసారి వెళ్ళినట్లు వెళ్ళనూ లేము. రెండవసారి వున్నట్లుగా అనుకొని మాననూలేము. ఇట్టి పరిస్థితి ప్రతిమనిషికీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా కలుగుతూనే వుంటుంది. ఉదాహరణకు మనకు ఒకసారి కష్ట మొచ్చింది. ప్రార్థన చేసాము, కష్టం తొలిగింది. కాబట్టి కష్టమొచ్చినప్పుడల్లా ప్రార్థన చేస్తే భగవంతుడు మనకు దారి చూపిస్తాడు అనే ఆశ కలుగుతుంది. కాని కొన్ని సమయాలలో అది నెరవేరదు. అప్పుడు యిందాక చెప్పుకున్నట్లు రెండవ సారి వెళ్తే సహాయం లభించనటువంటి పరిస్థితి కలుగుతుంది. అట్లా అని మూడవసారి వెళ్ళక తప్పదు. అంతకంటే మనం చెయ్యగలిగిందేమీ లేదు. కనుక మూడవసారి వెళ్ళేటప్పుడు మొదటిసారిలా సహాయం చేస్తాడా? లేక రెండవ సారిలా చేయడా? అనే సందిగ్ధంలో పడతాము. కాబట్టి మూడవసారి ప్రార్థన చేసేటప్పుడు తన కోరికను మన్నించినప్పుడు మనకు కలిగిన విశ్వాసాన్ని పొందుదామని ప్రయత్నం చేసినా మనంగా పొందడానికి కావలసిన అనుభవం ఒక్కటీ వుండదు. అనుభవం లేనిదే పూర్ణంగా దేనినయినా విశ్వసించగలమన్నది అబద్ధం. అందుకని సామాన్యుని ప్రార్థన హృదయపూర్వకం కాకుండాపోతుంది. తప్పక చేస్తాడనుకుని విశ్వాసంతో దిగుదామంటే ఒకసారి సఫలమవుతుంది. మరొకసారి విఫలమవు తుంది. చేస్తాడో చెయ్యడోననుకుంటే ప్రార్థన హృదయ పూర్వకం కాకుండా పోతుంది. కోరిక నెరవేరకుండా వచ్చినప్పుడు నా ప్రార్థనలో లోపముందేమోననే భావం ఒక ప్రక్క కలుగుతూ వుంటుంది. మరొక ప్రక్క మరి యింతగా ప్రార్థన చేసినా నెరవేరలేదుగదా అనే పరిస్థితి వస్తుంది. ఈ పరిస్థితిలో లౌకికులు - తమ కోరిక నెరవేరినప్పుడు భగవంతుని అనుగ్రహం అంటారు. నెరవేరనప్పుడు నా కర్మ తీరలేదని అంటారు. ఇది లోకంలో సరిపాటి. అంటే ఏమిటన్న మాట - మన మనస్సులోనే ఒకదానితో ఒకటి సమన్వయ పడని రెండు అంశాలున్నాయన్న మాట. మన జీవితంలో జరిగేటటువంటి కష్టసుఖాలకు కర్మే ప్రధానమా? లేక

దైవం ప్రధానమా? మనం చేసే ప్రార్థనలో ఏ భావం యిమిడి వున్నది? అంటే ఈ విషయం సామాన్య మానవుల దృక్కోణం నుంచి మనం ఆలోచిస్తున్నాము. దీని గురించి విశేషంగా ఆలోచించి అర్థం చేసుకోవడం కోసం కృషిచేసిన వాళ్ళ గూర్చి కాదు నేను చెప్తున్నది, సామాన్యుల మైన మన గురించే. ఇంతకూ అప్పుడు ఏం జరుగుతున్నదంటే కర్మ తీరలేదు గాబట్టి మన కష్టం తీరలేదు, కోరిక తీరలేదు అనుకుందామా అంటే కర్మది ప్రధానస్థానమైంది. అంటే మనకర్మ తీరినప్పుడు మాత్రమే భగవంతుడు మన కేదన్నా చేయగలడన్నమాట. అప్పుడు ఆయన చేయవలసిన అవసరం ఏమున్నది? కర్మ తీరనప్పుడు ఆయనేమీ చేయలేడు అనే భావం మనలోనే వుంటున్నది. అప్పుడు ప్రార్థన ఎటువంటి భావంతో చేయగలము? అలాగాదు, భగవంతుడు చేస్తాడు అనుకుంటామా! అప్పుడు కర్మను చూచి భయపడి ధర్మాచరణకు మాత్రమే కట్టుబడి వుండవలసిన అవసరం లేకుండా పోతుంది. ఈ ద్వయీభావం వుండడం చేతనే మనిషి నూటికి నూరు పాళ్ళు ఆధ్యాత్మిక జీవితానికి అంకితం కావడానికి ప్రయత్నం చేయడానికి సాహసించడు. పైగా దీనికితోడు మరికొన్ని అపోహాలు కూడా వుంటాయి. నూటికి నూరుపాళ్ళు ఆధ్యాత్మిక జీవితానికి అంకితం కావడమంటే మనకున్న సర్వస్వాన్నీ కోల్పోవడ మనే భావం కలిగివుంటాడు. అలాగాక ఆధ్యాత్మిక జీవితానికి అంకితం కావడమంటే అన్నింటినీ పోగొట్టుకోవడం కాదని, అన్నింటిమీద మనసులో వుండే కాపీనాన్ని పోగొట్టుకోవడం మాత్రమేననీ బాగా అవగాహన చేసుకుంటే గానీ తెలియదు. జీవితంలో మనకు ఋణానుబంధంగా ఏవేవైతే ఏర్పడ్డాయో వాటిని వేటినీ త్యజించనవసరం లేదు. వాటిపట్ల మనకుండేటటువంటి భావాలను సరిదిద్దుకోవడమే చేయవలసినది, వాటిపట్ల మనకుండే భావాలే మనలను అడ్డుకుంటాయి. వాటిపట్ల అవగాహన వున్నప్పుడు ఆధ్యాత్మిక జీవితానికి ఏదీ అడ్డుకాదు. అవగాహన సరిగా లేకపోతే సర్వం విడిచి పెట్టినవాడు గూడ అడ్డుకునేవి వుంటాయి. దీనిని గురించే శంకరాచార్యుల వారు చెప్పారు - "సర్వాన్నీ విడిచి పెట్టాడు, చెట్టునీడను మాత్రమే ఆశ్రయించాడు, మోకాళ్ళ మీద తల ఆనించుకొని కూర్చొని చలికాచుకుంటాడు - ఇన్ని చేసినా అతనిని ఆశాపాశం మాత్రం వీడలేదు" అని. అంటే ఏమిటన్నమాట- వాడియొక్క అవగాహన, వివేకము, వైరాగ్యము పూర్ణం కావడం ప్రధానంగాని, బాహ్యంగా యివన్నీ త్యజించాడా, లేదా అన్నది కాదు - అని ఆ మాటకర్థం. భగవంతు

డంటే ఏమిటో నిజమైన అవగాహన కలిగి, సరియైన భావంతో భగవంతుణ్ణి స్మరిస్తూ వుంటే సరిపోతుంది గాని అటువంటి పరివర్తన హృదయంలో కలుగకుండా బాహ్యంగా అన్నీ త్యజించి వచ్చి చెట్టుక్రింద కూర్చున్నంత మాత్రాన ఆశాపాశాలు మాసిపోవు సుమా! అని ఆ శ్లోకానికర్థం. అలాగాక యింతకు ముందు మనం చెప్పుకున్నట్లు అంతరంగం సరియైన అవగాహన చెంది, సరియైన పరివర్తన ఎప్పుడైతే చెందుతుందో అప్పుడు మనము వున్నటువంటి పరిస్థితుల లోనే మనం తీవ్రంగా అధ్యాత్మిక జీవితానికి అంకితం కావచ్చు.

ఇప్పుడు జీవితంలో మనం దేనిని పొందాలన్న విషయమై సరియైన అవగాహన మనకు ఏర్పడింది, అందుకు దోహదం చేసేటటువంటి సద్గురు దర్శనం లభించింది. ఆయన యొక్క గొప్పతనాన్ని గూర్చి హృదయంలో కొద్దో గొప్పో అనుభూతి కలిగి, అవగాహన ఏర్పడింది. దానిపట్ల నిష్ఠ, సబూరీ లను అలవరచుకునే ప్రయత్నం ప్రారంభమైంది. ఇక నిరంతరమూ ఆయన చెప్పే సూక్తులను గుర్తుపెట్టుకోవడానికి, మన లౌకిక విధులు సక్రమంగా నిర్వర్తించ డానికి ఆటంకం ఎలా వుంటుంది? అందుకని మనం యిప్పుడు మామూలుగా జీవిస్తున్న జీవితం గడుపుకుంటూ అందరిలో ఆయనే వున్నాడని గుర్తుపెట్టు కుంటూ, ఏ భావాలవల్ల మనకు ఐహికంగా ఏమీ ఉపయోగం లేదో, ఇప్పటి వరకూ సాధించుకున్న మానసిక పవిత్రత అంతా నాశనమైపోయి నిరుపయోగ మవుతుందో అటువంటి భావాలు మనస్సులోకి రాకుండా వుండేటట్లు చూచు కోవడమే మనం చేయవలసినది. ఇంతకుమించి ఏమీ చేయనక్కర లేదు. అంటే బాహ్యమైన విధులు ఏమీ వదిలి పెట్టనవసరంలేదు. అసలు బాహ్యంగా వున్నటు వంటివన్నీ వదిలిపెట్టాడా లేదా అన్నది ప్రశ్న గాదు. అంతర్యంలో బాహ్య విషయా లపై వుండే కాంక్షను వదిలిపెట్టాడా లేదా? నిష్ఠ, సబూరీలు కుదురుతున్నాయా లేదా అన్నదే ప్రశ్న.

కాబట్టి ఈ నిష్ఠ, సబూరీలను బలవరచుకొనేటటువంటి సూత్ర మేమిటో సద్గురువుయొక్క కృపచేత తెలిసినప్పుడు, బాహ్యమైన పరిస్థితులను త్యాగం చేయించడంవల్ల వచ్చేదేదీ లేదని, లేకపోతే పోయేది ఏదీ లేదనే సత్యం అవగాహన అవుతుంది. నిష్ఠ, సబూరీలు అంతర్యంలో కలగడంలోనే అంతా వున్నది. ఇదే మనకు విజయానందుడి విషయంలో తెలుస్తుంది.

సాయినాథుని దగ్గరకు విజయానందుడనే సన్యాసి ఒకడు వచ్చాడు.

వాడు మానససరోవరానికి యాత్ర చేద్దామని బయల్దేరి వెళ్తావుంటే మధ్యలో ఒకరు శిరిడీ సాయినాథుని గూర్చి చెప్పగా విని శిరిడీ వచ్చాడు. శిరిడీలో అతనికి మరొక సన్యాసి తారసపడి మానస సరోవరయాత్ర చాలా కష్టమనీ, దారిలో చాలా యిబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందనీ చెప్పేసరికి విజయానందునికి భయమేసి, ఆ యాత్ర మానుకుందామనుకున్నాడు. తర్వాత అతడు సాయివద్దకు రాగానే ఆయన ఉగ్రులై, "ఈ పనికిమాలిన సన్యాసిని బయటకు గెంటండి" అన్నారు. విజయానందుడిని బయటకు గెంటమనడంలో బాబా చెప్పదలచుకున్నదేమిటి? సన్యాసి అయినవాడు సుఖము, దుఃఖము అనే వాటిని జయించి తీరాలి. అందుకు సిద్ధమయినవాడు మాత్రమే సన్యసించాలి. సన్యాసం మాత్రమే తీసుకొని సుఖంగా ప్రయాణం చేయవచ్చని మానస సరోవరానికి బయలుదేరి, ఆ ప్రయాణం కష్టమని తెలిసినప్పుడు మానుకోదలచినవాడు యిక సాధన ఏమి చేస్తాడు? వాన్లేఘాట్ దున్నపోతు మీద దాటడం కంటే గూడా కష్టమైనటువంటి సాధనకు ఏమని ఉపక్రమిస్తాడు? కష్టంగాబట్టి మంచిదైనా సరే వదులుకోవాలనుకునేవాడు సాధనకు ఎలా పనికివస్తాడు? సాధన చేయదలచుకోకపోతే ఎందుకు సన్యసించినట్లు?

అందుకని అతనిని బాబా అలా మందలించారు. "పనికిమాలిన సన్యాసిని యిక్కడ నుండి బయటకు తరిమివేయండి" అన్నారు. అంటే పాడని రేడియోసెట్‌లాగా అన్నమాట. ఏ రిపేరుచేసినా అది పాడదు, ఇంట్లో స్థలం ఆక్రమించడం తప్ప మరేమీ కాదు. దిష్టిబొమ్మకూ, మనిషికీ వున్న తేడా ఎలాంటిదో అలాంటిదన్నమాట. అంటే వేషమే సన్యాసికాని అతనిలో సన్యాసి లక్షణాలు లేవన్నమాట. బాబా అలా అన్న తర్వాత గూడా అతనిలో మార్పేమీ రాలేదు. తన నిర్ణయం మార్చుకొని మానస సరోవరానికి వెళ్దామని నిర్ణయించుకోలేదు. మరొక వారం గడిచింది. అప్పుడు బాబా వాడిని తిట్టి తరిమెయ్యలేదు. వాడిలో నెమ్మదిగా పరివర్తనను తెస్తున్నారు. వాడి మనస్సు సరియైన దారికి మళ్ళేలా చేస్తున్నారు. అంతలోనే వాళ్ళ అమ్మకు సీరియస్‌గా వుందని టెలిగ్రాం వచ్చింది. అది పట్టుకుని బాబా దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అమ్మ దగ్గరకు వెళ్తానని చెప్పాడు. "తల్లిమీద అంత మమకారం కలవాడివి ఎందుకు సన్యసించావురా" అన్నారు బాబా. ఆయన అలా రెండవడోసు మందు యిచ్చారు. కాని మందు పనిచేసే సమయం లేదు వాడికి. అందుకని ఆయనిలా అన్నారు: "ఓర్పు

వహించి నీవిక్కడే వుండు. భాగవతం మూడు సార్లు పారాయణ చేయి. ఈ వాడాలో అంటే ఈ భవనంలో దొంగ లున్నారు జాగ్రత్త. సర్వాన్నీ అపహరించుకు పోతారు. అందుకని అన్ని ద్వారాలూ జాగ్రత్తగా మూసుకొని జాగరూకుడవై వుండు. నీపూర్వ పుణ్యం నిన్ను ఇక్కడకు తీసుకువచ్చింది". అతని అదృష్టం బాగుండి మనసుకు హత్తుకుంది. అదృష్టం బాగుండకపోతే టెలిగ్రాం తీసుకొని చెప్పకుండా ఇంటికి వెళ్ళివుండేవాడే. బాబా మాటలపై విశ్వాసముంచి అక్కడే వున్నాడు. భాగవతం విడవకుండా పారాయణ చేసాడు. బాగా అలసిపోయి వసతి గృహానికి వచ్చి మిత్రుడి ఒడిలో తలపెట్టి అలాగే ప్రాణం వదిలేశాడు.

ఇందులో మనకు తెలుస్తున్నదేమిటంటే - మానస సరోవర యాత్ర కష్టమని తెలిసినప్పుడు ఆ ప్రయాణం మానుకున్నాడతను. కనుక వాడు సన్యాసి కాడు. కాషాయం ధరించి మాత్రం వాడు సాధించినదేమిటి? అతడు వచ్చి నప్పుడు బాబా, "నువ్వు చాలా అదృష్టవంతుడివి, నీ పూర్వపుణ్యం నిన్నిక్కడకు లాక్కొచ్చింది" అన్నారు. అంటే, నీకు మరణమాసన్నమవుతున్న సమయంలో యిక్కడకు వచ్చావు. లేకపోతే సర్వవిధాలా భ్రష్టుడివై మరణించి వుండేవాడివి. అని ఆ మాటలకర్థం. ఒక ప్రక్క, మానస సరోవరయాత్ర కష్టం గాబట్టి అది మాను కున్నాడు. తల్లి మీద మమకారాన్ని చంపుకోలేకపోయాడు. భగవంతుడి సాక్షిగా సర్వసంగ పరిత్యాగం చేస్తున్నానని ప్రమాణం చేసి వున్నాడు. కాని వేషం మాత్రమే సన్యసించాడు. అంతరంగంలో ఏ మాత్రమూ పరివర్తన రాలేదు. అటువంటి భ్రష్ట స్థితిలో మామూలుగా అయితే ఈ మమకారాలతో మునిగి చనిపోయివుండేవాడే. కాని వాడి పూర్వపుణ్యం సద్గురు సన్నిధికి తీసుకువచ్చింది. అప్పటిదాకా వాడు తెలుసుకున్నటువంటి సూత్రాలు, ఆధ్యాత్మికతంటే వాడికున్న అభిప్రాయాలూ - ఇవన్నీ తప్పని తెలిపి సరియైన అవగాహన ఇవ్వగలిగిన సద్గురువు యొక్క సన్నిధికి రావడం నిజంగా వాడి పూర్వ పుణ్యము. అంతకుముందే సన్యాసం పుచ్చుకుని వున్నాడు గనుక కొద్దోగొప్పో ధర్మాలు తెలుసు. సాధన గురించి తెలిసినా సరియైన అవగాహన లేదు. మనం మొదటినుంచి చెప్పుకుంటున్నదదే - ఎన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు చదివినా, ఎంతగా తత్త్వసిద్ధాంతం తెలుసుకున్నా సద్గురువు యొక్క సంపర్కము, అనుగ్రహము కలిగేవరకూ సరియైన అవగాహన కలుగదు. అప్పటివరకూ వాడు చదవని వాడితో సమానమే. అట్టి అవగాహన కలగడమే వాడి పూర్వపుణ్యం. అట్టి అవగాహనను యివ్వగల సద్గురుని సన్నిధికి

రావడమే వాడి పూర్వపుణ్యం. ఇక ఏ సాధన చేయించడానికీ, తర్ఫీదునివ్వడానికీ సమయం లేదు. కనుక, "భాగవత పారాయణ చెయ్యమన్నారు" బాబా. చివరకు ఇంకొక ఆలోచన లేకుండా అహర్నిశలూ పారాయణ చేసాడు. పరమార్థం వైపుకు దృష్టి మళ్ళించడంలో ఉత్తమోత్తమమైన ఆ గ్రంథం చదివేసరికి అతని దృష్టి పరమార్థం వైపుకు మళ్ళింది. ఆ దృష్టితో శరీరత్యాగం చేసాడు. మహాత్ముని యొక్క సన్నిధిలో - గురుబంధువుయొక్క ఒడిలో శరీరాన్ని త్యజించాడు. ఇంత కంటే అతనికి శ్రేయస్సునివ్వగలిగినది మరొకటి ఏమున్నది?

అంటే ఇంతకుముందు వరకు అతడు చదివిన శాస్త్రాలు, తత్త్వ సిద్ధాంతాలూ ఏవీ సరియైన పరిణతిని యివ్వలేదన్నమాట. కాబట్టి యావచ్ఛక్తినీ వినియోగించి కృషి చేయాలనేది తెలియకపోవడమన్నది ఎంతవరకూ వున్నదంటే - సర్వసంగ పరిత్యాగం చేసిన సన్యాసికీ అలాగే వుంది - లౌకిక జీవితంలో వ్యవహరిస్తున్న వాడికీ అట్లాగే వున్నది. దీనికి కారణమేమిటి? అంటే - శక్తినంతటినీ వినియోగించి కృషి చేయడమంటే వుండే అపోహవలన మానవుడు ఆ ప్రయత్నం చేయడంలేదు - ఇది ఒక కారణం. ప్రధానమైనటువంటి ప్రశ్నలు సమాధాన పడకుండా పరస్పర విరుద్ధంగా వుండడం రెండవ కారణం. కర్మతీరక కష్టం తీరదా, లేక భగవదనుగ్రహం లేక కష్టం తీరదా? భగవదనుగ్రహం ప్రధానమా, కర్మ తీరడం ప్రధానమా?- ఈ రెండు సిద్ధాంతాలూ మూల గ్రంథాలలో వున్నాయి. ఒక ప్రక్క, 'ఎవరే దేవతలను ఏ విధంగా భజిస్తారో వాళ్ళను ఆ విధంగా అనుగ్రహించేది నేనే' అని చెపుతాడు. 'కర్మసూత్రం తప్పించుకోవడానికి వీలులేదు. ఈ కర్మ చక్రంలో పడవలసిందే' నని రెండవ ప్రక్క చెబుతాడు. రెండూ ఆయనే చెబుతున్నాడు. మరి ఈ రెండింటికీ సమన్వయమేమిటి? మన జీవితం మీద ఆధిపత్యం దీనిదా, దానిదా? జీవితంలో దీని ఆధిపత్యమూ కనపడుతోంది, దాని ఆధిపత్యమూ కనపడుతోంది. ఎక్కువగా కర్మాధిపత్యమే కనబడుతోంది. అప్పుడు - అంటే కర్మే ప్రధానమైనప్పుడు దైవాన్ని ఆరాధించడం వల్ల ఏమి ప్రయోజనం? అందుకని ఈ రెండింటికీ సమన్వయం తెలియాలి. బాబా చెప్పినట్లు ఆలోచించుకోవాలని తెలియకపోవడంచేత యోచనను నిర్దుష్టం చేసుకోకపోవడం చేత రాగద్వేష, అసూయ, భయాదులు హృదయంలో కమ్ముకుని ఆయా భావాలను ప్రేరణ చేసి ఆయా కర్మలను వాడిచేత చేయిస్తున్నాయి. ఆయా కర్మలను చేసినప్పుడు ముళ్ళ చక్రం ఎలా అయితే చెరుకును పిండుతుందో అదే

విధంగా అనివార్యంగా కర్మ చక్రంలోకి లాగబడతాడు. ఆయా కర్మల ఫలితాలను అనుభవిస్తున్నప్పుడు అజ్ఞానంవల్ల అట్లాంటి సంస్కారాలే అతనిలో వుంటాయి. కనుక అట్టి కర్మలే మళ్ళీ మళ్ళీ చేస్తూ యింకా యింకా అదే కర్మ వలయంలో చిక్కుకుపోతుంటాడు. మరి దీనిలోంచి బయటకు వచ్చే మార్గమేమిటి?

ఏయే కర్మలైతే ఇంతకుముందు చేసి వున్నామో, వాటి ఫలితాలు యిప్పుడు అనివార్యంగా అనుభవించవలసిందే. కాని మళ్ళీ యిట్లాంటి ముళ్ళ చక్రంలో యిరుక్కునే అవసరం లేకుండా తప్పించుకోవడానికి కావలసిన మనస్తత్వం ఏర్పడగలందులకు ఈ అవగాహనను, ప్రార్థనను చేసుకోవాలి. ఎలాగంటే-ఇంట్లో మనకు ఆర్థికమైన యిబ్బంది వున్నది. అప్పుడేం చేస్తున్నాం? ఒకచేత్తో అప్పు తీసుకు వచ్చి కుటుంబం గడుపుతున్నాం. రెండవచేత్తో అప్పు తీసుకోవలసిన అవసరం లేకుండా, అప్పు తీర్చుకొనే పద్ధతి వుండేటట్లు కృషి చేస్తున్నాము. ఈ ఆధ్యాత్మికతలో గూడా అంతే. ఒక ప్రక్క మనం కర్మానుభూతిని పొందుతూనే వున్నాము. ఎన్ని పూజలు చేసినా, ప్రార్థనలు చేసినా అనివార్యంగా కర్మానుభూతి కలుగుతూనే వున్నది. అయితే ప్రార్థన ఎందుకు? అన్నది ప్రశ్న. ఎందుకంటే ఆ ప్రార్థన ద్వారా మళ్ళీ యిటువంటి ముళ్ళ చక్రంలో దిగవలసిన ఆవశ్యకత లేని స్థితికి రావడం కోసం ప్రయత్నమే అది. ఈ అన్వయం దొరికేలోపల అందరూ దైవాన్ని కోరికలు తీరడం కోసమేననుకొని దైవాన్ని ప్రార్థిస్తూ వుంటారు. అసలు దైవాన్ని దేనికోసం ప్రార్థిస్తున్నారు? మనకే కష్టమొచ్చినా ఆయనను ప్రార్థిస్తే తొలుగుతుంది అని. అంటే మొత్తం మీద వాళ్ళకు ఏ కష్టమొచ్చినా తొలగడమే కావాలి. అంటే కష్టాలే లేని స్థితి కావాలి. అంటే దుఃఖమే లేని స్థితి కావాలి. అయితే దానిగురించి, అంటే దుఃఖమేలేని స్థితి గురించి కాస్తో గొప్పో అవగాహన వుంటే అది ఎట్లా వస్తుందో తెలుస్తుంది. అదే ఆధ్యాత్మికతకు శక్తినంతా వినియోగించి కృషి చేయడమంటే. అట్టి అవగాహన వాడికేర్పడేలోపల వాడు చేసే పూజలు, ప్రార్థనలు మొదలైనవి పిల్లల బొమ్మలాటలాగా వుంటాయి. అంటే అలా చేస్తూపోతూ వుంటే సుదీర్ఘ కాలానికి ఆ స్థితి రాదా? వస్తుందని చెప్పడానికి అవకాశం లేదు, వచ్చి తీరుతుందని చెప్పడానికీ అవకాశం లేదు. అలా జపమో, పూజో జన్మజన్మలుగా ఏదో ఒక రకంగా చేస్తూ పోతూ వుంటే రాదా? అంటే వస్తుందో, రాదోనన్నది ఒకదానిమీద ఆధారపడు

తుంది. ఈ చేస్తూ వుండడం చేత రాగద్వేషాదులు క్రమంగా అంతరించుకుపోయి నానాటికి చిత్తశుద్ధి కలుగుతుంటే అట్టి అవకాశం వున్నది. అంటే అలా చేసేవాడు అవగాహనతో చేస్తున్నాడన్నమాట. వాడు చేస్తున్నది అర్థం చేసుకుని చేస్తున్నాడన్నమాట.

కృష్ణుణ్ణి పెట్టుకున్నా, రాముణ్ణి పెట్టుకున్నా, ఈశ్వరుణ్ణి పెట్టుకున్నా, విఘ్నేశ్వరుని పెట్టుకున్నా, ఆ చేసే నామావళియొక్క, ఆ స్తోత్రం యొక్క అర్థాన్ని మననం చేసుకుంటూ అన్ని రూపాలలో అదే వున్నదనే అవగాహన పెంచుకుంటున్నాడన్నమాట. అలా చేయగా చేయగా రాగద్వేషాదులు పలుచబడతాయి. తద్వారా చిత్తం శుద్ధమవుతుంది. అట్టివాడికి తప్పకుండా దుఃఖరాహిత్య స్థితి లభ్యమవుతుంది. అట్టి అవగాహన లేకుండా వూరికే చేస్తూ పోతూ వుంటే అలా చేస్తూనే వుంటాము. కాని మనలో వున్న దోషాలు తీర కుండా అట్లానే నిలబడిపోతుంటాయి. కాబట్టి ఈ పూజలూ, జపధ్యానాదులూ చేసేవాళ్ళకు మరు జన్మలకు దుఃఖరాహిత్యస్థితి కలుగుతుందా అంటే అందరికీ కలుగుతుందని మాత్రం చెప్పలేము. ఎవరికైతే అవగాహన వుండి వీటిని చేస్తూ పోతూ వుంటాడో అట్టి అవగాహన ద్వారా రాగద్వేషాది భావాలను తొలగించుకుంటూ పోతూ వుంటాడో, వాడికి అట్టి సంస్కారమే మరుజన్మలో కలగడంచేత దుఃఖరాహిత్య స్థితి లభ్యమవుతుంది. అట్టి అవగాహన లేనివాడు ఏం చేస్తున్నాడంటే ఇటు మందూ తింటున్నాడు, అటు అపథ్యమూ చేస్తున్నాడు. వాడికి రోగం తగ్గుతుందన్న గ్యారంటీ వున్నదా? మందు యొక్క విలువ, జబ్బు తగ్గవలసిన ఆవశ్యకత, డాక్టరు మీద వుండే విశ్వాసమూ చేత మందు తీసుకుంటూ పళ్ళు బిగించియైనా సరే పథ్యం చేయగలిగిన వాడికి రోజు రోజుకూ మార్పు కనపడుతుంది. ఒకరోజులో కాకపోతే పదిరోజులలోనైనా కనపడుతుంది. పథ్యమూ చేయక, మందూ సమయానికి తీసుకోకపోతే వ్యాధి ఎలా తగ్గుతుంది? ఆధ్యాత్మికతలో రాగద్వేషాలు జయించడము, నిష్ఠ, సబూరీలు, అవగాహన పెంచుకోవడమూ పథ్యం వంటిది. జపధ్యానాదులు, పూజాదులు మందువంటిది. ఈ రెండూ కలిస్తేనే దుఃఖరాహిత్యం సాధ్యం. కాని ఊరికే జపధ్యానాదులు చేసుకుంటూపోతే సాధ్యం కాదు. లెక్కలు చేస్తూ వుంటే చేస్తున్న లెక్క ఏవిధంగా చేయాలో ఆ చేసే పద్ధతి అవగాహన అవకుండా వంద లెక్కలు చేస్తే మాత్రం పరీక్ష పాసవుతాడా? అదృష్టం బాగుండి వాడు చేసిన లెక్కలు పరీక్షలో దిగితే పాసవగలడు గానీ

లేకపోతే పాసవడు గదా! అలాగాక మూడు లెక్కలతోనైనా సరే వాడు లెక్క ఎలా చేయాలో సూత్రం నేర్చుకుంటే పాసవుతాడు. అందుకే 'జ్ఞానాదేవతు కైవల్యం' అన్నారు.

అందువలన అవగాహనతో చేసే కార్యక్రమాల వల్ల మనలో వున్న గుణాలన్నీ అదుపులోకొచ్చి సత్వగుణ, దైవీసంపదలు నానాటికీ అలవడుతూ ముందు జన్మలకు దుఃఖరాహిత్య స్థితికి మెల్ల మెల్లగా జారుకుంటాము. ఈ విధంగా జీవితం మొత్తాన్నీ మన ధర్మాన్ని మనం నిర్వర్తించుకుంటూనే మన భావనను మాత్రం నిష్ఠ, సబూరీలతో నిలుపుకొంటూ, ఆ నిష్ఠ సబూరీలను ఎవరికర్పించామో, ఆ సద్గురువే అందరిలో వున్నాడనే భావాన్ని అనన్యచింతగా నిలుపుకుంటూంటే అప్పుడు రెండు ప్రయోజనాలూ నెరవేరుతున్నాయి. ఒక ప్రక్క యిటువంటి కర్మచక్రంలో తగులుకునేటటువంటి దుస్థితిలో చిక్కుకోకుండా అభివృద్ధిచెందుతూ వున్నాము, రెండవప్రక్క కర్మను నిర్లిప్తంగా తీసుకునేటటువంటి, ద్వంద్వాలను జయించేటటువంటి, కష్ట సుఖాలను సమంగా తీసుకోగలిగేటటువంటి సాధనక్రింద జీవితాన్ని తీసుకోగలుగుతున్నాము.

ఈ విధంగా హృదయపూర్వకంగా, తన యావచ్ఛక్తినీ వినియోగించి సాధన చేయడానికి ఎక్కువమంది ఉపక్రమించేటంత వరకూ నిజమైన ఆధ్యాత్మికత ప్రజలకు తెలియలేదనే అర్థం. అది తెలియనంతవరకూ అన్ని విషయాలలో ఎన్ని అనర్థాలున్నాయో ఆధ్యాత్మికతలో గూడా అన్ని అనర్థాలూ వుంటాయి. ఆశ ఎప్పుడైతే వున్నదో ఆశను ఆశ్రయించుకొని బ్రతికే జీవితాలు ఎప్పుడూ వుంటాయి. Important ప్రశ్నలతో పరీక్ష పాసవ్వాలని ఎప్పుడైతే అనుకున్నామో, Important questions తో, guess questions తో solve papers బజార్లో తప్పకుండా అమ్ముకుంటారు. వీటిలో ఎవరు చెప్పిన పేపరూ పూర్తిగా రాకపోవచ్చు. అన్నీ కలిపితే మొత్తం సిలబస్ అవచ్చు. కాని వీళ్ళలో వుండే ఆశ వల్ల వాళ్ళు బ్రతికిపోతారు. ఎవడి అదృష్టమన్నా బాగుండి వాడు చదువుకునే దాంట్లో వస్తే రావచ్చు గూడా. కాని అది పరీక్ష పాసవడానికి సరియైన పద్ధతి కాదు గదా!

అందుకని నిజమైన ఆధ్యాత్మికత అంటే తెలుసుకుని సరియైన అవగాహనతో శక్తినంతా వినియోగించి కృషి చేయాలి. అలా కృషి చేయడమంటే

జీవితంలో వున్నదంతా కోల్పోవడం మాత్రంగాదు. దానిపట్ల మన భావం మారడమే, పూజ దేనికి చేస్తున్నాము? దైవమా? కర్మా? అన్నదానికి ఈ రెండింటికీ సమన్వయం కుదరడమే. మన కర్తవ్యం నిర్వహిస్తున్నప్పుడు, జీవితంలో కష్టసుఖాలను ఎదుర్కొంటున్నప్పుడు మన అవగాహన మారడమే జరుగవలసినది.



అధ్యాయం-13

అల్లామాలిక



ఎప్పుడు మనకేది ప్రాప్తమో, తప్పనిసరిగా మనకది వచ్చి తీరుతుంది. ఇంకొకడికేది ప్రాప్తమో వాడికది వస్తుంది. అనుకున్నప్పుడు అసూయాది భావాలు రావడానికి వీలుకాదు. అసూయాది భావాలు రాకపోవడం వల్ల మనకు జరిగే నష్టమేమీ లేదు. కాని అట్టి భావాలు రావడం వల్ల అనేక జన్మలు పాడవుతాయి. వాటిని నివారించుకోవడమే సాధన యావత్తూ. మన జీవశక్తినంతా ఆ విధంగా వృధా చేసి మన జన్మలను పాడుచేస్తాయి గనుకనే వాటిని 'దొంగలు' అన్నారు బాబా. అవి సర్వాన్నీ అపహరిస్తాయి అన్నారు. సర్వాన్నీ అపహరించడమంటే నీవు సర్వాన్నీ పొందగల జీవితావకాశాన్ని అపహరిస్తున్నాయని అర్థం. దొంగలను గుర్తించి కనిపెట్టి వుండగలగడం గూడా సద్గురుని అనుగ్రహంవల్లనే సాధ్యమవుతుంది.

దీనిగురించి మన పెద్దలు ఏం చెబుతున్నారు ? - 'ఒక ప్రక్క వివేక వైరాగ్యాలను బలపరచేటటువంటి చింతనా కావాలి. మరొక ప్రక్క భక్తీ కావాలి' అని చెబుతున్నారు. ఈ రెండూ ఒకదానికొకటి దోహదాలవుతాయి. భగవంతునికి అన్యమైన వాటియందు మనస్సు పోకుండా వివేక వైరాగ్యాలతో నిష్ఠ సబూరీలను అలవరచుకోవడం, మనకేది ప్రాప్తమో అది తప్పని సరిగా వచ్చి తీరుతుంది గనుక దేనిగురించీ ఆశపెట్టుకోవలసినదిగాని, భయపడ వలసిన అవసరంగాని లేదు గనుక, యావచ్ఛక్తినీ భగవంతుని మీద, నిష్ఠ, సబూరీలను నిలుపుకోవడం కోసమూ వినియోగించినట్లయితే, అందరిలో ఆయనే వున్నాడనే భావనను, అవగాహనను నిలుపుకుంటానికి శాయశక్తులా ప్రయత్నం చేస్తున్నట్లయితే, వాడికి లౌకికంగా రావలసినవి ఎటూ వస్తాయి. రానివి అప్పుడూ రావు, ఇప్పుడూ రావు. కాని జీవితం పట్ల వాడి అవగాహన మారుతుంది గనుక తప్పకుండా ఉత్తమ ప్రయోజనం వైపుకు హృదయం పరిపాకం చెందుతుంది. దీనికంతటికీ సరిపోయేటట్లు, మన యోచనను ఎలా పెంచుకోవాలి అనేటటువంటి కొన్ని కొన్ని సూత్రాలు సాయి అప్పుడప్పుడు చెబుతూ వచ్చారు. సూక్తిగా చెప్పకపోయినా ఎప్పుడూ ఆయన స్మరిస్తూండేటటువంటి, బ్రహ్మాస్త్రంలాంటి

పదం 'అల్లామాలిక్'. సాయి దగ్గరకు వెళ్ళి ఏమడగాలో తెలియనివాడు గూడా నమస్కరించేసరికి ఆయన ఏమనేవాడు? కష్టాలలో వున్న వాడొస్తే ఏమనేవాడు? - 'అల్లామాలిక్', 'అల్లా అచ్చాకరేగా' అనేవాడు. అంటే ఏమిటి? మనం అడిగినా అడుగకపోయినా సూత్రాన్ని ఆయనే చెప్పేశారు. 'అల్లా మాలిక్' అంటే సర్వానికీ ప్రభువు భగవంతుడు. అంటే అంతటికీ యజమాని, అధిపతీ భగవంతుడేనని, దానిని మననం చేసుకుంటూండమనీ అర్థమన్నమాట. దాని గూర్చి మనం ఆలోచించడం మొదలు పెట్టామనుకోండి, అంతా భగవంతుడిదే అయినప్పుడు ఏది మనది? అనే ప్రసక్తి వస్తుంది. దీనినే అసూయ గూర్చి చెప్పుకునేటప్పుడు, అవతలివాడు బాగుపడితే మనదేంపోయింది? వాడు మనదేమి అపహరించాడు? మనమేమి నష్టపోయాము? - అన్నదానికి అన్వయం దొరుకుతుంది. ఒకడు ఇచ్చేవాడున్నాడు. పదిమందికి తలాకాస్త, తలొక పిడికెడు అన్నం వేస్తున్నాడు. ఒకడొచ్చినప్పుడు కొంచెం పెద్దముద్ద పడింది, ఇంకొకడికి చిన్న ముద్ద పడింది. వాడు ఉచితంగా వాడి దగ్గరున్నది పదిమందికీ వేస్తున్నప్పుడు వీడిదే మన్నా లాక్కుంటే ప్రక్కవాడితో తగవులాడచ్చు. వాడికి పెద్ద ముద్ద పడింది. వీడికి చిన్న ముద్ద పడిందంటూ వీళ్ళు కొట్టుకుచస్తే ఎట్లా? కాబట్టి యజమాని వాడన్నమాట. అట్లాగాక, అదినాది. ఇది నీది అనే భావన చేతనే సర్వం కలుగుతున్నది. అది నాది, ఇది నీది అనేది నిజమా? అని ఆలోచిస్తే బయటి వస్తువుల సంగతి అటుంచి ముందు మన శరీరం మనదేనా? అన్న ప్రసక్తి దగ్గరొకొస్తుంది.

'మనది' అనే పదానికి అర్థమేమిటంటే మన శ్రమతో, మన యత్నంతో మనం రూపొందించినది, మనం అనుకున్న రీతిన మలచుకోవడానికి అవకాశమైనది, మన అధీనంలో సర్వకాల సర్వావస్థలలోనూ వుండేది అని అర్థం. అప్పుడు మనది అనవచ్చు. మనం కొనుక్కున్న వస్తువుని మనది అని ఎందుకంటున్నాము? మనం కావాలనుకొంటే గోడకేసి కొట్టుకోవచ్చు. అటకమీద పారేసుకోవచ్చు. కావాలంటే వాడుకోవచ్చు. ఇంతమాత్రం దానిపై ఆధిపత్యం వున్నది గనుక మనదని వ్యవహరిస్తున్నాము. దానిని కొనుక్కోవడము, దానిని స్వంతం చేసుకోవడము చేస్తున్నాము. ఈ ధర్మాలు మన దేహానికి అన్వయిస్తాయా? ఈ దేహం ఏ విధంగా రూపొందాలి? ఎటువంటి ఆకృతి కలిగివుండాలి? ఎటువంటి సామర్థ్యం కలిగివుండాలి? అనేది మనం కూర్చుకుంటే వచ్చిందా? పోనీ మనం చెప్పిన

ప్రకారం మారమంటే మారుతుందా? మనం మాట్లాడడానికి, పనులు చేయడానికీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కారణం కదా, జీవశక్తి కారణం గదా, మరి ఆ జీవశక్తి మనం చెప్పినట్లు, మన అనుమతి తీసుకొని పనిచేస్తుందా? మనమేదో పరధ్యానంలో వుంటే ఆ జీవశక్తి మానుకుంటుందా? మనకు జీవితం మీద విసుగుపుట్టి 'ఆగిపో' అంటే ఆగిపోతుందా? అప్పుడు ఎవడూ ఆత్మహత్య చేసుకోవలసిన పనివుండదు. 'లేదు, ఇంకొంతసేపు పనిచెయ్యి' అంటే ఆగిన సమయంలో పనిచేస్తుందా? కాబట్టి తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నడిపే ప్రాణశక్తి తనది కాదు. కాబట్టి తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తనవి కావు. మనోభావాలు తనవెటూ కావనేది నిత్యం అభ్యాసంలో తెలిసిపోతుంది. 'ఇదిగో! నువ్వు దైవాన్ని గుర్తుపెట్టుకో!' అంటే అది తప్పిస్తే ఏదైనా చేస్తాననంటుంది. మరీ గట్టిగా నిర్బంధిస్తే నిద్రపోతాననంటుంది. కాబట్టి మనస్సు మనది కాకుండా పోయింది. శరీరం మనది కాకుండా పోయింది. ఈ శరీరం వృద్ధి పొందడానికి కావలసినటువంటి ధాతువులన్నీ పంచభూతాలలోనుంచి, ప్రకృతిలోంచి దీనిలో కలవబడుతున్నాయి కనుక అదీ మనది కాదు. ఇట్లా ఏర్పడినదే మనది కాకపోతే యింక ఏవి మనవవుతాయి?

కాబట్టి మనది అన్న భావం కలగడంచేత తక్కిన భావాలన్నీ దాని లోంచి ఉద్భవిస్తున్నాయి. ఇది మనది కావాలి అనేటటువంటి ఆశచేత తక్కిన వన్నీ ఏర్పడుతున్నాయి. పోనీ కర్మఫలితం మన ఆధీనంలో వున్నదా? దైవం మనలను అనుగ్రహించడం, అనుగ్రహించకపోవడం మన ఆధీనంలో వున్నదా? అంటే మన అధీనంలో వుంటే అది అనుగ్రహమెలా అవుతుంది? మనం సాధించుకునేదవుతుంది. కనుక సర్వం - అంటే భగవంతుని అనుగ్రహం దగ్గరనుంచి మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలుదాకా ఇంత జగత్తులో ఏదీ మనమను కున్నట్లు నడవడం లేదు. అప్పుడు ఏది మనది?

ఈ విధంగా ప్రతి విషయాన్నీ తీసుకుని మనస్ఫూర్తిగా ఆలోచించు కుంటూ అవగాహన చేసుకుంటూపోతే, అంటే అటువంటి యోచనాపద్ధతి అలవరచుకుంటే అప్పుడు వ్యర్థమైన భావాలు మన హృదయంలో వుండవు. అయితే ఆ భావం లేకుండాపోగానే వాడు ఇల్లూ, వాకిలీ లేకుండా రోడ్డుమీద పడతాడని అర్థంగాదు. ఆ ప్రాప్తి వాడికి కలిగిననాడు యివన్నీ వున్నా గూడా వాడిని బయటకు నెట్టివేస్తారు. లేకపోతే అట్లా బయట తిరుగుతుండేవాణ్ణి

తీసుకొచ్చి లోపల కూర్చోబెడతారు. మహేష్ యోగిగారి గురువైన బ్రహ్మానంద సరస్వతీస్వామి ఉన్మత్తావస్థలో వుండి అరణ్యంలో అటూ యిటూ తిరుగుతుండేవారు. ఆయనను చాలాకాలంపాటు ప్రార్థించి, ప్రాధేయపడి తీసుకొచ్చి మరీ జ్యోతిర్మయీ పీఠం మీద కూర్చోబెట్టారు. ఆయన తనకా స్థానం వద్దు మొర్రో అంటున్నా ఆయనను సింహాసనమెక్కించారు. మరొక చోట బ్రహ్మాండమైన మరొక పీఠంలో ఆ పీఠానికి అర్హుడైన శిష్యుడైన వాడొకడున్నాడు. వాడికి ఉత్తరాధికారం వస్తుందన్న ఈర్ష్యలో అతనికి విషంపెట్టి చంపి మరొకడు ఆ పీఠమెక్కాడు. కనుక ఆ దేహానికి సింహాసనం మీద కూర్చునే యోగం వున్నప్పుడు నాకొద్దు అంటున్నా వాడిని తీసుకొచ్చి సింహాసనం మీద కూర్చోబెడుతున్నారు. ఆ దేహానికి ఆ యోగం లేనప్పుడు అర్హత వున్నాగూడా వాడిని కాదని మరొకడు కూర్చుంటున్నాడు. కాబట్టి మనకు పైన చెప్పినటువంటి అవగాహన కలిగినా గూడా ఎక్కడికీ వెళ్ళడమంటూ జరుగదు. పోనీ నా అనే భావం పోయింది గనుక ఎక్కడికైనా వెళ్తాడనుకుందాం. ఒక చెట్టు క్రిందకు వెళ్ళాడే అనుకుందాం, ఆ చెట్టు తనదనుకుని వెళ్తాడా? లేక స్మశానానికి వెళితే అది తనదనుకుని వెళ్తాడా? కనుక అల్లామాలిక్ అనుకున్నప్పుడు ఎక్కడికి వెళ్ళగలడు? ఎక్కడ వుండగలడు? కనుక ఎక్కడవున్నా అది ప్రభువుదని గుర్తుపెట్టుకోవడం ప్రధానమవుతుంది గనుక ఇక్కడకు వెళ్ళడమా, అక్కడకు వెళ్ళడమా అన్న ప్రసక్తి వుండదు. అందుకని భగవంతుడు ఎక్కడ వుంచితే అక్కడే వుంటాడు. అలాగాక ఎక్కడికైనా వెళ్ళి కూర్చున్నాడంటే ఇది తనది కాదని, అది తనదనీ అనుకున్నట్లే గదా! అందువలన ఒరిగేదేమున్నది? ఈ విషయాన్నే ఒకసారి సాయి అద్భుతంగా బోధించారు.

ఒకసారి మశీదులో అందరూ కూర్చునివున్నారు. ఒక పది సం॥ల పిల్ల వచ్చి మశీదులో ఒకచోట కూర్చుంది. ఇంతలో ఒక సాధువు వచ్చి ఆ పిల్లను 'లే, ఇక్కడనుంచి' అని గదిమి ఆ పిల్లను లేపి తను కూర్చున్నాడు. విషయమేమిటంటే రెండుమూడు రోజులనుంచి ఆ సాధువు అక్కడ కూర్చుంటున్నాడు. ఆ రోజు అతనికంటే 5ని॥లు ముందువచ్చి ఆ పిల్ల అక్కడ కూర్చున్నది. అందుకని ఆ పిల్లను లెమ్మని తాను కూర్చున్నాడు. వెంటనే బాబా ఉగ్రులయ్యారు. అందరినీ తక్షణమే అక్కడనుంచి వెళ్ళిపొమ్మన్నారు. ఒకళ్ళనుగాదు, అందరినీ

వెళ్ళిపొమ్మన్నారు. అప్పుడా సాధువు అనుకున్నాడు- పాపం వీళ్ళంతా లౌకికులు, పామరులు - వీళ్ళ మనస్సులలో ఏదో చాంచల్యం కలిగివుంటుంది, అందుకని ఆయన పొమ్మన్నాడు, తనను కాదులే అని అనుకున్నాడు. అతడు మాత్రం కూర్చునే వున్నాడు. వెంటనే బాబా 'నువ్వు కూడా వెళ్ళు' అన్నారు. అతడు కూడా బయటకు వెళ్లాడు గాని, తనలోని ఓరిమిని, నిరహంకారాన్నీ పరీక్ష చేయడానికి బాబా అలా అన్నారు గాని మరేం లేదులే అని మళ్ళీ వెళ్ళి కూర్చోబోయాడు. బాబా, 'ఛో, బయటకు!' అని గర్జించారు. అలా అనడంలో ఆయన ఉద్దేశ్య మేమిటి? "నాలుగు రోజులు ఒకచోట నువ్వు కూర్చున్నంత మాత్రాన ఆ చోటు నీది, మరొకరు అక్కడ కూర్చోగూడదు' అనే స్థితికి వచ్చావా? 'ఏదీ నాది కాదు' అని గ్రహించడం కోసం, తెలుసుకోవడంకోసం సన్యాసి వేషం వేసుకున్నావు. కాని నాలుగు రోజులు ఒకచోట కూర్చున్నంతమాత్రాన ఆ జాగా నీది అయిందా? మరొకరిని లెమ్మనేదాకా వచ్చిందా వ్యవహారం? మరి నువ్వు వదలిపెట్టినదేమిటి?' అని అంటున్నారు. అయితే 'మరి మీ సంగతేమిటి?' అని సాయిబాబాను అడుగుదామా? అంటే అలా అడిగే ధైర్యం ఎవరికున్నది? అలా అడగగల మొనగాడు నానావల్లీ. "నువ్వు మమ్మల్ని అడిగావు. బాగానే వుంది. కాని నీ సంగతేమిటి?" అని బాబాను అడగగల సత్తా అతనికి వుంది. అయితే నిరూపణ అయిన తర్వాత ప్రాణాలర్పించే గుణమూ అతనిలో వున్నది. లోకంలో ఒకటే చూస్తాముగాని మరొకటి చూడము. లోపల వున్న శంకను అడగలేరు. ఒకవేళ అడిగినా తర్వాత ఆయన కోసం ఏదీ యిచ్చేందుకు సిద్ధంగా వుండరు. నిరూపణ అయిన తర్వాత పూర్వంలాగే వుంటారు. ఇక్కడ నానావల్లీ సచ్ఛిష్యుడు ఎలా వుండాలో నిరూపించాడు.

ఒకసారి బాబా చుట్టూ అందరూ కూర్చుని వున్నారు. దైవస్వరూపంగా తలచి సేవిస్తున్నారు. ఇంతలో నానావల్లీ వచ్చి బాబాను, 'లే, అక్కడనుంచి, నేను కూర్చోవాలి' అని కసిరాడు. బాబా మాట్లాడకుండా లేచి కూర్చున్నారు, ఒక నిమిషం, రెండు నిమిషాలు చూసాడు. బాబా మామూలుగానే వున్నారు. నానావల్లీ లేచి అమాంతం బాబా కాళ్ళమీద పడ్డాడు. బాబా శిరిడీ వచ్చిన మొదటిరోజుల్లో ఆయనను ఎవరూ పట్టించుకోకుండా, పిచ్చివాడిలా అనుకునే రోజుల్లో అయితే ఆయనకు వినమ్రత వుండివుండవచ్చు. కాని పగలనక, రాత్రనక; ఒకరనక,

ఇద్దరనక వేలాది భక్తులు సాక్షాత్తు దైవస్వరూపమని కీర్తిస్తూ, సేవ చేస్తుంటే ఇప్పుడైనా ఆయన 'ఎవర్రా నువ్వు! నన్ను లెమ్మనడానికి?' అని అడుగుతారా లేదా? అని చూసాడు. 'ఇది నాది' అనే భావమేమైనా వచ్చిందా అని చూడడానికి వచ్చాడు. అదీ ఎటువంటి సమయంలో వచ్చాడంటే, ఏమారి వుండడానికి అవకాశం వుండే సమయంలో వచ్చాడు. ఆయన ప్రవర్తన చూచేటప్పటికి అమాంతం ఆయన పాదాలమీద పడ్డాడు.

నానావల్లీ బాబాను పరీక్షించడానికి ఆసనం మీద నుంచి దిగమని చెప్పి తాను కాసేపు కూర్చున్నాడు. కాని బాబా వైఖరిలో ఎట్టి మార్పు రాకపోయేసరికి ఆయన పాదాలపై సాష్టాంగపడ్డాడు. అక్కడనుంచి బయటకు వచ్చాక సాటి వారితో అన్నాడు: "ఇదే అసలైన వస్తువు" అని. అంతేకాదు తన హృదయాన్ని ఆయనకు అంతగానూ సమర్పించాడు. బాబా శరీరం త్యజించిన తర్వాత ఈ శరీరం ఒక నెలరోజులు గూడా వుండదు అన్నాడట. ఆవిధంగానే బాబా సమాధి చెందిన నెల తిరక్కుండానే తానూ శరీర త్యాగం చేసాడు. అదీ పరీక్ష పెట్టడమంటే. బాబాకు పరీక్ష పెట్టాడు, బాగానే వుంది. నెగ్గితే ఏమిచ్చాడు? తన ప్రాణాలనే పణంగా పెట్టాడు, ప్రాణాలర్పించాడు. పరీక్ష ప్రతీవాడు పెడతానంటాడు. కాని యిచ్చేందుకు వాడిదగ్గర ఏమీ వుండదు. శ్రద్ధ వుండదు, భక్తీ వుండదు, నిష్ఠ వుండదు. అంతకుముందు ఎలా వుంటాడో, ఆ తర్వాతగూడా అట్లాగే వుంటాడు. ఈ సంఘటనలో బాబా తన ప్రవర్తన ద్వారా ఏం చెబుతున్నారు - అల్లామాలిక్ అంటున్నారు. "వాళ్ళు తెచ్చి యిక్కడ కూర్చోబెట్టారు కనుక కూర్చున్నాను. వాళ్ళ ద్వారా అల్లా తీసుకొచ్చి యిక్కడ కూర్చోబెట్టాడు గనుక కూర్చుకుంటున్నాను. వీడి రూపంలో వచ్చి లెమ్మన్నాడు గనుక లేచాను. అది నా చోటు అయితే గదా!" అంటున్నారు. బాబా ఈ విధంగా అల్లామాలిక్ అనేదానిని అంత తు.చ. తప్పకుండా పాటించి చూపారు. అందుకని ఏదీ మనది అనే భావం వుంచుకోకుండా అల్లా ఎక్కడ ఎలా వుంచితే ఆ విధంగా వుండాలి. ఏదీ మనది కాదు అనే భావం రావడమంటే సర్వాన్నీ వదలిపెట్టి వెళ్ళడంమాత్రం కాదు. అలా పరిత్యజించి వచ్చిన సన్యాసి ఏం చేసాడు? నాలుగురోజులపాటు కాసేపు మశీదులో ఒక చోట కూర్చున్నంతమాత్రాన ఆ స్థలం తనదేనను కున్నాడు. ఇక సర్వమూ పరిత్యజించినదెక్కడ? తెలియక అక్కడ కూర్చున్న

పిల్లపై కోపగించుకున్నాడు. పోనీ విదానంగా చెప్పవచ్చుగదా! కనుక కోపాన్ని త్యజించలేకపోయాడు. ఎక్కడున్నావో అట్లాగే వుండు, నీ భావనను మాత్రం జాగ్రత్తగా వుంచుకో! అని బాబా సూక్తి చెబుతుంది. కాబట్టి అప్పుడు మనం వదులుకున్నదేమిటి? అంటే మనం పోగొట్టుకున్నదొకటే - ఏదయితే మనకు పనికిరాదో, ఏది మనకు నయాపైసా లాభంలేకుండా సర్వాన్నీ పోగొట్టి మనలను భ్రష్టులను చేస్తుందో, దానిని మనం పోగొట్టుకుంటాము. అంతేగాక మరు జన్మలో గూడ ఆ దుర్గుణాలకు కారణమైన అవగాహన లేనితనాన్ని మాత్రమే మనం వదులుకుంటామన్నమాట. అప్పుడు నేను, నాది అనుకోవడంవల్ల వచ్చే వికృతులు మాత్రమే పనిచెయ్యవు. వాటిననుసరించినటువంటి దుష్టసంకల్పాలు మాత్రమే పనిచెయ్యవు. అప్పుడు అట్టి దుష్టకర్మలు, మనలోంచి పుట్టవు. అట్టి దుష్టకర్మలవల్ల వచ్చే ఫలితమనే ముళ్ళ చక్రంలో మనం తగులుకోము.

మన శరీరంగూడా భగవంతునియొక్క, అల్లాయొక్క, సృష్టిలో ఒక భాగమే. సృష్టిలో అన్నింటిలాగానే ఇదీ ఒక క్రమపద్ధతిన పనిచేస్తుంది. ఎలా అంటే ప్రాణాన్ని లోపలకు తీసుకుంటుంది. అపానాన్ని బయటకు వదులు తుంటుంది. ఈ రెండింటినీ Balance చేస్తూ యింకొకటి వుంటుంది. దీనిని సక్రమంగా జరిగేటట్లుచూసేందుకు మరొకటి వుంటుంది. ఇవ్వి వుండడం వల్ల ఈ క్రియ జరుగుతున్నది. అందువల్లనే ఈ శరీరం నిలవడంగాని, పని చేయడంగాని జరుగుతున్నది. వాటి క్రియలయొక్క వస్తువుగా యిది వున్నదే గాని యింక వేరేదికాదు అనుకున్నప్పుడు నేను, నాది అనే భావన లేకుండా పోతుంది. దీనినే జీవితాన్ని యజ్ఞమయం చేసుకొనడమని అర్థం. అంటే సృష్టిని యజ్ఞంగా దర్శించటమని అని అర్థం. సృష్టికర్త తన సంకల్పానుసారం నడిచేటట్లు ప్రకృతిని నియమించిన ప్రకారం ప్రకృతి పనిచేస్తోంది. అది తెలియక నడిమధ్యన మనకు నాది అనే భావం వస్తున్నది. అని గుర్తుపెట్టు కోవాలి. అందుకనే పూజా విధానంలో గూడా ఆత్మ సమర్పణం చేయమని వున్నది. గురువును సేవించినా, మరెవరిని సేవించినా, బుద్ధిని, ప్రాణాలను, ఇంద్రియాలను, స్వజనాన్ని, అర్థాన్ని - మొత్తాన్ని గురువుకు సమర్పించమని గురుగీతా శ్లోకం చెబుతున్నది. దీనినంతటినీ కలిపి అల్లా మాలిక్ అనే ఒక సూత్రంలో బాబా చెబుతున్నారు.

మనం పూజ చేస్తున్నప్పుడు మొట్టమొదటగా సంకల్పం చెబుతున్నాము. ఆ సంకల్పంలో యిదే విషయాన్ని పొడుగునా గుర్తుపెట్టుకోమని వున్నది. ఏమని? - శ్రీమహా విష్ణువు యొక్క ఆజ్ఞచేత అని, దేశకాలా లన్నింటినీ అందులో చెబుతారు. అంటే ఈ దేశకాలాలు అనబోయేవి అన్ని రూపాలూ ధరించినటువంటి నామరూపరహితమైన ఒకానొక శక్తి ఏదైతే వున్నదో, దానియొక్క సంకల్పంచేత యిక్కడ నిలవడమే యిప్పుడు మనకు దేశంగాను, యిప్పుడు కాలంగానూ అనుభవమవుతూ, అందులో ఈ రూపంతో, యిట్లా కూర్చున్న అనుభూతిని కలుగజేస్తున్నది-అని గుర్తు పెట్టుకోమని ఆ సంకల్పంలో వున్నది. ఇట్లా రోజుకు మూడుసార్లు స్మరించుకోమన్నారు. ఇట్లా సంకల్పంలో చెప్పడం ద్వారా నేను, నాది అనే భావాన్ని తీసిపారేస్తున్నాడు. అందుకని ధ్యానం చేసేటప్పుడు గూడా 'తత్సద్ బ్రహ్మార్పణమస్తు' అనమంటున్నాడు. అంతకుముందు శ్లోకాలలో - తినేవాడు, తినబడేది బ్రహ్మమే అని చెబుతున్నాడు. యజ్ఞకర్తను, యజ్ఞ భోక్తను, హవిస్సును నేనే అని చెబుతున్నాడు. అప్పుడు, జరుగుతున్నది అంతా భగవంతుని లీలగా గుర్తించడమనేది జరిగి ఇది నాది, ఇది నీది అనే వ్యవహారం తగ్గుతుంది. మరొక ప్రక్కనుంచి అన్ని రూపాలలో ఆయనే వున్నాడనే భావం కమ్ముకొస్తుంది. ఇలా వివేకంతో, ఆలోచనతో అంతకుముందు మనలో పేరుకొని వున్న ఆలోచనలను తీసిపారేస్తున్నాం. అంతే జరుగుతున్నది. ఎట్లాగూ జరుగుతున్నది ఆ భగవంతుని లీలే. దానిని గుర్తించే స్థోమత లేక పోవడంచేత, అట్టిది ఒకటుందని మనకు తెలియక, ఇది నేను, నాది అనే భావం నానాటికీ వచ్చింది. ఎందువల్ల వచ్చిందీ అంటే అనాలోచితంగా జీవించడంవల్ల వచ్చింది. ఎలా? చిన్న పిల్లవాడు బంతి కావాలని సరదా పడుతు న్నాడు. అది కొనుక్కొచ్చేలోపల పక్కింటి పిల్లవాడి బంతి అడిగి తీసుకొచ్చి వాడికిచ్చామనుకోండి. ఇంతలో వాళ్ళ పిల్లవాడు వచ్చి తనకూ బంతి కావాలని గొడవ చేస్తుంటే వాళ్ళు వచ్చి వాళ్ళ బంతి తీసుకు వెళ్తుంటే వీడు గొడవ పెడతాడు. ఎవడిచ్చాడో వాడి బంతి వాడు తీసుకుపోతుంటే వీడు ఏడవడ మెందుకు? వీడి బంతి వాడు తీసుకుపోతుంటే ఏడిస్తే అర్థమున్నది. కాని వాడి బంతి వాడు తీసుకుపోతుంటే ఏడవడమేమిటి? వాడి బంతి నాలుగురోజులు ఆడుకోవడానికి యిచ్చాడని సంతోషించక తన బంతినే వాడు ఎత్తుకుపోతున్నట్లు ఏడుస్తాడు. ఎందుకని? అది తనది కాదన్న

సంగతి, అది వాడిదేనన్న సంగతి మర్చిపోయి తనదనే భావం పెంచుకుని అందులో యిరుక్కు పోయాడు. అది నాది కావడానికి అవకాశం లేదు. కాని సంతోషించడానికి తనది కాకపోవడంతో సంబంధం లేదు అనే సంగతి వాడికి తెలియాలి. అది తనది కావడానికీ, సంతోషించడానికీ సంబంధమేలేదు. అది వాడిదైతే ఎక్కువ సంతోషముంటుందన్నది అబద్ధం. ఎవరైనా ఎత్తుకుపోయి నప్పుడు, అది పోయినప్పుడు ఎక్కువ బాధపడతాడు, లేకపోతే పోతుందేమోనని భయం వుంటుంది. తనది కాకపోతేనేమి, ఆడుకున్నన్నాళ్ళు హాయిగా ఆడు కున్నాడు కదా!

మనం నాదనే భావంవల్ల సంతోషం వుంటుందని భ్రమిస్తున్నాము. కానీ అదీ వుండదు సరిగదా, దుఃఖ, ద్వేష, అసూయాది భావాలు మాత్రమే వుంటాయి. అనుభవం మాత్రం నాదనే భావం వున్నవాడికి ఎంతో, లేనివాడికీ ఒకటిగానే వుంటుంది. ఈ సంగతి తెలిసే మనవాళ్ళు అటువంటి సంస్కారాలతో జీవితాలను పూర్తిగా నింపేసారు. అందుకనే పూజ చేసేముందు సంకల్పం చెప్ప మన్నారు. ఏమని? పూజ చేస్తున్నాను అని చెప్పమన్నారు. ఎలాగూ పూజ చేయ బోతూ పూజ చేస్తున్నాను అని చెప్పడమెందుకు? అంటే- వూరికే పూజచేస్తున్నాను అని చెప్పడం కాదు, ఏ విధంగా చెప్పాలో గూడా అందులో చెప్పారు : శ్రీ మహా విష్ణువు యొక్క సంకల్పంచేత, నామరూపరహితమైన శక్తి, ఈ అనంతమైన విశ్వరూపం ధరించినప్పుడు, అందులో కాలమనేది వచ్చినప్పుడు, అందులో ఈ జంబూద్వీపము, భరత వర్షము, భరతఖండము అనే రూపాలు ధరించినప్పుడు, ఈ నా స్వ (వసతి) గృహమని నాచేత వ్యవహరించబడే యిక్కడ, ఈ శరీరంలో ప్రకటమైన, ఫలానా నామధేయంగల నేను- అని చెప్పమన్నారు. అంటే దీని కంతటికీ మూలమైన దానిని గుర్తుపెట్టుకోమని చెబుతున్నారు.

ఈ విషయం బాగా అర్థంగావడానికి ఒక ఉదాహరణ : ఇవాళ మన మందరమూ యిక్కడ కూర్చుని సత్సంగం చేసుకుంటున్నాము. దీనికి కారణ మేమిటి? దీనికి మొదలేది? అంటే ఈనాడు మనం యిక్కడ కూర్చుని మాట్లాడుకోవడానికి గల సంబంధానికి ప్రారంభమెక్కడ? కొద్దిగా ఆలోచిద్దాం. నేను ఈ ఉద్యోగంలో వుంటూ, మీరు ఆ ఉద్యోగాలలో వుంటూ, నేను శిరిడీ వెళ్ళడము, మీరు శిరిడీ వెళ్ళడము, మీకూ, నాకూ సాయిపట్ల ప్రీతి కలగడము,

మనకు ఈ అనుబంధం కలగడమూ కారణమన్నమాట. దీనికి నేను మా కుటుంబంలో అట్లాంటి పరిస్థితులలో పుట్టడము, మీరూ మీ కుటుంబాలలో అట్లాంటి పరిస్థితులలో వుండి, అటువంటి నిర్ణయాలు తీసుకుంటూ వుండివుండాలి. మనమంతా ఒకే కాలంలో జీవించాలి, ఒకే కాలపు మహాత్మునితో సంబంధం వుండివుండాలి. దీనికి కారణం మా పెద్దలు అలాంటి పరిస్థితుల లోనూ, మీ పెద్దలు అటువంటి పరిస్థితులలోనూ వుండి వుండాలి. ఇందులో ఏది జరుగక పోయినా యిప్పుడీ సంఘటన జరుగదు. ఇట్లా వెనుకకుపోతే ఆంధ్రదేశ మనేది ఒకటి ఏర్పడి వుండాలి, భరతవర్షమనేది వుండాలి, దానికోసం జంబూ ద్వీపం ఏర్పడి వుండాలి. దానికోసం భూమి ఏర్పడి వుండాలి. అంటే ఆధునిక విజ్ఞానం చెబుతుంది - మొదట సూర్యగోళం ఒకటే వుండేదనీ, పెద్దనక్షత్రమేదో దాని సమీపంలోంచి వేగంగా దూసుకు వెళ్ళిందనీ, దాని ఆకర్షణ శక్తికి సూర్య గోళం నుంచి ఒక పదార్థం లాగుకోబడిందని, అది వెళ్ళి నక్షత్రాన్ని కలుసుకునే లోపల ఆ నక్షత్రం వెళ్ళిపోవడంచేత ఆ పదార్థపు ముక్కలు నడిమధ్యలో వదలి వేయబడ్డాయని, అవి మెల్ల మెల్లగా చల్ల బడడంచేత ఈ గ్రహాలు ఏర్పడుతూ వచ్చి, అందులో భూమిగూడా ఏర్పడిందనీ చెబుతుంది. కనుక ఆనాడు ఆ నక్షత్రం గనుక అట్లా వెళ్ళకుండా వుండివుంటే భూమి ఏర్పడేదే గాదు, దానిమీద జంబూ ద్వీపము, భరతవర్షము ఏవీ ఏర్పడేవి కావు. నేను, మీరుగూడా వుండే వాళ్ళము గాము. ఈ సత్సంగం చేసుకునేవాళ్ళమూ గాదు. అంటే ఆనాడు ఆ నక్షత్రం సూర్యుని ప్రక్కనుంచి వెళ్ళడం - ఈనాడు మనం యిలా కూర్చుని సత్సంగం చేసుకోవడానికి కారణమన్నమాట. దానికి కారణం ఆ సూర్యుడు, ఆ నక్షత్రమూ ఏర్పడడం, దానికి ఆధారమైనది వుండడమూ అన్నమాట. దీనిలో ఏ ఒక్కటి జరుగకున్నా యిది జరుగదు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోమని ఆ పూజా విధానంలోని సంకల్పంలో చెబుతున్నారు. అంటే అక్కడ అనంతంగా జరుగుతుండే క్రియలో ఒక భాగంగా యిక్కడకు నీవు వచ్చావు. అందులో ఈ క్రియ నీవల్ల జరుగుతోంది అని గుర్తు పెట్టుకోమన్నారు. లేకపోతే మనం ఏమని చెబుతామంటే - భగవంతుని 'ప్రీతి కోసం నేను పూజ చేస్తున్నాను' అంటాను. "ఈ 'నేను పూజ చేస్తున్నాను' అనే భావాన్ని నువ్వు వదులుకుంటే గాని, భగవంతునికి దగ్గిర కావు. కాబట్టి సంకల్పం మేము చెప్పినట్లు చెప్పితే నీకు ఆ భావం

కలుగుతుంది" అని చెప్పారు. అందుకని ప్రతిరోజూ భావయుక్తంగా చేస్తుంటే మనకాభావం బలపడుతుంది. దీనినే సాయి 'అల్లామాలిక్' అని ఒక్క మాటలో చెప్పారు. ఆయన చెప్పిన ఆ ఒక్కపదంలో ఇంతటి భావం యిమిడి వున్నది. 'అల్లామాలిక్' అని గుర్తుపెట్టుకో, దానిని గురించే ఆలోచించు, అని చెప్పారు. ఆలోచిస్తే, మనవల్ల జరిగే ప్రతిక్రియా మనవల్ల జరిగేది కాదని తెలుస్తుంది. ఏదైనాసరే మన చేతుల్లో లేదని తెలిసిపోతుంది. మన జేబులో డబ్బు పోవడం గూడానా? అంటే అదీ అంతే. మన జేబులో ఆ డబ్బు వుండబట్టేగదా, కొట్టేశాడు. మనం ఎక్కిన ట్రైములోనే, ఆ బస్సులోనే వాడూ ఎక్కబట్టేగదా కొట్టేశాడు. అంటే ఆ సమయంలో ఆ బస్సు ఎక్కవ సిన పని వుండబట్టేగదా అది జరిగింది? అంటే పోయేదెటూ పోతుంది గనుక అజాగ్రత్తగా వుండమనా? అంటే అజాగ్రత్తగా వుండమని కాదుగాని, ఈ జాగ్రత్త వల్ల రక్షింపబడేది ఏమీలేదుకాని 'అజాగ్రత్తగా వుండడంవల్ల పోయింది' అనే బాధ మనలను వేధిస్తుంది కనుక ముందే జాగ్రత్త పడాలి. అయితే ఎంత జాగ్రత్తపడినా మనం పోయేదానిని కాపాడుకోలేము. పోయే సమయానికి వెళ్ళవలసిన చోటుకు, అది నాలుగుకాళ్ళమీద నడిచి పోతుంది. మనమే శుద్ధంగా మరచిపోయి వస్తాము. ఈ మధ్యనే ఒక మిత్రుడు ప్రక్క వూరిలో డబ్బువసూలు చేసుకోడానికి వెళ్ళాడు. రావలసిన బాకీలన్నీ ఆరోజు వచ్చాయి. రాత్రి బండికి తన వూరుకు వెళ్ళాలి. ఈ లోపు తెలిసిన వ్యక్తితో మాట్లాడుతూ, మాట్లాడుతూ బయట అరుగుమీదే అలాగే పడుకుని నిద్ర పోయాడు. పైజేబులో కొన్ని వేలరూపాయలు, ప్రక్క జేబులో, లోపలి జేబులో, కొన్ని వేలరూపాయలు వున్నాయి. అంతే, ఎవడో కాజేసాడు. ఇంతకంటే అరటి పండు వలచిపెట్టడం యింకేమైనా వుందా? ఆ మనిషితో కాసేపు మాట్లాడి రాత్రి బండికి వెళ్ళిపోవాలనుకున్నాడు. పోనీ అటు వెళ్ళినవాడూ కాలేదు, ఆ పైకం జాగ్రత్త పెట్టుకున్నవాడూ కాలేదు. పైజేబులో పెట్టుకుని బయట అరుగు మీద పడుకుని, ఒళ్ళు తెలియకుండా నిద్రపోతే నువ్వుతీసుకోరా నాయనా అని వాడికి చెక్కురాసి యిచ్చినట్లు అయింది కదా! అది వెళ్ళేటప్పుడు ఆ విధంగా బయటకు వెళ్తుంది. ఏదైనా సరే అంతే. అయితే జాగ్రత్త పడవద్దా అంటే జాగ్రత్త పడడం ఒకందుకు మాత్రమే. మనం జాగ్రత్తపడి వుంటే పోయేది కాదుగదా! అని మనకు అనిపించకుండా మాత్రమే అది పనికి వస్తుంది. ఇంకెందుకూ కాదు. మనం

పడవలసిన జాగ్రత్త ఏమన్నా వుంటే అది ఒక్క చోట మాత్రమే వుంది - అదే 'అల్లా మాలిక్' అని గుర్తు పెట్టుకోవడం. నిష్ఠ, సబూరీలతో అల్లామాలిక్ అని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నం చేస్తూ మనకు చేతనైనంత వరకూ జాగ్రత్తలు తీసుకుంటూపోవాలి. దానికి దోహదం చేసేందుకు మంత్రం ద్వారాను, ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రమూ సంధ్యా వందనం ద్వారాను, పూజ ద్వారానూ గుర్తుచేసుకుని, తెలుసుకుని చేయాలి. తెలుసుకోకుండా చేస్తే మనం ఏ భావంతో చేయాలో, మన భావాన్ని ఎలా శుద్ధి చేసుకోవాలో తెలియడం కోసం మన ఋషులు సంకల్పం అలా, ఆ విధంగా వుండాలని ఏ కారణంగా అయితే రూపకల్పన చేసారో దాని ప్రయోజనం లేకుండా పోతుంది.

అర్థం తెలియకుండా, భావం తెలుసుకోకుండా సంకల్పమూ, పూజ చేయడంవల్ల మన పెద్దలు చెప్పిన ఫలితం మాత్రం ఎట్లా వస్తుంది? నిత్యమూ మననం చేసుకోవడంవల్ల, భావం దృఢపడడంవల్ల, జీవితంలో సరియైన సంస్కరణ కలుగుతుంది. ఒక పెయింటర్ వున్నాడనుకోండి, అతను - ఒక కాన్వాస్ గుడ్డను గాని, ప్లైవుడ్‌నుగాని తీసుకుని ముందు దానిమీద ఏదో ఒక రంగు వేస్తాడు, తాను వేయదలచుకొన్న బొమ్మలను బట్టీ ముందు దానికి తగిన రంగు వేస్తాడు. ఆ రంగుమీద ఏవిధమైన రంగులతో బొమ్మవేయాలో తర్వాత నిర్ణయించుకుంటాడు. ముందు బొమ్మవేయడానికి వీలుగా సిద్ధం చేసుకుంటాడు. ఎలాగంటే, చాక్‌పీస్‌తో వ్రాయడానికి ముందు బ్లాక్‌బోర్డును శుభ్రంగా తుడుచుకున్నట్లు. అదే రీతిన పూజా పునస్కారాలతో సంస్కరించుకోవలసిన భావాన్ని సంకల్పంతో ఏర్పరచుకోమని చెప్పారు. అంటే సత్వ ప్రధానంగా నీ మనస్సును చేసుకుని తర్వాత పూజగాని, ఏదైనాగాని చెయ్యి అని చెప్పారు. భావయుక్తంగా నువ్వుచేసే దానిని గూర్చి, సంకల్పంగూర్చి మననం చేస్తే వచ్చేదాని ఫలితమే సాత్వికమైన భావము. అందులో నీది, నాది, వాడిది, వీడిది అనేది ఏమీ లేదు. అంతా ఈశ్వర సంకల్పమే - అన్ని రూపాలలో ఈశ్వరుడే వున్నాడు - అన్న అవగాహనే సాత్వికభావం. ఆ విధంగా భావనచేసి ఆ స్థితి తెచ్చుకోమని చెప్పారు. అప్పుడు జపంగాని, పూజగాని, ధ్యానంగాని చేయి అని చెప్పారు. కాబట్టి ఏదైతే బాబా చెప్పారో, ఏదైతే భగవద్గీత చెప్పిందో, అది అంతా గూడా మన భావనకు రావడం కోసం మన పెద్దలు సంకల్పం చెప్పారు.

కాబట్టి అర్థం చేసుకునే చెయ్యాలి. తెలియకుండా చేస్తే ఫలితం వస్తుందనేది లేదు, రాదుగూడా. పూజ ఎలాగూ చేస్తున్నప్పుడు అర్థం తెలుసుకుని చేస్తే పూజకంటే అప్రధానమైనవి వచ్చి నీపూజను చెడ గొట్టకుండా వుంటాయి. అదే అక్కడ జరిగేది. అంటే ఏమిటన్నమాట- మనమేదైతే యింతవరకూ నేర్చు కున్నామో, ఆ మొత్తానికి అర్థం చెప్పేటటువంటిది అల్లామాలిక్ అనే ఒక్కమాట, మొత్తం సంకల్పంలో చెప్పబడిన దాని అర్థమంతా, పురుషసూక్తం యొక్క అర్థ మంతా గూడా బాబా చెప్పిన 'అల్లా మాలిక్' అనే ఒక్కమాటలో యిమిడివున్నది. అయితే ఈ సంగతి వూరికే తెలుసుకుంటే చాలదు. ఎప్పుడూ గుర్తుపెట్టుకుని వుండాలి. ఊరికే గుర్తుపెట్టుకుంటే కూడా చాలదు. యోచనతో అది సరియైన దని మాటిమాటికీ గుర్తిస్తూనే వుండాలి. కాబట్టి బాబా చెప్పేటటువంటి ఆ ఒక్కసూక్తినీ మననం చేయుడంలో నిష్ఠ, సబూరీలు రెండూ కలుస్తు న్నాయి. నిష్ఠ బొమ్మ అయితే సబూరీ బొరుసు. ఈ రెండూ కలిసి అల్లామాలిక్ అనేటటు వంటి పదం కాసురూపం ధరించింది. అందుకని అటువంటి సాయి వాక్యాల న్నింటినీ గూడా-ఉపనిషత్తులకు బాష్యమెలాగైతే వున్నదో, ఎంత లోతుగా వాటిని ఆలోచించవలసి వుంటుందో, అంత లోతుగానూ ఆలోచించ వలసి వుంటుంది. బాబా సూక్తులకే కాదు, బాబా చర్యలకు గూడా అంతటి అర్థమున్నది. నానావల్లీ లెమ్మనగానే ఆయన లేచారంటే ఆయన ఆ చర్యకు అర్థమేమిటి? 'అల్లామాలిక్' అన్నపదం యొక్క వ్యాఖ్యానం. 'నువ్వక్కడనుంచి లేవడమే గాదు, నేనక్కడ కూర్చుంటాను' అని గూడా అన్నాడు నానావల్లీ. అప్పుడూ బాబా చర్యకు ఒకటే అర్థం - అల్లా మాలిక్ అనే. విజయానందుడిచేత భాగవతం చదివించడంలోని ఆయన భావమేమిటి? అతడు అంతటి ఒత్తిడిలో తొందరగా, నిష్ఠగా చదివి నపుడు భాగవతంలో అసలు ఏమి చెప్పదలచారో అది గుర్తువుంటుంది. అలా గాక రోజూ కొంచెంవింటే కథాభాగంలోపడి అసలు నేర్చుకోవలసిన దానిని మర్చిపోతాము. అందులోని కథలద్వారా బోధించదలచుకున్న తత్త్వాన్ని మర్చి పోతాము. అలాగాక ఆ కథను ఏకధాటిగా పారాయణ చేసినపుడు, ఆ కథ దేనినైతే ఉదహరిస్తుందో ఆ సూత్రాలు జ్ఞాపకముంటాయి. నేను ఉపన్యాసం చెబుతున్నాననుకోండి - మధ్యలో ఒక్కొక్క కథను తీసుకొని ఆ కథలోకి వెళ్ళిపోయాననుకోండి. అప్పుడు అసలు నేను ఏ సూత్రం వివరించడం కోసం ఆ

కథను చెబుతున్నానో మరుగునపడి కథమాత్రమే సాగిపోతుంది. అలాగాక కథ తగు మాత్రంగా చెబుతూపోతున్నప్పుడు నేను చెప్పబోయే సూత్రాన్ని బల పరుస్తూ పోతుంది. ఆ విధంగానే విజయానందుడిచేత అంత త్వరలో భాగవతం చదివించడంలో బాబా అతని దృష్టిని ఆయన చెప్పదలచుకున్న తత్త్వంవైపుకు తీసుకువెళ్ళారు. అంతేకాదు, ఈ 'అల్లామాలిక్' అన్న పదంయొక్క వివరణ క్రింద, అన్వయం క్రింద, నిత్యజీవితంలో దానిని అన్వయించుకోవడం ఎలాగో తెలియడంకోసం మరొక మాట గూడా చెప్పారు- 'మనలను భగ వంతుడు ఎలా సృష్టించాడో అలానే వుండాలి'అని, అంటే 'నిన్ను భగవంతుడెలా చేసాడో అలానే వుండాలనీ చెప్పారు. 'అల్లామాలిక్' అనే దానికి అర్థం నిజంగా అవగాహన అయినవాడికి సహజంగా నిలిచే భావనే అది. నిష్ఠ, సబూరీలకు అర్థం తెలిసిన వాడు సహజంగా అలానే వుంటాడు. మనం యిప్పటివరకూ నిష్ఠ, సబూరీల గురించి వివరించుకున్న దానిని బాగా ఆలోచించి, అవగాహన పెంచుకుంటూ పోతే సహజంగా వచ్చే పరిస్థితే అది. అయినా ఆ భావన ఆయన చెప్పేదాకా మనకు తోచదు. 'అల్లామాలిక్' అని ఆయన చెప్పాడు. మనం చక్కగా వివరించుకున్నాము. బాగానే వుంది. కాని 'భగవంతుడు మనలనెలా వుంచితే అలానే వుండాలి' అని ఆయన చెప్పినప్పుడు 'అదేమిటి?' అనిపిస్తుంది. మళ్ళీ కొత్తగా వింటున్నట్లే అనిపిస్తుంది. ఇంతకు ముందు చెప్పినదే కాని ఎప్పుడూ చెప్పని దానిని విన్నట్లే వింటున్నాము. అంటే ఒకచోట చెప్పబడ్డ సత్యాన్ని అన్నిచోట్లా అన్వయించుకోవడంవంటి అభ్యాసం మన మనస్సుకు ఎంతగా లేకుండా పోయిందో తెలుస్తుంది.

ఉదాహరణకు ఒక కుటుంబం విపతరీతమైన కష్టాలలో వుంది. వారికి తెలిసిన బంధువులొకరు వారి కష్టాలు చూడలేక తన యింట్లో వుండమన్నారు. వాళ్లా వున్నారు. వాళ్ళకు 7,8 సం॥ల పిల్లవాడు వున్నాడు. వాడు వాళ్ళింట్లో వస్తువులను చూసి 'నాకది కావాలి, యిది కావాలి' అని మారాం చేస్తున్నాడు. అప్పుడు వాళ్ళమ్మ, మనకు ఏమీ లేకపోతే వాళ్ళు ఆశ్రయమిచ్చారని, అవన్నీ మనవి కావనీ, అట్లా మారాం చేయవద్దనీ వివరించింది. వాడు కాసేపు ఆలోచించి అవును, నిజమే అడగకూడదు అనుకుంటాడు. కానీ, కాసేపు అయిన తర్వాత మర్చిపోతాడు. మళ్ళీ వాళ్ళ పిల్లవాడికేదో వుంటే అది తనకు కావాలని మారాం

చేస్తాడు. అది నాకిస్తావా? లేదా? అని వాళ్ళ పిల్లవాడి మీదకు పోతాడు, తల్లి పదే పదే జ్ఞాపకం చేస్తుంటుంది. అలాగే బాబా కూడా మనకు పదే పదే 'అల్లామాలిక్', 'అల్లామాలిక్' అని జ్ఞాపకం చేస్తూ వుంటాడు. అప్పటికీ మనకు అర్థం కాకపోతే, 'అల్లా మనలను ఎట్లా వుంచాడో అట్లా వుండడం నేర్చుకో వాలిరా' అని చెప్తారు. ఆయనకుగూడా మనతో యిదే గొడవ. పదే పదే చెబుతూండవలసిందే. ఎందుకంటే ఆయన చెప్పే ఆ ఒక్క సూత్రాన్ని జ్ఞాపకం పెట్టుకుంటే చాలు, జీవితం మొత్తం మారిపోతుంది. అల్లాయే మాలిక్ అయిన తర్వాత మనం యిట్లా వుండాలి, అట్లా వుండాలి అనుకోవడానికి వీలవు తుందా? ఎలాగూ మనం ఎట్లా వుండాలో అట్లాగే వుంటాము. మరొక విధంగా వుండాలనుకోవడం అజ్ఞానం తప్ప మరేమీ కాదు. అందుకని ఎట్లాగూ వుండాలని అనుకోగూడదు. అనుకోవలసిన అవసరమూ లేదు. అనుకున్నా, అనుకోక పోయినా ఒకలాగానే వుంటాము. కనుక ఫలానా విధంగా వుండాలి అని అనుకోవడం ఎందుకు? శ్రమ, దండగ. కానీ, జీవితంలో దుఃఖమంతా ఎక్కడి నుంచి వస్తున్నది? నేను యిట్లా వుండాలి అని అనుకోవడంలో వస్తున్నది. రేపు తాను అనుకున్నట్లు నిజంగా జరిగితే జరుగవచ్చు గాక! కాని ఈ లోపల మన మనస్సు పాడయిపోతుంది. ఎట్లాగంటే 'Operation success, Patient dead' అన్నట్లు. బ్రహ్మాండమైన డాక్టర్ అని ఒకరిని చేర్పించారు; ఆపరేషన్ జరిగింది, రోగి చనిపోయాడు. మరొక డాక్టర్ దగ్గర చేర్పిస్తే బ్రతికేవాడని ఎవరో అన్నారట. అప్పుడు ఒకడు, 'రోగి చస్తే చచ్చాడు గాని ఆ డాక్టర్ ఆపరేషన్ చాలా బాగా చేసాడు' అన్నాడట. అట్లాగే రేపు మన మనుకున్నట్లు మనం కోరుకున్నది నెరవేరవచ్చు, కానీ ఈ లోపల మన భావాలు మనలను మళ్ళీ కర్మలంపటంలో తగుల్కొనేలా చేస్తాయి. కర్మలంపటంలో తగులుకునే సంస్కారంలోనుంచి విడివడడానికోసం చేస్తున్నటువంటి ఆధ్యాత్మికత అనే ప్రయోజనం నశించి, జీవితంలో ఉత్తమమైన ప్రయోజనము, దుఃఖనివృత్తి కోసం మనం చేసే ప్రయత్నమూ సంపూర్ణంగా విఫలమైపోతుంది. అప్పుడు మననను కున్నది నెరవేరినా ప్రయోజనమేమున్నది?

ఉదాహరణకు ఒక చిన్నపిల్లవాడి చేతికి బంగారు మురుగులు వున్నాయి. వాడు బయట ఆడుకుంటున్నాడు. ఎవడో చూసి పిల్లవాణ్ణి చంకనేసుకుని ముద్దుచేస్తూ వెళ్ళి చేతికున్న బంగారు మురుగులు లాక్కున్నాడు. వాడు

లాగుకునేసరికి పిల్లవాడు ఏడ్చాడు. వాడు వెంటనే జేబులోంచి చాక్‌లెట్ తీసి పిల్లవాడినోట్లో పెట్టి, గలగలలాడే గిలక్కాయ ఒకటి చేతికిచ్చాడు. పిల్లవాడు ఏడుపు మానేశాడు. గిలక్కాయ తీసుకోవడంలో మురుగులు పోయాయన్న సంగతి వాడికి తెలియలేదు. అట్లాగే మనం మనకేదో కావాలని కోరుకోవడంలో విలువైన దానిని జారవిడుచుకుంటాము. తర్వాత మనము కోరుకున్నది మనకు లభించవచ్చుగాక, ఈలోపు నష్టపోవడం జరుగుతుంది. అందుకని 'అల్లామాలిక్' అనుకున్నప్పుడు ఏదీ కోరనవసరంలేదు. అన్నీ ఆయనే చేస్తాడు. కనుక అల్లామాలిక్ అనేది మహామంత్రం. దాని వివరణ యింత దూరంవుంది అని సూచిస్తున్నారు బాబా.



అధ్యాయం-14

విశ్వప్రబోధము



మరొక విషయం, భూమి నుండి వృక్షం సారాన్ని గ్రహిస్తుంది. అలాగే భూమిగూడా వృక్షంవల్ల సారవంతమవుతుంది. అదే రీతిన మనం సద్గురు సమాగమం లభించినపుడు మన శరీరం ఆ నేలవంటిదైతే అందులో సద్గురు కృప, స్మరణ మనం నాటవలసిన విత్తనంలాంటిది. ఇందులో ఒక్క అంశము వున్నది. దత్తాత్రేయుల వారు అవధూత రూపంలో దర్శనమిచ్చి, తనకు జ్ఞానమెలా కలిగిందో చెబుతూ ఈ అనంతమైన విశ్వం నుండి 24 మంది గురువుల రూపంలో ప్రబోధిస్తున్నదని చెప్పారు. ఇది భాగవతంలో వున్నది. దానినుండి ఆయన ప్రబోధిస్తున్నదేమిటంటే ఈ అనంతమైన విశ్వము ఆయన రూపమే. ఈ అనంతమైన రూపాలద్వారా ఆయన యొక్క బోధ మనకు అందుతూనే వున్నది. మనమే గ్రహించడంలేదు అని చెబుతున్నారు. దీనికి ఉదాహరణగా మహనీయు లందరిలోనూ ఈ తత్త్వమే ప్రకటమవుతున్నది. వారి జీవితంలోని సంఘటనలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ఒకసారి ప్రవక్త మహమ్మదుల వారు నదిలో స్నానం చేస్తున్నారు. అప్పుడు ఆయనకు నీటిలో కొట్టుకొనిపోతున్న ఒక తేలు కనిపించింది. దానిని రక్షిద్దామనే సంకల్పంతో ఆయన తమ చేతిలోకి తీసుకో బోయారు. వెంటనే అది కుట్టింది. ఆ బాధకు చేతిని వెనక్కు తీసు కున్నారు గాని, వెంటనే మళ్ళీ చేతిలోకి తీసుకున్నారు. మళ్ళీ అది కుట్టింది. వెంటనే చేతిని విదిలించినా మళ్లీ దానిని రక్షించడానికి చేతులోకి తీసుకోవడం, అది తిరిగి ఆయనను కుట్టడం యిలా నాలుగైదుసార్లు జరిగింది. ఆయన ప్రయత్నాన్ని చూస్తున్న ప్రక్కనతను ఆయనతో అన్నాడు ; "ఏమయ్యా! నీకు జ్ఞానంలేదా? నువ్వు దానిని ఒడ్డున పడేద్దామని ప్రయత్నించినపుడల్లా అది కుడుతున్నదే. అది కుడుతున్న కొద్దీ యింకా యింకా దానిని రక్షించే ప్రయత్నమే చేస్తున్నావేమిటి?" అని. అపుడు మహమ్మదులవారు యిలా జవాబిచ్చారుట: " ఆ తేలు అలా కుట్టడంలోనే నాకు ప్రబోధాన్నిస్తున్నది. కుట్టడమనే సహజ గుణాన్ని అది వదిలి పెట్టకపోతే, భగవంతుని నిరంతరం స్మరించుకుంటూ, సకలజీవుల శ్రేయస్సు కోసం పాటుపడదామనుకున్న నా నియమాన్ని నేనెలా వదులుకునేది? అందుకనే

నేను దానిని రక్షించ యత్నిస్తున్నాను. అది నాకు నా గుణాన్ని వదలవద్దు అని నేర్పుతున్నది" అన్నారట. అంటే తెలుసుకునే వాడికి ఎక్కడి నుంచైనా బోధ అందుతూనే వుంటుందన్నమాట.

అలాగే ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో 'బాలకృష్ణ గోస్వామి' అనే ఒక మహాత్ముడుండేవాడు. అతనివద్దకొకడు వచ్చి, "స్వామీ! ఏమిచేసినా నా మనస్సు సంసారలంపటం నుండి బయటపడడం లేదు. మీరు చెప్పినవన్నీ చాలాకాలంగా చేస్తూనేవున్నాను. అయినా ఏమీ మార్పు రాలేదు. ఏంచేస్తే విడివడుతుంది?" అని అడిగాడు. అందుకు గోస్వామిగారు ఏమీ మాట్లాడ లేదు. అప్పుడతను, రెండవసారి అడిగాడు, ఏమీ మాట్లాడలేదు. మూడవసారి అడిగాడు. "ఎన్నిసార్లు అడిగినా సమాధానం చెప్పరేమిటి స్వామీ?" అన్నాడు. అందుకాయన, "సమాధానం కోసమే నేనూ చూస్తున్నాను" అన్నారట. ఆయనలా అంటుండగానే ప్రక్కనేవున్న వెలగచెట్టునుండి ఒక పండు రాలి క్రింద పడింది. అదిగో ప్రసాదం తెచ్చుకోమన్నారు స్వామి. అతడు వెళ్ళి తెచ్చుకున్నాడు. చాలా బాగా పండి వున్నది ఆ వెలగపండు. స్వామి అతనితో, "ఇప్పుడు తెలిసిందా?" అన్నారు. అతడు నాకేమీ తెలియడం లేదన్నాడు. అప్పుడు స్వామి, "నువ్వు మొదటిసారి అడిగినప్పుడు ఆ పండు పడలేదు. రెండవసారి అడిగినప్పుడూ అది పడలేదు. మూడవసారి అడిగినప్పుడు పడింది. అంటే అది ఏమి చెబుతున్నదో తెలుసా? నువ్వు ఏ గురువునైతే విశ్వసించావో, ఏ గురువు బోధనైతే ఆశ్రయిస్తున్నావో, వారిని నిష్ఠ, సబూరీలతో అట్లాగే ఆశ్రయించుకుని వుంటే నీ హృదయం పక్వానికి వచ్చి, అడుగవలసిన అవసరం లేకుండా దానంతటదే చెట్టునుంచి ఆ పండు ఎట్లా అయితే విడివడిందో అదే విధంగా సంసార వృక్షంనుంచి నీవు విడివడుతావు. అందుకు కావలసినదల్లా నిష్ఠ, సబూరీలు మాత్రమే".

కాబట్టి పైన చెప్పుకున్నట్లు మహమ్మదులవారి ఉదాహరణ తీసుకున్నా సరే, గోస్వామిగారి ఉదాహరణ తీసుకున్నాసరే మనకు తెలిసే విషయమేమిటంటే భగవంతుడు ఈ అనంతవిశ్వంలో, అనంత రూపాలతో మనకు ప్రబోధిస్తూనే వున్నాడు. వాటిని గ్రహించడమే మనం చేయవలసినది. అటువంటి బోధను మనం తీసుకోగలిగినపుడు ఒక విషయాన్ని మనం నేర్చుకోవచ్చు. దాని గురించి సాయి, 'సద్గ్రంథాలు చదువు, భగవన్నామముచ్చరించు, పని చెయ్యి' అన్నారు. మరొక సూక్తి- 'ఎవరైతే నా నామమే ఉచ్చరిస్తూ, నన్ను గురించే మాట్లాడుతూ,

నా కథల గురించే వింటూ, నేనుగా మారిపోతారో, వారి కర్మబంధం తీరిపోతుంది' అని ఈ రెండు సూక్తులు చెప్పారు. ఈ రెండవ సూక్తి యొక్క వివరణ ఏమిటి? అని ఆలోచిస్తే సాయి చరిత్రలోని ఒకానొక సంఘటన స్ఫురణకు వస్తుంది.

శ్రీరామనవమి ఉత్సవాలలో హరికథాగానం చేయడానికని దాసగణు మహరాజును శిరిడీకి పిలిపించారు. ఏ క్రొత్తపని ప్రారంభించినా సాయి ఆగ్రహించడం మామూలు. ఏమిటిదంతా అని తిడతారని భయం. అందుకని ఆయనదగ్గరకొచ్చి నమస్కారమైనా చేసుకోకుండా కార్యక్రమం మొదలు పెట్టారు. మద్దెల మొదలైనవి వాయిస్తున్నప్పుడు 'ఏమిటిరా ఈ గోల?' అని అడిగారు సాయి. కథాగానం చేస్తున్నామని చెప్పారు. 'ఆ కథాగానం చేసే వాళ్లే పిలవండి' అన్నారు సాయి. తిడతారో, మరేదైనా చేస్తారోనని భయపడుతూనే వాళ్ళంతా ఆయన దగ్గరకు వెళ్ళారు. ఆయన దాసగణును చూస్తూనే, "ఏమిటి! హరికథ చెప్పడానికి పెళ్ళికొడుకులా తయారయ్యావ్? ముందు ఆ కోటు విప్పేసేయ్. చొక్కా లేకుండా కథాగానం చెయ్యాలి" అని ప్రక్కనున్న ఒకతనికి పూలమాల యిచ్చి దాసగణు మెడలో వేయమన్నారు. అంటే ఆయన హరికథా గానం చేయమంటున్నారు. కాని, వీళ్ళనుకున్నట్లు గాదు. అప్పుడు నా ఆశీస్సులు నువ్వడగకపోయినా వుంటాయని చెబుతున్నారు.

ఈ దాసగణు ఎక్కడ హరికథాగానం చేసినా - రాముని గురించి చెప్పినా, కృష్ణుని గురించి చెప్పినా, మరెవ్వరి గురించి చెప్పినా మొట్టమొదటగా సాయిని గురించి చెప్పి, తర్వాతనే తక్కినవి చెప్పేవాడు. అందుకని ప్రత్యేకమైన స్థానాన్ని అతనికి సాయి కల్పించారు. అయితే, హరికథా కాలక్షేపానికి దాసగణును ఎందుకు సాయి ఆ విధంగా ఆశీర్వదించారు అనేది ఆలోచించవలసిన విషయం. ఎంతో మంది హరికథకులు సాయి వద్దకు వచ్చేవారు. వాళ్ళు గానంచేసి వెళ్ళిపోయేటప్పుడు మాత్రం వాళ్ళకు డబ్బులిచ్చి ఆశీర్వదించి పంపేవారాయన. మామూలుగా అలానే జరుగుతుండేది. కాని దాసగణు విషయంలో మాత్రం అలా చెయ్యలేదు. అతడు పోలీస్ కానిస్టేబుల్‌గా వున్నప్పటి నుంచి గూడా అతనిని ఆ ఉద్యోగం మానెయ్యమనేవారు. మరి నేనెట్లా బ్రతకాలి అంటే హరికథా గానంచేసి బ్రతకమన్నారు. అది జీవనోపాధిగా తిండిపెట్టదుగదా! అంటే, నేను పెడతాను, నేను పోషిస్తాను అన్నారు. దానికి ఆశీర్వచనంగానే ఆ మాల వేశారన్నమాట.

ప్రత్యేకించి అతనికి అంతటి ఆదరణ యివ్వడానికి, దానికి అతని సంస్కారాలే కారణం. ఆ సంస్కారాలేమిటంటే - అతడు ఏ కథాగానం ఎక్కడ చేసినా మొదట తాను ఆశ్రయించిన సద్గురుడైన సాయినాథుని కీర్తించి తర్వాత తక్కిన కథ చెప్పేవాడు. అందుకని సాయి భక్తుల అనుభవాలు చూస్తుంటే ఎంతో మంది దాసగణు హరికథ వినడంవల్ల, అక్కడ సాయి పటం చూడడంవల్ల శిరిడీ వచ్చి సాయి దర్శనం చేసుకున్నట్లు తెలుస్తుంది. అంటే ఏమిటంటే బాబా వాళ్ళను పిలుచుకున్నారు - అందులో సందేహంలేదు. కాని దాసగణుద్వారా పిలుచుకోవడమనేది అతని అదృష్టం. ఆ భక్తులంతా - ఆనాడు దాసగణు చెప్పిన కథ వినబట్టిగదా మనకు సాయి దర్శనం లభించింది అనే సంతోషంతో ఆయనపట్ల ఆత్మీయతా బావాన్ని పెంపొందించుకున్నారు. వాళ్లు అనుకున్నవన్నీ శతకోటి రెట్లుగా ఆశీస్సులుగా అతనికే చెందుతాయి. అదీ అందులోని విశిష్టత. అందుకని మనపూర్వీకులందరూ చెప్పారు - మందిర నిర్మాణంగాని, ఆలయ నిర్మాణం గాని, మహాత్ముల కథాగానము, కథా రచన మొదలైనవన్నీ భగవంతుడు మనకు యిచ్చినటువంటి సేవ అని, అది మహాపుణ్యము అనీ చెప్పారు. అలా చెప్పడానికి గూడా కారణం యిదే. ఎవరెవరు ఆ గ్రంథం చదవడంవల్ల, ఆ కథ వినడంవల్ల ఉత్తేజపడి భగవంతుని మార్గానికి వస్తారో, వారందరి హృదయాలు భగవంతునికి దగ్గరవడానికి నిమిత్తమాత్రులవడం వలన వారికి వీళ్ళందరి హృదయాలనుంచి ఆశీర్వచనం లభ్యమవుతుంది. అదీ అక్కడి రహస్యం. అందుకని సద్గురుని గూర్చి చెప్పడమనే పూర్వజన్మ సంస్కారం అతనిలో వుంది. అందుకనే నేటికీ మన మాయనను తలచుకుంటూనే వున్నాము. అందుకని అతనికి అంతటి అదృష్టం లభిస్తూనే వుంది. అందుకనే ఆటువంటి అవకాశం అతనికి కల్పించారు సాయి.

'నా నామాన్నే స్మరిస్తూ, నన్నే తలచుకుంటూ, నా గురించే వింటూ, నా గురించే మాట్లాడుతూ అనన్యమైన చింతనలో ఎవడైతే వుంటాడో వారి కర్మ బంధం నశిస్తుంది. వాడు కర్మబంధ విముక్తుడవుతాడు' అని సాయి చెప్పారు. ఈ విధంగా చేయడంవల్ల ఎవరైతే మనతో సంబంధంలోకి వస్తున్నారో, వారందరి జీవితం సార్థకమవడానికి మనం నిమిత్తమాత్రులమవుతాము. అన్ని దానాలలోకి అన్నదానం గొప్పదని సామాన్యంగా చెబుతుంటారు. కాని జాగ్రత్తగా గమనించినట్లయితే అంతకంటే గూడా గొప్పది జ్ఞానదానం. ముల్లోకాలనూ దానం చేసిన

దానం చేసిన దానితో అది సమానమని చెప్పారు. దానికి కారణమేమిటంటే - వాడికి ఎన్ని జన్మలైతే వున్నాయో, అన్ని జన్మ పరంపరలనూ అతిక్రమించడానికి కావలసిన మార్గం లభ్యమవడానికి గాని, లేకపోతే అవి ఉత్తమోత్తమంగా సంస్కరింపబడ డానికి గాని, మళ్ళీ వాళ్ళ ద్వారా ఎవరెవరైతే అది విని ఉత్తమ మార్గాన్ని తెలుసు కుంటారో ఆ పుణ్యమంతా మనకు లభిస్తుంది. వాళ్ళు మనవల్ల సన్మార్గంలోపడి ఏ మహాత్ముల ఆశీస్సులైనా పొందితే ఆ ఆశీర్వాద ఫలితం మనకు గూడా దక్కుతుంది. అందుకని ఎవడైతే యితరులు సన్మార్గులు కావడానికి దోహదం చేస్తాడో వాడికి మహాత్ములందరి ఆశీస్సులు లభిస్తూనే వుంటాయి. వారందరి అనుగ్రహము నిరంతరము లభ్యమవుతూనే వుంటుంది. ఎందుకంటే భగ వంతుని ధర్మశాసనం- మూలమైనది ఒకటున్నది. అదేమిటంటే, "నీకు యితరులు ఏమి చేయాలనుకుంటావో, అది యితరులకు నీవు చెయ్యి, నీకు యితరులు ఏమి చేయకూడదని అనుకుంటావో, నీవు యితరు లకు దానిని చేయవద్దు" అని. ఉదాహరణకు మనం భగవంతుని అనుగ్రహం పొందడం కోసం, సాధన చేసుకోవడం కోసం తపిస్తున్నప్పుడు మనకు యింకా సులభమైన మార్గం ఎలా దొరుకుతుందా? ఎవరి అనుగ్రహంతో మనం యింకా ఒక మెట్టు పైకిపోతామా? ఎవరి ఆశీస్సులు మనకు లభ్యమవుతాయా, ఎవరే సూక్ష్మం తెలుపుతారా? అని ఆరాటపడి తిరుగుతాము. మనకు సరియైన ఆధ్యాత్మిక మార్గం ఎలా లభ్యమవుతుంది అని పరితపించే సమయంలో ఎవరైనా మనకు ఆ మార్గం చూపించగలవాడు కన్పిస్తే మనమెంతో సంతోషి స్తాము. అలాగే మనకు దొరికినంత మాత్రం గూడా మార్గం లభించని వాడెవడైనా వుంటే వాళ్ళకు మనకు తెలిసినది చెప్పినపుడు వాళ్ళెంతో సంతోషి స్తారు గదా! అందుకని పై సూత్రాన్ని పాటించి ఆత్మీయులైన వారికి, మన పరిచయస్తులకు ఈ మార్గం తెలుపుతూ వుంటే వాళ్ళు సన్మార్గానికి వచ్చి వాళ్ళకుగూడా మహాత్ముల ఆశీస్సులు లభిస్తే మనకూ ఆ మహాత్ముల ఆశీస్సులు లభిస్తాయి. వాళ్ళుగూడా మనం చేసిన సహాయంపట్ల కృతజ్ఞత కలిగి మనపట్ల ఆత్మీయతా భావం కలిగి వారికి తెలిసిన సన్మార్గం మనకూ చెబుదామనే ప్రీతి కలుగుతుంది. ఇది భగ వంతుడు నాకిచ్చిన అనుగ్రహాలలో ఒకటి. ఇందుకు ఒక ఉదాహరణ : ఫిబ్రవరిలో అనుకోకుండా శిరిడీ వెళ్ళి 14 రోజులుండడం జరిగింది. ఢిల్లీ వెళ్ళవలసిన ప్రోగ్రాం వుండడంవల్ల శిరిడీలో రెండురోజులు మాత్రమే,

వుండడానికి ప్రోగ్రామ్ పెట్టుకుని వెళ్ళాను. మర్నాడు నేను బయల్దేరవలసి వున్నదనగా శివనేశన్‌స్వామికి నేను మర్నాడు బయల్దేరుతున్నానని చెప్పడానికి చూడడానికి వెళ్ళాను. ఆయున ఇప్పుడే వస్తాను వుండమని, నన్ను కూర్చోమని చెప్పి అటు యిటూ తిరుగుతూ ఏదో పని చేసు కుంటున్నారు. ఇంతలో ఒక సన్యాసి అక్కడకు వచ్చాడు. బాగా దృఢంగా వున్నాడు. మంచి తేజస్సుతో వున్నాడు. శివనేశన్ స్వామిని పిలిచి ఏదో మాట్లాడుతూ మాట్లాడుతూ మధ్యమధ్యలో నాకేసి పరీక్షగా చూసి, "నువ్వు భరద్వాజవు గదా!" అన్నాడు. అవునన్నాను. "నేనెవరో గుర్తున్నానా?" అన్నాడు. "గుర్తులేవు" అన్నాను. "మామాజీ గుర్తున్నాడా?" అడిగాడు. అప్పుడు 15సం॥ల క్రితం సంగతి గుర్తొచ్చింది. అప్పుడు యితడు చాలా బక్కపలచగా వుండేవాడు. గొప్ప ధన వంతుల కుటుంబానికి చెందినవాడు. అపారమైన ఉదారభావము కలవాడు. అతడు తరచు శిరిడీ వస్తూండేవాడు. వచ్చినప్పుడల్లా యింటినుంచి పదివేలో, 15వేలో డబ్బు తెచ్చేవాడు. వీడు, వాడు అని లేకుండా అందరికీ సహాయం చేస్తుండేవాడు. ఒకడికి తిండిలేదంటే డబ్బులిచ్చేవాడు. మరొకరికి యింకొక అవసరం. అందుకని ఎవరికి ఏ అవసరం వచ్చినా అతని సహాయమే పొందేవారు. ఇట్లా ఖర్చుపెట్టి ఆ డబ్బు అయిపోగానే మళ్ళీ బొంబాయి వెళ్ళి మళ్ళీ పదో, ఇరవయ్యో తీసుకుని శిరిడీ వచ్చేవాడు. చివరకు వీడి బాధ భరించలేక యింట్లో వాళ్ళు ఖచ్చితంగా చెప్పేసారు. "నువ్వు యిట్లా ఖర్చు పెడుతుంటే యివ్వడం యిక మావల్ల గాదు, నువ్వు యింటిపట్టున వుండి అన్ని బాధ్యతలు తీసుకుంటూ అందరిలాగా వుంటే వుండు. లేకపోతే నువ్వు వెళ్ళదలచుకుంటే ఈసారి నువ్వు తీసుకువెళ్ళే ఈ 20వేలు తీసుకో, ఇదే అఖరు. ఇక యింటికి రావద్దు" అన్నారు. ఇతను తనకెట్టి సంబంధమూ లేదని చెప్పి ఇంటినుంచి వచ్చేసాడు. ఇతడు చాలా తెలివిగలవాడు. ఈ పనీ ఆ పనీ అని లేకుండా అన్ని పనులూ చేసేవాడు. ఎవరికైనా బాగుండకపోతే చుట్టు ప్రక్కల ఆకులుతెచ్చి ఏదో తయారుచేసి యిచ్చేవాడు. కార్లు రిపేరు చేసేవాడు, రిక్షాలు బాగుచేసేవాడు, ఎలక్ట్రిక్ రిపేర్‌లు చేసేవాడు. అందుకని తన దగ్గర పైకం కొంతవరకూ తగ్గిందనుకోగానే బొంబాయికో, అహ్మద్‌నగర్‌కో వెళ్ళి కారు తీసుకొచ్చి దానిని రిపేరు చేసి కొత్త కారులాగా తయారుచేసి దానిని అమ్మి డబ్బు తెచ్చుకునేవాడు. ఆ డబ్బును మళ్ళీ యిలాగే ఖర్చు పెడుతుండేవాడు. శిరిడీలో అతడి వలన సహాయం

పొందని వాళ్ళంటూ ఎవరూ లేరు. అందరూ ఏదో ఒకరకమైన సహాయం పొందినవాళ్ళే. అందుకే మామాజీ అంటే అందరికీ యిష్టం. అతను వచ్చాడంటే శిరిడీ వాళ్ళంతా అతని వెంబడి తిరుగుతుండేవారు. నేనూ అప్పుడు తరచూ శిరిడీ వెళ్తాండడంవల్ల నాకూ అతడు పరిచయమయ్యాడు. ఇద్దరం కలిసి మాట్లాడు కుంటూ అలా బయటకు వెళ్ళి కాలక్షేపం చేస్తూండేవాళ్ళము. ఒకసారి అతనికి ఎందుకు వచ్చిందోగాని జీవితం మీద విరక్తి కలిగింది. ఒకరోజు నాకు శిరిడీలో కన్పించి, టీతాగుదాం రమ్మన్నాడు. "నాకు జీవితం మీద విరక్తి కలిగింది. నేను ఈ రోజుతో జీవితం సమాప్తం చేసుకుందామనుకుంటున్నాను. నేను బాగా ఆలో చించే ఈ నిర్ణయానికి వచ్చాను. అందుకని నువ్వు నన్ను కారణమేమిటి? అని అడగవద్దు. పూరడించడానికి ప్రయత్నం చేయవద్దు, యిదే నీతో చివరిసారిగా మాట్లాడడము. అందుకని ఇద్దరం ఆత్మీయంగా సరదాగా టిఫిన్ తిని, టీ తాగుదాము రమ్మ న్నాను" అని అన్నాడు. ఇంకేమి మాట్లాడుతాను అతనితో! ముందే ఏమీ చెప్పవద్దని చెప్పేశాడాయె! అతడు సామాన్యమైన ప్రజ్ఞ కలవాడు కాదు. అందుకని సామాన్యులను బుజ్జగించినట్లు బుజ్జగించడానికి వీలుపడదు. అసలు అతని కష్టమేమిటో, ఎందుకొచ్చిందో, ఏమీ తెలియదు. ఇక ఏం చేస్తాము? అతనితో పాటు హోటల్ కెళ్ళి కూర్చున్నాను. హాయిగా తిని టీ త్రాగాము. "ఇక నేను సెలవు తీసుకుంటాను. ఏదైనా మాట్లాడుతావా?" అన్నాడు. ఆ సమయంలో నేనేమి మాట్లాడగలను అతనితో? ఏమి చెప్పాలి అతనికి? ఒక్క క్షణం ఆలోచించాను. మనస్సుకు రెండు విషయాలు తట్టాయి. అప్పుడు చెప్పాను: "నువ్వెలాగూ ఆత్మహత్య చేసుకోవడానికే నిర్ణయించుకున్నావు గనుక వద్దని నేనేమీ చెప్పను. బాబా వద్దని చెప్పినవి కొన్ని వున్నాయి. కానీ అవి నేను నీకు చెప్పను. కానీ ఈ విషయంలో నీకు రెండుమాటలు చెప్పాలనిపిస్తుంది. ఒకటేమిటంటే, నువ్వు శిరిడీలో మటుకు ఆత్మహత్య చేసుకోబోకు. ఎందుకంటే సాయి సమ్మతి లేదు గనుక. ఆయన ఒప్పుకోలేదు గనుక. అక్కల్‌కోట స్వామి గూడా ఒప్పు కోలేదు. కాబట్టి ఈ క్షేత్రంలో నువ్వాపని చేయడం మాత్రం అధర్మము. ఇక రెండవది: నువ్వు ద్వారకామాయికి వెళ్ళి ఒక అరగంట సాయి సన్నిధిలో కూర్చొని అక్కడ సెలవు తీసుకొని ఎక్కడికైనా వెళ్ళి ఆత్మహత్య చేసుకో" అని చెప్పాను. అంతే, అప్పుడే ఆఖరుసారిగా మేము కలవడము. ఆ తర్వాత మేము 15 సం॥లు కలవనేలేదు. అతడేమైపోయాడో తెలియదు.

ఆత్మహత్య చేసుకుని వుంటాడని నేననుకున్నాను. అతడు యిప్పుడు చెప్పాడు - ఆ తర్వాత ఏం జరిగిందో!

అతడు నేను చెప్పిన సలహానుసరించి వెళ్ళి ద్వారకామాయిలో బాబా ఎదురుగా ధునికానుకుని కూర్చున్నాడట. 10, 15 నిమిషాలు కూర్చు న్నాడు. ఏమీ జరుగలేదు. మధ్యాహ్నసమయం, అతడొక్కడే అక్కడ వున్నాడు. కొద్ది సేపటికి ఇద్దరు వ్యక్తులు వచ్చి అతనికి అటుప్రక్కన ఒకడు, యిటు ప్రక్కన ఒకడు కూర్చున్నారు. 5 నిమిషాలు గడిచాక ఒక ప్రక్కన కూర్చున్న వాడు ముందుకు వంగి మరొకప్రక్క వాడితో చెబుతున్నాడట - "ఔరంగాబాదులో నీకు స్నేహితు డున్నాడు గదా, అతనిని కలవగూడదూ?" అని. ఇతనికి ఔరంగా బాదులో స్నేహితుడున్నాడు. ఎందుకనిపించిందోగాని ఇతనికి అది తనకు బాబా చెప్పిన సందేశమేమోనని, ఎందుకు బుద్ధి మారిందో మారింది. వెంటనే బయలు దేరి ఔరంగాబాదు వెళ్ళాడు. మిత్రుని యింటికి వెళ్ళేసరికి అతను ఆఫీసుకు వెళ్ళాడు. సాయంత్రానికిగాని రాడన్నారు. ఇతడు పుస్తకాల పురుగు, ఏపాటి సమయం చిక్కినా, ఏ పుస్తకం దొరికితే ఆ పుస్తకం చదవవలసిందే. అందుకని ఏమైనా పుస్తకాలుంటే యివ్వమని యింట్లోవాళ్ళని అడిగాడు. ఏవో పాతపత్రికలు, సంచికలు కొన్ని అతనికిచ్చారు. వాటిని తిరగేస్తుంటే ఒక పత్రికలో ఒక చిన్న వ్యాసం కనపడింది. ఆ వ్యాసంలో యితని ఆధ్యాత్మిక సాధనకు కావల సిన సూచన వున్నది. ఆ కాగితాలు చింపుకున్నాడు. మిత్రుడు వచ్చేవరకూ గూడా ఆగకుండా వెంటనే బయల్దేరి బండెక్కాడు. కొన్ని కొన్ని ప్రదేశాలకు వెళ్ళాడు. నర్మదాదేవికి నమస్కారం చేసుకున్నాడు. చివరకు కాశీకి వెళ్ళి, అందులో చెప్పిన ప్రకారం ప్రార్థన చేస్తే అనుగ్రహం కలుగుతుందని వుందట. అందుకని గంగలో స్నానం చేసుకుని అనుష్ఠానం చేసుకుంటున్నాడు. ఇంతలో ఎవరో యిద్దరు సాధువులు వచ్చి మా గురువుగారు పిలుస్తున్నారని చెప్పి, ఒక ప్రదేశానికి తీసుకు వెళ్ళారు. అక్కడ మరొక సాధువు గూడా వున్నారు. తర్వాత ఆ ముగ్గురూ తాము ఫలానా అని చెప్పి, నీకు ఫలానా సాధన చెప్పమని వారికి భగవదాదేశముయిందని చెప్పి యితనికి సన్యాసదీక్ష యిచ్చారు. వాళ్ళు నాథసాంప్రదాయంలోని వాళ్ళు. నాథ సాంప్రదాయంలో సరైన దీక్ష దొరకడమనేది సామాన్యమైన విషయం కాదు. అటువంటిది వాళ్ళే పిలిచి తీసుకువెళ్ళి ఆ దీక్ష అతనికి యిచ్చారు. తర్వాత వాళ్ళు చెప్పిన ప్రకారం సాధన చేసుకుంటూండమని చెప్పారు. అప్పుడితడు, "మీరు

చెప్పినట్లు నేను సాధన చేస్తూ వుంటే ఏమైనా సందేహాలొస్తే ఏం చేయాలి? ఎవరిని అడగాలి? మీరెక్కడ వుంటారు?" అని అడిగాడు. అప్పుడు వాళ్ళు, "నీకు అవసరమైనపుడు మేమే వస్తాము. ఇప్పుడు మాత్రము నువ్వు పిలిస్తే వచ్చామా? నీకలాంటి పరిస్థితి వస్తే నువ్వు ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు వస్తాము. అయినా నువ్వు అడిగావు గాబట్టి చెబుతున్నాము. మేము వలానా చోట వుంటాము" అని చెప్పారు. అతనిని ఎక్కడా ఒకచోట నిలవకుండా, ఒక ఉపాధి ఏర్పరచుకోకుండా సాధన చేసుకోమని చెప్పారు. అతడలాగే తిరుగుతూ సాధన చేసుకుంటూపోతూ, వాళ్ళు చెప్పిన చోటుకు వెళ్ళినప్పుడు అక్కడ విచారిస్తే అక్కడ అటువంటి ఆశ్రమము వున్నట్లుగాని, అటువంటి సాధువులు వున్నట్లుగాని ఎవరూ చెప్పలేదు. ఎంత విచారించినా వాళ్ళ ఆచూకియే లేదు. కాని అతడా సాధనచేస్తూ పోతూవుంటే ఎంతోమంది మహాత్ముల, సాధువుల దర్శనము, సాంగత్యము లభించడము, అతని సాధనకు అవసరమైన మెళుకువలు, సాధనలోని రహస్యాలు వివరించడము జరిగేది. వారు వాటిని అనుష్ఠింపచేసేవారు. ఇలా కొంతకాలం సాధన చేసాక, ఆ సాధనాబలం చేత అతడు నర్మదా ప్రదక్షిణం చేసాడు. దత్తాత్రేయ సంప్రదాయంలోను, మరికొన్ని సాంప్రదాయాలలోనూ కొంత సాధన చేసిన తర్వాత, భగవదనుగ్రహం కలిగినట్లు కొన్ని కొన్ని అనుభవాలు కలిగాక, అప్పుడు నర్మదా ప్రదక్షిణం చేస్తారు. అది అన్నింటికంటే కఠోరమైన సాధన. నర్మదానదీ ప్రదక్షిణం అంటే ఎక్కడ నర్మదా నది పుడుతుందో, అక్కడ పూజాదికాలు చేసుకొని బయల్దేరి తీరం వెంబడి నడుస్తూవెళ్ళి నర్మదానది సముద్రంలో కలిసేచోట దాటి అవతలి ఒడ్డుకు చేరి అక్కడ నుంచి తిరిగి నర్మదానదీ తీరంవెంబడి వెళ్తూ మళ్ళీ ఆ నది పుట్టిన చోటుకు చేరుతారు. అప్పటికి ప్రదక్షిణం పూర్తి అయినట్లు లెక్క. అది రెండు రకాలుగా చేస్తారు. మొదటి రకమైన ప్రదక్షిణ ఏమిటంటే - ఇన్ని అడుగులు దాటి తీరం వెంబడి పోకూడదు అని. అట్లా వెళ్తాంటే ఒక్కొక్క చోట ఉపనది రావచ్చు. అప్పుడు దానిని దాటి వెళ్ళవలసిందే గాని, చుట్టు తిరిగి వెళ్ళకూడదు. ఒక్కొక్కచోట, కొండలు రావచ్చు, గుట్టలు రావచ్చు. ఎక్కి దిగవలసిందేగాని అన్ని అడుగుల దూరం మాత్రం దాటివెళ్ళకూడదు. ఇది చాలా కఠోరమైన నియమం. ఇట్లాగాక నదీజలం కంటికి కనబడుతుంటే చాలు అనేది మరొక నియమం. ఇది మొదటిదానికంటే కొద్ది సులువు. ఈ రెండింటిలో కఠోరమైన నియమమే వాళ్ళు చేయమని చెప్పారట. అందుకని యితడు మొదటిరకమైన

ప్రదక్షిణ చేస్తూ వచ్చాడు. ఇతడు ఆ దీక్ష చేస్తూ వుంటే ఎంతోమంది మేము చేస్తామంటే మేము చేస్తామని ఇతని వెంట బయలుదేరారట. ఇతనితో పాటు వాళ్ళు నడవలేక పోయేవాళ్ళట. ఇతడు రోజుకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలో. దూరం నడిచేవాడట. ఏ ఒక్కరోజూ అంతకు మించి తక్కువ నడిచేది లేదట. అందుకని మిగతావాళ్ళు రెండుమూడు రోజులు వెనుకబడేవారట. ఇతడు వెళ్తూంటే యితనికి ఆకలై ఆహారం తీసుకుంటే బాగుండును అనుకునేసరికి ఎవరో ఒకరు అన్నం వళ్ళా లలో తీసుకుని యితని కోసం ఎదురుచూస్తూ వుండేవారట. ఇతడు ఒక్కరోజు గూడా ఆహారం లేకుండా పస్తుండలేదుట. ఒక్కొక్కచోట ఒక్కొక్క మహాత్ముడు కనబడి అతనిని అక్కడ 3,4 రోజులు వుండమని ఆపేసేవారట. అప్పుడు వాళ్ళ దగ్గర అలాగే వుండి తాను తెలుసుకోవలసిన విషయాలు తెలుసుకుని, తనకు కావలసిన విద్య నేర్చుకుని మళ్ళీ ప్రదక్షిణం కొనసాగించేవాడట. ఆ విధంగా రెండుమూడు రోజులుండటం చేత ఇతనికంటే వెనుకబడ్డ వాళ్ళు వచ్చి యితనిని కలుసుకునేవారట. అప్పుడు వాళ్ళ ద్వారా యితనికి తెలిసేదేమిటంటే - ఇతనికి మహాత్ములు, ఆశ్రమము కన్పించినచోట వాళ్ళకు ఏమీ కన్పించేవి కావుట. ఇతనికి కన్పించినట్లు ఎవరైనా కన్పించడంగాని, ఆహారం యివ్వడంగానీ ఏమీ జరిగేవి కావుట. 150 కి.మీ. , 200 కి.మీ నరసంచారమే లేకుండా తినడానికిగాని, త్రాగడానికిగాని ఏమీ దొరకక అవస్థపడవలసి వచ్చేదట. అడుగుదామన్నా నరసంచారమే వుండేది కాదుట. అదీ నర్మదానది అనుగ్రహమంటే. ఆమె ఆశీర్వచనం పొందిన వాడికి ఇతనికి జరిగి నట్లు జరుగుతుంది. లేనివాడికి వాళ్ళకు జరిగినట్లు జరుగుతుంది. ఆవిధంగా యిబ్బందులు పడలేక కొంతమంది ఆ ప్రదక్షిణం చేయడం విరమించుకున్నా రట. ఒక వృద్ధుడు మాత్రం నేను నీతోపాటే వస్తానని వెంటబడ్డాడట. వృద్ధుణ్ణి తనతో తీసుకుపోయేదెట్లా? అతనితో పాటు నెమ్మదిగా నడిచేదెట్లా? అలాగే అతనిని తీసుకుపోతుంటే ఒక్కొక్కసారి వున్నట్లుండి అనేవాడట - నాకు చలి పుడుతున్నది, వణికిపోతున్నాను, కప్పుకోవడానికి రగ్గుంటేగాని లాభం లేదు. నాకు చలిజ్వరం వచ్చేస్తుంది" అని. అతడు ఎక్కడినుండి తెస్తాడు రగ్గు? అది లేకపోతే చచ్చిపోతాను అనేవాడట. పోనీ అని ఆ వృద్ధుణ్ణి వదిలేద్దామా అంటే మనిషి తోడులేరు. అప్పుడు రెండు ధర్మాలమధ్య యిరుక్కున్నాడన్న మాట.

అప్పుడతడు కూర్చుని ప్రార్థన చేసుకుంటుంటే, ఎవరో ఇతని ముక్కూ ముఖమూ తెలియనివాళ్ళు వచ్చి, "పాపం, ఇంత దూరం చలిలో ప్రయాణం చేస్తున్నావు గదా! అని నీకు రగ్గుయివ్వాలనిపించింది" అని రగ్గు యిచ్చి వెళ్ళిపోయేవారట. ఇలాంటి చిత్రమైన అనుభవాలు ఎన్నో జరిగేవట. ఆ విధంగా అతడు $2^1/_2$, 3 సం॥లలో నర్మదానదీ ప్రదక్షిణం పూర్తిచేసి తిరిగి వచ్చాడు. అక్కడినుంచి వచ్చాక అతడు శిరిడీ రావడం అదే. అతని సాధనకు జనంలోకి అతడు రాకూడదు. అందుకని అతడు రాగానే సంస్థానంవాళ్ళు అతడు ఎక్కడ వుంటాడో తెలియడానికి వీలులేనిచోట వుంచారు. అతడు ప్రతీరోజు మధ్యాహ్నం 3, 3-30 గంటల ప్రాంతంలో మందిరానికి వచ్చి సాయి దర్శనం చేసుకుని ఎవరికీ తెలియకుండా వెళ్ళిపోయేవాడు. ఆ భగవంతుని లీల ఎలా వుంటుందో! సరిగ్గా అతను శిరిడీ వచ్చిన సమయంలోనే నేను అనుకోకుండా శిరిడీ వెళ్ళడము, అతడు శివనేశన్ స్వామితో మాట్లాడుదామని వచ్చిన సమయంలో నేనక్కడ వుండడము, నన్నతడు గుర్తు పెట్టి పలకరించడము జరిగిందన్నమాట. అప్పుడాతడు, "ఇప్పుడు నేను గుర్తు వచ్చానా?" అన్నాడు. గుర్తొచ్చావని నేనగానే అతడు నేను నీతో కొన్ని విషయాలు చెప్పాలి. నువ్వు యిక్కడ ఎన్నాళ్ళు వుంటావు?" అని అడిగాడు. నేను రేపు తప్పక వెళ్ళిపోవాలని చెప్పాను. అప్పుడాతడు, "నీకు చాలా విషయాలు చెప్పాలి. నువ్వు 10,15 రోజులు నాతో గడపాలి. నేను నీకోసమే వచ్చాను. నువ్వు వుండిపో" అన్నాడు. శిరిడీలో, శివనేశన్ స్వామి సన్నిధిలో, ఒక సాధువు వచ్చి నీకు కొన్ని విషయాలు చెప్పాలి అంటున్నాడు, వుండమంటున్నాడు. అందుకని బాబాకు ఒక నమస్కారం పెట్టి ఇంటికి ఒక టెలిగ్రాం కొట్టి అతనితో సరే వుంటానన్నాను. అతడు సరేనని వెళ్ళి మర్నాడు వచ్చాడు. వచ్చి నేనుండే రూమ్ ఖాళీ చేసి ఒక టీస్టాల్ పేరు చెప్పి అక్కడకు రమ్మనమని, ఆ టీ స్టాల్‌వాడు నన్ను తన దగ్గరకు తీసుకువస్తాడనీ చెప్పాడు. నేను రూమ్ ఖాళీ చేసి ఆ టీస్టాల్‌కు వెళితే అతడు సాయంత్రం రమ్మనమనీ, అప్పుడైతే ఎవరూ చూడరు గనుక అప్పుడు తీసుకువెళ్తాననీ చెప్పాడు. సరేనని నేను వెళ్తే రాత్రి 9-30కు అతని దగ్గరకు తీసుకువెళ్ళాడు. అప్పుడు నన్ను 14 రోజులు అక్కడే వుంచి ఎన్నో విషయాలు చెప్పాడు. అతడేమన్నాడంటే - "ఆరోజు సాయి నిన్ను నిమిత్త మాత్రునిగా చేసుకుని నన్ను ఔరంగాబాదు పొమ్మని చెప్పి వుండకపోతే నా జీవితం వేరుగా వుండేది. అప్పుడు

ఒక రకమైన మరణం సంభవించి వుండేది. ఇప్పుడు యింకొక రకమైన మరణం సంభవించింది. అప్పుడొక రకమైనజన్మ వచ్చేది. ఇప్పుడు యింకొక రకమైన జన్మ వచ్చింది. అప్పుడు ఒకరకమైన విద్య వచ్చేది. ఇప్పుడు యింకొక రకమైన విద్య వచ్చింది. కాబట్టి యిందులో నీకూ భాగముంది. నాకు వచ్చినదాంట్లో గూడా నీకూ భాగముంది. అందుకని మనిద్దరం పంచుకుందాము కూర్చో" అని, అతడు ఎంతో కష్టపడి నేర్చుకున్న వాటిల్లో కొన్ని కొన్ని-నాకు బాబా ఏవైతే చెప్పమన్నారో, అవి మాత్రమే చెప్పాడు. అతనిని చెప్పమని ఎవరడిగాడు? నేనేమన్నా అడిగానా? నేనేమన్నా వాటికోసం తపస్సు చేసానా? పోనీ బాబానైనా యివన్నీ కావాలని అడిగానా? దీనిని బట్టీ-బాబా చెప్పిన ఆ మాట వెనకాల ఎంతటి అర్థమున్నదో తెలుస్తుంది.

ఈ మధ్య ఒక ఒక కుర్రవాడు ఉత్తరం వ్రాశాడు. అతడు హైదరాబాద్‌లో వుంటాడు. "నేను 10, 15 సార్లు శ్రీసాయిలీలామృతం పారాయణ చేసాను. కాని నా మనస్సు స్థిమితం కాలేదు. మనఃస్థిమితాన్ని చెడగొట్టే ఒకానొక సన్నివేశంలో బాబా సూక్తి జ్ఞాపకం వచ్చింది. అప్పటినుంచి నా మనస్సు స్థిమితపడింది. అప్పుడా సన్నివేశముగూడా మారిపోయింది. నాలోని బలహీనత శాశ్వతంగా తొలగిపోయింది. అప్పుడు ఇంతవరకూ నేను సాయి లీలామృతము పారాయణ చేయలేదని నాకనిపించింది. బాబా చెప్పిన ఆ సూక్తిలో అంతటి అర్థం యిమిడివుందని నాకు తెలియడానికి యింతకాలం పడితే, ఒక్కొక్క సూక్తికి యింత కాలం చొప్పున యింకెంత కాలం పడుతుందో, మొత్తం సాయి లీలామృతం ఒక పారాయణకు నాకు ఎన్ని జన్మలు పడుతుందో అనిపించింది" అంటూ అతడు ఉత్తరం వ్రాశాడు. నేను చెప్పే నాకు జరిగిన ఆ సన్నివేశం కూడా అట్లాంటిదే. 14 సం॥లపాటు ఆయన గురించి తెలుసుకోవడం కోసం తిరిగినప్పటికీ, విషయసేకరణచేసి వ్రాసినప్పటికీ ఈ సూక్తిలో యింతటి అర్థముందని ఆ సంఘటన జరిగే వరకూ నాకు మాత్రం ఏమి తెలుసు? ఆ సాధువు నాకు చెప్పిన విషయాలలో వెంట్రుకవాసి కోసం జనం అతని చుట్టూ ఎంతగానో తిరుగుతారు. అతడు అక్కడ ఆశ్రమం నుంచి బయలుదేరాడని, శిరిడీ వెళ్ళాడనీ తెలిసి, శిరిడీకి ఎక్కడెక్కడినుంచో ఎంతోమంది ఆయన కోసం వచ్చారు. కానీ ఆయన ఎవరికీ చిక్కడం లేదు. సంస్థానం వాళ్ళకు కూడా గట్టిగా చెప్పాడు - తన ఆచూకీ ఏ మాత్రం చెప్పవద్దని, అలా జరిగిన వెంటనే తాను

అక్కడనుంచి వెళ్ళిపోతానని. అందుకని వాళ్ళు గూడా చాలా జాగ్రత్తగా వున్నారు. అటువంటి ఆ సాధువు నన్ను పిలిచి, తాను చేసిన సాధనలోని కొన్ని రహస్యాలు చెప్పారంటే అది సాయికృప కాక మరేమిటి?

సద్గురువు యొక్క స్పర్శ కలిగేలోపల అన్నీ అర్థమైనట్లు కనబడతాయే గాని, ఏదీ అర్థమవదు అన్న సంగతి తెలుస్తుంది. సద్గురువు సన్నిధికి వచ్చిన తర్వాత ఆయనను స్మరించుకుంటుంటే వారి అనుగ్రహం సంపూర్ణంగా వుంటుంది. అందుకు ఉదాహరణగా ఈ రోజున నాకు జరిగిన ఒక సన్నివేశాన్ని చెబుతాను. ఈ రోజు కార్తీక పూర్ణిమ, ప్రత్యేకమైన రోజు. ఈ రోజు కార్తీ పూర్ణిమ అన్న సంగతి ఉదయంనుంచి నాకు గుర్తులేదు. కూర్చొని నాదారిన నేను ఏదో వ్రాసుకుంటూంటే యింట్లోవాళ్ళు గుర్తు చేసారు. ఈరోజు కార్తీకపూర్ణిమ గదా, లేచి స్నానం చేస్తారా , చాలా ఆలస్యమైంది అని. అప్పుడు వెళ్ళి స్నానం చేస్తూ "ఈరోజు కార్తీకపూర్ణిమ, అరుణాచలంలో చాలా బాగా జరుగుతుంది గదా!"అనుకున్నాను. ఇంతలో ఎప్పుడో రామతీర్థం వస్తానని ప్రోగ్రామ్ యిచ్చానట. నాకు జ్ఞాపకం లేదు. ఆయన వచ్చి 3 గంటలకల్లా వచ్చి మిమ్మల్నక్కడకు తీసుకుపోతాను. ఆ సంగతి మీకు గుర్తుచేయడానికి వచ్చాను' అన్నాడు. 'ఇక్కడ సత్సంగముంది. ఎట్లా' అంటే 'మళ్ళీ 8గంటలకల్లా మిమ్మల్ని దింపే బాధ్యత నాది' అన్నాడు. అక్కడ వాళ్ళకొకయిబ్బంది వచ్చింది. ఉషశ్రీగారు కార్యక్రమాని కొచ్చి ఆయనకు ఒంట్లో బాగుండక కేన్సిల్ చేసుకున్నట్లు వీళ్ళకు 11 గంటలకు తెలిసింది. ఆయన వస్తారనే నమ్మకంతో వీళ్ళు ఫంక్షన్ పెట్టుకున్నారు. ఆయన రావట్లేదని తెలిసి పరుగెత్తుకుంటూ వచ్చి, 'మీరు రాక తప్పదు, కార్యక్రమం చెడిపోతుంది - మీరు రాకపోతే' అన్నారు. అట్లాంటి పరిస్థితులలో తప్పక వస్తాను. అయితే 8 గంటలకల్లా నన్నిక్కడకు చేర్పించాలి'అన్నాను. సరేనన్నారు. ఈ సంఘటన గూర్చి ఆలోచిస్తే యిందులో వాళ్ళ కార్యక్రమం మాత్రమే నెరవేరుతున్నదా? కార్తీక పూర్ణిమనాడు శివక్షేత్రానికి తీసుకుపోయారు, శివాలయంలో దర్శనమైంది. అక్కడ కొంచెంసేపు సత్సంగం చేసుకోవడము జరిగింది. ఈ రోజు కార్తీకపూర్ణిమ అన్న సంగతి గుర్తులేదే. పోనీ సాయియైనా గుర్తుచేయలేదే అనుకున్నందుకు ఆయన ఎట్లా జరిపించాడో చూడండి. అదీ గుర్వనుగ్రహ మంటే. ఒక్క క్షణం మనం ఏమారినా, ఆయన ఏ మాత్రం ఏమారరు. ఇది యిట్లా జరగలేదే అనుకుంటే వెంటనే అందుకవసరమైన

అనుభవం జరుగవలసినదే! అందుకు ఇదిఒక ఉదాహరణ మాత్రమే. అలాగే ఇంకొకరికి కలిగిన అనుభూతి గూడా సరిపోతుంది. బుద్ధుడున్నాడు - ఎవడో జబ్బు పడితే చూచాడు, ఎవడో చనిపోతే చూచాడు, వృద్ధాప్యం వస్తే చూచాడు. అన్నింటిని గూర్చి ఆలోచించి, దుఃఖానికి మూలకారణమేదో తెలుసుకుని, దానిని నశింపజేసుకొని బుద్ధుడైనాడు. ఇలా మరెవరికో కలిగిన అనుభవం చూచి గూడా బుద్ధుడు పొందాడు. అలాగే భాగవతంలో చెప్పిన ఇరవై నలుగురి గురువులగూర్చి తెలుసుకుంటే అక్కడ ఏదో ఒక సన్నివేశం, ఎవరింట్లోనో, ఎందుకో, వాళ్ళకోసం జరిగిన సన్నివేశాన్ని చూచి దానిని తనకు గురువుగా తీసుకోవడమే గొప్పదనం. అదే అక్కడ మనం గమనించవలసిన విశేషం. "కాబట్టి ఎక్కడినుండి పొందాలి బోధ" అని అడిగితే ఎక్కడినుంచి పడితే అక్కడినుంచి పొందవచ్చు. ఇది తెలుపడం కోసమే బాబా ఏం చేసారంటే హేమాద్పంతును శ్యామాతో కాసేపు మాట్లాడి రమ్మన్నారు. ఆ చెప్పవలసినదేదో తన దగ్గరే చెప్పించవచ్చు గదా! లోపల తపన కలిగినప్పుడు, ఎక్కడికైనా వెళ్ళు, నీకు సరిపోయిందే వస్తుంది అని తెలియ జేస్తున్నారు. అయితే శ్యామా దగ్గరకే ఎందుకు పంపించారంటే అది స్మరించడంలో వాడికుపయోగం వుంది గనుక. శ్యామా పూజపూర్తి చేసుకున్నాడు. అతడుగూడా ద్వారకామాయికి రాబో తున్నాడు. అయితే హేమాద్పంతుతో కొద్దిసేపు మాట్లాడడంవల్ల అది మననం చేసుకో వడంవల్ల వాడికీ ప్రయోజనమున్నది. 15రూ॥లు దక్షిణగా యివ్వడమంటే అదే. గుడ్డెద్దుచేలోపడ్డట్లు అనుష్ఠానం చేసుకుంటున్నాడు. అందుకని హేమా ద్పంతు అడిగినప్పుడు చక్కని సమయస్ఫూర్తితో జ్ఞాపకం వస్తున్నది. అప్పుడు వాడికిగూడ శ్రద్ధ కలుగుతుంది. ఉదాహరణకు మనం క్లాసులో కూర్చుని పాఠం వింటున్నాము. వింటున్నప్పుడు మనస్సు ఎక్కడికో వెళ్ళింది. ఉన్నట్లుండి మనం క్లాసులో కూర్చున్నాము గదా అని గుర్తుకు రాగానే పాఠం అర్థమవడం మొదలు పెడుతుంది. అలాగే పూజా పునస్కారాలు ఎప్పుడైతే యాంత్రికమయ్యాయో అప్పుడు అందులోంచి ఒక్కసారికుదిపి మళ్ళీసరియైన స్థితికి తీసుకు వచ్చాడు - మశీదుకు వచ్చేముందు. అందుకని ఇతడు వెళ్ళడం అతనికిగూడా ఉపయోగ పడింది. అదే వాడిదగ్గరనుంచి 15 రూ॥లు దక్షిణ తెమ్మనడమంటే. అలాగాక పోతే అతనినే బాబా అడగవచ్చుగదా! అంతటి సమన్వయం వుంటుంది గురువు యొక్క లీలలో. ఇది తెలియడానికి సప్తశృంగిలీల మరొక ఉదాహరణ.

సప్తశృంగిలో అలయ పూజారి వున్నాడు. అతనికి ఒకప్పుడు ఎన్నో కష్టాలు వచ్చి మనశ్శాంతి లేకుండా పోయింది. ఎంతో దీక్షగా ఆ దేవిని ప్రార్థించాడు. ఒకనాడు స్వప్నంలో ఆ దేవి కన్పించి, "బాబా దగ్గరకు వెళ్ళు, నీకు మనశ్శాంతి లభిస్తుంది" అని చెప్పింది. అప్పట్లో సాయి బాబా పేరు ప్రఖ్యాతులుగాని, శిరిడీ పేరుగాని మహారాష్ట్రదేశంలోనే తెలియవు. అందుకని అమ్మ చెప్పిన బాబా ఎవరో తెలియక, భిక్షకులందరినీ బాబా అంటారు గనుక శివుడు భిక్షువు గనుక, ప్రఖ్యాతమైన శివక్షేత్రం త్రయంబకేశ్వరం గనుక అక్కడికి వెళ్ళమన్నారనుకొని అక్కడకు వెళ్ళి కొద్దిరోజులున్నాడు. కాని మనశ్శాంతి లభించలేదు. అప్పుడు మళ్ళీ వచ్చి సప్తశృంగిదేవినే తిరిగి ప్రార్థిం చాడు. అప్పుడు ఆమె మళ్ళీ స్వప్నంలో కన్పించి చెప్పింది: "ఎందుకు అనవసరంగా త్రయంబకేశ్వరం వెళ్ళావు? నేను చెప్పింది శివుణ్ణి గాదు, శిరిడీ సాయినాథుని గురించి"అని. అపుడు శిరిడీ ఎక్కడుందో ఎవరికీ తెలియదు. ఎట్లా వెళ్ళాలి! అనుకుంటుంటే, అదే సమయంలో ఇక్కడ శిరిడీలో శ్యామా అనే భక్తునికి కష్టాలు వచ్చాయి. అప్పుడొక జ్యోతిష్కుడు శిరిడీ వచ్చాడు. శ్యామా జాతకం చూసి, "మీ అమ్మగారు సప్తశృంగి దేవికి మొక్కుకుని ఆ మొక్కులు తీర్చలేదు గాబట్టి కష్టాలు వచ్చాయి" అని చెప్పాడు. అప్పుడు శ్యామాకు గుర్తొచ్చింది, వాళ్ళ అమ్మగారు చనిపోతూ మొక్కు గురించి చెప్పింది. శ్యామా తాను తీరుస్తానని చెప్పాడుగాని తీర్చలేకపోయాడు. ఆ సంగతి జ్ఞాపకమొచ్చి, సాయియే సకల దేవతా స్వరూపము గనుక సాయికే ఆ మొక్కును తీర్చివేద్దాము అనుకున్నాడు. బాబా వద్దకు వచ్చి, మా అమ్మ యిలా మొక్కుకున్నది, దేవతలందరూ మీరే గనుక మీరే మొక్కును స్వీకరించి మా అమ్మను ఋణవిముక్తుని చేయవలసింది అని ప్రార్థించాడు. అప్పుడు బాబా అన్నారు :" మీ అమ్మ మొక్కుకున్నది సప్తశృంగిదేవికి గనుక నువ్వు అక్కడకు వెళ్ళవలసిందే" అన్నారు. కాని మరొకడు పుణ్యతీర్థాలలో స్నానానికి వెళ్తానంటే, అక్కడికెందుకు? గంగా, యమునలు నా పాదాలలోనే వున్నాయని బాబా చెప్పారు. మరి శ్యామా, "మీరు సకల దేవతా స్వరూపులు, ఇక్కడే మొక్కు తీర్చుకుంటానని చెబితే, కాదు, నువ్వు సప్తశృంగికే వెళ్ళమన్నారు. ఎందుకనంటే అక్కడ మరొక పనివుంది గనుక. శ్యామా సప్తశృంగి వెళ్ళి ఆ పూజారి యింటనే దిగాడు. ఎక్కడనుంచి వస్తున్నారని ఆ పూజారి అడిగాడు. శిరిడీనుంచి అని శ్యామా చెప్పగానే, అతడు "మీకు సాయిబాబా తెలుసా"? అన్నాడు. "తెలియద

మేమిటి, నేను నిత్యమూ ఆయన సేవ చేసుకుంటూ వుంటాను" అన్నాడు. అయితే నేను శిరిడీ వస్తానని చెప్పి శ్యామా మ్రొక్కు తీర్చుకున్నాక అతనితో శిరిడీ వచ్చాడు. ఈ విధంగా బాబా అలా రెండిటికీ link పెట్టారన్న మాట. ఇటు శ్యామా పని నెరవేరాలి, దానితో పాటు అక్కడ పూజారిపనీ నెరవేరాలి. అదీ ఆయన గొప్పతనం. అలాగే ఇక్కడ హేమాద్పంతు సంశయా నికి సమాధానం దొరకాలి, అటు శ్యామా శ్రద్ధ పెరగడానికి ఉపయోగపడాలి. అదీ link. అందుకని వీడు అక్కడకు వెళ్ళి సమాధానం తెచ్చుకోవాలి. అక్కడ వాడు 15రూ॥లు దక్షిణ రూపంలో నువ్వు మశీదుకు శ్రద్ధగా రావడం నేర్చుకో, రోజూ చూసే బాబానే గదా అనే పద్ధతిలో కాకుండా బాబా చెప్పినదేమిటో జ్ఞాపకం తెచ్చుకుని మననం చేసుకుంటూ రమ్మని అతనికి వీడి ద్వారా బోధిస్తున్నారు. కాబట్టి ఆయన చేసిన ఆ లీలలో అంతటి బోధ యిమిడి వున్నది. అందుకని బాబా ఏమంటున్నా రంటే-ఒకసారి, ఒకప్పుడు చెవిలో మాత్రమే చేసే ఉపదేశం కాదుమాది, అన్ని రూపాలలోనూ వినగలిగేటంతటి ఘోషతో నిరంతరం జరిగేటటువంటిది అంటున్నారన్నమాట.



అధ్యాయం-15

సర్వసమర్పణ



శరీరమింద్రియం ప్రాణం అర్థస్వజన బాంధవాన్॥
ఆత్మదారాదికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్॥

గురుగీతలోని ఒకానొక శ్లోకంలో యిలా వుంది:

స్వజన బాంధవులను సద్గురువుకు నివేదించమన్నారు. ఎట్లా నివేదించేది? స్వజనులు - అంటే తనవారినందరినీ సద్గురువుకు నివేదించాలి. కావాలంటే నన్ను నేను నివేదించుకోవచ్చు. కాని మరొకరిని తీసుకుపోయి ఒప్పగించేందుకు నేనెవర్ని? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. నా మిత్రుడున్నాడు, నా అన్న వున్నాడు, నా తమ్ముడున్నాడు-అలాగే మరొకరు, మరొకరు - వీరిని అర్పించడానికి నేనెవరిని? ఎలా ఏమని సమర్పించాలి?

ఇలాంటిదే ఒకడికి సాయియే పరీక్ష పెట్టారు. ఒకడున్నాడు, వాడికి సాయి స్వప్నంలో దర్శనమిచ్చి, 'నిన్ను నాకు సమర్పించుకుంటావా?" అనడిగారు. "నేను సిద్ధమే"! అన్నాడతడు. "నీకు దేహమిచ్చిన మీ తండ్రి అనుమతి లేకుండా ఎలా యిస్తావు? నీకు దేహాన్నీ, జన్మనూ యిచ్చింది నీ తండ్రి కాబట్టి నీవు నీ తండ్రి సొత్తు, ఆయన అనుమతి లేకుండా ఎలా సమర్పించుకుంటావు?" అని మళ్ళీ ఆయనే ప్రశ్న వేశారు. అతడు గొప్ప వివేకి. ఎన్ని జన్మల సంస్కారమో అతనిది. అందుకని అతడన్నాడు బాబాతో, "మా తండ్రికి నన్ను యిచ్చింది మీరు, కాబట్టి నన్ను మీరు తీసుకుంటే తప్పేమిటి? తీసుకోండి"అని. సాయికి తగిన భక్తుడతడు. అతనికి తగిన గురువు సాయి. 'నా తండ్రికి మీరే నన్ను యిచ్చారు. మీ అనుగ్రహం వల్లనే నేను పుట్టాను. కాబట్టి మీరు యిచ్చిన దానిని మీరు అడిగినప్పుడు యివ్వడానికి సందేహ మెందుకు? కాబట్టి నామీద మీకు ఎప్పుడో హక్కు ఏర్పడింది కనుక నన్ను నేను సమర్పించుకోవడం వల్ల మీదైన వస్తువును మీకివ్వడమే జరుగుతుంది.

ఆ భక్తుడు సాయితో యింకా యిలా అన్నాడు : "మీ అనుగ్రహం వల్ల నేను జన్మించాను. కనుక నన్ను సమర్పించుకోవడంవల్ల మీ వస్తువు మీకిచ్చినట్లే

అవుతుంది. అలాగాక మీరడిగినప్పుడు నేను అంగీకరించక పోవడం వల్ల మీ వస్తువును మీకివ్వనిరాకరించిన దోషమే మిగులుతుంది గదా!" అన్నాడు. అప్పుడతనిని తీసుకుని బాబా తమ హృదయానికి దగ్గరలో వున్న జేబులో పెట్టుకున్నారట. అంతట అతనికి మెలకువ వచ్చింది. మెలకువ వచ్చాక గూడా కొన్ని రోజులపాటు అతడు ఒకానొక అతీతమైన పారవశ్యంలో వున్నాడట. దీనిని బట్టి మనకేమి తెలుస్తున్నదంటే మనలను మనం సమర్పించుకోవడానికి గూడా మరొకరికి సమాధానం చెప్పుకోవలసిన పరిస్థితి వున్నదన్నమాట. మరి అలాంటప్పుడు స్వజనులందరినీ ఆయనకు సమర్పించడమెలా? శరీరాన్ని, ఇంద్రియాలను, ప్రాణాన్ని, అర్థాన్నీ, స్వజనులను, బంధువులనూ-వీటన్నింటినీ సద్గురువుకు సమర్పించాలి అని చెప్పారు. వీటన్నింటినీ ఎలా సమర్పించుకోవడం? అనేది మన సమస్య. అప్పుడు మనం తాత్త్వికమైన భావాన్ని ఏర్పరచుకోవాలి. అవతలి వారి పట్ల మనకుండేటటువంటి బంధానికి తోడు అందరిలోనూ ఆయనే వున్నాడు అనే ఆ రకమైన భావాన్ని అలవరచుకోవాలి. వీడు నా తమ్ముడు, వీడు నా మేనమామకొడుకు యిప్పుడు మనకుండేటటువంటి ప్రీతిని మనం మలచుకోవలసివుంటుంది. ఏరీతిన? వెనుకటి వరకు - ఇతడు మన బంధువు గాబట్టి, ఇతడు మన సోదరుడు గాబట్టి అని ప్రీతిబద్ధాము, ఇప్పుడలా కాదు - అందరిలో వున్న సాయి వాళ్ళలోనూ వున్నాడనే ప్రీతి ఏర్పరచుకుంటాము. ఇది ఒక రకమైన సమర్పణ. ఇదిగాక రెండవరకమైన సమర్పణ వున్నది. అదేమిటంటే వాళ్ళమీద మనకు ఆత్మీయత వున్నందుకు మనము చేయవలసినదేమిటి? జీవితం చరితార్థమయ్యేందుకు ఒకానొక మార్గం మనకు తెలిసింది గనుక వారికి నచ్చేటటువంటి రీతిన వారి జీవితాలను సార్థకం చేసుకోవడానికి మనవంతు యత్నం చేయాలి. మన గురువు దగ్గర వారందరినీ గూడా అనుగ్రహించు, నీ దరికి చేర్చుకో అని ప్రార్థించాలి. మరి వాళ్ళమీద మనకు ప్రేమ వున్నందుకు మనం చేయవలసినదిదే. వాళ్ళందరినీ కూడా నీ అండన జేర్చుకోవలసినది, అనుగ్రహించవలసినది, వాళ్ళను చరితార్థులను చేయవలసినది అని ప్రార్థించడము. రెండవది - వాళ్ళతో కూర్చున్నపుడు ఎప్పుడైనాసరే, రాగద్వేషయుతమైనటువంటి, లౌకికమైనటువంటి ప్రస్తావనలే ఎప్పుడూ కొనసాగకుండా, సాధ్యమైనంత యుక్తిగా వాటిల్లోంచి తీసుకువచ్చి సద్గురువు యొక్క లీలలను గూర్చి చెబుతూ, సద్గురువుపట్ల ప్రీతి కలిగేలా చేయాలి. అందులో యుక్తి

వుంటుంది. ఏమిటా యుక్తి? లౌకికమైన మన పనులు నెరవేరడం కోసం అలాంటి యుక్తులను ఉపయోగిస్తూనే వుంటాము. మనకు ఒకరితో ఒకపని వచ్చిందనుకోండి. అప్పుడేం జేస్తాము? వాడికి మనమెలా మాట్లాడితే యిష్టమో తెలుసుకుంటాము. వారియొక్క మనస్తత్వాన్ని గమనిస్తాము. ఎవరికి దేని యందు ప్రీతివున్నదో తెలుసుకొని ఆ రంగంలోంచి వారి దగ్గరకు వెళ్ళడానికి ప్రయత్నిస్తాము. ఫలానా వారికి సాహిత్యమందు, నాటకాలయందు ప్రీతి, అభి మానము. దానియందు ప్రీతిగలవాళ్ళన్నా, అభినివేశం కలవాళ్ళన్నా అభిమాన మని ఎవరైనా చెప్పారనుకోండి. అప్పుడు అందులో బాగా ఆరితేరిన వారు, ఆయనతో చెప్పగలిగినవారూ ఎవరో తెలుసుకొని వారిద్వారా అవతలి వారి దగ్గరకు వెళ్తాము. ఇంకొకళ్ళకు జ్యోతిష్యంయందు ప్రీతి అన్నారనుకోండి. మనం వారి దగ్గరకు వెళ్ళినపుడు నాకు జ్యోతిష్యం అంటే చాలా యిష్టమని, మా అన్నగారు గూడా గొప్ప జ్యోతిష్కుడనీ, మీకు గూడా జ్యోతిష్యం వచ్చుటగదా! అనీ పరిచయం చేసుకుని తర్వాత అసలు విషయానికొస్తే అప్పుడు కొంత వరకూ పని జరుగుతుంది. ఇలా లౌకికమైన విషయాలలోనే యుక్తిని ఉపయోగిస్తు న్నప్పుడు, అవతలి వాడికి అత్యంత శ్రేయస్సునిచ్చేచోట ఉపయోగిస్తే తప్పేమిటి?

ఒకడికి భక్తి మెండు. వాడు సాయిబాబా భక్తుడు. మనకొక పని కావలసి వుండి ఆపని నెరవేరడంకోసం వాడిదగ్గరకు వెళ్ళి సాయిబాబా చాలా గొప్పవారండి అని పొగిడి, చాలా కాలంగా మిమ్మల్ని కలవాలనుకుంటున్నా నండి అని, నాకు కొంచెం ఈ పని చేసిపెడ్తారా? అని అడిగామనుకోండి. అప్పుడు పారమార్థికాన్ని లౌకికానికి వాడుకునే గతిపడుతుంది. లక్షరూపాయల చెక్కును తీసుకొచ్చి పొయ్యి వెలిగించుకుంటున్నామన్నమాట. అది పారమార్థికతే అయినా మనలను చెడగొడుతుంది. దీనికి బదులు ఒక్కమొర ఆయన (సాయిబాబా) ముందు పడేస్తే, అంటే ఆయనను ప్రార్థిస్తే, ఎవరివల్ల పని అవుతుందో, వాడితో పరిచయమున్నవాడు మనకే తటస్థపడి, ఆ పని నేను చేసి పెడతానంటాడు. అట్లాగాక పైన చెప్పిన విధంగా అయితే లౌకికమైన బంధానికి పారమార్థికాన్ని వాడుకోవడం జరుగుతున్నది. అది మనకు శ్రేయస్సునివ్వదు. అలాగాక ఒకడు లౌకికంగా చాలా బాధల్లో వున్నాడనుకోండి, అప్పుడు వాడితో, "సాయిబాబా వల్ల యింతమందికి యిలా మేలు జరిగింది, నువ్వు గూడా ఆయనను సేవిస్తే బాగుంటుందేమో అని" చెప్పాలి. "నాకు యిట్లాంటి వాటి

యందు విశ్వాసం లేదు" అన్నాడనుకోండి. అప్పుడు, "నువ్వు విశ్వాసం లేదంటున్నావు కాని నీలాగే విశ్వాసంలేని ఒకడికి యిలా జరిగింది. నువ్వీ విషయం కొంచెం ఆలోచించు" అని చెప్పాలి. "అలాగాదు, మాది ఫలానా సాంప్రదాయం" అన్నాడనుకోండి. అప్పుడు, "ఈ సాంప్రదాయాలు యిన్ని రకాలున్నాయి. బాబా ఈ సాంప్రదాయాల గురించి ఈ విధంగా చెప్పారు. ఆ సాంప్రదాయం వాళ్ళను అయన యిలా ఉద్ధరించారు" అని వాడికి తెలిసేటట్లు చెబితే మెల్లగా వాడుగూడా ఆలోచించడం మొదలు పెడతాడు. అంటే ఏమిటన్నమాట-మనం లౌకికమైన కార్యానికి ఏ విధంగా యుక్తి ఉపయోగిస్తున్నామో అలాగే యిక్కడా అదే ఉపయోగిస్తున్నామన్నమాట. మన పిల్లవాడికి ఏది యిష్టమైతే దానితో మాటుపెట్టి మందు ఎలాగైతే వాడికి మింగిస్తున్నామో, అలాగే వాడికి అత్యంత శ్రేయస్కరమైన ఈ మందును యిస్తున్నాము. అటువంటి ప్రేమతో అవతలి వాడికి శ్రేయస్కరమైన దానిని మనం చేస్తున్నపుడు మనకు రాబోయే జన్మలలో గూడా సహస్రముఖాల తోటి, సహస్రవిధాలుగా సద్గురువు మనలను కాపాడుతూనే వుంటాడు. మన చుట్టూ వుండేవాళ్ళుగూడా మనకు శ్రేయస్సునివ్వడానికి ప్రయత్నంచేస్తూ వుంటారు. మన మనస్తత్వం లోంచి మనకది ప్రవేశపెట్టాలని ప్రయత్నం చేస్తారు. వాళ్ళ గురువు దగ్గరకు వెళ్ళినపుడు మనకాయన మేలు చేయాలని ప్రార్థన చేస్తారు. అలాగే మన తరింపుకు ప్రయత్నించేవారందరూ పరిగెత్తుకూంటూ వచ్చి మన తరింపుకు మార్గం చూపుతారు. నాకు జరిగిన "మామాజీ" సంఘటన ఇందుకొక ఉదాహరణ. ఆ సంఘటనలో మీకొక సందేహం కలుగవచ్చు. "మీరు ఇంతకాలంగా సాయిని ఆశ్రయిస్తున్నాగూడా సాయి మీకు చెప్పని రహస్యాలు - మామాజీ నుంచి నేర్చుకోవలసినవి యింకా వున్నాయా?" అని. అలాంటిదేమీ కాదు. ఉదాహరణకు మనదగ్గర ఒక యంత్రం వున్నదనుకోండి. దానిని మనం ఒకరకంగా ఉపయోగిస్తున్నాము. దానిని మరొక విధంగా ఉపయోగిస్తే మరొకందుకు గూడా ఉపయోగపడుతుంది అని చెబుతున్నాడు అంతే.

అరటిపండు తిన్నాము. తొక్కవిసిరి అవతల పారేశామనుకోండి. ఎవడో వచ్చి 'దానిని అలా విసిరి పారేయకయ్యా, పదిమందీ తొక్కుతారు, మట్టికొట్టుకుని ఎవరికీ పనికిరాకుండాపోతుంది. జాగ్రత్తగా చెత్తబుట్టలోనో, గోడప్రక్కనో పడేస్తే పశువులో, మేకలో తింటాయి. అది ఒక జీవికి ఆహార

మవుతుంది అని 'గుర్తుపెట్టుకుంటే చాలు. నీకు పుణ్యము కూడా దక్కుతుంది. నువ్వు అరటి పండు పెట్టలేకపోవచ్చు. కానీ ఆ పారేసే తొక్క ఒక జీవికి ఆహారంగా ఉపయోగపడుతుంది కదా. కొంచెం జాగ్రత్తగా ఒక ప్రక్కకు పెడదాం అనే శ్రద్ధ నీకుంటే చాలు' అని సూక్ష్మం చెప్పాడనుకోండి. అప్పుడు ఆ చెప్పేదెవరు? ఎక్కడ చెబుతున్నారు? ఎవరి ఆజ్ఞననుసరించి చెబుతున్నాడు? అవధూతకు 24మంది గురువులు ఏవిధంగా అయితే చెప్పారో, అలాగే ముక్కోటిమంది వచ్చి ఆలాగే చెబుతారు మనకు. ప్రతివాడు చెప్పినదానిని, దానిలోని సారాంశాన్ని మనం యిలా తీసుకోవలసినదే. అవతలి వాడు ఏ భావంతో చెప్పినా సరే, ఎవరు ఏ భావంతో ఏపని చేసినా సరే, సద్గురువు యొక్క అనుగ్రహంలో మనం వున్నాక, ఏదో రీతిన వాడికి మేలుచేసేది కాకపోతే అవతలివాడికి ఆ బుద్ధే పుట్టదు. వాడు ఆ పనీ చేయడు. తర్వాత పర్యవసానం చూసుకుంటే, వాడికా బుద్ధిపుట్టి ఆ పని చేయించింది ఎందుకోసమో, దానివలన ఎంతగా మేలుజరిగిందో మనకు తెలుస్తుంది. అందుకని మనము ఏ విషయంలోనూ చింతపడనవసరమూ లేదు, భయపడనవసరమూ లేదు. కాబట్టి మామాజీ విషయంలో మామాజీకి నాచేత ఒకమాట చెప్పించి అతనిని త్రిప్పి సాధన చేయించిందీ ఆయనే. నాకు అట్టి శ్రమ లేకుండా కొన్ని సాధనా రహస్యాలు నాకు చెప్పించిందీ ఆయనే. ఆ విధంగా నా దగ్గరున్న వస్తువును ఏ విధంగా ఉపయోగ పరచుకోవచ్చో తెలియపరుస్తున్నారు. అంటే ఏ సమయానికి నాకు ఏది కావాలో అది ఎవరినీ అడగనక్కర్లేదు. ఆయనను (బాబాను) గూడా అడగనక్కర్లేదు అని చెబుతున్నారు. ఇంతటి అర్థం దాగి వున్నది - స్వజన బాంధవాన్ - "ఆత్మ దారాధికం సర్వం సద్గురుభ్యో నివేదయేత్" అన్న శ్లోకంలో.

అందుకని మనం సద్గురువు దగ్గర తెలుసుకున్న వాటిని, ఎవరి సంస్కారాన్ననుసరించి వారు చరితార్థులు కావడానికి యోగ్యమైనటువంటి సాయియొక్క బోధలను, లీలలను చెప్పడానికి యత్నం మాత్రం చేస్తూనే వుండాలి. ఉదాహరణకు : మన బిడ్డ చెప్పినమాట వినకుండా తిరుగుతున్నాడనుకోండి, చెడిపోయాడనుకోండి, అప్పుడు మనం వాడిని వదలిపెట్టి వూరుకుంటామా? అతనిని బాగుపరచడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూనే వుంటాము. అలాగే యిక్కడగూడా మన ప్రయత్నం మనం చేస్తూనే వుంటాము. ప్రాప్తమున్నవాడు వింటాడు, లేకపోతేలేదు. అందుకే సాయి చెప్పారు -

"ఇతరులు చేసే పనులకు వారిపైనే ప్రభావముంటుంది. నీవు చేసే పనులకు మాత్రమే నీమీద ప్రభావముంటుంది. అందుకే నీవు చేసే పనులు జాగ్రత్తగా చేయి". అందుకని యిక్కడ మనపని జాగ్రత్తగానే వుంటుంది. అవతల వాడికి శ్రేయస్సు జరగాలనే సంకల్పంతో మన చేతనైన మేరకు చెప్పదలచు కున్నదేదో చెప్పుకునిపోతున్నావు. ఆ తర్వాత ప్రయోజనం పొందడం, పొందక పోవడమూ అవతలి వాడి ప్రాప్తం. అవతలి వాడికి ఏమి జరగాలని నీవు తాపత్రయ పడ్డావో ఆ ఫలితమే నీకుంటుంది.

ఎలాగంటే యిదివరలో ఒకసారి ఈ ఉదాహరణే చెప్పుకున్నాము. ఒకడికి మరొకడిమీద ద్వేషం వుంది. కానీ వాడిని ఏమీ చేయలేడు. అందుకని ఎప్పుడన్నా అవకాశమొస్తే వాడికి యివ్వడానికి వుంటుందని ఇంట్లో విషం తెచ్చి వుంచు కున్నాడు. వాడికి ఒకసారి వ్యాధి వచ్చింది. నాదగ్గర మందు వున్నదని చెప్పి ఆ విషం కలిపి తీసుకొచ్చి యిచ్చాడు. యింకేముంది? చచ్చిపోయాడు, పీడ విరగడ అయిపోయిందని సంతోషిస్తున్నాడు. కాని వాడికి జబ్బు తగ్గిపోయింది. అతడి పరిస్థితికి అది విరుగుడుగా అద్భుతంగా పనిచేసి వాడు బ్రతికాడు. కాని అక్కడ వీడికి చంపాలనుకున్న ఫలితం మాత్రమే దక్కుతుంది కాని, వాడిని బ్రతికించిన పుణ్యం మాత్రం దక్కదు. వాడి పూర్వ పుణ్యంవల్ల వాడు బ్రతికాడు గాని వీడి సంకల్పంవల్ల కాదుగదా! అట్లాగే యిటునుంచి అటుగూడా. ఒకడు మరొకడికి అతనిని బ్రతికించాలనే తాపత్రయంతో మందు వేశాడు. కాని అది వికటించి అతడు చనిపోయాడు. అది విషంగూడా కాదు. మామూలుగా అందరికీ ఉపయోగపడే మందే, కాని అది వాడి శరీరానికి సరిపడక రియాక్షన్ వచ్చి చని పోయాడు. కాబట్టి వీడికి చంపిన పాపం దక్కుతుందా? అంటే దక్కదు. అతనిని బ్రతికించడానికి ప్రయత్నం చేసిన మేలు మాత్రమే దక్కుతుంది. చనిపోవడ మనేది వాడి ప్రాప్తం. అట్లాగే యిక్కడ మనం ఏ సంకల్పంతో ప్రయత్నం చేస్తున్నా మనేది ముఖ్యం. కాబట్టి స్వజనులకు, బంధువులకు, తనకు తెలిసిన వారందరికీ గూడా ఎప్పుడైతే సాయి లీలల గురించే, బోధలగురించే సాధ్యమైనంత మేరకు మాట్లాడడం అలవాటు చేసుకున్నామో అప్పుడు బాబా చెప్పిన మొదటి సూక్తి అమలులోకి వస్తుంది. "ఎవడు నాగురించే ఎప్పుడూ మాట్లాడుతూ, నా గురించే ఆసక్తితో వింటూ, నన్నే అనన్యంగా చింతన చేస్తాడో, వాడు నా రూపమే ధరిస్తాడు. వాడి కర్మ తీరిపోతుంది" అని సాయి చెప్పారు గదా! అందుకు తగిన వాతా

వరణాన్ని మనం తయారు చేసుకుంటున్నామన్నమాట. మనం సాయి గురించి మాట్లాడుతున్నప్పుడు అవతలివాడికి నచ్చక పోతేనో అంటారేమో! నచ్చకపోతే వాడే మనదగ్గరకు రావడం మానివేస్తాడు. "పిడిదగ్గర కెళితే ఎప్పుడూ అ గొడవే"! అని మన దగ్గరకు రావడం మానేస్తాడు. లేకపోతే ఎక్కడెక్కడి విషయాలూ తెచ్చి మన స్మరణను పాడుచేస్తాడు. అందు కని బాబా చెప్పిన ఆ సూక్తిని మనం ఆ విధంగా ఉపయోగించుకోవచ్చు.

మచిలీపట్నంలో ఒకరున్నారు. వారి తల్లిగారికి సుమారు 80 సం॥ల పైనే వుంటాయి. ఆమె మనుమలు యిద్దరు ఒకరు ఇంగ్లాండులోను, ఒకరు అమెరికాలోనూ, డాక్టర్లుగా వున్నారు. ఇటీవల రెండు మూడు నెలల క్రిందట ఆమెకు జబ్బు చేసింది. మచిలీపట్నంలో వుండే పెద్ద డాక్టర్లు యిద్దరు, ముగ్గురు ఆమెను పరీక్షచేసి గుండెకు ఎక్కువగా నీరు పట్టిందని, గుండె పెరిగిందని, ప్రక్కటెముకలకు అనుకుంటూ వుంది, కనుక ఇక ఏ చికిత్స చేసీ లాభంలేదనీ, ఇకచివరి రోజులొచ్చాయి గనుక ఆమెను సంతోషంగా ఈ చివరిరోజులలో వుండేటట్లు చూడండి అనీ చెప్పారు. అయినా మా ప్రయత్నం మేము చేస్తామన్నారు, చేస్తున్నారు. ఈమె చివరి రోజులలో వుందని తెలిసి విదేశాలలో వున్న మనవలిద్దరూ ఈమె పోయినతర్వాత వెళ్ళవచ్చని 2,3 నెలలు సెలవు పెట్టుకుని వచ్చివున్నారు. వాళ్ళూ స్థానికంగా వున్న డాక్టర్లు కలిసి చికిత్స చేస్తున్నారు. అయినా ఉపయోగం లేదనుకున్నారు. రోజురోజుకూ ఆమె పరిస్థితి క్షీణిస్తున్నది. ఇంతలో వేరే వూరిలోవున్న ఆమె కుమార్తె వచ్చింది. ఆమె అక్కడ శ్రీసాయి బాబాగురించి విని శ్రీసాయిలీలామృతం పారాయణ చేస్తుంటుంది. సాయి సత్సంగాలలో పాల్గొంటుంది. ఆమె తల్లిగారి దగ్గరకు వచ్చిన తర్వాత ఆమెకు ప్రతిరోజూ శ్రీసాయిలీలామృతము చదివి వినిపించడం మొదలుపెట్టింది, రోజూ కొంచెం విభూతి బొట్టుపెట్టడం మొదలుపెట్టింది. ఇలా రెండు, మూడు రోజులు గడిచింది. నాలుగవరోజురాత్రి బాబా ఆరోగికి కలలోకి వచ్చారు, నాకు మంచి నీళ్ళు కావాలని ఆమెనడిగారు. ప్రతిరోజూ రాత్రి పడుకునేటప్పుడు ఆమెకు త్రాగడానికి ఒక గ్లాసుతో మంచినీళ్ళు పెడతారు. ఆమె కలలో ఆ గ్లాసుతోనే బాబాకు మంచినీళ్ళిచ్చింది. బాబా ఆ గ్లాసులోని నీళ్ళలో కొద్దిగా విభూతివేసి త్రాగమని ఆమె కిచ్చారు. ఆమె త్రాగింది. కొద్దిగా మిగిలి వుంటే గ్లాసు పక్కన పెట్టి ఆయునకు నమస్కారం చేసుకుందామని వంగింది. అప్పుడు చేయి తగిలి

గ్లాసు క్రిందపడింది. అమె దాని సంగతి తర్వాత చూసుకోవచ్చులే అని నమస్కారం చేసుకుంటుండగా మెలకువ వచ్చింది. మెలకువ వచ్చాక చూసే సరికి గ్లాసు నిజంగానే ప్రక్కకు పడివున్నది. తెల్లవారాక తనకు వచ్చిన స్వప్నం సంగతి యింట్లో వాళ్ళకు చెప్పింది. వాళ్ళు ఆ గ్లాసుతీసి చూచేసరికి అందులో అడుగున కొద్దిగా విభూతివున్నది. అప్పటినుండి ఆమెకు స్వస్థతచేకూరి యిప్పుడు హాయిగా వున్నది. అంటే బాబా స్వప్నంలో యిచ్చిన విభూతి మెలకువ వచ్చాక గూడా అలానే వున్నది. డాక్టర్లు ఆశ వదిలేసిన సందర్భంలో ఆమె జబ్బు పూర్తిగా తగ్గిపోయింది. ఇది స్థూలమైన ఉదాహరణ. ఇదివరకు మనం చెప్పుకున్న ఉదాహరణలో ఏముందంటే మనమీనాడు చేతనైనంతవరకూ పదిమందికి మేలుచేసే సందేశం అందించడం కోసం మనం పడే తాపత్రయం వలన సాధన కోసం ఎక్కడెక్కడో తిరిగి సాధించిన నాలుగు మంచి విషయాలు మనకు అందేలాగ చేస్తారనీ, మనం పడే ఆ తాపత్రయం వలన అటువంటి పుణ్యం మనకు లభించేలాగ గురుకృప మనకు చేస్తుందనీ తెలుసుకున్నాము. మన వాళ్ళందరినీ గురుసేవకు వినియోగించడమంటే వాళ్ళందరికీ హితం క్రింద మనం సాయిని గూర్చి చెప్పడము అని మనం యింతకుముందు అనుకున్నాము. అదే ఆ శ్లోకానికి వివరణ అని అనుకున్నాము. ఇప్పుడు నేను చెప్పినటువంటి ఆ వృద్ధురాలి సంఘటనలో ఆ కూతురు, ఆ తల్లికి చేసినది అదేమరి! తక్కిన వాళ్ళందరూ చేసిన ప్రయత్నం ఒకలాంటిది, ఆ కూతురు చేసిన ప్రయత్నం ఒకలాంటిది. ఆ కూతురు చేసిన ప్రయత్నంవల్ల ఆ ముసలమ్మకు మాత్రమే గాక తక్కిన వాళ్ళందరికీ గూడా సాయిపట్ల విశ్వాసం కలిగింది. ఆమెకు చికిత్స చేస్తున్న స్థానిక డాక్టర్లకు గూడ విశ్వాసం కలిగింది. విదేశాలలో వుండే వాళ్ళిద్దరికీ కలిగింది. ఆ విధంగా ఆ కుటుంబం మొత్తానికీ శ్రద్ధ ఏర్పడింది. ఆమెకు తెలిసినా తెలియకున్నా వారందరికీ ఆ విధంగా మేలు జరిగింది. ఆమె ద్వారా బాబా చేయించుకున్నకార్యం ఏమిటంటే - ఆ శ్లోకంలో చెప్పాడే - స్వజన బాంధవాన్ అని , స్వజన బంధువులను సాయికి అర్పించుట అనే పనిని ఆమె చేసింది. దీనినే గురుగీతలో మరొకరకంగా చెప్పబడి వుంది. ఎవరైనాసరే తన గురువుయొక్క మహిమను, గొప్పతనాన్నీ మననం చేసుకుంటూ వుండడము, ఎవరికైనా చెపుతూ వుండడము శిష్యునికి సరియైన సౌశీల్యము, సరియైన నడవడి అనీ చెప్పారు. తన గురువు యొక్క మహిమను మరుగుపరచవలసిన అవశ్యకత

ఎవరికి వుంటుందో ఉదాహరణ చెప్పుకుందాము.

ఒక్కొక్కరి మనస్తత్వం ఒక్కొక్క విధంగా వుంటుంది. ఉదాహరణకు గొప్ప వంశంలో పుట్టిన ఒకడు వున్నాడనుకోండి. వాడు తనది ఫలానా వంశమని ముందే పరిచయం చేసుకుంటాడు. నాపేరు ఫలానా అని తన పేరు చివరగా చెప్పుకుంటాడు. అలాగాక మరొకడు చిత్రమైన మనస్తత్వం గలవాడుంటాడు. వాడు వంశం వాళ్ళ పేరిటనేనా నాకు గౌరవం వచ్చేది? మనిషిగా నాకు గౌరవం లేదా? అనుకుంటాడు. అందుకని వాళ్ళ సంగతి ముందుగా చెప్పడు. 'వాళ్ళ పరంగా నాకు గౌరవమిస్తే అక్కర్లేదు, నన్నుగా గౌరవిస్తే గౌరవించు' అంటాడు. శ్రీగురుగీతలో సచ్ఛిష్యుడు తన గురువు యొక్క మహిమను చెప్పుకుంటాడు అని చెప్పారు. ఎందువల్లనంటే అలా చేయడంవల్ల తనకు గురువు పట్ల భక్తి భావం నిలుస్తుంది. వినమ్రత ఏర్పడుతుంది. తనలోమంచి పనికొచ్చే గుణము, పనికివచ్చేమాట, ఇలా ఏది వెలువడ్డా అది తన గురువువల్లనేనని అవతలివాడికి స్పష్టంగా తెలుస్తుంది. ఇది నా స్వంతంగాదు, ఇది నా గురువు చలవవల్ల, వారి బోధవల్ల, వారి ఆశీస్సులవల్ల మాత్రమే వచ్చిందని చెప్తాడు. 'ఇదిగో, యిది నేను చెబు తున్నాను' అని మాత్రం అనడు. అప్పుడు తన వాళ్ళందరినీ , 'ఆత్మ దారాదికం సర్వం' అన్నట్లు సద్గురువుకు అర్పించడం జరుగుతుంది. ఈ మొత్తం కలిసి దక్షిణ అనేదానికి అన్వయించుకుంటే సరిపోతుంది. అటువంటి కార్యమే సాయి అక్కడ అమెచేత చేయించుకున్నారు.



అధ్యాయం-16

సత్సంగము



మన వ్యక్తిగత జీవితానికి బాబా చెప్పిన సూక్తులను అర్థం చేసుకోవడానికి, అవగాహన పెంచుకోవడానికి, అమలులో పెట్టుకోవడానికి సత్సంగం మనకు దోహదం చేస్తుంది. తరచుగా సత్సంగాలు చేస్తూ వుంటే నలుగురితో బాబా విషయాలు పంచుకోవడం వల్ల ఎవరిదగ్గరైనా సంకోచం లేకుండా మాట్లాడడం అలవాటవుతుంది. అందుకని సత్సంగంలోని అందరూ సత్సంగంలో పాల్గొనడమే గాకుండా సత్సంగం చేయడం కూడా నేర్చుకోవాలి. ఎందుకంటే బాబా గురించి ఏమీ తెలియని వాళ్ళు వచ్చి, "మాయింట్లో సత్సంగం పెట్టుకోవాలని వుందండి, ఎలా చేసుకోవాలో తెలియదు. మీరు వచ్చి సత్సంగం చేస్తారా?" అని అడిగినపుడు వెళ్ళి సత్సంగం చేసిరావడానికి అవకాశముంటుంది. అలాగాక ఎప్పుడూ ఒకడే సత్సంగం నిర్వహిస్తుంటే వాడొక్కడే ఎన్నిచోట్లకని వెళ్ళి చెప్పగలడు? వాడు లేకపోతే సత్సంగమే ఆగిపోయే పరిస్థితి రాకూడదు. మనింట్లో వున్న నలుగురూ అన్ని పనులూ చేయడం నేర్చుకుంటే ఎవరు వూరి కెళ్ళినా యింట్లో పనులు జరిగిపోతాయి. ఒకవేళ యిరుగుపొరుగు వాళ్ళకు యిబ్బంది వచ్చినా సహాయం చేయడానికిగూడా అవకాశముంటుంది. అందు కని సత్సంగంలోని ప్రతివాళ్ళూ చరిత్ర పఠనము చేయడము, భజన చెప్పడమూ, బాబా గురించి మాట్లాడడమూ చేస్తూ వుండాలి. అంటే ఒక్కొక్కసారి ఒక్కొక్కళ్ళు చొప్పున సత్సంగం చేయాలన్నమాట. అలా చేస్తే బాబా గురించి నలుగురితో మాట్లాడాలంటే సంకోచము, బిడియమూ లేకుండాపోతాయి. ఇవన్నీ ఎందుకంటే ఆత్మీయతను, బాబా పట్ల ప్రీతిని మనలో పెంచుకునే మార్గాలే. అలా చేస్తూవుంటే ఆ విధంగా చేయడంలో మనకు ప్రీతి యింకా పెరుగుతూ వుంటుంది.

మన ప్రాణమిత్రుడు వచ్చినప్పుడు వాడితో ఎంతసేపు కాలక్షేపం చేసినా యింకా చేయాలనే అనిపిస్తుంది. వాడిగురించి యితరులకు పరిచయం చేస్తాము, వాడి గురించి వాళ్ళకు చెప్తాము, విసుగనే అనిపించదు. మరెవరైనా వస్తే "వీడి దుంపతెగ, వీడు వచ్చాడే, మన టైమంతా తినేయడానికి" అనిపిస్తుంది.

అందుకని మన గురువు గురించి - బాబా గురించి - యింకా యింకా తెలుసుకోవడం, నలుగురితో పంచుకోవడం మనలో ఆయన పట్ల ప్రీతిని పెంచుకోవాలి. అలా చేస్తుంటే మనలో ప్రీతి పెరిగి ఆయన గురించి యింకా యింకా తెలుసుకోవాలనే తపన పెరుగుతుంది. రాత్రింపగళ్ళూ ఆయన గురించి మాట్లాడినా విసుగనిపించదు. ఎట్లాగంటే ఇంట్లో అతి గారాబంగా పెరిగిన పిల్ల వున్నది. ఆ పిల్లకు ఎప్పుడూ ఏ కష్టమూ తెలియకుండా , ఏ పనీ చెప్పకుండా పెంచారు. ఎప్పుడూ నిద్రలేకుండా వుండి వుండదు. ఆ అమ్మాయికి వివాహమైతే భర్త ఎవరినైనా స్నేహితులను తెచ్చి వండిపెట్టమంటే విసుగనిపించవచ్చు, ఇష్టంలేకపోవచ్చు. కాని ఆ అమ్మాయికే ఒక బిడ్డ పుడితే, ఆ బిడ్డ రాత్రిపూట నాలుగైదు సార్లు ఏడ్చినా ఏమీ విసుగనిపించదు. నిద్రా భంగం కలుగుతున్నట్లు అనిపించదు. పైగా ఆ బిడ్డ లేచి ఏడుస్తుందేమోనని ఒక కంట కనిపెడుతూనే వుంటుంది. అట్లా ఎందుకని పిస్తుందంటే ఆ బిడ్డ పట్ల అపారమైన ప్రీతివల్లనే.

అలాగే మనింటికి ఒక పెద్దమనిషి వచ్చారు. ఆయనంటే మనకెంతో గౌరవం. కాని గౌరవం దూరానికి సంకేతం. "వారు పెద్దవారు, కాసేపు మాట్లాడి పంపించకపోతే ఎట్లా? బాగుండదు" అనుకుంటాము. అదే ఆత్మీయుడైన స్నేహితుడొస్తే, వాడితో ఎక్కువసేపు మాట్లాడకపోతే మనకు బాగుండదు. అలా గాక మనకు పెద్దగా పరిచయం లేకుండా, గౌరవనీయులైన పెద్దమనిషితో మనకు సాన్నిహిత్యము, చనువు ఏర్పడినకొద్దీ అది ప్రీతిక్రింద, ఆత్మీయత క్రింద మారుతుంది. అదే రీతిన ప్రతిరోజూ పూజ చేసేటప్పుడు ఆ సద్గురువు యొక్క గుణగణాలను స్మరిస్తాము గనుక అప్పుడు మనకు వారి దయాదాక్షిణ్యాలవల్లనే ఈ జగత్తు, మన జీవితమూ ఆధారపడివున్నాయని గుర్తింపు వచ్చి, వారినిగాక యింకెవరిని గురించి ఆలోచిస్తాము? అనిపిస్తుంది. ఈ గుర్తింపువల్ల రోజు రోజుకీ ఆయనపట్ల ఆత్మీయత పెరుగుతుంది. ఆయనకు, మనకు, ఈ సృష్టికీ వుండే సంబంధాన్ని గూర్చి ఆలోచించిన కొద్దీ అవగాహన పెరిగి ఆయనయే నిజమైన స్నేహితుడు, నిజమైన తండ్రి అనిపిస్తుంది. ఎందుకని? సృష్టి జరుగక ముందు కేవలం పరబ్రహ్మమే వున్నదని, అప్పుడు దానికి 'నేననేక మగుదును గాక' అని సంకల్పం కలిగిందని, అది సర్వశక్తివంతమైన ఆ పరబ్రహ్మ సంకల్పం గనుక అనేక రూపాలు ధరించిందనీ శాస్త్రం చెబుతుంది. ఇవన్నీ ఏర్పడకముందు

- ఆ మొట్టమొదట వున్న దానిని పురుషుడు లేక చైతన్యము అంటున్నారు. అది మనలోనూ వుంది. ఎందుకని? ఆయనలో వుంది గనుక. అందుకని సర్వానికీ తండ్రి ఆయన. ఆయన సంకల్పంచేత ఏర్పడినటువంటి దేహమే మళ్ళీ మనకు ఆ రూపంలో గోచరిస్తుంది. అంతటా నిండివున్న ఆయనే మన శరీరంలో గూడా వున్నాడు. ఈ సంగతి గుర్తుండడం కోసం అంగన్యాస కరన్యాసములు చేయమని మన పెద్దలు చెప్పారు. 'ఇది నా ఆహారము, నా పొట్ట కోసం నేను తింటున్నాను' అనే దౌర్భాగ్యపు భావంతో గాక, భగవంతుడు ఏర్పరచినటువంటి సృష్టి క్రమంలో ఆయన సంకల్పం నెరవేరడానికి ప్రకృతి శక్తులు కలిసి ఎలా పనిచేస్తున్నాయో గుర్తుపట్టి తినమని చెప్పడంకోసమే ప్రాణాహుతులు చేయమని చెప్పారు.

ఆ రీతిన వీటన్నింటినీ గుర్తుపెట్టుకుంటూ అన్నింటిమీద మనకున్న అవగాహనను, భావనను విస్తరింపజేసుకుంటూ వుండమని చెప్పారు. అట్లా విస్తరింపజేసుకోవాలంటే ఆయనతో సాన్నిహిత్యం ఏర్పడాలి. ఏ రీతిన? మన మిత్రుల పట్ల ఆత్మీయత ఏ రీతిన ఏర్పడింది? రోజూ కొంతసేపు వాళ్ళతో కాల క్షేపము చేసాము గనుక, ప్రీతి పెరిగినకొద్దీ ఎక్కువ సమయం వాళ్ళతో గడుపుతాము. అలా ఎక్కువ సమయం వాళ్ళతో గడుపుతాము గనుక, వాళ్ళ పట్ల యింకా ప్రీతి కలుగుతుంది. ఇది గూడా అంతే. పూజ చేస్తున్నప్పుడు ఆ ప్రభావం వల్ల ఎక్కువసేపు పూజ చేసుకుంటే బాగుండుననే భావం కలుగుతుంది. అందుకని ఎక్కువసేపు చేస్తాము. అలా చేస్తాము గనుక ఆయనపట్ల భావం లోతుగా, గాఢంగా కలుగుతుంది. అప్పుడాయనపట్ల ప్రీతి పెరుగుతూ పోతుంది. అప్పుడు "త్వమేవ మాతాచ పితా త్వమేవ" అన్న శ్లోకం వాస్తవంగా అర్థమై, ఆయనే సర్వమూ అన్న భావం దృఢపడుతుంది. అలా ఏర్పడడం కోసమే మూడు పూటలా చేయమన్నారు. అటువంటి ఆత్మీయతా భావం హృదయంలో పెరుగుతుంటే, ఆత్మీయులైన స్నేహితులు వచ్చినపుడు వాళ్ళను సంతోషపెట్టడం కోసం ఏయే ఏర్పాట్లయితే చేస్తున్నామో, అవే భావాలతో యిక్కడా చేస్తున్నాము. అంతే కాక ఇక్కడ బాబా నిజమైన ప్రాణస్నేహితుడు, నిజమైన తల్లి, నిజమైన తండ్రి, నిజమైన ఆత్మీయుడు అని తెలియడంచేత అట్టి గుర్తింపుతో చేస్తున్నాము. అప్పుడు అందరిపట్లా వుండే భావం ఒకేచోట కూడివుండడంచేత ఇది సాటి లేనిదవుతుంది. అక్కడ మిత్రుడి మీద వుండే భావం మిత్రుడి మీద వుంటుంది,

తండ్రిమీద వుండేభావం తండ్రి మీద వుంటుంది - అలాగే అందరిమీద వుంటుంది. కాని ఇక్కడ అలాగాదు. ఇంతమందిమీద కలిసివుండే భావం ఒక్కరిమీదే వుంటుంది గనుక సాటిలేనిదవుతుంది. సాటిలేకుండా ఎప్పుడైతే అయిందో అది అనన్య భక్తి అయింది. దానికి సాటి మరొకటి లేదు - హృదయంలో అప్పుడు మనం సమర్పించిన - నిష్ఠ సబూరీలనే మూడడుగుల నేలను ఆయన ఆక్రమించాడని అర్థం. అందుకని పూజా కార్యక్రమం యిందుకోసం పెట్టారు. సత్సంగ కార్యక్రమం మనం యింతకు ముందు చెప్పుకున్న విధంగా మనస్సు మలచుకునేందుకు పెట్టారు. ఈ విధంగా సాధ్యమైనంతమేరకు మన జీవిత మంతా గూడా ఆయన గురించి ఆలోచించడము, ఆయన గురించి వినడము, ఆయన గురించి మాట్లాడడము, ఆయనను పూజించడము చేయడంవల్ల, మొత్తం ఆయన సంకల్పానుసారం ఆయన రూపమే లీలగా ఈ జగత్తుగా ఆడుతున్నది అనే అవగాహన మనకు కలగడం వల్ల, నిష్ఠ, సబూరీలనే మనము సమర్పించిన దక్షిణ ఆత్మ సమర్పణగా మారి, ఆ స్థితిలో మనము నిలబడగలుగుతాము. ఈ విషయాన్నే సాయి తన సూక్తులలో చెప్పారు. 'నా లీలలే గానం చేయి' అని. అలా చేస్తే పర్యవసానం ఏమిటి? అంటే వారే నేనుగా మారిపోతారు అని చెప్పారు. దానికి ఋజువు ఏమిటి? అంటే తాము తమ గురువును ఆరాధించిన సంగతి చెప్పారు. "నా ప్రాణాలన్నీ కళ్ళల్లో కేంద్రీకరించుకుని, నా కళ్ళను గురువుమీద కేంద్రీకరించుకుని ఆయననే చూస్తూ వుండిపోయాను. నాకు యింక వేరే ఆలోచనే తట్టేది కాదు. క్షణకాలంగూడా ఎడబాటు లేకుండా ఆయన గురించే నా మనస్సు ఆలోచించేది. వేరే ఆలోచించడానికి తగిన విషయమే నాకు దొరకలేదు" అన్నారు. అట్లా అయినపుడు ఆయన గురువు ఏం చేసారు? ఏమన్నా యిచ్చారా? ఈయన ఏమన్నా చేయమని ఆయనను అడిగాడా? చేయడమూ లేదు, ఇచ్చేందుకూ ఏమీ లేదు. ఆశీర్వదించారు అంతే! ఆయన ఎలా అయ్యారో, ఈయనా అలాగే అయ్యారు.

శ్రీసాయి యిలా అన్నారు : "నేను నా గురుకృప వల్ల ఈ విధంగా అయ్యాను. నన్ను గూడా అలాగే పెట్టుకుని మీరుగూడా ఆ విధంగానే అవండి" అని. అవును, ఆయన సాంప్రదాయం వేరు. ఆయన చెవిలో ఉపదేశించరు. కాని చెవులు హోరెత్తిపోయేటట్లు అన్ని వైపులనుంచి అరుస్తారు. అన్ని దిక్కులనుంచి,

అనేక రూపాలలో నుంచి నిరంతరం బోధిస్తూనే వుంటారు. నీవు ఒకే ఉపదేశం, ఒకే దిక్కు నుంచి, ఒకే సమయంలో కాసేపు కావాలన్నావు. కాని నేను 365 రోజులు, 24 గంటల చొప్పున, అన్ని రూపాలతోను ఉపదేశం యిస్తుంటాను, చేతనైతే తీసుకో'' అంటున్నారు. 'బోధలేదు, బోధలేదు' అని ఎందుకు బాధ పడతావు? అని ఆయన బోధను అన్ని వైపులనుంచీ వర్షిస్తున్నారు. కనుక అటువంటి అవకాశాన్ని మనం పొందగలందులకు ఈ సత్సంగ కార్యక్రమం దోహదం చేస్తుంది. మనం నిత్యం స్మరించుకోవడానికి అది పనికి వస్తుంది. మనకు ఆత్మీయులైన వాళ్ళకు ఉత్తమమైన సంకల్పం ద్వారా మన చిత్తం శుద్ధమయ్యేందుకు, సాత్వికం కావడానికీ అది దోహదం చేస్తుంది. అప్పుడు వారు చెప్పిన సూక్తిలో వారిచ్చిన అభయాన్ని మనం పొందుతున్న వాళ్ళమవుతున్నాము. ఆయన తమ గురువు వద్దనుంచి పొందినటువంటి దానిని మనం గూడా పొంద డానికి మన జీవితాన్ని ఆ విధంగా రూపకల్పన చేసుకుంటున్నాము.

ఇందాక మనం చెప్పుకున్నట్లు దాసగణు మహరాజ్‌గారికి కీర్తన చేయమని ఎందుకు చెప్పారంటే మనం యిప్పుడు సత్సంగం ఎందుకు పెట్టు కున్నామో అందుకు. ఎవరిమీద ఆయనకు అనుగ్రహం కలిగిందో వాళ్ళకంతా అట్టి కాలక్షేపమే. మహల్సాపతికి ఏముంది? అతనిది నిరుపేద కుటుంబం, ఖండోబా ఆలయంలో అర్చకత్వము చేసేవాడు. బంగారుపని చేసుకునే వాడు. శిరిడీ అతి చిన్న గ్రామమేమో ఎవరికీ పెద్దగా అవసరంగూడా వచ్చేది గాదు. అ వున్నంతలో ఆ బంగారు పనే చేసుకుని బ్రతికేవాడు. అలాంటివాణ్ణి బాబా ఆ పని మానేయమన్నారు. మరేమి చేయమంటారు? అంటే "భిక్ష చేసి జీవించు'' అని అన్నారు. అతడు అందరికంటే ఆత్మీయుడు, అతనిని అలా బ్రతక మన్నారు. అలాగే దాసగణును కీర్తన చేసుకుని బ్రతకమన్నారు, ఈ విషయం భాగవతంలోగూడా వున్నది. "ఎవడిమీద అనుగ్రహం సంపూర్ణంగా వుంటుందో, భగవంతుడు వాడినుంచి ముందుగా సర్వం అపహరిస్తాడు"అని. సర్వం అపహ రించడమంటే ఏమిటి?

ఉదాహరణకు: చిన్న పిల్లవాడు బయట ఆడుకుంటున్నాడు. చెత్తాచెదారమంతా రెండు చేతులతోనూ ప్రోగుచేసుకున్నాడు. రాళ్ళు, రప్పలు, రంగు కాగితాలు మొదలైనవన్నీ రెండు చేతులనిండా వున్నాయి. తల్లి వాడి

చేతుల్లో ఏదైనా తినుబండారం పెట్టాలనుకున్నదనుకోండి. అప్పుడు ఆమె అవన్నీ వాడి చేతులలోంచి తీసి అవతల పారేసి శుభ్రంగా చేతులు కడిగి ఆ చేతుల నిండా తినుబండారాలు పెడుతుంది. అలాగే మనం గూడా సాయి అనుగ్రహాన్ని పొందగలందులకు అంటే సత్సంగం ఒక సాధనగా ఉపకరిస్తుంది. మనకు అనవ్యచింతన కలగడానికోసం దానగణును ఉదాహరణగా చూపించారు. మనము గూడా ఆయన సూచిస్తున్న దానిని ఆచరణలో పెట్టుకోవడానికి ప్రయత్నం చేయాలి. దానిని మరింత సార్థకం చేసుకోవడానికి మనం చదివినవి, విన్నవీ కాస్త ఎక్కువ స్థాయిలో గుర్తుపెట్టుకోవడానికి మనం ప్రయత్నం చేస్తే చాలు. పత్సంగం గూడా దక్షిణలో భాగమే.



అధ్యాయం-17

పూజ



దక్ష అంటే జాగ్రత్త అనే హెచ్చరిక. దక్షిణ అంటే లోపల ఎన్నడూ జాగరూకత కలిగివుండడం. జాగరూకత కలిగి వుండడమంటే ఆయనకు, ఆయన పటానికీ భేదం లేదని చెప్పిన ఆ భావాన్ని - అంటే పటం రూపంలో సాక్షాత్తూ వారే వున్నారన్న భావాన్ని సాధ్యమైనంతగా నిలుపుకోవడానికి ప్రయత్నం చేయడం. కాని అలా ప్రయత్నిస్తున్నప్పుడు ఎక్కువసేపు ఆ భావాన్ని నిలుపలేము. నడుమును నిటారుగా ఎంతగా నిలపాలని ప్రయత్నించినా వంగిపోతూ వుంటుంది. మనస్సుగూడా అంతే. నీవు కాసేపన్నా నిటారుగా వుంటుంది. నెప్పిపుట్టినప్పుడన్నా నిటారుఅవుతుంది. కాని లోపల వుండే భావన మాత్రం నిలువ ప్రయత్నిస్తుంటే వెంటనే పడిపోతుంటుంది. అందుకని దానిని కాసేపన్నా నిలబెట్టుకోవడానికి - అంటే గుర్తుపెట్టుకోవడానికి అభ్యాసంగా మనవాళ్ళు పూజావిధానం నియమంగా చేయమన్నారు. బాబా ఎదురుగుండా పూజలో కూర్చున్న కాసేపు, ఆ అరగంటసేపైనా సరే - ఆయనే వున్నాడన్న భావం నిలుపుకుంటే చాలు, 24 గంటల సంగతి తర్వాత చూడవచ్చు అన్నారు. పూజలో కూర్చున్నప్పుడు - ఆయన సాక్షాత్తూ అక్కడ వున్నారు, ఆయన పాదాలు కడుగుతున్నాము, చేతులు కడుగు తున్నాము, ఆయనకు స్నానం చేయిస్తున్నాము అని ఆయన స్వయంగా అక్కడ వుంటే ఎలా సేవలు చేస్తున్నామో, అలాగే అట్టి భావనతో ఎంతసేపు చేయగలిగితే అంతసేపు చేయమన్నారు. అందుకోసమే పూజ ఏర్పడింది. అలా చేస్తుంటే ఏం జరుగుతుందో, ప్రయత్నం చేసి చూస్తే తెలుస్తుంది. మన బిడ్డనే కాసేపు దైవంగా భావించి మనకు వచ్చిన సూక్తంగాని, మంత్రంగాని చదువుతూ స్నానం చేయించడం కోసం ప్రయత్నించండి. ఏం జరుగుతుందో మీకే తెలుస్తుంది. మధ్యలో మర్చిపోతాము. ఎందుకని? ఆ పిల్లవాడు సరిగా నీళ్ళు పోయించుకోడు. మనం పోస్తుంటే వాడు విదిలించుకుంటాడు. అటూ యిటూ తిరుగుతాడు, పరుగెత్తి పారిపోతుంటాడు. వాడిని పట్టుకోవడమే సరిపోతుంది. వీపు రుద్దించుకోలేదు, తలరుద్దించుకోలేదు అనడమే సరిపోతుంది, ఇక సూక్తం సంగతి ఎక్కడ? అంతకుముందు ఎక్కడ

ఆపామో గూడా గుర్తుండదు. "ఓం నమో రుద్రాయ" అనేటప్పటికి వాడు ఏదో అల్లరి చేష్ట చేస్తాడు. ఆ నబ్బునీళ్ళు మన ముఖాన చల్లుతాడు. లేకపోతే సబ్బురుద్దిన ముఖం కడగక ముందే కళ్ళు తెరుస్తాడు, ఏడుస్తాడు. అప్పుడు ఏమైపోతుంది మన మంత్రం? అందుకని మనవాళ్ళు-"వాడికి పోస్తున్నంత వివరంగా పోస్తున్నట్లు భావనచేయి చాలు" అన్నారు. అంతటి చింతనతో, మననంతో చేస్తే ఏం జరుగుతుందో చూడమన్నారు. మనం ఏ మంత్రంలోనూ ఏ సూక్తంలోనూ గూడా అలా మనస్సును నిలువలేము. కనుక పూజకు అంటే ఆయనను పూజించడానికి ఏం కావాలి? అంటే 'దక్ష'-దక్షిణ - ఒక్కటే కావాలి. 'సాక్షాత్తూ ఆయనే ఎదుట వున్నాడు' అన్న ఒక్క భావన వుంటే పూజకు ఏమీ లేకపోయినా రక్తి కడుతుంది. అది లేకపోయిన తర్వాత ఎన్నివున్నా రక్తిగట్టదు. ఉదాహరణకు : లౌకికంగా ఒక పెద్దమనిషిని తీసుకువచ్చి సన్మానం చేస్తున్నా మనుకోండి. ఆ సన్మానం చేయడంలోని ఉద్దేశ్యం-మనకు గాని, లేక పదిమందికి గాని కావలసిన పనిలోగాని ఏదో ఆయన సహకారం వుంటుందన్న ఆశతో చేస్తున్నామనుకోండి, 'ఏడింతటి వాడు, అంతటివాడు' అని పొగుడుతున్నాము. నిజానికి ఆయన పనికిమాలినవాడు అని తెలిసి గూడా అలా పొగుడుతున్నా మనుకోండి. ఆ సమయంలో ఆయన ఇవేవీ వినలేని స్థితిలో నిద్రలోకి జారు కున్నాడనుకోండి, అప్పుడు మన శ్రమంతా ఏమయినట్లు? ఎవరైతే విని సంతోషించాలని మనం మాట్లాడామో ఆయన నిద్రపోతున్నప్పుడు ఎవరికోసం యిదంతా? ఆయన వింటేనే అది రక్తి కడుతుంది. లేకపోతే వృధాశ్రమే మిగులుతుంది.

శ్రీసాయి ఎప్పుడూ నిద్రపోరు, ఆయన నిద్రపోయే పరిస్థితే లేదు. ఆయనను చెక్కబల్లమీద పడుకోమన్నపుడు, పైన వ్రేలాడగట్టుకుని హాయిగా పడుకుని, 'కళ్ళు తెరిచి వాలాగా నిద్రపోగలవాడు మాత్రమే చెక్కబల్లపై పడుకోగలడు' అని చెప్పారు. కాబట్టి కళ్ళు తెరచి నిద్రపోగల స్థితి ఆయనది, అంటే నిద్రలేని స్థితి అన్నమాట. కాబట్టి ఆయన నిద్రపోయే ప్రసక్తే లేదు. ఈ సంగతి గుర్తుపెట్టుకుని మన లోపలివాళ్ళి నిద్రలేపడమే సుప్రభాతమంటే. కాబట్టి సుప్రభాతం ఎవరికోసం? భగవంతుడే నిద్రపోతే వాళ్ళే మేల్కొలపడం మనకు సాధ్యమా? కనుక "ఆయన సర్వకాల సర్వావస్థలలోను, అంతటా వ్యాపించి, సర్వమూ తెలుసుకుంటూ సర్వాన్నీ కాపాడుతున్నాడు" అన్న 'ఎరుక' ను మనలో మేలుకొలపడమే సుప్రభాతమంటే. "ఇంకా ఎందుకు నిద్ర

పోతావు?" అని ఆ స్పృహను మేల్కొల్పాలి. "మేలుకో! లేకపోతే తప్పుడు పనులు చేస్తుంటావు. ఇకనైనా లేచి జగద్హితమైన కార్యం చేయి" అని మనకు మనం చేసుకునే ప్రబోధమే సుప్రభాతమంటే. ఎందుకని? పనికిరాని పనులు చేసి లోకాన్ని పాడుచేస్తున్నదీ మనమే, ఉత్తమమైన కార్యంలో నిమగ్నమై బాగు చేసుకునేదీ మనమే. ధర్మాన్ని రక్షించినవాణ్ణి ధర్మం రక్షిస్తుంది. అందరం కలిసి 'క్యూ' అనే సూత్రాన్ని పాటిస్తే వరుసగా నిలబడడంవల్ల హాయిగా వుంటుంది. లేకపోతే త్రోసుకుని మనమే యిబ్బంది పడతాము. 'క్యూ' అనే సూత్రాన్ని పాటిస్తే అందరం సుఖపడతాము. ఆ ధర్మాన్ని రక్షించుకున్నాము గనుక ఆ ధర్మం మనలను రక్షిస్తుంది. మనం ఉల్లంఘిస్తే మనలను మనమే చెడగొట్టుకున్న వాళ్ళ మవుతాము. కాబట్టి సర్వత్రా నిండివున్నవాడు - ఒకడున్నాడని మరిచి మనలోపలవున్నవాడు నిద్రపోతుంటాడు. వాడు నిద్రపోతే అహితమైన కార్యాలు జరిగిపోతుంటాయి. అందుకని లేవమని, మేలుకోమని, జగద్హితమైన కార్యంలో నిమగ్నమవమని, అప్పుడే మేలు జరుగుతుందన్న ఎరుక కలిగి వుండమని మనలోపల వాడికి పాడుకునేదే సుప్రభాతం.

అలాగే పూజ చేసేటప్పుడు స్థాపన చేసుకునేది, ఆవాహన చేసుకునేదీ మనలో వుండేటటువంటి ఈ ఎరుకనే. దీనినే ఆవాహనచేసి స్థాపన చేసుకుంటున్నాము. మనస్సు ఏం చేస్తుంది? - పనికిమాలిన చోట్లంతా తిరిగేసి వస్తుంది. అందుకని కాళ్ళు కడగాలి. చేయరాని పనులన్నీ చేసింది, అందుకని చేతులు కడగాలి. అందుకని ఆ భావన ఆయనయందు నిలపడం వల్ల మనస్సు శుద్ధమవుతుంది. ఆయన ఎప్పుడూ శుద్ధుడే. ఆయన చేతులు, కాళ్ళూ మనం కడిగేదేమిటి? ఆయనకు స్నానంచేయిస్తే మనమాలిన్యం ఆయనకంటుకుంటుంది. అనలది మనకు సాధ్యమా? అంతటావున్న ఆయనను కూర్చోబెట్టడం ఎట్లా? ఎవరైనా మనింటికొచ్చి మనలనే 'కూర్చోండి సార్' అన్నాడనుకోండి. మనింటికొచ్చి, 'ఏమీ మొహమాటపడకండి, భోంచేయండి' అన్నాడనుకోండి. మనింటికొచ్చి మనకు మర్యాదలేమిటి? అందుకని మనలో వున్న ఎరుకకు సంస్కరణే ఈ మొత్తమంతా. 'రక్ష'అని ఆయన చెప్పిన ఆ ఒక్క మాటలో యింతటి ఆధ్యాత్మిక సంస్కృతి యొక్క జగత్తు ఆధారపడి నిలిచివున్నది.

మనం సాయినాథుని సన్నిధిలోకి వచ్చాము. ఒక మందిరానికి గాని, లేక ఒక సత్సంగ కార్యక్రమానికిగాని వచ్చామనుకోండి. మనం ఎందుకు

వచ్చాము? సాయినాథుని అనుగ్రహం కోసం, ఆయన కృప కోసం వచ్చాము, మనకేదో మేలు జరుగుతుందనే ఉద్దేశ్యంతో వచ్చాము. ఆయనకు నివేదించిన ప్రసాదం మనకు పవిత్రతను, సంస్కారాన్ని ప్రసాదిస్తుందని వచ్చాము. కాని ఆ విభూతిగాని, తీర్థంగాని, నివేదించిన పదార్థంగాని - బాహ్యంగా యిచ్చే ప్రసాదాలన్నీ సంకేతాలు మాత్రమే. 'సాయి సన్నిధిలోకి వచ్చాము' అని శ్రద్ధగా ఆయన సన్నిధిలో కూర్చోవటంవల్ల మన మనస్సులో వుండే నిష్ఠ వున్నదే, అదే అసలైన ప్రసాదం. దీనిని మనం బాగా గుర్తుంచుకోవాలి. అందుకనే వెనుకటి వాళ్ళు ఆలయంలేని ఊరు పనికిరాదన్నారు. సాధ్యమైనంత తరచుగా ఆలయానికి వెళ్ళి రావాలి అన్నారు. అలా వెళ్ళనివాడు పనికిమాలినవాడు అన్నారు. ఆ విధంగా చెప్పడంలో వాళ్ళ ఉద్దేశ్యం - ఆలయానికి వెళ్ళగానే మన గుణం మారిపోతుందని కాదు. మనలో వుండేటటువంటి ఈ పవిత్రమైన భావాన్ని జాగ్రత్తగా మనస్సులో వహించి గుర్తుపెట్టుకోవడానికి అది ఒక సోపానం - దానిని సక్రమంగా వినియోగించుకోమని అంటున్నారు. కాబట్టి ఆయన సన్నిధికి ఎందుకోసం వచ్చాము? ఆయన అనుగ్రహం కోసం వచ్చాము. ఆయన అనుగ్రహం మన శ్రద్ధవల్ల లభ్యమవుతుంది. అందుకని ఆ శ్రద్ధను జాగ్రత్తగా నిలుపుకోవాలి. ఆయనకు, ఆయన పటానికీ భేదం లేదు, ఆయనయే మన ఎదుట వున్నాడు, ఆయనంటే ఫలాని తత్త్వం గలవాడు - అని గుర్తుపెట్టుకుని ఆయన సన్నిధిలో కొద్దిక్షణాలైనా కూర్చోగలిగితే క్రమంగా శ్రద్ధ నిలుస్తుంది. అదే మనం తీసుకున్నటువంటి అసలైన ప్రసాదం. స్థూలమైన ప్రసాదం దీనికి సంకేతం మాత్రమే. అందుకని మన పెద్దలు ఆలయానికి వెళ్ళినపుడు దర్శనం చేసుకుని గబ గబా వెళ్ళిపోబోకు, కాసేపన్నా అక్కడ కూర్చుని వెళ్ళు అన్నారు. అంటే వూరికే కూర్చొని పొమ్మనిగాదు దాని అర్థం. మనస్సును కాసేపైనా ఆయన సన్నిధిలో వుంచమని అర్థం. కాసేపు మనస్సును అక్కడ కూర్చోనివ్వమని, జపంగాని, ధ్యానంగాని చేసుకోనివ్వమని, 'అది ఆయన సన్నిధి' అన్న భావాన్ని హృదయపూర్వకంగా రానివ్వమనీ అర్థం. అలాగాకపోతే మనం ఆలయానికి వచ్చినట్లు ఎలా అవుతుంది? రాళ్ళ మధ్యకు వచ్చినట్లే అవుతుంది. ఇటుక, సిమెంటుల మధ్యలోకి వచ్చినట్లు అవుతుంది. ఉదాహరణకు : ఎవరో ఇల్లు కట్టారు. దానిలో నివసించడం మొదలుపెట్టాక అది నివాసము. అంతకు ముందు ఇసుక, సిమెంటు మాత్రమే. అలాగే అది వారి సన్నిధి అని గుర్తించినపుడు అది మందిరం. గుర్తించక ముందు అది మామూలు ఇంటితో సమానం.

అందుకని మనం పరధ్యానంలో వుండి ఏదైనా కబుర్లు చెప్పుకోవడంలోగానీ, మరే యితర ఆలోచనలతోగానీ కాలంవృధా చేసుకున్నామనుకోండి, అప్పుడు ఇటుక, సిమెంటుల మధ్య కూర్చున్నట్లే లెక్క. ఎక్కడైనా కూర్చుంటే ఎంతో, అక్కడ కూర్చున్నా అంతే. అట్లాగాక, అక్కడికి వచ్చి కూర్చున్న కాసేపూ సాక్షాత్తూ ఆయన సన్నిధిలో వున్నాము అని శ్రద్ధాభక్తులతో గుర్తుపెట్టుకోవాలి. అలా గుర్తు పెట్టుకోవాలంటే వారి చరిత్రలో వారికీ, వారి పటానికీ భేదం లేదని చెప్పిన సన్నివేశాన్ని ఒకసారి గుర్తుతెచ్చు కుని, మనస్సులో నిలుపుకోవడానికి ప్రయత్నం చేయాలి. వారు వారి గురువుపట్ల ఏవిధంగా చేసారు? తమ గురువుపై దృష్టి నిలిపి, తదేక ధ్యానంలో వున్నారు. అలాగే మనంగూడా మన దృష్టిని ఆయనపై నిలిపి, ఆయన లీలలు, ఆయన తత్త్వము గురించి ఆలోచించుకుంటూ కూర్చోవచ్చు. ఆయన నామస్మరణ చేసుకుంటూ కూర్చోవచ్చు.

మందిరంలో కూర్చున్నప్పుడు ఒకవేళ మనస్సు ఇతర విషయాల మీదకు మళ్ళితే 'ఇలా మనస్సు యితర విషయాలపైకి వెళ్ళబట్టేగదా, అప్పుడు ఆ భక్తుడు నైవేద్యం పెట్టడం మరిచిపోయాడు. ఆ సంగతి శిరిడీలో వున్న సాయి చెప్పారు గదా!" అని మనస్సును ప్రబోధించుకుంటూ కూర్చుంటే అప్పుడు మనం మందిరంలో కూర్చున్నవాళ్ళమవుతాము. అప్పుడు సాయి సన్నిధిలో కూర్చున్నవాళ్ళమవుతాము. సాయి కార్యక్రమాన్ని చేస్తున్నవాళ్ళమవుతాము. ఈ విధంగా సాయి చెప్పినటువంటి సూక్తులను మనం ఆచరణలో పెట్టుకుంటూ పవిత్రమైన ఆయన సన్నిధిని మనం సద్వినియోగం చేసుకోవాలి. కాబట్టి అట్టి సన్నిధిని మనకు ప్రసాదించిన సాయినాథుని కృపకు మనం సదా కృతజ్ఞులమై యుండి, దానిని సార్థకం చేసుకొని మన హృదయాలలో చక్కని పరివర్తనము తెచ్చుకోవాలి. ఇతరులమీద మనకు కలిగే ద్వేషము, అసూయ, భయము మొదలైన భావాలు హృదయంలో కలుగుతూ మానవుడనబడే స్థాయికంటే మనలను దిగజారుస్తున్న మన బుద్ధిలోని కుంటితనం ఏదైతే వున్నదో, మన వయస్సు, సంస్కారము, సాన్నిధ్యము, ఎటువంటివి వున్నా గూడా మనస్సులో ప్రవేశిస్తున్న వైకల్యం ఏదైతే వున్నదో, దానిని సవరించుకోవడానికి సాయి మన కిచ్చినటువంటి వారి చరిత్ర పారాయణ, సత్సంగము, ఆయన సాన్నిధ్యములను సద్వినియోగం చేసుకొనే ప్రయత్నం చేయాలి.



అధ్యాయం-18

సద్గురుసేవ



తమ సాంప్రదాయం గురించి సాయిచెప్పినటువంటి వాటిని మననం చేసుకోవాలి. సాయి తమ గురువును తామెలా సేవించారో చెప్పారు. తాము చెవిలో ఉపదేశించము అనీ, ఉపదేశాలకోసం ప్రాకులాడవద్దనీ, గురుసేవవల్లనే తమకిట్టి స్థితిని ఏ ఉపదేశమూ లేకనే తమ గురువు ప్రసాదించారనీ చెప్పారు. తాము గురుసేవ ఎలా చేసినదీ ఆయన చెప్పారు. తమ గురువు అన్నారట: "నేను చెప్పినట్లు చేయగలిగితేనే నా వెంట రావాలి. నేను చెప్పినట్లు చేయ గలవాడే కృతార్థుడవుతాడు"అని. అప్పుడు సాయి అందుకంగీకరించారట. అప్పుడు ఆ గురువు సాయిని తమ ఆశ్రమానికి తీసుకువెళ్ళారట. అక్కడ ఒక పెద్ద బావి వున్నదట. ఆ గురువు సాయినాథుని కాళ్ళు త్రాడుతో కట్టి ఆ బావి మీదకు వున్న చెట్టు కొమ్మకు బావిలోకి తలక్రిందులుగా వ్రేలాడేటట్లు కట్టేశారట. బావిలోని నీళ్ళు అందకుండా జానెడుపైకి వుండేటట్లు వ్రేలాడదీసి ఎక్కడికో వెళ్ళిపోయారట. సుమారు 4,5 గంటల తర్వాత తిరిగివచ్చి బావిలోకి తొంగి చూచి, "ఎలా వున్నావు?"అని అడిగారట. అప్పుడు సాయి, "పరమానందంలో తేలిపోతు న్నాను"అని సమాధానమిచ్చారట. అంతట గురువుగారు సాయిని బయటకు తీసి ఆలింగనము చేసుకొని, నఖశిఖపర్యంతమూ చేతితో నిమిరారట. అంతటితో సాయికి తల్లి-తండ్రి, ఇల్లు-వాకిలి అనే లౌకిక బంధాలన్నీ మరుపుకు వచ్చాయట. అప్పుడు ఆ గురువు ఆయనను తమ ఆశ్రమంలో వుంచుకున్నారు. ఆ తర్వాత గురువు ఎక్కడకూ వెళ్ళకుండా ఒకచోట ఆసనం వేసుకు కూర్చుని ఆత్మనిష్ఠలో వుండిపోయారు. ఆ నిష్ఠ ఎటువంటిదంటే ప్రపంచము, తన శరీరము వున్నాయనే సంగతి ఆయన మర్చిపోయారు. వేళకు ఆహారం తీసు కుందామన్న ధ్యాసేలేదు. శరీరమున్నట్లు జ్ఞాపకముంటేగదా తినాలనిపించేది? మలమూత్ర విసర్జన చేయాలనిపించాలంటే తనకొక శరీరమున్నట్లు గుర్తుం డాలిగదా! అటువంటి స్పృహ లేని స్థితిలో నిరంతర ధ్యాననిష్ఠలో వుండిపోయారు. అటువంటి ఆయనను చూస్తూ సాయి గూడా ఆకలిదప్పుల సంగతే మరచి పోయారు. తన సంగతేమీ తనకు పట్టేది కాదు. అందుకని సాయికి ఆయనను

- అంటే తమ గురువును వదలిపెట్టి వెళ్ళలేని స్థితి ఏర్పడింది. అప్పుడు సాయి వేళకు వెళ్ళి భిక్ష తీసుకువచ్చి ఆయనకు ఆహారం తినిపించేవారు. ఆయన అక్కడే మలమూత్ర విసర్జన చేస్తే అదంతా శుభ్రం చేసి ఆయనను చూస్తూ ఆయన ఎదురుగా కూర్చునేవారట.

అప్పుడు సాయి అనుకునేవారట, "ఈయన చాలా గొప్పవారు. ఆకలిదప్పులు గూడా తెలియని ఆత్మనిష్ఠలో వున్నారు. శరీరమున్న సంగతినే మరచిపోయి ధ్యానస్థితిలో వున్నారు. ఈయనకు శ్రద్ధగా సేవచేస్తే ఏనాటికైనా ఉపదేశం చేస్తారు. ఇటువంటి గురువు దగ్గర ఉపదేశం పొందితే జన్మకు సార్థకత కలుగుతుంది. మనం సేవచేస్తుంటే ఎప్పటికైనా దయతలచి ఉపదేశం చేయక పోతాడా?" అని ఎంతో శ్రద్ధతో సేవ చేసారట. అలా 12 సం॥ల పాటు ఆ ఆశ తోనే నిరంతరసేవ చేసారట. 12 సం॥లు గడిచాక ఒకరోజు గురువు సాయిని పిలిచి మొదట తలమీది వెంట్రుకలు తీయించారుట. ఆ తర్వాత రెండు కాసులు యివ్వమని అడిగారట. సాయి మామూలుపైసలు యివ్వబోతుంటే ఆయనన్నారట, "నేను అడిగింది ఈ మామూలు డబ్బులు కాదు, ఒక పైస నిష్ఠ, రెండవ పైస సబూరి (ఓరిమి)" అన్నారట. సాయి వాటిని సమర్పించి నమస్కరించాను అన్నారు. అప్పుడు గురువు తన తలమీద ఆయన చేతి నుంచి ఆశీర్వదించారని చెప్పారు సాయి. "నువ్వు సప్త సముద్రాలకవతల వున్నాసరే నేను నీ వెంటనుండి కాపాడుకుంటాను" అని ఆశీర్వదించారుట. అదే ఆయన తమ కిచ్చిన ఉపదేశమని సాయి చెప్పారు. అది ఉపదేశమే కావచ్చు, అనుగ్రహం కావచ్చు, మరేదైనా కావచ్చు. సాయి తమ దగ్గరకు వచ్చినవాళ్ళకు "చెవిలో ఉపదేశించడం మా సాంప్రదాయంకాదు. నా గురువుమీద అచంచల విశ్వాసంతో నా దృష్టిని ఆయనపైనిలిపి నేనిలా అయ్యాను. మీరు గూడా ఆ విధంగానే అవండి" అని చెప్పారు. అందుకు ఉపయోగపడేలా చిన్న హెచ్చరిక గూడ చేసారు: "ఉపదేశాల కోసం పరుగెత్తవద్దు" అని. అందుకు కారణమేమిటి? అంటే శాస్త్రప్రకారమయితే మాత్రం ఉపదేశమివ్వడం ఒకప్పుడే వీలవుతుంది. ఎవరు ఏ మంత్రానుష్ఠానంలో ఆత్మసాక్షాత్కారంగాని, లేక భగవత్సాక్షాత్కారం గానీ పొందారో వాడుదానిని ఉపదేశించడానికి అర్హుడు. అందుకని గురువు తాము ఉపదేశమిచ్చేటప్పుడే ఎవరి సంస్కారానికి తగిన ఒకానొక ఉపదేశమిచ్చేవారు. వాడు దానిలో ఆరితేరిన తర్వాత, వాడికి భగ

వదనుభూతి కలిగిన తర్వాత వాడికి చెప్పేవారు- "నీవు భగవదనుభూతిని పొందినాసరే సాధకావస్థలో వుండి ధ్యానాదులు నిర్వర్తించు" అని. అలాగాక పోయినా లోకహితం కోసం అవతరించిన మహనీయులందరికీ గూడ భగవదాదేశం అలానే వచ్చింది.

శ్రీ రామకృష్ణ పరమహంస అందుకే ఉదాహరణ. ఆయన దేవీ ఉపాసన చేసిన తర్వాత అన్ని రకాల సాధనలు చేసారు. అందుకని ఆయన తన శిష్యులకు ఎవరికి ఏ మంత్రం అవసరమో ఆ మంత్రం ఉపదేశించేవారు. దీనిలో ఒక సూక్ష్మమున్నది. మొదటిది సాధించడమే కష్టం. ఒకదానిలో అనుభూతి పొందిన తర్వాత తక్కినవన్నీ నామ మాత్రం చేసినే అంటే కొద్ది సాధన చేయడంతోనే అనుభవమవుతాయి. ఒక వాయిద్యం వాయించడం వచ్చాక మిగతావి వాయించడం తేలికవుతుంది. మొదటిదాన్ని నేర్చుకోవడమే కష్టం. అలాగే ఒకడు ఒక సాధన చేసి దానిలో అనుభూతి పొంది, వాడికి బుద్ధిపుట్టి ఎవడికైనా ఉపదేశిస్తే అంటే యిచ్చే వాడికి యివ్వాలనే బుద్ధిపుట్టాలి. తీసుకునేవాడికి పుడితే చాలదు. అప్పుడు మంత్ర దీక్ష తీసుకున్న వాడికి అనుభూతి కలుగుతుంది.

ఉదాహరణకు ఒక మహాగాయకుని దగ్గరకు మనము వెళ్ళామను కోండి. మహానందంతో అతడు గళమెత్తి పాడుతున్నాడు. అప్పుడు చాలా బాగుంటుంది. కానీ అతని మనస్సు పాడేందుకు సంసిద్ధతగా లేనపుడు, "నువ్వు యిప్పుడు పాడు. మనం మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామో" అని మనమన్నా మనుకోండి. అతడు -"నాకు మూడ్ లేదు, నేను పాడలేను" అంటున్నాసరే, 'ఒక్కటన్నాపాడు. నీ పాట మేము వినాలి' అని నిర్బంధిస్తే ఎలా వుంటుంది? వాడు గొప్ప గాయకుడు గనుక వాడిని నిర్బంధించినా వాడిపాట మనకు బాగానే వుంటుంది. కాని అతనికి తెలుసు - తనకు పారవశ్యం వచ్చినప్పుడు పాడినట్లు యిట్లా పాడితే వుండదని. అలాగే ఇది గూడ. అందుకని వెనుకటి రోజులలో గురువువద్దకు వెళ్ళి సేవచేస్తూ వుండేవాళ్ళు ఉపదేశం చెయ్యమని ఎప్పుడూ గూడ అడిగేవాళ్ళే గాదు. "మీరే నాకు శరణ్యము, నా భారమంతా మీదే" అని చెప్పి గురువు పిలిచి ఉపదేశమిచ్చేదాకా సేవచేస్తూ వుండేవాళ్ళు గాని, అడిగేవారు కాదు. "ఇన్నాళ్ళు సేవచేసినా నాకు ఉపదేశం యివ్వడేమిటి? ఫలానావాడికి అప్పుడే ఉపదేశమిచ్చాడే" అని ఆలోచించే వారుగాదు. గురువుకు ప్రీతి కలగాలి. అప్పుడాయన ఉపదేశమిస్తారు. దానివల్ల ఉపదేశం పొందిన వాడికి అనుభూతి కలుగుతుంది. అలా అనుభూతిని

కలిగించేదే ఉపదేశము. అలాగాక శబ్దాల యొక్క కూర్పు అయితే మనం గ్రంథాలలో చూసుకున్నా అర్థమవుతుంది. అలాగాక గురువే ఎందుకు చెప్పాలి? ఎందుకంటే వాళ్ళు అనుభూతితో కలిపి దానిని ఉపదేశమిస్తారు గనుక. ఉదాహరణకు రామకృష్ణపరమహంస వివేకానందునికి యిచ్చిన అనుభవంలాగ, సాయినాథునికి తమ గురువు యిచ్చిన ఉపదేశంలాగ.

అట్లా అనుభూతి యివ్వాలంటే వారికి - అంటే గురువుకు యివ్వాలనే సంకల్పం కలగాలి, అనుగ్రహం కలగాలి. వీడు సేవచేస్తూ వుంటాడు. ఉన్నట్లుండి ఆయనకు ఒకరోజున అనిపిస్తుంది : "ఇంతగా సేవ చేస్తున్నాడు గదా, వీడికి ఉపదేశం యిద్దాము"అని. అప్పుడు ప్రేమతో పిలిచి ఉపదేశం యిస్తారు. ఆ సమయమంటే, అలా అనిపించడం ఈ రోజే కావచ్చు, 10 సం॥లకు కావచ్చు, 20 సం॥ల తర్వాత గూడా కావచ్చు. అయితే యిన్నాళ్ళ పాటు వాళ్ళను తన దగ్గర వుంచుకొని సేవ చేయించుకోవడం కరెక్టా అంటే వాళ్ళను తన దగ్గర వుంచుకుని సేవ చేయించుకుంటున్నామనే భావన వారికి వుంటే కదా, వారి బిడ్డలైతే వుండడం లేదా? అలాగే వీళ్ళూ వుంటారు. ఎవడో వచ్చాడు, యిక్కడ మనింట్లో వున్నాడు అని వారికి అనిపిస్తే గదా! వాడూ తమ బిడ్డే. ఎంతమంది తమ దగ్గర వున్నా సరే వాళ్ళకు అలాగే అనిపిస్తుంది. అటువంటి దృష్టి వున్నప్పుడు వాళ్ళు పిలిచి ఉపదేశమిచ్చినప్పుడు అనుభూతి కలుగుతుంది. ఆ అనుభూతిని ఒకసారి చవిచూచిన తర్వాత లౌకిక విషయాల వైపుకు మనస్సు వెళ్ళదు. అలానే ఉపదేశదీక్ష తీసుకున్నట్లు గుర్తెట్లాగంటే లౌకిక ప్రవృత్తులన్నీ పకడ్బందీగా అయిపోతాయి. ఉత్తమాధికారికి సంపూర్ణ వైరాగ్యమేర్పడుతుంది. మధ్యమాధికారికి లౌకికమైన కర్తవ్యాలను నిర్వర్తించడానికి కావలసినంత మాత్రమే ప్రజ్ఞ వుంటూ తక్కినవన్నీ విస్మరింపబడతాయి. తక్కిన సమయమంతా గురువుకే అంకితమవుతుంది.

ఉదాహరణకు: చీట్ల పేకాటకు అంకితమైన వాడికి ఆకలైనపుడు మాత్రమే యిల్లు, వాకిలీ గుర్తుంటుంది. తక్కిన సమయమంతా చీట్లపేక మీదనే ధ్యాస వుంటుంది. అట్లాగే వీడికి లౌకిక కర్తవ్యాలు మాత్రమే మిగిలి, తక్కిన సమయమంతా భగవంతుని స్మరణలో లీనమవుతాడు. అట్లా అయితేనే ఉపదేశం తీసుకోవాలి అని మన శాస్త్రజ్ఞులు చెప్పారు. అటువంటి వాడే ఉపదేశమివ్వగలడు. అసలు ఉపదేశం ఒకరి దగ్గర ఎందుకు తీసుకోవాలి? దానికి కారణం వీడు సాధన ఆరంభంలో వున్నాడు గనుక ఏం చేసినా అటువంటి

అనుభూతిని పొందలేడు. అందుకని గురువు తమ సాంగత్యంచేత వీడి చిత్తం శుద్ధమయ్యేటట్లు చేస్తాడు. అసలు గురు సన్నిధిలో వుంటేనే వీడికి లౌకిక చింత లేకుండా పోతుంది. అందుకని వీడిని తమ సన్నిధికి చేర్చుకుని వాడి మనస్సును ఒక పాకానికి తీసుకువచ్చి, అప్పుడు ఉపదేశం చేస్తాడు. 'మనమేదో' ఈయన దగ్గరకు ఉపదేశానికి వచ్చాము'అన్న భావంపోయి, 'ఈయనే నా తల్లి, తండ్రి గూడా. నాకు సర్వమూ వీరే' అన్న భావము, ప్రేమ ముందు కలగాలి. ఆ అనుబంధం ముందుగా వీడి హృదయంలో ఏర్పడాలి. ఆ తర్వాత ఉపదేశం యిస్తే అనుభవం కలుగుతుంది. లేకపోతే ఆ అనుభూతి కలగదు. ఎట్లాగంటే ఎవరైనా కొత్తవాళ్ళు మనింటికి వస్తే ఎటువంటి సంబంధముంటుందో, అటువంటి సంబంధం వుండడం మానెయ్యాలి. గురువుకు, శిష్యునికి మధ్య అటువంటి సంబంధం పోవాలి. అక్కల్కోటస్వామి చరిత్ర చదువుతుంటే అందులో వస్తుంది. శిష్యునికి ఉపదేశమిస్తుంటే ఆ పిల్లవాడి తల్లి ఏడుస్తుంటే స్వామి అంటారు, "నీకు వాడిమీద ఎంత ప్రేమ వుందో, అంతకు వెయ్యి రెట్లు ఎక్కువగా నాకు వాడిమీద ప్రేమ వుంది. అందుకే వాడికి ఉపదేశం చేస్తున్నాను"అని. తల్లికి, తండ్రికి కొడుకుమీద ఎంతటి ప్రేమ వుంటుందో, అంతకు వెయ్యిరెట్లుగా ప్రేమ ఆయనకు వుంటుందట. ఆమె మరీ గట్టిగా ఏడ్చి శోకాలు పెడుతుంటే, వాడికి సన్యాసదీక్ష నివ్వడం పూర్తయ్యేవరకూ ఆమెను గదిలో పెట్టి తాళం వేయమన్నారు.

కాబట్టి మొట్టమొదట జరుగవలసినది ఏమిటంటే వేరు అనే భావం పోయి గురువే తల్లి, తండ్రి అనే భావం కలగాలి. అటువంటి స్థాయికి మనస్సు ఎదగాలి. అయితే గురువువైపు నుంచి వాళ్ళకు వేరు అనే భావం వుండదు. అందుకని శిష్యునివైపునుంచి ఆ భావం పోవాలి. "ఇది గురువుగారి ఆశ్రమం గదా, అదిగదా, ఇదిగదా" అని బెరుకుగా వుంటుంది. వాడు అటువంటి వాటికి అలవాటుపడి వుండడంచేత వాడి మనస్సులో కొత్తగా వుంటుంది. ఆ భావం పోవడానికి సమయం పడుతుంది. అందుకని గురువు తమ దగ్గర కొంతకాల ముంచుకుంటారు, సేవ చేయించుకుంటారు. పదిమందితో కలుపుతారు. ఆ విధంగా తర్ఫీదు నిస్తారు. అప్పుడు వాడి హృదయంలో వుండే దూరం తొలగి పోతుంది. అప్పుడు గురువుకు తనపట్ల ఎంతటి ప్రేమవుందో వాడికి అర్థమవు తుంది. అప్పుడు గురువుకు గూడ తనపట్ల వాడికెట్టి భావముందో వాడికి అర్థమైందన్న సంగతి తెలుస్తుంది. ఎందుకంటే గురువుకు తనపట్ల ఎటువంటి

భావముందో వాడికి అర్థంకాకపోతే ఎట్లా? ఉదాహరణకు: ఒకరిని మనింట్లో వుంచుకుని మనవాడుగా చూసుకుంటున్నామనుకోండి. కానీ మనం వాణ్ణి సత్రంలో బయటివాడిలాగా చూసుకుంటున్నామని వాడనుకొన్నాడనుకోండి. దానికి మనమేం చేస్తాము? అసలు లౌకికంగా యివన్నీ ఎందుకేర్పడ్డాయి? లౌకిక జీవితంలో, సామాజిక జీవితంలో యివన్నీ అవసరం గనుక, అందుకే సమాజం లో జీవిస్తున్నప్పుడు మనకు తెలియకుండానే మన వ్యక్తిత్వంలో యివన్నీ వచ్చే స్తాయన్నమాట.

భోజన సమయం కానప్పుడు ఒకరింటికి మనం వెళ్ళవలసి వచ్చిం దనుకోండి, అప్పుడేమనిపిస్తుందీ -వేళగాని వేళలో యిప్పుడేం వెళ్తాములే, యిప్పుడు గనుక వెళ్తే మనకోసం మళ్ళీ భోజనం తయారుచేయవలసి వస్తుం దేమో, వాళ్ళు యిబ్బంది పడతారేమో, యిప్పుడు వద్దులే, తర్వాత వెళ్దాములే అనిపిస్తుంది. ఎందుకని? - మన సామాజిక జీవితంలో వుండే నిజమైన యిబ్బం దులు యివి. ఎవడైనా ప్రతిరోజూ వచ్చి మనింట్లో కూర్చుంటున్నాడనుకోండి. నిజంగా ఎవరికైనా విసుగుపుడుతుంది. అలాగే కొన్ని పరిస్థితులవల్ల కొందరిపట్ల గౌరవం ఏర్పడుతుంది. మరి కొందరిపట్ల అగౌరవం కలుగుతుంది. ఇవన్నీ చిన్నప్పటి నుంచి సమాజం మనకు నేర్పిపెడుతుంది. వీటన్నింటినీ అతిక్రమించి మనం బ్రతకలేము. ఒకవేళ బ్రతికితే అవాంఛనీయమైన సంఘటనలు జరిగి పోతాయి. ఎవరో పూర్వజన్మ ఋణానుబంధంవున్న వాళ్ళు మాత్రమే మరొక కుటుంబంలో కలిసిపోతారు. ఎవరెవరు ఎందుకు కలుస్తారో తెలియదు. అలా కుటుంబంలో ఒకరుగా కలిసి పోతారు. అట్లాగని ఎవరంటే వాళ్ళు అలా కలిసి పోలేరు. వాళ్ళకు ఏదో ఒక సాకు కనబడుతుంది. ఏ సాకూ లేకపోతే సామాజిక ధర్మాలే, మొహమాటాలే అడ్డు వస్తాయి. బిడియాలే కారణమవు తాయి. అందు కని ఒకటిగా కలవలేకపోతారు. అందుకని యిటువంటి అవసరాలేవీ లేకుండా వుండే ఆశ్రమంలో కొంతకాలం వుంటే యిటువంటి వాటిని నిలుపుకోవలసిన అవసరం వుండదు, సరిగదా, వాడికి వాడే వెలితిగా అనిపిస్తాడు. అక్కడ అందరూ హాయిగా ఒకే కుటుంబంలోని వారిలా వుండగలగడంవల్ల, తాను వుండలేక పోవడం వల్ల వాడే నష్టపోతుంటాడు. ఇది నేను స్పష్టంగా చూచిన విషయం. అక్కడక్కడా ఆశ్రమాలలో వున్నప్పుడు నేను గమనించినదేమిటంటే మనకెప్పు డైతే అట్టి దూరంలేదో, ఆ మహాత్ములనైపు నుంచీ గూడ అట్లాగే దూరం వుండదు.

"మనం కొత్తగా వచ్చాముగదా, ఇక్కడ పద్ధతులు ఏమిటో మనకు పెద్దగా తెలియదే, మనం కాళ్ళు పిసికితే తప్పేమో, మాట్లాడిస్తే ఏమనుకుంటారో" అని మనం ముభావం గా వుంటే ఆ మహాత్ములు గూడ దూరంగానే వుంటారు. మనం మాట్లాడిస్తే సమాధానమిస్తారు. అట్లాగాక మనం వెళ్తానే "ఈయన మన వాడు" అని నిజంగా, హృదయపూర్వకంగా భావించి వెళ్తే, ఆయన (అంటే ఆ మహాత్ముడు) గూడా చనువుగా మనకు పనులు చెప్పడం మొదలు పెడతారు. "ఒరేయ్! కాళ్ళు పిసుకు" అని, "ఇదిగో, ఈ వస్తువు తీసుకుపోయి అక్కడ పెట్టు" అంటారు. "అదిగో, వాడేదో పిలుస్తున్నాడు పోయి చూడు!" అంటూ యింట్లో పిల్లవాడిలా మాట్లాడతారన్నమాట. అప్పుడు మనకుగూడ అట్లాంటి చనువే ఏర్పడుతుంది. "ఏమిటండీ ఆ రోజు అట్లా చెప్పారుగదా, మరిప్పుడు యిలా చెబుతున్నారేమిటి? ఈ రెండింటికీ పొత్తు ఎలా కుదురుతుంది?" అనే స్థితికి వస్తాడు. "నిన్ననేమో మీరిలా చేయమని చెప్పారుగదా, మరి సత్యమేమో మరొక విధంగా వుందికదా! మళ్ళీ మీరే మరొక విధంగా చెబుతున్నారు గదా, ఈ రెండింటికీ ఎలా సరి పోతుంది, సమన్వయం ఎలా కుదురుతుంది, మీరిట్లా చెబితే మేమేం కావాలి?" అనేటటువంటి చనువు ఏర్పడుతుంది, అప్పుడు ఆయనకు కూడా వీడికి ఏది చెబితే సరిపోతుందన్న అవగాహన కలిగి ఏ సమయంలో ఏది చెప్పవలసి వుంటుందో, ఆ విధమైన తర్ఫీదునిస్తూ వుంటారు. అలాగాక వాడట్లాగే ముభావంగా వుంటే ప్రకటనబోర్డు బజారువైపు త్రిప్పి పెట్టినట్లు వీడిలో ఒక అంశం మాత్రమే ఆయనవైపు తిరిగి వుంటుంది. కనుక గురువుయొక్క సన్నిధిలో కొంతకాలము వుంటే ఈ వేరనే భావం గనుక తొలిగితే, ఆత్మీయత అనే భావం గనుక కలిగితే, లౌకికమైన సంస్కారాలన్నీ తొలగి, అటువంటి వాతావరణంలో వాడి చిత్తం శుద్ధమైతే అప్పుడు గురువుకు అనుగ్రహం కలుగుతుంది. ఆయనకు అనుగ్రహం ఎప్పుడు, ఎందుకు కలుగుతుందో తెలియదు, అనుగ్రహం కలిగి నప్పుడు పిలిచి ఉపదేశమిస్తాడు. అప్పుడు అనుభవం కలుగుతుంది. అట్టి అను భవము, అట్టి దివ్యానుభూతి కలిగాక లౌకిక విషయాల మీద మనసు పెట్టడం వీలుగాదు.

ఉదాహరణకు: పొరాడే పసిపిల్లలున్నారు. మనం అన్నం తినేసి లేచి పోయి, విస్తళ్ళు తీయడం గనుక ఆలస్యమైతే గబగబా పొరాడుకుంటూ వచ్చి ఆ ఎంగిలి విస్తట్లోది తినేస్తారు. అప్పుడే మనం కూర్చుని తిని లేచిన తర్వాత

మనలను కూర్చోమంటేనే మనం కూర్చోలేము. మరొకరి విస్తరి సంగతి అలా వుంచండి. మనం తిని చేయి కడుగుకున్న తర్వాత మళ్ళీ అదే విస్తట్లో మనలను తినమంటే తినలేము. ఎందుకని - మనస్సులోని అవగాహనలో అంతటి భేదం వుంది. ఆ తిని వదిలేసిన ఎంగిలి పులిస్తరాకు మనకు ఏ విధంగా అనిపించడం మొదలెడుతుందో, అలాగే ఇప్పుడు అంటే ఆ అనుభూతిని పొందాక - శాస్త్రాలు మనలను వేటినైతే వదలిపెట్టమని చెప్పాయో, అవన్నీ గూడ పులిస్తరాకువలె అనిపించడం మొదలుపెడతాయి. ఆ పసిపిల్లవాడు ఎందుకని అలా చేయ గలిగాడు? మనం ఎందుకని ఆ విధంగా చేయలేము? మనం పెరిగి, మన ఆలోచన, మనస్సులో యోచన పెరిగేసరికి, "అది పులిస్తరాకు గదా, దానిని తాకితేనే చేతులు, కాళ్ళు కడుక్కోవలసిన పరిస్థితి గదా" అని తెలియడమే మనకు జరిగింది. అలాగే గురువుయొక్క అనుగ్రహం కలిగాక, అట్టి అనుభూతిని చవిచూచిన తర్వాత లౌకిక విషయాలు అలాగే అనిపిస్తాయి. అందుకని వాటి మీదకు మనస్సు మామూలుగా పోవాలనుకున్నాపోదు. అట్టి స్థితి కలుగు తుంది. అదీ ఉపదేశమంటే. ఇప్పుడు అలా యిచ్చేటటువంటి స్థోమత కలవాళ్ళూ లేరు. ఇస్తే పొందేవాళ్ళూ లేరు. ఇవ్వడానికి అందరూ సిద్ధమే. పుచ్చుకోవడానికి గూడ చాలామంది సిద్ధమే. ఉండవలసిన (conditions) రెండూ మాత్రం వుండవు. ఎట్లాగైతే ఎక్కువభాగం విద్యాసంస్థల్లో చదువనేది లేకుండా వాటి పేర్లు మాత్రమే వుంటాయో, అలాగే ఇట్టి ఆధ్యాత్మిక సంస్థల్లో గూడ. దేశంలో విశ్వవిద్యాలయాలుగాని, కళాశాలలుగాని, పాఠశాలలుగాని ఎన్నో విద్యాసంస్థలు వున్నాయి. అయితే వీటిల్లో ఎన్నింటిలో చదువు అనేది వున్నది? చదువుకున్న మనిషియొక్క దృక్పథం ఎలా వుండాలి? కాని ఎలా వుంటున్నది? అప్పుడు విద్యే లేదక్కడ, నేతి బీరకాయలో నేయి ఎంతవుంటుందో, అక్కడగూడ విద్యఅనేది అంతే వుంటుంది. అట్లాగే ఈ ఉపదేశాలలో గూడ అట్లాగే వుంది. అందుకనే సాయి "ఈ గొడవంతా నీకెందుకు? నీకు నిర్దుష్టంగా అవునని తెలుసుకున్న మార్గాన్ని పట్టుకుని దానిని ఆచరించుకుంటూ వెళ్ళు, తప్పకుండా పరమార్థాన్ని పొందుతావు" అన్నారు. "యద్భావం తద్భవతి' అని శాస్త్రం గూడా చెప్పింది గదా! దేనియందు మనస్సు నిలుపుతావో, దానిని తప్పక పొందుతావు" అని పెద్దలు చెప్పారుగదా! కాబట్టి ఈ కాలానికనుగుణంగా 'ఉపదేశం కోసం పరుగెత్తవద్దు' అని సాయి చెప్పారు. మరి ఆయన దగ్గరకు వచ్చిన వాళ్ళకు, ఆయన భక్తులకు ఏమిటి మార్గం? ఆయన

వద్దకు ఎవరైనా ఉపదేశమార్గం అవసరమైన వాళ్ళు వస్తే స్వప్నంలో ఉపదేశమిచ్చారు. వారి పూర్వజన్మ సంస్కారం ప్రకారం ఉపదేశమార్గమే వాడికి అవసరం కాబోలు! ఆయనే (సాయియే) స్వప్నంలోకొచ్చి ఉపదేశమిచ్చేవారు. అట్టి సన్నివేశాలు వారి చరిత్రలో వున్నాయి.

శ్రీసాయి తమ గురువు వద్దకు వెళ్ళినపుడు వారి గురువు ఏవైతే చెప్పి వున్నారో, అదే సాంప్రదాయాన్ని సాయి గూడ యిక్కడ మనకు చెబుతూ వున్నారు. కనుక ఆ సాంప్రదాయంలో - అంటే సాయి తమ గురువు గురించి చెప్పిన కథ, సాయి మనకు యిచ్చిన బోధ మొత్తం సమగ్రంగా పెట్టి చూసుకుంటే అటు మంత్రోపదేశం వరకూ వెళ్ళినా సరే, అట్లాగాకుండా వున్నా సరే, ఎవరికైనా అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటో తెలిసి, ఆచరించేటటువంటి యోగ్యత, పరిపాకము, మనస్సుకు కలగాలంటే, సరియైన అవగాహన కలగాలంటే - సద్గురువును సేవించడం అవసరము అని మనకు తెలుస్తున్నది.



అధ్యాయం-19

జీవితమే సాధన



ఇప్పటిదాకా మనం చెప్పుకున్నదేమిటంటే - 'అల్లామాలిక్' అన్న దానిని ఎలా సమన్వయ పరుచుకోవాలో, దానికి అన్వయించుకుని దక్షిణగా మనం బాబాకు సమర్పించుకోవడంలో భాగంగా సత్సంగం చేసుకోవడం ఒక అంశమని, నిత్యమూ పూజ చేసుకోవడం మరొక అంశమని అనుకుని, ఈ పూజ ఎందుకు? సంకల్పం ఎందుకు? అన్న దానిని గూర్చి కొద్దిగా వివరించు కున్నాము. అంటే జీవితాన్ని సాధనగా మలచుకునేది ఎట్లా? జీవితం సాధనగా మారేదెట్లా? అనే విషయంగూర్చి చెప్పుకున్నాము. అనన్య చింతన అని పెద్దలు చెప్పారుగదా! కాసేపు చింతన చేస్తుంటే జీవితం లో సాధన ఒక భాగమవుతుంది. అనన్యమైన చింతన చేస్తుంటే జీవితమే ఒక సాధనగా మారుతుంది. అందుకని భగవద్గీత లోగాని, దేన్నోనైనాగాని చెప్పినదేమిటంటే - రోజూ కాసేపు మాత్రమే - మడిగట్టు కున్నట్లు మాత్రమే ప్రొద్దున్నపూట అరగంట, సాయంత్రం అరగంట అని మాత్రమే ప్రత్యేకించి చేసుకునే కార్యక్రమం వుంటే వున్నది, కాని మొత్తం నీ జీవితమంతా గూడా సాధన క్రింద మారాలి. అప్పుడు నీవు అనన్యచింతలో వుంటావు. అప్పుడు కృతార్థుడవు అవుతావు' అని చెప్పారు. ఎవడికి దేనియందు హృదయపూర్వకమైన ప్రీతి వుంటుందో వాడి జీవితమంతా దానికోసం అంకితమవుతుంది. కీర్తియే కావలసినవాడు అహర్నిశలూ దానికోసమే పాటు బడతాడు. ధనమే కావలసినవాడు నిరంతరం దానికోసమే పాటుబడతాడు. పలుకుబడే కావలసినవాడు దాని కోసమే పాటుబడతాడు. అలాగే మనకు గూడ భగవంతుని యందు ప్రీతి కలిగినపుడు మన జీవితమంతాగూడ దానికోసం పాటుబడడం క్రింద మారుతుంది.

దక్షిణకుగాను నిష్ఠ, సబూరీలతో జీవితాన్ని సమర్పించుకోవడముగా మనము చెప్పుకున్నాము. అందుకోసం ప్రత్యేక కార్యక్రమం క్రింద అంటే మన స్మరణ సజీవంగా వుండడానికి సాయిని నిరంతరం స్మరించుకోవడమని అను కున్నాము. అలా సాయిని నిరంతరం సాయి, సాయి అని అనుకోవడం కోసం ప్రయత్నంచేస్తే ఏమవుతుందంటే -సాయి లీలలు జ్ఞాపకం వున్నప్పుడో, వివరణ

జ్ఞాపకం వున్నప్పుడో, మనలో సత్వగుణం పనిచేసినపుడో సాయి అనుకున్నప్పుడు హృదయం స్పందిస్తుంది. కొన్ని సమయాలలో అలా స్పందించకుండా-నియమం పెట్టుకున్నాము గనుక వూరికే పలుకుతుంటాము. అదీ అసలు సమస్య. ఒక్కొక్క సమయంలో నిజంగానే సాయి సన్నిధిలో వున్నట్లు అనిపిస్తుంది, హృదయం స్పందిస్తుంది. అలాగాక ఒక్కొక్క సమయంలో నియమం పెట్టుకున్నాము గనుక స్మరణ తొలగిపోతుందేమోనని వూరికే బలవంతాన స్మరణ, లీలాచింతన జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు అది గూడా జరగకుండా పోతుంది గూడా. జరిగినా యాంత్రికంగా జరుగుతుంది. అను కున్నాము గనుక జరుగుతుంది. ఇటీవల ఒకరు చెప్పారు-'నాకు నిరంతరం స్మరణ జరుగుతోంది' అని. ఆయన ఒక సమస్యమీద నాదగ్గరకు వచ్చారు. సాయి చరిత్ర చదువుకోమని చెప్పాను. అప్పుడాయన నాకు మనస్సులో అఖండంగా జరుగుతూంటుందండీ అన్నారు. "అఖండంగా జరుగుతున్నదంటే మీకు అసలు ఆలోచనలు రావా!" అని అడిగాను. అప్పుడాయన, "అబ్బే! అదేం లేదండీ, ఆలోచనలు వాటి పాటికవి వస్తూనే వుంటాయండి, నామం పాటికి నామం జరుగుతూనే వుంటుందండి' అన్నారు. నిజంగా చెప్పాలంటే అలా జరగడం మంచిది గాదు. చాలా చెరుపు చేస్తుంది. నిజంగా అట్లాగే గనుక జరుగుతూ వుంటే, కొంచెం బెసికితే చాలు రుగ్మతలు వస్తాయి. ఒకానొక కారణంగా మాత్రం రుగ్మత రాకుండా కొంత మందికి నడుస్తుంది, అలా గాకుండా అదిగనుక కొద్దిగా బెసికిందంటే మటుకు తప్పకుండా రుగ్మత కలుగుతుంది. అది ఎట్లా బెసిగితే రుగ్మత వస్తుందో చెప్పడం గూడా తప్పే, ప్రమాదమేనన్న మాట. అది అంత సూక్ష్మమైనది.

ఉదాహరణకు ఒకచోట పది అంతస్థుల మేడ వుంది, ప్రక్కదీ అంతే. రెండింటికీ మధ్య చిన్న సందు వుంది. అందుకని వాళ్ళు ఒకదాని మీదినుంచి మరిక దానిమీదకు అవసరమైతే వెళ్ళ డానికి 4,5 చెక్కలు వేసుకున్నారు. ఒకడు అదేమీ చూచుకోకుండా యిటు నుంచి అటు చకచకా నడిచిపోతున్నాడు, ఒకడు అదిచూచి, వాడు పడిపోతాడేమో, ఎట్లాగా అని, 'అది చెక్కరా, పడిపోతావ్' అని అరిచాడనుకోండి. వాడు కంగారుపడితే మాత్రం అక్కడ నుంచి క్రిందపడ తాడు. అందుకని అప్పుడేమీ మాట్లాడకూడదు, వూరుకోవాలి. దాటి వెళ్ళిన తర్వాత చెప్పాలి. లేకపోతే వెళ్ళకముందన్నా చెప్పాలి. వాడు రెండడుగులు వేసిన తర్వాత మాత్రం చెప్పగూడదు. ఆ మిగతా రెండడుగులు

తెలియకుండానే వేసి దాటి పోతాడు. అలాగాక వాడు రెండడుగులు వేసాక చెబితే వాడు కంగారు పడిపోయి తప్పకుండా పడిపోతాడు. ఒకడు రైలు కదిలాక దానివెంబడి పరుగెత్తి కమ్మీ పట్టుకున్నాడనుకోండి. అప్పుడు వాడిని అలా ఎక్కవద్దని చెప్పకూడదు, ముందే చెప్పాలి. అలాగాక వాడు కమ్మీ పట్టుకున్న తర్వాత చెబితే నువ్వు చెప్పేదేమిటో అర్థంగాక వదిలిపెట్టి క్రింద పడతాడు. అలాగే యిక్కడ ఏ విధంగా బెసికితే గతితప్పుతుందో చెబితే, వాడికి అలా బెసుకుతుందేమోనన్న ఆలోచన వచ్చినాగాని గతిమారుతుందన్నమాట. అందుకని ఎట్లా బెసుకుతుందనేది చెప్పనక్కరలేదు. అలా జరిగితే మాత్రం అది జపంక్రిందకు వస్తుందని గాని, ధ్యానం క్రిందకు వస్తుందనిగాని యింత వరకూ ఎవరూ చెప్పలేదు. అందుకనే భగవద్గీతలో శ్రీకృష్ణుడు మహా యుక్తిగా - 'అనన్యాశ్చింతయంతో మామ్' అని చెప్పాడు. నీ మనస్సు చింతించడమే ప్రధానం. నువ్వు జపంద్వారా చేసుకుంటావో, రూపం ద్వారా చేసుకుంటావో నీ యిష్టం. నీ మనస్సు, ఆలోచనలు, భావాలు నా మీద కేంద్రీకరించడమే ముఖ్య మని అన్నాడు. మనసులో శబ్దాలు దొర్లడంకాదు అనిచెప్పడం కోసమే చింత అనే పదం వాడాడు. అందుకని ఎవరికైనా నిరంతర జపం అఖండంగా జరుగు తున్నదంటే, ఇతర ఆలోచనలుగాని, భావాలుగాని రాకుండా ఈ భావం మాత్రమే వస్తున్నపుడు, అదీ నిరంతర ధ్యానం. ధ్యానం అవిధంగా జరుగ కుండా యాంత్రికంగా జరిగే సమయాలు వుంటాయి. ఎక్కువ సమయాలు అట్లాగే వుంటాయి. వాటిని ఏ విధంగా అతిక్రమించాలి అనే విషయంగురించి యింతకు ముందు చెప్పుకున్నాము. అదేమిటంటే - సాయి సాన్నిధ్యంలో వున్నాము అనే సంగతిని ఎల్లప్పుడూ భావన చేయడాన్ని అలవాటు చేసుకోవాలి. మనం సాయిజీవిత చరిత్ర చదువుతున్నాము, ఆయన తత్వాన్ని గూర్చి చదువుతున్నాము. అదీ చదువుతున్నప్పుడు సాయి లేని చోటే లేదు అని తెలుస్తున్నది. అయనకు-ఆయన పటానికీ భేదం అసలేలేదు అనీ తెలుస్తున్నది. అయినాగానీ మన మనస్సుకు మళ్ళీ అది పటమేనని ఎందుకు అనిపిస్తున్నది? అప్పుడు మనం వివేకంతో ఆలోచించుకోవాలి. ఓహో! మన దృష్టి మందగిస్తుం దన్నమాట. ఆయనవైపునుంచి మాత్రం ఏమీ తేడాలేదు. ఆయన నిరూపణ యిస్తూనే వున్నారు. కాని నావైపు నుంచి మాత్రం నాకు పటమనే అనిపిస్తున్న దంటే నా భావనలోనే లోపమున్నదన్నమాట. అందరికీ రుచిగా బాగానే వున్న

పదార్థం నాకు మాత్రం చేదుగా అనిపిస్తున్నదంటే నా నాలికలో లోపమున్నట్లే కదా! ఆ తార్కాడ్ అట్లా పటమని అనుకోబట్టే గదా నైవేద్యం పెట్టడం మర్చిపోయాడు? అని ఆయన పటానికీ, తనకూ భేదమేలేదని నిరూపణ యిచ్చిన విషయాలను గుర్తు తెచ్చుకోవాలి.

తార్కాడ్‌కు విగ్రహారాధనపట్ల విశ్వాసం లేదు. అతని కొడుకు మాత్రం సాయిబాబా ఫొటో పెట్టి పూజ చేసుకుంటుండేవాడు. ఆ పటానికి నైవేద్యం పెట్టందే ఏమీ తినడు. తల్లి శిరిడీ వెళతానంటే తండ్రి ఆ కొడుకును తల్లికి తోడుగా వెళ్ళిరమ్మన్నాడు. తండ్రికి విగ్రహారాధన మీద నమ్మకం లేదు కదా. తాను శిరిడీ వెళితే బాబాకు నైవేద్యం ఎవరు పెడతారు? అని కొడుకు శిరిడీ వెళ్ళనన్నాడు. అతడు తోడులేకపోతే తల్లి ఒక్కతే శిరిడీ వెళ్ళలేదు. అప్పుడు తండ్రి, "నాకు నమ్మకం లేకపోయినా నీవు వూళ్ళో లేనప్పుడు నీవెట్లాచేస్తావో, నేనూ అట్లాగే పూజ చేస్తాను, నైవేద్యం పెడతాను" అన్నాడు. "నేను మాట యిస్తున్నాను నీవు నిర్భయంగా వెళ్ళిరా" అన్నాడు. అప్పుడు ఆ తల్లీకొడుకు లిద్దరూ శిరిడీ వెళ్ళారు. శిరిడీలో శుక్రవారంనాడు దిగారు. తండ్రి రోజూ ఇంటిదగ్గర పూజచేసి నైవేద్యం పెడుతున్నాడు. వంటవాడు భోజనానికి ముందు ఆ ప్రసాదం పెట్టి, ఆ తర్వాత భోజనం వడ్డిస్తాడు. నాలుగవరోజు ఆఫీసు తొందరలో పూజ చేసాడుగాని, నైవేద్యం పెట్టడం మర్చిపోయాడు. మధ్యాహ్నం యింటికివచ్చి భోజనానికి కూర్చోగానే వంటవాడు ప్రసాదం పెట్టకుండా భోజనం వడ్డించాడు. ప్రసాదం ఏది? అని అడిగితే అప్పుడు మీరు నైవేద్యం పెట్టడం మరచిపోయారని చెప్పాడు. అరె, కొడుకుకిచ్చిన మాట తప్పానే అని బాధపడి కొడుకుకు జాబు వ్రాశాడు. "నీకిచ్చినమాట ప్రకారం ఈ రోజువరకూ పూజ, నైవేద్యం బాగానే చేసాను, కానీ ఈ రోజు మాత్రం ఆఫీసుపని తొందరలో పూజ చేసాను గానీ నైవేద్యం పెట్టడం మర్చిపోయాను. నువ్వు మాత్రం నేనుమాట తప్పినందుకు బాధపడవద్దు. ఇకనుంచి యిటువంటి పొరపాటు జరగకుండా చూసుకుంటాను". అని బాబాకు క్షమాపణ చెబుతూ జాబు వ్రాశాడు.

సరిగ్గా ఆరోజు అదే సమయంలో శిరిడీలో హారతి జరుగుతున్నది. ఆ సమయంలో బాబా ఆ తల్లీకొడుకులకేసి చూసి యిలా అన్నారు: "అమ్మా! ఆకలిగా వుంది, తినడానికి ఏమైనా పెడతారేమోనని తలచి బాంద్రాలో మీ యింటికి వెళ్ళాను. అక్కడ పూజాగృహం తలుపు తాళం వేసివున్నది. ఎట్లాగో

లోపలకు వెళ్ళి చూసాను. బాపూ నాకేమీ పెట్టలేదు. ఆకలితో తిరిగి వచ్చేశాను" అని. బాబా మాటలు ఆ తల్లికి ఏమీ అర్థం కాలేదు. ఉదయం నుంచి ఆయన యిక్కడే వున్నారు గదా! ఏదో ఆయన (బాబా) అప్పుడప్పుడు అలా మాట్లాడు తుంటారులే అనుకున్నది. కాని ఆమె కొడుకుకు మాత్రం అర్థమైంది. 'నేను యిక్కడకు వచ్చేశాను గదా! అక్కడ తండ్రి బాబాకు సరిగా పూజ చేస్తున్నాడో లేదో, నైవేద్యం పెడుతున్నాడోలేదో, ఆయనకసలే విశ్వాసం లేదుగదా' అని అతనికి ఒకటే దుగ్ద అయిపోయింది. రోజూ అనని బాబా యివ్వాళే ఎందు కన్నారు? కనుక పూజలో ఏదో లోపం జరిగివుంటుంది అనుకున్నాడు. అందుకని బసకు వెళ్ళి భోజనం కాగానే తండ్రికి జాబు వ్రాసాడు. ఇప్పటిదాకా ఏమీ అనని బాబా ఈ రోజు యిలా అన్నారు. కనుక పూజలో లోపం రాకుండా చూసుకో వలసినదని తండ్రికి జాబు వ్రాశాడు. అక్కడ తండ్రేమో కొడుకుకు వ్రాశాడు. రెండు ఉత్తరాలూ ఎదురెదురుగా ప్రయాణం చేసాయి.

ఈ సంఘటననుబట్టి మనకేం తెలుస్తున్నదంటే - ఆ పిల్లవాడి తండ్రి నైవేద్యం ఏ భావంతో పెట్టాడు? 'ఇది పటమేగదా! వాడేదో పిచ్చివాడు, చాదస్తుడు, వాడి ప్రీతిని నేను చెడగొట్టడమెందుకు? నా భావాలు వాడిపై రుద్దడమెందుకు? ఒక్క నాలుగు రోజులు సర్దుకుపోతే సరిపోలా, ఏదో వాడి బదులు నేను చేసిపెడుతానన్నాను. గమక చేసిపెడుతున్నాను. ఇందులో మనకు పోయేదేముంది?" అనే దృష్టి తోనే, విశ్వాసం లేకుండానే పెట్టాడు. కానీ అక్కడ బాబాకు అతడు నైవేద్యం పెడుతున్నదీ తెలుస్తున్నది, పెట్టనిదీ తెలుస్తున్నది. అందుకని ఈ లీలలు స్మరిస్తున్నప్పుడైనా మనం తెలుసుకో గలగాలి. మనకు ఇది బాబా పటమేనన్న భావం తెలియకుండానే వచ్చిపడి పోతున్నది. కాని యిది మన దృష్టిలో లోపమే గాని అక్కడ లోపంగాదు, అని. ఇటువంటి విషయాల గురించే సాయి గురువు సాయితో 'నీకు కావలసినది నేను చూపిస్తాను. కానీ నేను చెప్పినది పూర్తిగా, నూటికి నూరుపాళ్ళు విశ్వ సించినవాడు మాత్రమే కృతార్థుడవుతాడు' అన్నారు. అదే షరతు బాబా దగ్గర మనకు గూడా వర్తిస్తుంది. ఆయన, "ఇదిగో, నా పటానికి నాకూ తేడా లేదని నేను నిరూపిస్తున్నాను. నూటికి నూరుపాళ్ళు నువ్వు నమ్మి వ్యవహరించినంత సేపూ నువ్వు కృతార్థుడవుతావు. దానిని ఎంతగా గుర్తుపెట్టుకుంటే అంతగా కృతార్థుడవుతావు" అంటున్నారు.

నిజ జీవితంలో గూడా అంతే. పాకుడున్న మెట్లమీదికి రెండుసార్లు వెళ్ళి జారి పడ్డాము. మూడవసారి వెళ్తే మాత్రం పడకుండా వుంటామా? ఎప్పటి దాకా గుర్తుపెట్టుకోకుండా వుంటామో, అప్పటిదాకా పడుతూనే వుంటాము. అలాగే ఈ విషయంలో గూడా ఎంతవరకూ మనస్సును నిలుపలేమో అంత వరకూ కాలు జారవలసిందే. ఇది పటము అని అనిపించడం, అది పటమవడం వల్ల కాదు, ఎన్ని ఉదాహరణలు చెప్పినా మనస్సుకు హత్తుకోకపోవడంవల్లనే, మన లోని తమోగుణం వల్లనేనని గుర్తించాలి. కాబట్టి ఆ లీలలను మళ్ళీ మళ్ళీ స్మరించాలి. వాటిని స్మరించి, "ఇది నా దృష్టి దోషమే గాని వాస్తవంగా నీవిక్కడే వున్నావు. కనుక ఓ తండ్రీ! నీ యొక్క ఉనికిని తెలుసుకునే సామర్థ్యం లేకపోవడంచేత నాకు కనువిప్పు కలగడం,లేదు. నాకు కనువిప్పు కలిగించు. నీ ఉనికి వున్నట్లు అనుభవం నాకివ్వు నామీద దయ చూపు అని ప్రార్థించవచ్చు. అది గూడా సరియైన ప్రార్థనే అవుతుంది. మనకు పటమేనని అనిపిస్తుంటే మరి ఏం చేస్తాము? ఆ లీలలు గుర్తొస్తూనే వున్నాయి. కాని మళ్ళీ అది పటమేననే అనిపిస్తున్నది. మనం పెడుతుంటే ఆయన తీసుకున్నట్లు తెలియడంలేదు కదా! అందుకని ఆ సంగతే ఆయనతో మొరపెట్టుకోవాలి. "ఏమయ్యా! వాడికేమో అట్లాంటి అనుభవమిచ్చావు, ఇంకొకడికేమో మరొక అనుభవమిచ్చావు, మరి నాకేమో ఏ అనుభవమూ యివ్వకపోతివి. నాదురదృష్టమో, ఏమో మరి. నాకేమో అది పటమేననిపిస్తున్నది. కాని వాళ్ళకిచ్చిన అనుభవంవల్ల నువ్విక్కడ వుండి తీరాలి. కాబట్టి నాకు అట్లాంటి ధ్యాస కలిగేలా చేయవలసింది, నాకు అనుభవం యివ్వవలసింది", అని హృదయపూర్వకంగా ప్రార్థించాలి.

ఉదాహరణకు : ఒక పెద్ద సభ జరుగుతున్నటువంటి పందిట్లో తల్లి దగ్గరనుంచి పిల్లవాడు తప్పిపోయాడు. అప్పుడు వాడు ఏం చేస్తాడు? ఎటు ప్రక్కనవున్నా వినపడేటట్లు గొంతెత్తి అరుస్తూ తిరుగుతుంటాడు. తల్లి ఎక్కడ వున్నదో తెలిస్తే వెళ్ళివుండేవాడు. తెలియదు గనుక సాధ్యమైనంతవరకూ ఆ ప్రాంతంలోనే తిరుగుతూ ఎటుప్రక్క వున్నా గాని వినిపించడానికి సరిపోయే టట్లు అరుస్తూ వుంటాడు. అట్లాగే యిక్కడ గూడా, 'బాబా! నువ్వెక్కడున్నావో నాకు తెలియడం లేదు, నాకు నువ్విక్కడున్నావనే దృష్టి కలగడం లేదు. కనుక నా దృష్టిని మార్చి నాకలాంటి అవగాహనను యివ్వవలసినది' అని హృదయ పూర్వకంగా వేడుకుంటుంటే అది గూడా సరియైన పూజ, స్మరణ అవుతుంది.

మొత్తంమీద మనం పూజలో చేయవలసిన అభ్యాసమేమిటంటే మనమున్నది ఆయన సన్నిధిలోనన్న సంగతి మరచిపోకుండా వుండడమే. మరచిపోవడానికి, మరిచిపోకపోవడానికి ఎంతో తేడా వున్నది. దానినే మన పెద్దవాళ్ళు, ఒళ్ళు దగ్గరుంచుకోమని అన్నారు. అంటే ఏమిటి? మన ఒళ్ళు మనదగ్గర వుండక ఎక్కడికి పోతుంది? అలాగాదు; దాని అర్థమేమిటంటే "నీవు ఫలానా చోట వున్నావు. ఫలానావాడితో మాట్లాడుతున్నావు. ఫలానా విషయం మాట్లాడు తున్నావని మరిచిపోయి, ఎక్కడికో వెళ్ళిపోయి మాట్లాడేవు జాగ్రత్త" అని చెప్పడమన్న మాట. నువ్వు ఎక్కడున్నావో, ఎవరివో గుర్తుపెట్టుకో, మరిచిపోయి ఊహాలోకాల్లోకి వెళ్ళబోకు అని ఆ మాటకర్థం. ఉదాహరణకు ఇది నిత్యాను భవంలో చూస్తే కూడా తెలిసిపోతుంది. మనం ఒక చక్కటి నాటక ప్రదర్శనకు వెళ్ళాము. లేక మంచి సినిమాకు వెళ్ళాలనుకున్నాము. టిక్కెట్లు రిజర్వు చేయించు కున్నాము. అంతా బాగానే వుంది. కొద్ది ప్రదర్శన జరగడం మొదలు పెట్టేసరికి ఇది సినిమాహాలు, ఇది ఫలానా ఊరు, ఇది సినిమా, నేను చూడడం కోసం వచ్చాను అనేసంగతి మరిచిపోయి అదివాస్తవం అనిపించడం మొదలు పెడ్తుంది. అందులో వాడికి కలిగే సుఖానుభూతి మనకు సంతోషాన్నిచ్చి నవ్వేలా చేస్తుంది. వాడికి కలిగే దుఃఖానుభూతికి మనం కళ్ళనీళ్ళు కారుస్తాము. ఇంతా చేస్తే అక్కడున్నదేమిటి? కేవలం తెర, వెలుగు, ఫిల్మ్ తప్ప యింకేమీ లేదు.

సినిమా చూస్తున్నప్పుడు అందులోని పాత్రలకు కలిగే సుఖ దుఃఖాను భవాలు మనకే కలుగుతున్నట్లు అనుభూతి కలిగి సుఖం వచ్చినప్పుడు సంతోషము, దుఃఖము వచ్చినప్పుడు దుఃఖపడతాము. కాని అక్కడ జరిగేది నిజమా? కాని లైట్లుపోతే గాని ఆ సంగతి మనకు గుర్తురాదు. లేకపోతే మనకు ముందువరుసలో కూర్చున్న వాడు మాటిమాటికీ తల అడ్డుపెడుతూ వుంటే వెధవహాలు, వెధవ సీటు అరేంజిమెంటు అనుకున్నప్పుడు ఇది థియేటర్ అన్న సంగతి గుర్తుకొస్తుంది. అప్పుడు సినిమాలోని రసానుభూతిలోంచి యివతలకు వస్తుంది మనస్సు. అలాగాకపోతే మాత్రం రెండు రీళ్ళు గూడా తిరగకుండానే ఆ రసానుభూతిలో లీనమైపోతాము; అందులో వున్న దుఃఖకరమైన సన్నివేశం చూచి మనం కన్నీళ్ళు కారుస్తున్నామనుకోండి, ప్రక్కనున్న మిత్రుడు, కళ్ళనీళ్ళు పెడుతున్నావేమిటిరా, ప్రక్క వాళ్ళు చూసి నవ్వుతారు. ఇది సినిమానే కదా! అంటే అప్పుడు చూసుకుంటే గుర్తొస్తుంది - ఇది సినిమా అని. సినిమా అన్న

సంగతి గుర్తురాగానే ఆ బాధ తగ్గిపోతుంది. ఇది సినిమా అన్న సంగతి గుర్తుండక పోవడానికి, గుర్తుండడానికి ఎంత తేడా వుందంటే చూసే సన్నివేశం తనకే జరిగినట్లు ఏడవడానికీ, ఇంతేకదా, ఇది సినిమానే కదా, అని ఏడవకుండా వుండటానికి వున్నంత తేడా వున్నది. కాబట్టి మనం ఆయన సన్నిధిలో వున్నాము అని గుర్తించడం కావాలి. ఆ సంగతి మనం మరచి పోతుండడం జరుగుతూ వుంటుంది. అందుకని మన పెద్దవాళ్ళు మరుపే మరణం అన్నారు. ఈ 'మరుపు మరణం' అనేది ఈనాటి సూక్తి కాదు. వెనుక పూర్వీకులు చెప్పినమాట అది. అనన్య చింతతో వున్నవాళ్ళు చెప్పిన మాట అది. మరుపు మరణం అంటే మనం థియేటర్లో కూర్చున్న సంగతి మరిచిపోయి ఉన్నంతసేపు మిగతా అంతా మరిచి పోయి వుంటాము. ఇది ఫలానా ఊరు, నేను ఫలానా సందర్భంగా సినిమాకు వచ్చాను అన్న సంగతి మరచిపోయి వుంటాము. అది సినిమా అని జ్ఞాపకం వచ్చేవరకూ అది నిజమేనని అనిపిస్తూ వుంటుంది! బయటి విషయాలన్నింటినీ మనం మరచిపోయి వుంటాము. అంటే మన మనసులో ఆ విషయాలు జ్ఞాపకం లేకుండా పోతాయి. అదే మరణమంటే. గత జన్మలో మనమెవరమో జ్ఞాపకం లేకుండా పోవడమే మరణము. నిన్న ఏమిటో గుర్తుండడమేమో నిద్ర. నిన్న మనం ఏమేమిచేసామో గుర్తుంటుంది గనుక అది నిద్ర. ఇంతకుముందు మనమేమిటో గుర్తు లేకుండా పోయింది గనుక మరణము. అందుకని మరుపు మరణము. అలాగే ఇదీ మరణమే. 'సర్వగతుడైన సాయి ఎక్కడ లేకుండా వుంటాడు? కాబట్టి ఇక్కడ గూడా వున్నాడు' అని గుర్తు పెట్టుకోలేకపోవడంచేత మనం మామూలు లోకాన్ని చూస్తున్నాము. కాబట్టి గుర్తులేకపోవడంలో నుంచి ఆ గుర్తులోకి వెళ్ళడమే మనం చేయవలసిన సాధనంతా. కాబట్టి ఆ గుర్తును సంపాదించుకోవడానికి పెట్టినటువంటి అభ్యాసమే పూజ. అంటే పూజ అనేది ఆ గుర్తును నిలుపుకోవడానికి మనం పెట్టుకున్న నియమమన్నమాట. ఉదాహరణకు మనం ఎన్నిసార్లు ప్రయత్నించినాగూడా ఒక విషయం జ్ఞాపకం వుండడం లేదు. ఒక పాఠం గుర్తుండడం లేదు. ఒక లెక్క గుర్తుండడం లేదు. అప్పుడేం చేస్తాము? మనం ఎక్కడెక్కడైతే తిరుగుతుంటామో అక్కడక్కడంతా వ్రాసిపెట్టు కుంటే ఎక్కడకు పోయినా అదే కనిపిస్తుంటుంది. యూనివర్శిటీలలో, కాలేజీలలో, హాస్టల్స్‌కు వెళ్ళి చూస్తే తెలుస్తుంది. వాళ్ళకువుండే ఈక్వేషన్స్, డయాగ్రమ్స్

ఎన్నిసార్లు చదివినా గుర్తురావు. అందుకని చాక్‌పీస్ తీసుకుని కిటికీలమీద వేస్తారు. పెన్సిల్ తీసుకుని గోడమీద గీస్తారు. పుస్తకం మీద అట్టవుంటే అట్ట మీద వేసుకుంటారు. డెస్కులమీద గిచిసెడుతుంటారు. ఒకటేమిటి? రెండు మూడు రకాలుగా వ్రాసిపెట్టి వుంటాయన్నమాట. ఎక్కడ ఏ కారణంగా వెళ్ళినా గుడ్డిగా గుర్తుంటుంది.

అదే రీతిన సర్వగతుడైన సాయి సమక్షంలో మనం వున్నామని గుర్తు పెట్టుకోవడం కోసం మనం ఆ మూర్తిని పెట్టుకుంటున్నాము. ఆయన ఎప్పుడూ సర్వగతుడే గనుక మనం గుర్తుపెట్టుకోకపోవడం ఒకటే మన దోషం గనుక గుర్తుపెట్టుకోవడానికి కావలసిన సదుపాయమే మనం పెట్టుకున్న మూర్తి. కాబట్టి అట్టి సదుపాయం పెట్టుకుని మనం ఆయనను గుర్తుపెట్టుకోవాలి. అట్టి గుర్తింపును హృదయగతం చేసుకోవడానికి మన పెద్దలు పూజా విధానం పెట్టారు. కాబట్టి పూజ, షోడశోపచారాలు చేస్తున్నపుడు ఆ భావాన్ని పెంచుకుంటూ పోవాలి. అట్టి శ్రద్ధ పెరిగేదాకా మనం పూజ చేసుకుంటుండాలి. లేకపోతే ఇంతకుముందు మనం జపం విషయంలో చెప్పుకున్నదే యిక్కడ వర్తిస్తుంది. ప్రారంభించిన మొదట్లో రెండు మూడు రోజులు శ్రద్ధగా చేసుకుంటాము. కొన్నాళ్ళయిన తర్వాత రొటీన్‌గా మారిపోయి గబగబా పూర్తిచేసుకుని వెళ్ళిపోతాము. అట్లా అవడం మొదలుపెట్టినపుడు పూజ మానేసి వూరికే కూర్చుని బాబా సన్నిధిని భావనచేస్తూ తక్కువ సమయం దానికి కేటాయించినా మంచిదే. నామాలన్నింటితో పూజ చేయడానికి 45 ని॥లు పడుతుందనుకోండి. మొదటి రోజు శ్రద్ధగా చేసాము. రెండవరోజు శ్రద్ధగా చేసాము. కాని కొన్నాళ్ళయిన తర్వాత యింటిలోని పరిస్థితులు కానీయండి, బయటి పరిస్థితులు కానీయండి, లేక ఏ కారణంచేతనైనా కానీయండి - పూజ యాంత్రికమయ్యే పరిస్థితి వస్తుంది. నియమం పెట్టు కున్నాము గనుక గబగబా వెళ్ళి పూజ చేసుకుని వచ్చేద్దామని అనిపిస్తుంది. ఇది దాదాపు ప్రతివాళ్ళ అనుభవంగూడా. అటువంటప్పుడు అలా గబగబా చేసేకంటే అసలు పూజే చేయకుండా ఆయన ఎదురుగా కూర్చుని ఆ మూర్తిని చూస్తూ ఆయన సన్నిధానంలో వున్నామని గుర్తుపెట్టు కుంటూ పదినిమిషాలు కూర్చున్నా చాలు. అలా ఆయన సన్నిధిలో కూర్చున్నప్పుడు మంత్రం చదవడం మానేస్తున్నాము. శ్లోకం చదవడం మానేస్తున్నాము, నామావళి చదవడం మానేస్తున్నాము, ఆయన సన్నిధిలో కూర్చుని వున్నాము అనే భావం

బాగా తెచ్చుకోవడానికి పెనుగులాడాము. అలా ప్రయత్నిస్తుంటే చివరకు రెండునిమిషాలు ఆ భావం బాగా నిలిచిందనుకోండి, అప్పుడు ఆ కొద్దిసేపైనా చాలు పూజ చేసుకోవచ్చు. ఆవాహయామి, పాద్యం సమర్పయామి, అర్ఘ్యం సమర్పయామి అని ఒక్క నిమిషంలో పూజ మొత్తం చేసుకున్నా చాలు. అది సార్థకమవుతుంది. అది సార్థకమెందుకవుతుందంటే సాయి అక్కడ మన ఎదురుగా వున్నారన్న భావన స్థిరపడింది కనుక.

ఈ విధంగా మనం ఆయన సన్నిధిలో వున్నామన్న భావాన్ని నిలుపుకోడానికి పూజలో వుండే ఉపచారాలను ఉపయోగించుకుంటూ, మరొక ప్రక్క సత్సంగాలను ఉపయోగించుకుంటూ, నిత్య జీవితంలో తారసపడే సాటి మనుషుల యొక్క ప్రవర్తనను ఆ విధంగా మలచుకుంటూ జీవితాన్ని సాధనగా మార్చుకోవాలి. వీటన్నింటికి గూడా కీలకమైన అంశము సద్గురువు యొక్క సాన్నిధ్యంలో వున్నది.

ఇప్పటివరకూ మనం - "పూజవలన మనం బాబా సన్నిధిలో వున్నా మన్న భావాన్ని నిలుపుకోవడం వల్ల మన జీవితాన్ని సాధనగా మార్చుకోవచ్చు" అని చెప్పుకున్నాము. కాని దీనిలో కూడా కొన్ని సాంప్రదాయ భేదాలున్నాయి. ఆ సాంప్రదాయ భేదాలపట్ల గూడా ఎటువంటి భావాలుండాలోగూడ సాయి చరిత్రలో చెప్పబడి వుంది. అందులో 'సాయి - సాంప్రదాయము' అని ఒక అధ్యాయం గూడ వున్నది. సాయిబాబా తన వద్దకు వచ్చేవాళ్ళను ఎవడికి ఏది కష్టమనిపిస్తుందో దానిని చేయమనేవారు. ఎందుకంటే యిష్టాయిష్టాలను జయించడం అవసరం గనుక. వాడికావిధంగా ద్వయీ భావముంటే అది వాడి తరింపుకు ఆటంకమవుతుంది. గనుక అలా చేయమనేవారు. ఇందులో ఆయనకు ఒరిగేదేమీ లేదు. ఒకసారి ఒక ముస్లిం భక్తుడు వచ్చాడు. అతనికి బిడ్డలు లేరు. సంతానం కలిగితే శిరిడీ వచ్చి కలకండ పంచుతాను అని మ్రొక్కుకున్నాడు. బిడ్డ కలిగిన తర్వాత శిరిడీ వచ్చాడు. కలకండ పంచుతా నంటే బాబా, "మారుతీ ఆలయం వుంది, అక్కడికి వెళ్ళి పంచు"అన్నారు. "నేను ముస్లిమ్‌ను గదా! అక్కడ విగ్రహాలు పెట్టి పూజించే మారుతీ ఆలయం లో నన్ను పంచమంటాడేమిటి? నేను ముస్లిమ్‌నని తెలుసు గదా ఆయనకి!" అని అతడనుకున్నాడు. అతడామాట బాబాతో అనగానే బాబా ఎగతాళిగా నవ్వి, "ఈ మధ్య అల్లాకు, మారుతికీ యుద్ధం జరిగింది. మారుతి అల్లాను చిత్తు చిత్తుగా కొట్టేశాడు.

ఆయనదే సైచేయి కనుక అక్కడే పంచు పో" అన్నారు. అతనికి బాబా మాటలోని వ్యంగ్యం అర్థమైంది. "నువ్వెక్కడివాడివిరా, నువ్వు నిజమైన భక్తువి వేనా? పోయి మారుతీ ఆలయంలో పంచితేపంచు, లేకపోతే యింటికి వెళ్ళు, నాపేర పంచనక్కర లేదు" అన్నట్లు అర్థమైంది. అంటే ఈ ప్రతిమలుగాని, ఈ మూర్తులుగాని మనం ధ్యాస నిలుపుకోవడం కోసం, మన మనస్సులో భావం స్పష్టంగా వుండడం కోసం మనం ఏర్పరచుకున్నవి మాత్రమే నన్ను విషయాన్ని మరచిపోయి మూర్తులయొక్క భేదం చేత దైవంలో భేదాలు చూసుకునే స్థితికి మనం వచ్చినపుడు దానిని ఎగరగొట్టవలసిన ఆవశ్యకత బాబాకు వున్నది.

ఈ విషయం శాస్త్రంలో గూడా స్పష్టంగా చెప్పబడి వుంది. వేదములను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే అందులో ఎక్కడాగూడా ఏ మూర్తిని గూర్చి వర్ణించబడి లేదు. ఉపనిషత్తులలో గూడాలేదు. ఇప్పుడు మనం ఆరాధించే మూర్తులయొక్క ఆరాధనంతా పురాణకాలంనుంచే వచ్చింది. అందు కని మనం ఆచరించే నిత్యకృత్యాలలోని ఆచరణలో గూడా భేదం కనిపిస్తుంది. శ్లోకము, అర్థముగూడా వేరుగా వుంటాయి. ఉదాహరణకు: 'ఉపాసన' అన్న పదాన్ని తీసుకుంటే పురాణాలలో చెప్పిన ఉపాసనకు ఒక అర్థము, ఉపనిషత్తులలో చెప్పిన ఉపాసనకు మరొక అర్థమూ వుంటుంది. అందుకని పురాణాలలో చెప్పబడినది, ఉపనిషత్తులలో చెప్పబడినది వేరన్నమాట. ఉపనిషత్తులలో ఏమంటాడంటే సూక్ష్మాన్నే ఉపాసించమంటాడు. ఉపాసించడం అంటే నిరంతరం గుర్తుపెట్టుకోవడం. స్థూలమైన దానిని గుర్తుపెట్టుకోమనలేదు. ఎంతసేపటికీ సూక్ష్మమైన దానినే గుర్తు పెట్టుకోమన్నారు. పురాణకాలం నుంచి స్థూలమైన దానిని గుర్తుపెట్టుకున్నా సరిపోతుంది అని చెప్పబడింది.

ఉపనిషత్తులలో 'ఆకాశాన్ని ధ్యానించవలసినది, మనసును ధ్యానించవలసినది, అగ్నిని ఉపాసించు' అని చెప్పబడి వుంది. అగ్నికి ఒక రూపమేమున్నది? ఏ కట్టె ఏ ఆకారంలో వుంటే అగ్ని ఆ ఆకారంలో వుంటుంది. అందుకని అగ్నిని ఉపాసించు అని చెప్పారు. 'అగ్నిని ధ్యానించు' అని చెప్పారు. అగ్నిని ఎలా ధ్యానించాలి? పొడుగ్గా వుండే కట్టె రూపంలో ధ్యానించాలా? లేక గుండ్రంగా వుండే మొద్దుకట్టె రూపంగా ధ్యానించాలా? బొగ్గు లాగా ధ్యానించాలా? లేక పిడకలాగా ధ్యానించాలా? మంటలాగా ఊహించాలా? లేక సెగలాగ ఊహించాలా? వెలుగులాగా ఊహించాలా? లేకపోతే ఏ ఎండు పుల్లలను ఒకదాని

కొకటి రుద్దడంవల్ల మాత్రమే మొదట అగ్ని పుట్టిందో, ఆ రుద్దడం వల్ల వచ్చే వేడిలాగా ఊహించాలా? లేకపోతే ఆ వేడి ఉత్పన్నమవడానికి కారణమైన అగ్ని తత్వంగా ఊహించాలా? అంటే ప్రకటమైన అగ్నిగా ఉపాసించాలా? ప్రకటం గాని అగ్నిగా ఉపాసించాలా? అని అడిగితే సోపాన క్రమంలో ఒకదాని నుంచి మరొకదానికి నువ్వే వెళ్తావు అని చెప్పారు. నీ యిష్టమొచ్చింది పెట్టుకో, ఏది పెట్టుకున్నా క్రమంగా నువ్వే పైకి వెళతావు అన్నారు. ఉదాహరణకు ఒక పిడకను పెట్టుకో. అది మండుతుంటే దానిని చూచి దానిని మనసులో పెట్టు కోవడానికి ప్రయత్నించేయి. అలా ప్రయత్నించగా ప్రయత్నించగా నీ మనసుకే తడుతుంది. పిడక పెట్టాము గనుక పిడక ఆకృతిలో వుంది, కట్టె పెడితే కట్టె ఆకారంలో వుంది. కాబట్టి కట్టెను బట్టీ పిడకనుబట్టీ దాని ఆకృతి వుంటుంది. కాని అగ్నికి ప్రత్యేకించి ఒక ఆకారం అంటూ ఏదీ లేదు అని. అప్పుడు ధ్యానం కుదురుతోంది అని అర్థం. ఇవి ధ్యానం చెడగొట్టే ఆలోచనలు కావు. అలాగాక అక్కడ నుంచి ప్రక్కకు వెళ్ళి పోతే మాత్రం కష్టం. ఎట్లాగంటే 'నిన్న పిడక పెడితే అట్లా వుంది, ఇవ్వాళ కట్టెపెడితే యిట్లా వుంది, ఈ కట్టెలు తెచ్చిచ్చినవాడు ఫలానావాడు, వాడు ఇదివరకు నన్నిట్లా అన్నాడు' అని ఈ విధంగా ఆలోచనలు పోతే ఆ ధ్యానం లో నుంచి మనస్సు ప్రక్కకు పోయిందన్నమాట. అట్లాగాక ఈ రోజు కట్టె పెడితే యిట్లా వుంది, నిన్న పిడక పెడితే అట్లా వుంది కనుక ఆ అగ్ని ఉపాధిని బట్టీ ఆకారం మారినట్లు వుంటుంది గాని అగ్నికి స్వతహాగా ఏ ఆకారమూ లేదు. మరైతే కట్టెలో వున్నదేమిటి? మంట మాటేమిటి? నిప్పుగాని, నిప్పు రవ్వగాని, నిప్పుకణిక, సెగ - ఇవన్నీ ఏమిటి? అని ఈ విధంగా ఆలోచనలు వస్తుంటాయి. ఇలా ఆలోచించుకుంటూ పోతే, అసలీ అగ్ని ఏ విధంగా ఉత్పన్నమైంది? దాని నిజస్వరూపమేమిటి? ఒరిపిడి పెట్టినప్పుడు వేడిగా ఉంది కదా, అది దాని రూపమా? మరైతే ఒరిపిడి పెట్టకముందు వేడిదాగి వుంది కదా! మరి అదా దాని రూపం? ఈ విధంగా మనస్సు స్థూలంలోనుంచి సూక్ష్మంలోకి వెళ్ళిపోతుంది. అసలు అగ్నిలేనిది ఎందులో? అందుకని దానిని ఉపాసించు అన్నారు. అందుకని మనస్సును ఉపాసించు అన్నారు. అందుకని ఆకాశాన్ని ఉపాసించు అన్నారు. ఉపనిషత్తులలో ఈ విధమైన ఉపాసనను చెప్పారు. అందుకని పురాణకాలంలో చెప్పిన ఉపాసన వేరుగా వుంటుంది, ఉపనిషత్తులలో చెప్పిన ఉపాసన వేరుగా వుంటుంది. పురాణాలలో 'విఘ్నేశ్వరుని ఉపాసించు, విఘ్నేశ్వరుడంటే గజ

ముఖుడుగా వుంటాడు. చతుర్భుజాలు కలిగి వుంటాడు, ఆయుధాలు ఈ విధంగా పట్టుకుని వుంటాడు. శరీరాకృతి యిలా వుంటుంది. ఈ విధంగా ధ్యానించు' అని వుంటుంది. ఇది పురాణోపాసన. కానీ వేదాలలో 'గణానాం త్వాం' అనే మంత్రముంది. దానికి అర్థం తీసుకోవడం మొదలు పెడితే సృష్టి అంతటికీ అన్వయమవుతుంది. పరబ్రహ్మతత్త్వానికి అన్వయమవుతుంది.

ఒక శివాలయమున్నది, లేక ఒక రామాలయమున్నది. అందులో శివుడని, రాముడనీ ఏదో ఒక ఆకారాన్ని పెట్టుకున్నాము. రూపాన్ని పెట్టుకునే టప్పటికి ఏమవుతోంది? అన్ని రూపాలలో వున్న దానిని గుర్తుచేయడం కోసం పెట్టుకున్న ఆకృతిద్వారా, ఆకృతినే పట్టుకుని, ఆకృతికి ఆకృతికీ వున్న భేదాన్ని మనస్సు పట్టుకుంటున్నది. అసలు వస్తున్న చిక్కంతా అదే. అసలు మనం ఆకృతిని పెట్టుకున్నది దేనికి? భగవంతుడు ఎప్పుడూ సర్వగతుడు. సర్వగతుడు గనుక మన ఎదుట గూడా వున్నాడు. ఆ సంగతిని మనం మర్చిపోతున్నాము గనుక మనం మరిచి పోయినప్పుడల్లా మళ్ళీ మళ్ళీ గుర్తుపెట్టుకోవడానికి సహకారం కావాలి కాబట్టి ఆకారాన్ని అంటే రూపాన్ని పెట్టుకున్నాము. అన్నింటి లోనూ వున్నది సర్వగతంగా వుంటూ యిక్కడ గూడా వున్నది అని గుర్తుపెట్టు కోవడం కోసం పెట్టుకున్నటువంటి ఒక ఆకృతినుంచి ఇది ఈ ఆకృతి మాత్రమే, ఇంకొక ఆకృతి కాదు అనే స్థితికి వచ్చేస్తే ఎలా? అప్పుడు మనం దేనికోసమైతే ఆకృతిని పెట్టుకున్నామో అదంతా పోయినట్లే గదా! అందుకని యింతకు ముందు చెప్పుకున్నట్లు ఉపాసనగాని, ఆరాధన గాని ఉపనిషత్తులలో చెప్పినది ఏదైతే వుందో అటువైపుకు ఉన్ముఖంగా తీసుకుపోతేనే మన ఈ ఆరాధన ఆయనకు చెందుతుంది. అది ఉపాసన అవుతుంది. ఆ భావన మనసుకు కలిగించుకుంటూ దానిని చేస్తూపోతే అది పూజ అవుతుంది. పూజా విధానంలో ఉపచారాలు చేస్తూ మంత్రం ఎందుకు చదువుతున్నాము? 'గంధం దాస్యామ్యహంభక్త్యా సద్గురూత్తమ స్వీకురు' అంటున్నాము. ఆ మంత్రం చదవడమెందుకు, ఎటూ గంధం రాస్తూనే వున్నాము గదా! నేను గంధం యిస్తున్నాను అని ఆయనకు చెప్పడమెందుకు? వద్దని ఆయనేమన్నా చెప్పాడా? అలా చెప్ప మనడంలోని ఉద్దేశ్యమేమిటంటే ఎదుట వున్నది బొమ్మ మాత్రమే అని దృష్టికి రాకుండా వుండడానికి అలా చెప్పమన్నారు.

ఉదాహరణకు: పిల్లలు అన్నం తినకుండా నిద్రపోతారేమోననుకుంటే

మనమేమి చేస్తాము? అన్నం వడ్డించేదాకా కబుర్లు చెబుతూ వాణ్ణి నిద్ర పోకుండా చూసుకుంటాము. "ఇందాక ఎక్కడికి పోయావు? వాళ్ళ పిల్లవాడు ఏమన్నాడు? ఆటల్లో ఏం చేసావు? నువ్వు గెలిచావా? వాడు గెలిచాడా?" అని అడుగుతుంటే అవి చెబుతూ వాడు మెలకువగా వుంటాడు. అట్లాగే మన లోపల నిద్ర పోయేవాడున్నాడు గదా, వాణ్ణి నిద్రపోకుండా మెలకువగా వుంచ డానికే ఈ మంత్రాలు చెప్పడం. "ఎదురుగుండా వున్నది నిర్జీవమైన ప్రతిమ అనుకోకు, యిది యిస్తున్నాను అని చెప్పు; స్వీకరించమని చెప్పు. ఆవిధంగా ఆయనతో మాట్లాడు తుంటే ఆ సంబోధనవల్ల ఆయనతో మనకు ఆత్మీయత పెరుగుతుంది" అని చెబుతున్నారన్నమాట. లేకపోతే మనిషికి, మృగానికి తేడా ఏముంటుంది? మనిషికి తనకు తెలిసిన విషయం జ్ఞాపకం వుంటుంది. మృగానికి జ్ఞాపకం వుండదు. ఆ రెండూ మనలోనే వున్నాయని తెలియజెప్పడం కోసమే దేవతా మూర్తులకు కొన్నింటికి మృగాలను వాహనాలుగా పెట్టారు. మానవత్వము మనలోనే వుంది, పశుత్వము మనలోనే వుంది. మనలోవుండే పశుత్వం మనలోవుండే మానవత్వానికి లొంగివున్నప్పుడు వాడు దైవస్వరూపుడవుతాడు. లేకపోతే రాక్షస స్వరూపుడవుతాడు. ఈ సంగతి తెలుపడానికోసమే ఆ రెండిం టినీ కలిపి కొన్ని ప్రతిమలను మలచారు. సాధకుడైనవాడు తనలో లొంగదీసు కుని అధీనంలో వుంచుకోవలసిన గుణాలకేమో వాహనాలు సంకేతము. వాటిని లొంగదీసుకోవలసిన ప్రజ్ఞకేమో మూర్తి సంకేతం. పెద్దలు ఈ విధంగా సంకేతాలు పెట్టుకుంటూ వచ్చారు. కాని మన దృష్టి ప్రక్కదారిపట్టి ఈ సంకేతం దైవము, ఆ సంకేతం కాదు, ఇది ఎక్కువది, అది తక్కువది అనుకోవటం మొదలుపెడితే మనం ప్రక్కదారి పట్టినట్లే.

అందువల్ల మొట్ట మొదటగా మనం అంతటావున్న భగవంతుణ్ణి గుర్తుపెట్టుకోవడం కోసం ప్రతిమను పెట్టుకున్నాం అన్న సంగతి మరచి పోవడం జరుగుతున్నది. అంతటా వున్నదే యిక్కడా వున్నది అన్న సంగతి మరిచిపోయాము. ఇక్కడ వున్నది రూపమే అనుకోవడం మొదలుపెట్టాము. అంటే అన్ని రూపాలకూ అతీతంగా వుండే దైవాన్ని ఒక రూపం క్రిందకు తీసు కొచ్చాము. అసలు రూపమనే మాటకు అర్థమేమిటి? ఉన్నా లేకున్నా మన యింద్రియాల మీద అట్టి ప్రభావం కలిగించేది అని అర్థం. ఆలోచిస్తే మాత్రం ఎంతో దూరం పోతుంది ఈ విషయం. ఉదాహరణకు: మట్టిముద్ద వున్నది.

మట్టిముద్దతో కుండ తయారుచేసాము. తరువాత దానిని కుండ అన్నాము. ఇప్పుడు మనం కుండ అంటున్నది దేనివి? మట్టినా? ఆకారాన్నా? ఆకారాన్నే గనుక అయితే అందులో వున్న మట్టిని తీసి ప్రక్కన పెడితే ఆకారమనేది వుంటుందా? కాబట్టి అక్కడ మట్టి తప్ప ఏదీ లేదుకదా! ఇక ఆకారమనేది ఎక్కడిది? మట్టి కన్యంగా రూపమంటూ లేదు. అందుకని అసలు రూపమంటేనే వస్తుత్వం లేనిది అని అర్థం. లేనిది వున్నట్లుగా భాసించేది అని అర్థం. మట్టికంటే భిన్నంగా వున్నట్లు అనిపిస్తుందిగాని నిజంగా చూస్తే మాత్రం ఏమీ వుండదు. దానికి మన ఇంద్రియాల మీద కలిగిన ప్రభావం మాత్రమే అది. వస్తుతః చూస్తే మట్టి తప్ప ఏమీ వుండదు. దానిని ఏ ఆకృతిలో చేసినా అదే వుంటుంది. అందుకని రూపమే దైవమనుకుంటే ఏది కాదో అక్కడకు వచ్చామన్నమాట. ఏది అవునో దానిని మర్చిపోవడం జరుగుతున్నదన్నమాట. అయితే రూపంతో ఉపాసన చేసే వాళ్ళు కృతార్థులుకారా? తప్పక అవుతారు. కాని రూపం అనుకోబట్టి కాదు. రూపంలో ఆ దైవమే వున్నది, ఇది సచేతనము అనుకోబట్టి. ఈ సంగతి జ్ఞాపకం వున్నపుడు రూపం దానికి సహాయపడుతుంది.

ఉదాహరణకు మనం పరిచయమున్న ఒక వ్యక్తి యొక్క ఫోటో చూసాము, ఆత్మీయత మన హృదయంలో కలుగుతుంది. ముక్కూ మొహం తెలియనివాడి ఫోటో చూసాము, ఏమీ గుర్తుపట్టలేము. అంతదాకా ఎందుకు? మనకు తెలిసిన మిత్రుడు దిగుతాడని రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్ళాము. అక్కడ ఎన్ని రకాల ముఖాలు యిటునుంచి అటు వచ్చి పోతుంటాయో! కాని మన దృష్టి మాత్రం వాడినిగాని, వాడిని పోలివున్న వాడిని వెదుకుతూ తక్కిన వాళ్ళను గుర్తుపట్ట కుండా వదలివేస్తుంది. అక్కడ వాడిమీదవుండే భావం రక్కున వాడిని గుర్తు పట్టడానికిగాని, వాడిలాగా పోలికలున్న వాడిని గుర్తు పట్టడానికి గాని కారణ మైందన్నమాట. కనుక రూపాన్ని ఆలంబనంగా తీసుకొని ఈ రూపాలన్నింటికీ అతీతమైన తత్త్వాన్ని ఎవరైతే లోపల భావన చేయగలరో, వాళ్ళకే అది సాధ్య మవుతుంది. కాని రూపమేనమకున్న వాళ్ళకది సాధ్యపడదు. రూపంగా పెట్టుకు సాధన చేస్తుంటే రామకృష్ణ పరమహంసకు కాళికామాత సాక్షాత్కారం అవు తుంది గాని రూపంగా పెట్టుకున్న ప్రతి వాడికీ సాక్షాత్కార మవుతుందని చెప్ప లేము. ముందు అక్కడ వున్నది రూపం మాత్రమే గాదు అనే భావనతో చేయగలగాలిగదా!

ఒకవేళ రూపం మాత్రమే అనుకున్నా గూడా మనం ఆ రూపాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నంచేస్తుంటే కాసేపట్లో ఆ రూపం కనిపించకుండా పోతుంది. దానికి బదులు యింకేదో వస్తుంది. అలాగాకుండా మనం ఆత్మీయుడైన ఒక వ్యక్తిని గుర్తు తెచ్చుకున్నామనుకోండి. అపుడు అతని రూపం భావనలోకి వస్తుంది. అప్పుడు అక్కడ జరుగుతున్నదేమిటంటే, అవతలివాడికి మనమీదవుండే ఆత్మీయత, మనకు వాడిమీద వుండే ఆత్మీయత, మనకు వాడితో కలిగిన అనుభవాలు, ఇవన్నీ కలిసి ఆ రూపాన్ని నిలుపుతుందన్నమాట. ఒకవేళ ఆ రూపం మసకమసకగా తయారవుతుందనుకోండి. అప్పుడు వాడిదగ్గర మనకుండే ఫీలింగ్ మనకు జ్ఞాపకముంటుంది. ఫీలింగ్ మరుపువస్తే వాడి రూపం జ్ఞాపకముంటుంది. ఈ రెండూ మరుపు వచ్చాయనుకోండి. వాడి మాట తీరు జ్ఞాపకముంటుంది. ఈ మూడూ మరుపయితే వాడితో మన పరిచయం జ్ఞాపకం వస్తుంది. ఇలా ఏదో ఒక విధంగా వాడిమీద మాత్రం మనసు నిలుస్తూ వుంటుంది. కాబట్టి యివన్నీ ఒకదానికొకటి బలపడి వుండడంచేత అవి జ్ఞాపకముండడం తేలిక.

అదెలాగంటే ఉదాహరణకు, ఒక పుస్తకాల shelf వున్నదనుకోండి. అందులో ఒక అరలో రెండు మూడు పుస్తకాలు మాత్రమే పెట్టామనుకోండి. కదలిస్తే చాలు పుస్తకాలు క్రింద పడతాయి. అలాగాక పుస్తకాలు shelf నిండా పేర్చి తనాయించి వుండేటట్లు పెట్టామనుకోండి. అప్పుడు పుస్తకాల shelf ను వంచి నిలబెట్టినా గాని పుస్తకాలు క్రిందపడవు. ఎందుకని? ఒకదానికొకటి తనాయించి వుంటాయి గనుక. ఒకదానికొకటి Press చేస్తూ క్రింద పడకుండా వుంటాయి. అలాగే మన స్నేహితుని విషయంలోగూడా వాడికి మనమీద వుండే feeling మనకు వాడిమీద వుండే feeling వాడి రూపము, వాడు మాట్లాడే తీరు, వాడు వ్యవహరించే తీరు, అన్నీ కలిసి మన స్మృతులలో నొక్కి పెట్టి అన్నీ కలిసి మన మనస్సులో పేర్చుకుని వుంటాయన్నమాట. అందుకని వాడి గురించి మన ఆలోచనలు మొత్తం ఒక యూనిట్ గా వుంటాయి. అట్లాంటి feeling దైవం గురించి ఎవరికి ఏ రూపంతో సమన్వయమై అటువంటి feeling కలుగుతుందో, అప్పుడు ఆ రూపం మనస్సులో నిలు స్తుంది. అప్పుడు పూజ సార్థకమవుతుంది. అంటే ఈ చెప్పడంలో అర్థమేమి టంటే ఆ రూపం వాస్తవంగా ఆ దైవంయొక్క రూపమేనని గుర్తు వుండడమన్నమాట. ఈ చెప్పిన వివరణ అంతటికీ అర్థమేమిటంటే ఆయనకు, ఆయన పటానికీ భేదంలేదని ఋజువైందన్నమాట.

అంటే పూజకు, సత్సంగానికి, భజనకు, పారాయణకు, సర్వానికీ గూడ కీలకము, సార్థకము, ధ్యేయము, గమ్యము ఒక్కటే - సదా ఆయన సన్నిధిలో వున్నాము అని గుర్తుపెట్టుకోవడం. దానికి సోపానం క్రింద రూపాన్ని పెట్టుకున్నాము. ఆ విధమైన భావన నిలుపుకోవడం కోసం చేసేటటువంటి యత్నమే ఈ పూజా పునస్కారము, ఈ సత్సంగము, ఈ భజన. ఈ విషయాన్ని మనం ఎప్పుడైతే గుర్తుపెట్టుకుంటామో, అప్పటి నుంచి మన జీవితమంతా గూడా యాంత్రికంగా జరిగేటటువంటి స్థితిలోంచి క్రమంగా బయటకు వచ్చేస్తుంది. ఎంతమేరకు యాంత్రికంగా వుండడం మానేసి, మన హృదయంలో ఆయన సాన్నిధ్యము, ఆ సన్నిధిలోని మాధుర్యము అనుభవమవుతూ, ఆయన సన్నిధిలో వున్నాము అన్న గుర్తు మనకుంటుందో అంత మేరకు మనకు తెలియకుండానే వ్యవహారాలు జరుగుతుంటాయి.

ఇంతకు ముందు భగవద్గీతనాధారంగా ఒక విషయం ప్రస్తావించడం జరిగింది. భగవద్గీతలో, 'రాగద్వేషాలను జయించు, ఇంద్రియాలను జయించు, మనస్సును జయించు' అని చెబుతాడు. కాని 'ఎలా జయిం చాలి?' అన్నది ప్రశ్న. 'దేనితో జయించాలి?' అన్నది ప్రశ్న. ఉదాహరణకు: ఒకని యింట్లో వడ్లు వున్నాయి. రెండుశేర్లు బయట పారబోయమనండి చూద్దాం. పారపోయడు, వాటినే పొలంలో పొయ్యమంటే పోస్తాడు. కారణం ఏమిటి? పొలంలో చల్లితే పంటగా పండి మళ్ళీ చేతికొస్తుంది. పంటగా చేతికొస్తుందనే అవగాహనచేత యిప్పుడు పొలంలో పోసేది వూరికే పారపోసేది కాదని తెలుస్తుంది. అదే రీతిన మనలోని రాగద్వేషాదులను జయించడంచేత, వాటిని అదుపులో పెట్టుకోవడం చేత మనకు శ్రేయస్సు జరుగుతుందనేది మనకు స్పష్టమైతే, అట్టి ప్రయత్నం మనలో నుంచే పుట్టుకొస్తుంది. కాని ఆ విషయం స్పష్టం కావడానికి ఆధారా లేవి? మనకు జీవితంలో వున్న పరిమితమైన అనుభవం చాలదే! న్యాయం చేసే వాళ్ళంతా సుఖంగా బ్రతకలేక పోతున్నారు. అన్యాయం చేసేవాళ్ళంతా హాయిగా బ్రతుకుతున్నారు. అసూయాద్వేషాలతో వున్నవాడు నాశనమైపోతాడు, మంచి గా వున్నవాడు మాత్రం బాగుంటాడు, అనడానికేమీ లేదు. ఇట్లాగూ వున్నవాడు వున్నాడు, అట్లాగూ వున్నవాడూ వున్నాడు. కాబట్టి ఏ ఆధారాన్ని బట్టి మనం అట్టి ప్రయత్నం చేయగలుగుతాము? అలా చేయడం వల్ల నిత్య జీవితంలో కష్టం కలుగుతుంది.

ఒకడిమీద నాకు కోపం వచ్చింది. వాడిమీద అరుస్తే అక్కసు తీరుతుంది గాని, వూరుకుంటే బాధగా వుంటుంది గదా! వాడు నన్ను అన్నప్పుడు

వూరుకున్నాను. నేను వాడినంటే వాడు వూరుకుంటాడా? అసలు నేనేమీ అనకుండానే అనవసరంగా వాడు నన్ను మాటలంటున్నాడు. అప్పుడు నేను వూరుకుంటే ఎట్లా? వూరుకుంటే వాడునవ్వున్నాడనే బాధ కలుగుతుంటుంది. అరిస్తే కాస్త అక్కసన్నా తీరుతుంది. దీనిని కాదనుకుని ముందుకు పోగలగడం ఎట్లా? అటువంటి సన్నివేశం గాని, ఉదాహరణగాని ఏమైనా వున్నదా? అట్టి విశ్వాసం కలగడానికి అధారమేమైనా వున్నదా? అందుకని జయించాలను కుంటూ వుండడము, జయించలేక పోవడమూ జరుగుతూ వుంటుంది.

ఈ సందర్భంగా ఒక ఉదాహరణ పెద్ద వాళ్ళు చెప్పినది మనం జ్ఞాపకం చేసుకుందాము. పెద్ద బాణలిలో నూనె పోసి సల సలా కాగిస్తున్నాము. వంట చేస్తున్నాము, చిన్న వంట గది. ఉన్నట్లుండి బాణలి ఒక్కసారి ఏదో పొరపాటువల్ల క్రింద పడింది. ఆ పడడం కూడా ఏ రీతిన పడిందంటే గదిలో యిటు ప్రక్కకు, అటు ప్రక్కకూ కమ్ముకుని సలసలాకాగే నూనె మనవైపుకి వచ్చేస్తోంది. ఎటు అడుగు పెట్టాలన్నా కాళ్ళు నూనెమీద పడతాయి. నిలుచున్న చోటనే వుందా మంటే అన్ని వైపుల నుంచీ నూనె కాళ్ళ కిందకు వచ్చేస్తోంది. ఆలోచించ డానికిగాని, యింకొక పని చేయడానికిగాని సమయం లేదు. పోనీ పైకి ఎగిరితే పరిష్కారం అవుతుందేమోననుకుంటే ఎగిరితే అక్కడే పడి జారితే మాత్రం శరీరం గూడ కాలుతుంది. అందుకని పైన ఏ ఆలంబనం చిక్కితే ఆ ఆలంబనం పట్టుకోవాలి. కిటికీ చువ్వ దొరికితే చువ్వ గట్టిగా పట్టుకుని కాళ్ళు కిటికీలో పెట్టుకోవాలి. దూలం దొరికితే దూలం పట్టుకుని కాళ్ళు పైకి లేపుకోవాలి. ఏదో ఒక ఆలంబనం చూసుకోవాలి. రోలుంటే రోలుమీదెక్కాలి. పీట వుంటే పీట మీద ఎక్కినుంచోవాలి. అంటే ఏమిటన్న మాట? దూలమైతే నేమి, అటకైతే నేమి, రోలయితేనేమి! ఇంకొకదాని ఆలంబనంతో మనం నేలమీదనుంచి కాళ్ళు పైకి లేపుకుంటున్నాము.

ఏదో ఒక ఆలంబనం ద్వారా మనం ఎలా అయితే కాళ్ళను పైకి లేపు కుంటామో, అలాగే సద్గురువుయొక్క ఆశ్రయంచేత మాత్రమే మనం ఉద్ధరింప బడగలము. కాని మనంతట మనం ఉద్ధరించుకోవడం చాలా కష్టమైన పని. అయితే అసాధ్యమేమీ కాదు. కాని చాలా కష్టము. అయితే కష్టమని ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే అందుకు వివేకం చాలా కావాలి. వివేకంతో ఆలో చించాలి. ప్రతి విషయంగూర్చి దాని తత్త్వము ఏమిటో తెలిసిందాక నిద్ర

పోకుండా మనస్సులో తరచి తరచి ఆలోచించాలి. అలా ఆలోచిస్తే ఒక నిర్ధారణకు రావచ్చు.

ఉదాహరణకు: నేను, మీరు అందరం వున్నాము. ఇంత మందిమి వున్నట్లు అనిపిస్తున్నది, ఇందులో నేను వేరు, మీరు వేరు, వాడు వేరు అనే భావానికి ఆధారం ఎక్కడ వున్నది? ఇది ఆలోచించడం గూడా ఎంత కష్టమో ఆలోచిస్తే తెలుస్తుంది. నేను, మీరు వేరువేరు అనుకోండి. ఇలా వేరు అనుకోడానికి మనకు ఆధారం ఎక్కడైనా దొరికిందా? మొక్కలన్నీ నేలలో నుంచి తీసుకున్న ఆహారంలోనుంచి ఈ రక్తమాంసాలేర్పడ్డాయి. ఆ మొక్కలు గూడా భూమిలోని సారాన్ని గ్రహించడంవల్ల ఏర్పడ్డాయి. ఆ జలతత్త్వము, ఆ వాయుతత్త్వము, పంచభూతాలు అన్నీ అన్నిటికీ ఒకలాగే వుంటాయి. కాబట్టి పంచభూతాల వైపు నుంచి చూస్తే ఒకదానికొకదానికీ తేడాలేదు. ఇక మనస్సు వైపు నుంచి చూస్తే? మనస్సులో వుండే అభిప్రాయాలు వేరువేరుగా వుండవచ్చు గాని మనస్సు పనిచేసే పద్ధతులు మాత్రం ఒక్కటే. ఇంద్రియానుభూతులు పొందే పద్ధతి మాత్రం ఒకటే. ఇష్టాయిష్టాలు కలిగి వుండడం, రాగద్వేషాలు, భయము కలిగి వుండడము అంతా ఒక్కటే. ఇక నేను అనే అనుభవం చూద్దామా అంటే అందరిలో ఒకేలాగ వుంది. అందుకని వీటిల్లో నేను వేరు, అవతలి వాడు వేరు అని విడివిడిగా కనిపించి అనిపించేది ఏమిటి? రూపం వేరుగా వున్నది గనుక పోనీ అది తీసుకుందాం. ఒకరి రూపం ఒకటే అనుకోడానికి గూడా వీలుపడదు. ఎందుకంటే ఒకే వ్యక్తియొక్క రూపం ఒక వయస్సులో వున్నప్పుడు ఒకరకంగానూ, మరొక వయస్సులో వున్నప్పుడు మరొక రకంగానూ వుంటుంది. అలా వున్నది గనుక వాడెవరో, నేనెవరో అని ఎవ్వరూ అనరు. నేను 10 సం॥లుగా వున్నప్పటి ఫోటోకి, 40 సం॥లప్పుడు తీయించుకున్న ఫోటోకి పోలికే లేదనుకోండి, అప్పుడు వాడెవడో నేనెవడో అంటే సరిపోతుందా? అలా అనలేము. కాబట్టి వాడు వేరు, వీడు వేరు, నేను వేరు అని గిరిగీసే గిరి ఎక్కడ వున్నది? అని యిలా ఆలోచిస్తూపోవాలి. వేరుగా వున్నట్లు అనుభవమవుతున్నది గాని వేరు అని నిరూపించలేము.

ఈ విధంగా తరచి తరచి ఆలోచించి బుర్రను పదును పెట్టుకోగలిగితే అన్నీ మన అదుపులోకి వస్తాయి. ఇందుకు ఉదాహరణగానే సాయి, అసూయను ఎలా జయించాలో చెప్పారు. ఆ విధంగా ఆలోచించినా సరిపోతుంది. అట్టి

ఆలోచన నిలవడానికి కావలసిన బలాన్ని గూడా అనుభవరూపంలో మనకు ఆయనే ప్రసాదిస్తున్నారు. 'నువ్వు ఎవరికి ఏది చేసినా అది నాకే చెందుతుంది' అని చెబుతున్నారు గదా! అదే మనకు బలాన్ని యిస్తుంది. యోచించడానికి సహకరిస్తుంది. 'నువ్వు కుక్కను కొడితే నాకు తగులుతుందిరా' అని బాబా చెప్పారనుకోండి. ఎన్ని సార్లు చెప్పినా మనసుకు ఎక్కదు. అందరిలో ఒకే తత్త్వం వుంది. పంచభూతాలు చూస్తే ఒకటే, మనసు చూస్తే ఒకటే, ఆత్మ ఒకటే. అందరిలో ఒకటే వుంది. ఇక వేరు అనేది ఎక్కడ వున్నది అని యిలా ఎంతసేపు చెప్పినా గూడా మనసుకు అర్థంకాదు. అలా గాక కుక్కను కొడితే అయనకు తగిలిందనుకోండి, అప్పుడు అర్థమవుతుంది. అందుకని సాయి మనకు ఒక ప్రక్క అనుభవాన్నిస్తున్నాడు, మరొక ప్రక్క యోచించమనీ చెబుతున్నాడు. ఈ రెండింటినీ కొనసాగించుకోమని చెబుతున్నారు. కానీ ఈ రెండింటినీ యివ్వవలసిందీ, విడివిడిగా అన్వయించి చెప్పవలసినదీ గూడా సద్గురువే.

అందుకని సత్సంగం, పూజ, భజన, పారాయణ వీటన్నింటిలో మనం చేస్తున్నదేమిటంటే సామూహికంగా ఆ భావాన్ని పొందడానికి ప్రయత్నించడం. ఒకే భావాన్ని పంచుకున్నవాళ్ళంతా ఒకేచోట కూర్చుంటే, ఆ భావం ఆ విధం గా సక్రమంగా రావడానికి దోహదమెక్కువగా వుంటుంది. పరీక్ష కోసం చదువు కుంటున్నామనుకోండి. పరీక్షకు చదువుకునే పిల్లలు నలుగురూ ఒకచోట కూర్చుంటే మేలు. పదిమంది చదువుకునే వాళ్ళమధ్య మనం గూడ కూర్చుంటే మనకు గూడా చదువుకోవాలని అనిపిస్తుంది. ఒకవేళ సోమరితనం అనిపించి వూరికే కూర్చున్నా మళ్ళీ వాళ్ళను చూసి, వాళ్ళ సాంగత్యంచేత ప్రోత్సాహం కలుగుతుంది. అందుకని ఒకే కార్యక్రమం పెట్టుకుని ఒకేరకమైన మనస్తత్వం తో ఒకే దీక్షలో వుండడానికి ప్రయత్నం చేసే వాళ్ళు ఒకే సమయంలో ఒకేచోట కూర్చుని ఒకే కార్యక్రమాన్ని కొనసాగించినట్లయితే దానికి దోహదమెక్కువ. ఇది ఆధ్యాత్మిక కార్యక్రమం గనుక వీరిలో పూర్వజన్మ సంస్కారంచేత బాగా ధ్యానం కుదిరేవాళ్ళు, బాగా చేతనైనవాళ్ళూ వుండేటట్లైతే, వాళ్ళ యొక్క సాంగత్యము, వాళ్ళ యొక్క ధ్యాన బలముచేత యితరులకు గూడా ప్రశాంతిగా వుండేమాట నిజం. వాళ్ళకు మరింత దోహదంగా వుండేమాట నిజం. మనం యింత మందిమి వున్నప్పుడు, ప్రతిరోజూ మనం ఒకే చోట కలుసుకుంటూ వున్నప్పుడు, ఆ సాంగత్యానికి, ఆ ప్రదేశానికి, మన మనస్సుకూ ఒక విధమైన అనుబంధం ఏర్పడు

తుంది. అక్కడికి వచ్చేటప్పటికి మనస్సు సరియైన మూడ్‌లోకి వస్తుంది. అందుకని ఎక్కడ సత్సంగానికి కూర్చున్నా గాని, భజనకు కూర్చున్నాగాని, ఆయన సన్నిధిలో వున్నామని గుర్తుపెట్టుకుని వుండడం, ఆ గుర్తును మనలో బలపరచుకుంటూ వుండడంకోసం, సాక్షాత్తూ వారే మన ఎదుట వుంటే మనం ఏ విధంగా నడచుకుంటామో ఆలోచించుకుని, ఆ విధంగా నడచుకోవడానికి మనం ప్రయత్నం చేసినట్లయితే మనం వచ్చి కాసేపు సత్సంగంలో కూర్చుని వెళ్ళే సమయంలో ఎప్పుడూ జరగనటువంటి ధ్యానం కుదురుతుంది. అలాగే మన ఆత్మీయులైన వాళ్ళందరినీ గూడా ఈ కార్యక్రమంలోకి తీసుకువెళ్ళడం గూడా మనం ఆయన సన్నిధిలో వుండడానికి సాధనగా ఉపయోగపడుతుంది. అందుకని ఆ రీతిన ఈ విషయాన్ని ఆకళింపు చేసుకుని, కూర్చునే వాళ్ళం పదిమంది అయినా సరే దానివల్ల జరిగేటటువంటి ప్రయోజనం ఎక్కువగా వుంటుంది. కాబట్టి దీనినే కేంద్రీకరించుకుని సాయి చెప్పిన మార్గంలో సాధన చేసుకుంటూ మన భావనను మళ్ళీ మళ్ళీ నిత్య నూతనం చేసుకుంటుండడమే మనం చేయవలసినది. అప్పుడు జీవితంలో సాధన ఒక భాగమవడంగాక, జీవితాలే ఒక సాధనగా మారుతుంది.



అధ్యాయం-20



సద్గురు ప్రాశస్త్యము-అనుగ్రహము

ఇంతకుముందు మనం చెప్పుకున్న ప్రసంగంలో గురువును సేవించుకోవడంలో మనకుండవలసిన భావము, సత్సంగంవంటి కార్యక్రమము, ఈ రెండూ మాత్రమేకాక మనఆత్మీయులైన వారందరితోనూ మనంకలిసి మాట్లాడుకునేటప్పుడు గురువుయొక్క మహిమను, గురువుయొక్క అనుగ్రహాన్ని వారితో కలిసిపంచుకోవడంద్వారా మనము ఆలోచించవలసినదీ, మాట్లాడవలసినదీ వేరొక విషయం లేకుండా వుండేటట్లు చూచుకోవడం, వాళ్ళకు అత్యంతమైన శ్రేయస్సు చేకూర్చడంలో మనవరకూ మనంయత్నం చేయడం. ఈ మూడూ కలిసి మన జీవితంలో అనన్యచింతన నిలువుకునేందుకు చక్కని సాధనగా నిలువుకోవాలని బాబా ఎలా సూచించారో మూడు ఉదాహరణలతోటి చెప్పుకున్నాము. ఒకటి, దాసగణు మహరాజుగారిని కీర్తనలు చేయమని బాబా ప్రోత్సహించడము. రెండవది, చరిత్ర వ్రాయమని హేమాద్‌పంత్‌ను ఆశీర్వదించడము, ఆ లీలలుగూర్చి చింతనచేస్తే విలువైనటువంటి ఆధ్యాత్మిక రహస్యాలు అందులో దొరుకుతాయి అని బాబా ఆశీర్వదించేటప్పుడు చెప్పడము. ఇదిగాక సూక్తి ద్వారా, 'ఎవరైతే నన్నే స్మరిస్తూ, నామాటలే వింటూ, నా గురించే మాట్లాడుతూ, నా లీలలే గానం చేస్తూ వారే నేనుగా మారిపోతారో, వారి కర్మ నశిస్తుంది అని బాబా చెప్పడము, ఈ మూడుమార్గాలద్వారా వీటిని మన నిత్యజీవితంలో అనన్యచింతనగా నిలువుకోవచ్చు, తద్వారా నిష్ఠ, సబూరీలు అనేటటువంటి దక్షిణను సమర్పించేటటువంటి మన యత్నంలో యింకా సాఫల్యం చెందవచ్చు అనే విషయాన్నిగూర్చి స్మరించుకున్నాము.

సద్గురువును పొందడానికి యత్నం, మన పూర్వఋషులు మనకు నిర్దుష్టమైనటువంటి కొన్ని మార్గాలను అందించారు. మొట్టమొదటగా సద్గురువుయొక్క ప్రాశస్త్యం మనకుతెలియాలి. అప్పుడు ఆయనయొక్క ఆశ్రయము మనకు లభించాలనేటటువంటి కోరిక మనకు బలీయంగా కలుగుతుంది. ఇది అన్నింటికంటే ముఖ్యము. మనకు ఏ విషయంపైన ప్రీతి వుంటుందో, అది లభించినప్పుడు దానిని శ్రద్ధతో వినియోగించుకునేటటువంటి సామర్థ్యం మన

కుంటుంది. ఏ విషయంలోనైతే సామర్థ్యం మనకుంటుందో దానిమీద ఆపేక్ష వుంటుంది. ఎట్లాగంటే - విద్యద్వారా మనస్సును వికసింపజేసుకుని, విజ్ఞానం సాధిద్దామని కోరిక కలిగివున్నట్లయితే, అభ్యసిద్దామనేటటువంటి యత్నము, అభ్యాసంలో తీవ్రమైనటువంటి ఆసక్తి శ్రద్ధనిలవడమూ మామూలుగా ప్రపంచంలో మనం చూస్తూనే వుంటాము. అదేరీతిన సద్గురువుయొక్క పమాశ్రయము మనకు అవసరము అనేటటువంటి సంగతితెలిసి, దానికోసం హృదయంలో తీవ్రమైన కోరిక కలగాలి. ఎక్కువమందిమి మనకు సద్గురువు యొక్క అనుగ్రహం లభించలేదే, ప్రత్యక్షమైన అనుభవం కలుగలేదే అని బాధపడతాముగాని దానికి ఒక కారణమున్నది. ఊరికే అప్పుడప్పుడూ అనిపించడమే తప్ప మనస్సులో నిరంతరం కలిగేటటువంటి ఆకాంక్ష కలుగదు. అట్టి అనుభవం కలుగకపోవడానికి కారణం అదే. దీనినే వేదాంతంలో 'ముముక్షత్వం తీవ్రతరం అయ్యేంతవరకూ మోక్షం లభించదు, జ్ఞానం లభించదు' అని తాత్వికంగా చెప్పారు.

అంటే ఒక వ్యక్తి శాస్త్రాధ్యయనం చేసి, తన గురువును సేవించడంవల్ల, తత్త్వజ్ఞానం కొంతవరకూ పొందినప్పటికీ, తెలిసినటువంటి ఆ తత్త్వజ్ఞానాన్ని నిత్యజీవితంలో అనుష్ఠించడము, వస్తువులపట్ల, వ్యక్తులపట్ల మనకుండే భావాన్ని పూర్తిగా మార్చుకోవడం అనేటటువంటి అభ్యాసం తీవ్రమైనరూపం ధరించే టంతవరకూ ప్రయోజనముండదు. దీనినే భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇంద్రియ మనోనిగ్రహం ప్రధానం అనిచెప్పాడు. అందులోగూడా మనస్సును నిగ్రహించడం ద్వారా ఇంద్రియాలను జయించవలసినది అనే సూత్రాన్నిగూడా చెప్పాడు. అట్లాగాక ఇంద్రియాలను మాత్రమే నిగ్రహించి ఎవడైతే మనసును నిగ్రహించడంలేదో వాడు మిధ్యాచారిఅని చెప్పాడు. మనస్సును నిగ్రహించడమంటే కేవలం సుఖాలను, భోగభాగ్యాలనూ త్యజించడం మాత్రమే కాదు. నిజానికి మనస్సు భోగభాగ్యాల గురించి మాత్రమే చింతన చేయదు, రాగద్వేషపూరితమైన భావాలతో గూడా నిండి వుంటుంది. రాజసిక, తామసిక భావాలతో నిండి వుంటుంది. వీటన్నింటినీ గూడా నిగ్రహించవలసి వుంటుంది. దీనినే మన పూర్వీకులు మనచేత అభ్యసింపజేయడం కోసం ఉపవాసవ్రతాలు పెట్టారు. అలా ఉపవసిస్తున్నప్పుడు బాహ్యంగా శరీరంతో మాత్రమేగాక మనస్సుతో గూడా ఉపవసించవలసి వస్తుంది. తన ఇష్ట దైవంయొక్క సాన్నిధ్యంలో మనస్సుసదా వుండాలి. తన ఇష్టదైవంపట్లగాని, సద్గురువుయందుగాని మనస్సు ఎంతగా

నిలవాలంటే తక్కిన విషయాలు మనస్సుకు తోచనంతగా నిలవాలి. మనమేదైనా అనక్తికరమైనటువంటి కాలక్షేపంలో నిమగ్నమైవున్నపుడు - అంటే ఎవరికి దేని యందు ఆసక్తి వుంటుందో, దానియందు నిమగ్నమైవున్నపుడు ఆకలి దప్పులు గుర్తులేకుండాపోతాయి. నిద్ర తూగకుండా వుండిపోతుంది. ఆ రీతిన తన ఇష్ట దైవంమీదగాని, గురువుయందుగాని వుండే ప్రీతిచేత ఆ ధ్యాసలో నిమగ్నమై వున్నపుడు మనస్సు రజోగుణ, తమోగుణ ప్రధానంగా యికవేటి గురించి గూడా ఆలోచించ కుండా ఎటువంటి భావాలనుగూడా పొందకుండా వుండగలిగితే అప్పుడు అది మానసికమైన ఉపవాసమవుతుంది. దానివల్ల సహజంగా శరీరం గూడా ఉపవసించవలసి వస్తే అది పవిత్రమవుతుంది. లేకపోతే ఇందాక భగవద్గీత లో శ్రీ కృష్ణుడు చెప్పిన శ్లోకంలోలాగా ఇంద్రియాలను మాత్రమే నిగ్రహించిన వాడవుతున్నాడు. శరీరంతో ఉపవాసంవున్నా మనస్సు మాత్రం ఆకలికి గురైం దనుకోండి. అప్పుడు ఉపవాసంయొక్క ఫలితం లేకుండాపోతుంది. ఈ విషయం చెప్పడానికే బాబా కొన్ని లీలలు చేసారు. ఒక భక్తునికి ఉదయం 10 గంటలకే భోజనంచేసే అలవాటుంది. అతడు శిరిడీ వచ్చాడు. అక్కడ అందరికీ హారతి అయిన తర్వాత భోజనం చేయడం అలవాటు. అందుకని అతనికి ఆకలి వేస్తున్నా గూడా భోజనం చేయకుండా వుండిపోయాడు. ఆ రోజు ఏకాదశి. అందరూ ఉపవసిస్తున్నారు. ఎవరైనా ఉపవసించని వాళ్ళు వుంటే, వాళ్ళు హారతి అయిపోయిన తర్వాత భోజనం చేస్తారు. కాని బాబా అతనిని పిలిచి నువ్వు పోయి భోజనం చేయుమని చెప్పారు. అతడు సంకోచిస్తుంటే బాబా అన్నారు "వీళ్ళంతా పిచ్చివాళ్ళు. నేను చెప్పినా గూడా వినడంలేదు, నువ్వు పోయి తినిరా" అని.

ఈ వాక్యంలోని మొదటి మాటను గూర్చి మనం కొంచెం ఆలోచించ వలసి వుంటుంది. "నువ్వు ఆకలికి తట్టుకోలేవు, తినిరా" అని మాత్రమే బాబా అన్నట్లయితే ఆకలికి తట్టుకోలేకపోతే తినవచ్చు కాబోలు, అను కుంటాము. కాని బాబా అలా అనక, 'వీళ్ళంతా పిచ్చివాళ్ళు, నేను చెప్పినావినరు. నువ్వు వెళ్ళి భోజనం చేసిరా', అన్నారు. అప్పుడు భోజనం చేయడానికని అతడు వెళితే అక్కడి వాళ్ళు, ఏకాదశినాడు గూడా భోజనం కోసం యిట్లా ఆరాటపడటానేమిటి? ఆరతి అయిన తర్వాతగాని భోజనం పెట్టమువొమ్మన్నారు. అతడు బాబా దగ్గరకొచ్చి మెదలకుండా కూర్చున్నాడు. "భోజనం చేశావా?" అని బాబా అతనిని మళ్ళీ అడిగారు. తాను భోజనం చేయకపోవడానికి కారణం చెబితే వాళ్ళమీద బాబా

విరుచుకు పడతారేమోన్న ఉద్దేశ్యంతో, "వద్దులే బాబా, ఆరతి అయిన తర్వాత భోజనం చేస్తాలే" అన్నాడు. అప్పుడు బాబా, "అట్లాగాదు, హారతి అగుతుందిలే, నువ్వు వెళ్ళి ముందు భోజనం చేసిరా" అన్నారు. అంటే అక్కడ ఏమవుతున్న దంటే అతనికి ఆకలవుతోంది, అన్నం తినాలన్న కోరిక కలుగుతున్నది. అటు వంటప్పుడు వాడక్కడ కూర్చునివున్నా ఆరతిమీద మనస్సు లగ్నంకాక, అటూ యిటూ చెదురుతూ గందరగోళపడుతూ వుంటుంది. అందువలన ఏం జరుగుతున్నది? దేనికోసం ఉపవాసముంటారో, ఆ ప్రయోజనం చెడిపోయింది. ఊరికే శరీరాన్ని కష్టపెట్టటం మాత్రమే జరిగింది. పవిత్రం చేసుకోడానికి వుండేటటువంటి సద్గురు సాన్నిధ్యాన్ని, ఆరతిని నిష్ఫలం చేసుకోవడం మాత్రమే జరిగింది. ఇది మూడు విధాలుగా చెడగొడుతున్నది. అంతకంటే భోజనం చేసేస్తే యింకొక ఆలోచన ఏమీలేక సద్గురుసాన్నిధ్యంమీద మనస్సు లగ్నమవుతుంది. అందుకని వాడికి ఫలితం దక్కుతుంది. అందుకనే, "వీళ్ళు నేను చెప్పినా వినిపించుకోరు, నువ్వైనా ఆ పని చేసిరా" అన్నారు బాబా.

అకారణంగానే ఉపవసించడం మొదట ఆంతరంగికము, తర్వాత బాహ్యము. ఆంతరంగికమైన ఉపవాసంతో కూడిన ఉపవాసం బాహ్యమైనపుడు అది సరియైనటువంటి ఉపవాసమవుతుంది. అందుకనే సాయి తన గురువును తాను సేవించిన విషయం చెబుతూ తన గురువును చూస్తూ కూర్చుంటే ఆకలిదప్పులు గూడా గుర్తురాకుండా పోయేవని చెప్పారు. అట్లా చూస్తూ వుంటే ఎంతసేపైనా ఆయన సాన్నిధ్యంలో అలాగే కూర్చుండిపోవాలని అనిపించేదట. ఆకలిదప్పులే గుర్తొచ్చేవి కావట. అదెలా సాధ్యమవుతుందని మనం గనుక ఆలోచిస్తే తెలుస్తుంది. లౌకికంగా గూడా వ్యామోహాలలో వుండే వారికి - ఎవరికి దేనిపైన వ్యామోహం వుంటుందో ఆ వ్యామోహంలో వున్నవారికిగూడా అట్లాగే వుంటుంది. సినిమా పిచ్చివున్న వాళ్ళకు సినిమాకు వస్తే నిద్రాహారాలు, ఆకలిదప్పులూ తెలియవు. పేకాటపిచ్చి వున్నవాళ్ళకూ అలాగే వుంటుంది. జూదంపిచ్చి వున్నవాళ్ళకూ అట్లాగే వుంటుంది. స్నేహితులతో రోడ్లవెంబడి తిరగడం అలవాటైన వాళ్ళకూ అట్లాగే వుంటుంది. ఎవరికి దేనిమీద తీవ్రంగా అపేక్ష వుంటుందో, శ్రద్ధ తీవ్రంగా వుంటుందో అప్పుడు మిగతావేవీ పట్టకుండా వాటికై అవే కట్టుబడతాయి. దీనినే భగవద్గీతలో చెప్తాడు, సర్వేంద్రియాలనూ జయించు అని మనస్సు తన లక్ష్యంయందు ప్రీతితో నిలవడం ద్వారా ఇంద్రియాలన్నీ వాటంతట

అవే కట్టుబడివుంటాయి.

ఇది మన వ్యాఖ్యానమా, కాదా అనుకుంటే రామకృష్ణపరమహంస చెప్పిన ఉదాహరణను చెప్పుకోవచ్చు. మనస్సును జయించడానికి ఆయనొక ఉదాహరణను యిలా చెప్పారు. ఒక పశువులకాపరి ఒకకర్ర తీసుకొని రోడ్డుమీద అటు ప్రక్కన, యిటు ప్రక్కన అదలించుకుంటూ వస్తున్నాడు. ఆ మందలో 40, 50 పశువులున్నాయనుకోండి. అవి రోడ్డుమీదనుంచి క్రిందకు దిగుతుంటాయి. వీడు ఒక ప్రక్క క్రిందకు దిగి వాటిని మళ్ళించి పైకి వచ్చేసరికి రెండవ ప్రక్కకు కొన్ని పశువులు దిగుతాయి. ఇలా యిటువైపు, అటువైపు కొన్ని పశువులు దిగుతాయి. ఇలా యిటువైపు, అటువైపు క్రిందకు దిగకుండా తోలడం చాలాకష్టమవుతుంది. అలాగాక, వాటన్నింటికీ ఆకలి తీర్చేటటువంటి, ఆకర్షణీయంగా వుండేటటువంటి పచ్చిగడ్డికట్టను బుజాన వేసుకుని వాటికి ముందుగా నడవమన్నారు. అప్పుడు వాటికి తెలుసు, ఆ పచ్చిగడ్డి వాటికోసమేనని. అందుకని వాడి వెంటనే అవి గమ్యాన్ని చేరతాయి.

అలాగే బలవంతాన మనస్సును నిగ్రహించడమనేది చాలా కష్టతరము, విఫలమూ అవుతుంది. అలాగాక సంతోషకరమైనటువంటి విషయం మీద మనస్సు ఆకర్షింపబడడం ద్వారా తన గమ్యం వైపుకు తీసుకుపోవడం సులభమవుతుంది అని రామకృష్ణ పరమహంస గూడా సులువైన మార్గాన్ని మనకు తెలియపరుస్తున్నారు. ఆ సులువైన పద్ధతిని రామకృష్ణ పరమహంసలాగా చేయగలిగితే భగవద్గీతలోని ఆ శ్లోకానికి వివరణ యిది కాబోలు అని అపుడు అర్థమవుతుంది. లేకపోతే ఏమవుతుందంటే ముందు మనస్సును నిగ్రహించి, తర్వాత ఇంద్రియాలను నిగ్రహించాలి అన్న వాక్యాన్ని తిరిగి అనుకోవడం ద్వారా అర్థమైనట్లు అనిపిస్తుందిగాని తీరాకూర్చున్న తర్వాత ఏం చేస్తున్నాము, ఏం చెయ్యాలి అన్న సంగతి గుర్తురాదు. అక్కడ విన్న ఆ సూత్రం యిక్కడ అన్వయించుకోవాలి అన్న సంగతి మనస్సుకు ఆ సమయానికి తట్టదన్నమాట. ఏమిటబ్బా, ఇంతగా ప్రయత్నించినాగూడా మనస్సు నిలవడం లేదేమిటి? ఎందుకు నిలవడం లేదు అని తపనపడుతుందితప్ప అక్కడ చెప్పిన సూత్రం యిదిగదా అన్న సంగతి జ్ఞాపకంరాదు. భగవద్గీత అధ్యయనం చేయడం, అధ్యయనం చేయడంగానే వుండిపోతుంది. ఇక్కడ జీవితంలో తనపాట్లు తనవిగానే వుండిపోతాయి. అందుకనే పరమహంస ఆ సులభమైన సూత్రాన్ని

వివరించారు. ఉపవాసమన్న దానికి గూడా అర్థమదే. మనస్సు ఎప్పుడైతే సంతోషం తోను, ప్రీతితోను పవిత్రమైనటువంటి పరమార్థంయందు లగ్నమవుతుందో, సద్గురువుయందు లగ్నమవుతుందో, అప్పుడు మనస్సుకట్టుబడుతుంది గనుక ఇంద్రియాలు గూడా వాటంతట అవే నిగ్రహించబడతాయి అని చెప్పారు. ఆ రీతిన మనస్సును నిగ్రహించినట్లయితే లక్ష్యంయందు మనస్సు నిలుస్తుంది. లక్ష్యంయందు ప్రీతి ఏర్పడితే మనస్సు నిలుస్తుంది. ఇదీ అసలుసూత్రం. మనస్సును నిగ్రహిస్తే ఇంద్రియనిగ్రహం కలుగుతుంది. మరి మనస్సు నిగ్రహించడం ఎలా? అంటే పవిత్రమైన ఆ వస్తువుయందు అపారమైన ప్రీతిచేత కట్టుబడుతుంది. అందుకని ప్రీతినిచ్చేటటువంటి దానిని మనస్సుకు లభింపచేయవలసి వుంటుంది. దేనిమీనైతే ప్రీతి వుంటుందో, అక్కడ దానికై అదే లగ్నమవుతుంది. దీనిని ప్రపంచంలో సాధారణంగా చూస్తూనే వుంటాము. ఎవడైతే జీవితంలో దేనిని ఎనలేనినిధిగా తలుస్తాడో వాడి హృదయమంతా దానిమీదే వుంటుంది. ఒకడికి కీర్తిమీద వుంటుంది, మరొకడికి ధనంమీద, ఇంకొకరికి ఇంకొక దానిమీద-యిలా యెవరికి దేనిమీద వుంటుందో, దానినే నిరంతరం తలుస్తూ వుంటాడు.

అట్లాగే మనకు సద్గురువుపట్ల ప్రీతి కలిగి అందుకోసం అన్వేషణ, తపన, ఆకలి, దాహం బయలుదేరాలి. అవి ఎప్పుడూ వుండాలి. ఇక్కడ నూటికి తొంభై మందికి జరిగే లోపం సద్గురువుయొక్క ఆవశ్యకత తెలియకపోవడం వల్లనే జరుగుతుంది. సద్గురువుయొక్క ఆవశ్యకత బాగా మనస్సుకు తెలియడం ద్వారా సద్గురువుయొక్క అనుగ్రహాన్ని పొందాలి అనేటటువంటి తపన నిరంతరం వుండాలి. అందుకనే శాస్త్రంలో "దారేషణ, ధనేషణ, పుత్రేషణ" -ఈ మూడూ కలిస్తే ఎట్లా వుంటుందో, అన్నీ కలిసినంత పరమాత్మ మీద ప్రీతి వుండాలట. మనిషికి భార్యాబిడ్డలమీద ఎటువంటి ప్రీతి వుంటుందో, ధనంమీద ఎంతటి ప్రీతి వుంటుందో వీటన్నింటిమీదా వుండేటటువంటిప్రీతి సద్గురువుమీద వుండాలి. ఈ మూడింటినీ ఎందుకు ఉదాహరణగా చెప్పారంటే -ఎక్కడ, ఎప్పుడు ఏం చేస్తున్నా సరే, నేపథ్యంలో వాటిమీదే లోపల మెదులుతూ వుంటుంది. అన్నీ వున్నాసరే, రేపు ఎట్లా అని ఆలోచిస్తూనే వుంటుంది. నిత్యజీవితంలో నిరంతరం జరిగే చింతనకు ఉదాహరణ యిది కాబట్టి దీనిని చెప్పారు. ఆ విధమైన నిరంతర చింతన కలిగినప్పుడు మనస్సు సద్గురు సాన్నిధ్యాన్ని

అనుభవించడానికి యోగ్యమవుతుంది. అప్పుడు తప్పక ఆ సాన్నిధ్యాన్ని పొందుతుంది. అలోపల అట్టి సాన్నిధ్యం లభించినా అనుభవించలేము - ఎట్లా గంటే ఆకలి వేయడంగాని, తినాలనిపించడం గాని మనస్సుకు అనిపించనపుడు తినే పదార్థాలు రుచికరమైనవి వున్నాగాని వాటిని తలుచుకోము. అదే విధంగా తినాలని ఆపేక్ష లోపల కలిగినపుడు, ఆకలివేసినపుడు దానికోసం ఎంతగానో ప్రయత్నిస్తాడు, అవసరమైతే అడుక్కుంటాడు లేకపోతే దొంగతనానికి కూడా పాల్పడతాడు. అంటే జీవితంలో అదిలోపల తీవ్రయత్నాన్ని పురిగొల్పుతుంది. కాబట్టి సద్గురువు యొక్క సాన్నిధ్యప్రభావాన్ని, ప్రయోజనాన్ని మనం పొందగలగా లంటే సద్గురువు యొక్క అనుగ్రహమే సర్వము అనే విషయం మొట్టమొదటగా తెలియాలి. దానియందు ఆపేక్ష కలగాలి. ఆయనే సర్వమూ అని తెలియడంవల్ల ఆపేక్ష కలగడం సులభమవుతుంది. దానికొక కారణం వున్నది. ఎన్నిసార్లు సాయిని గూర్చివిన్నాగాని మనస్సు ఒక్కచోట మాత్రం మళ్ళీ మళ్ళీ పొరబడు తూనే వుంటుంది. ఉదాహరణకు మన పాంటుమగాని, చొక్కాను గాని యిస్త్రీ చేసేటపుడు ఒకే రకమైన మడతమీదే యిస్త్రీ చేస్తుంటారు. అలా చేయటంవల్ల ఎప్పుడైనా క్రింద పిగిలిపోతే వెనుకకు త్రిప్పి కుట్టిద్దామనుకుంటే ఆ పాత మడతలు పోవు. అదేరీతిన మనకు సరియైన అవగాహన లేకపోవడంచేత ఏర్పడిన దురభి ప్రాయాలు, అవి దురభిప్రాయాలే అని తెలిసినా గూడా వెనుకటి అభ్యాసంచేత ఎన్నిసార్లు వెనుకకు త్రిప్పడానికి ప్రయత్నంచేసినా గూడా గుడ్డపై పాత మడతలు పోనట్లు ఒకచోట మనం పొరబడడంవల్ల ఈ తపన మనలో జనించకుండా వుంటుంది. అదేమిటంటే, లౌకిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి వైవిధ్యం వుంది అని ఎక్కడో, ఎందుకో లోపల మెలికబడి వుంటుంది. సద్గురువుయొక్క అనుగ్రహం ఆధ్యాత్మికానికి మాత్రమే అనేటటువంటి భావనగూడా దానిలో దాచబడి వుంటుంది. ప్రాపంచిక జీవితంలో మనకు అభ్యాసము, అభినివేశము వుంది గనుక పారమార్థిక జీవితం మీద నిరంతరము ప్రీతికలుగదు. కనుక సద్గురువు మీద ప్రీతి కలుగదు. అందుకుతోడు పారమార్థికమైన దానినే ఆయన యిస్తారు అనేటటువంటి భావన లోపల దాగివుంటుంది. కాని ఆయన గూర్చి "భుక్తిముక్తి ప్రదంతం" అని స్పష్టంగా చెప్పారు. మొదట భుక్తిని యిచ్చి తర్వాత ముక్తిని యిస్తారాయన. అందుకని గురువును కల్పవృక్షము అని పేర్కొన్నారు. గురువుతో పోల్చడానికి కల్పవృక్షము గాని, కామధేనువుగాని, చింతామణిగాని

పనికిరావట. కారణం యివన్నీ ఎలాగైతే కోరినవన్నీ యిస్తున్నాయో, అవన్నీ గురువు అనుగ్రహిస్తాడు. అంతేగాక ఏదీ కోరనవసరంలేని స్థితిని గూడా ప్రసాదిస్తాడు. ఇహాన్ని, పరాన్నీ - ఆయన రెండింటినీ యిస్తున్నాడు. ఈ సంగతి మరిచి ఇది పారమార్థికమైన విషయం, అనే అభిప్రాయము వుండడం వల్ల లౌకికమైన ప్రాకృతికమైన జీవితంపట్ల అభినివేశం వుండడంమూలాన దానిమీద ప్రీతి కలుగకుండా వుంటుంది. సరియైన అవగాహనవుంటే ప్రీతి కలుగుతుంది, పెరుగుతుంది. అసలు ప్రీతి కలుగకుండావున్నా ఫరవాలేదు. ఇక్కడ జరిగేదేమిటంటే ప్రీతి కలగకుండావుండి, దురవగాహన చేత మాత్రమే ఈ దురభిప్రాయం మనసులో కలిగివుంటుందన్నమాట. మన సమస్యల గురించి, మన బాధల గురించి మన యత్నం మనంచేసుకుంటూవుండి, పారమార్థికమైనది కావలసి వచ్చినప్పుడు మాత్రమేఆది అనేభావం లోలోపలవుండి జీవితానికంతటికీ పారమార్థకమే ముఖ్యము అనే అభిప్రాయములేదు గనుక సద్గురువు యొక్క అనుగ్రహం కోసం తపన కలుగదు. అందుచేత ప్రత్యక్షంగా ఆయన సాన్నిధ్యం లభ్యమవుతున్నాసరే అనుభూతిరూపంలో దానినిలోపల పొందలేక పోతున్నాడు.

దీనికే ఇదివరలో ఒక ఉదాహరణ మనం చెప్పుకున్నాము. మహా పండితుడు ఒకడున్నాడు. ఆయనకొక కొడుకున్నాడు. దేశంలోని దూర ప్రాంతాలనుండి విద్య నేర్చుకోవడం కోసం ఎందరో వచ్చి ఆయన కోసం వాకిట్లో పడిగాపులు పడుతుంటారు. కాని ఆయన దగ్గర ఎప్పుడూ వుండేటటువంటి కొడుకుకు ఆ పాండిత్యంయందు ప్రీతి లేకపోవడంవల్ల, "ఈ చాదస్తు డికి అ చాదస్తులు దొరికారు" అనుకుంటుంటాడు. తన కొడుకు మహా పండితుడు కావాలని ఆ తండ్రి ఎంతో తపన పడుతుంటాడు. కాని తండ్రి పట్ల అతనికి 'ఈయన హాయిగా వుండడు, నన్ను హాయిగా వుండనివ్వడు' అనిపిస్తుంటుంది. అంటే - అంతటి మహా పండితునిదగ్గరే వున్నప్పటికీ నీడికాపేక్ష లేకపోవడంవల్ల ప్రయోజనం లేదు. దీనికే ఒక ఉదాహరణ మన పెద్దలు చెప్పారు. ఒక కొలనులో కలువలు వికసిస్తున్నాయి. వాటి సమీపంలో ఆ నీళ్ళలోనే కప్పలు గూడా వున్నాయి. కాని ఎక్కడినుంచో వచ్చిన తేనెటీగ ఆ పూలలోని మకరందాన్ని తీసుకు వెళ్తుంది. ఆ కలువలవెంబడే కప్పలు వున్నా ఆ తేనెను అవి గ్రహించలేవు. ఆ పూవుమాత్రం ఎవరికైనా మకరందంయివ్వడానికి సిద్ధంగానే వుంటుంది. అలాగే ఆ పండితుడు తనపాండిత్యాన్నంతటినీ తన కొడుకుకు గూడా యివ్వ

దానికి, సిద్ధంగానే వుంటాడు, కానీ తీసుకునేందుకు అతనికి అపేక్ష వుండాలిగదా! అలాగే సద్గురువు గూడా తన జ్ఞాన సంపద నంతటినీ యివ్వడానికి సిద్ధంగానే వుంటారు కానీ, తీసుకోవాలనుకునేవారు వుండరు. ఒకవేళ తీసుకోవాలనివున్నా సరియైన అవగాహన లేకపోవడంవల్ల పొందలేరు. ఒకప్పుడు ఒక ధనవంతుడు సాయివద్దకు వెళ్దామనుకున్నాడు. "జీవితంలో నాకు అన్నీ వున్నాయి. ఒక్క బ్రహ్మజ్ఞానమే కొరవడింది. అదొక్కటి లభిస్తే నాకే కొరతా వుండదు" అనే వుద్దేశ్యంతో బయలుదేరాడు. అప్పుడు అతని స్నేహితుడు, "మమకారం వున్న వాడికి బ్రహ్మజ్ఞానం లభించడం కష్టం. నువ్వు వెళ్ళవద్దు" అని అన్నా వినిపించుకోకుండా ఏకంగా శిరిడీకి రానూపోనూ బండి మాట్లాడుకుని బయల్దేరి శిరిడీ వెళ్ళాడు.

"బాబా! భగవంతుని దయవల్ల నాకు అన్నీ వున్నాయి. బ్రహ్మజ్ఞానమొక్కటే లోపించింది. మీ దగ్గరకు వచ్చినవాళ్ళకు మీరు బ్రహ్మజ్ఞానమిస్తారని విన్నాను. అందుకని ఆ ఒక్కటీ పొందిపోదామని వచ్చాను" అన్నాడు. అప్పుడు బాబా అన్నారు: "బ్రహ్మజ్ఞానం కావాలనే వాడివి యింతకాలానికి నువ్వొక్క డివే దొరికావు. నేను యివ్వాలనుకున్నా కావాలనేవాడే లేడు, అడిగేవాడేలేడు" అని ఒక పిల్లవాణ్ణి పిలిచి, నా దగ్గర డబ్బులు లేవు! "నాకు 5రూ॥లు అప్పు గా కావాలి. ఎవరినైనా అడిగి అప్పుగా తీసుకురా" అన్నారు. ఆ పిల్లవాడు ఒక శేఠ్ దగ్గరకు వెళ్ళాడు. బాబాకు డబ్బులిస్తే తిరిగి రావని ఆ శేఠ్‌కు భయం. మనకు బుద్ధి పుట్టినప్పుడల్లా దక్షిణగా డబ్బులిస్తే మాత్రం ఫరవాలేదు. బాగానే వుంటుంది కాని, అప్పుగా యిస్తే మాత్రం యికరావు. అందుకని తిరిగి రావలసిన డబ్బు క్రింద మాత్రం ఆయనతో పెట్టుకుంటే లేనిపోనిది మన సొమ్మూ పోతుంది, ఆయనతో మనకున్న బంధమూ చెడిపోతుంది. అందుకని లేదని చెప్పమన్నాడు. బాబా మరికొంతమంది దగ్గరకుకూడా అలాగే అప్పుతీసుకు రమ్మని పంపారు గాని వాళ్ళు తమ దగ్గర డబ్బులేదనో, అదనో, యిదనో ఏదో ఒక సాకు చెప్పి పంపించారు. ఆ కుర్రాడు అందరి దగ్గరకూ పోతూనే వున్నాడు, తిరిగి వస్తూనే వున్నాడు.

ఇదంతా చూస్తున్న ధనవంతుడికి బాబా తన పని ఆలస్యం చేస్తున్నందుకు బాగా విసుగెత్తిపోయింది. ఏమిటీ, నేను బ్రహ్మజ్ఞానం అడుగుతే ఈయన డబ్బుకోసం తాపత్రయపడతాడు అనుకుని, "బాబా! నేను త్వరగా

వెళ్ళాలి, నేనడిగింది మరచిపోయినట్లున్నారు, నాకుత్వరగా బ్రహ్మజ్ఞానమివ్వండి"అనడిగాడు. అప్పుడు బాబా, "నేనందుకే తాపత్రయపడుతున్నాను. నీకు బ్రహ్మజ్ఞానమిద్దామనే ప్రయత్నమే యిదంతా. కానీ ఏమి చేసేది? నాకు 5రూ॥లు ఎవరైనా యిచ్చారేమో చూశావా! దీనికి యాభైరెట్లు యిప్పుడు నీ జేబులో వున్నది. నీదగ్గర అంతవుండి గూడా 5రూ॥లు నాకు దక్కలేదు. వాళ్ళదగ్గర అంత ధనముండి గూడా నాకు 5 రూ॥లు దక్కలేదు. ఎందుకని? వాళ్ళ దృష్టి ఒకదానిమీద, నా దృష్టి మరొకదాని మీద వుంది గాబట్టి. నాకు కావలసింది వాళ్ళు యివ్వలేదు. ఆలాగే నీ దృష్టి గూడా దానిమీద వుందిగాబట్టి నీవుగూడా యివ్వలేదు. నీ దృష్టి వాటిమీద వున్నంతవరకూ బ్రహ్మజ్ఞానం యివ్వడం వీలుపడదు. నీలోవుండే అయిదూ, ఎప్పుడైతే సమర్పణ చేస్తావో, అప్పుడు నీకు బ్రహ్మజ్ఞానం యివ్వడానికి వీలవుతుంది'' అని సంకేతంగా ఆయన చెబుతున్నారు.

ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామంటే బాబాకు బ్రహ్మజ్ఞానమివ్వాలని ఎప్పుడూ వుంటుంది. పొందాలని వాడికుండాలి అంతే. పొందాలని వాడికి లేకపోవడంచేతనే పోయింది. 1876లో సాయి 72 గంటలపాటు సమాధిస్థితిలో వున్నారు. వెళ్ళటోయేముందు మహల్సాపతితో అన్నారు, ''ఈ లోకంలో జనాన్ని చూస్తుంటే ఆశ్చర్యంగా వుంది. నాదగ్గర జ్ఞానం బోలెడంత రాసులు రాసులుగా వుంది, ఎవడొచ్చి తీసుకుపోతాడా, యిద్దామని ఎదురు చూస్తున్నాను. అడిగేవాడే లేడు. ప్రతివాడూ లౌకికమైన కోరిక కోరేవాడే. నాకు యివ్వడానికి వీలుగానివి గూడా కోరుతాడు. ఎంతసేప టికీ నాకు యిది కావాలి, అది కావాలి అని. ఆ కోరిక, ఈ కోరిక కోరేవాడే. అందరూ అవే అడుగుతారు. జ్ఞానం కావాలని ఎవ్వరూ అడగడమే లేదు. నాకు వీళ్ళతో విసుగుపుట్టి పోయింది. అల్లా దగ్గరకు వెళుతున్నాను. బుద్ధిపుడితే వస్తాను, లేకపోతే లేదు"అన్నారు.

ఇవన్నీ గూడా ఒక్క విషయాన్నే తెలుపుతాయి. సద్గురువు యొక్కకృప పొందాలనే మనకున్న కోరికకంటే మనం కృపార్హులమై కృప పొందాలనే తాపత్రయం సాయికే ఎక్కువ వుంటుంది. అది వుండబట్టే ఆయనొక సూక్తి చెప్పారు : "ఎవరు ఎవరిని కోపగించినా, దూషించినా నన్ను కష్టపెట్టినవాడవుతాడు" అని. తన కొడుకు ఎంతో గొప్పవాడు కావాలని కోరుకునేటటువంటి తండ్రికి ప్రక్కయింట్లో జేబు కొట్టుకొచ్చాడని తెలిస్తే ఎట్లా వుంటుంది? తన కొడుకు ఆదర్శ

ప్రాయుడైనటువంటి వ్యక్తిగా, ఉత్తమ వ్యక్తిగా రూపొందాలని ఎంతో తాపత్రయపడి ఎన్నో రకాలుగా పాట్లుపడుతున్నాడాయన. కొడుకు అటువంటి ప్రయత్నం చేసేబదులు యింకొకయింట్లో దొంగతనం చేసొచ్చాడని తెలిసిందనుకోండి. లేక ఏదైనా తప్పుపని చేసాడని తెలిసిందనుకోండి. ఆ తండ్రికి ఎంతటి హృదయ వేదన వుంటుందో, సాయికికూడా అంతగానూ వుంటుంది. ఇది మనం గమనించవలసిన విషయం. మనకు ఆయన తమఅనుగ్రహం ప్రసాదించడానికి, అనుభవమివ్వడానికి ఎప్పుడూ సంసిద్ధులుగానే వున్నారు. దీనికి వారే ఒక దృష్టాంతమిచ్చారు. కోపర్గాంవ్‌లో ఒకాయన వుండేవాడు. శిరిడీకి వెళ్ళాలంటే ఎవరైనా సరే కోపర్గాంవ్ మీదుగాగాని, అహ్మద్ నగర్‌నుంచిగాని వెళ్ళాలి. ఇతడు కోపర్గాంవ్‌లో వుండేవాడు. శిరిడీకి ఎవరు వెళ్తున్నా సరే విమర్శిస్తుండేవాడు. చివరకు అతనికి, ఇంతమంది వెళ్తున్నారు గదా, ఏమిటో తమాషా చూద్దామని అనిపించి శిరిడీ బయల్దేరాడు. దారిలో వెంట నడుస్తున్నతనితో, "ఎందుకయ్యా శిరిడీ వెళ్ళడం, నేను వూరికే అంత మంది వెళ్తున్నారు ఏమిటి చూద్దామని బయల్దేరాను గాని, నాకు నమ్మకం లేదు. అసలు ఏమిటిదంతా? అంతా బూటకమే" అంటూ మాట్లాడాడు.

అతడు శిరిడీ వచ్చేసరికి బాబా కుండలలో నీళ్ళనన్నింటినీ పారబోసి, వాటిని తలక్రిందులుగా బోర్లిస్తున్నారు. అప్పుడు వాడనుకున్నాడు- "ఈ పిచ్చి వాణ్ణి పట్టుకుని వీళ్ళంతా దైవమంటున్నారు. అందుకని ఆయన చేసేపని ఏమిటని అడిగితే వాళ్ళు ఏదో పిచ్చి సమాధానం చెబుతారు. అందుకని నేనే ఆయనను అడుగుతాను" అనుకొని, "ఏమిటిలా చేస్తున్నారు?" అని బాబాను అడిగాడు. అప్పుడు బాబా అతనితో, "నాదగ్గరకొచ్చే కుండలన్నీ యిట్లాగే వస్తున్నాయి" అన్నారు. మామూలుగా వుంటే ఏదైనా పోయవచ్చు. బోర్లించి వుంటే పోసేదెట్లా? కాబట్టి ఏముందో చూద్దామని ఆసక్తితో వచ్చినాగాని ఏదైనా యివ్వవచ్చు. కాని అక్కడ ఏదీలేదనే నమ్మకంతో వచ్చేవాడికి - ఆ కుండను నింపేదెలా? అని ఉదాహరణతో చెప్తున్నారు.

దీనితో మనం ఇంకొక ఉదాహరణను గూడా జోడించుకోవచ్చు. మనకు నీళ్ళు కావాలి. చెరువు దగ్గరకు వెళ్ళాము. బిందెను చెరువులో మామూలుగా ముంచాము, బిందెనిండుగా నీళ్ళు వస్తాయి. కాని తల్లక్రిందులుగా ముంచామనుకోండి. ఎంతగా ముంచినా బిందెలోకి కొంచెమైనా నీళ్ళు వెళ్ళవు. ఆ బిందె

కొంచెమైనా పక్కకు వంపుతిరిగితే కొంచెమైనా నీళ్ళులోపలకు వెళ్ళడానికి అవకాశముంటుంది. ఆదే రీతిన సద్గురువు ఎల్లెడలా వున్నాడు. మనమెప్పుడూ సద్గురువుయందే వున్నాము. అయితే వచ్చినచిక్కేమిటంటే - తలక్రిందులుగా వుండే బిందెవలె వున్నాము. ఈ సంగతి తెలియడానికి మంత్రపుష్పంలో చెప్పారు: "హృదయం చాప్యథో ముఖమ్" అని. హృదయము అథోముఖంగా వున్నదట. ఎవరికైతే ధ్యాన తీవ్రత ఎప్పుడైతే కలుగుతుందో, అప్పుడా హృదయగ్రంథి విచ్ఛేదమై ఊర్ధ్వముఖమవుతుంది. అంటే యిందాక చెప్పుకున్నట్లు చెరువులోని బిందెపైకి తిరుగుతుందన్నమాట. అలాగే హృదయకమలము ఊర్ధ్వముఖ మయ్యేసరికి హృదయమంతా ఆ అనుభూతితో నిండి, "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అనే అనుభవానికి వస్తుంది.

ఇప్పుడు చూడండి - మంత్రపుష్పంలో చెప్పినదానికి, బాబా చెప్పిన దానికి ఎంతటి చక్కని పోలికవుందో! అథోముఖంగా వుండడం అంటే ఏమిటి? ఏది అనిత్యమో, ఏది అశాశ్వతమో, వేటిద్వారానైతే సుఖశాంతులు రావడానికి వీలుగాదో, వాటియందు ప్రీతి కలిగి వుండడము, అసలైన వస్తువుయందు విముఖత కలిగి వుండడమున్న మాట. అంటే యిందాక మనం చెప్పుకున్నట్లు పారమార్థిక జీవితం వేరు, లౌకిక జీవితంవేరు అనే దురభిప్రాయం కలిగి వుండడం వల్ల, సద్గురువు యొక్క అనుగ్రహం పారమార్థికానికి మాత్రమే ననేటువంటి భావం లోపల వుండడం చేత, అదిగూడా రెండింటినీ యివ్వగలదు అనేటటు వంటి విశ్వాసం లేకపోవడంచేత, అందులోనే వుండిగూడా ఆ అను భూతిని, ఆ ప్రీతిని మనం పొందలేకుండా వున్నాము. ఈ విషయాన్ని ఋషులు గూడా గుర్తించారని తెలుసుకోవడ కోసమే మంత్రపుష్పంలోని ఈ మంత్రాన్ని చెప్పు కోవడం జరిగింది. హృదయకమలం అధోముఖమై వుండుట. దీనినే భగవద్గీత యిలా చెబుతుంది. "ఛిద్యతే హృదయ గ్రంథీ" - హృదయ గ్రంథి విచ్ఛిన్నమై పోతుంది అని. అంటే ఏమిటంటే హృదయగ్రంధి దానితోటి ఛేదింపబడి పోతుందట. ఎలాగంటే ఉదాహరణకు ఒక రబ్బరుగొట్టమున్నది. దానిద్వారా నీరు ప్రవహిస్తున్నది. ఆ గొట్టం మధ్యలో మెలికబడిందనుకోండి. నీటి ప్రవాహం నిలిచి పోతుంది. అట్లాగే బయట ఏది వుందో, మనలోపల అదే వుంది అనే చైతన్యాను భూతి, నేను వేరు, బయటవి వేరు అని మెలికబడడం చేత అక్కడి నుంచి అను గ్రహం గాని, లోపలినుంచి జ్ఞానంగాని ఒకటిగా కాకుండాపోతుంది. కనుక ఈ

మెలిక వెనుకకు తిరగాలి. అలాగే మన హృదయంలో గూడా (హృదయమంటే 'నేను, నేను' అనే అనుభూతి) శుద్ధంగా నేను నేననే తత్త్వాన్ని తెలుసుకునే దాని యందు నిలువక నేను - అన్యము అనేటటువంటి దానియందు మెలికపడి వున్నది. ఇహము, పరము వేరు అనే మెలికపడి వున్నది. ఆలా మెలికపడి వుండడంచేత అనుగ్రహం లోపలకు రావడంలేదు. దీనినే అధో ముఖంగా హృదయం వుండడం అని చెబుతున్నారు. అది చెరువులోవుండే బిందె తల క్రిందులుగా వుండడంతో మనం పోల్చుకోవచ్చు. నీరు చెరువంతా నిండివుంది. బిందె ఎప్పుడైతే పైకి తిరుగుతుందో, బిందెలోకి నీరు వచ్చేస్తుంది. బిందె ఎక్కడ వున్నది అనే ప్రసక్తి లేదు. చెరువులో ఎక్కడైనా సరే వుంటే చాలు. అది సరిగా తిరిగిన మరుక్షణమే నిండి. లోపల, బయట అదే వుంది అనేఅనుభవాన్ని పొందు తుంది. కాబట్టి ఇహం చెడుతుందనేటటువంటి భయంలోపల వుండడంచేత పూర్ణంగా గురువును శరణాగతి చెందలేకపోతాము. శరణాగతి చేయలేకపోవడ మంటే ఏమిటి? గురువుకు భిన్నంగా జగత్తు, వస్తువులు, వ్యక్తులు వున్నాయన్న విశ్వాసం దృఢంగా వుండడమే అని అర్థం. ఇది సాయి చెప్పినటువంటి సమా ధానంలో తెలుస్తుంది. గురువుకోసం అన్వేషించబోయే ముందు నలుగురం కలిసి చర్చించుకున్నామని, తామొక అడవిలోకిపోయామని, భగవంతునిపొందే మార్గమేమిటని వాదించుకున్నామనీ చెప్పారు. అప్పుడు సాయి చెప్పేదానికి, మిగతావాళ్ళు చెప్పినదానికీ చాలా భేదమున్నది. ఒకడు - తనను తాను తెలుసు కోవాలని అన్నాడట. రెండవవాడు ఏది సత్యమో ఏది అసత్యమో తెలుసుకుని, నిత్యమైన దానిని అంగీకరిస్తూ, అనిత్యమైనదానిని నిరసిస్తూపోవాలి అన్నాడు. మూడవవాడు మన యత్నంతో మనం సాధించుకోవాలి అన్నాడు. అంటే వాళ్ళు శాస్త్రాన్ని అపార్థం చేసుకున్నారన్నమాట. 'ఉద్ధరేదాత్మనాత్మానం' అన్నపదానికి గురువు అవసరంలేదు అని అర్థం చేసు కున్నారు. అందుకనే గురువును నిరాక రించారు. ఆ తర్వాత వాళ్ళు భగ వంతుని కోసం అన్వేషించడంమాని దేశదిమ్మ రులై పోయారని సాయి చెప్పారు. వాళ్ళు బయల్దేరినది భగవంతుణ్ణి అన్వేషించ డానికనే. చివరకు ఏం జరిగింది? భగవంతుని కోసం అన్వేషించడానికి ఓపిక నశించి ఏమీ తోచక ఊరికే తిరుగుతూ తిరుగుబోతులయ్యారు. అంటే జనన మరణాలనేటటువంటి, సంసారమనేటటువంటి ఈ మహారణ్యంలో పరిభ్ర మిస్తూనే వున్నారు. అంటే వారిలో భగ వంతునికోసం అన్వేషించాలనే కోరిక

గూడా చచ్చిపోయిందన్నమాట. అంటే ఏమిటంటే - సూక్ష్మం తెలియకుండా, సులువు తెలియకుండా మొదలుపెడితే కాసేపటికి విఫలమై ఆ యత్నాన్ని వదలిపెడతాడు. ఎన్నిసార్లు చేసినా ఒక లెక్క రావడంలేదనుకోండి. ఏం చేస్తాము, ఎంతసేపని ప్రయత్నం చేస్తాము? దానిని వదిలేస్తాము. అలాగాక వివేకియైనవాడు సూత్రం కోసం వెతుక్కుంటాడు. ఆ సూత్రం చెప్పే వాడికోసం వెతుక్కుంటాడు. ఆ సూత్రం చెప్పిన వాడిని అంగీక రించడం కావాలి. ఇది ఎప్పటికైనా జరుగవలసిందే. గురువులేకనే ఆత్మజ్ఞానం పొందిన రమణమహర్షివంటి వారు గూడా అదే చెబుతున్నారు. ఒకరు రమణ మహర్షిని అడిగారు-సద్గురువుయొక్క కృప అవశ్యకమా? అవి. తప్పకుండా అవశ్యకమే అన్నారాయన. నువ్వు చేసుకోగలిగిన సాధనకంటే గూడా అది ఆవశ్యకమని చెప్పారు. ఎందుకంటే వారియొక్క దర్శనంచేత కొంత పవిత్రులమవుతాము. వారియొక్క సాన్నిధ్యంచేత మరి కొంత పవిత్రులమవుతాము. కాబట్టి మనం ఎంత సాధన చేసినప్పటికీ దానితో సాటికాజాలదు.

అప్పుడు, 'మరి మీ గురువెవరు? మీకెట్లా జ్ఞానం లభించింది?' అని అడిగారు. అప్పుడాయన, "నాకూ ఒక గురువు వున్నారు. కాని మీరనుకున్నట్లు కాదు" అన్నారు. అయితే మనకూ అటువంటి గురువు వుండవచ్చుగదా! అంటారేమో! అయనకున్న స్థితి మనకూ వచ్చాక వుండవచ్చు. ఇంతకుముందు మనం చెప్పుకున్న ఉదాహరణలో వెలగపండు క్రిందపడడమనేది సమాధానం కోసమేనన్న సంగతి తెలుసుకునే స్థితి ఒకటుండాలిగదా! ఆ సమయంలో చెట్టు మీదనుంచి వెలగపండు పడింది. అది సమాధానమే! కాని, అది సమాధానమే అని తెలియడానికి గురువు కావలసివచ్చింది. ఆ గుర్తింపు ఆయన తీసుకువస్తే అది వీడికి సమాధానమని తెలిసింది. సాయి చరిత్రలోకూడా దీనికే యింకా చక్కని ఉదాహరణ కనిపిస్తుంది. ఒకరోజు సాయి సన్నిధిలో హేమాద్పంతు కూర్చుని వున్నాడు. మరొకప్రక్క సాఠే కూర్చుని వున్నాడు. సాఠే గురుచరిత్ర ఒకసారి పారాయణ చేసాడు. నాటిరాత్రి స్వప్నంలో సాయిబాబా కన్పించి గురుచరిత్ర చేతిలో పట్టుకుని అందులోంచి విషయాలు బోధిస్తున్నట్లు స్వప్నం వచ్చింది. అతడు తన గురుచరిత్ర పారాయణ చక్కని ఫలితాన్నిచ్చిందని సంతోషించి తన స్వప్నంగూర్చి బాబాతో విన్నవించుకున్నాడు. అక్కడే కూర్చునివున్న హేమాద్పంతునకు ఆ అనుభవం వినగానే చాలా బాధ కలిగింది. ఇతడు ఒక్కసారి

ముఖరాలను చేయడమెందుకు? ఆమెకేదైనా సమాధానం చెప్పరాదా"? అన్నాను. అప్పుడు బాబా ఆమెను పిలుచుకు రమ్మన్నారు. అప్పుడామెతో బాబా యిలా చెప్పారు : "అమ్మా! చెవిలో మంత్రం చెప్పడమనేది మా సాంప్రదాయం కాదు, నా గురువు బ్రహ్మనిష్ఠుడై అలా కూర్చునివుంటే ఆయనను తదేకంగా ధ్యానంచేసి చేసి నేనూ అలాగే అయిపోయాను. మా సాంప్రదాయం అదే. కాబట్టి నువ్వుగూడా చేతనైతే అలాగేచేసుకో. అంతేగాని చెవిలో ఉపదేశించడం మా మార్గంకాదు" అని చెప్పారు.

ఈ లీల మొత్తంచూస్తే ఏం తెలుస్తున్నది? హేమాద్పంతు 40 సం॥లుగా పారాయణ చేస్తూనే వున్నాడు. కాని అనుభూతిని పొందలేదు. ఎందుకని? ఇదీ మనం గమనించవలసిన విషయం. మనకు తెలిసినా తెలియకపోయినా ఫలితం తప్పకుండా వస్తూవుంటుంది. అనిమనం ఒకరకంగా సమాధాన పడతాము. ఒకరకంగా ఫలితం వస్తున్నమాటగూడ నిజమే. ఆ పారాయణ పూరికే కూర్చుని ఏవో పనికిరాని పనులుచేసి మనస్సంతా పనికిరాని ఆలోచనలతో బుర్ర పాడవకుండా చేస్తుంది. ఒకందుకు ఇది మంచిదే. అదీగాక ఎంత కొద్దిపాటి శ్రద్ధతో పారాయణ చేసినా కొద్దోగొప్పో ఆ విషయంమీద నిలుస్తుంది. అంతవరకూ మేలే. కాని నిజంగా పొందవలసిన ప్రయోజనాన్ని పొందగలిగిందా? లేదు. అందుకని, తన అద్భుతమైన లీలచేత అటువంటి అనుభూతిని సాఠేకు ప్రసాదించి, హేమాద్పంతు ప్రక్కనుండగా అతనికి చెప్పాలనే బుద్ధిపుట్టించి చెప్పించారు బాబా. అలా చెప్పించబట్టి హేమాద్పంతుకు ఆరాటంకలిగింది. లేకుంటే గుడ్డెద్దు చేలోపడ్డట్లు చదువుతుండేవాడు. చదువుతుంటే ఫలితం వస్తుందిగదా అని అనుకుంటుండేవాడు. కాని ఈనాటికి తనకు ఫలితం కలుగ లేదే, ప్రక్క వాడికి కలిగిందే అని ఆరాటం బయల్దేరింది. అలా ఆరాటం కలిగిన తర్వాత అతనిని శ్యామావద్దకు పంపించారు. ఆ కథంతా చెప్పించారు. ఇందులో రెండు విషయాలున్నాయి. ఒకటి తీవ్రమైనటువంటి శ్రద్ధ లేకుండా అతని పారాయణ మందంగా సాగుతుండడం వల్ల అనుభవం రాలేదు అనేదానిని, నా కింకా కలుగలేదే, ప్రక్క వాడికి కలిగింది చూచావా? అనేటటువంటి ముల్లుగర్రతో పొడిచినట్లయింది. దానికోసం కోరిక తీవ్రమైంది. వెంటనే శ్యామా దగ్గరకు వెళ్ళి నప్పుడు సరిగ్గా అతనిమనస్సుకు సరిపోయేటటువంటి అనుభవం శ్యామాకు జ్ఞాపకంవచ్చి చెప్పడం జరిగింది. అదిగూడా హేమాద్పంతు, తాను నియమంగా

ముఖురాలను చేయడమెందుకు? ఆమెకేదైనా సమాధానం చెప్పరాదా"? అన్నాము. అప్పుడు బాబా ఆమెను పిలుచుకు రమ్మన్నారు. అప్పుడామెతో బాబా యిలా చెప్పారు : "అమ్మా! చెవిలో మంత్రం చెప్పడమనేది మా సాంప్రదాయం కాదు, నా గురువు బ్రహ్మనిష్ఠుడై అలా కూర్చునివుంటే ఆయనను తదేకంగా ధ్యానంచేసి చేసి నేనూ అలాగే అయిపోయాను. మా సాంప్రదాయం అదే. కాబట్టి నువ్వుగూడా చేతనైతే అలాగేచేసుకో. అంతేగాని చెవిలో ఉపదేశించడం మా మార్గంకాదు" అని చెప్పారు.

ఈ లీల మొత్తంచూస్తే ఏం తెలుస్తున్నది? హేమాద్పంతు 40 సం॥లుగా పారాయణ చేస్తూనే వున్నాడు. కాని అనుభూతిని పొందలేదు. ఎందుకని? ఇదీ మనం గమనించవలసిన విషయం. మనకు తెలిసినా తెలియకపోయినా ఫలితం తప్పకుండా వస్తూవుంటుంది. అనిమనం ఒకరకంగా సమాధాన పడతాము. ఒకరకంగా ఫలితం వస్తున్నమాటగూడ నిజమే. ఆ పారాయణ పూర్తికే కూర్చుని ఏవో పనికిరాని పనులుచేసి మనస్సంతా పనికిరాని ఆలోచనలతో బుర్ర పాడవకుండా చేస్తుంది. ఒకందుకు ఇది మంచిదే. అదీగాక ఎంత కొద్దిపాటి శ్రద్ధతో పారాయణ చేసినా కొద్దోగొప్పో ఆ విషయంమీద నిలుస్తుంది. అంతవరకూ మేలే. కాని నిజంగా పొందవలసిన ప్రయోజనాన్ని పొందగలిగిందా? లేదు. అందుకని, తన అద్భుతమైన లీలచేత అటువంటి అనుభూతిని సాఠేకు ప్రసాదించి, హేమాద్పంతు ప్రక్కనుండగా అతనికి చెప్పాలనే బుద్ధిపుట్టించి చెప్పించారు బాబా. అలా చెప్పించబట్టి హేమాద్పంతుకు ఆరాటంకలిగింది. లేకుంటే గుడ్డెద్దు చేలోపడ్డట్లు చదువుతుండేవాడు. చదువుతుంటే ఫలితం వస్తుందిగదా అని అనుకుంటుండేవాడు. కాని ఈనాటికి తనకు ఫలితం కలుగ లేదే, ప్రక్క వాడికి కలిగిందే అని ఆరాటం బయల్దేరింది. అలా ఆరాటం కలిగిన తర్వాత అతనిని శ్యామావద్దకు పంపించారు. ఆ కథంతా చెప్పించారు. ఇందులో రెండు విషయాలున్నాయి. ఒకటి తీవ్రమైనటువంటి శ్రద్ధ లేకుండా అతని పారాయణ మందంగా సాగుతుండడం వల్ల అనుభవం రాలేదు అనేదానిని. నా కింకా కలుగలేదే, ప్రక్క వాడికి కలిగింది చూచావా? అనేటటువంటి ముల్లుగ్రర్రతో పొడిచినట్టయింది. దానికోసం కోరిక తీవ్రమైంది. వెంటనే శ్యామా దగ్గరకు వెళ్ళి నప్పుడు సరిగ్గా అతనిమనస్సుకు సరిపోయేటటువంటి అనుభవం శ్యామాకు జ్ఞాపకంవచ్చి చెప్పడం జరిగింది. అదిగూడా హేమాద్పంతు, తాను నియమంగా

ప్రతిరోజూ చేసే ఏకనాథ భాగవత పారాయణ పూర్తయిన తర్వాత లభ్యమైంది. చూస్తే ఈ మొత్తంలో చక్కని కూర్పు వుంది.

రాధాబాయి గూర్చి శ్యామా చెప్పటం పూర్తవగానే హారతి సమయమవటంతో శ్యామా హేమాద్పంతులిరువురూ ద్వారకామాయికి చేరుకున్నారు. "నేను అడిగిన దక్షిణ తెచ్చావా?" అని బాబా హేమాద్పంతును అడిగారు. అందుకతడు శ్యామా తనవద్ద డబ్బులు లేవని చెప్పాడని, తన నమస్కారాలే దక్షిణగా సమర్పిస్తున్నానని చెప్పాడనీ హేమాద్పంతు చెప్పాడు. "సరే, కొద్దిసేపు అతనితో మాట్లాడి రమ్మన్నాను గదా! మాట్లాడి వచ్చావా? అక్కడ ఏంజరిగిందో చెప్పు" అనడిగారు బాబా. మశీదులోని భక్తులంతా కలిసి హారతి పాడుతున్నారు. బాబా ఆదేమీ పట్టించుకోకుండా ఆసనం మీదనుంచి ముందుకు జరిగి ముందుకువంగి, చెవిఒగ్గి, "చెప్పు వింటాను" అన్నారు. హేమాద్పంతు అక్కడ జరిగిందంతా చెప్పాడు. అంతావిన్న బాబా హేమాద్పంతు చేతిలో కలకండ పెట్టి, **"ఈ ఒక్కలీల గుర్తు పెట్టుకుంటేచాలు"** అన్నారు.

చూడండి! ఈ లీల ద్వారా బాబా ఎంత చక్కనిబోధ యిచ్చారో! "సాఠేకు అనుభవం వచ్చింది, నాకు రాలేదే! నాకు గుర్వనుగ్రహము, పరిపూర్ణత ఎలా లభిస్తుంది?" అని అతడనుకోగానే, 'ఇలా లభిస్తుంది' అని సమాధానం చక్కగా శ్యామా చేత చెప్పించారు బాబా. అదిగూడా అతనిమనస్సు దానికోసం తహతహలాడిన తర్వాతనే శ్యామాచేత చెప్పించారు. ఆ తహతహ కలగడానికి గల సూచనను గూడా ఆయనే యిచ్చారు.

ఈ మొత్తం చూస్తే - హేమాద్పంతుకు 40 సం॥లలోనూ అనుభవం కలగకపోవడము, సాఠేకు ఒక్కవారం పారాయణతోనే అనుభవము కలగడము, ఇది చూచిన హేమాద్పంతుకు లోపల తపన కలగడము వెంటనే తగినటువంటి అనుభవం కలగడము , ఇవన్నీ సరిగా మనం గమనించినట్లయితే మనకు సాయియొక్క అనుగ్రహంగాని, బోధగాని, ఎందుకు కలగడం లేదు? అని మనం తలచేటట్లయితే ఇందాకటి కారణమే మనకూ వర్తిస్తుంది. యాంత్రికమైనటువంటి, మాంద్యమైనటువంటి శ్రద్ధతో గూడిన పారాయణ, మనలోపల పాదుకుని వున్న లౌకికమైన భావాలు, అందుకు కారణమని తెలుస్తుంది. అంటే ఇహం వేరు, పరం వేరు గాబోలు. ఇది పరమైన దానికి సంబంధించిన విషయం కాబోలు మొదలైన భావాలవల్ల మనస్సు లగ్నమవదు. మనస్సు యింకా బలహీనమైన

ప్పుడు, పారాయణ మాత్రమే చాలదు కాబోలు, ఇంకా ముఖతః ఏమైనా కావాలి కాబోలు అనిపిస్తుంది.

పరీక్షకు వెళ్ళే ముందు కొంతమంది అతి ఆత్రంతో చదువుతారు చూచారా! ఇంకొక్కసారి పాఠం తిరగేస్తే, ఇంకొక్కసారి అని అనిపిస్తూంటుంది. ఇంకొక్కసారి తిరగెయ్యలేకపోయామే అన్నగిలివల్ల ఏవీ జ్ఞాపకం రాకుండా పోతాయి. ఆ తత్తరపాటు ఎక్కువైపోతుంది. దానిని వర్ణనిచెప్పడం కోసమే సబూరి అని బాబా చెప్పారు. ఈ తహతహవల్ల నీకు లభించిన దానిని గూడా సంతోషంగా అనుభవించలేకపోతున్నావు అని చెబుతున్నారు. అన్నీవుండి రేపు ఏమైపోతానో అన్న ఆందోళన వున్నవాడిలాగ అవుతుందన్నమాట. ఇప్పుడన్నీ వున్నాయి. రేపు ఎట్లా? అని ఒకనికి మానసికంగా భయం కలిగిందనుకోండి. లేకపోతే ఉన్నట్లుండి చచ్చిపోతానేమోన్న భయం కలిగిందనుకోండి. కొంత మందికి ఏ కారణమూ లేకుండానే అటువంటి భయం కలుగుతూ వుంటుంది. అందుకు ఏ కారణమూ వుండదు. ఎందుకోగాని చచ్చిపోతానని అనిపిస్తుం దన్నమాట. శరీరంలోపల ధాతువైషమ్యంచేత అలా కలుగుతుంది. కొన్ని సంఘటనవల్ల కూడా కలుగవచ్చు. నిష్కారణమైన భీతి కలుగుతుందన్నమాట. అప్పుడు అన్ని సుఖాలు వుండిగూడా వాళ్ళ ఆ ఆలోచననుంచి మరపించలేవు. పట్టు పరుపుమీద ఎ.సి. రూమ్‌లో పడుకుని భయంకరమైన కలగంటున్న వాడికి వలె వుంటుంది. వీడి పరిస్థితి గూడా అదే. వీడు సద్గురువు యొక్క సాన్నిధ్యంలో వున్నాడు. సద్గురువు యొక్క అనుగ్రహానికి కావలసిన పని చేసివున్నాడు. ఆయనవైపునుంచి హామీవున్నది. ఆయన యిచ్చిన హామీమీద నిలువలేక పోవడంచేత మాత్రమే వీడులోపల బాధపడుతున్నాడు.

శ్రీసాయి సశరీరులుగా వున్నప్పుడు సేవించినవారిలో ఒకాయన వ్రాశారు. సాయిసమాధి చెందినతర్వాత మొదట్లో కొంతకాలం ఎట్లాగబ్బా, మన కెవరున్నారు? అనిపించేదిట. ఆ సమయంలో అతనికి కొంతమంది గురువులు కబురుపంపేవారట. ఆధ్యాత్మిక వికాసానికి సశరీరులైన గురువు కావాలి. ఉప దేశం తప్పకుండా కావాలి అని కొంతమంది చెప్పేవారట. మహాత్ముడు శరీరంతో వున్నప్పుడు ఆ సాన్నిధ్యంలో వున్నప్పటి సంగతి వేరు, ఆయన శరీరంతో లేరు గనుక యిప్పుడు ఉపదేశం అవసరమని చెప్పేవారట. దీనికితోడు కొందరైతే మేము ఉపదేశం చేయడానికి సిద్ధంగా వున్నాము. నువ్వు వచ్చి ఉపదేశం తీసుకో

వలసింది అని కబురు గూడా చేసేవారట. అసలు బాబా వున్నప్పుడే చాలా మంది ఇలా మొదలు పెట్టారట - బాబా అంటే అన్నింటికీ అతీతులు, అంతటి గొప్ప మహాత్ములైన ఆయనిచ్చేది మనకు పొందే సామర్థ్యం వుండాలి గదా, కనుక మనకు ఉపదేశమనేది ఒకటి వుండవలసిందేనని చెప్ప డమేగాక, వేరే గురువుల వద్దకు కూడా వెళ్ళి మావాడొకడున్నాడు, వాడికి ఉపదేశం చెయ్యవలసిందని వాళ్ళను వేడుకోవడం, ఆ గురువులు తప్పక ఉపదేశం చేస్తాము వాడిని తీసుకు రమ్మనమని చెప్పడము యిలాజరిగేదట. అప్పుడు బాబాతో చెప్పుకుంటే ఉపదేశం అవసరం లేదు పొమ్మనేవారు. ఇక సమాధియైన తర్వాత ఇటువంటి గురువుల సంగతి యిలావుంటే, గొప్ప మహాత్ముల వద్దకు వెళ్ళినపుడు వాళ్ళేం చెప్పేవారంటే "నువ్వెందుకయ్యా మా దగ్గరకు వస్తావు. పూర్వపుణ్యంవల్ల నువ్వు అంతటి గొప్ప మహాత్ముణ్ణి ఆశ్రయించావు. మావంటివాళ్ళము ఆయనను ఆశ్రయిస్తుంటాము. నువ్వు హాయిగా ఆయననే సేవిస్తూ వుండు'' అనేవారు. ఇప్పుడేమవుతున్నదీ - వీడి తత్తరపాటువల్ల వీడి నిష్ఠ మాత్రమే చంచలమవుతున్నది తప్ప మరేమీ కాదు. "నా గురువు నాకే మంత్రమూ ఉపదేశించలేదు. నేను నా గురువును నిరంతరం ధ్యానించి యిలా అయ్యాను, మా సాంప్రదాయం వేరు, నువ్వూ ఆ మార్గమే అనుసరించు. అలాగే అవుతావు" అని చెప్పారు గదా!



అధ్యాయం-21



సత్త్వగుణ ప్రాధాన్యత

ఎవరు మనకు ఏం చెప్పినా మనకు జరుగవలసినది అనన్యచింతనే. అన్నింట్లో అందరిలో ఆయనే వున్నాడనే జ్ఞాపకం మనకు వుండేంతవరకూ అనన్య చింత కలుగదు. అనన్యచింత కలిగేలోపల రక్షిస్తానని యింతకు ముందు ఎవరూ అనలేదు, యికముందు అనబోరు, జరుగదు గూడా. అనన్యచింత కలగాలి, కలిగితేనే యోగక్షేమం వహిస్తానని గీతలో గీతాచార్యుడు చెప్పివున్నారు. ఎక్కడ ఏ రూపంలో ఏ రీతిన ఎవరు చెప్పినా అనన్యంగా నీవు శరణు పొందితేనే యోగ క్షేమాలు చూచుకుంటామని చెప్పి వున్నారు. అనన్యచింత కలుగడానికి ఈ ప్రపంచము, మాయ ఒప్పదు. ఎందువల్ల ఒప్పదంటే-అన్నీ వేరు, ఇది ప్రియము, ఇది అప్రియము, వీడు మిత్రుడు, వీడు శత్రువు, వీడు నా వాడు, వీడు పరాయి వాడు మొదలైన భావాలచేత అది బెడిసి కొడుతుంటుంది. దీనిని తెలుపడం కోసమే మన పెద్దవాళ్ళు ఆధ్యాత్మిక తత్త్వం మనస్సుకు రావడానికి పరమపద సోపానపటము (వైకుంఠపాళి) మొదలైన ఆటలద్వారా మనకు నేర్పేవాళ్ళు. ఆటలో గూడా ఆధ్యాత్మిక చింతనే. జీవితం ఏ సూత్రం మీద నడుస్తుంది అనేది అది ఆడుతుంటే తెలుస్తుంది. అందులో పావు నిచ్చెనెక్కి పైకి వెళ్తుంటుంది. ఉన్నట్లుండి పాము తగిలి క్రిందకు వస్తుంటుంది. కాబట్టి మనలో వుండేటటు వంటి భేదభావంవల్ల, ఆ భేదభావంవల్ల వచ్చేటటువంటి ద్వంద్వాది భావాలవల్ల, వాటివల్ల మనకుండే వివేక వైరాగ్యాలు కోల్పోయి, మనకు మళ్ళీ మొదటి కొచ్చే పరిస్థితి వస్తుందని పురాణ కథల వల్ల గూడా తెలుస్తూనే వుంది. ఒకడు తపస్సు చేస్తాడు, పైదాకా వెళ్తాడు. మళ్ళీ ఆగ్రహావేశాలతో ఎవరికో శాపంపెడతాడు. మళ్ళీ తపస్సు మొదటి కొస్తుంది. కాబట్టి సాయి చెప్పినటువంటి ఒకటి రెండు మాట లలో యావత్ ఆధ్యాత్మిక సాంప్రదాయమంతా - మర్రిచెట్టంతా ఒక గింజలో వున్నట్లు, లోకంలో వున్నదంతా యిమిడి వున్నది. కాబట్టి ఎవరు ఏమి ఉపదేశించి నప్పటికీ మళ్ళీ యింత గొడవా వున్నది. ఇది ఎప్పటికీ తీరేది కాదు. అయ్యేదీ కాదు. ఎందుకనంటే ఎవరన్నా ఉపదేశం చేసినా, ఆ ఉపదేశంలో వుండేటటు వంటి జపం చేసుకుంటూ పోతున్నప్పటికీ భగవద్గీతలోని మాట ప్రకారం రజోగుణ,

తమోగుణాలు నశించబడి సత్వగుణం మీదకు వచ్చినే తర్వాతనే ఫలిత మిస్తుంది. యజ్ఞము, దానము, తపస్సు, కర్మ - ఇవన్నీ గూడా త్రిగుణాలనను సరించి మూడురకాల శ్రద్దలు కలిగి వుంటాయి. అందుకని వాటి అనుష్ఠానం మూడు రకాలుగా, వాటి ఫలితాలు మూడురకాలుగా వుంటాయి. తమోగుణ ప్రధానమైన వాడికి ఈ విధమైన ఫలితం వస్తుంది, రజోగుణ ప్రధానమైన వాడికి ఈ విధంగా వస్తుంది, సత్వగుణ ప్రధానమైన వాడికి మాత్రమే సరియైన ఫలితమొస్తుందని గీతలో గీతాచార్యుడు ప్రతిచోట చెబుతూవచ్చాడు. మొట్టమొదటి మెట్టుక్రింద శీతోష్ణ సుఖదుఃఖాలను సమభావంతో చూడాలని గీతలో ముందుగానే చెబుతున్నాడు. ఈ సమభావం లేకపోవడానికి కారణం రజోగుణ, తమోగుణాలని చెప్పివున్నారు. కాబట్టి భగవద్గీతచూస్తే ద్వంద్వాలను అతిక్రమించినటువంటి, రజోగుణ, తమోగుణాలను అతిక్రమించినటువంటి సత్వగుణాన్నే ప్రధానంగా చెబుతున్నాడు. వాటిని అతిక్రమిస్తేనే యజ్ఞదాన తపః కర్మలు సరియైన ఫలితాన్ని ఇవ్వగలవని చెప్పి వున్నాడు. వాడు చేసినకర్మ సాత్విక మైతేనే సత్ఫలితాలనిస్తుందని చెబుతున్నాడు. కాబట్టి మళ్ళీదీనిలో యింతటి గొడవ వున్నదన్నమాట. ఉపదేశంగా తీసుకున్న మంత్రజపం సత్వ గుణం వుంటేనే సరియైన చోటుకు తీసుకుపోతుంది. సత్వగుణం వుండాలంటే మళ్ళీ మొదట చెప్పుకున్నట్లు చేయాలి. అది కుదిరిననాడు సాయి చెప్పినట్లు చేస్తే గూడా కుదురుతుంది. సత్వగుణ ప్రధానమైనప్పుడు ఏ సాధన చేసినా సరి పోతుంది. ఏ సాధనా చేయకపోయినా నిష్కామకర్మ చేసినా గూడా సరిపోతుంది అని దీనికి ఒక ఉదాహరణగూడా చెప్పారు. జనకాదులు నిష్కామకర్మద్వారా ఫలితాన్ని పొందా రని చెప్పారు. అందులో సందేహమేమీ లేదని ఖచ్చితంగా చెప్పారు. ఎందుకంటే కర్మ చేస్తూ వుంటే చివరకు కర్తయైనటువంటివాడు కర్మచేస్తున్నపుడు లోపల ఎలాంటి ప్రేరణ కలుగుతుందో చూస్తూ కర్మలు చేస్తూ వుండడం జరుగుతుంది. దీనిని మన నిత్య జీవితంలో మనంగూడా చూడవచ్చు. గారడీవాడు చేసినట్లు ఆరు బంతులు ప్రాక్టీస్ చేయడం మొదలు పెట్టామనుకోండి. ఆ బంతులు ఎగరేసినప్పుడు మన మనస్సు ఏం చేస్తుంటుందో చూస్తే తెలుస్తుంది. మనలోని ఎగరవేయగల సామర్ధ్యాన్ని చూస్తూ వుంటుంది. అలాగే ఏదైనా ఆటఆడేటప్పుడు మనం ఫామ్‌లోవుండి ఆడుతుంటే తెలుస్తుంది. అప్పుడు మనమనస్సు మనలో ఆటమీద వుండే సామర్థ్యం మీద కేంద్రీకరింపబడి వుంటుంది. దానిమీదకాక తక్కినవాటి మీదకు పోయినప్పుడు అప్పుడు ఏదోరకంగా మిస్అయి ప్రక్కకు

పోతాము. అట్లాగే నిష్కామకర్మ సక్రమంగా ఆచరించేవారికి కర్మకు ప్రేరణ లోపలనుంచి ఎక్కడ కలుగుతుందో, ఆ ప్రేరణకు కేంద్రం మీద మనస్సు నిలిచి యాంత్రికంగా చేతులు కదులుతాయి. అతి వేగంగా నృత్యం చేసేవాళ్ళకు గూడా ఈ విషయం అర్థమవుతుంది. ఎంతో కాలంగా, చాలా చక్కగా అభ్యసించిన మీదట ఆలోచించనక్కర లేకుండానే లయ, తాళాల ప్రకారం సరిగ్గా కదలికలు జరుగుతాయి. ఎక్కడన్నా పాటపాడేవాడు తప్పినాగాని, వీళ్ళ నృత్యాన్నిబట్టి వాడు సరిచేసుకునేటంత చక్కగా అడుగులు పడతాయి. అంత వేగంగా నృత్యం చేస్తున్నప్పుడు వాడి మనస్సు తర్వాత అడుగేమిటి? అని ఆలోచిస్తే అడుగు తప్పుతుంది.

అలాగే మనం రోడ్డుమీద నడుస్తున్నాము. సైకిల్ ఎదురుగుండా వచ్చింది. మామూలుగా ఎటో ఒకవైపు తప్పుకుంటాము. అలాగాక ఎటు తప్పుకోవాలా అని ఆలోచన వచ్చినపుడు వాడూ, మనమూ కంగారుపడి సైకిల్‌వచ్చి మనకు తగులుతుంది. ఏదైనా చిన్న కాలువ అడ్డువచ్చిందనుకోండి. నడుస్తూ నడుస్తూ అప్రయత్నంగా అవతల ప్రక్కకు ఒక్క గంతేసి అడుగువేస్తే ఫరవాలేదు గాని సందిగ్ధావస్థలో పడితే మాత్రం కాలవమధ్యలో కాలుపడుతుంది. కనుక వీటన్నింటిలోనూ మనకు తెలిసేదేమిటంటే - సక్రమంగా ఏ కార్యం నిర్వహించినా సరే మనస్సు ఆకార్యంలో వుండే వివిధమైనటువంటి వివరాలలో వుండే బదులు కార్యక్రమము, కర్త, కర్మలో ఐక్యత చెందడంలో కలిసివుంటుంది. ఇది బాగా గమనించవలసిన విషయం. చేయవలసిన కార్యము, చేసేటటువంటి కర్త రెండూ వేరుగా వుండడం మానేసి, జరుగుతుండేటటువంటి కర్మ అనేదాంట్లో లీనమై వుండడం జరుగుతుంది. అలాగే ఒకడు తన్మయత్వంతో పాటపాడు తున్నపుడు తాను వేరుగా, పాట వేరుగా, శ్రోతలు వేరుగా వుండడం మానేసి, మూడింటికీ కారణమైన రసానుభూతిని వాక్కురూపంలో దానిని వ్యక్తం చేయడానికి చూస్తూ వుంటాడు. నేర్చుకున్న అభ్యాసం ప్రకారం గానం సాగిపోతూ వుంటుంది. అపుడు తాను పారవశ్యం చెంది శ్రోతలను పారవశ్యం చెందిస్తాడు. కాబట్టి క్రీడలోగాని, నిత్య జీవితంలోగాని, సాధనలోగాని అదే అయినపుడు సాధనను యిటువంటి ఐక్యతలోనుంచి యివతలకు పడేసేవి ఆ రాగద్వేషాలే గనుక, ఆ రజోగుణ తమోగుణాలే గనుక, మనము ఏ అనుష్ఠానం చేసినా, ఏ సాధన చేసినా రక్తి కట్టడానికి వీలులేకుండా పోతుంది.

కొద్ది రోజులు టేబుల్ టెన్నిస్ నేర్చుకొని అది అర్థంగాక, అబ్బే! టేబుల్ టెన్నిస్ కష్టంగా వుంది గనుక క్రికెట్ నేర్చుకుంటానని, అది కొద్ది రోజులు నేర్చుకుని అక్కడ బంతి గట్టిగావుంది, దెబ్బ తగులుతుంది అని దానిని విడిచిపెట్టి - ఇలా ఒక ఆటలోనుండి యింకొక ఆటకు మారుతుంటే, అసలు ఏదీ రాదు. ఏది కుదరాలన్నా సూత్రం ఒకటే - ఒక ఆట కుదిరితే యింకొక ఆటగూడా కుదురుతుంది. అలాగే ఈ సాధనకంటే ఆ సాధన, ఈ నామంకంటే ఆనామం, ఈ బోధకంటే ఆ బోధ, ఈ గురువు కంటే ఆ గురువు - అనేవి ఏవీలేవు. జరుగవలసిన క్రియ ఒకటి వుంది. అది సక్రమంగా జరిగినపుడు మీకు సాత్వికమైన భావం ఎప్పుడైతే కలుగుతుందో, అప్పుడు ఒక్క దృష్టాంతం, ఒక్క అనుభవం కలిగినా హృదయ పరివర్తన కలుగుతుంది.

ఎన్ని సాధనలు చేసినా ప్రధానంగా మనలో జరగవలసినది సత్వగుణ ప్రధానంగా మనస్సులో మార్పురావడమే. మనలో ఈ మార్పు అంటే మనస్సు సత్వగుణ ప్రధానం కానంతవరకూ మనం చేసే ఏ సాధనయినా ఎటువంటి సత్ఫలితాలనివ్వడానికీ అవకాశం లేదు. అయితే ఒకడికి ఇటువంటి సత్వగుణ ప్రధానమైన సాధన ఎందుకు జరుగుతుంది? దీనికి కారణం అతనికి పూర్వ జన్మ సంస్కారానుసారంగా పాతఅకౌంట్ తాలూకు సత్వగుణ భావం వుంటుంది. ఈ సత్వగుణ భావంగూడా మామూలుగా అన్ని సమయాల్లోనూ ఒకే రీతిన వుండదు. ఒక్కొక్క సమయంలో ఎక్కువగానూ, మరొక సమయంలో తక్కువగానూ వుండవచ్చు. అందుకని కొంతమంది-చిన్నప్పుడు బాగా భక్తి శ్రద్ధలుండేవి, ఇప్పుడేమో కావాలనుకున్నా కలగడంలేదు అని ఒక్కొక్కరు బాధపడుతుంటారు. చిన్నప్పుడు ఏమీ తెలియని వయసులో గూడా భక్తి శ్రద్ధలతో చేసేవాడుంటాడు. మరొకడు ఒక సమయంలో ఏమీ పట్టకుండావుండి యింకొక్కప్పుడు తీవ్రంగా సాధన చేసేవాడుంటాడు.

వీటన్నింటికీ కారణం పూర్వజన్మలో వాడు చేసినటువంటి సాధన. పూర్వజన్మలో ఎవడు ఎంతెంతకాలం ఏవిధంగా ఏయేసాధనలను అభ్యసించి ఎప్పుడు దేనిని ఏ విధంగా వదలిపెట్టాడో దానినిబట్టి ఇప్పటి పరిస్థితి వుంటుంది. అట్లాగాక ఒకే స్థాయిలో వుండమని బాబా చెప్పారు. ఈ రోజు 90% భక్తిశ్రద్ధలు, రేపు నెయ్యిశాతం భక్తి శ్రద్ధలు పెట్టుకోకు. 30% పాడుగునా వుంచుకోవాలు అని ఆయన చెప్పారు. అదే నిష్ఠఅంటే. అదే సబూరి గూడా. 30శాతం ఎప్పుడూ

తగ్గకూడదు. 90శాతానికి హెచ్చకపోయినా ఫరవాలేదు. రోజా 30కి పడి పోకుండా వుంచుకో అని బాబా హెచ్చరిస్తున్నారు. కాబట్టి అట్టి సద్గురువును పొందడానికి మనకు యిటువంటి భావాలన్నీ ఆటంకమవుతున్నాయి. సద్గురుకృప అంటే పరమార్థానికి సంబంధించినది కాబోలు, మనం లౌకికులముగదా, మనవి లౌకిక సమస్యలుగదా అనే భావాలే అటంకమవుతున్నాయి. సమస్యలమీద ఎప్పుడైతే మనస్సు గట్టిగాపట్టుకుని వుంటుందో అప్పుడు మనస్సు తప్పకుండా ఒక స్థాయిలో వుంది అని అర్థం. నానాత్వమైన ప్రపంచము, మనుషులు వేరువేరు అనే అవగాహనతో ఆ స్థాయిలోనే నిలిచిపోయి వుంటుందని అర్థం. ఎప్పుడైతే అక్కడే నిలిచిపోతుందో, వెంటనే రాగద్వేష అసూయాది భావాలుగూడా వుంటాయి. దీనినే శాస్త్రాలలో పెద్దలు చెప్పారు. జాగ్రత్తగా ఒక సద్గుణాన్ని జయించినట్లయితే మిగిలిన సద్గుణాలన్నీ వాటంతట అవే వస్తాయి. అలాగే ఒక బలహీనతను వుండనిచ్చినట్లయితే తక్కిన బలహీనతలన్నీ వాటంతట అవే వస్తాయి అని రెండూ చెప్పారు. దానికి కారణమేమిటంటే బలహీనతలన్నీ ఒక స్థాయిలో వుంటాయి.

ఎట్లాగంటే ఉదాహరణకు ఇనుము వున్నదనుకోండి. అది లోహంగా వుండే స్థాయిలో ఎన్నో మలినాలు వుండవచ్చు. కాని అది కరిగే స్థాయికొచ్చినపుడు ఆ మలినాలన్నీ భస్మం కావలసిందే. ఇంకేదీ వుండడానికి వీలు లేదు. అలాగే మన మనస్సు ఒక స్థాయిలో వుండేటప్పుడు, అంటే మనలో వున్న బలహీనతలన్నీ వుండటానికి వీలుండే స్థాయిలో వున్నపుడు బలహీనతేగాదు, తక్కిన బలహీనతలన్నీ గూడా దాదాపు వుంటాయి. పరిస్థితుల గూర్చిన చింత దాదాపు ప్రతివారికీ వుంటుంది. కానీ ఆ చింత మరీ ఎక్కువై చివరకు సద్గురువు రెండింటినీ - (ఇహాన్ని, పరాన్ని) గూడా ప్రసాదించగలడనే విశ్వాసాన్ని గూడా ప్రక్కకు నొక్కినప్పుడు, రాగద్వేష అసూయ మమకారాలు గూడా అంత బలంగానూ వుంటాయి. ఇవన్నీ కలిసి సద్గురువుపైగల విశ్వాసాన్ని చెదరగొడతాయి. వీటి గురించే "వాడాలో దొంగలున్నారు జాగ్రత్త" అని బాబా చెప్పారు. కాబట్టి ఎటుతిరిగీ మనం కాపాడుకోవలసింది సద్గురువుపై గల విశ్వాసాన్నే.



అధ్యాయం-22



పూర్వకర్మ-సద్గురుకృప

శ్రీ సాయియే మనకు అద్భుతమైన అనుభవాన్నిచ్చి మనలో శ్రద్ధా భక్తులను ఎందుకు యినుమడింప జేయగూడదు? మనలో తీవ్ర ముముక్షుత్వం ఎందుకు కలిగించగూడదు? మన శ్రమకుతగ్గ ఫలితం ఆయన దగ్గరనుంచి ఎందుకు లభ్యంకాదు? అని అనేటట్లయితే లభ్యంకావడానికి నీ మనస్సు అందుకు ఉన్ముఖం కావాలి. ఈ సద్గురు సేవయింత గొప్పది. ఇహానికి, పరానికీ గూడ యింతకుమించి యింకొకటి లేదు అన్నగుర్తు వుండాలి. అది వివేకంతో మాత్రమే వస్తుంది, వివేకంతో ఆలోచిస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఏది జరిగినా మనకు కర్మ ప్రకారమన్నా జరగాలి, లేక భగవంతుని సంకల్పానుసారంగానన్నా జరగాలి. రెండూగాకుండా జరగడానికి వీలులేదు. రెండూ ఒకటే గదా అంటే రెండూ ఒకటిగాదు. ఒకటే ననుకుంటే, నాకీ సమస్య వచ్చింది. ఇది తీరాలి అనే ప్రశ్న ఉద్భవించదు. అందుకని మనకు మన అనుభవంలో మన మనస్సు ఏ స్థాయిలో వుంటుందో, అక్కడనుంచే నేను మాట్లాడుతున్నాను. ఒక కష్టమొచ్చినపుడు ఆ కష్టం తీరాలని మనమనుకుంటున్నపుడు అది తీరడానికి భగవంతుని అనుగ్రహం ప్రధానమా? కర్మ తీరడం ప్రధానమా? రెండూ ఒకటేననేటటువంటి వాడు అది కష్టమనీ, అది తీరడమనీ రెండూ అనడు. పరమాత్మమీద ప్రీతి వున్నప్పుడు నా ఆధ్యాత్మిక పరిపాకానికి యిది అవసరం కాబట్టే ఆయన యిచ్చి వుంటాడు గనుక వుంటేవుండనీ అనుకుంటాడు. ఒకవేళ ఏ కారణంగానైనా సరే ఉపవసించవలసి వస్తే, ఆయన అనుగ్రహమే అది గూడా అనుకుంటాడు. ఉపవసిస్తేమటుకు ఏమైంది? అనుకుంటాడు. కాస్త కష్టమైన సేవ చేయించుకుంటే అది మనలను శుద్ధి చేయడానికి అవసరం కాబోలు అనుకుంటాడు. అప్పుడు అది కష్టమని పించదు. ఈ విధంగా అనుకోగలిగినవాడి గురించి మనమనుకోనక్కరలేదు. కాని మామూలుగా మనకు ఎప్పుడైతే సమస్యలు నొక్కుతాయో అప్పుడు మన మనస్సు రెండింటిమధ్య వూగిసలాడుతుంది. మనం యింతకుముందే చెప్పు కున్నట్లు - ఈ సమస్య భగవంతుని అనుగ్రహంవల్ల తప్ప తీరేది కాదు. మన చేతుల్లో ఏమీ

లేదు. భగవంతుని అనుగ్రహంవల్ల మాత్రమే యిది తీరుతుంది అని భగవంతుని ఆరాధించడం మొదలుపెడతాము. కాని అది తీరిందా సరే, లేకపోతే ఆయనమీద కోపమొస్తుంది. ఇంత ప్రార్థన చేసినా ఆయన నాకేమీ చేయలేదు, కాబట్టి ఆయన లేడేమోననిపిస్తుంది. డబ్బాలో రాళ్ళువేస్తే ఎలా గల గలమంటుందో, అలాగే పరిస్థితులు వాడిని డబ్బాలో రాళ్ళువేసినట్లు గలగలలాడిస్తాయి. కాసేపు యిదని పిస్తాయి, కాసేపు అదనిపిస్తాయి. ఈ మనోవ్యాకులతచేత, చాంచల్యం చేత నిత్య జీవితంలో సాటి మనుషులపట్ల మనకుండే అనుబంధాలు గూడా చంచలమవు తాయి. చీటికీ మాటికీ కోపము, ద్వేషము కలుగుతాయి. ఉన్నట్లుండి ఒక్కసారి దిగులు కలుగు తుంది. ఇంకొకసారి నిస్పృహ, యింకొకసారి ధైర్యం కలుగుతూ వుంటుంది. ఈ విధంగా పరిస్థితులు గలగలలాడిస్తే బెదిరిపోయేటట్లయితే యిక వీడు ఎప్పటికి ఏ సాధననైనా ఎలా పట్టుకోగలడు? అందుకే బాబా 'సబూరీ' అని చెప్పారు. అయితే ఏమాశించి ఓర్పు వహించాలీ అంటే 'నేనున్నాను' అన్నారు. 'నాపై నీ దృష్టి నిలుపు, నీపై నాదృష్టి నిలుపుతాను. నువ్వు యిహ పరాల గురించి చింతపడవలసిన అవసరంలేదు' అని చెక్కురాసిచ్చారు. చాలా కష్టాలలో వున్న వాడొకడు బాబా దగ్గరకొస్తే బాబా అంటారు, "మొత్తం భగవంతునికి అర్పించి చూస్తూవుండు, ఆయన ఎలా రక్షిస్తారో నీకే తెలుస్తుంది" స్థిమితంగా వుండి చూస్తూ వుండు అన్నారు. ఈ అస్థిమితమంతా సరియైన అవగాహన లేకపోవడం వల్ల మాత్రమే వస్తున్నది.

భగవంతుని అనుగ్రహంవల్లనే కష్టాలు తొలగేటట్లయితే, భగవంతుడు మన కర్మను రద్దుచేయగలిగినట్లయితే, మనం సత్కర్మలు చేయాల్సిన అవసరం లేదుకదా! చెడు కర్మలుచేసి ఆ కర్మ బాధించకుండా చేసుకోవచ్చు. మనం చేసిన కర్మలు రద్దు చేయగలవాడు భగవంతుడు. అయితే కర్మలు ఎట్లాగంటే అట్లాచేసి చివరకు ప్రార్థన చేయగలిగితే చాలన్నమాట. అయితే ఇక్కడ ఒకటున్నది. అట్లా చేసిన చెడ్డకర్మలు భగవంతునిగూర్చి ప్రార్థనగూడా చేయనివ్వవు. కాబట్టి ప్రార్థించడానికి గూడా కర్మలు సరిగా వుండాలన్నమాట. అంటే ప్రార్థన చేయిం చేది నీకర్మలేనన్నమాట. అప్పుడు మళ్ళీ మొదటికే వచ్చాము. అప్పుడు కర్మే ప్రధానమనుకుని, మనం చేసిన కర్మల ఫలితాలనే యిప్పుడు అనుభవిస్తున్నా మనుకుని, అవి తీరేనాటికే తీరుతాయని ఓర్పుతోవుంటే సరిపోతుంది. లేదా

భగవంతుని ప్రార్థన చేయాలి. మనస్సు అటూ నిలువనీయదు, యిటూ నిలువనీయదు. ఇదే అవగాహన లోపించడమంటే. ఈ కంగారు ఏం చేస్తుందంటే యిది పరమార్థానికి మాత్రమే సంబంధించినది కాబలనుకుని జీవితంలో వుండే సమస్యల గురించి కర్తవ్య నిర్వహణకంటే మించినటువంటి అనావశ్యకమైన స్థాయి వరకూ వాటి గురించి చింతన చేసేలా చేస్తుంది. ఏ విషయం గురించైనా ఆలోచించవలసిందే, ఆలోచించి తన కర్తవ్యాన్ని నిర్వర్తించవలసిందే. మనమనేది లేకుండా పోయేదాకా కర్తవ్య నిర్వహణ చేయవలసిందే. అందులో అనుమానమే లేదు. కాని యిక్కడ జరిగేదేమిటంటే మనం చేయవలసిన కర్తవ్యమేమిటని ఆలోచించి నిర్ణయించుకుని ఆ కర్తవ్యం చేసిన తర్వాత గూడా దాని గురించి ఆలోచించడంవలన మనస్సు చంచలమై లక్ష్యం చెడిపోవడం తప్ప దానివల్ల జరిగేదేమీలేదు. అందుకని మనం చేయవలసినది పూర్తిచేసి బాబామీద దృష్టి వుంచి యిహపరాలకు రెండింటికీ ఆయన వున్నాడన్న అవగాహనతో ఆయనకు వదిలేసి వూరుకున్నామనుకోండి. మనస్సు అప్పుడు అంత చంచలమవడం మానేస్తుంది. మనస్సు చంచలమవడం మానేసినప్పుడు చింతపడడం మానేస్తుంది. చింతపడడం మానేస్తుంది గనుక ఆ స్థాయికుండే మనస్సుకుండే టటువంటి రాగద్వేషాది భావాలు ఎక్కువగా బాధించవు. ఒకప్పుడు మనం కష్టాలలో వున్న ఒకడికి సద్భావంతో సహాయంచేసి వుండవచ్చు. వాడీనాడు హాయిగా వుండివుండవచ్చు. మనకు సహాయం అవసరమైన సమయంలో వాడు సహాయం చేయకపోతే నేనప్పుడు వాడికి సహాయం చేసానుగదా, వాడు నాకేమీ సహాయం చేయడం లేదే అని మనస్సుకు కష్టం కలుగుతుంది. అప్పుడేమో వాడు ఋణానుబంధంవల్ల నాదగ్గరకు వచ్చాడు. మనం క్రిందటిజన్మలో ఋణపడ్డాము గనుక వాడికా సహాయం చేయాలని మనకు బుద్ధి పుట్టింది, యిచ్చాము, వాడు పొందాడు అని అనిపిస్తుంది. ఇప్పుడేమో ఈ మనోవేదనకు తట్టుకోలేక ఒకప్పుడు వాడికోసం మనమంతగా చేసాముగదా! మనం యిట్లా నలిగిపోతున్నామని తెలిసికూడా వాడెందుకు పట్టించుకోడు అనిపిస్తుంది. వాడిమీద కోపం వచ్చేస్తుంది. అంతేగాదు, అటువంటి కృతఘ్నులకే సహాయం లభిస్తుందేమిటి? భగవంతుని దృష్టిలో ఏమిటీ వైపరీత్యం? అని భగవంతుని మీద గూడా బాధ కలుగుతుంది. అట్లా అనుకుంటే ఏం జరుగుతుందో బాబా ఒకలీలద్వారా

తెలియజేసారు. అట్లా బాధపడుతూ ఠిక్కూభాయితెచ్చిన పూలమాలను, పండ్లను ఆయన తిరస్కరించారు. "దుఃఖంతో తెచ్చిన ఈ మాల నాకొద్దు, ఈ పండ్లు నేను స్వీకరించను" అన్నారు బాబా అందుకని తృప్తిగా వుండడము అవసరము. తృప్తిగా వున్నవాడు మాత్రమే నిశ్చలంగా వుండగలడు. మనకు ఆయన వున్నాడు, మనకు ఎప్పుడూ ఎందులోనూ లోటు జరగదు. ఏది అవసరమో అది చేస్తారు అన్న విశ్వాసం మనకు తృప్తి, నిశ్చలత వున్నప్పుడు మాత్రమే కలుగుతాయి. ఆ విశ్వాసం మనస్సులో స్థిరపడాలి. విశ్వాసం కలగాలంటే అప్పుడప్పుడన్నా అనుభవం కలుగుతుండాలి. అనుభవం కలగాలంటే సద్గురువు యొక్క అనుగ్రహము, సాన్నిధ్యము మాత్రమే ఇహ, పరాలు రెండింటికీ గూడ ఏకైక మార్గము అన్న సంగతి హృదయంలో ఎంతగా వుంటుందో, దానికోసం అంతగా తపన కలుగుతుంది. దానికోసం తపన ఎంతగా వుంటుందో, దాని పట్ల శ్రద్ధఅంతగా కలుగుతుంది. ఆ శ్రద్ధ ఎంత మేరకు వుంటుందో, అంత మేరకు అన్యవిషయాలపట్ల చాంచల్యం లేకుండా వుంటుంది. అందుకని నిష్ఠ, సబూరీలు అర్పించిన వాడవుతాడు. అప్పుడు ఆత్మసమర్పణ పూర్తవుతుంది.

ఆత్మసమర్పణ జరిగాక తాను చేసేదేమీలేదు గనుక ఆయనమీద దృష్టి పెట్టుకుని నిశ్చింతగా వుండగలుగుతాడు. అపుడు ఏది వచ్చినా చలించడు. ఆ విధంగా ఉష్ణాయుష్ణాలు లేకుండా నిష్ఠ, సబూరీలతో వున్నప్పుడు, తాను వేరుగా వుండకుండా ఆటలోవలె కర్త, కర్మ అనేది వేరుగా వుండక క్రియ అనేదాంట్లో ఐక్యంచెంది వుంటాడు. నిరంతరం ఆయన (బాబా) ధ్యాసలో వుండడం, నిరంతరం ఆయనను గుర్తుపెట్టుకుంటూ వుండడం అనే దాంట్లో తాను, జగత్తు, జీవితము అనేవి సమన్వయం చెందిపోతాయి. అప్పుడు ఏ అనుభవాలు వచ్చినా, పోయినా రైల్లో నిద్రపోయినవాడికివలె హాయిగా నిద్రపోతాడు. ఏయే స్టేషన్లు వస్తున్నాయో, కొండలొస్తున్నాయో, గుట్టలొస్తున్నాయో వాడికేమీ తెలియదు. హాయిగా రైలుతోపాటు వాడుగూడా ప్రయాణం చేస్తూ వుంటాడు. మెళకువ గా వుండి చింతపడేవాడు, తిట్టుకునేవాడూ గూడా ప్రయాణం చేస్తూనే వున్నారు. విసుగుపడేవాడూ ప్రయాణం చేస్తున్నాడు. దీనికేఒక ఉదాహరణ యింతకు ముందు ప్రస్తావించడం జరిగింది. రైలు ఎక్కుదామని ముగ్గురు వ్యక్తులు రైల్వే స్టేషన్‌కు వెళ్ళారు. రాత్రి 9గంటలకు బండి వెళ్ళిన తరువాత ఆ రైలు 4గంటలు

ఆలస్యంగా వస్తుందని తెలిసింది. ఆ ఊరు ఎలాంటిదంటే స్టేషన్‌నుంచీ యింటికి వెళ్ళాలంటే 3,4 మైళ్ళు జట్కామీద వెళ్ళాలి. వీళ్ళు ఎక్కివచ్చిన బండి తిరిగి వెళ్ళిపోయింది. కాబట్టి తిరిగి వెళ్ళడానికి బళ్ళు లేవు, సమయమూ చాలదూ కనుక అక్కడే కూర్చున్నారు. అప్పుడు ఆ ముగ్గురిలో ఒకడు - ఈ వెధవ రైళ్ళు యింతే, మన ప్రభుత్వం వచ్చాకయింతే. ఇదే బ్రిటీష్ వాళ్ళు వున్నప్పుడు ఎలా వుండేది, అంటూ తిట్టుకుంటూ కూర్చున్నాడు. ఇంకొకడు సంచిలోంచి డిటెక్టివ్ నవల తీసి హాయిగా చదువుకుంటూ కూర్చున్నాడు. మూడవవాడు, రైలెక్కిన తర్వాత మనకు నిల్చోవడానికి, కూర్చోవడానికి చోటుంటుందో వుండదో ఎందుకు గొడవ, రైలు వచ్చేలోగా కాస్త నిద్ర తీసేద్దామని ఎక్కడో ఒకచోట ఖాళీ చూసుకుని, ఒక కూలీకి గంటకొట్టగానే తనను లేపమని చెప్పి హాయిగా నిద్రపోయాడు. ఈ ముగ్గురిలో ఎవరు ఉత్తములు?

వీరిలో మొదటివాడు అనవసరమైన వాటిగూర్చి ఆలోచించి ఆలోచించి మనస్సును రొచ్చు రొచ్చు చేసుకుంటున్నాడు. రెండవవాడు కొంచెం మేలు. ఏదో ఒక కాలక్షేపంలో నిమగ్నమై, ఆ నాలుగు గంటలు తెలియకుండా గడిపేస్తున్నాడు. మూడవవాడు ఉత్తముడు. ఎందుకంటే రైలులో పడుకోవడానికి చోటులేపోయినా నిద్ర తూగడు. కథ చదువుకున్నవాడుగూడా తూగులాడు. అయితే యిక్కడ నిద్రపోవడమంటే ఏమిటంటే ఆయన యందున్నటువంటి విశ్వాసంయందు నిద్రించుట అని అర్థం. చేయవలసిన కర్తవ్యం అయిపోయింది. ఇక చేయవలసినదేమీ లేదు. ఏమి చేసినా యికబాబానే చేయాలి. ఆచేసే ఆయన నాకేది శ్రేయస్కరమో అదే చేస్తాడు అనే విశ్వాసంతో హాయిగా నిద్రించడమన్నమాట. లేకుంటే సంచలనము, గందరగోళముతప్ప ఏమీ మిగలదు. అసలుండవలసిన నిష్ఠ, సబూరీలు పోయి చేయవలసిన కర్తవ్యం గుర్తులేకుండాపోతుంది. ఏ ఒక్కటి చేస్తే రైటుగావడానికి వీలుందో, ఆ ఒక్కటీ మర్చిపోయేలా చేస్తుంది. దీనికంతటికీ మూలము ఎక్కడన్నమాట. అంటే మనం మొట్టమొదట ప్రారంభించిన చోటుకే వచ్చామన్నమాట. ఇహానికి, పరానికీ గూడా సద్గురువుయొక్క కృపతప్ప మరేమీ శరణ్యంకాదు అన్నదానికే వచ్చాము. ఎందుకనంటే కర్మను అట్టి మహాత్ములు మార్చిన సందర్భాలున్నాయి. గనుక మహాత్ముల చరిత్రలు చదువుతుంటే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. అక్కల్‌కోటస్వామి చరిత్ర చూస్తే ఆయన అలా

కర్మను మార్చిన సందర్భాలు వున్నాయి. అక్కల్‌కోటస్వామికి ఎంతోకాలంగా ఎంతో సేవచేస్తుండేవాడు ఒకడున్నాడు. ఒకరోజు స్వామి అతనిని పిలిచి, "ఒరేయ్! నీకు పిలుపు వస్తోంది, సిద్ధంగా వుండు" అని చెప్పారు. అంటే నీ టైమ్ అయిపోతున్నది. శరీరత్యాగం చేయడానికి మనస్సును సంసిద్ధంగా వుంచుకో అని చెప్పారన్నమాట. సాయిబాబాలాగానే వారినోటవెంట మాట వచ్చిందంటే ఏమాట వస్తే అది జరగవలసిందే. అయితే ఆయన తొందరగా ఏమీ అనేవారు గాదు. అన్నారంటే మటుకు జరిగితీరవలసినదే. స్వామి అన్నమాట అతనికి అర్థమైంది. అప్పుడతడు, "స్వామీ! నాకు చనిపోతానన్న భయంలేదు. ఈరోజు కాకపోతే రేపయినా చనిపోవలసిందే గదా! కాని నాకు ఒక్కటే భయం. మళ్ళీ మీలాంటి సద్గురువు యొక్క సేవ లభ్యమవుతుందోలేదోనని, అందుకోసమన్నా నాకు మరి కొంతకాలం మీసేవ చేసుకునే అవకాశమివ్వవలసింది అని ప్రాధేయపడ్డాడు. వీడలా అడగ్గా అడగ్గా స్వామికి కృప గలిగింది. "సరే, అట్లాగే పోరా" అన్నారు. వాడికా గండం గడిచింది. ఈ విషయం ప్రజలు చెప్పుకోవడం ప్రారంభించారు, వాడికి స్వామి ఆయుర్దాయమిచ్చారని. అది మరీ ఎక్కువయ్యేసరికి ఒకరోజు స్వామి అన్నారు : "ఒరేయ్! నీకు నేను కొత్తగా ఏమీ ఆయుర్దాయమివ్వలేదు. కాకపోతే నీకు ఈ జన్మలో 55సం॥లు వచ్చే జన్మలో 75సం॥లు బ్రతుకవలసి వున్నది. నేను వచ్చే జన్మలోని ఆయుర్దాయాన్ని యిప్పటికీ, ఇప్పటి ఆయుర్దాయాన్ని వచ్చే జన్మకూ మార్చాను అంతే. అయితే ఈ జీవితంలో ఎక్కువకాలం నా సేవ చేసుకుని పరిపక్వత చెందుతావు గనుక వచ్చే జన్మలో ఆ కాలాన్ని యింకా బాగా వినియోగించుకుంటావు. అందుకే నేనిలా చేసాను" అన్నారు. ఇలాంటిదే సాయి చరిత్రలో గూడా ఒక సంఘటన వున్నది. ఒకనికి ఎంతకాలానికీ మగ సంతానం కలుగకపోతే గాణ్గాపురం వెళ్ళి తనకు మగపిల్లవాడు కలిగితే గాణ్గాపురం తీసుకువస్తానని మొక్కుకున్నాడు. మగపిల్లవాడు కలిగాడు. కాని గాణ్గాపురానికి దర్శనానికి ఆ పిల్లవానిని తీసుకెళ్ళనేలేదు. ఇదిలా వుండగా అతడొకసారి ఏదో కారణంగా శిరిడీ వెళ్ళి సాయిని దర్శించాడు. అతనిని చూస్తూనే సాయి వుగ్రులై, "ఒరేయ్! నీ జాతకంలో మగపిల్లలు ఎక్కడున్నారురా, ఏదో గర్వపడుతున్నావే! నా రక్త మాంసాలు చీల్చి నీకు మగపిల్లవాడినిచ్చాను" అన్నారు. అంటే ఏమిటన్నమాట - వీడి రాతలో లేనిది వాళ్ళు ప్రసాదించడమున్నది సంభవమన్న

మాట. అయితే అది వాడికి శ్రేయస్కరమైనప్పుడు మాత్రమే ఆపని చేస్తారు. శ్రేయస్కరం కాకపోతే చేయరు. ఉదాహరణకు మన పిల్లవాడు సరిగా చదువు కోవడం లేదు. టీచరు అందుకని కొడుతుంటే, మా పిల్లవాణ్ణి కొట్టడానికి వీల్లేదని ఒకమాట చెప్పగలమా? ఎందుకని? అది వాడికి శ్రేయస్కరంకాదు గనుక. ఇదే అనవసరంగా మరొక పిల్లవాడు మన పిల్లవాడిని కొడుతున్నాడనుకోండి. అప్పుడు వెళ్ళి అడ్డుకుంటాము. అలా ఎందుకు చేస్తున్నామో ఆ తారతమ్యం తెలియాలి. ఆ పిల్లవాడు కొడుతుంటే అడ్డుకున్నాము. గనుక రోజూ టీచరు కొడుతుంటే అడ్డు కోరేమిటి? అని ఆ పిల్లవాడు అనుకుంటే ఎట్లా? డాక్టరు అవతలివాడికి తీయ మందు, నాకు చేదుమందు యిచ్చాడనుకుంటే ఎట్లా? వాడికొచ్చిన రోగం వీడికి వచ్చిందా? అందుకని విశ్వాసం వుండాలి. మనకవసరమైనది జరుగు తుంది అనే విశ్వాసం వుండాలి. దానికి ఏమిటి గుర్తు? దీనికి సాయి చరిత్రలో చాలా నిదర్శనాలు వున్నాయి. అన్నాచించినీకర్ అను భక్తుడు శిరిడీవచ్చి సాయి సన్నిధిలో వున్నాడు. అతని ఊరైన చించినీలో ప్లేగువ్యాపించింది. జనం విపరీతంగా చని పోతున్నారు. అందుకని ఊళ్ళో అందరూ ఊరువిడిచి వెళ్ళిపోతున్నారు. ఊళ్లో యితని భార్య, పిల్లవాడు మాత్రమే వున్నారు. బంధువులంతా గూడా వెళ్ళి పోయారు. ఆ సమయంలో బాబా ఇక్కడ అతనికేమీ చెప్పలేదు. తర్వాత అతనికి తెలిసి ఆందోళనతో అక్కడకు వెళ్ళాడు. అక్కడ అంతా బాగానే వుంది. ఆ సమయంలో బాబా అతని భార్యకు 10,12సార్లు భౌతికంగా దర్శనమిచ్చినట్లు తెలిసింది. అలాగే ఒకసారి మహల్సాపతి, శ్యామా, మరికొందరు భక్తులు బాబా దగ్గర కూర్చుని వున్నారు. అప్పుడు బాబా మహల్సాపతితో, "నీ భార్యకు మెడవాచి బాధపెడుతున్నది, తగ్గిపోతుందిలే" అన్నారు. తర్వాత కబురు వచ్చింది. అతని భార్యకు మెడవాచి, తర్వాత తగ్గిపోయిందని . అలాగే ఒకరోజు ఒక భక్తుడు ఒక ఉత్తరం తీసుకుని బాబా వద్దకు వచ్చాడు. వాడు ఆ ఉత్తరం తెరవనేలేదు. బాబా అన్నారు, "ఆమె నాలుగురోజులలో వస్తుందా!" అని. తీరా ఆ ఉత్తరం చదివేసరికి అందులో అతని భార్యకు జబ్బుచేసి సీరియస్‌గా వుందని తెలిసింది. అప్పుడతడు, "బాబా! ఆమెను తీసుకురమ్మంటారా?" అని అడిగాడు. అప్పుడు బాబా అన్నారు. "వద్దు నాలుగు రోజులలో ఆమేయిక్కడకు వస్తుంది, బాధపడకు" అన్నారు. నాలుగు రోజులలో ఆమె చనిపోయింది. ఆయన ఏం చెబుతున్నారంటే - పోవడమనేది తథ్యం, నా చెంతకు చేర్చుకోడానికి నేను పోనీ యిస్తున్నాను అంటున్నారు.

ఆమెకు జబ్బుగా వుందని వీడికి తెలియకముందే, రక్షించమని ఆయనను అడగక ముందే చెబుతున్నారు. ఆమెకు వీలైతే తగ్గించు, లేకపోతే నీ చెంతకు చేర్చుకో అని అడగడం వీడికి తెలుసా? కాని వీడు అడగకముందే ఆయనే చెబుతున్నారు. అందుకని అక్కడ చించినీలో వున్న తన భార్యాపిల్లలను రక్షించమని చించినీకర్ అడగాల్సిన అవసరం లేదు.

మహాల్సాపతి భార్యకు మెడమీద కురుపు లేచింది. అతడు తన భార్యను రక్షించమని అడగనవసరం లేకుండానే బాబా తగ్గించారు. అలాగే ఆ భక్తుని భార్య ఎలాగూ 4,5రోజులలో చనిపోతుంది. ఆమె సంగతి జాగ్రత్తగా చూడమని బాబాతో అతడు చెప్పవలసిన పనిలేదు. ఆమెను తనచెంతకు చేర్చుకోవడమనేది జరిగిపోతుంది. కాబట్టి ఆయనను ఏదీ అడగవలసిన పనిలేదు. మనకు సంబంధించిన సర్వమూ జరిగిపోతుంది. ఆయన మనలను సరిగా చూసుకోడేమోననే టటువంటి తపనవల్ల వున్నది కాస్తా పోగొట్టుకుంటాము, చెరువులో బిందె తల క్రిందులుగా వున్నట్లు. ఎలాగంటే బిందె చెఱువులో వున్నది. కానీ తలక్రిందులుగా వున్నది. చెఱువులో ఎంత నీరున్నా, బిందె లోపలకు రావడానికి ఆ నీరు ఎంత త్రోసుకున్నా సరే ఒక్కచుక్క నీటిని గూడా ఆ బిందె లోపలకు రానివ్వదు. అలాగే ఈ చపలత్వంవల్ల, ఆయన అన్నింటికీ మనకున్నాడనే విశ్వాసం లేక పోవడంవల్ల ఆయన రక్షణను మనం పొందలేము. ఉదాహరణకు ఒకతనికి జీవితంలో స్థిరం చిక్కలేదు. అప్పుడతని తండ్రి, "నీకు నేనున్నాను. నీకు స్థిరత్వం కలిగేవరకూ తిండి, గుడ్డ నేను చూసుకుంటాను. నీకేమీ ఫరవాలేదు"అని ఎంత చెప్పినా గూడా అతడు నమ్మలేక ఎంతో బాధపడుతున్నాడనుకోండి. అప్పుడా తండ్రి ఏమి చేయగలడు? అతని మనోవేదన తగ్గించడంగాని, అతనికి శాంతి కలగజేయడంగాని ఎలా వీలవుతుంది? తండ్రి యిచ్చినదానిని వాడు కాలదన్ను కోవడానికి సిద్ధంగా వున్నాడు. ఉదాహరణకు ఒక మొండిపిల్లవాడు తనకు ఏదో కావాలని అడిగాడు. ఇవ్వడం ఒక్కక్షణం ఆలస్యమైంది. వాడు అలిగి నాకు వద్దంటున్నాడు. పోనీలే అని తినడానికి నోట్లో పెట్టబోతే నాకక్కర్లేదని విసిరి పారేస్తున్నాడు. అప్పుడు వాడు వాడికి కావలసినది చేతికి వచ్చినాగాని అనుభవించలేని స్థితిలో వున్నాడన్నమాట.

అట్లాగే సాయియొక్క అనుగ్రహం వచ్చినాగాని అంగీకరించలేని స్థితిలో

వాడు వుంటాడు. చెఱువునిండా నీళ్ళున్నా సరే ఒక్క చుక్క గూడా నిరెక్కకుండా బిందె వుంటుంది. కనుక ఈ మొత్తానికి మూలమేమిటంటే ఇహానికి గాని, పరానికిగానీ సద్గురువుయొక్క అనుగ్రహాన్నిమించి యింకొకటి లేదు. అనుగ్రహానికి యివతల ప్రక్క నిలబడివుంటే ఏం జరుగుతుందంటే కర్మననుసరించి యథావిధిగా జరిగిపోతుంది. కర్మప్రకారం జరుగుతుందన్న విశ్వాసంమీద నిలబడినా చాలు. లేక భగవంతుని అనుగ్రహం వుంటుందన్న విశ్వాసంమీద నిలబడినా చాలు. దేనిమీదనైనా నిర్దుష్టమైన అభిప్రాయం వుండాలి. ఆత్మవంచన వుండకూడదు. 'ఆత్మవంచన' అని ఎందుకు చెబుతున్నానంటే ఎక్కడికక్కడ సమాధానం చెబుతూ వుంటాడు. ఆ సమాధానం సరిపోదని వాడికే తెలుస్తూ వుంటుంది. ఇదిగో యిది చేస్తే కష్టం తీరుతుందని చేస్తున్నాను అంటాడు, మరి ఆ కష్టం తీరలేదేమిటి అంటే కర్మ తీరలేదు. ఆ మాటకీ, ఈ మాటకీ పొంతన ఎక్కడుంది? అయితేవాడు ఇటువంటి భావనతోనే చేస్తున్నాడన్నమాట.

మనం యింతకుముందు దీనికి ఒక ఉదాహరణను గూడా చెప్పుకున్నాము. మనకు ఆర్థికంగా యిబ్బందివచ్చింది. ఒక తెలిసిన వ్యక్తి దగ్గరకు వెళ్ళాము. ఇబ్బంది చెప్పి అప్పుయివ్వమని అడిగాము. వాడు వెంటనే యిచ్చాడు. వీడు మంచివాడు. ఎప్పుడైనా అవసరమొస్తే వీడిదగ్గర కెళితే మంచిది అనుకొని రెండవసారి వెళ్ళాము. అప్పుడతడు వీడికి ఒకసారి యిచ్చేటప్పటికి మళ్ళీ తయారయ్యాడు. ఈ అలవాటు బాగాలేదు, అందుకని ఒకసారి లేదని చెబితే జాగ్రత్త నేర్చుకుంటాడని వీలు గాదని చెప్తాడు. అప్పుడు మనకు మూడవసారి అవసరమొచ్చినప్పుడు వాడి దగ్గరకు వెళ్ళవలసి వచ్చినపుడు మొదటిసారిలాగా యిస్తాడనుకుని వెళ్తామా? రెండవసారిలాగా యివ్వడనుకుని వెళ్తామా? అందుకని మూడవసారి వెళ్ళేటప్పుడు ద్వయీభావమొచ్చి యాభైశాతం ఆశతోను, యాభైశాతం నిరాశతోనూ వెళ్తాము. అలాగే మనం భగవంతుని కోరుకున్నది జరిగితే సంతోషం. ఒకప్పుడు జరగకపోతే అధైర్యం. ఈ ధైర్యాధైర్యాలు రెండూకలిసి పూర్ణంగా ధైర్యమూ గాకుండా, పూర్ణంగా అధైర్యమూగాకుండా నడిమధ్యలో నుంచుని కాల్చుకు తింటాయి. అసలు చేసే ప్రార్థన యాభైశాతమే అయితే ఇక ఫలితాన్ని ఆశించేందుకు ఎంత అవకాశముంటుంది? అట్లా అజ్ఞానంతో మనిషి ఏ పనిచేసినా, చేసిన పనియొక్క ప్రయోజనం గురించి ఆలోచించి క్రిందకు

దిగజార్చడమే దానియొక్క గుణం. ఇదీ మనం బాగా అర్థం చేసుకోవలసిన విషయం. అందుకని సరియైన అవగాహన వుండాలి అట్టి అవగాహనతో మనం ఏం చేసినా సరే, ఆ కార్యం నెరవేరకపోయినా పైకే తీసుకువెళుతుంది. బాగు పడినా అంతే.

ఉదాహరణకు లోకంలో మనం చూస్తూనే వుంటాము. మంచి స్వభావం కలవాడు ఒకడున్నాడు, వాడికి మంచిజరిగితే యింకా మంచివాడవుతాడు. వాడికి కష్టమొస్తే ఏం చేస్తాడంటే కష్టమంటే ఏమిటో ఇప్పుడు నాకుబాగా అర్థమైంది. ఇది పగవాడికి గూడా వద్దు అంటాడు. తను చూస్తుండగా ఆ కష్టం యింకొకడికి రాకుండా చూడాలని తాపత్రయపడతాడు. సుఖమొస్తే నలుగురితో పంచుకుంటాడు. అదే దుష్టుడైతే, వాడికి కష్టమొచ్చిందంటే, నేనొక్కడినే ఎందుకు కష్టపడాలి, అవతలివాడు ఎందుకు సుఖపడాలి అని యథాశక్తి అవతలివాడికి బాధలు కలిగించడానికి ప్రయత్నిస్తుంటాడు. అలాగాక కలిసొచ్చిందంటే అది పెట్టి అందరిమీదా మరీ జులుంచేసి, అందరినీ నానాహింసలూ పెడతాడు. దుష్టస్వభావం గలవాడికి సుఖమొచ్చినా కష్టమే, దుఃఖమొచ్చినా కష్టమే. మంచి వాడికి సుఖమొచ్చినా, దుఃఖమొచ్చినా మంచిగానే వుంటాడు. సరియైన అవగాహన ఎప్పుడైతే వున్నదో, అప్పుడు కష్టమొచ్చినా, సుఖమొచ్చినా వాడి సాధన మెరుగవుతూవుంటుంది. అట్టి అవగాహన ఎప్పుడైతే వుండదో, కష్టమొచ్చినా, సుఖమొచ్చినా క్రిందకే లాక్కొడుతూ వుంటుంది. పూజ చేసినా, ఏం చేసినా భగవంతుని కృప వస్తుందో లేదోనని సగం విశ్వాసంతోనే జరుగుతుంది. తీరా ఆ పని నెరవేరినపుడు నేను చేసిన ప్రార్థనవల్ల తీరిందా? లేక నా కర్మ తీరడం వల్ల తీరిందా? అని అనుమానం వస్తుంది. అపుడు కృతజ్ఞత పూర్తిగా వుండడానికి వీలుగాదు. అందుకని స్పష్టమైన అవగాహన వుండాలి. ప్రార్థన చేసావు, కష్టం తొలగింది. ప్రార్థన చేసినందువల్ల జరిగిందని చెప్పు. అయితే ప్రార్థన చేసినందువల్లే జరిగింది, లేకపోతే నా కర్మవల్లనే తీరిందని చెప్పాలి. ఏదో ఒకమాట మీద నిలబడగలగాలి. అందుకని అవగాహనతో గూడిన ప్రార్థన అయితే ఏమవుతుందంటే, స్పష్టంగా తెలుస్తుంది. మన కర్తవ్యం మనం నెరవేర్చాము, మామూలుగా యిది మన కర్మప్రకారం జరిగిపోతుంది, దీని గూర్చి ఆలోచించడం దండగఅని. దీనిగూర్చి ఆలోచించేబదులు సద్గురువుమీద మనస్సు నిలిపితే ఆయన మన కర్మను తగు రీతిన మార్చగలడు. మార్పు అవసరమైతే

చేస్తాడు, లేకపోతే లేదు అనిపిస్తుంది.

ఆయన మనకు అవసరమైనది చేస్తాడు అన్న అవగాహనతో చేసిన వాడు సుఖమొచ్చినపుడు వుత్సాహపడడు, దుఃఖమొచ్చినపుడు నిరుత్సాహ పడడు. ఆయన ఏమి చేసినా కారణముంటుందని వాడికి తెలుసు. అందుకని కష్ట మొచ్చినాసరే, ఇది మనకవసరం కాబట్టి ఆయన పట్టించుకోలేదు. కాబట్టి యిది వస్తే వచ్చింది, మనలో ఎటువంటి మార్పురావడం కోసం ఆయన యిలా చేసారో నని అనుకోగలుగుతాడు. కష్టమొచ్చినా, సుఖమొచ్చినా అలాగే తీసుకోగలుగు తాడు. కాబట్టి అతడు సాత్త్వికస్థితిలో నిలుస్తున్నాడు గనుక సద్గురువు యందు వాడి భావం గూడా సాత్వికమైన స్థాయిలో నిలుస్తోంది. అందుకని సత్త్వప్రధాన మైనటువంటి భక్తిఎలా రక్తి కడుతుందో, అలాగే అతడు చేసేటటువంటి జపం గూడ సత్త్వగుణ ప్రధానమవుతుంది. అందుకని అతడు చేసే దానం సత్త్వగుణ ప్రధానమవుతుంది. అలాగే కర్మగూడా సత్వగుణ ప్రధానమవుతుంది. అతని శ్రద్ధయావత్తూ సత్వగుణ ప్రధానం ఎప్పుడైతే అయిందో సత్ఫలితాన్ని యిస్తుంది. కాబట్టి యిహ పరాలకు యింతకుమించి చేసేదేమీ లేదు. మార్పు ఏమైనా చేయగలవాడు సద్గురువు మాత్రమే. ఆయన మనకు అవసరమైనపుడు తగిన మార్పు చేస్తాడు. ఆయన చేయలేకపోయిన తర్వాత యిక చేయగలవాడు ముల్లోకాలలోనూ ఎవడూ లేడు. ఒకవేళ దయగలిగి ఎవరైనా అలాచేయగల వాడు వుంటే అలాచేస్తే అంతకంటే చెరువు యింకొకటి లేదు. ఈ విషయం బాగా గమనించాలి.

ఉదాహరణకు, యింతమంది దేవతలలో ఒక దేవతను కొలిచాము. అనుకున్నది కాలేదు, మరొక దేవతను కొలిస్తే అయింది. లౌకికంగా చూస్తే పైసాయెత్తు లాభం కలిగినట్లు అనిపిస్తుందిగాని, అధ్యాత్మికంగా ఆలోచిస్తే నీడి మనస్సు ఎంతటి చాంచల్యానికి దారితీస్తుందో తెలుస్తుంది. అప్పటి నుంచి ఆలోచ నలు వేరుగా రావడం మొదలుపెడతాయన్నమాట. ఈ కష్టమొస్తే ఈ దేవతను కొలిస్తే సరిపోతుంది. ఇంకొక కష్టమొస్తే మరొక దేవతను కొలిస్తే సరి పోతుంది. ఈ కష్టానికి జపంచేస్తే సరిపోతుంది, యిలా మనసులో ఆలోచనలు పెరగడం మొదలుపెడతాయన్న మాట. అంటే అప్పుడేమవుతున్నదంటే అసలైన ప్రయోజనంపోయింది. అవసరమైతే మన కర్మనుగూడా తప్పించడానికి

అవకాశమున్నటువంటి సామర్థ్యాన్ని కలిగివున్నటువంటి సద్గురువు యొక్క చేతిని గట్టిగా పట్టుకోడానికి వీలులేకుండా పోయింది. ఇది మనకు గురుచరిత్ర చదివితే చక్కగా తెలుస్తుంది. దీపకుడు గురువు దగ్గరకు వచ్చి, వ్యాధి తగ్గించమంటారా? అని అడిగితే, "నాకేమీ అవసరం లేదు. నాకర్మను నేను అనుభవిస్తాను, నాకు సేవ చేయలేక అడుగుతున్నావా?" అంటారు గురువు. మనిషికి వుండవలసిన బాధ్యతను ఆయన చెప్పారు. ఇదే సాయి చరిత్రలో గూడా వస్తుంది. 'ఎప్పుడూ నా చెంతన మీరుండాలి' అని ఒక భక్తుడు కోరినప్పుడు సరేనని వరమిచ్చారు సాయి. 'అయితే యింకేమీ అక్కర్లేదా?' అంటే అక్కర్లేదన్నాడు. ఒకప్పుడతని కొడుకు చచ్చిపోయాడు. చనిపోయిన బిడ్డను ఒళ్ళోపెట్టుకుని కూర్చున్నాడతడు. భార్య శోకిస్తున్నది. అతనూ కొంత బాధ పడుతున్నాడు. అప్పుడు సాయి దర్శనమిచ్చి, "కావాలంటే నీ బిడ్డను బ్రతికిస్తాను, కాని నీకు నాకూ యింతటితో ఎటువంటి సంబంధమూ లేదు. నువ్వు ఆ కోరిక కోరకపోతే, నీచెంతనే ఎప్పుడూ వుంటాను. నీకేది కావాలో తేల్చుకో!" అన్నారు. అప్పుడతడు, "మీరెప్పుడూ నాచెంత నుండడమే నాకు కావాలి" అన్నాడు. ఒకవేళ అప్పుడతడు ఏదో ఒక దేవతకు పూజ గాని, శాంతిగాని, మరేదైనా గాని చేస్తే దానివల్ల ఆ పిల్లవాడు బ్రతికాడను కోండి. అప్పుడు బాబా షరతు ఏం కావాలి? ఆ దేవతను ఆశ్రయిస్తే ఆ దేవత కరుణించింది. మరి బాబా వాడికిచ్చిన వరం అలాగే వుంటుందిగదా! అంటే అలా ఏమీ కుదరదు. అక్కడ ఆ దేవతకు చేసిన ప్రార్థన సాయికి చేసినట్లే లెక్క. అక్కడ సాయికిచ్చిన మాట ఎగ్గొడితే యిక్కడ ఎగ్గొట్టినట్లే లెక్క. కాబట్టి అక్కడ ఏది అడిగినా యిక్కడ అడిగినట్లే. ఒకసారి హృదయంలో ఆకోరిక ప్రారంభించాక ముల్లోకాలలో ఎక్కడికిపోయి ఎవరిదగ్గర వ్యక్తం చేసుకున్నా ఈయన దగ్గర వ్యక్తం చేసుకున్నట్లే. ఉదాహరణకు ఒకనిని అన్నం పెడతాను రమ్మని పిలిస్తే బిడియానికి పోయి వద్దని చెప్పి, బయటకువెళ్ళి పక్కింటికి పోయి ఒక ముద్ద తినివచ్చినట్లుం టుంది. అట్లా చేయడమెందుకు? అడగడమో, ఏడవడమో, మొరబెట్టుకోవడమో యిక్కడే చేస్తే సరిపోలా? అప్పుడు ఆయన పెట్టకపోతే ఎట్లా? అంటే ఎందుకు పెట్టడంలేదో ఆలోచించు. అందుకని విశ్వాసం వుండాలి. ఈ విషయం తెలియ జెప్పడంకోసమే గురుచరిత్రలో ఆ కథ వున్నది. అక్కడకు శివుడు, బ్రహ్మ, విష్ణువు ముగ్గురూ వచ్చారు. నీకిష్టమొచ్చిన వరం కోరుకోమన్నారు. ఏమీ అక్కర్లేదన్నా

రాయన. అదీ మనిషికుండవలసిన లక్షణం. అలాచేస్తే మరి లౌకికంగా కష్టం గదా! అంటే మరి ఈ ధ్యాస, ఈ అవగాహన కుదరకపోతే జన్మ పరంపరలో వుండే కష్టాలు అలాగే వుండిపోతాయి గదా! పరీక్షముందు కాస్త గట్టిగా కష్టపడి పాఠాలు చదువుకునేవాడికి తర్వాత యావజ్జీవితము ఏమీ కష్టం లేకుండా పోతుందిగాని, ఎప్పటికప్పుడే పరీక్ష కష్టమనుకుని చదవకుండా ఎగ్గొట్టే వాడికి జీవితమంతా పరీక్షలే. ఇందులో ఏది బాగుంటుంది? అందుకనే పడేకష్టమేదో ఒక్కసారే పడితే సరిపోతుంది. ఇలా అనుకునే నిబ్బరమే నిష్ఠ, ఓరిమిలంటే. మళ్ళీ మొదటికే వచ్చాము. ఇహానికి, పరానికీ గూడా సాయి వున్నారు. ఇంకదేనికోసమూ ఎవరినీ ఏమీ కోరనవ సరంలేదు. "మన కర్తవ్యం మనం చేసి, గురువుకు సర్వసమర్పణ చేసుకోవాలి" అనే అవగాహనతో సాయి బయల్దేరారు గనుకనే ఆయనకు గురువు దొరికారు. ఆయన అట్టి గురువును పొందగలిగారు. ఆయన తమకు గురువు లభించిన కథ చెబుతూ "మేము నలుగురం కలిసివెళ్ళాము" అని చెప్పారు. భగవంతుని చేరుకునే మార్గాలగూర్చి వారిమధ్య చర్చ జరిగినపుడు మిగతావాళ్ళు చెప్పిన మార్గానికీ, సాయి చెప్పిన దానికీ తేడా యిదే-మన కర్తవ్యం మనం నిర్వర్తించి తను,మన,ధనాలను గురువుకర్పించాలని ఆయన బయల్దేరడంతోనే ఆయన అవగాహన సరియైనది. తక్కినవాళ్ళు అది కాదంటున్నారు. మనలను మనమే ఉద్ధరించుకోవాలి, నిత్యానిత్య వివేకంతో మనం ఆలోచించుకోవాలి అంటున్నారు వాళ్ళు. కాని నిత్యానిత్య వివేకముయొక్క ఆలోచన ఎట్లాగో తెలియాలంటే గురుముఖత: వినాలని శాస్త్రంలోవున్న సంగతి వాళ్ళకు తెలియదు. వాళ్ళు చెప్పినవన్నీ జరగాలన్నా గురుముఖత: వాడు తెలిసికొని గురువుయందు విశ్వాసం కలిగి వుంటేనే అన్నీ ఫలిస్తాయి.

ఎవరికైనా సరే, నిత్యానిత్య వివేకము అంత తేలికగా చేతనవదు. ఒకవేళ ఎప్పుడో ఒకప్పుడు కొద్దిగా వివేకము కలిగినా అది అంత తేలికగా నిలవదు. దానిమీద నిలవగలగడానికి గురువుయొక్క సాన్నిధ్యము, అనుగ్రహము వుంటే గాని అది సాధ్యపడదు. ఈ సంగతి సాయికి ఒక్కరికే తెలుసుగాని, ఆయనతో పాటు బయల్దేరిన ఆ ముగ్గురికీ తెలియదు. తను మనోధనాలు ఎప్పుడైతే సమర్పించామో, నిత్యానిత్య వివేకజ్ఞానాన్ని ఆయనే ప్రసాదిస్తారు. అనన్యచింతన ఆయనే కలిగిస్తారు. నడచుకోవడానికి కావలసిన ధర్మాలు ఆయనే తెలియ

జేస్తారు. ఇహానికి, పరానికీ అవసరమైనవన్నీ ఆయనే చూసుకుంటారు. అందుకని షడ్శాస్త్రాలూ అక్కర్లేదు, సాధనసంపత్తి అక్కర్లేదు. ఆ రెండింటినీ గూడా గుర్వనుగ్రహమే యిస్తుంది. భగవద్గీతలో బుద్ధియోగంలో శ్రీకృష్ణుడుగూడా నేనే వాడికి యిచ్చాను అని చెప్పారు. అక్కడ కృష్ణుడు చెప్పినట్లే యిక్కడ సాయిగూడ మనకు చెబుతున్నారు. అయితే దీనినంతటినీ మనం పొందగలగాలంటే అది ఎంతటిదో, ఇహానికి, పరానికీగూడ ఎంత శ్రేష్ఠమైనదో మనకు తెలియాలి. అది మన మనస్సుకు వచ్చినప్పుడు ఎంతటి క్లిష్టపరిస్థితులలోనైనా మనమనస్సు చలనంలేకుండా అదే ఒక్క సూత్రంమీద, అదే ఒక్కమాటమీద నిలుస్తుంది. అలా నిలిచినపుడు మనకేచింతా అవసరంలేదు. అన్నీ ఆయనే చూసుకుంటారు.



అధ్యాయం-23

మన కర్తవ్యము



క్రిందటి అధ్యాయంలో చెప్పిన విధంగా శ్రీ సాయిపట్ల ఆర్తి అవగాహనను మనం మళ్ళీ మళ్ళీ చింతన చేసుకుంటుంటే, అటువంటి అనుగ్రహం కోసం మన మనస్సులో తపన కలుగుతుంది. గనుక శ్రద్ధ నిలుస్తుంది. శ్రద్ధ నిలుస్తుంది గనుక ఫలితం లభిస్తుంది. అప్పుడు తలక్రిందులుగా చెరువులో వున్న బింబె పైకి తిరగడం నేర్చుకుంటుంది. లేకపోతే సాయినాథుని సాన్నిధ్యంలో వున్నప్పటికీ, శిరిడీలోనే నివసిస్తున్నప్పటికీ ఎక్కడెక్కడి చింతలో వాడిని పట్టుకుని వదలవు. శిరిడీలో వున్న వాళ్ళందరూ అనన్య భక్తులు కాదు గదా! ఖాపర్డే తన డైరీలో వ్రాసుకున్నాడు. ఖాపర్డే గొడవ ఎప్పుడూ ఒకటే-శిరిడీకి అతడు ఎప్పుడు వెళ్ళినా సాయి తనను యింటికి వెళ్ళనివ్వడని బాధపడుతుండేవాడు. అతడు శిరిడీలో వున్నాడనేగాని ఎప్పుడెప్పుడు యింటికి పోదామా అనే ధ్యానతోనే వుండేవాడు. అతడు డైరీలో వ్రాసుకున్నాడు: 'ఈరోజు గూడా సాయి ఇంటికి వెళ్ళడానికి అనుమతించక పోయేసరికి నిరుత్సాహంతో తిరిగి వచ్చాను అని, నిరుత్సాహంతో అడగడం మానుకున్నాను' అని. అంటే సంతోషంతో గాదు మానుకున్నది. ఇంటికి పంపించలేదనే అతని బాధ. అయితే అతనిది తప్పు అని నేననడంలేదు. అతనికి ఎంతటి అదృష్టం లేకపోతే ఆయన సన్నిధిలో వుండగలుగుతాడు? ఎన్నెన్ని జన్మలుగా లోపలవున్న అజ్ఞానాన్ని కురుపులోని రసిని పిండేసినట్లు ఆయన పిండుతున్నాడు. కాబట్టి అవన్నీ బయటకు వచ్చి వ్యక్తమవుతున్నాయి. కాని ఎంతటి అదృష్టం లేకపోతే అతడు ఆయన సన్నిధిలో, ఆయన సేవలో గడపగలుగుతాడు? పైకి రసి కనిపిస్తుంది గాబట్టి అతనిని తక్కువవాడని అనుకోడానికి వీలులేదు. అతడు అసలు డాక్టరు దగ్గరకు వెళ్ళగలిగాడు. లోపలవున్న చీమునంతటినీ పిండివేయించుకుంటు న్నాడు. అందుకని అతడు మనకంటే ఎంతో మెరుగు. అందుకని మొదట మనలోపల సద్గురుని అనుగ్రహం పొందాలనే తపనవుడుతుంది. అందుకని దానియందు శ్రద్ధ అవసరం. ఆ శ్రద్ధలేకుండా కూడా ఈ కార్యక్రమాలన్నీ చేయ వచ్చు, శ్రద్ధతోనూ చేయ వచ్చు. శ్రద్ధకు అవగాహన అవసరం.

ఇట్టి అవగాహనకు కావలసినదంతా గూడా ఆయన బోధలో వున్నది. ఆయన లీలలలోనూ, మాటలలోనూ గూడా వున్నది. వాటిని ఎంతమేరకు మనస్సులో తీవ్రంగా మననం చేయగలుగుతామో, అంత మేరకు అవగాహన కలుగుతుంది. అవగాహన కలిగినపుడు ఆయన చెప్పిన వాటి మీద శ్రద్ధ కలుగుతుంది. ఆయన తమ లీలలద్వారా రక్షణమాత్రమే గాక బోధగూడ చేస్తూ వచ్చారు. కాని అందరూ ఆయన చేసిన లీలలలోని రక్షణ మాత్రమే చూస్తున్నారు గాని, దానిలో వుండే బోధను గ్రహించలేక పోతున్నారు. లేకపోతే ఆయన లీలలు ఎన్నోసార్లు అనుభవమయ్యాక గూడ మనకు పైకి వెళ్ళడానికి మరేదైనా కావలసి వస్తుందేమోనన్న కొరత లోపల ఎందుకు కలుగుతుంది? కాబట్టి ఈ లీలద్వారా ఆయన చెబుతున్నదేమిటి? అనేది మనం బాగా ఆకళింపు చేసుకోడానికి తగిన చింతన చేయాలి. సాయి తమచరిత్ర వ్రాయడానికి హేమాద్పంతుకు అనుమతిస్తూ "ఈ లీలలగూర్చి లోతుగా, అనన్యంగా ఎవరైతే చింతన చేస్తారో వారికి ఎనలేనటువంటి ఆధ్యాత్మిక రత్నాలు దొరుకుతాయి"అన్నారు.

కాబట్టి సాయి ఈ లీలల గురించి చింతన చేయమంటున్నారు. బ్రహ్మ సూత్రాల అర్థం గురించి ఏ విధంగానైతే ఆలోచిస్తున్నారో, భగవద్గీత యొక్క శ్లోకాలకు వ్యాఖ్యానమెట్లాగా అని ఏవిధంగానైతే ఆలోచిస్తున్నారో, అలాగే ఈ లీలల గూర్చి గూడ ఆలోచించాలి. అలా ఆలోచించినకొద్దీ యింకా యింకా లోతుగా అర్థమవుతూనే వుంటాయి. తద్వారా మన అవగాహన మారుతుంది. తద్వారా మన మనస్సు స్థిరమవుతుంది. తద్వారా మనస్సు ఆయన కృపకోసం, అనుగ్రహం కోసం నిరీక్షిస్తూ వుంటుంది. సాయి చరిత్రలో కాలూ అనే పిల్లవాడు ఇదే చెప్పాడు. ఒకతనికి బిడ్డలులేరు. బాబా దగ్గర కొచ్చి సంతానం కావాలని అడిగితే, బాబా కొబ్బరికాయ ప్రసాదంగా యిచ్చారు. ఆ ప్రసాదమిస్తూ ఆయన కళ్ళ వెంబడి బొటాబొటా కన్నీరు కార్చారు. తర్వాత అతనికి ఒక పిల్లవాడు కలిగాడు. ఆ పిల్లవాడు గొప్ప సంస్కారవంతుడు. చిన్నప్పటి నుంచి గూడా ఎప్పుడూ చిన్న చిన్న చీటీలమీద నామరచన చేస్తుండేవాడు. ఎప్పుడూ తలమీద గుడ్డ కప్పుకుని కదలకుండా కూర్చుని వుండేవాడు. ఒక రోజు తండ్రి చూచి, యిట్లా కూర్చున్నాడేమిటని తలమీద గుడ్డ తీసిచూస్తే కనుగుడ్లు రెండూ పైకి త్రిప్పి కూర్చుని వున్నాడు. ఏమిటిలా కూర్చున్నావని అడిగితే అలా కూర్చుంటే బాబా నాకు కనిపిస్తారు అని చెప్పాడు. వాడు పుట్టిన తర్వాత బాబాను అసలు చూడలేదు. బాబా నీకెట్లా తెలుసు అంటే నాకు తెలుసు కాని నేను చెప్పను

అన్నాడు. కాని తండ్రికి నమ్మకం కుదరలేదు. తర్వాత ఒకరోజు 'హిజ్ మాస్టర్స్ వాయిస్' గ్రామ్‌ఫోన్ రికార్డు ప్రకటన చూస్తున్నాడు. తండ్రిని చూచి యిదేమిటని అడిగాడు. ఇది 'హిజ్ మాస్టర్స్ వాయిస్' అనే కంపెనీవారి గ్రామ్‌ఫోన్ రికార్డు. దానిమీద వున్నది వారి ప్రకటన లాలూకు కుక్కబొమ్మ అన్నాడు. ఆ పిల్లవాడు అది కాదన్నాడు. మరి ఏమిటిది అంటే 'ఆ కుక్క ఆ గ్రామ్‌ఫోన్ రికార్డులోంచి వచ్చే తన యజమాని గొంతును ఎంత శ్రద్ధగా వింటుందో చూడు!' అన్నాడు. అట్లా మనము గూడా శ్రద్ధగా కూర్చుని వినగలిగితే సాయి మాటలు గూడ మనం కూర్చున్నచోటనే వినవచ్చునన్నాడు. ఆ పిల్లవాడు ఏ విధంగా మందలిస్తున్నాడో చూచారా! కనబడే బొమ్మ ద్వారా సాయిమాట వినబడుతున్నది - నువ్వేమైనా వింటున్నావా? అంటున్నాడు. హిజ్‌మాస్టర్స్ వాయిస్‌వారి ప్రకటన ద్వారా వాడికి సాయిబాబా యొక్క బోధ అందుతున్నది. కాని అతని తండ్రికి మాత్రము ప్రకటనమాత్రమే కనబడుతున్నది.

ఆ కాలూ చెప్పిన బోధలన్నీ యిప్పుడు మనం చెప్పుకున్న సాయి సూక్తులలో వున్నాయి కాబట్టి దానియందు అంతటి ఏకాగ్రత వుండాలి. ఏకాగ్రత వుండాలంటే శ్రద్ధ వుండాలి. శ్రద్ధ వుండాలంటే అవగాహన వుండాలి. అవగాహన అంటే ఏమిటంటే యిహ, పరాల రెండింటిలోనూ మనిషి సంపూర్ణంగా దుఃఖ నివృత్తిని పొందాలి. అందుకు సద్గురు కృపను సంపూర్ణంగా పొందాలి. సద్గురువంటే సకలదేవతా స్వరూపి. ఆయన యొక్క ఆశీస్సులు వుంటే అందరియొక్క ఆశీస్సులూ వుంటాయి అన్న విషయాన్ని గుర్తుపెట్టుకుని సద్గురువుపట్ల విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. ఇది వేరు, అది వేరు అనుకుని వేరు వేరు దేవతలను ఆరాధించవలసిన అవసరం లేదని 'గురుగీత' చెబుతుంది.

ఆ విషయాన్నే సాయినాథుని యొక్క భక్తుల అనుభవాలు చెబుతున్నాయి. భగవద్గీత గూడ "ఈ దేవతలందరూ వేరువేరని తలచి వారిని సేవించేవారందరూ చనిపోయిన తర్వాత ఆ దేవతాలోకాలలో వుండి, ఆ కర్మఫలం పూర్తవగానే మళ్ళీ భూలోకంలో జన్మిస్తారు. కనుక ఆయా దేవతలందరూ ఎవరి యొక్క రూపాలో, అట్టి పురుషోత్తముని ఎప్పుడైతే ధ్యానిస్తావో, అప్పుడు మళ్ళీ వెనుకకు తిరిగిరాని మార్గంలో వెళ్తావు. అలాగాక యివన్నీ వేరువేరనే భావంలో వుండి ఒక్కొక్క దానికోసం ఒక్కొక్క దేవతను ఉపాసిస్తే అక్కడిదాకా వెళ్ళి తిరిగివస్తావు" అని చెబుతుంది. కాబట్టి ఆర్షవాణి చూసుకున్నా అదే మాట

చెబుతుంది. ఆధునిక వాణిగూడ ఆదేమాట చెబుతున్నది. ఎందుకంటే అది సనాతనమైనది గనుక. అది నిత్య నూతనముగూడ గనుక. అది అన్నింటికంటే ప్రాచీనము, అన్నింటి కంటే నూతనము. అదే సూత్రాన్ని అనేకసార్లు మన పెద్దలు మనకు అందజేస్తూ వచ్చారు. అదే సూత్రం సాయినాథునివద్ద మనకు లభ్యమవుతూ వున్నది. కాబట్టి మనం సద్గురుకృపను పొందగలందులకు ప్రయత్నం చేయాలి. అందుకు మన కర్తవ్యాన్ని మనం క్షుణ్ణంగా నిర్వర్తించడము, మన కవసరమైనది ఆయన చేస్తారు, కనుక మనం వేరే ఏపీ చేసుకోవలసిన పనిలేదు అన్న విషయాన్ని గుర్తుపెట్టుకుని, అందరిలో ఆయన వున్నాడన్న భావంతో వైషమ్యా లకు అనవసరమైనటు వంటి భావాలకు హృదయంలో తావివ్వక, అందరిలో ఆయన వున్నాడన్న భావాన్ని నిలుపుకోధానికి ప్రయత్నం చేయడము - ఇదీ మన కర్తవ్యము, యిదే నిష్ఠ, యిదే సబూరీ, యిదే విశ్వాసమంటే. "ఇట్టి విశ్వాసంలో నిలిచి నేను కృతార్థుడనయ్యాను"అని గుండెమీద చెయ్యి వేసుకుని ఆయన ఖచ్చితంగా చెబుతున్నారు గనుక మనకు అంతకంటే సులభమైన మార్గం యింకొకటి లేదు. అట్టి విశ్వాసంతో వున్నవాడికి ఎప్పుడూ పరిస్థితుల రూపంలో నేనే వుండి ఎక్కడ ఏ సర్దుబాటు కావాలన్నా చేస్తున్నాను, ఎప్పుడు ఏ బోధ కావాలో అది ఇస్తున్నాను. ఇవన్నీ నిన్ను కృతార్థుడిని చేస్తాయి అని సాయి చెబుతున్నారు. ఎవరికైతే సాయి యొక్క రక్షణ, సాయి ఆశీస్సులు వున్నాయో, సాయి సకల సాధుస్వరూపి కనుక సాధువులందరి అనుగ్రహమూ ఆయన నాశ్రయించిన వారికి వుంటుంది. ఆయన సకలదేవతాస్వరూపి గనుక సకల దేవతల అనుగ్రహమూ వుంటుంది.

ఈ విషయం మరిచి దేవతల అనుగ్రహం కోసం పరుగెత్తితే రైల్వే మంత్రిగారి కొడుకు రైలులో టిక్కెట్టు పోగొట్టుకున్నట్లు వుంటుంది. ఏం లాభం? అందులో పనిచేస్తున్న వాడికి వీడు ఫలానా అని వీణ్ణి చూస్తే తెలిసేటటువంటి పరిచయం వుండాలి. లేకపోతే ఫలానా అని తెలియకుండానే ఎలా వదిలేస్తారు? లేకపోతే గడుగ్గాయి అయిన ప్రతివాడూ పట్టుబడినప్పుడు విడిచిపెట్టాలని అలానే సమాధానం చెబుతాడు. అందుకని అధికారులు అతడు నిజంగా మంత్రి కొడుకు అవునోకాదో తేల్చుకోవాలి. నిజంగా అతడు ఆ డిపార్టుమెంటుకు అధిపతే కావచ్చు, కాని వీడి సంగతి వాళ్ళు తెలుసుకోవాలి గదా! కాని రైల్లోవుండి టిక్కెట్టు పోగొట్టుకోవడమనేది క్లిష్ట పరిస్థితే. ఎంతమందిని

ప్రతిమాలుకున్నాగాని పైవాడి అనుగ్రహం అటునుంచి రావాలి.

అలాగే సద్గురువుపట్ల గూడా సరియైన అవగాహనతో వున్నప్పుడు మనస్సు ఆత్మనిష్ఠలో నిలుస్తుంది. అన్నింటిలో ఆయన వున్నాడన్న సంగతి పూర్తిగా మనస్సుకు వచ్చినప్పుడు అది ఆ స్థాయిలో నిలుస్తుంది. అప్పుడు మనం వేరే కోరవలసిన అవసరం వుండదు. ఆయన చెప్పిన దానిని మనం ఆచరించిన వారమవుతాము. ఇదే వారిబోధలోని చరమదశ. అప్పుడు ఆత్మ సమర్పణ మనేది ఆరంభమైనదని అర్థం. ఆ తర్వాత మనము, ఆయన అనేది వేరుగా లేకుండా పోయి మనం ఆయనవలె అయిపోయినప్పుడు ఆత్మ సమర్పణ పూర్తవుతుంది. దీనికి మన కర్తవ్యం మనం నెరవేర్చడము, అన్నింటికీ ఆయనే వున్నాడు, కనుక జరుగవలసినది జరిగి తీరుతుంది, అవసరమైన మార్పు ఆయనే చేస్తాడు, అవసరమైన అనుభవాలను యిస్తాడు అని ఇతర ఆలోచనలు పెట్టుకోకుండా ఆయననే గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించడమే మన కర్తవ్యము. మరి నిరంతరం ఆయనను గుర్తుపెట్టుకోవాలంటే కూర్చుని అహర్నిశలూ ఆయన ధ్యానలో నిలువలేము గనుక. అలా నిలువగలిగే లోపల యింతకు ముందు మనం చెప్పుకున్నట్లు ఎప్పుడూ ఆయన గురించి మాట్లాడడము, ఎప్పుడూ ఆయన గురించే వినడము, సూక్తులు గురించి, లీలల గురించి వివరించుకోవడం, ఆయన గురించి చదవడము, నామ స్మరణచేయడము - యిలా ఆయన చుట్టూనే మన మనస్సును నిలుపుతుండాలి. మనలో ఎప్పుడన్నా మానవ సహజంగా తలెత్తినటువంటి వికారభావాలేవైనా వుంటే అందరిలో ఆయన వున్నాడనేటువంటి ఆయనిచ్చిన అనుభవాలతో వాటిని చెదరగొట్టుకోవాలి. ఎప్పుడైనా పరిస్థితుల వత్తిడి మన మనస్సుకు రావడంచేత, ఈ కష్ట మొచ్చిందే, ఎట్లాగబ్బా! బాబా చూస్తే పట్టించుకోవడంలేదు, యింకేదైనా చేద్దామా! అన్న ఆలోచన వస్తే ఈ వివేచనతో, మననం చేసుకుంటూ మనస్సుకు హితవు చెప్పుకుంటూ పోవాలి. ఇదంతా గూడా మనం ఆయన చెప్పినదానిని అమలులో పెట్టుకోడానికి చేసే ప్రయత్నమే గనుక యిది మనస్సు యొక్క చాంచల్యం క్రిందకు రాదు. మనస్సుకు స్థిరత్వం కలగడం కోసం మనం చేసే కృషి క్రిందకు వస్తుంది. ఉదాహరణకు రోడ్డు బాగుచేయాలంటే అప్పుడు వున్న రోడ్డును పగుల గొడ్తున్నారు. అప్పుడు రిక్షాగాని, సైకిల్‌గాని మరేదైనా గాని వెళ్ళడానికి వీల్లేకుండా వుంటుంది. అట్లాగని మనం కంగారుపడితే ఎట్లా? రోడ్డు వేశాక చూస్తే ఎంత బాగుంటుంది! అలాగే మన ఈ ఆలోచనలు, ఈ గందర

గోళాలు సర్దుకోవడానికి మనం చేసే యత్నమే ఆయన గురించి మాట్లాడ డము, సత్సంగం చేయడము, చరిత్ర వినడము మొదలైనవన్నీ.

ఆయన చెప్పిన సూక్తిని గుర్తుపెట్టుకోవడం కోసం యావచ్ఛక్తినీ వినియోగించడమంటే యిదే. అందుకే సాయిచెప్పిన నాన్హేఘాట్ దున్నపోతునెక్కి దాటడంకంటే కష్టమంటే యిదే. అంటే అక్కడినుంచి పడకుండా చూసుకోవాలి గదా! పడితే ఏమవుతుంది? ఇక మధ్యలో ఎక్కడా ఆగడమంటూ వుండదు. అందుకేగదా దున్నపోతుమీద ఎక్కింది. అలాగే ఈ దృష్టిలో నుంచి నువ్వు పడబోకు, ఎక్కడాఆగకు, నడుములు హూనమయినా పర్వాలేదు, కాళ్ళు నొప్పులు పుట్టినా ఫర్వాలేదు. మధ్యలో తొడలన్నీ తిమ్మిర్లుపట్టినా పర్వాలేదు. కూర్చుని వదలిపెట్టడం మాత్రం చేయకు. జారడం మాత్రం చేయకు. ఓర్చుకో, చివరకు గమ్యం చేరుతావు. అలాగాకపోతే అట్టడుగుకు చేరుతావు. అప్పుడు నువ్వు వుంటావో లేదో గూడ తెలియదు. అందుకని యిందులో మనం ఎంత శ్రమ చేసినా ఫర్వాలేదు. ఎన్నిరకాల ఆలోచించినా పర్వాలేదు. ఎన్నిరకాల కార్యక్రమాలు పెట్టుకున్నా ఫర్వాలేదు. అవన్నీ గూడా అవగాహన కలగడానికి, మనస్సు ఏకముఖం కావడానికిచేసే ప్రయత్నంలో భాగమే గనుక అది మనస్సును వారి కర్పించడమే అవుతుంది. మన కర్తవ్యాన్ని నిర్వర్తించి పూర్తిగా ఆయనను శరణాగతి చెందడమంటే యిదే. మనసులో వారిని గూర్చి ఆలోచించి భావాన్ని నిలుపుకుంటున్నాము. శరీరంతో ఆ రూపానికి పూజ చేస్తున్నాము. ఇలా అన్ని విధాలా వారిమీద దృష్టినిలపడం కోసం మనం చేసే యత్నంలో ఆత్మ సమర్పణ మనేది ఆరంభమైంది. ఐక్యత అనేది చరమదశ. ధ్యానంలో ఎటువంటి భావాలూ రాకుండా సర్వత్రా ఆయనే వున్నాడనేటటువంటి చరమదశ వచ్చినప్పుడు ఆత్మ సమర్పణ పూర్తవుతుంది. దీనినిబట్టి మనం ఆరంభదశలోనే వున్నామనే చెప్పుకోవలసి వుంటుంది. ఆయనకు శరణాగతి చెందేటటువంటి అదృష్టాన్ని అందరికీ ప్రసాదించమని సాయినాథుని ప్రార్థిస్తున్నాను.



అధ్యాయం-24

సద్గురుసామర్థ్యము



మానవుడు శరీరంతో పనిచేయగలడు, వాక్కుతో పనిచేయగలడు, మనస్సుతో పనిచేయగలడు. మనస్సు, వాక్కు, శరీరం - ఇవి త్రికరణాలు. ఎప్పుడైతే ఈ మూడింటితో ఒకే పనిని చేస్తాడో, అప్పుడు ఆ పని చాలా బలవత్తరమవుతుంది. ఉదాహరణకు ఒక పిల్లవాడు తండ్రి తంతాడేమోనని పైకి పాఠం చదువుతున్నాడు. కానీ లోపల మాత్రం స్నేహితుడు షికారుకు వెళ్తున్నాడే అని ఆలోచిస్తుంటాడు కాబట్టి మనస్సు ఒక పని చేస్తుంటే వాక్కు మరొక పని చేస్తున్నది. అలాగే ఉదాహరణకు ఒకడు క్రింద నేలమీద రాస్తూగాని, చాప పుల్లలు లాగుతూగాని చదువుతున్నాడనుకోండి. వాడి ధ్యాస చదువుమీద కేంద్రీకరణ కాలేదని అర్థం. కాబట్టి శరీరం ఒక పని, మనస్సు ఒక పని చేస్తే అదిసరియైనది కాదు. ఏ పని చేయవలసి వచ్చినా మనస్సు, వాక్కు, శరీరం ఒకే పని చేయాలి. అలాగే ధర్మాచరణ గూడ ఈ మూడింటితో చేయాలి. ధర్మబద్ధమైన తలంపు వుండాలి. ధర్మబద్ధమైన మాట వుండాలి. ధర్మబద్ధమైన చేత వుండాలి. దీనిని 'త్రికరణశుద్ధి' అంటారు. కాబట్టి ఎవడైతే త్రికరణశుద్ధిగా దేనినైనా చేస్తాడో అతడు తపస్సు చేసినా త్రికరణశుద్ధిగా వుంటుంది. లౌకిక వ్యవహారం చేసినా త్రికరణశుద్ధిగా వుంటుంది. ధర్మ బద్ధంగా వుంటుంది. ఇలా దీక్షగా, ధర్మబద్ధంగా ఎవడైతే చేస్తుంటాడో, కొంతకాలం తర్వాత ఎప్పుడైనా వాడి నోటి నుండి మాట పొరపాటుగా వచ్చినట్లయితే, జరగడానికి వీల్లేని మాట వాడినోటి వెంబడి వచ్చినట్లైతే ప్రకృతిలో నున్న శక్తులన్నీ కలిసి దానిని నిజం చేస్తాయి. ఉదాహరణకు: గురుచరిత్రలో ఒక గృహిణి ఒక మహాత్మునికి నమస్కరిస్తుంది. వెంటనే ఆయన, "నీకు పుత్రపౌత్రాభివృద్ధిరస్తు" అని ఆశీర్వదిస్తారు. అప్పుడామె, 'నాభర్త మరణించాడు, నేను సహగమనం చేయాలనుకొని ఎవరో చెప్పగా మీ దర్శనం చేసుకుని, మీ ఆశీర్వచనం, అనుమతి తీసుకుని వెళ్దామని వచ్చాను' అన్నది. అప్పుడాయన, "ఏనుగు నోటి నుంచి పెరిగిన దంతం వెనుకకు ఎలా వెళ్ళదో, అలాగే నానోటినుండి వెలువడినమాట వెనుకకు తీసుకోవడానికి వీలు లేదు. కనుక ఆమె భర్త శవాన్ని తీసుకురమ్మని" చెప్పారు. ఆయన ఆజ్ఞప్రకారం

శవాన్ని తీసుకువచ్చారు. అప్పుడాయన తన కమండలంలోని నీరు ఆ శవం మీద చల్లేసరికి అతడు తిరిగి జీవించాడు.

అలా ఎందుకు జరుగుతుందంటే, ప్రాణం పోతున్నాసరే త్రికరణ శుద్ధిగా ఆలోచిస్తాడు, మాట్లాడుతాడు, పనిచేస్తాడు గనుక అటువంటివాడి నోటి వెంట ఏ మాటైనా వచ్చిందంటే అది తప్పక జరిగితీరుతుంది. తను అన్నదాని కోసం, జరగడానికోసం తపస్సు చేయనవసరంలేదు, ధ్యానం చేయనవసరం లేదు. అందుకని త్రికరణాలు కలిసి పనిచేసేదానికి అంతటి బలం వుంటుంది. మామూలుగా మనం చేసే పూజలో త్రికరణాలు వుండవు గనుక నిదర్శనాలు అంత తొందరగా రావు. మనకేదో కొన్ని యిబ్బందులు వున్నాయి. బాబా మన లను వాటినుంచి కడతేర్చి బయటపడేయాలి. దానికోసం పూజ చేస్తున్నాము. కొంత కాలం పూజ చేసినా నిదర్శనమేమీ రాలేదు. అప్పుడు మనము యిన్నాళ్ళ నుండి పూజ చేస్తున్నా నిదర్శనమెందుకు కలగలేదు? అనుకుంటాము. ఎందుకు కలగడం లేదంటే మనం పూజ చేసేటప్పుడు మనస్సు అందులో లగ్నం కావడం లేదన్నమాట. నోరు మంత్రం చెబుతుంది. కాని మనస్సు దేనిగురించో ఆలో చిస్తుంది. అలాగే చేయి పూలు వేస్తుంటుంది, నోరు మాత్రం మరొకపని చేసుకు పోతుంటుంది. చేతితో పువ్వు వేస్తూ, ఏమేవ్! దొడ్డితలుపు వేసుకో అని అంటుం టాడు యిక్కడ కూర్చుని. అప్పుడు దానికి బలం చేకూరదు. ఒకసారి ఒకవేళ చేకూరితే వందసార్లు చేకూరకుండా పోతుంది. మనం సాయిచరిత్ర చదువు కున్నాము. అందువలన ఆయనమీద శ్రద్ధాభావం, భక్తిభావం ఏర్పడ్డాయి. ఈ భావం మనస్సులో వుంటే చాలా? వాక్కు రూపంలోనూ, క్రియారూపం లోనూ వుండాలా? ఇదీ ప్రశ్న. అంటే మన కాయన మీద భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి. ఈ ఏర్పడ్డ భక్తి శ్రద్ధలు కేవలం మన మనస్సులో భావం రూపంలో వుంటే చాలా, వాక్కు రూపంలోనూ గూడా వుండాలా? మనస్సులో వుంటే చాలదా? భజన చేయాలా? పూజ చేయాలా? అని కొంతమంది అంటారు.

ఉదాహరణకు నేనొక కాలేజీలో పనిచేస్తున్నాను. నాతోకూడా ఒకతను లెక్చరర్ పని చేస్తున్నాడు. అతడు చాలా భాగ్యవంతుల యింట్లో పుట్టాడు. అతని నందరూ బంగారుపిచ్చుక అనేవారు. అతని తండ్రి ధనవంతుడైనా నిరాడం బరుడు. సేద్యం తప్పిస్తే మరేమీ తెలియదు. ఆయన ఒకసారి కొడుకు కోసం ఆ కాలేజీకి వచ్చాడు. ఆయన ఆ కాలేజీ పిల్లలతో మా అబ్బాయి ఎక్కడ? అని

అడుగుతున్నాడే తప్ప, అతని పేరు సరిగ్గా చెప్పాలనిగూడా తెలియనంత అమాయకుడు. అందుకని ఆ పిల్లలంతా వాళ్ళ అబ్బాయి కాలేజీలో చదువుకుంటున్నాడు కాబోలు, అతని కోసం వెతుక్కుంటున్నాడని అనుకున్నారు. ఆయన ఎప్పుడూ అంతకుముందు అక్కడికి రాకపోవడంవల్ల సాటి లెక్చరర్లకు కూడా ఆయన ఫలానా అని తెలియదు. అప్పుడాయన కొడుకు ఆయనను దూరం నుంచి చూచాడు. తండ్రి ఆ విధమైన వేషభాషలతో కాలేజీకి రావడం భరించలేకపోయాడు. నామోషీపడ్డాడు. గబగబా దగ్గరకు వెళ్ళి మాట్లాడుతూ దూరంగా తీసుకుని వెళ్ళాడు. వేరే లెక్చరర్‌ను క్లాసు తీసుకోమని చెప్పి, తండ్రిని దూరంగా తీసుకుని పోయి మాట్లాడి అటునించి అటే రిక్షా ఎక్కించి పంపించేసాడు. తర్వాత ఒకరు ఆయన చాలాసేపటినుంచి మీకోసం వెతుక్కుంటున్నాడు ఎవరండీ అంటే, ఆయన మా వూరినుండి వచ్చాడు, మా పరిచయస్తుడులెండి అన్నాడు. అప్పటికప్పుడు ఆ మాటఅర్థం వేశాడు. తర్వాత కొన్నాళ్ళకు నేనొకసారి వారింటికి వెళ్ళాను. అతని తండ్రి ఆ ఊరొచ్చి అదే డ్రస్సులో వాకిట్లో కూర్చొని వున్నాడు. నేను పేరుపెట్టి ఆ మాస్టరుమ పిలుస్తున్నాను. ఎవరి కోసమయ్యా అన్నాడాయన. ఈ యింట్లో వున్న ఆయన కోసం అన్నాను నేను. ఆయన తిరిగి మా అబ్బాయి కోసమా? అనడిగాడు. మీ అబ్బాయో, ఎవరో నాకు తెలియదు. ఈ యింట్లో వున్న మాస్టారి కోసం అన్నాను. అప్పుడాయన ఒరేయ్, అబ్బాయ్ అని కేకవేసారు. అతను ఏంటి నాన్నా అంటూ లోపలినుంచి బయటకొచ్చాడు. అప్పుడు ఈయన ఎవరు సార్ అని అడిగితే మా నాయనగారు అని చెప్పాడు. అంతకు ముందు కాలేజీకి వచ్చినప్పుడు మా తండ్రి అని చెప్పుకోవడానికి సిగ్గుపడ్డాడు. అతడు 'నాతండ్రి అనే భావం మనస్సులో వుంటే చాలదా, పైకి అందరికీ చెప్పుకోవాలా?' అన్నాడనుకోండి. అదెంత అసహ్యంగా వుంటుంది? కాబట్టి లోపల వున్న భావాన్ని పైకి వ్యక్తం చేయడానికి జంకు వుండకూడదు. అది వున్నపుడు దేనియందైతే గౌరవభావం వుందో, దానిని తృణీకరించినట్లవుతుంది. అదంటే నాకిష్టమే గాని అది ఇష్టమని నలుగురు ముందూ చెప్పడానికి యిష్టపడనప్పుడు అదంత పనికిమాలినదని అర్థం. ఏ త్రాగుడో, వ్యభిచారమో చేసినపుడు నలుగురెదుట బొంకవచ్చు. చాటుగా ఆ వ్యవహారం నడుపుకొని బయట ఛ ఛ అదేంటి అనవచ్చు. అతప్పుడు పనిచేసి కీర్తి ప్రతిష్టలు దెబ్బతింటాయని అనుకున్నప్పుడు అలా చేస్తే చేయవచ్చు. కాని చేస్తున్నది పవిత్ర కార్యం, దైవం అని ఒక ప్రక్క చెబుతూ,

రెండవ ప్రశ్న, దాని గురించి మన భావం ప్రకటించుకోలేకపోతే సిగ్గుపడ్డామంటే, సరిగ్గా అతడు తన తండ్రిని తండ్రి అని చెప్పుకోడానికి ఎంత హీనపరిస్థితిలో వున్నాడో ఇది కూడా అంతేనన్నమాట.

శాస్త్రాలలో కూడా లోపల భావన ఎంతగావున్నా చాలదు, భజన చేయగలగాలి అని చెప్పారు. ఎందుకనంటే మన మనస్సులోని భావాల్ని భజన రూపంలో వ్యక్తం చేయలేక పోయామనుకోండి, అప్పుడు ఏమనిపిస్తుందంటే, నలుగురూ మనలను చూచి ఏమనుకుంటారోనని అనిపిస్తుంది. అదే పోగొట్టు కోవాలి. నా గొంతు విని నలుగురు ఏమనుకుంటారో, బాగుండదేమోననుకొని పాడడానికి జంకుతాడు. మనం భగవంతుని కోసం పాడుతున్నాము గాని నలుగురినుండి బాగా పాడాడని అనిపించుకోడానికి కాదు. మనుషులచేత అట్లా, అనిపించుకోడానికి పాడేవాడు వృత్తి కోసం పాడేవాడని అర్థం. భగవంతునికోసం పాడేటప్పుడు భావం కావాలి గాని కంఠధ్వని అక్కర్లేదు. భగవంతునికి కంఠధ్వని కావాలంటే మనకంటే కోటిరెట్లు బాగా పాడగల నారద తుంబురులున్నారు. అయినప్పటికీ ఎంతటి తొక్కిమాటలు, ముద్దుమాటలు, పిచ్చిమాటలైనా తల్లికెంత ప్రీతికలిగిస్తాయి. కాబట్టి ఆ భావాన్ని ప్రకటించడానికి జంకకూడదు. జంకి నందువలన త్యణీకరించినట్లవుతుంది. ఆయనకు మనయందు ఎంతో ప్రేమ వుంటుంది. తల్లికి తనయుడంటే ఎంతో ప్రేమ వుంటుంది. అందుకని పిల్లవాడు పాలు త్రాగుతూ కొరికినా ముద్దేనన్నమాట. మనము గట్టిగా భజన చేసినపుడు మనలో అహంకారమనే గోడ దెబ్బ తింటుంది. కాబట్టి మన భావం ప్రధానమైనప్పుడు మన కంఠం ప్రధానం గాదు. ఈ అహంకారమంటే ఏమిటంటే నేను ఒక మనిషిని, వీళ్ళంతా నాకంటే భిన్నులు, వీళ్ళందరిలో నాకొక స్థాయి, అంతస్థు, హోదా వున్నాయి. నేను గొంతెత్తి భజనచేస్తే నలుగురూ నాగురించి ఏమను కుంటారోనని పిస్తుంది. ఇది కొబ్బరికాయకు పెంకువున్నట్టు వుంటుంది. పెంకు గట్టిగా వుంటుంది. గనుక లోపలవున్నది బయటకు పోదు, బయట వున్నది లోపలకు పోదు. అందుకని అందరిలోను దైవత్వం ఉన్నప్పటికీ మనలోనూ దైవత్వం వున్నప్పటికీ గూడా పెంకు పగలగొట్టకపోతే కొబ్బరి మనకెలా దొరకదో అలాగే దైవత్వం మనకు లభ్యంకాదు. అందుకనే కొబ్బరికాయ కొట్టడమనేది దీనికి సంకేతం. మనలో వుండే అహాన్ని బద్దలు కొట్టుకుంటేగాని దానిలోని దైవత్వం మనకు అనుభవమవ్వదు. అందుకని భజన చేయుగలిగేంత వరకూ మనిషికి భక్తి

కలిగిందని చెప్పటానికి వీలులేదు. భజన చేసేటప్పుడు ఒకే నామాన్ని తీసుకొని చాలాసేపు అంటాము. ఎందుకంటే అక్కడ ఎన్ని రూపాలైతే కనపడుతున్నాయో వాటన్నింటిలోనూ ఆయనే వున్నాడని జ్ఞాపకం చేసుకోవడం కోసం. అంటే ఆయనమీద తప్ప మరొక దానిమీదకు మనస్సు పోకుండా నిలుపు కునేందుకన్న మాట. ఒకసారి అనేటప్పటికే మనస్సు ఆ నామంమీదకు వస్తుంది. అయితే మనస్సుకు చంచల స్వభావం కనుక వెంటనే మరొకదాని మీదకు వెళ్తుంది. వెళ్ళే మనస్సును లాగిపడేయటానికి ఆ నామాన్ని రెండోసారి అంటాము. మనస్సుకొక గుణముంది. ఏదైనా సంగీతంలాగా లయగా, తాళంగా వుంటుందో దానిమీద మనస్సు నిలుస్తుంది. అందుకని నామాన్నిగూడా ఒక లయ ప్రకారం, తాళం ప్రకారం వుండేటట్లయితే దాని పట్ల మనస్సు తేలికగా ఆకర్షింపబడుతుంది. కనిపించే చరాచర జగత్తంతా బాబానే వున్నారన్న విషయం ఆయన చరిత్ర చదువు తుంటే తెలుస్తుంది. కాబట్టి మనం భజన చేసేటప్పుడు మన చుట్టుపక్కల అన్ని రూపాల్లోనూ, మన రూపంలోనూ కూడా బాబానే నిండి వున్నారనేది స్థిరపడు తుంది. ఆ భావన స్థిరపడడానికే భజన చేస్తున్నాము. ఆ భావాన్ని మాత్రమే నిలుపు కుంటూ తక్కిన అన్ని భావాలనూ మరిచిపోవాలి. నా కంటే భిన్నంగా వాళ్ళంతా వున్నారు, నేను గొంతెత్తి భజన చేస్తే ఏమను కుంటారోనన్న భావం పోకపోతే అది భజనే కాదు. అప్పుడు మనలోని అహంకారం పోయేందుకు అవకాశమే లేదు. అప్పుడు ఆయనదయ మనకు అనుభవమయ్యే అవకాశం కూడా లేదు. కిటికీ తెరవక పోతే బయట సూర్యుడు వచ్చినా యింట్లోకి వెలుతురు ఎలా వస్తుంది? అందుకని సాధ్యమైనంత వరకూ లోపలవున్న బిడియాన్ని, జంకునూ అతిక్రమించ డానికి చేసే ప్రయత్నమే భజన. అందుకని సాధ్యమైనంత వరకూ లోపలవున్న బిడియాన్నీ, జంకునూ అతిక్రమించడానికి ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు మంచిగా వున్న మనం ఒక చెడ్డ అలవాటుకి గురయ్యామనుకోండి. మొదట రెండుమూడుసార్లు జంకుగా వుంటుంది. ఒక పదిసార్లు పోయేటప్పటికే ఆ అలవాటు ప్రక్కవాడికి తెలిస్తే తెలియనీ అనుకుంటాం. అది అక్కడ చెడ్డపనికి వినియోగపడుతున్నది. ఇక్కడ మంచి పనికి వినియోగపడుతున్నది. అక్కడ అపవిత్రమైన పనితో ఆ బిడియాన్ని పోగొట్టు కొంటున్నపుడు పవిత్రమైన పనితో దానిని ఎందుకు పోగొట్టుకోకూడదు? అందుకని బిడియాన్ని వదిలి భజన చెయ్యాలి.

చుట్టూవున్న జగత్తులోనున్న వాటినుండి వీడు ఫలానా, వాడు ఫలానా అని మారేంతవరకూ మనిషి ఆ bottle neck నుండి బయటపడే వీలులేదు. మన ఆధ్యాత్మికతను చెడగొడుతున్నది ప్రపంచం కాదు, మన భావాలు. అందుకని సాయిబాబా చరిత్ర చదివినపుడు, అన్నింటిలోనూ ఆయనే వున్నాడని గుర్తింపు కలిగినపుడు, కుక్కలో గూడా ఆయనే వున్నాడని తెలుసుకున్నప్పుడు కుక్క కనబడినా కాలుపెట్టి తన్నలేదు. అన్నింటిలోవుంటూ దానిలోగూడా వున్న principle నీ మనస్సు గుర్తించడం నేర్చుకుంటుంది. కాబట్టి కుక్క అనుకుని తన్నే ఇదివరకటి భావం యిప్పుడు మారింది. అట్లాగే వ్యక్తులందరి పట్ల పరిస్థితు లన్నింటిపట్ల క్రమంగా మారుతూ వస్తుంది. వచ్చి ఈ జగత్తు యావత్తూ ఆయన రూపమే అని నిలుస్తుంది. దానినే భాగవతంలో ఇరవై నలుగురు గురువుల రూపంలో అవధూతకు బోధించటం వ్రాయబడి వున్నది.

అన్నింటిలో ఆ భగవంతుణ్ణి చూస్తుండు అని చెప్పకపోవడంవల్ల అలా చూడాలని కూడా తెలియదు. ఉదాహరణకు ఒకడు సన్యాసం పుచ్చుకున్నాడు. గీతోపన్యాసాలు యిస్తున్నాడు. కాని ఉత్తరాధికారం కోసం కోర్టు కెక్కుతున్నాడు. అందుకనే బాబా అన్నింటిలో తానే వున్నానని చెప్పడంగాక నిదర్శనాలిచ్చారు. ఒకసారి ఒకని గడ్డివామి తగలబడుతున్నది. వాడు బాబా వద్దకు వచ్చి మొర బెట్టుకున్నాడు. అప్పుడు "ఆ గడ్డివామి నీదా, ఆ మట్టి నీదా? గాలి నీదా? సూర్యుడు నీవాడా? నీవేమైనా తయారుచేసావా? లేక తనకైతానే మొలిచిందా? అది ఎట్లా నీదైంది?"అని అడిగారు బాబా. "ఈసారి వ్యాపారం చేసుకున్నపుడు కలిసివస్తుందిలే వెళ్ళు" అన్నారు. ఆ విధంగా బాబాతప్ప ఎవరు బోధించ గలరు? అన్ని రూపాలూ ఆయననేనని తెలియజేసారు. అందుకని అటువంటి మహాత్ముల సన్నిధిలో వీలైనప్పుడల్లా వుండడం మంచిది. అలా వీలుకానప్పుడు యిటువంటి చరిత్ర పారాయణ చేస్తుండడం చాలా దోహదం చేస్తుంది. ఎందుకనంటే యిది మామూలు జగత్తు అని పడే ప్రతిరెప్పపాటునూ, పొరపాటును ప్రతిసారీ సర్దుకుం టుంది. అందుకని అటువంటి సహకారం లేకుండా యిక్కడ సరిగా నడవలేము.

మహాత్ముల చరిత్ర పారాయణయొక్క సహకారం లేకుండా ఆధ్యాత్మి కంగా ఒక్క అడుగు కూడా సరిగానడవలేము. మనం రెండడుగులు వేసేసరికి మన భావన దెబ్బతినిపోయి వుంటుంది. మళ్ళీ ఇంతటి గొప్ప అవకాశం యిప్పుడు వచ్చిందికదా, భుక్తి ముక్తి రెండూ కలిసివచ్చేటప్పుడు త్రికరణశుద్ధిగా

చేసుకుంటూ పోదాము అన్న భావం మరల వచ్చి నెమ్మదిగా తప్పటడుగులు వేసుకుంటూ ముందుకు పోతాము.

ఉదాహరణకు మనం ధ్యానానికి కూర్చున్నామనుకోండి. ధ్యానం చేసేటపుడు వెన్ను నిటారుగావుంచి కూర్చోమన్నారు. కాసేపటికి చూస్తే, వెన్ను క్రిందకు దించి వుంటాము. నొప్పిపుట్టి కూర్చోవడంవేరు. అలాగాక, జపం చేసుకోవడానికి, ధ్యానం చేసుకోవడానికి కూర్చున్న అరగంట తర్వాత చూస్తే యిలా కూర్చున్నామేమిటి? అనిపిస్తుంది. అసలు కూర్చున్నదెందుకు? ఆలోచిస్తున్నదేమిటి? అనిపిస్తుంది. అటువంటి స్థితి మనకు కలుగకుండా దోహదం చేస్తుంది. ఇటువంటి చరిత్రల పఠనం, ఎప్పుడూ గూడా inactive గా వుండకుండా చూస్తుంది. చదివినా, వ్రాసినా, మరేం చేసినా ఈ అవగాహనతో చేసుకుంటూ పోతే మన భావన దెబ్బతినదు. ఆ స్థితి వచ్చినవాడికి ఎలా వుంటుందంటే ఉదాహరణకు చదరంగం ఆడుతున్నాము. తెల్లని, నల్లని పావులున్నాయి. మనకు అవి పావులు మాత్రమే అనిపిస్తాయా? లేక ఇది రాజు, ఇది బంటు, యిది మంత్రి అనిపిస్తుందా? పావులు మాత్రమే అనిపిస్తే ఆటయందు ఆసక్తి వుండదు. నిజంగా రాజు, మంత్రి అనిపిస్తే తన రాజును తప్పించాలని చూస్తాడు. అవి ఒట్టి చెక్కముక్కలని అనుకోడు. ఒకరకంగా చెక్కముక్కలే అనుకుంటాడు కాబట్టే ఎన్నిసార్లైనా ఆడగలుగుతాడు. అలాగాక నిజంగా రాజు, బంటు అని అనుకుంటే తను గెలవడానికి శతవిధాలా పాటు పడతాడు. ఓడిపోయినప్పుడు ఎదుటి వాడిని కొట్టడానికి గూడా వెనుకాడడు. కాబట్టి వాటిని చెక్కముక్కలని అనుకోము. రాజు, మంత్రులనీ అనుకోము. రెండింటికీ మధ్యస్థితిలో వుంటుంది మనస్సు. అట్లాగే ఆ స్థితిననుభవించే వాడికి ఈ జగత్తు నిజమా అంటే నిజమే, కాదు అంటే కాదు. ఉదాహరణకు ఇప్పుడు నేను మాట్లాడుతున్నాను, మాట్లాడుతున్నంతసేపు మీరు వింటు న్నారు. మీరు వింటున్నంత సేపు మీరెట్లా కూర్చున్నారో మీకు తెలుస్తున్నదా, తెలియడంలేదా? తెలుస్తున్నదంటే నేను చెప్పింది మీరు వింటున్నట్లు కాదు. పోనీ తెలియదు అనుకోడానికి మీరు నిద్రపోవడంలేదుకదా! ఆలోచిస్తే తెలుస్తుంది. లేకపోతే తెలియదు. అలాగే ఆ స్థితిని అందుకున్న వాడి పరిస్థితి అంతే. అలాగే ఒకడు టెన్నిస్ ఆడుతున్నాడనుకోండి. ఆట ఒక మంచి పట్టులో వున్నపుడు ఇది ఆట, వీళ్ళు ప్రేక్షకులు, యిది net అని గుర్తుంటుందా, లేక ఆట గెలవాలనే దృష్టి వుంటుందా? వుంటుంది, వుండదు గూడా. కాని తక్కినది

గుర్తుపెట్టుకుంటే ఆటగెలవలేడు. అట్లా వుండీవుండనట్లు, జరిగీ జరగనట్లు, గుర్తించీ గుర్తించనట్లు, చేసీచేయనట్లు వుంటాడు. ఉదాహరణకు, ఒకడు ఎ.సి. రూమ్‌లో పట్టుపరుపుమీద పడుకుని వున్నాడు. నిద్రలో కల వచ్చింది. కలలో పోలీసులు వీడిని నేలమీద పడేసి కాలుతో తంతున్నారు. వీడు భరించలేక పెద్దగా అరుస్తూ లేచాడు. అప్పుడు పట్టుపరుపు మీద పడుకున్నవాడు వీడా? లేక పోలీసులు బూటుకాలుతో తంతుంటే అరుస్తూ లేచినవాడు వీడా? ఒకేమనిషి పట్టుపరుపుమీద పడుకోవడము, బూటుకాలుతో తన్నులు తినడం వీలుకాదు. కాబట్టి యిద్దరూ ఒకరే అవడం వీలుకాదు. పట్టుపరుపుమీద పడుకున్నాడంటే బాధతో ఎందుకు అరిచాడు? అలాగాదు తన్నులు తిన్నవాడే వీడనుకుంటే పోలీసులు లేరుగదా!

అలాగే వాళ్ళ ఆత్మస్థితి పట్టుపరుపుమీద వున్న శరీరం వంటిది. మెలకువ అనే స్థితిలో చూస్తే లేనేలేదు. వున్నట్లుగా కావాలంటే వుంటుంది. ఇవి తెల్లపావులు, నల్లపావులు అనుకున్నపుడు ఆటనడుస్తుంది. చెక్కముక్కలనుకున్నప్పుడు అవి చెక్కముక్కలే. అలాగే జగత్తు వుందన్నా చెల్లుతుంది; లేదన్నా చెల్లుతుంది. నేనే ఇదంతా చేస్తున్నాను అన్నా చెల్లుతుంది. నేనేమీ చేయుడం లేదన్నా చెల్లుతుంది. ఉదాహరణకు ఏదో తొందరపని మీద రోడ్డు మీద వెళ్తున్నపుడు మనకాళ్ళు రోడ్డు మీద ఆనుతున్నాయని తెలుస్తుందా? లేదా? అలాగే బాగా అలవాటుగా వున్నవాడు పద్యాన్ని వల్లె వేసుకుంటూ, సైకిలు త్రొక్కుతూ వెళ్తున్నాడు అప్పుడు వాడి మనస్సు పద్యాన్ని గూర్చి ఆలోచిస్తుందా? లేక పెడలు త్రొక్కడం మీద ఆలోచిస్తుందా? ఫలానాదాన్ని గురించి అని చెప్పలేడు. రెండింటి గురించి అని చెప్పడం తప్పు. ఎందుకంటే రెండింటి గురించి ఒకేసారి మనస్సు ఆలోచించలేదు. అలాగని ఏ ఒక్కదాన్ని గురించీ ఆలోచిస్తున్నదన్నా తప్పే అవుతుంది. అట్లా వుంటుంది వాడి స్థితి.

వాడికి ఆ సైకిల్ మీద Balance కుదరడం అంటే వీడు ఆ state లో స్థిరం కావడమన్నమాట. అది అవగాహనతో గాని రాదు. సైకిలు వచ్చినవాడికి సైకిలు మీద మనస్సు పెట్టడం తగ్గిపోతుంది. సైకిలు రానపుడు దానిపై ఎక్కువ మనస్సు వుంచుతాము. అలాగే సాధన పెరిగేకొద్దీ దానిపై ప్రత్యేక మనస్సు పెట్టకుండానే సాధన జరిగిపోతూవుంటుంది. ఎలాగంటే సైకిలు త్రొక్కడాన్ని గుర్తు చేసుకోకుండానే సైకిల్ త్రొక్కుతూ పోతూ వున్నట్లు. అందుకని సాధన ఆ

స్థితికి చేరేవరకూ మన ప్రయత్నం అవసరం.

పూర్వజన్మ కర్మలు నశించడానికి, కొత్త వాసనలు తగులుకోకుండా వుండడానికి, పాత వాసనలు నాశనమవడానికి నిరంతరం భగవంతునియందు నిలవడమే ప్రధాన కర్తవ్యం. క్రొత్తవి తగులుకోకుండా వుండడానికి భగవంతుని యందు దృష్టి వుంది గనుక వాడు తరిస్తాడు. కాబట్టి భగవద్భక్తుడికి ఈ సృష్టి యంతటి కల్పవృక్షం మరొకటి లేదు. వెనుకటి కర్మలన్నింటినీ నశింపజేసి ఇక జన్మలే లేకుండా చేస్తుందది. భగవద్భక్తి లేనివాడికది చేయదు. అందుకని ఒక శ్లోకంలో ఏం చెప్పారంటే "సదాకల్పవృక్షస్య తస్యాధిమూలే" అన్నారు. కల్పవృక్ష మూలంలో ఆయన వున్నారట. ఇక్కడ కల్పం అనేదానిమీద శ్లేష వున్నది. సృష్టి అనేది మూలము. ఆయన పరబ్రహ్మమే తానై వున్నాడు. అట్లా వుంటూ గూడా తాను పరిమిత రూపుడుగా గోచరిస్తూ "భుక్తిముక్తి ప్రదంతం" అంటే ఇహాన్ని, పరాన్నీ గూడా ప్రసాదిస్తున్నారు. ఆయన నిజంగా వేపచెట్టు క్రింద కూర్చున్న మాట నిజమే. అది యదార్ధంగా జరిగిన సంగతే. ఏ భక్తుడు వచ్చినా ఆ వేపాకులు దూసిపెడితే అవి ఆలాగే పనిచేసేవి. అది తార్కికంగానూ నిజమే. యదార్థంగా జరిగినమాటగూడా నిజమే. చాంద్‌పాటిల్ గుఱ్ఱం విషయంగూడా అంతే. చాంద్ పాటిల్ గుఱ్ఱం తప్పించుకుపోయింది. దానికోసం ఎంత వెతికినా దానిజాడ కన పడలేదు. చివరకు అతడు నిరాశతో జీను భుజాన వేసుకుని తిరిగివస్తున్నాడు. అప్పుడు ఒక చెట్టు క్రింద కూర్చుని ఒక ఫకీరు కన్పించాడు. ఆ ఫకీరు చాంద్ పాటిల్‌ను చూచి చెంతకు రమ్మని పిలిచారు. గుఱ్ఱం మోయవలసిన జీనును నీవు భుజానవేసుకుని మోస్తున్నావేమిటి? అని హాస్యంగా పలకరించారు. 'నా గుఱ్ఱం తప్పించుకుని పోయింది. ఎంత వెదికినా కన్పించలేదు' అని అతడు చెప్పాడు. 'బాగా వెతికావా?' అని అడిగారు బాబా. బాగా వెతికాను అన్నాడతను. అయితే ఆ ప్రక్కనేవున్న కాలువ గట్టుదగ్గర చూడమన్నారు. అతడు వెళ్ళిచూస్తే తన గుఱ్ఱం అక్కడే మేస్తూ వున్నది. అతనికెంతో ఆశ్చర్యమేసింది. కారణం - అంతకుముందే అతనక్కడంతా వెతికాడు. ఇది యదార్థంగా సాయి చరిత్రలో జరిగింది. దీనిలో ఆధ్యాత్మికమైన సంకేతం కూడా వున్నది. ఉదాహరణకు బౌద్ధమతంలో చూస్తే 12 ఆధ్యాత్మిక చిత్రాలు వున్నాయి. (Twelve ox herding pictures) ఆధ్యాత్మిక తత్వాన్ని చిత్రాలుగా గీచి బోధించబడ్డాయి. అందులో గొడ్లను కాచుకునే వాడొకడు గొడ్లను తోలుకుపోతుంటాడు. వాడు ఒక పశువు మీద కూర్చుని

తోలుతుంటాడు. అప్పుడు ఆ పశువు పిడిని బోల్తా కొట్టించి పరుగెత్తిపోతుంది. వాడు అది ఎటు పోయిందో చూచుకుంటూ దాని కాలిగుర్తులు కనిపిస్తే వాటిని పట్టుకుని వెళ్తాడు. అలా కొంతదూరం పోయాక ఆ గుర్తులు కనిపించవు. అప్పుడతనికి ఒకడు కనిపించి దారి చూపిస్తాడు. అప్పుడతడు చూపించిన మార్గాన్ని పట్టుకుని గొడ్లకాపరి స్వస్థానానికి వస్తాడు. ఇవన్నీ చిత్రాల ద్వారానే చూపిస్తారు. ఆఖరు చిత్రంలో వాడు, ఆ పశువు, జగత్తువేరుగా లేక ఖాళీ చిత్రం మాత్రమే వుంటుంది. పూర్ణాకృతి మాత్రమే వుంటుంది. సున్నా గీచి వుంటుంది. ఇది మొత్తం ఆధ్యాత్మిక సంకేతం.

బాబా, మనస్సొక గుఱ్ఱం అని చెప్పేవారు. ఒకడికి ఒక గుఱ్ఱం వుండేది. దానిని లొంగదీసుకోవాలని ఎంతగా ప్రయత్నించినా అది వశంకాలేదు. పోనీ జంట గుఱ్ఱాన్ని తీసుకొచ్చి కలిపితే లొంగుతుందేమోనని చూస్తే అలా గూడా లొంగలేదు. అప్పుడు వాటిని గూర్చి తెలిసినవాడు, దానిని ఎక్కడి నుండి తెచ్చారో, అక్కడికే తీసుకు వెళ్ళమని చెప్పాడు. అలా చేస్తే అది అణకువగా పడివుంటుంది అని చెప్పాడు. అలా చేస్తే ఆ గుఱ్ఱం నిజంగానే అణకువగానే పడివుందట. అని చెప్పి ఆ కథ ఆపివేశారు బాబా. భగవాన్ రమణమహర్షి కూడా అలానే చెప్పేవారు. మనస్సు ఎక్కడనుంచి ఉత్పన్నమవుతుందో అక్కడే దానిని కేంద్రీకరిస్తే స్వస్థమవుతుంది అని చెప్పారు. మనస్సు గుఱ్ఱం పోయినట్లు పరుగెత్తుకుని పోతుంది. అలా పోయేటప్పుడు గుర్తుచెప్పి మనసును చూడు అని చెప్పేవాడు కావాలి. అలా చెప్పినప్పుడు మనస్సును లయంచేస్తే స్వస్థమవుతుంది. అందుకని మనస్సును గుఱ్ఱంతో పోల్చారు. అది ఆధ్యాత్మికంగా సరిపోతుంది. అదే ox herding pictures లో సంకేతంగా వున్నది. ఆ సంకేతం బాహ్యంగా గూడా వున్నది.

దీనికే మరొక ఉదాహరణ నారాయణావనం దగ్గర సొరకాయ స్వామి అనే మహాత్ముడుండేవారు. ఆయన సమాధిచెంది వంద సం॥లు పైనే అవుతుంది. ఆయన సమాధి యిప్పటికీ అక్కడ వున్నది. ఒకసారి ఆయన వద్దకు ఒకరు వచ్చి, వేదంలోని **"ద్వా సుపర్ణా"** అనే మంత్రానికి అర్థం చెప్పమని అడిగారు. వేదంలో దానికర్థం యిలా చెప్పబడి వుంది. ఒక చెట్టుమీద రెండు పక్షులున్నాయి. అందులో ఒకపక్షి పండును తింటున్నది. రెండవది, దానిని చూస్తూ ఆనందిస్తున్నది అని వేదంలో చెప్పారు. దాని అర్థం అడిగిన అతనితో స్వామి కాసేపు

ఆగమని చెప్పారు. కాసేపు ఆగి అతడు స్వామిని మళ్ళీ దాని అర్థం చెప్పమని అడిగాడు. అప్పుడు స్వామి అతనిని పైకి చూపించారు. పైకి చూస్తే చెట్టుమీద నిజంగా రెండు పక్షులు వున్నాయి. ఒకటేమో పండును కొరికి తింటున్నది. రెండవది దానిని చూస్తూ వున్నది. వానిని ఆయన చూపించినపుడు, దానికేసి వాడు చూసినపుడు , వాడికి దాని అర్థం స్ఫురించింది. మనలో 'నేను పరిమితుడను' అనే భావంతో కష్ట సుఖాలను అనుభవించే భాగం ఒకటి. దానికి సాక్షీభూతంగా అయి వుండేది గూడా ఒకటి వున్నది. సాక్షీభూతంగా వుండేది పరమాత్మ. పండును తినేది జీవాత్మ. రెండూ మనలోనే వున్నాయని వాడికి స్ఫురించింది. అక్కడ తార్కికమైన అర్థంగూడా సరిపోతుంది. భౌతికంగా గూడా వాస్తవంగా అది జరుగుతుంది. అలాగే అత్రిమహర్షి త్రిగుణాలకు అతీతుడైన మాటగూడా నిజమే. చారిత్రకంగా దత్తాత్రేయుడు వాళ్ళింటికి వచ్చి వారికి దత్తుడయినమాట గూడా నిజమే.

క్రీస్తు విషయంలో గూడా అలానే జరిగింది. క్రీస్తును శిలువ వేయడము, మూడురోజుల తర్వాత ఆయన తిరిగి లేవడము ఎప్పుడో చరిత్రలో జరిగింది మాత్రమే కాదు. మనలో 'నేను, నేను' అనే ప్రజ్ఞ జీసస్. ఇప్పుడు మనలో వుండేది జీసస్. దానిని, అంటే 'నేను పరిమితుడను' అనే దానిని శిలువకొట్టినట్లయితే అదే క్రీస్తుగా పునరుద్ధానమై వస్తుంది. ఇది క్రైస్తవంలో Gnastics చెప్పే సిద్ధాంతం. వెనుకటి చైతన్యం మరణించాలి. నూతన చైతన్యం ఉద్భవించాలి. ఈ విషయాన్ని జీసస్ చెబుతున్నారు. ఈ విధంగా అది తార్కికంగానూ సరిపోతుంది. యదార్థంగా శిలువవేసిన మాట గూడా నిజమే. ఇలాంటివి మహాత్ముల చరిత్రలలో జరుగుతుంటాయి.

జ్ఞాని దగ్గర శక్తిపాతం -సూర్యుని వెలుగులాగా ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. సూర్యుని వెలుగు తలుపుతీసినా పడుతుంది. తీయక పోయినా పడుతుంది. తలుపుతీస్తే లోపలకు ఎండ పడుతుంది. లేకపోయినా సూర్యుని వెలుగు పడుతూనే వుంటుంది. అలాగే జ్ఞానివద్ద నుండి శక్తిపాతం ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. ఆయన వద్దకు వచ్చిన వాడి సాధనాబలంమీద పొందగలగడమనేది ఆధారపడి వుంటుంది. శిష్యుడి సాధనాబలం ఎక్కువ వున్నప్పుడు ఆ శక్తిపాతం త్వరగా వీడిలోకి వస్తుంది - సూర్యుని వెలుగు తలుపు తీసినపుడు యింట్లో పడినట్లు. సాధనాబలం తక్కువగా వున్నపుడు అది సరిగా

జరుగదు. అయినా జ్ఞానియొక్క శక్తిపాతం సూర్యుని వెలుగులాగా ఎప్పుడూ అలాగే వుంటుంది. సాధనలో శక్తి తక్కువగా వున్నపుడు శక్తిపాతం సరిగా జరుగదు. కట్టెలను ఎండలో 10, 15రోజులు పెడితే త్వరగా అంటు కుంటాయి. అలాగే మనస్సును శుద్ధం చేసుకున్నవాడు జ్ఞాని దగ్గర కూర్చోగానే వాడికి శక్తి పాతం వెంటనే జరుగుతుంది. అందుకే జ్ఞానిదగ్గరకు ఎన్నో అడుగుదామని వచ్చి కూర్చుంటే ఖాళీ అయిపోతుంది మనస్సు. ఏమీ అడుగలేడు. ఏ శక్తి కోసం ఆశించి అడుగుతున్నాడో, అది నెరవేరిందన్నమాట.

ఉదాహరణకు నాకు ఆకలి అవుతున్నదనుకోండి. అన్నం తినాలని అనుకుంటున్నాను. ఎవరో మహాత్ముడు తన శక్తితో తిన్నగా నా కడుపులోకి ఆహారాన్ని పంపించాడనుకోండి. ఇక నేను అన్నం ఎలా తింటాను? కడుపు నిండిపోయి వుంటుంది. అందుకని అడగాల్సిన అవసరం వుండదు.

అలాగాక ఒకడు ఒంటికి నూనె పూసుకొచ్చి నీళ్ళ క్రింద కూర్చున్నా డనుకోండి. ఎంతసేపు నీళ్ళక్రింద కూర్చున్నా యివతలకు వచ్చి చూసుకుంటే ఒంటిమీద నీటి బొట్టు మిగలదు. అలాగే వాడి చింతలు, వాడి భావాలు అనే నూనె పూసుకుని వస్తాడు గనుక అవతలివాడు ఎంతటివాడో గమనించడు. శ్రద్ధపెట్టి అడుగలేడు. వాడు అడగదలచుకున్న లౌకిక చింతలమీదే మనస్సు పెట్టి వుంటాడు. ఎలాగంటే ఒకడున్నాడు. వాడి బంధువులు చిక్కుల్లో వున్నారను కోండి. వాళ్ళకెట్లా ఏమిటో అని జ్ఞాని దగ్గర కూర్చున్నపుడు గూడా ఆలోచిస్తూ వుంటాడు. అందుకని ఆయనను గమనించడు. అలాగాక మహాత్ముని దర్శనం చేసుకున్నపుడు శ్రద్ధపెట్టి చూడాలి. ప్రాణాలన్నీ కళ్ళల్లోకి రావాలి. దృష్టి అంతా ఆయన మీదే వుండాలి. అప్పుడు వాడు అడుగవలసినదంతా వస్తుంది. అడగా ల్సిన అవసరం లేని స్థితికి ఎంతగా దగ్గరవుతాడో, అంతసేపు జ్ఞానానుభూతిని పొంది జ్ఞానానికి దగ్గరవుతాడు. ఉదాహరణకు కట్టెలను ఎండలో పెట్టినట్లు. ఎండయొక్క ప్రభావంచేత త్వరగా ఎండుతాయి. ఎండ పడేచోట పెట్టడమే మనము చేయవలసినది.

ఒక సమస్య వుంది, అది తీరితే అన్నీ తీరుతాయా అంటే అన్నీ తీరవు. అప్పటికి ఆ సమస్య తీరుతుంది. మరలా సమస్యల పరంపర మొదలవుతుంది. పిల్లవాడున్నాడు, వాడికి పెళ్ళికావాలి, పిల్లను వెదకడం సమస్య అయింది. పెళ్ళయిన తర్వాత వాడు హాయిగా వుండకపోతే అదొక సమస్య. తర్వాత వాడికి

పిల్లలు పుట్టకపోతే సమస్య. పుడితేవాడికి ఆరోగ్యం బాగాలేకపోతే సమస్య. వాడు బాగా చదువుకోవాలి, మంచి ఉద్యోగం రావాలి. మళ్ళీ వాడి పెళ్ళి - ఈ విధంగా సమస్యలు వస్తూనే వుంటాయి. ఎప్పుడికి యివన్నీ తీరేది? పోనీ అవన్నీ తీరితే వాడికి తృప్తి అయితే సరే, అలా కావేకాదు. ఒక సమస్య తీరిందను కుంటే దానినుండి మరొక సమస్య మొదలవుతుంది. అందుకని ఈ కష్టం, ఈ సమస్య, ఈ బాధ - అన్నీ తీరినా మరొకటి రాకుండా వుంటే తీర్చవచ్చు. అందుకని తృప్తి అనేది కలగాలి. తృప్తి అనేది కలిగింతర్వాత వాడికి కావలసింది ఏమీ లేదు. తృప్తి అనేది కలుగకపోతే వాడికి ఒరిగేదీ లేదు. తృప్తి వున్నప్పుడు ఆనంధం వుంటుంది. అందుకని విడిగా వున్నప్పుడు మన మనస్సు వేరు, మహాత్ముల సన్నిధిలో వున్నప్పుడు మన మనస్సు వేరుగా ఎప్పుడైతే వుంటుందో, అప్పుడు మనం నిజంగా వాళ్ళ సన్నిధిలో వున్నట్లు గుర్తు. దానికే శాస్త్రంలో ఎక్కడైతే నీ చిత్తం శాంతించి ఆనందంగా వుంటుందో అదే నీ స్థానం అన్నారు. రమణమహర్షి చెప్పినదాంట్లో నీ స్థానం అని చెప్పిందదే. నిజమైన 'నేను' ఏదో అది నీ స్థానమని అర్థం. నీ పూర్వపుణ్యాన link చేయించుకోవడానికి నీకు నిర్ణీతమైన చోటుకు వచ్చావు. అందుకని మహాత్ముల సన్నిధికి వెళుతుండడం అంత గొప్పదన్నమాట. వాళ్ళ సన్నిధి అంటే Physical presence మాత్రమే కాదు. ఎట్లాగంటే Bulb అంటే light కాదు. ఎందు కంటే ఫిలమెంట్ లేకపోయినా బల్బే. కరెంటు కనెక్షన్ లేకపోయినా బల్బే. కాబట్టి బల్బ్ అంటే లైటు కాదు, కాని బల్బుద్వారా గాని లైటు రాదు. అలాగే వాళ్ళ Physical presence, physical presence మాత్రమే కాదు, వాళ్ళ శక్తి Physical prsence ద్వారా వ్యక్తమవుతుంది. కాబట్టి ఆరంభంలో వాళ్ళ Physical presence మనకు పెద్ద asset అన్నమాట. ఎందుకంటే mind continuous గా వారి Presence లో వుండడంవల్ల spiritual presence గుర్తుపట్టగలిగిన దానిని విద్యుద్దీకరిస్తుంది. అట్లావుండి charge అయినపుడు తర్వాత మనం ఎక్కడున్నా, తలచుకున్నప్పుడల్లా charge అవుతూంటుంది మనస్సు, అప్పుడు you have make use the right అన్న మాట. ఎప్పుడు ఎక్కడ కూర్చున్నా సరే continuous గా వున్నట్లుంటుంది.

ఉదాహరణకు సినిమాలో కూర్చున్నప్పుడు మనం ఎక్కడ కూర్చున్నామో గుర్తుంటుందా? ఇది థియేటర్ అని గుర్తుంటుందా? అదెట్లా గుర్తు లేకుండా పోతుందో, అట్లాగే వారి సన్నిధిలో ప్రాపంచిక విషయాలు గుర్తుండ

కుండా పోతాయి. ఎక్కడవున్నా ఆ సన్నిధి feeling వుంటుందన్న మాట. ఉదాహరణకు రైల్లో నాలుగురోజులు ప్రయాణంచేసిన తర్వాత మీరెక్కడ వున్నా రైల్లో ప్రయాణం చేస్తున్నట్లు వుంటుంది. దానికి Physical presence కొంత సహకారి. అయితే ఈ Physical presence అందరికీ దొరుకుతుందా? అంటే అందరికీ అవకాశాలురావు. మహాత్ములుండే చోటుకు వెళ్ళడం కష్టం కావచ్చు. వారి దగ్గర వుండడం కష్టం కావచ్చు. అన్ని అవకాశాలు అందరికీ రావు. కాబట్టి దీని పరిస్థితి ఏమిటి? సృష్టిలో వుండే తత్త్వాన్ని గుర్తించి తాము వేరుగా లేకుండా పోయిన వాళ్ళే మహాత్ములు. అయినపుడు ఆ తత్త్వం అక్కడా వున్నది. ఇక్కడా వున్నది. కాని మనకు అనుభవం కావడం లేదు. అందుకు నేను వేరుగా వున్నాననేది అడ్డుపడుతున్నది. సృష్టి అంతటా వున్నది అనుభవం కాకపోవడానికిగాని, దానిని గుర్తుపట్టకుండా పోవడానికిగాని - ఈ జగత్తువేరు, నేను వేరు అనే ఒక్క పొరచాలు. అందుకని ఆ పొరను తొలగించి ఆ సన్నిధిలో వుండకపోయినా ఆ స్థితికి తీసుకుని పోయేందుకు దోహదపడేది చరిత్రపఠన మాత్రమే. అందుకని పారాయణ అంత గొప్పది. అందుకని గ్రంథ పారాయణ అనే సాంప్రదాయం వచ్చింది.

శ్రీ రామకృష్ణపరమహంస వద్దకు వచ్చిన ఒకతను తనకు భక్తివైరాగ్యాలు ఎంతకీ కలగడంలేదని బాధపడ్డాడట. అప్పుడాయన అతనిని కొంతకాలం మధుర బృందావనంలో వుండి, భాగవతాన్ని శ్రద్ధగా పారాయణ చేయమనీ చెప్పారట. ఎందుకంటే భాగవతంలో అవతార పురుషుల కథలే కాక అట్టి స్థితిని పొందిన మహాత్ముల చరిత్రలు, వారు దానినెలా పొందినదీ గూడ వ్రాసి వుంది. అందుకని ఆయన చెప్పినదేమిటంటే మహాత్ముల చరిత్రలు మళ్ళీ మళ్ళీ చదువుతూ వుండమని. మహాత్ముల చరిత్రలు ఎందుకు చదవాలంటే అవి మహాత్ముల యొక్క నిజతత్త్వాన్ని తెలుపుతాయి. వారూ మనలాగే ఆహారం తీసుకుంటారు, పడుకుంటారు, వ్యాధిగ్రస్తులవుతారు. కాని ఆయన బాబా అయింది దానివలన కాదు, కుక్కను కొట్టినా ఆయనకు తెలుస్తుందే - దానివలన. దానిని అంటే ఆ తత్త్వాన్ని ఈ చర్మచక్షువు చూడలేదు. కాబట్టి మన మనస్సు ఆ తత్త్వాన్ని చూడగలుగుతుండాలి. అలా చూడగలగడానికి మహాత్ముల లీలలు దోహదం చేస్తాయి. ఏ సృష్టి అయితే మన సాధనకి అడ్డంకి అవుతుందో, ఈ చరిత్ర చదువుతున్న వాడికి ఆ సృష్టే సాధనకు దోహదం చేస్తుంది. మామూలు వాళ్ళకి ఈ

ప్రపంచం పరమార్థాన్ని చెడగొడుతుంది. దేవుని ముందు కూర్చుని అనేక రూపాలలోవున్న నీకు నమస్కారం అని చెప్పి, ఇవతలకు రాగానే 'ఆ రాస్కెల్ నన్నిట్లా అన్నాడు, ఈ వెధవ నన్నట్లా అన్నాడు' అని అంటుంటాడు. రోజుకు 10 ని॥లు మాత్రం అందరి రూపాలలో ఆయనే వున్నాడనుకుని, 23 గంటల 50ని॥లు వాడు అట్లా, వీడిట్లా అనుకుంటుంటే లాభమేముంటుంది? అందుకని ఖాళీ వున్నప్పుడల్లా ఆయననే జ్ఞాపకం చేసుకుంటుంటే అదే అభ్యాసమవుతుంది.

బంధ మోక్షాలన్నింటికీ మనస్సే కారణం. భగవంతుడున్నాడని, ఆయన గొప్పతనాన్ని గుర్తించి, భావించి గొప్ప స్థితిని పొందేదీ మనస్సే. భగవంతుడు లేడని, ఆయన గొప్పదనాన్ని గుర్తించక భ్రష్టుపట్టేదీ మనస్సే. కాబట్టి భగవంతుని యందు గురుత్వాన్ని, గొప్పదనాన్ని కలిగి వుండవలసినదీ మన మనస్సే, తరించ వలసింది గూడా మన మనస్సే.

ఉదాహరణకు ఒక బౌద్ధ మహాత్ముడు స్నానం పానం లేకుండా కూర్చుని వున్నాడట. ఒకడు ఆయన దగ్గరకు వెళ్ళి, 'స్వామీ, నాకు బుద్ధుడు ప్రత్యక్షమయ్యేటట్లు అనుగ్రహించు' అన్నాడట. మళ్ళీ అతనికి అనుమానం వచ్చిందట. ఈయన గొప్ప మహాత్ముడు గదా! బుద్ధుడు గనుక నిజంగా ప్రత్యక్షమవుతే ఏం చేయాలి అని. అందుకని మళ్ళీ ఆయనను, 'స్వామీ! బుద్ధుడు కనబడితే నన్నేం చేయమంటారు?' అని అడిగాడట. స్వామి 'నరికి అవతల పారేయ్' అని చెప్పారట. "ఏమిటిస్వామీ! అలా మాట్లాడారు, నన్నేం చేయమంటారు?" అని మళ్ళీ అడిగితే స్వామి, "వచ్చిన దారినే పో!" అన్నారట. అతడు యింకా అర్థంకాకుండా కూర్చున్నాడు. ఇంతలో స్వామి ఒక చెట్టునుంచి ఒక కొమ్మను విరిచి కఱ్ఱలాగా పట్టుకుని అటూ యిటూ కాసేపు తిరిగి తర్వాత దానిని విరిచి అగ్నిలో పారేశారు. అప్పటికీ ఆయన చర్యలోని భావం అర్థం కాలేదు. అందుకని అతడు తిరిగి వెళ్ళిపోతున్నాడు. దారిలో అతనికి ఆ స్వామి శిష్యుడొకడు ఎదురుపడ్డాడు. "ఏమిటయ్యా! నీవు ఆయనదగ్గర యిన్నాళ్ళుగా శిష్యరికమెలా చేస్తున్నావు? నేను మూడు గంటలు కూర్చున్నా గూడా ఆయన ఏమీ సమాధానం చెప్పలేదు" అని అతనిని అడిగాడు. అప్పుడా శిష్యుడు సమాధానం చెప్పాడు : "అది గాదయ్యా, ఆయన నీకు అద్భుతంగా సమాధానం చెప్పారు. అది నీకు అర్థం కాలేదు. నాకు కొంచెం అర్థమైంది. నాకు అర్థమైనది నీకు చెబుతాను అని యిలా చెప్పాడట:

బుద్ధుని దర్శనం కావాలని కోరినదీ నీ మనస్సే, ఈయనను మహా

త్మూడని అనుకున్నదీ నీ మనస్సే. బుద్ధుడు కనిపిస్తే ఏం చేయాలని అనిపించింది గూడా నీ మనస్సుకే. మళ్ళీ ఆయనను అడిగిందీ నీ మనస్సే. ఆయన కఱ్ఱ కోస్తుంటేను, అగ్నిలో వేస్తుంటేనూ చూస్తున్నదీ నీ మనస్సే. తర్వాత ఆయనను ఎద్దుమొద్దు స్వరూపంగా అనుకుంటున్నదీ నీ మనస్సే. అసలు ఆయన చేసినదేమిటంటే మొద్దుగావున్న చెట్టునుండి కఱ్ఱను కోసుకుని దానిని చేతి కఱ్ఱగా వాడుకుని మొద్దుగావున్న ఆ కఱ్ఱను నిప్పులో పారేసారు. ఎదురుగా జ్ఞానిగా కన్పించినా మహాత్ముడు ఎప్పుడూ మొద్దు స్వరూపమే. ఆయనను మహాత్ముడు అని అనుకున్నప్పుడూ మొద్దే, కాదు మొద్దు అనుకున్న ప్పుడూ మొద్దే. అలాగే చెట్టుమీద వున్నప్పుడూ మొద్దే. చెట్టునుండి విరిచి కఱ్రగా చేసుకున్నప్పుడూ మొద్దే. అగ్నిలో పడేసినప్పుడూ మొద్దే. అయితే అది మొద్దైనా స్వామికి చేతి కఱ్రగా ఉపయోగపడింది. అట్లాగేనీకు బుద్ధివుంటే ఆ బుద్ధుడు నీకు చేతికఱ్రగా ఉపయోగపడతాడు. అవధూతకు 24 మంది గురువులలాగ నిప్పు, నీరు గాలి, భూమి, ఆకాశము, శరకారుడు, కన్య, కొండ చిలువ మొదలైనవన్నీ ఆయనకు గురువులే. చూడడం చేతనయిన వాడికి ప్రపంచం అంతా గురువే. చూడడం చేతకానివాడికి ఏదీ గురువు కాదు. అలాగే ఆ చెట్టును ఉపయోగించుకోకపోతే అది మొద్దే, ఉపయోగించుకుంటే అదే చేతి కఱ్ర. కాబట్టి తెలిసిన వాడికి అదే భగవంతుడు, తెలియనివాడికి అదే మొద్దు స్వరూపము. అందుకని 'బుద్ధుణ్ణి నరికెయ్యి' అని ఆయన చెప్పారు. అంటే నీ నుండి భిన్నంగా వున్న బుద్ధుణ్ణి, ఆ పరిమిత తత్త్వాన్ని అంటే అట్టి భావాన్ని నరికేసెయ్యి అని ఆయన చెప్పారన్నమాట. అయితే అది బుద్ధుడని శ్రద్ధాభక్తులతో ఉపయోగించుకుంటే అది బుద్ధుడు. అది మొద్దే అయినప్పటికీ దానిని నడవడానికి చేతి కఱ్రగా తయారుచేసుకున్నావు. దాని ప్రయోజనం నెరవేరిన తర్వాత అవతల పారేయవచ్చు. అలాగే నీవు ఆయన బుద్ధుడని శ్రద్ధాభక్తులతో గుర్తుపెట్టుకోవడంవల్ల దాని ప్రయోజనం నెరవేరిన తర్వాత తీసివేయవచ్చు. ఎలాగంటే నీవు బుద్ధత్వం పొందిన తర్వాత, ఆయన, నీవు వేరుగా వుండవు. నీవు పరిమితుడుగా వుండవు. కాబట్టి పరిపూర్ణుడైన వానివైపు నుంచి చెప్పాలంటే చూస్తూవుండే 'చూపు' భగవంతుడు. కాని మనం యిది చూడబడే దృశ్యం అనే భ్రమవల్ల చూస్తున్నాము. మనవైపునుంచి చూడాలంటే కలలో వుండే రూపాలలాంటివాళ్ళము మనము. అయితే ఈ రూపాలన్నీ ఏ కల అనబడే మనస్సు యొక్క రూపాలో ఆ మనస్సు

భగవంతుడు. ఊహల్లోని పాత్రలలాంటి వాళ్ళం మనం. అయితే ఈ మొత్తం ఊహించే మనస్సు భగవంతుడు. లేనిది వున్నట్లుగా కనిపించడం మాయ. తెరమీది బొమ్మలుగా కనిపించడం మానేసి అది సుఖదుఃఖాలతో కూడినదని అనిపించడం మాయ. చూచే చూపు మాత్రమే నీవు అయినప్పుడు చూడబడే దృశ్యం నీవు అనిపించడం మాయ. సుఖము, దుఃఖము, భ్రాంతి మాత్రమే. కాని నిజమని అనిపించడం మాయ. రూపాలన్నింటిలోనూ ఒక్కటే వున్నాగాని యిన్నిగా అనిపిస్తున్నదేదైతే వున్నదో అది మాయ. వీటినుండి విడివడడమే ముక్తి.

భగవంతుడు తల్లిలాంటివాడు. తల్లి లేవలేని పిల్లవాడి దగ్గరకు తానే వెళ్తుంది. వాడికి జావపట్టడము, కూర్చునే ఓపిక లేకపోతే లేవదీసి కూర్చోబెట్ట డము, అనుకోకుండా కూర్చోలేని పరిస్థితిలో తానేవీపుకు ఆనుకుని కూర్చో వడము - యిలా సేవచేస్తుంది. అలాగే ఈ సృష్టిలోకూడా రెండు రకాల వారున్నారు. చాలా కొద్దిమంది మాత్రమే ఈ పుష్టికరమైనటువంటి బిడ్డలుగా వుంటారు. వాళ్ళకు ఉదాహరణగా శుకుడు మొదలైనటువంటి యోగీశ్వరులను చెప్పుకోవచ్చు. వాళ్ళు భగవంతుని దర్శించడానికి ఎక్కడికీ వెళ్ళనవసరంలేదు. అందుకే శ్రీకృష్ణుడు అవతరించిన తర్వాత గూడా శుకుడు కృష్ణుని దగ్గరకు వెళ్ళినట్లు పురాణాలలో ఎక్కడా లేదు. కారణమేమంటే - కృష్ణునిరూపంలో ఏది అవతరించిందో, ఆ పరమాత్మ తత్వాన్ని, ఈ విశ్వమంతటా అణు వణువునా నిండివుండటాన్ని అతడు చూస్తున్నాడు. కృష్ణుడు అవతరించి అవతార కార్యాలు చేస్తుంటే చూచి ఈయన అవతార పురుషుడు అని గుర్తించవలసిన పరిస్థితిలో శుకుడు లేడు. విశ్వమంతటా ఆయనరూపం లాగానే, తన లోపల, బయట, అంతటాగూడా ఆయననే చూస్తున్నాడు. ఆయన నుంచి ఎప్పుడూ తానంటూ ఒకడు విడిగా లేనేలేడు. అంటే ఈ జగత్తు అంతటికీ తల్లి తండ్రి అయిన పరమాత్మతత్వం దగ్గరకు తన శక్తిసామర్థ్యాలతో, తపస్సుతో తానే వెళ్ళాడు.

ఇటువంటి వాళ్ళను ఎవరితో పోల్చామంటే, మంచి ఆరోగ్యంగా, బలంగా వుండే పిల్లవాడు తల్లి దగ్గరకే పరుగెత్తుకుంటూ వచ్చి, వంటింట్లో కూర్చునే భోజనం చేసే పిల్లవాడివంటి వాళ్ళు. చేరవలసిన గమ్యం దగ్గరకు తనశక్తితో చేరి అచట పరమాత్మానుభూతిని పొందుతున్నాడు. ఇక మనము ఎటువంటి వాళ్ళమంటే కూర్చున్న చోటునుంచి లేవలేనటువంటి, అస్వస్థతతో మంచంలో వున్నటువంటి

బిడ్డలం. అందుకని మనం తపస్సుతో అటువంటి స్థితికి పోలేము గనుక మన మీద అపారమైన ప్రేమచేత ఆయనే మనచెంతకు వస్తారు. ఇదీ మన అదృష్టం. భాగవతం చెప్పింది - యోగులు, మహాతపస్సు చేయగలిగినవాళ్ళు తమ హృదయాలలోనే తమ జ్ఞానశక్తిచేత పరమాత్మను దర్శిస్తూ వుంటారు. అట్లా దర్శించలేని మనలాంటివాళ్ళ కోసం మన దగ్గరకు పరమాత్మ వస్తారు. ఎందుకంటే ఆయన వాళ్ళకు తల్లీ, తండ్రీ ఎలాగో, మనకూ అలాగే తల్లి తండ్రీ గనుక. ఆయనకు బిడ్డలిద్దరిపైన సమానమైన ప్రీతే. తల్లికి ఆరోగ్యంగా వుండేబిడ్డ ఎక్కువ, ఆరోగ్యంలేని బిడ్డ తక్కువ ఎలా కాదో, భగవంతుని దృష్టిలో శుకుడు ఎక్కువా కాదు, మనము తక్కువాగాదు. ఇదీ మనం గమనించవలసిన విషయం. 'వారెక్కడ మహర్షులు! మనమెక్కడ వారితో తూగుతాము, అనుకోవలసిన పనిలేదు. వారు చేరుకోగలరు కాబట్టి వాళ్ళ కోసం ఆయన రానవసరంలేదు. మనం చేరుకోలేము కాబట్టి మనకోసం ఆయన మన దగ్గరకు వస్తారు.

అందుకే భాగవతం ఏం చెప్పిందంటే ఎవరైతే తమ తపశ్శక్తిచేత అంతటా వుండేటటు వంటి భగవంతుణ్ణి యోగాభ్యాసం, తపస్సుద్వారా దర్శించలేరో, అటువంటి వాళ్ళకోసం భగవంతుడు భూమిమీద మానవులకు ఎప్పుడూ లభిస్తూనే వుంటాడు. ఏ రూపంలో లభిస్తాడంటే మానవాకారంలో వుంటూ కూడా పూర్ణుడైన పరమాత్మ స్వరూపులైన అవధూతల రూపంలో లభిస్తాడు. దానికి వాళ్ళు మరొక ఉదాహరణ యిచ్చారు. దానిని యింతకు ముందు మనం చెప్పుకున్నాముగూడ. నెలల బిడ్డకు తల్లి ప్రేమను అర్థం చేసుకునేటటువంటి పద్ధతి వేరే వుంటుంది. ఆ బిడ్డకు మనస్సు ఎదగలేదు. ఆ బిడ్డకు నఖశిఖ పర్యంతమూ తల్లియే అయినప్పటికీ ఆమె పోషణము తల్లియొక్క స్తన్యంలోనే పొందుతాడు. అలాగే ఆవు కొమ్ము చివరినుండి తోక చివరివరకూ ఆవే అయినప్పటికీ మనకవసరమైన పాలు మాత్రం దాని పొదుగు దగ్గరే పొందు తాము. అలాగే పరమాత్మ విశ్వమంతటా వ్యాపించి వున్నప్పటికీ ఈ మహాని యుల రూపంలోనే ఆయన అనుగ్రహము మనకు లభిస్తుంది. ఇదీ ప్రధాన మైన అంశం. దానినుంచే భగవద్గీత వుత్పన్నమైంది. అట్లా వచ్చిన రూపాలలో కృష్ణ పరమాత్మ ఒకరు. ఇక్కడ నుంచి పరమాత్మ స్థితికి చేరుకున్న వారికోసం, అంటే శుకుని వంటి వారికోసం ఆయన రాలేదు. శుకుడు ఆయనను చూడనే లేదు, పరమాత్మ వుండేచోటుకు శుకుని హృదయం ఎప్పుడో చేరుకుంది. అట్లాగాక

నావాళ్ళు, పరాయివాళ్ళు అనే ద్వంద్వాలలో చిక్కినటువంటి అర్జునుడు మొదలైన వారికోసం వచ్చింది.

ఒకరు ప్రశ్న వేశారు. "అన్ని అక్షౌహిణుల సైన్యాన్ని ఆయన నశింప జేసాడు గదా! ఇదెక్కడి అవతార కార్యము, యిదెక్కడి దయ?" అని. అందుకా పెద్దలు సమాధానం ఏం చెప్పారంటే - మహాభారత యుద్ధంలో అంతమంది చనిపోవడానికి కృష్ణుడే కారకుడయ్యాడు, నిజమే. కాని ఆయన రూపం ఎలా వుండేది అంటే ఆయనలో దివ్యమహిమ నిండివుండడం వల్ల చూచిన ఎవరికైనా ఈయన మానవ మాత్రుడు కాడని తెలిసేదట. ఏ వ్యక్తినైనా చూస్తే మనకెటు వంటి భావాలు కలుగుతాయో అటువంటి భావాలేవీ కలుగ కుండా మనసు నిర్మలంగా నిశ్చలంగా అయి ఒళ్ళు మరచి ఆయనను చూస్తూ వుండేవారట. ఈ విషయం శ్రీసాయిబాబా చరిత్ర చదివితేగూడా తెలుస్తుంది. శ్రీసాయి బాబా వద్దకు వచ్చే ఒక్కొక్క భక్తుడు ఆయనను కన్నార్పకుండా ఆయనను చూస్తూ వుండేవాడట. "ఏమిటి! నీకేమన్నా పిచ్చా? అలా చూస్తున్నావు?"అని అడిగితే ఆయన దివ్య ముఖారవిందాన్ని చూస్తుంటే ఏదో తెలియని ఆనందం కలుగు తోంది, ఎప్పుడూ అలాగే చూడాలని అనిపిస్తోంది" అనేవారట. ఇది సాయిబాబా చరిత్రలో భక్తుల అనుభవాలలో వస్తాయి. ఆయనకేమీ కిరీటాలు లేవు. నాలుగు చేతులు, శంఖు చక్రాలు కనిపించడంలేదు. మనలాగా రక్త మాంసాలతో వున్న మనిషిలాగానే వున్నాడు. మరి ఆ వర్చస్సు ఏమిటో తెలియదు గాని అలాగే చూస్తూ వుండిపోయేవారట. పరిసరాలనే మరిచిపోయేవారట. కృష్ణపరమాత్ముని రూపంగూడా అలానే వుండేదిట.

భగవద్గీతలో ఒక విషయం చెప్పారు. చనిపోయేముందు మనస్సు, హృదయం దేనియందు లగ్నమవుతుందో, వాడు దానినే పొందుతాడుఅని. అందుకని అక్కడ యుద్ధరంగంలో మరణించిన వారందరి దృష్టి కృష్ణునిమీద మాత్రమే వుంది. అందుకని వాళ్ళందరికీ ఉత్తమగతులే కలిగాయి. వాళ్ళు యుద్ధరంగంలో తమ అంత్య దశలో కృష్ణుణ్ణే చూస్తున్నారు. ఇది ఎటువంటి దంటే ప్రేమలో పడిన యువతీ యువకుల మనస్తత్వంలాంటిది. ఎవరో ముక్కు ముఖము తెలియని వాళ్ళను త్వరపడి పెళ్ళి చేసుకోవద్దని పెద్దవాళ్ళు ఎంత చెప్పినాసరే మేము కష్టపడినా, సుఖపడినా ఒకరికొకరమే అంటారు వాళ్ళు. అట్లాగే యుద్ధరంగంలోని వాళ్ళ మనస్సు కూడా వేరొక ధ్యాసలేకుండా పోయి

ఆయనను చూస్తూనే ప్రాణాలు వదిలారు. అందుకే వాళ్ళందరికీ ఉత్తమ గతులే శ్రీకృష్ణుడు ప్రసాదించాడు అంటారు పెద్దలు. కాబట్టి శ్రీకృష్ణుడు ఎవరి కోసం వచ్చాడు? తపస్సు ద్వారా ఆయనను చేరుకోలేనటువంటి మనవంటి వారికోసం వచ్చారు. అందువల్ల అనేక కారణాలు, అనేక ప్రయోజనాలు నెరవేరుతాయి.

ఉదాహరణకు యిక్కడ మందిరంలో సాయిని పెట్టుకుని పూజా పునస్కారాలు చేస్తున్నాము. నైవేద్యాలు పెడుతున్నాము. భక్తులంతా వస్తున్నారు. సాయినాథుని గూర్చి తెలుసుకుంటున్నారు. సాయిని దర్శించుకుంటున్నారు. ఆనందిస్తున్నారు. అలాగే యిక్కడకు చిన్నచిన్న పిల్లలు వస్తున్నారు. విశాలంగా వుండే మందిరాన్ని, అందులో జరిగేవాటిని వినోదంగా చూస్తున్నారు, ప్రసాదాలు తిని వెళ్తున్నారు. అదిగాక యితర జీవులకుగూడ అంతో యింతో వాటికి కావలసిన తిండి వాటికి లభిస్తున్నది. సమీపంలో పూజా పునస్కారాలకు కావలసిన వస్తువులు అమ్ముకునే వారుంటారు. వాళ్ళకు భక్తి వుండకపోవచ్చు. కాని వాళ్ళ వస్తువులు అమ్ముడుపోయి జీవనం గడవడమనే వాళ్ళ ప్రయోజనం వాళ్ళకు నెరవేరుతున్నది. ఎవరి దృష్టిని బట్టి వాళ్ళ ప్రయోజనాలు నెరవేరుతున్నాయి. పిల్లలకు కాలక్షేపం, పెద్దలు పవిత్రమైన భావాలు కలిగేలా సమయం గడుస్తున్నది. వస్తువులు అమ్ముకునే వారికి జీవనోపాధి కలుగుతున్నది. అట్లాగే కృష్ణపరమాత్మ ఎన్నో జీవులయొక్క అవసరాలను తీర్చడానికి ఆవిధంగా అవతరించాడు. ఆయన వచ్చి మనకు చెప్పినటువంటిది భగవద్గీత. అంటే భాగవతంలో చెప్పినది తు.చ. తప్పకుండా యిక్కడ సరిపోతుందన్నమాట. మనము వెళ్ళలేము గనుక ఆయనే మనవద్దకు వచ్చాడు. వచ్చి ఏం చేసాడంటే - తల్లిదండ్రులకు బిడ్డదగ్గర ముద్దుకలిగినప్పుడు ఏం చేస్తారు? ఆ బిడ్డలాగానే ముద్దు మాటలు మాట్లాడుతారు. వాడు పాడితే వాడితోపాటు పాడుతారు. వాడు కొట్టినట్లు నటిస్తే వాడిలాగ కళ్ళమీద చేతులు పెట్టుకుని ఏడుస్తున్నట్లు నటిస్తారు. ఎందుకంటే వాడికి సరదా కల్పించడంకోసం.

అలాగే కృష్ణుడుకూడ మనకర్థమయ్యేపదాలు, మనకు అర్థమయ్యే భావాలు తీసుకొని వాటితో మనతో వ్యవహరిస్తాడు. గోపాలురతో ఆడు కున్నాడు. అర్జునునితో సరదాలాడాడు. యుద్ధరంగంలో సామర్థ్యంగల మహానాయకుడిగా వ్యవహరించాడు. అన్ని సామర్థ్యాలు ఆయనలో వున్నాయి. అలాగాక కేవలం యోగాభ్యాసం మాత్రమే వున్న ఉద్ధవునికి ఉద్ధవగీతను ఉపదేశించాడు. వాడి

స్థాయివాడిది. వీడి స్థాయి వీడిది. ఆయనలో అన్ని స్థాయిలు వున్నాయి. అలాగే సాయి మన స్థాయి కొచ్చి మన దగ్గర వ్యవహరించాడు. ఆవు పొదుగు దగ్గర మాత్రమే పాలు లభించినట్లు మహాత్ములవద్ద మాత్రమే భగవంతుని పొంద గలము. అయితే ఈ మహాత్ముల తత్త్వమేమిటి? చూడడానికి మనలాగానే మానవాకృతి వుంటుంది. మనలాగానే తింటారు, మనలాగానే తిరుగుతారు, మనలాగానే వ్యవహరిస్తారు. కాని వాళ్ళ అంతఃకరణ మాత్రం పూర్ణమైన భగవత్స్వరూపమే అయివుంటుంది. అదే అర్జునుణ్ణి గుర్తుపట్టమని ఆయన చెప్పింది. 'నేను నీతోపాటు ఆడుకుని వుండవచ్చు, సారధిగా రథమెక్కించి తీసుకురావచ్చు, నీ రథాన్ని మువ్వెక్కడ ఆపమంటే అక్కడ ఆపవచ్చు. కానీ నీవు ఏమీ తెలియక గందరగోళ పడిపోయే సమయంలో వున్నపుడు అన్నీ తెలియ జెప్పడానికి, అవసరమైతే విశ్వరూపం సాక్షాత్కారమిచ్చి నీకు విషయం విశద పరచడానికి వున్న నేను ఎవరినో నీవిప్పుడు తెలుసుకో' అని చెప్పాడు.

అందుకని ఆ విధంగా వచ్చిన రూపాలు మనకు బోధిస్తాయి. అందుకని భగవద్గీత మనకు శిరోధార్యమైంది. అటువంటి మహాత్ములను ఆశ్రయించాలి అనడానికి అదే ఉదాహరణ. అదే భగవద్గీత యొక్క సారాంశము. భగవద్గీత అట్టి మహాత్ములను ఆశ్రయించమని చెప్పిందిగూడా. లేకపోతే ఎవరిని ఆశ్రయిం చాలి? ఎవరు చెప్తారు? వేదాలు, ఉపనిషత్తులు వున్నాయి. కాని వాటికి సరైన అర్థాన్ని ఎవరు చెప్పగలరు? ఇదివరకు నేను నాస్తికంగా వుండేరోజులలో అనేక చోట్లకు వెళ్ళాను. ఎంతోమంది పెద్దలను దర్శించాను. నా సందేహాలు తీర్చమని అడిగాను. 1961సం॥ వరకూ నేనిక్కడ (ఒంగోలు) పనిచేసాను. నేనీ వూరి నుంచి వెళ్ళిపోబోయే 2,3 నెలల ముందు వరకూ నాస్తికంగానే వున్నాను. అప్పుడు ఈ ఉపనిషత్తులు, పురాణాలు బోధించడంలో అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన పెద్దలను ప్రశ్నించాను. ఒకసారి పరీక్షలు వ్రాయడానికి ఢిల్లీ వెళ్ళాను. అక్కడ ఒకచోట పెద్ద పందిరి వేసివుంటే చూద్దామని వెళ్ళాను. అక్కడ గీతాజ్ఞాన యజ్ఞం జరుగుతున్నది. ఆరోజు ఆఖరిరోజు. పెద్దలొకరు ప్రవచనం చేస్తున్నారు. ఆయన తను ఉపన్యాసం ముగిస్తూ "ఈ రోజుతో గీతా యజ్ఞం ముగిసింది గనుక ఏమైనా సందేహాలుంటే అడిగి తెలుసుకోవచ్చు. సాయంత్రం ఫలానాచోట మేము వుంటాము. అక్కడకువచ్చి సందేహాలు తీర్చుకోండి" అని చెప్పారు.

నేనున్నచోటుకు ఆయనచెప్పిన చోటు దగ్గరే గనుక ఆ రోజు

సాయంత్రం వెళ్ళి కూర్చుని వాదించడం మొదలుపెడితే సమాధానమెక్కడా చిక్కక, 'ఏమయ్యా! నువ్వింత వున్నావో లేదో ఋషులను ప్రశ్నించేవాడివా? వాళ్ళు చెప్పింది అబద్ధమని నీ ఉద్దేశ్యమా? అసలు నువ్వేం ధ్యానం చేసావు గనుక? నువ్వేమి తపస్సు చేసావు గనుక యిలాంటి ఆవకతవక ప్రశ్నలు వేస్తున్నావు?' అని మండిపడ్డారు. అప్పుడు నేనన్నానంటే - అయ్యా! నేను ఋషులు చెప్పింది కాదనడం లేదు. కాదనడానికి నేను తపస్సు చేసి వుండాలిగదా! నా ప్రశ్న ఏమంటే ఋషులు చెప్పినది సత్యమేనన్న విశ్వాసం మీకెలా కలిగింది? మీరే కారణాలు చూసి వారు చెప్పినది నిజమని నమ్మారు? వాళ్ళు గొప్పవాళ్ళు అయితే కావచ్చు, వాళ్ళు చెప్పినది సత్యమేనని మీరెలా తెలుసుకున్నారు? ఏ కారణాలవల్ల నిర్ధారణ చేసుకున్నారు? అని మాత్రం నేనడుగుతున్నాను" అని అడిగితే ఆయన అన్నారు: "చిన్నా పెద్దా లేకుండా మాట్లాడుతున్నాడు, వాడిని బయటకు గెంటండి"అని.

ఉపనిషత్తులగూర్చిగాని, వేదాల గూర్చిగాని చెప్పడానికి బ్రహ్మానుభూతిని పొందినవాడు, బ్రహ్మానుభూతిని యివ్వగలవాడు మాత్రమే అర్హుడు. అందులో ఉపనిషత్తులు చూస్తే వాటిల్లో ఒకచోట బ్రహ్మవిద్య యిలా అంటుంది "నీకు వివాహయోగ్యమైన బిడ్డవున్నపుడు ఆమెనిచ్చి వివాహం చేయబోయే ముందు వరుణ్ణి ఎన్నోసార్లు విచారించి బిడ్డనిస్తావు గదా, అలాగే నన్ను ఎవరికైనా యివ్వదలచుకున్నప్పుడు వాడు అర్హుడైనవాడు అవునో కాదో చూచి మాత్రమే యివ్వుసుమా! లేకపోతే వాడు చెడి, నన్ను చెడగొట్టి లోకాన్ని చెడగొడతాడు. అట్లా మాత్రం చేయకు''అని. ముముక్షునైనవాడు, బ్రహ్మ నిష్ఠుడు, శ్రోత్రియుడు అయిన వాడి దగ్గరకు మాత్రమే వెళ్ళవలసినదని శాస్త్రం చెబుతుంది. మరి అటువంటివాడు మనకెక్కడ దొరుకుతాడు? ఉపనిషత్తులను, భగవద్గీతను, అందులో చెప్పబడ్డ పరమాత్మ తత్త్వాన్ని అనుభవించి మనకు చెప్పగలవాడు ఎవడు? తాను అనుభవించినవాడు మాత్రమే మనకు అనుభవాన్నివ్వగలడు.

చరిత్ర చూస్తే ఈ విషయం మనకు తెలుస్తుంది. శ్రీరామకృష్ణ పరమహంస వున్నారు. పరమాత్మ సాక్షాత్కారాన్ని ఆయన పొందారు. ఆయన వద్దకు వివేకానందుడు వెళ్ళాడు. "ఏమయ్యా! దేవుణ్ణి గురించి అందరూ మాట్లాడేవాళ్ళే. నువ్వు గూడా భగవంతుని గూర్చి పూరికే మాట్లాడుతున్నావా? నిజంగా నువ్వు ఆయనను చూసి చెబుతున్నావా?'' అని అడిగాడు. అందుకాయన, "నేను నిన్నెట్లా చూస్తున్నానో, భగవంతుని గూడా అట్లాగే చూస్తున్నాను'' అన్నారు.

అట్లాగయితే నాకు చూపించమన్నాడు వివేకానందుడు. రేపు వస్తే అట్లాగే చూపిస్తామ అన్నారాయన. అతనిని మాటలలో పెట్టి మాట్లాడుతూనే తన పాదంతో అతనిని మెల్లగా తాకారు, అంతే! అతనికి పరమాత్మానుభూతి కలిగింది. ఆ తర్వాత అతనిని ఆ స్థితిలోంచి లేవగొడితే, 'నన్నెందుకు మేల్కొలిపారు? నన్నట్లాగే వుండనీయకపోయారా?' అన్నాడు. అందుకని ఆ స్థితిలో వున్నవాడు మాత్రమే భగవద్గీత చెప్పాలి. అయితే వివేకానందుడికి యిచ్చాడని తమ వద్దకు వచ్చిన వాళ్ళందరికీ ఆయన ఆ స్థితిని యిచ్చారా? అసలు యివ్వడం సాధ్యమా?

దీనికి ఉదాహరణ మనకు సాయినాథుని చరిత్రలో తెలుస్తుంది. బీడీలు అమ్ముకునే వాడొకడు సాయినాథునికి అప్పుడప్పుడు బీడీలిస్తుండేవాడు. సాయినాథుడు తమ వద్దకు వచ్చేవారికి ఎన్నో అనుభవాలను యివ్వడం చూసాడు. అప్పుడు సాయినాథుని వద్ద బ్రహ్మానుభూతిని పొంది సిద్ధ పురుషులై కీర్తి గడించిన వాళ్ళు అక్కడక్కడా వున్నారు. ప్రొద్దు గుంకిన కొద్దీ ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినుకుమన్నట్లు అట్టి మహాత్ముల సంగతులు బయటపడుతున్నాయి. మద్రాసు సమీపంలో టుదూర్ అనే ప్రాంతముంది. అక్కడ రెడ్‌హిల్స్ స్వామి అనే ఒక మహాత్ముడు వుండేవారు. ఆయన ముస్లిమ్. ఆయన దగ్గర వుంటూ సేవ చేసుకుంటూ వుండే ఘనశ్యామ్ అనునతడు మద్రాసులో వున్నారు. అతడు రెడ్‌హిల్స్ స్వామిదగ్గర అనేక అద్భుతలీలలు చూసాడు. ఒకసారి ఆయన ఘనశ్యామ్‌తో నేను వెళ్ళిపోతున్నానని చెప్పారు. అప్పుడతడు, నాకొక చిన్న సందేహంవుంది. మీ గురువెవరో తెలుసుకోవాలని వుంది, చెప్పమని ప్రార్థించాడట. 'రేపు ప్రొద్దున చెబుతాను' అన్నారట ఆయన. మర్నాడు ఉదయమే స్నానసంధ్య చేసుకుని ఆయన సన్నిధికి వెళ్ళాడు ఘనశ్యామ్. అప్పుడా స్వామి అతనిని సూర్యబింబంకేసి చూడమన్నారట. ఆయన చెప్పినట్లు చూచేసరికి సూర్యబింబంలో ద్వారకామాయిలో వున్న సాయినాథుని ముఖం, అయిదునిమిషాలపాటు కన్పించిందట. అప్పుడతడు స్వామిని ఆ దర్శనం యొక్క అర్థమేమిటని అడిగాడట. నిన్న నీవడిగిన ప్రశ్నకు సమాధానమని చెప్పారట స్వామి. అంటే ఆయన గురువు సాయినాథు డన్నమాట. ఆయన సాయి వద్దకు ఎప్పుడు వెళ్ళారో తెలియదు.

ఇటువంటి అనుభూతినివ్వడం ఆ బీడీలమ్ముకునేవాడు చూసాడు.

నాకూ అట్టిస్థితినిమ్మని బాబాను అడిగాడు. భక్తితో వుండు పరిపాకం వచ్చి నపుడు అదే వస్తుంది అంటే అతడు వినక పదే పదే ఆయనను అడుగుతూండేవాడు. నేను నీకింతకాలంగా సేవ చేస్తున్నానుగదా, బీడీలిస్తున్నాను గదా, నాకాస్థితి ఇవ్వవలసినదేనని పట్టుపట్టేవాడు. చాలా రోజులు పెడచెవిని పెట్టి వూరుకున్నారు బాబా. ఒకరోజు అతడు బీష్మించాడు. చివరకు బాబాకు విసుగేసి, "తీసుకో పో" అని ఒట్టి చేతిని అతని వైపు విదిలించారు. అంతే! అప్పటినుండి వాడికి యిల్లు, వాకిలీ, భార్యాపిల్లలు, బీడీలు యివేవీ గుర్తులేవు. సరిగ్గా బాబాలాగానే ప్రవర్తించేవాడు. పగలు, రాత్రి ఏమీ తెలిసేది కాదు. ఎండా, వానా తెలిసేది కాదు. అరబ్బీలోని, ఖురాన్‌లోని ఏవో మంత్రాలు చదువుతుండేవాడు. పిచ్చివాడిలాగా యిల్లు వాకిలీ పట్టకుండా తిరుగుతుండేవాడు. అతనికి బుద్ధి పుట్టినప్పుడు ఎప్పుడైనా, ఎవరికైనా ఒక్క మాట చెబుతుండేవాడు. అవి తప్పక జరిగితీర వలసిందే. 'ఒరేయ్! ఆటు వెళ్ళబోకు, ఫలానా చోట పాము ఎదురు అవుతుంది అని ఒకనితో చెప్పాడు ఒకసారి. అతడు చెప్పినట్లే జరిగింది. ఇలా అతడు చెప్పినవన్నీ జరుగుతుండేవి. అతనిని ఆ స్థితిలో చూసిన అతని స్నేహితుడొకనికి ఏమీ అర్థం కాలేదు. "ఏమిరా! పెళ్ళాం, పిల్లలు పట్టకుండా, యిల్లూ, వాకిలీ పట్టకుండా యిలా పిచ్చివానిలా తిరుగుతున్నావ్" అన్నాడు. ఇతడు, "ఇది పిచ్చిగాదులే, నీపని నువ్వు చేసుకుపో" అన్నాడు. అప్పుడా స్నేహితుడు, "ఇది పిచ్చిగాక మరేమిటి? శుభ్రంగా యిది పిచ్చే!"అన్నాడు. "అయితే నువ్వూ అట్లాగే అవుగాక!" అన్నాడతడు. వెంటనే ఆ స్నేహితుడు గూడా యిల్లూ, వాకిలీ పట్టకుండా పిచ్చివాడిలాగా తిరగడమారంభించాడు. ఆ విధంగా ఆ బీడీలమ్ము కునేవాడు ఏది మాట్లాడితే అదల్లా జరిగింది.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు సాయినాథుడు మశీదులో కూర్చుని వున్నారు. ఎవరూలేని సమయంచూసి వాడు సాయినాథుని వద్దకు వెళ్ళి ఆయన రెండు కాళ్ళు పట్టుకున్నాడు. "బాబా! ఈ స్థితిని భరించలేకుండా వున్నాను. నీవిచ్చిన ఈ స్థితిని నువ్వే తీసుకో" అని ప్రార్థించాడు. అలాగేనని బాబా 'లాప్' అంటూ అతని దగ్గరనుంచి ఏదో వస్తువును తీసుకుంటున్నట్లు తమ చేతిని కదిలించారు. వెంటనే అతనికాస్థితి తొలగిపోయింది. అతడు మామూలుగా వున్నాడు. అంతేగాక మధ్యలో ఏం జరిగిందో పూర్తిగా మర్చి పోయాడు. అప్పుడు ఏ స్థితిలో వున్నాడో, తనలో ఆ శక్తి ఎట్లా వచ్చిందో, ఎట్లా

పని చేసిందో అతనికి ఏమీ తెలియదు. నిద్రపోయిలేచిన వాడికి నిద్రపోయి నప్పుడువున్న స్థితి ఎలా వుంటుందో అలా వుందతనికి. అందుకని అతనికి సాయినాథుడు ఆ స్థితిని యిస్తే ఏమైంది? నా కొద్దుబాబూ తీసుకో అన్నాడు. అందుకని అట్టి స్థితిని యిచ్చినా పుచ్చుకునేది వుండదు!

అందుకని పరిపాకం రానివారికి ఆ స్థితిని యివ్వలేరు. అంతటి వివేకా నందుడు గూడా తనను రామకృష్ణ పరమహంస కొద్దిగా తాకేసరికి తట్టుకోలేక, "నన్నేం చేస్తున్నారు మీరు"అన్నాడు. అప్పుడు రామకృష్ణ పరమహంస నవ్వి, "నువ్వు సప్తర్షి మండలంనుండి లోక కల్యాణం కోసం అవతరించిన వాడివి. అంతటి నీవే భగవదనుభూతిని తట్టుకోలేక, "అమ్మయ్యో! నన్నేం చేస్తున్నారని అడిగితివే, మరి నీకే అంతటి భయం కలిగితే, యిక మామూలు వాడి పరిస్థితి ఏమిటి?" అన్నారు. అందుకని వాళ్ళు యిచ్చినా పుచ్చుకునే పరిస్థితి వుండాలి. సమర్థత వున్నవాడికి యివ్వడానికి వాళ్ళు వెనుకాడరు. ఇది మనం గమనించాలి. అందుకని భగవద్గీతకు అర్థం ఎవరు చెప్పాలి? ఆ స్థితిలో వున్నవాళ్ళు, అనుభవాన్ని యివ్వగలవాళ్ళు చెప్పాలి. ఎవరికి చెప్పాలి? అర్హతగలవాళ్ళకు చెప్పాలి. భగవద్గీత నాలుగవ అధ్యాయంలో శ్రీకృష్ణుడు చెప్పాడు, "శ్రద్ధాసక్తులు లేనివాడికి చెప్పవద్దు, ఎవడికంటే వాడికి చెప్పవద్దు. నీవు నాకు ఆత్మీయుడవు గనుక ఈ రహస్యమైనటు వంటి, గుహ్యాతమమైనటువంటి ఈ విషయాన్ని నీకు చెబుతున్నాను"అని. అటు వంటప్పుడు పదివేలమందిని, యాభైవేల మందిని కూర్చోబెట్టి ఉపన్యసించడ మన్నది కృష్ణునికి తెలియకపోవడమా? మనకు తెలియకపోవడమా? అనుభవాని కొస్తే కృష్ణుడు యిచ్చిన అనుభవాన్ని మనం యివ్వగలమా? అందుకని అటువంటి దానిని వివరించి అనుభవాన్ని యివ్వ గలవారు ఎవరయ్యా అంటే ఆ స్థితిలో వుంటూ మానవాకృతిలో మన కొరకు పరమాత్మ వచ్చి భూమిమీద తిరుగుతూ వుండే సద్గురువు మాత్రమే. వాళ్ళు వచ్చేది యిందుకే. అందుకని వాళ్ళ దగ్గరకు వెళ్ళు. ఇదే భాగవతం యొక్క రహస్యం, ఇదే భగవద్గీత యొక్క రహస్యం. అందుకని అటువంటి మహాత్ముడు తప్ప మరెవ్వరూ చెప్పడానికి అర్హులుకారని పెద్దలు చెప్పారు. ఎందుకు చెప్ప వద్దన్నారంటే ఆత్మజ్ఞానానుభవం పొందనివాడు చెప్పినా వినలేము, విన్నా అర్థం చేసుకోలేము, అర్థం చేసుకున్నట్లు అనిపించి నప్పటికీ ఆచరణలో పెట్టలేము.

ఉదాహరణకు భగవద్గీత అర్థంతోటి చదువుతున్నాము. నిత్య పారా

యణ చేస్తున్నాము. అందులో శ్రీకృష్ణుడు, తాను అన్ని జీవుల హృదయాల లోనూ నిండి వున్నానని, తన మాయచేత అన్నింటినీ ఆడిస్తున్నానని చెప్పాడు. జ్ఞాని లక్షణాలను, స్థిత ప్రజ్ఞుని లక్షణాలను, భక్తుని లక్షణాలనూ చెబుతూ, భక్తుడైనవాడు అన్నింటియందూ తననే దర్శిస్తాడు అని చెప్పాడు. కాని ఆ స్థితిని మనం పొందడమెలా? కాని మానవుని జీవితం యొక్క ప్రయోజనం అదే. బడికంటూ వెళ్ళి చేరడానికి కారణం విద్య నేర్చుకుని సమర్థులుగా బ్రతకడం నేర్చుకోవడానికి మాత్రమే. బడికి వెళ్ళడంలోని ప్రయోజనం ఎట్లాగో, భూమి మీద మానవునిగా జన్మనెత్తినందుకు ప్రయోజనం ఒక్కటే. ధర్మము, అర్థము, కామములను సంపాదించి మోక్షాన్ని గూడ పొందడమే. నాలుగు పురుషార్థాలనూ పొందడమేనని శాస్త్రం చెప్పింది. ఋషులు చెప్పారు. తక్కిన పురుషార్థాలు నాకొద్దు, మోక్షం మాత్రం కావాలంటే కుదరదు. తన్నడానికి నేల లేకుండా సైజెగిరే ప్రశ్నే లేదు. కాళ్ళ క్రింద నేల లేకుండా తన్ని సైకెట్లా ఎగురగలడు? అందుకని ధర్మము, ధర్మాన్ని అనుసరించిన అర్థము, ధర్మాన్ని, అర్థాన్ని అనుసరించిన కామము, ఎవడైతే అంగీకరిస్తూ, అనుభవిస్తూపోతాడో, అట్టివాడు మోక్షానికి అర్హుడవుతాడు. అప్పుడు దీనిని తన్నివాడు మోక్షానికి వెళ్ళగలుగుతాడని పెద్దలు చెప్పారు. అందుకని దానిని నిర్వచించి అర్థమయ్యేటట్లు అర్థం చెప్పగలవాడు ఆ స్థితిలో వున్నవాడు మాత్రమేనని చెప్పారు. కాబట్టి వారిని ఆశ్రయించవలసిందే.

కాని ఈ నాలుగు పురుషార్థాలనూ అంటే ధర్మార్థకామ మోక్షాలను పొందాలంటే - మనస్సు శుద్ధంగా వుండాలి, శుద్ధమైన వాసనలతో, శుభమైన వాసనలతో నింపుకున్నాక అప్పుడు శుభాశుభ ఫలితములకు అతీతమైన స్థితిని పొందడానికి ప్రయత్నం చేస్తాడు. అప్పులు వున్నటువంటివాడు అప్పులన్నీ తీర్చుకుని కొంత నిలువ చేసుకున్నాక ఇక సంపాదించడానికి అవసరం లేని స్థితిని పొందుతాడు. అలాగే ముందు మనం అప్పుల్లో వున్నాం. అంటే మనలో అశుభమైన వాసన లున్నాయి, అప్పు తీర్చేసుకుని అదనంగా మిగుల్చుకున్నాము అంటే అశుభమైన వాసనలు తీర్చేసుకుని శుభమైన వాసనలను ఏర్పరుచుకున్నాము. కాని అది గూడా యివ్వాళ రావచ్చు, రేపు పోవచ్చు అనే స్థితిలో వున్నాము. అలా గాక యిలా రావడానికి, పోవడానికి వీలులేని స్థితిని దానిలో సంపాదించుకున్నట్లే అదే రీతిన ధర్మాధర్మాలకూ, శుభాశుభాలకూ లొంగనటువంటి అతీతమైన స్థితిని పొందాలి. ఇది పొందాలంటే-ఈ మనస్సును శుద్ధంగా వుంచుకోవాలంటే, ఈ

నాలుగూ చేసి తీరాలని చెప్పింది. యజ్ఞము, దానము, తపస్సు, కర్మ. ఈ నాలుగింటినీ విడిచిపెట్ట డానికి వీలులేదు అంటూ, ఆ విషయం తెలియక మానవులు ఎలా పొరపాటుపడుతున్నారో గూడ చెప్పారు. కర్మలు చేస్తే కర్మల ఫలితం రూపంలో మళ్ళీ జన్మపరంపరలకు రావలసి వుంటుంది గనుక ఏ కర్మలూ చేయకూడదు అని కొందరు అంటున్నారు. యజ్ఞ, దాన తపఃకర్మలుగూడా చేయకూడదు అంటున్నారు. అలాగాక మరికొంతమంది చేసి తీరాలని అంటున్నారు. మరికొంతమంది చేయకపోతే వీలులేదు అంటున్నారు. వారిద్దరూ గూడ పొరబడ్డారు అని చెబుతున్నాడు గీతాచార్యుడు. అసలైన విషయం నేను చెబుతున్నాను విను అంటున్నాడు.

అదేమిటంటే ఈ నాలుగింటిని చేయవలసిందే కాని వాటిద్వారా ఏమీ పొందాలని ఆశించకుండా చేయి అంటున్నాడు. చేయాలి గాబట్టి చేయి అంటున్నాడు. అంటే తల్లి బిడ్డకు అన్నం పెడుతుంది, అంటే రేపు అతడు ఉద్యోగం చేసి తనను పోషిస్తాడు అన్న ఉద్దేశ్యంతోనా? అట్లా అయిన పక్షంలో వాడు జబ్బునపడి మంచంలో వుండి యిక లేచే పరిస్థితి లేకపోతే వాడిని గొంతుపిసికి చంపేయాలి, కాని చంపదు. తన ప్రాణాలొడ్డి అయినా బ్రతికించుకోవాలని చూస్తుంది. అలా ఎందుకు చేస్తుంది? తల్లి కాబట్టి చేస్తుంది, వేరే కారణం లేదు. వాడు సుఖంగా వుండడమే ఆమెకు సంతోషంగాని వాడిద్వారా ఏదో పొందుదామని కాదు. అలాగే మనకిష్టమైన వాళ్ళపట్ల గూడ యిలాగే ప్రవర్తిస్తాము. ఎందుకంటే వాడు సంతోషపడితే మనకు బాగుంటుంది అంతే! యింకొక కారణమేమీ వుండదు. వాడంటే మనకు యిష్టము. వాడు సంతోషిస్తే మనకు సంతోషము. తప్పిస్తే వాడు మనకు ఆదిస్తాడేమో, ఇదిస్తాడేమో అని ఆశపడికాదు. వాడు సంతోషపడడమే మనకు కావాలి.

యజ్ఞము, దానము, తపస్సు, కర్మలను నిష్కామంగా చేయడం అన్నారు. కాని నిష్కామంగా ఎలా చేయడం? ఇది మనం జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయము. భగవద్గీత చెప్పినట్లే వుంటుంది. అర్థమైనట్లే వుంటుంది కాని అర్థం గాకుండా తప్పించుకు పోయేదిక్కడే! యజ్ఞదాన తపఃకర్మలను చేస్తాము. ఎలా చేస్తాము? స్వర్గం కోసమా? నాకు స్వర్గమక్కరలేదు అన్నామనుకోండి. పోనీ ఫలితం కోసం - అంటే ఏదైనా లక్ష్యం కోసం చేస్తామా? అదీ అక్కర్లేదు. మరిదేని కోసం చేస్తాము? చిత్తశుద్ధితో నిష్కామంగా చేస్తాము. చిత్తశుద్ధికోసము

అనేది కోరిక అవునా కాదా? చిత్తశుద్ధి కోసం తల్లి పిల్లలకు అన్నం పెడుతున్నదా? కాబట్టి ముక్తికోసమో, తరింపుకోసమో, దేనికో ఒకదాని కోసం చేస్తాము. ముక్తికోసము అంటే అది కోరిక అవుతుంది కదా! ముక్తి అంటే కోరిక లేకపోవడం.

తుంటరియైన ఒక పిల్లవాడు క్లాసులోకి టీచరు వచ్చినపుడు పిల్లలను మాట్లాడవద్దని చెప్పినప్పుడు వీడు యుక్తిగా తిట్లు తినకుండా "సైలెన్స్" అరవకండి అని పెద్దగా అరుస్తాడు. ఎందుకురా అరుస్తున్నావంటే 'అరవద్దంటున్నాను టీచర్, కోపగించుకోకండి' అంటాడు. అంటే వాడు ఆ వంకపెట్టి అరుస్తాడన్నమాట. అట్లాగే నాకే కోరిక లేకుండా ఇదంతా చేస్తాము అనడం సరికాదు. తరింపు అనే ఫలితాన్ని ఆశించే కదా యిదంతా చేస్తున్నాము! ఇదీ మనం గమనించవలసిన విషయం. ఏపని చేసినందువల్లనూ తరింపు అనే ఫలితం రాదు. తరింపు రావాలనే ఉద్దేశ్యంతో కర్మ చేయడంతో తరింపు పీలుపడదు. ఏమి ఆశించి శ్వాస పీలుస్తున్నాము? ఇంకాసేపట్లో ఏమైనా మింగి చచ్చిపోదామనుకున్నవాడు గూడ ఆ క్షణంలో శ్వాస పీలుస్తూనే వున్నాడు. వాడు పీల్చాలనుకుంటే పీల్చలేడు, ఆపాలనుకుంటే ఆపలేడు. అట్లా సహజంగా జరుగుతున్నప్పుడు నిష్కామ కర్మ అవుతుంది. ఆట ఆడుతున్నాము. ఎంతో సంతోషంగా ఆడుతాము. ఏమి ఆశించీ ఆడము. డబ్బుపెట్టి ఆడే ఆటలను ప్రక్కన పెడితే వినోదం కోసం మనం ఆడే ఆటలలో మనం ఏమీ ఆశించి ఆడము. ఆడుతుంటే బాగుంటుంది కనుక ఆడతాము. మన తెలివితేటలంతా ఉపయోగించి ఆడతాము. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు పట్టించుకోకుండా ఆడతాము. ఎందుకు? డబ్బులొస్తాయి కాబట్టా? ఉద్యోగంలో ప్రమోషన్ వస్తుందనా? ఏమీ కారణం కాదు. ఆడుతుంటే ఆనందంగా వుంటుంది. అంతే. అదీ నిష్కామకర్మ అంటే.

అలాగే యజ్ఞం చేస్తుంటే ఆట ఆడుతున్నట్లు వుండాలి. దానం చేస్తుంటే ఆట ఆడుతున్నట్లే వుండాలి. లేక సినిమా చూస్తున్నట్లు వుండాలి. అలా వుంటే నిష్కామకర్మ చేసినట్లు అవుతుంది. అలాగాక ఆముదం త్రాగినట్లు ముక్కు మూసుకుని తాగేస్తే కడుపుకు మంచిది కదా! బాగుండకపోయినా తాగుదాములే అని త్రాగినట్లు; నిష్కామంగా కర్మ చేస్తే మంచిదిలే అని చేసినపుడు ఆ పనిని అయిష్టంగా చేసిన వాళ్ళమవుతాము. అది నిష్కామకర్మ కాజాలదు. గతిలేక చేయడం అవుతుంది. తంతానంటే కాళ్ళు పట్టుకుంటామే అట్లా, చంపుతానని కత్తి చూపిస్తే నగలిస్తామే అట్లా. అది ఇష్టంగా చేయడమా? అది నిష్కామమా?

ప్రాణం దక్కాలనీ సకామంతో యిచ్చింది కాని అది దానం కాదు. అట్లాగే ఎట్లా గోట్లా యిష్టమున్నా లేకపోయినా యజ్ఞము, దానము, తపస్సు, కర్మ వేరే కోరిక లేకుండా చేసేస్తే మనకు తరింపు వస్తుందనుకున్నపుడు విధిలేక, గత్యంతరంలేక, ఆశతో, ఇష్టంలేకుండా చేసిన పని అవుతుందిగాని, అట ఆడుతున్నట్లు, సినిమా చూస్తున్నట్లు ఎందుకుంటుంది? అట్లా వున్నపుడు అది నిష్కామకర్మ అవుతుంది.

అందుకనే శ్రీకృష్ణుడు చెప్పాడు: "ఈ యజ్ఞము, దానము, తపస్సు, కర్మలు మానవులందరూ చేస్తే చేయవచ్చుగాక, చేసేవాళ్ళు మూడు రకాలుగా వుంటారు అని. భగవద్గీతలో చెప్పని విషయమే లేదు, కాని అన్వయించుకుని తెలుసుకోవడమే కష్టం. అదే గీతలోని గొప్పతనం. ఎన్నిసార్లు విన్నప్పటికీ బోధపడకుండా వుంటుంది. గీత అర్థం కావాలంటే సాయినాథుని చరిత్రలో చూస్తే తెలుస్తుంది. ఖాపర్డే అనువాడు సాయినాథుని వద్ద ఒక సంవత్సర మున్నాడు. అతడు రాజకీయాల్లో వున్నాడు. స్వతంత్రోద్యమంలో వున్నాడు. అందుకని అతడు కనపడితే అరెస్ట్ చేయాలని పోలీసులు అతని కోసం వెదుకు తున్నారు. అందుకని అతడు వచ్చి శిరిడీలో తలదాచుకున్నాడు. కాని అతడు యింటికి వెళ్తానని బాబాను అడుగుతుండేవాడు. అతడి వుద్దేశ్యం - "నేను మా వూరు వదలిపెట్టి శిరిడీలో ఎందుకుండాలి? భార్యా పిల్లలను వదలిపెట్టి ఎందు కిక్కడ వుండాలి? నేను మా వూళ్ళోనే వుంటే పోలీసులకు చిక్కకుండా బాబా రక్షించవచ్చు కదా!" అని. అంటే అతడు భార్యా పిల్లలను, ఆ వూరిని వదలిపెట్టి వాడు వుండడు, కాని అతడు అక్కడ వున్నప్పటికీ బాబాఅతనిని పోలీసులకు చిక్కకుండా చేయాలట. అందుకని అతడు బాబాను ఎప్పుడూ తిట్టుకుంటూనే వుండేవాడు. బాబా దగ్గరకు వెళ్ళి, "బాబా మా వూరు వెళ్తానయ్యా" అంటే "రేపు" అనేవారు బాబా. రేపు అనుమతిని యిస్తారు అనుకునే వాడతడు. అలాగే మర్నాడు వెళ్ళి అడిగే వాడతను. మళ్ళీ బాబా, "రేపు" అనేవారు. ఇలా ఎన్నోసార్లు అడిగి అడిగీ విసుగు పుట్టి వూరుకునేవాడు. పక్కవాళ్ళతో చెప్పిబాధపడుతూండేవాడు - బాబా నన్ను యింటికి వెళ్ళనీయడం లేదు, మీరైనా చెప్పండి అని. వాళ్ళు వెళ్ళి అడిగితే, "మీరెందుకు అడగడం? వాణ్ణి నాదగ్గరకొచ్చి అడగమను" అనేవారు. అతడే వచ్చి అడిగితే, "రేపు" అనేవారు తప్ప అనుమతినిచ్చేవారు గాదు. అతడు అన్నీ తన డైరీలో వ్రాసుకునేవాడు. ఒకసారి అతడు డైరీలో యిలా వ్రాసు కున్నాడు. "సాయినాథుడు నాకు రెండుకథలు చెప్పారు. అవి ఎంత అద్భుతమైన

కథలంటే ఏమైనా సరే వీటిని జాగ్రత్తగా డైరీలో వ్రాసుకోవాలి అనుకున్నాను. కాని అవి ఏ మాత్రం గుర్తులేవు" అని. బాబా వాటిని ఎట్లా మొదలుపెట్టారో, చివరకు ఏం జరిగిందో, కించిత్తుగూడ గుర్తు లేకుండా పోయిందట. పోనీ ప్రక్కవాళ్ళకన్నా గుర్తుందా అంటే ఆ సమయంలో బాబా సన్నిధిలో 50, 60 మందిదాకా కూర్చుని వున్న భక్తులందరూ శ్రద్ధగా విన్నప్పటికీ వాళ్ళెవరికీ కొంచెం గూడ గుర్తు లేదట. ఆ స్థితిలో వున్న వాళ్ళు మాట్లాడే మాటలు అట్లా వుంటాయి. అలాగే భగవద్గీత కూడా అర్థం కావడము, నిలవడమూ గూడా చాలా కష్టము.



అధ్యాయం-25

త్రిగుణాలు



ఎంతమందివచ్చి, ఎన్నిసార్లు భగవద్గీతోపన్యాసాలిచ్చినా, పెట్రోలు ఆవిరైపోయినట్లు ఆవిరైపోతాయి తప్ప వింటున్న వాళ్ళకు ఏదీ నిలువదు. వినేవాళ్ళకే కాదు. చెప్పేవాళ్ళకు కూడా ఏ మాత్రం నిలవదు. దానికి కారణం అందులోని విషయాలు జీవితంలో అన్వయించుకోవడం జరుగదు. ఎందుకంటే ఈ యజ్ఞ దాన తపఃకర్మలను చేసేవారు సత్వగుణ ప్రధానులు, రజోగుణ ప్రధానులు, తమోగుణ ప్రధానులు అని మూడు రకాలుగా వుంటారు. అలాగే యజ్ఞంపట్ల వారి భావము, దానిమీద వారికి వుండే అభిప్రాయము, దాని వెనుకవుండే ఉద్దేశ్యముమీద ఆధారపడి ఫలితం వుంటుందని గూడ భగవద్గీతలో చెప్పాడు. అందుకని రజోగుణ ప్రధానుడు అహంకారంతోను, గర్వంతోనూ యజ్ఞం చేస్తాడట. వీడు ఎంత గొప్పగా యజ్ఞం చేసాడు అని నలుగురూ అను కోవడం కోసం, ఆడంబరంకోసం చేస్తాడట. లేదా ఇంద్రాది పదవుల కోసం చేస్తాడట. లేదా మరుజన్మలో సిరి సంపదలతో, మహాభోగిగా జన్మించాలని చేస్తాడట. లేదా రాజ్యము మొ॥వి సంపాదించడం కోసం చేస్తాడట. ఇటువంటి కోరికలతో యజ్ఞం చేసేవాడిని రజోగుణ ప్రధానుడు అన్నారు. అట్లాగాక తనకేదో మహాశక్తులొచ్చి, తనను ఎవడు కాదంటే వాడిని సర్వనాశనం చేసేశక్తి తనకు కావాలని యజ్ఞయాగా దులు చేసేవాడిని, తమోగుణ ప్రధానుడని అన్నారు. వాడు ఆరోజు నన్ను చూసి నవ్వాడు కనుక వాడికేసి నేను చూడగానే వాడు సర్వనాశనం కావాలి అని తపస్సు చేస్తాడట. వాడు యజ్ఞము చేస్తాడు, దానము చేస్తాడు, తపఃకర్మలను గూడా చేస్తాడు కాని ఏవి చేసినా వాడి సంకల్పం మాత్రం ఒకసారి వాడికేసి చూసి నవ్వినందుకు గాను అవతలివాడు బుగ్గయైపోవాలనీ, వాడు ఎవడి నెత్తిమీద చేయిపెడితే వాడు భస్మమైపోవాలని వుంటుందట. ఎంత కాలం తపస్సుచేసినా, వాడి కోరికలు మాత్రం యిలాగే వుంటాయి. తాను బాగుండాల, ఎదిఏమందీ బాగుండాలి, చచ్చినవాడిని లెమ్మంటే లేవాలి, బాధలో వున్నవాడిని ముట్టుకుంటే వాడికి బాధలేకుండా పోవాలి అని వాడు కోరుకోడు.

తాను ఎక్కడ ముట్టుకుంటే అక్కడ దహించుకుపోవాలని, అవతలివాడు నాశనమైపోవాలనే కోరుకుంటాడట. ఇంతకుముందు రజోగుణం కలవాడి సంగతి చెప్పుకున్నాము. వాడు ఏది చేసినా నలుగురూ గొప్పగా చెప్పుకోవాలి అనుకుంటాడు. కనుక నలుగురూ గొప్పగా చెప్పుకోగానే వాడు చేసిన కర్మ ఫలితం అయిపోతుంది. ఇది తెలియక కలియుగంలో గూడ యిదే ధర్మం నడుస్తున్నది. పెద్ద పెద్ద ఆలయాలకు, సత్రాలకు మనము వెళ్ళినప్పుడు మనం చూస్తాము. 'ఇది ఫలానావారి ధర్మము, ఇది ఫలానావారి చేత యివ్వబడింది' అని పెద్ద పెద్ద అక్షరాలతో వ్రాయబడి వుంటాయి. అట్లా వ్రాస్తామంటేనే యిచ్చేవారు చాలామంది వుంటారు. ఇదివరకు మేము విద్యానగర్ మందిరం కోసం విరాళాలకై వెళ్లినప్పుడు పెద్ద పెద్ద వర్తకులు, ధనవంతులు మొ॥న వాళ్ళు మమ్మల్ని అడిగేవారు. 'ఏమండీ! మాపెద్దల పేరుగాని, మాపేరుగాని వేస్తారా? వేస్తామంటే యిస్తాము' అని. "మీరు వెయ్యవలసిందేనని గట్టిగా బలవంతం చేస్తే వేస్తాముగాని, వెయ్యడము, వెయ్యకపోవడంలోని ప్రయోజనాలను ఆలోచించుకుని అడగండి. వెయ్యమంటే వేస్తాము" అన్నాము. "ఫలానావారు యిట్లా చేసారు అని అందరికీ తెలియాలనే గదా మీ ఉద్దేశ్యము? తెలిసింది కాబట్టి ఫలితం వచ్చేసింది, ఇక అంతకుమించి ప్రయోజనమేమీ వుండదు. ఒక ఫలితం కోరి యిచ్చారు. ఆ ఫలితం వచ్చేసింది. ఇక మరుజన్మకు గాని, పెద్దలకుగాని, మీకుగాని మిగిలేదీ ఏమీ వుండదు" అని చెప్పాము. "సైగా ఆలయానికి వచ్చే వాళ్ళందరికీ ఈ పేర్లు చూడడమేనా పని? ఆలయానికి వచ్చినవాళ్ళందరమూ ఎక్కడన్నా అక్కడ వ్రాసిన పేర్లను చూస్తున్నామా? సాధ్యమైనంతవరకూ ఎంత త్వరగా ఆ దేవుని దర్శనం చేసుకుందామా అనే ధ్యాసలో వుంటాము తప్ప వీటిని చూడము. అందుకని వారనుకున్న ఫలితముగూడ అంతగా దక్కదు". ఈ విషయాలన్నీ వాళ్ళకు చెప్పి, "మీరు వేయమంటే వేస్తాము, మీ యిష్టం" అని అంటే అందరూ వద్దన్నవాళ్ళే, మాకు తెలియక అనుకున్నాము అన్నారు. ఒక్కరుగూడా పేరు వేయమని అనలేదు. నలుగురూ గొప్పగా అనుకోవాలి అనే సంకల్పంతో దేనినైనా ఆచరించేవాడిని రజోగుణ ప్రధానుడు అన్నారు. దైవీసంపద, అసురీ సంపద అని సంపద రెండురకాలు. ఈ అసురీ సంపదను తొలగించుకుని అంటే రాక్షస స్వభావాన్ని, ఇంద్రియలోలతను తొలగించుకుని, దైవీ సంపద - అంటే

ధర్మంయందు ప్రీతి, సత్యము మొదలైన ఉత్తమ గుణాలన్నింటినీ దైవీ సంపద అంటారు. అవి కలిగినప్పుడు వాడు సత్వ గుణ సంపన్నుడు అవుతాడు. ఆ స్వభావంవున్నవాడికి వాడు చేసిన యజ్ఞ దాన తపః కర్మలన్నీ చిత్త శుద్ధినిచ్చి మోక్షానికి అర్హుణ్ణి చేస్తాయి. అవే కర్మలు తమోగుణ ప్రధానుడు చేస్తే వాడి నాశనానికి, ఇతరుల నాశనానికి కారణమవుతాయి. అట్లా అని యివేవీ చేయకుండా వుంటే బాగుంటాడా? అన్నది ప్రశ్న. తమోగుణ ప్రధానుడు యజ్ఞదాన తపఃకర్మలు చేస్తే రాక్షస స్వభావుడై ఇతరులను నాశనం చేసి తాను నాశనమై పోతాడు. అందుకని మనలో తమోగుణముంటే మనమూ అట్లా అయిపోతామేమో, కనుక మనకీ యజ్ఞమూ వద్దు, దానమూ వద్దు, కర్మలూ వద్దు, అసలు మనకీ అధ్యాత్మికతే వద్దు అనుకుంటే ఏమవుతుంది? ఏమవుతుందంటే - అప్పుడు గూడా మనలో రాగద్వేషాలు ప్రబలి, వాటి ప్రాబల్యంచేత నా శత్రువులైన వాళ్ళందరినీ నశింపచేయాలన్న పట్టుదల మనలో పెరిగి, అటువంటి పొరపాట్లనే పదే పదే చేసేటటువంటి గుణం మనలో పెరిగిపోతుంది. కనుక జాగ్రత్త. అందుకని అవి చేయకపోవడమూ పొరపాటే అని పెద్దలు చెప్పారు. "నువ్వు మామూలు మనిషివే కనుక, నీలో రాగద్వేషాలున్నాయి కనుక గీకినకొద్దీ తామర ఎట్లా అయితే ఎక్కువైపోతుందో, అలాగే నీలో రాగద్వేషాలు పెరుగుతూ పోయి ఒకనాటికి అవి తీవ్రతరమవుతాయి. అప్పుడు ధర్మాధర్మాలతో సంబంధం లేకుండా నీకు యిష్టమున్నవాడు ఎంత దౌర్భాగ్యుడైనా సరే వాడిని ఆశీర్వదించి వుత్తమస్థితిని యిస్తుండాలనీ, ఎంత ఉత్తముడైనా సరే నీకిష్టంలేకపోతే వాడిని నశింపజేయాలనే దుర్మార్గపు గుణం ఎక్కువవుతుంది. అప్పుడు అలాచేసే సామర్థ్యం కోసం యజ్ఞదాన తపఃకర్మలు నువ్వే చేస్తావు. అలాచేసి నువ్వే రాక్షసత్వాన్ని పొందుతావు. ఇతరులను నాశనం చేసి నువ్వు నాశనమవుతావు. ఆ గుణాలు నీలో తప్పకుండా ఏర్పడుతాయి. కనుక యజ్ఞ దాన తపః కర్మలు తప్పకుండా చేయవలసిందే" అన్నారు. కాబట్టి వాటిని చేయకుండా వదలడానికి వీలులేదు అన్నారు.

మరి చేస్తే రాక్షసులలాగా అవుతానేమో! అంటే, అట్లా అవకుండా మనలో ఏ గుణాలు ప్రబలుతున్నాయో చూచుకుంటూ సత్వగుణాన్ని పెంపొందించుకుంటూ చేయమని చెప్పారు. పరీక్షకు వెళ్తే తప్పుతానేమోనని భయపడి

పరీక్షకు వెళ్ళకపోతే పాసవుతాడా? వెళ్తే గనుక ఒకవేళ వీడికి వచ్చిన నాలుగు ప్రశ్నలు తగిలి పాసవడానికి అవకాశమన్నా వుంది. వెళ్ళకపోతే ఆ అవకాశమే వుండదుగదా! కాబట్టి యజ్ఞదానాది కర్మలు చేస్తే తమోగుణం పెరిగి రాక్షసుల మవుతామేమోనని భయపడి చేయకపోతే అంతకంటే హీనంగా తయారవుతాడు. ఒకవేళ రజోగుణంవల్ల ఇంద్రాది పదవులకోసం చేస్తే, ఒకవేళ వాడు గనుక ఇంద్రాది పదవులు పొందితే ఏమవుతుంది? మూడునాళ్ళ ముచ్చటగా మంత్రి పదవివస్తే ఏమవుతుందో అదే అవుతుంది. మంత్రిగారు కాకముందు మన ముఖం చూచేవాడెవడూ వుండడు. మనం రైలు దిగి, కారు పంపిస్తారా? అంటే నువ్వెవడివి? అంటారు. మంత్రిపదవి వచ్చినరోజున మా కారులో కూర్చోండి అంటే, మా కారులో కూర్చోండి అంటారు. మళ్ళీ ఆ పదవి పోయిన రోజున మన ముఖం చూసే వాడుండడు. పూలమ్మినచోట కట్టెలమ్ముకోవలసి వస్తుంది. మంత్రిగా అవకుండానే వుండాలిగాని ఒకసారి అయిన తర్వాత ఆ అంతస్థులో, ఆ level లో తిరిగాక ఆ పదవి నుంచి దిగి తర్వాత బ్రతకగలమా? అదే విధంగా ఆ ఇంద్రాది పదవులు, రాజ్యాది పదవులు వచ్చి ఆ పుణ్యం ఖర్చయ్యాక మళ్ళీ మామూలు స్థితికే వస్తాడు. అంతకంటే ఘోరం యింకొకటి లేదు. కాబట్టి తమోగుణమైతే అట్లా అవుతాడు, రజోగుణమైతే యిట్లా అవుతాడు. కనుక సత్వగుణాన్ని ఏర్పరచుకోవలసిందే! కాళ్ళూ, గడ్డాలూ పట్టుకుని కాలేజీలో సీటు తెచ్చుకుంటాడు. అప్పుడు మాత్రం నూటికి నూరుపాళ్ళు కృషిచేసి బాగా చదివి డాక్టరో, యింజనీరో అవాలనే అనుకుం టాడు. కానీ చివరివరకూ అట్లా చదివి మంచి మార్కులు తెచ్చుకునేవాళ్ళు కాలేజీ మొత్తం మీద ఏ పదిమందో తేలుతారు. కాబట్టి చదవాలని వూరికే అనుకుంటే సరిపోదు. కృషి చేయడం తన చేతులలోనే వుంది. కష్టపడి చదివితే సరిపోతుంది. అది అందరికీ తెలుసు. అలా కష్టపడి ఫలితం పొందుదామనే కాలేజీలో చేరుతున్నారు. కాని మూడు నెలలు గడిచేసరికి పదిమందిగూడా తేలరు. ఆ పదిమందిలో మళ్ళీ ఎంట్రన్స్‌లో ఏ ఒకరిద్దరో వస్తారు. అందుకని ఏ విద్యార్థి అనుకున్నంత మాత్రాన కాలేదు.

ఆలాగే మనలో చాలా మందికి కోపం పెరిగిందని, కోపం తగ్గించు కోవాలనీ అనిపిస్తుంది. ఒక్కొక్కప్పుడు కోపంమీద కోపమొస్తుందిగూడా. "ఛ ఛ ఈ వెధవ కోపం నా దుంపతీస్తుంది" అని. శాంతం రావాలనుకుంటే వస్తుందా?

అందరికీ తాము సత్యహరిశ్చంద్రునిలా వుండాలనే వుంటుంది. మోసంయందు ఎవరికీ ప్రీతి యుండదు. ప్రతి వాడూ సత్యంగానూ, ధర్మంగానూ బ్రతకాలనే అనుకుంటాడు కానీ బ్రతుక గలుగుతున్నాడా? అలాగే సత్వగుణ లక్షణాలేమిటో, తమో గుణ లక్షణాలేమిటో, రజోగుణ లక్షణాలేమిటో తెలుసుకుని అట్లా అవాలని అనుకున్నా గూడా ఆవడం జరుగదు. కాని అట్లా అవుతేగాని ప్రయోజనం వుండదు. ప్రయత్నం చేస్తే వీలుగాదు. ప్రయత్నంచేయకపోతే ప్రయోజనం వుండదు. అయితే ఎట్లా? అని అడిగితే మూడు సమాధానాలు చెప్పారు. ఈ యజ్ఞదాన తపః కర్మలను, మన పెద్దలు చెప్పిన ఆచారాలనూ పాటిస్తూపోతూ వుంటే సత్వగుణం వస్తుంది అని కొందరు చెప్తారు.

ఈ విషయమై చాలామంది పెద్దలతో నేను వాదించినప్పుడు ఒకరు చెప్పిన సమాధానమిది: "అయ్యా! సత్వగుణమెలా కలుగుతుంది? దైవీసంపద ఎలా కలుగుతుంది? కలగనిదే ఫలితం రాదుగదా! మనలో సత్వగుణంలేదని తెలుసు గదా! మరి మనకది ఎలా వస్తుంది? శాస్త్రంలో ఎక్కడైనా చెప్పి వున్నదా? ఎక్కడ చెప్పి వున్నది? ఎలా చెప్పివున్నది?" అని అడిగితే ఒకరు, 'అర్థమైనా కాకపోయినా శాస్త్రాలలో చెప్పినవిధంగా ఆచార, నియమాలను జాగ్రత్తగా ఆచరించుకుంటూ పోతే సత్వగుణం వస్తుంది' అన్నారు. ఈ యజ్ఞ దాన తపః కర్మలను పాటించి రావణాసురుడు ఈశ్వర సాక్షాత్కారం పొందాడు గదా! మరి అతనిలోని రాక్షసత్వం పోలేదు గదా! ఎందుకని పోలేదు? మమకారము, రాగము, ద్వేషము, అసూయ మొఃవన్నీ రజోగుణ, తమోగుణ లక్షణాలే గదా! అసలు ఒకే ధర్మంలో శైవ వైష్ణవ భేదాలు ఎందుకు వస్తున్నాయి? అది పట్టుకుని ఒకపట్టాన వదలడం లేదెందుకని? ఆ మమకారం రజోగుణాత్మకమా? తమోగుణాత్మకమా? సత్వగుణాత్మకమా? వేదాలను గౌరవించవలసినదే, విశ్వసించవలసినదే! మరి వేదాలలోనే నారాయణోపనిషత్తు వున్నది. వేదంలోనే రుద్రమున్నది, పురుష సూక్తమున్నది. అందులో అన్నీ వున్నాయి. అటువంటప్పుడు మనకు ఒకటే ఎందుకు ప్రీతి అవుతున్నది? మరొకటి ఎందుకు యిష్టపడడంలేదు? ఇష్టంలేని దానిపట్ల అసహనమే కాకుండా ద్వేషంక్రింద మారుతున్నదెందుకని? మరి వాళ్ళకు యజ్ఞ, దాన, తపః, కర్మలు సక్రమంగా చేస్తున్నప్పటికీ ఎందుకా ద్వేషం తొలగిపోవడం లేదు? కాబట్టి వాటిని పాటిస్తుంటే

మాత్రమే అవి తొలుగుతాయన్న మాట అబద్ధం. యజ్ఞదాన తపో కర్మలు చేస్తే యివన్నీ పోతాయని గీతలో చెప్పలేదు. ఇవి పోగొట్టుకుని యజ్ఞదాన తపఃకర్మలు చేస్తే ఫలితమిస్తాయని అందులో చెప్పి వున్నది. అదే యిక్కడవున్న తమాషా. పెళ్ళి కుదిరితే గాని పిచ్చి కుదరదు, పిచ్చి కుదిరితేగాని పెళ్ళి కుదరదు అన్నట్లున్నది. ఈ దోషాలు తొలగితేతప్ప యజ్ఞ, దాన, తపః, కర్మలు వుత్తమమైన ఫలితాన్నివ్వవు. కానీ ఆ దోషం తొలిగేదెట్లా? కాబట్టి అవి పాటిస్తుంటేపోతుంది అనేది సరిపోదు. పోనీ జపాదులు చేస్తుంటే పోతాయా అనేది సరిపోదు. అంటే జపాదులు గూడా యజ్ఞంలో భాగం కనుక సరిపోదు. ఇంతకు ముందు మనం చెప్పుకున్న ఉదాహరణలాగా.

ఈశ్వరుని కోసం తపస్సు చేసి ఈశ్వర సాక్షాత్కారం పొందిన వాళ్ళు గూడా ఈశ్వరునికే యిబ్బంది కలిగేలా చేసారు. హిరణ్యాక్షుడు మొ॥న వాళ్ళు తపస్సు చేసి గొప్ప గొప్ప వరాలు పొందారు. కాని సాత్వికులు కాలేదు. కాబట్టి దానివల్ల మనిషి సాత్వికుడు అవడు, మరి దేనివల్ల అవుతాడు? అనడిగితే మరికొంతమంది ఏం చెప్పారంటే - "ఆహారశుద్ధౌ సత్వశుద్ధిః" అని చెప్పివున్నది. గనుక ఆహారశుద్ధి వలన కలుగుతుంది. అని చెప్పారు. ఆహార శుద్ధి అంటే భగవద్గీతలో చెప్పి వున్నది. రజోగుణం కలవాడు ఎలాంటి ఆహారాన్ని యిష్టపడతాడో, సత్వగుణం కలవాడు ఎటువంటి ఆహారాన్ని యిష్టపడతాడో, తమోగుణ ప్రధానుడు ఎలాంటి ఆహారం యిష్టపడతాడో చెప్పివున్నది.

కనుక సత్వగుణానికి పనికివచ్చే ఆహారాన్ని తింటూ వుంటే సత్వగుణం వస్తుంది అని చెప్పారు. కాని గీతలో సత్వగుణ ప్రధానుడు ఎటువంటి ఆహారాన్ని యిష్టపడతాడో చెప్పివున్నది గాని, ముక్కు మూసుకుని ఆముదం త్రాగినట్లు అట్టి ఆహారం తీసుకుంటే సత్వగుణం వస్తుందని చెప్పలేదు. అట్టి ఆహారాన్ని సత్వగుణ ప్రధానుడు యిష్టపడతాడు అని చెప్పివున్నది. మరి సత్వగుణం ఎట్లా కలుగుతుంది? అంటే ఇక మార్గమే లేకుండా పోయిందన్నమాట. అసలైన విషయాన్ని చెప్పకుండానే వెళ్ళాడు శ్రీకృష్ణుడు. ఆయన యజ్ఞ, దాన, తపః, కర్మలు చేయవలసినవేనని చెప్పాడు. సత్వగుణ, రజోగుణ, తామోగుణాల్లో సత్వ గుణ ప్రధానంగానే చేయి, పొందుతావు అన్నాడు. ఇక ఆయన ఏమి చెప్పినట్లు?

ఇంతకుముందు మనం ఒక ఉదాహరణచెప్పుకున్నాము. ఒకడు రోగాలు, రొష్టులతో బాధపడుతున్నాడు. ఒక రోగానికి మందుతీసుకుంటే అది తగ్గి మరొక వ్యాధి ముంచుకొస్తుంది. చివరకు అతడు చాలా విసిగిపోయాడు. ఆ పరిస్థితిలో ఒక స్నేహితుడు కన్పించి, "ఎందుకురా, వాళ్ళ దగ్గరకూ, వీళ్ళ దగ్గరకు అని యిన్నిచోట్లకు తిరుగుతావు, నా దగ్గరకు ఒకసారి రా, నేను మంచి ఉపాయం చెబుతాను. దానితో తగ్గిపోతుంది" అని చెప్పాడట. అప్పుడు వీడన్నాడట - "ఏమిటి ఇంతమంది డాక్టర్లు ఏమీ చేయలేకపోయారు, నువ్వు చేసేదేమిటి?" అని. "నీకెందుకు? నాదగ్గరకు రా, చెబుతాను గదా!" అని ఆ స్నేహితుడన్నాడు. సరేనని వాడు ఆ మిత్రుని దగ్గరికి వెళ్తే, అతనన్నాడట - "ఏముందిరా, సరైన మందు తీసుకో, అదే తగ్గిపోతుంది"అని. సరైన మందు తీసుకోమని చెప్పడమే వీడి సలహా. కాని ఆ సరైన మందేమిటో చెప్పడం కాదు. అదేవిధంగా భగవద్గీత యింత కష్టపడి చదివితే అందులో చెప్పిన దేమిటి? 'రజోగుణ, తమోగుణాలను తొలగించుకుని, సత్వగుణాన్ని పొంది, యజ్ఞ దాన తపః, కర్మలను చేసి తరించు' అని చెప్పి వున్నది. కాని సత్వగుణాన్ని ఎలా పొందాలో మాత్రం చెప్పలేదు. దైవీ సంపద ఎలా పొందాలి అన్నది చెప్పలేదు. ఈ ప్రశ్న నాదగ్గర చాలా సం॥లు వున్నది. ఎవరైనా భగవద్గీత తెలుసు అన్న వాళ్ళొస్తే ఈ ప్రశ్న అడిగేవాణ్ణి. అయితే ఒంటరిగా వున్నప్పుడు మాత్రమే అడిగే వాణ్ణి. ఎందుకంటే - నేను గెలవాలనిగాని, వాడు గెలవాలనిగాని, వాడికి తెలియదని నాకు కావల సినది నిరూపించడంగాదు. జవాబు వాళ్ళకు తెలిసి చెబుతున్నారా, లేక తెలియ కుండానే చెబుతున్నారా? అసలు యిందులో ఏదైనా సత్యం వుందా, లేదా? అనే అన్వేషణలో నేనప్పుడు వున్నాను. అందుకని అందులోని విషయం తెలియడం నాకు ముఖ్యంకాని వాడికెంత తెలుసు, వీడికెంత తెలుసు అన్నది కాదు, నాకు కావలసినది. కాని వాళ్ళు తెలుసుకోకుండానే మాట్లాడుతున్నారని మాత్రం నాకు అర్థమైంది. ఆ ప్రశ్న సమాధానపడకుండా చాలా సం॥లు నా దగ్గర వున్నది. చివరకు మహానుభావుడైన సాయి దయవలన ఆయన పాదస్పర్శ వలన నాకు తెలిసింది.

మళ్ళీ మనం మొదటి విషయానికే వచ్చాము. ఎక్కడైతే మొదలు పెట్టామో అక్కడికే వచ్చాము. సాయి చరిత్రలో నానా చందోర్కర్ అనువాడు

అంటావా? ఆత్మ చనిపోయేది కాదు, పుట్టేదిగూడా కాదు, ఇక ఏడవడానికే ముంది? అన్నాడు. అయితే యిది పుడుతూ చస్తూ వుండేదా? లేక చావకుండా పుట్టకుండా వుండేదా? ఆ సంగతి చెప్పలేదు. 'అట్లా అనుకుంటే అట్లా, ఇట్లా అనుకుంటే ఇట్లా' అని చెప్పాడు. ఇటువంటి కష్టమైన శ్లోకాలన్నీ దాటివచ్చి, టీక తెలిస్తే అర్థం తెలిసిపోయే ఈ శ్లోకాన్ని పట్టుకుని చెప్పాడు. దీనిలోని అంతరార్థం ఏమిటి? అన్న సందేహం నాకు పట్టుకున్నది. చాలా కాలం తర్వాత ఎందుకు చెప్పారో అర్థమైంది. నానా చేస్తున్న పనికి ఆ శ్లోకం సమాధానం. ఈ విశ్వమంతా తన రూపమేనని నిరూపించిన సాయినాథుడంతటి గురువును పట్టుకున్నాడతడు. ఎంతటి పుణ్యమో! దేవతలందరి రూపాలలో ఆయా భక్తులకు ఎవరైతే దర్శనమిచ్చారో, అన్ని జీవులూ తమ రూపమేనని వచ్చిపోయే భక్తులందరికి ఎవరైతే అనుభవమిచ్చారో, ఈ విశ్వంలో ఎక్కడ ఎప్పుడు ఏమి జరుగుతున్నదో అనుక్షణం తనకు తెలుస్తుందని ఎవరైతే నిరూపించారో, ఎవరికైతే ఖురాను, ఉచ్ఛ్వాస నిశ్వాసమో, ఎవరికి వేదాలు, ఉచ్ఛ్వాస నిశ్వాసాలో, అంతటి మహనీయుణ్ణి ఆశ్రయించాడు నానా.

అయితే శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు 'తద్విద్ధి ప్రణిపాతేన' శ్లోకంలో చెప్పిన ఒక దానిని - శ్రీసాయివంటి మహాత్ముని పట్టుకోవడం ఒక్కటే చేసాడు నానా. శ్రీకృష్ణుడు అందులో మూడుపనులు చేయమని చెప్పారు. 'మహాత్ములకు శరణాగతి చెందు, సేవచేయి, పరిప్రశ్న చేయి'అని. దానిలో ఆశ్రయించడమనే ఒక పని చేసాడతను. కాని దానిని ఎలా వినియోగించుకోవాలో మాత్రం అతనికి తెలియులేదు. భగవద్గీతను బాబా నలుగురిలో తిడితే పరువుపోకుండా అడ్డంపెట్టుకునేందుకు వాడుకుంటున్నాడు. భగ వద్గీతను ఉపయోగించుకోవలసిన విధానం అదేనా? నిందాస్తుతులను, శీతోష్ణాలను సమానంగా తీసుకోవలసిందని చెప్పిన భగవద్గీతను, నలుగురిలో బాబా తిడితే తన పరువు పోతుందేమోనని అడ్డంపెట్టుకోవడం ఎంత ఘోరం? అందుకని బాబా 'నీ దుంపతెగ, ఎలాగూ ఆశ్రయించడమనే ఒక పని చేసావు. సేవ చేయడం, పరిప్రశ్న చేయడంగూడా ఎలాగో తెలుసుకోరా!" అని చెప్పడానికే ఆ శ్లోకం వచ్చేదాకా ఆగి ఆ శ్లోకార్థమే అడిగారు. అంటే బాబా యింతటి పద్ధతుప్పెంత చేయవలసినది కూడని ఆలోచనలు, కూడని పనులుగాదు - బ్రహ్మ

అంటావా? ఆత్మ చనిపోయేది కాదు, పుట్టేదిగూడా కాదు, ఇక ఏడవడానికే ముంది? అన్నాడు. అయితే యిది పుడుతూ చస్తూ వుండేదా? లేక చావకుండా పుట్టకుండా వుండేదా? ఆ సంగతి చెప్పలేదు. 'అట్లా అనుకుంటే అట్లా, ఇట్లా అనుకుంటే ఇట్లా' అని చెప్పాడు. ఇటువంటి కష్టమైన శ్లోకాలన్నీ దాటివచ్చి, టీక తెలిస్తే అర్థం తెలిసిపోయే ఈ శ్లోకాన్ని పట్టుకుని చెప్పాడు. దీనిలోని అంతరార్థం ఏమిటి? అన్న సందేహం నాకు పట్టుకున్నది. చాలా కాలం తర్వాత ఎందుకు చెప్పారో అర్థమైంది. నానా చేస్తున్న పనికి ఆ శ్లోకం సమాధానం. ఈ విశ్వమంతా తన రూపమేనని నిరూపించిన సాయినాథుడంతటి గురువును పట్టుకున్నాడతడు. ఎంతటి పుణ్యమో! దేవతలందరి రూపాలలో ఆయా భక్తులకు ఎవరైతే దర్శనమిచ్చారో, అన్ని జీవులూ తమ రూపమేనని వచ్చిపోయే భక్తులందరికి ఎవరైతే అనుభవమిచ్చారో, ఈ విశ్వంలో ఎక్కడ ఎప్పుడు ఏమి జరుగుతున్నదో అనుక్షణం తనకు తెలుస్తుందని ఎవరైతే నిరూపించారో, ఎవరికైతే ఖురాను, ఉచ్ఛ్వాస నిశ్వాసమో, ఎవరికి వేదాలు, ఉచ్ఛ్వాస నిశ్వాసాలో, అంతటి మహనీయుణ్ణి ఆశ్రయించాడు నానా.

అయితే శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు 'తద్విద్ధి ప్రణిపాతేన' శ్లోకంలో చెప్పిన ఒక దానిని - శ్రీసాయివంటి మహాత్ముని పట్టుకోవడం ఒక్కటే చేసాడు నానా. శ్రీకృష్ణుడు అందులో మూడుపనులు చేయమని చెప్పారు. 'మహాత్ములకు శరణాగతి చెందు, సేవచేయి, పరిప్రశ్న చేయి'అని. దానిలో ఆశ్రయించడమనే ఒక పని చేసాడతను. కాని దానిని ఎలా వినియోగించుకోవాలో మాత్రం అతనికి తెలియలేదు. భగవద్గీతను బాబా నలుగురిలో తిడితే పరువుపోకుండా అడ్డంపెట్టుకునేందుకు వాడుకుంటున్నాడు. భగ వద్గీతను ఉపయోగించుకోవలసిన విధానం అదేనా? నిందాస్తుతులను, శీతోష్ణాలను సమానంగా తీసుకోవలసిందని చెప్పిన భగవద్గీతను, నలుగురిలో బాబా తిడితే తన పరువు పోతుందేమోనని అడ్డంపెట్టుకోవడం ఎంత ఘోరం? అందుకని బాబా "నీ దుంపతెగ, ఎలాగూ ఆశ్రయించడమనే ఒక పని చేసావు. "సేవ చేయడం, పరిప్రశ్న చేయడంగూడా ఎలాగో తెలుసుకోరా!" అని చెప్పడానికే ఆ శ్లోకం వచ్చేదాకా ఆగి ఆ శ్లోకార్థమే అడిగారు. అంటే బాబా యింతటి సద్గురువు చెంత చేయవలసినది కూడని ఆలోచనలు, కూడని పనులుగాదు - బ్రహ్మ

జ్ఞానం కోసం ప్రయత్నించాలి.

నిండు సభలో వస్త్రాపహరణం జరుగుతున్నపుడు ద్రౌపతి తానుగా ప్రయత్నించినప్పుడు ఏమయింది? విఫలమైంది. కాని ఆ పరమాత్మను తలుచుకుని ఆయనపై భారం వేసినపుడు రక్షణ లభించింది. అందుకని 'ఆ శ్లోకంలో ఏమి చెయ్యాలో అంతా చెప్పబడివుంది గనుక, వేరే ఆలోచనలు రాకుండా వుండేందుకు వుపయోగించుకోవడంగాక, దానిలో వున్నట్లు శరణాగతి చెంది, పరిప్రశ్న, సేవలు చేస్తే బ్రహ్మజ్ఞానం లభిస్తుంది' అని చెప్పడానికే ఆ శ్లోకానికి అర్థం చెప్పమన్నారు బాబా. అతడు చెప్పలేడు గనుక తానే వివరించి ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్పడానికే ఆ శ్లోకానికి అర్థం చెప్పమన్నారని నాకు తోచింది. ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే అసలు గీత ఎలా పుట్టిందో, ఆ శ్లోకంలో వున్నదని తెలుస్తుంది. పరమాత్మ తత్వాన్ని తనలోపల, బయట అంతటా చూస్తూవున్న, సాక్షాత్తూ పరమాత్మ స్వరూపమే అయిన కృష్ణుణ్ణి శరణు పొందాడు అర్జునుడు. ఏది ధర్మమో, ఏది అధర్మమో తెలియక కొట్టుమిట్టు తున్నాను, దయచేసి వివరించు అని పరిప్రశ్న చేయడం ప్రారంభించాడు. అప్పుడు కృష్ణుడు బోధించడం ప్రారంభించాడు. అంటే తత్వజ్ఞానియైన శ్రీకృష్ణుని అర్జునుడు ఆశ్రయించాడు. పరిప్రశ్న చేసాడు. ఆలా చేయడంవల్లనే భగవద్గీత పుట్టింది. కనుక భగవద్గీత ఎలా పుట్టిందో గూడా ఆ శ్లోకంలో వుంది. అందుకని ఆ శ్లోకం అంత ముఖ్యమైనది అని సాయి చెబుతున్నారని నాకర్థమైంది. ఇంకా ఆలోచిస్తే సత్వగుణము, దైవీసంపద, ఎలా మనం పొందాలో ఈ శ్లోకంలో మాత్రమే చెప్పివున్నదని, ఏ సత్వ గుణాన్నిగాని, దైవీ సంపదను గానీ పొందకపోతే యజ్ఞదాన తపఃకర్మలు నిరర్థకమై పోతాయో, వేటిని పొందకపోతే వేరే దారి లేదో, కాని వేటిని పొందడానికి ఉపాయమెక్కడా చెప్పబడలేదో, ఆ ఉపాయం ఈ శ్లోకంలో మాత్రమే వుంది. అందుకనే ఆ శ్లోకాన్నే బాబా వివరించారని నాకు అర్థమైంది.

అంటే సర్వశాస్త్రసారమైన భగవద్గీత మనం తరించడానికి కావలసినదంతా చెప్పింది. కాని సక్రమంగా అర్థంచేసుకుని ఆచరించాలంటే మనకుగా సాధ్యపడదని అర్థమవుతున్నది. ఎందుకు సాధ్యపడదో మళ్ళీ ఒకసారి క్లుప్తంగా చెప్పకుందాం. మానవుడు యజ్ఞ, దాన, తపః, కర్మలను నాలుగింటినీ గూడా విడువకుండా ఆచరిస్తూండవలసిందేనని గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. వాటి

నాచరిస్తూ వుండడం చేత మానవుడు తానున్న స్థాయికంటే క్రిందకు దిగజారకుండా వుండగలుగుతాడు అని సూచించారు. అయితే వీటిని ఆచరించేవారు ఎటువంటి శ్రద్ధతో వాటినాచరిస్తారో గూడా కృష్ణుడు ఉదహరించాడు. సత్వగుణ ప్రధానంగా, దైవీ సంపదతో వాటిని ఆచరించేవాడు సరియైనటువంటి ఫలితాన్ని పొందుతారని, అలాగాక రజోగుణ తమోగుణ ప్రధానంగా ఆచరించేవాళ్ళు సరియైన ఫలితాన్ని ఎలా పొందలేరో గూడా శ్రద్ధాత్రయ విభాగయోగంలో చెప్పాడు. పురాణాలలో గూడా దీనికి ఉదాహరణలు కన్పిస్తాయి. ఋషులు తపస్సు చేసారు. రాక్షసులు గూడా తపస్సు చేసారు. యజ్ఞ, దాన, తపః, కర్మలనే నాలుగింటినీ రావణాది రాక్షసులుగూడా నిర్వహించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అన్ని ధర్మాలు తు.చ. తప్ప కుండా పాటించారు వాళ్ళు. వాళ్ళకూ పరమాత్మ సాక్షాత్కారమై అడిగిన వరాలిచ్చాడు. అట్లాగే ఋషులు గూడా వీటిని ఆచరించారు. వాళ్ళకూ పరమాత్మ సాక్షాత్కారమై తరించారు. దీనవలన మనకు తెలుస్తున్నదేమిటంటే - ఈ నాలుగింటినీ మనమాచరిస్తున్నప్పటికీ మనం వాటిని రాజసికంగా ఆచరిస్తామా? తామసికంగానా? లేక సాత్వికంగా ఆచరిస్తామా అన్న దానిమీద ఫలితం ఆధారపడుతుందన్నమాట. ఒక పని చేసేప్పుడు దాని వెనకాల వున్న మన ఉద్దేశ్యాన్నిబట్టీ ఆ పనియొక్క ఫలితం వుంటుందని భగవద్గీత చెబుతుంది. ఉదాహరణకు ఒకడు అన్నదానం చేయడంలోని వుద్దేశ్యం పదిమందిలో ఘనంగా తనకు పేరురావాలని కావచ్చు. ఇంకొకడు, తనకు సమాజంలో ఆర్థిక స్థోమతు ప్రకటించుకోవడానికి కావచ్చు. మరొకడు ఆ కీర్తి వాడికి మాత్రమే ఎందుకు దక్కాలి? మనం మాత్రం చేసామని ఎందుకు పదిమంది చేతా అనిపించుకోగూడదు? అన్న పోటీ భావంతో చేయవచ్చు. తాను చేసినటువంటి పాపాలు ఆ విధంగా పోగొట్టుకోవచ్చు అని చేయవచ్చు. మరొకడు తనకు పుణ్యం రావాలని చేయచ్చు, మరొకడు తన దగ్గరనున్న నల్లధనాన్ని పట్టుబడ కుండా వుండడానికి చేయవచ్చు. మరొకడు పేదవారికి ఆ విధంగా ఒకపూటైనా కడుపునిండా అన్నం పెట్టవచ్చుగదా అని చేయవచ్చు. కానీ వీరందరూ చేసినదీ అన్నదానమే అయినప్పటికీ అందరికీ ఒకే ఫలితం రాదు. కారణం ఎటువంటి భావంతో ఆపని చేసాడు అన్నదానిని బట్టే దాని ఫలితముంటుంది. మానవుడు ఎన్ని రకాల లక్ష్యాలను కలిగివుంటాడు అన్నదానిని బట్టి

మూడు రకాలుగా మనిషి యొక్క స్వభావాన్ని విభజించారు. సాత్వికమైనది, రాజసికమైనది, తామసికమైనది అని. ఉత్తమమైన లోకాలుగాని, ఇంద్రాది పదవులుగాని, మరుజన్మలో రాజ్యాది పదవులుగాని, కీర్తిగాని మొ॥వ వాటిని ఆశించి చేసేది రాజసిక స్వభావమని చెప్పారు. అంటే బాగా ఆలోచిస్తే వాడికొచ్చే ఫలితం సరియైనది కాదని తెలుస్తుంది. ఉదాహరణకు మనకు నెలకు వెయ్యి రూ॥లు జీతమొస్తుంటే తినడము, ఖర్చుపెట్టుకోవడముమాని, వంద రూపాయల తోనే ముక్తసరిగా ముగించుకుని తొమ్మిదివందల రూపాయలు వెనకేసుకుంటూ బ్యాంకులో దాచుకుంటూ, వడ్డీలు పెంచుకుంటూ, ఒక 20 సంవత్సరాల తర్వాత లక్షలు వెనకేసుకోవడము, మనం లక్షాదికారులమని మురిసిపోవడం ఏమి తెలివి?

తాను తినవలసినది, కట్టుకోవలసినది, తనవాళ్ళు తినవలసినదీ, తన వాళ్ళు కట్టుకోవలసినదీ తినకుండా, కట్టుకోకుండా మూటగట్టి, దానిని నిలువ చేసి గొప్ప అనుకుంటే, అది గొప్పతనం ఎలా అవుతుంది? వాడు పడ్డ శ్రమకు, పొందే ఫలితానికి తేడాలేదు. అది నిజమైన తెలివిగాదు. తెలివి ఎవరిదంటే నేలలో ఒక గింజను నాటి, కంకెడు గింజలు తీసుకునేవాడిది. నాటిందేమో ఒక విత్తనం. తీసుకున్నదేమో కంకెడు విత్తనాలు. అదీ పెరగడమంటే, అదీ తెలివంటే. అంతేగాని ఒకరూపాయి మార్చుకుని పదిపైసలు, ఇరవై పైసలు చిల్లరగా మార్చు కుని, జేబునిండా పోసుకుని సంతోషించడం కాదు. రజోగుణ ప్రధానమైన వాడి యజ్ఞ, దాన, తపః, కర్మలన్నీ చిల్లర మార్చుకుని సంతోషించడంవలెనే తప్ప దాని వల్ల వాడు సాధించేదేమీ వుండదు. అలాగే లోకం తనను గొప్పగా అనుకుంటే సంతోషిస్తారు కొందరు. దానిలో ఏముంది? లోకమంతా అట్లా అనుకున్నంత మాత్రాన వాడి ఆయుర్దాయం ఒక్క గంటసేపుగూడా మారదు. వృద్ధాప్యం వచ్చినపుడు ఒక్క క్షణం గూడా వృద్ధాప్యం ఆగదు. సుఖ దుఃఖాది రూపమైన కర్మలు అనుభవానికి వచ్చినప్పుడు ఎవరూ అడ్డురారు. బలిచక్రవర్తి ఎన్ని దానాలు చేసినా గాని భగవంతుడు వచ్చి పాతాళానికి త్రొక్కేసే సమయంలో ఆయనకు ఒక్కటీ అడ్డు పడలేదు.

అందుకని రజోగుణ ప్రధానంగా కర్మలు చేసి ఫలితం పొందేవాడు తెలివైనవాడు గాదు, పసి పిల్లవాడు అని అర్థం. తమోగుణ ప్రధానుడు -ఈ

పసిపిల్లలో గూడా కుళ్ళు బోతువాడు అని అర్థం. నాకు మార్కులు రాకపోతే రాకపోయాయి, వాడికి రాకుండా వుంటే చాలు అనిపిస్తుంది వాడికి. అందుకని తన కంటే పైకి వస్తుంటే ఎలాగోలా సాధించాలని, బాధపెట్టాలనీ, తనను వ్యతిరేకించిన వాళ్ళను నశింపజేయాలని, పదవి సంపాదించి, అధికారం సంపాదించి, అందరినీ తన పిడికిట్లో పెట్టుకోవాలనీ అనుకునే దుష్ట సంకల్పమేమో తామో గుణం. రాక్షసులంతా ఆ విధంగానే తపస్సు చేసారు. అలాగే ఈ రజోగుణం కలవాడు తిండీ గుడ్డా లేకుండా మూట కట్టుకుంటున్నాడు. అందుకని వీళ్ళిద్దరూ సరియైన ఫలితం పొందినవాళ్ళు కారు. మా అమ్మగారు మరణించిన తర్వాత మా నాన్నగారికి బంధువులంతా సలహాయిచ్చారు.

మా అమ్మగారు నా చిన్నతనంలోనే పోయారు. అప్పుడు మేము నలుగురం పిల్లలము. మా నాన్నగారికి పెంచుకున్న తల్లి తండ్రులనుంచి చాలా ఆస్థి వచ్చింది. అప్పుడు బంధువులంతా మా నాన్నగారికి, "ఏమయ్యా! నువ్వు నడివయస్సులో వున్నావు గనుక పిల్లలందరినీ తలా ఒక బంధువుకీ అప్పజెప్పి, ఒక్కొక్కళ్ళ పేరిట కొంత కొంత ఆస్థి వేసెయ్యి. నువ్వు హాయిగా వుండు" అని చెప్పారు. వీళ్ళతో నువ్వెక్కడ వేగుతావు? అని సలహా యిచ్చారు. దానికాయన చెప్పినదొక్కటే. నేను వాళ్ళకు యింతేకాదు, యింతకుమించిన ఆస్థి యిస్తే మాత్రం వాళ్ళు తెలివి తక్కువగా ప్రవర్తించి పాడుచేసుకోరని నమ్మకమేమిటి? అలా అంతా పాడుచేసుకుని వీదినపడితే అప్పుడు వాళ్ళ పరిస్థితి ఏమిటి? అందుకని వాళ్ళు పాడుచేసుకున్నా, పాడుకానటువంటి విద్యను వాళ్ళకు నేర్పించి వదిలిపెడితే అప్పుడు వాళ్ళు చెడిపోకుండా వుంటారు అని మాకు చదువు చెప్పించారు. ఎందుకంటే అది పాడుచేసుకుందామన్నా పాడవదు. ఖర్చుపెట్టిన కొద్దీ పెరుగుతూ వుంటుంది. ఇచ్చినవాడికీ, పుచ్చుకున్నవాడికి గూడా పెరుగుతుంది. అదీ ఆయన ధైర్యం. అందుకని అటువంటి ఆలోచన, ఒక విత్తనం నాటి కంకు సంపాదించడంలాంటిది. అందుకని వివేకం పెంచుకుని, సాత్విక భావాలను అలవరచుకుంటే యజ్ఞయాగాది కర్మలు సాత్విక భావంతో చేయగలుగుతాము. అందుకని ఉత్తమమైన ఫలితాన్ని పొందగలుగుతాము. అదీ సాత్విక కర్మంటే. అటువంటి భావంతో యజ్ఞాది కర్మలు చేయాలి. ఎటువంటి భావంతో యజ్ఞాది కర్మలు చేయాలి?

ఇక్కడ మనం జాగ్రత్తగా ఆలోచించాలి. పూజాది కర్మలు, నిత్య సంధ్యావందనము గూడా నిత్య యజ్ఞంలో ఒక భాగమే. వీటిని ఎలా చేయాలి? దేనిని ఆశించీ చేయకూడనప్పుడు అసలెందుకు చేయాలి? ఏ ఆశాలేనపుడు మనకు ఆసక్తి వుండదు. శ్రద్ధ వుండదు. మరి శ్రద్ధగా చేయడమెట్లా? విలువైన వస్తువులేవీ లేనప్పుడు పెట్టెకు తాళం వేయము. కాని విలువైన వస్తువులుంటే ఎప్పుడూ తాళం వేసే వుంచుతాము. అందుకని దేనినుండైనా, దేనిలోనైనా ఏదైనా విలువ వుందని తెలిస్తే తప్ప శ్రద్ధ కలుగదు. అయినప్పుడు ఏ లక్ష్యమూ లేకుండా సంధ్యా వందనం గాని, పూజాదులు గాని చేయడం ఎట్లా? ఆశ లేకపోతే శ్రద్ధ వుండదు. కాని ఏ ఆశాలేకుండా శ్రద్ధతో చేయాలి. అయితే అలా చేసినవాళ్ళు ఎలా చేసారు? ఎందుకు అలా చేయమన్నారు? ప్రతి మంత్రానికి శక్తి, బీజము, కీలకము మొ॥నవి వుంటాయి. అవి ఏమిటి? వాటిని ఎందుకు చెప్పారు? వాటిని ఎలా వినియోగించాలి? నిత్యం సంధ్యావందనం ఎందుకు చేయాలి? అందువల్ల ఏం కలుగుతుంది? ఇలా ఆలోచనలు కలుగుతాయి. అదీ సాత్విక బుద్ధి అంటే. తక్కిన ప్రాణులకు లేనిదీ, మనిషికి వున్నదీ ఏమిటంటే ఇది ఏమిటి? అని తెలుసుకుందామనే జిజ్ఞాస. ఇదే మనిషియొక్క ప్రధాన కర్తవ్యము. ప్రధానమైన ధర్మము. దీనినే బుద్ధిశక్తి అన్నారు. ఏదైనా తెలుసుకోవడంవల్ల ఏమి వస్తుందీ అంటే ఏమీ రాకపోవచ్చు. తెలుసుకోవడమే సంతోషం. అక్కడ గందరగోళం జరుగుతుంటే అక్కడనుంచీ వచ్చే వాళ్ళను 'ఏమిటండీ, అక్కడ జరుగుతున్నది? అంటాము. అది ఏమైతేమటుకు మనకేమిటి? ఎందుకు? కాని దానిని తెలుసుకునేంత వరకు ప్రాణం కొట్టుకుపోతుంది. ఎవరో క్రొత్త పరికర మొక దానిని విదేశాలనుండి పట్టుకు వచ్చారు. అది పెట్టుకుని ఆయనపని చేసుకుంటుంటే 'ఏమిటండి ఇది? ఎందుకు ఉపయోగ పడుతుంది? ఖరీదెంత? అని అడుగు తాము. ఎందుకంటే తెలుసుకోవడంలోనే ప్రీతి వున్నది. చిన్న పిల్లలు మనలను ప్రశ్నలువేయడం మొదలుపెట్టి ప్రాణాలు తోడేస్తుంటారు. చల్లగా వుంటుంది గదా అని వాకిట్లోకి తీసుకువస్తే ఆకాశం లోని నక్షత్రాలను చూపించి అవేమిటని అడుగుతారు. చెబితే అవి అట్లా ఎందుకు వెలుగుతాయి అని అడుగుతారు. దీపాలు అని చెబితే అవి మిణుకు మిణుకుమనవుగదా! మరి ఇవి ఎందుకు అలా మిణుకు మిణుకుమంటాయి? అని అడుగుతారు. వాటిని ఎవరు

వెలిగించారు? అని అడుగుతారు. వాళ్ళకు ఏం చెప్పాలో అర్థంకాదు. వాళ్ళు ఎందుకు అట్లా ఆడుగుతారు? తెలుసుకోవాలి అనే జిజ్ఞాస. అదీ మనిషి యొక్క నైజం. దానిని సత్వగుణము అన్నారు.

ఆ తెలుసుకోవడంవల్ల ఒక ఉద్యోగము వస్తుందనిగాని, ప్రమోషను వస్తుందనేదిగానీ ఏమీ లేదు. ఏదైనా తెలుసుకోవడంలోనే ఒక సంతోషమున్నది. ఎలాగంటే ఆరోగ్యంగా వుండడమే సుఖము. ఏదైనా వ్యాధి వచ్చినప్పుడు ఆరోగ్యంగా వుండడము ఎంత సుఖమో తెలుస్తుంది. ఆరోగ్యంగా వున్నప్పుడు ఏమీ తెలియదు. అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రమే తెలుస్తుంది. ఒకడికి కాస్త చల్లగాలి తగిలితేచాలు తుమ్ములొస్తాయి. ఎండలోకి వెళ్తే తట్టుకోలేడు. కాస్త పుష్టికరమైన ఆహారం తింటే అరగదు. అలా అని తీసుకోకపోతే పుష్టిలేక శుష్కించి పోతాడు. అప్పుడు తెలుస్తుంది వాడికి - ఆరోగ్యంగా వుంటే ఎంత బాగుంటుందో! అందుకని శాయశక్తులా పాటుబడి ఆరోగ్యాన్ని చేకూర్చు కుంటాడు. అందుకు కారణం, ఆరోగ్యంగా వుంటే హాయిగా వుండడమే.

ఉదాహరణకి: పడకమీద పడుకున్నాము. వెల్లకిలా కాసేపుపడు కున్నాక పక్కకు ఒత్తిగిలాలనిపిస్తుంది. అందుకని కాసేపు పక్కకు ఒత్తిగిలు తాము. అప్పుడు "అమ్మయ్యా! హాయిగావుంది!" అనుకుంటాము. అసలు ఎందుకు ఒత్తిగిలినట్లు? దానికి కారణం ముల్లు గుచ్చుకోవడంగాని, ఏదైనా వీపుక్రింద వుండడంగానీ కాదు. ఒకేవైపు ఎక్కువసేపు పడుకుంటే అసౌఖ్యంగా వుంటుంది. ఒత్తిగిలుతుంటే హాయిగా వుంటుంది. దానివల్ల ఏదో లాభం వస్తుందనీ కాదు. అలాగే ఏదైనా విషయం తెలుసుకుంటే బాగుంటుంది. అలాగే తెలుసుకోవాలని అనిపించడాన్ని సత్వగుణము అన్నారు. తెలుసుకోవాలనే జిజ్ఞాస లేకపోవడాన్ని రజోగుణము, తమోగుణము అన్నారు. అందుకనే శాస్త్రాలకు అర్థాలను వివరిస్తుంటే కొంతమందికి ఇష్టం వుండదు. "ఎందుకయ్యా యివన్నీ? ఎవరికి కావాలి గనుక"? అంటాడు. "కలశం యిందుకోసం పెడతారు, అగ్ని పెట్టడంలో ఉద్దేశ్యమిది, అగ్ని గుండానికి చుట్టు ఇటుకలు కట్టడము, అన్ని ఇటుకలే కట్టడంలో అంతరార్థమిది" అని చెబుతుంటే 'ఇదంతా నాకెందుకొచ్చిన గొడవయ్యా, ఎన్నియిటుకలు కావాలో చెప్పు, కట్టించి పడేస్తాను' అంటాడు. అలాగే శాస్త్రాలలోని మంత్రార్థాలను వివరించి చెప్పాలని చూస్తే,

'ఇదంతా మాకెందుకు? ఆ మంత్రమేమిటో చెప్పు, ఆ కాస్త అనేసి వెళ్ళి పోతాను' అంటాడు. ఇలా జిజ్ఞాస లేకపోవడం సాత్వికగుణ లక్షణం కాదు అన్నారు. జిజ్ఞాస లేకుండా యాంత్రికంగా చేసే యజ్ఞం సాత్విక యజ్ఞంకాదు అన్నారు. అంటే దానివల్ల వచ్చే ఫలితం మీద ప్రీతే గాని దానిపట్ల శ్రద్ధ లేదని అర్థం. పరీక్షలకు చదువుతున్నాము. తర్వాత వచ్చే ఉద్యోగం కోసం చదువుతాము కాని చదువుమీద ప్రీతి వుండి కాదు. అట్టి అవకాశాలు లేకపోతే చాలామంది చదవరు. ఇంతకుముందు మనమనుకున్నట్లు B.ipcలోనో, M.Pc లోనో కష్టపడి సీటు సంపాదించుకున్నది చదువుమీద ప్రీతి వుండికాదు. ఎట్లాగోట్లా అందు లోంచి బయటపడిపోతే తర్వాత మంచి ఉద్యోగం వచ్చి డబ్బులొచ్చినప్పుడు బాగుంటుంది కాబట్టి. ఈ డాక్టరు చదువు చదివినందువల్ల మంచి ఉద్యోగమొస్తే, మంచి జీతమొస్తే మంచి హోదాతో కాలుమీద కాలు వేసుకుని తినవచ్చు. కాస్త గర్వంగా బ్రతకవచ్చు అని తలచడాన్ని రజోగుణము అంటారు. అట్లాగాక ఈ శరీరమేమిటి? ఆకలవుతే ఎట్లా వుంటుంది? ఎట్లా కడుపు నిండుతుంది? ఆరోగ్యమెట్లా కుదురుతుంది? శరీరంలో అవయవాలు ఎట్లా నిర్మించబడ్డాయి? ప్రకృతి యొక్క వైచిత్ర మేమిటి? అని తెలుసుకుందామనే జిజ్ఞాస కలిగివుండి చదువుకోవడమేమో సాత్వికమైన చదువు. కాపీకొట్టి గాని, మరేవిధంగా గానీ, ఎట్లాగోట్లా సర్టిఫికెట్ సంపాదించుకుందామనుకునేది తామసికమైన చదువు. ఎందుకోసమైతే విద్యవున్నదో దానికి విరుద్ధమైన పని అన్నమాట. తెలియ జెప్పడంకోసం విద్యవుంటే తెలుసుకోకుండావుండే ప్రయత్నమిది. దానిని తామసికము అన్నారు. అవసరంకోసమైనా, ఆశతోనైనా ఎట్లాగోట్లా తెలుసుకుందామని ప్రయత్నం చేసేది రాజసికము. సంతోషంతో, ఆసక్తితో తెలుసుకుందామనుకునేది సాత్వికము. ఈ సత్వము, రజస్సు, తమస్సులను గూర్చి నిత్య జీవితంలో వుండే సందర్భాలను సరళంగా ఉదహరించక పోవడంవల్ల ఎన్నిసార్లు వాటిగూర్చి విన్నా అన్వయం కుదరదు.

అలానే సాయిని నిత్యమూ పూజిస్తాము. ఈ మూడింటిలో ఏ విధంగా పూజిస్తు న్నాము? అయనను పూజిస్తే మనకు రక్షణ అండ లభిస్తుంది గాబట్టి చేస్తున్నామా? అయితే అట్లా చేయగూడదని కాదు. అలా చేస్తూవుంటే వగరుగా వుండేటటువంటి పిందె క్రమంగా కాయగా, పండుగా, తర్వాత తియ్యగా ఎలా

మారుతుందో, ఈనాడు పుల్లగా వుండే మామిడికాయ తర్వాత తియ్యగా వుండే మామిడిపండుగా ఎలా మారుతుందో, అలాగే మనలో తెలుసుకునే సామర్థ్యం క్రమంగా పెరుగుతూ, తెలుసుకునేకొద్దీ మనలో సత్వం పెరుగుతూ వస్తుంది. అందుకే బాబా, చెప్పినందుకోసమైనా చేస్తూవుండమని, అలా చేయగా చేయగా మామిడి పిందె, పండు అయినట్లు అవుతావుఅనీ అన్నారు. అందుకని వాటిని ఆశించి చేయకూడదని అనడం తప్పు. కానీ ఆశిస్తూ మాత్రమే చేస్తూండడమూ తప్పే.

ఎట్లాగంటే బ్లాంక్ చెక్కు, అడుగున సంతకం పెట్టి నీయిష్ట మొచ్చిన అంకె వేసుకుని డబ్బు తీసుకోమని చెబితే ఆ చెక్కును కాదనుకుని నాకు పది పైసలు యివ్వు అని అడిగినట్టు అవుతుంది. తనకున్న పరమాత్మ స్థితినే ఆయన (బాబా) మనకు యిద్దామనుకుంటే, ఈ అవసరం తీర్చు అని అడగవలసిన అవసరం మనకేమిటి? ఈ విషయం మనం యింతకుముందు గూడా చెప్పుకున్నాము. పరమాత్మ తనకున్న యావత్తూ మనకు ప్రసాదించాలని చూస్తున్నాడు. అంటే తనంతటివాణ్ణి చేయదలచుకున్నాడు. అంటే ఆయన నుంచి సర్వాన్నీ పొందినవాడు సాయిలాగా వుంటాడన్నమాట. వర్షాన్ని ఆగ మంటే ఆగవలసిందే, అగ్నిని ఆగమంటే ఆగవలసిందే, దేవతలందరూవారి అధీనంలో వారికి కట్టుబడివుండవలసిందే! మహనీయుడు భగవంతుని యొక్క ఆత్మస్వరూపము. అదీ మనము గమనించవలసింది. అందుకే శ్రీకృష్ణుని పట్ల ఇంద్రుడు చేసిన పొరపాట్లు శుకాదులు చేయలేదు. బ్రహ్మాదులకు అసూయ కలిగి, గోవులనూ, గోపాలురనూ తీసుకువెళ్ళి బంధించారు. అందుకని వాళ్ళకు బుద్ధి చెప్పాలని వూనుకున్నాడు కృష్ణుడు. గోపాలకులంతా ఇంద్రుని ప్రీతి కోసం ఒక యజ్ఞం చేయబోతున్నారు, అప్పుడు కృష్ణుడు "ఎక్కడో వున్న ఇంద్రుని పూజించడమెందుకు? సస్యశ్యామలమైన ప్రాంతము గోవర్ధనగిరి ప్రాంతము. కనుక గోవర్ధనగిరి మీరు పూజింపదగినది". కనుక గోవర్ధనగిరినే ఆరాధిద్దామని చెప్పాడు. నిజానికి ఆయన చెప్పినది తనను ఆరాధించమని. మహనీయులెప్పుడూ అలానే చెబుతారు. ఆయన చెప్పిన దానికి నేను వున్నాను గదా! అని అర్థం. కాని ఆమాట ఆయన చెప్తే ఈ లోకంలో అహంకారమున్న ప్రతివాడూ అలాగే చెప్పడానికి అవకాశముంది గనుక ఆయన గోవర్ధనగిరిని పూజించమన్నాడు. శిరిడీలో సాయినాథుడు ఒకరోజున

యిలాగే అన్నారు: "ఈరోజు గురుపూర్ణిమగదా! ద్వారకామాయిలో వున్న స్తంభాన్ని పూజించండి" అని. అక్కడున్న వాళ్ళకు ఆ రోజు గురుపూర్ణిమ అని తెలియదు. తీరా పంచాంగం చూసుకుంటే ఆరోజు గురుపూర్ణిమే. సద్గురువును పూజించుకునేరోజు. వాళ్ళంతా సాయిదగ్గర వుంటున్నారు, సాయి లీలలు చూస్తున్నారు. ఆయన ఆత్మజ్ఞానియని వాళ్ళకు అనుభవమవుతూనే వున్నది. ఆయనను సద్గురువుగా తెలుసుకుని ఆయనను పూజించాలని వాళ్ళకు తోచనేలేదు.

నిజంగా ఆలోచిస్తే ఆయన చెప్పినది పరోక్షంగా తనను పూజించమనే. సద్గురువు తనను పూజించమని ఎన్నడూ చెప్పరు. అలా చెబితే అహంకరించడం అవుతుంది. గనుక ద్వారకామాయిలోని స్తంభాన్ని పూజించమని చెప్పారు. ఈ విషయం ఆలోచిస్తే అర్థమవుతుంది. ద్వారకామాయి అంటే ద్వారములు కలది అని అర్థం. ఎక్కడ నాలుగు వర్ణాలకూ ఎటువంటి భేదం లేకుండా ద్వారాలు తెరచివుంటాయో అది ద్వారక. ఆ ద్వారక ఈ విశ్వానికి సంకేతం. జీవులన్నీ జన్మల రూపంలో యిక్కడకు వచ్చి యిక్కడ నాలుగు పురుషార్థాలనూ పొందాలి. పాత కర్మలను రద్దు చేసుకుని, పుణ్య కర్మలను ఆచరించి వుత్తమగతులను పొందడానికి సౌలభ్యం యిక్కడే వున్నది. కర్మరాహిత్యం పొందడానికి గూడా యిదే ద్వారం కాబట్టి యిది ద్వారక. అట్టి ద్వారకకు మూలస్తంభమైన దానికి పూజ చేయమని బాబా చెప్పారు. దానికి మూల స్తంభమెవరు? అది మూడు స్తంభాలమేడ. కొంతమంది దానిని త్రిగుణాలుగా చెప్పారు. మరికొంతమంది దానిని త్రిమూర్తులుగా చెప్పారు. బ్రహ్మ, విష్ణు శివాత్మకము, పరబ్రహ్మ తత్త్వము అయినటువంటి సద్గురువుయొక్క రూపమే దాని స్తంభము. అట్లాగే ఈ శరీరమే ద్వారకామాయి. నవద్వారములు గల ఈ దేహమే ద్వారకామాయి. జీవుడు ఈ దేహమనే ద్వారకామాయిలో ప్రవేశించి దాని ద్వారానే నాలుగు పురుషార్థాలనూ పొంది, కర్మరాహిత్యాన్ని పొందుతాడు. ఇందులో ఆత్మ రూపంలో లోపల హృదయంలో సద్గురువే వున్నాడు. అందుకే దానికే - అంటే ఆ స్తంభానికే పూజ చేయమని చెప్పారు బాబా. అలాగే అక్కడ ఆ గోపాలకులు పూజించింది ఆ గోవర్ధనగిరినికాదు, కృష్ణుణ్ణి గాదు, వాళ్ళు పూజించింది కృష్ణపరమాత్మ యొక్క మాటను. మరి అంతేగదా! గోవర్ధనగిరిని పూజించండి అని ఆయన చెప్పాడనుకోండి. మామూలుగా అయితే దాదాపు ఎవ్వరూ చేయరు. మరి వాళ్ళు ఆయన

మాటను వెంటనే అమలుపరవారు. అంటేవాళ్ళు ఆయన మాటకు అంతటి విలువ నిచ్చారన్నమాట. అందుకని ఆయన మాటపై ఆ పర్వతాన్ని పూజిస్తే ఆయనను పూజించినట్లే లెక్క. అదీ దానిలోయున్న యుక్తి. అందుకని కృష్ణపరమాత్మ ఆ పర్వతాన్ని ఆరాధించమని చెప్పారు. వాళ్ళు అలా చేయడమారంభించేసరికి ఇంద్రాదులకు కోపం వచ్చింది. 'వర్షాలు మేము కురిపిస్తుంటే మమ్మల్ని పూజించడం మాని, ఆ కృష్ణుడి మాట విని ఆ పర్వతాన్ని పూజిస్తున్నారు' అని వాళ్ళకు కోపం వచ్చి వర్షం తెప్పించి వాళ్ళను కష్టపెట్టాలని చూసారు. వాళ్ళ అహంకార నిర్మూలనం కావడం కోసం కృష్ణపరమాత్మ ఆ గోవర్ధనగిరిని ఎత్తిపట్టుకుని గోపాలురకు రక్షణగా నిలిచాడు. అప్పుడు శ్రీకృష్ణుని గొప్ప తనాన్ని తెలుసుకుని ఇంద్రాదులు హదాక్రాంతులయ్యారు. అందుకని ఇంద్రాదిదేవతలు అహంకరించడమూ వుంటుంది. భగవంతుడు వాళ్ళు తెలుసుకునేలా మొట్టికాయలు వేయడమూ వుంటుంది. అలాగాక శుకమహర్షిలాంటివాళ్ళు అహంకరించడమూ వుండదు. భగవంతుడు మొట్టికాయ వేయవలసిన అవసరమూ లేదు. ఏ పరమాత్మ అయితే కృష్ణుని రూపంలో వుండి అవతారకార్యం నిర్వహించాడో, ఆయనే శుకయోగి రూపంలో అరణ్యాలలో సంచరిస్తూ అవతార కార్యం నిర్వహిస్తున్నారు. అందుకని దేవతల కంటే వీళ్ళు అధికులు. మానవ శ్రేయస్సు కోసం అరణ్యాలలో తపస్సు చేసేటటువంటి అనేకమంది మహర్షులను రక్షిస్తూ, ప్రజాహిత కార్యంకోసం ఆ పరమాత్మ రామకృష్ణాది రూపాలలో అవతరించి కాపలాకాస్తారు. మన డబ్బులన్నీ తీసుకెళ్ళి బ్యాంకులో దాచుకున్నాము. వాటి నెవరూ దోచుకోకుండా కాపలా కాయిస్తున్నాము గదా! అట్లాగే ఋష్యాదులు. వాళ్ళలో వుండే జ్ఞానము, వాళ్ళ తపస్సు అంతా ధనాగారాలు. వాటిని రాక్షసులనే దొంగలు దోచుకుపోకుండా చూచే కాపలాదారుడు అవతారపురుషుడు. అయితే కాపలాదారుడు కదా అని ఆయనను చులకనగా చూడగూడదు. ఆ కాపలామీద సకలజీవుల శ్రేయస్సూ ఆధారపడుతుంది గనుక పవిత్రంగా చూడాలి. ఇదీ దానిలో వున్న రహస్యం. కాబట్టి యజ్ఞ, దాన, తపః, కర్మలను సాత్వికంగా చేయడమనేది నేర్చుకు తీరాలి. కాని ఎలా సాత్వికులు అవాలో చెప్పలేదు. రజోగుణ, తమో గుణ, సత్వగుణ లక్షణాలను చెప్పారు. రజోగుణ, తమో గుణాలతో యజ్ఞ, దాన, తపః కర్మలు చేస్తే వ్యర్థమవుతాయి అన్నారు. కనుక సాత్వికంగా చేయాలి అన్నారు. అయితే

సాత్వికంగా చేయడమెలా అన్నది సమస్య. మారాలి అనుకుంటే మనం మారలేము. ఈ విషయం యింతకు ముందు ఒకసారి చెప్పుకున్నాము. కోపం రాకూడదు అనుకుంటాము. కాని ఏం చేసినా ఆ సమయానికి వస్తూనే వుంటుంది. శ్రీరామచంద్రునిలా, సత్యహరిశ్చంద్రునిలా వుండాలని అందరమూ అనుకుంటాము. కాని వుండగలుగుతున్నామా? అలాగే సత్వగుణం కలిగి వుండాలి అనుకున్నంత మాత్రాన వుండ లేము. దైవీసంపద రమ్మన్నంత మాత్రాన రాదు. దైవీ సంపద అంటే ఏమిటో, సత్వగుణమంటే ఏమిటో తెలిసినంత మాత్రాన ఏమి కాదు. ఒకసారి రమణమహర్షి వద్దకు 'అహం బ్రహ్మాస్మి' అని జపం చేసేవాడు ఒకడు వస్తే అలా ఎప్పుడూ చేయవద్దు అని ఆయన చెప్పారు. మనం నిజంగా ఏది అయి వున్నామో అది నేను, నేను అని ఎప్పుడూ అనుకోము గదా! అనుకోవడానికి ప్రయత్నం చేసామంటే అది కాము అని మన అభిప్రాయమన్నమాట. నేను భరద్వాజ అని తెలిసినపుడు నా పేరు జపం చేయవలసిన అవసరం లేదు గదా! నేను ఏ అక్కినేని నాగేశ్వరరావు లాగానో వుండాలని ప్రయత్నం చేస్తున్నానంటే నేనలా లేను కనుక. అలాగే 'నేను బ్రహ్మాన్ని, నేను బ్రహ్మాన్ని' అని ఎందుకనుకోడానికి ప్రయత్నం చేస్తున్నామంటే మనం నేను బ్రహ్మం కాదని తెలుసు కనుక. కాని నోటితో నేను బ్రహ్మాన్ని అంటుంటే చాలదు. ముందు మనమేమిటో తెలిస్తే బ్రహ్మమేమిటో తెలుస్తుంది. అందుకని అటువంటి సూక్ష్మాలు మహనీయులు చెప్పాలి. ఆ సూక్ష్మాలు వాళ్ళు చెప్పక ముందు ఆ గ్రంథాలు చదివినా ఏమీ అర్థం కాదు. శంకరాచార్యులు "బ్రహ్మా హమస్మి ఇతి విభావయంతః" అని వ్రాశారు.

అంటే "నేనే బ్రహ్మమును అని విశేషముగా భావన చేసినవాడు" అని అర్థము. అటువంటి మహాత్ములకు నమస్కారము అన్నారు. మరి ఆయన అలా చెప్పారు, మరికొందరు ఈ విధంగా చెప్పారేమిటి? అంటే ఈ 'విభావయంతః' అన్న పదానికి అర్థం నీకు తెలియలేదు అన్నారు. భావన వేరు, విభావన వేరు అని చెప్పారు. బ్రహ్మము కానివాడు తాను బ్రహ్మమును అని అనుకోవడం కోసం చేసే ప్రయత్నాన్ని భావన అంటారు. అలాగాక లేనిపోని భ్రాంతులన్నింటినీ తీసి పారేసి అసలు బ్రహ్మమంటే ఏమిటి? అన్న విషయాన్ని తెలుసుకొని, ఏది వాస్తవంగా వున్నదో దానిని గుర్తించడాన్ని విభావన అంటారు. భ్రాంతిమయమై నటువంటి భావనలు తొలగినపుడు మన నిజతత్త్వం తెలిసినప్పుడు దానిని విభావన

అంటారు. చూడండి! ఎలా విపరీతార్థం వచ్చిందో! అలాగాకుండా మనం కూర్చుని 'నేనే బ్రహ్మన్ని' అని భావన చేస్తుంటే అవుతుందనుకుంటే పొరపాటే. ఏమీ అవదు. అవకపోగా అలా చేయడం కోసం ప్రయత్నం చేస్తుంటే ఏమవుతుందంటే - 'మనం బ్రహ్మజ్ఞానం కోసం ప్రయత్నం చేస్తున్నాము, మనం బ్రహ్మజ్ఞానులము, మనం తత్వజ్ఞులము' అనిపించడం మొదలెడుతుంది. కాని అది నిజం కాదు. బ్రహ్మము ఎక్కడైనా తననుతాను బ్రహ్మజ్ఞానినని అనుకుంటుందా? ఎప్పటికీ అను కోదు. కారణం తాను కానివాళ్ళంటూ ఎవరైనా వుంటే గదా తాను బ్రహ్మజ్ఞానినని అనుకోడానికి, తానుగాక ఎవరైనా వున్నారంటే అది ప్రపంచమే అవు తుంది. తాను వేరు అవుతుంది, అప్పుడు తాను దేహమన్న భ్రాంతి వున్నట్లే గదా! అందుకనే - ఇటువంటి విపరీతార్థాలు వస్తాయనే మన వాళ్ళు పెద్దల వద్ద మాత్రమే శాస్త్రాలను తెలుసుకోవాలని చెప్పారు. లేకపోతే ఏవికావో అవి అవుననిపిస్తాయి. మయసభలాగా అనిపిస్తాయి.

ఉదాహరణకు మహాపండితులైన యిద్దరు భగవంతునియొక్క తత్వాన్ని గూర్చి చర్చిస్తున్నారనుకోండి. నలుగురి మధ్యలో తాను ఓడిపోవడం యిద్దరికీ యిష్టంలేక శాస్త్రంతోను, తర్కంతోనూ వాదిస్తున్నారనుకోండి. వారి వాదం ఎంత గొప్పగా వున్నప్పటికీ వారికి మాత్రం క్షణక్షణానికి అజ్ఞానం ప్రబలుతుంది. ఎందుకంటే వాళ్ళకు నలుగురిలో తమ వాదం పోతే ఎట్లా? అవమానం కదా! అన్న భావం ప్రధానంగా వుండి ఓడిపోవడం ఏ మాత్రం యిష్ట వుండదు. అప్పుడేమవుతున్నదంటే నలుగురూ వేరుగా వున్నారు. తాను వేరుగా వున్నాడు. వారించే వ్యక్తి వేరుగా వున్నాడు. అందరూ వేరువేరనే భావాలున్నాయి. గెలుపు, ఓటమిలనే భావాలు వున్నాయి. ఇవి రజోగుణ ప్రధానములైన భావాలు గనుక మొత్తం వ్యర్థం. దీనికి యింతకుముందొక ఉదాహరణ చెప్పుకున్నాము. టీచరు వస్తూండడం చూచి క్లాసులోని పిల్లలు మాట్లాడడం మానేస్తున్నారని తెలిసినా గూడ, ఒక తుంటరి పిల్లవాడు, 'మాట్లాడవద్దు, టీచరు వస్తున్నారు., యిప్పుడు మాట్లాడవచ్చా?' అని పెద్దగా అరుస్తున్నాడు. 'ఏమిటిరా అరుస్తున్నావ్' అని టీచరు అడిగితే, 'వాళ్ళను మాట్లాడవద్దంటున్నాను టీచర్' అంటాడు. వాడిని తిట్టేందుకు వీలులేకుండా నేమో అవతలి వాళ్ళను అల్లరి చేయవద్దని చెబుతున్నాడు. ఆ చెప్పే మిషమీద వీడు అల్లరి చేస్తున్నాడు. అటువంటి తుంటరి

పిల్లవానిలాగా మన మనస్సు పనిచేస్తుంది. కాబట్టి సత్వగుణ ప్రధానంగా యజ్ఞ, దాన,తపః, కర్మలను చేయడమెట్లా? అనేది, మనం కావాలంటే రాదు అని చెప్పుకున్నాము. సత్వగుణం ఎలా వస్తుంది అనేది భగవద్గీతాది గ్రంథాలలో ఎక్కడా చెప్పలేదని యింతకు ముందు చెప్పుకున్నాము. పోనీ ఆచారాన్ని పాటిస్తుంటే వస్తుందని చెప్పడానికి పురాణకథలు సరిపోవు. పోనీ జపాదులు చేస్తుంటే సరిపోతుందా అంటే జపం గూడా యజ్ఞమే. అది ద్రవ్యయజ్ఞంగాదు, తపోయజ్ఞం. కనుక తక్కిన యజ్ఞాదులకువలెనే సత్వగుణ ప్రధానంగా చేస్తేనే ఆ జపయజ్ఞమైనా సరియైన ఫలితాలనిస్తుంది. ఇది తెలియక చేసిన ఉపదేశాలన్నీ వ్యర్థము. ఊరికే మనుషులను భ్రాంతిలో పడేసి తమ పిడికిట్లో బిగించుకుని తమ చెప్పుచేతలలో వుంచుకోవడానికి మాత్రమే పనికివస్తాయి. కొందరు ఏదో ఒక మంత్రమో, నామమో వాళ్ళదగ్గరకు వచ్చిన వాళ్ళకు చెబుతారు. అది చేస్తూండండి వస్తుంది అంటారు. వాళ్ళు చేస్తూ వున్నా అవకపోతే వచ్చి, ఏమండీ చేస్తూనే వున్నాను, యింకా ఏమీరాలేదు అన్నారనుకోండి. నీవు సరిగా చేయలేదు, నీలో యింకా పరివర్తన రాలేదు, చేస్తూవుండు అంటారన్నమాట. అప్పుడు వాళ్ళ పరిస్థితి అయోమయం. చేస్తూ వున్నాకూడా ఫలితం రాదు, వదిలి పెట్టడానికేమో భయం. ఎందుకనంటే వాళ్ళను సాత్వికులుగా అవమని వారు చెప్పలేదు కదా! అది వాళ్ళకే తెలియదు కనుక ఒకవేళ చెప్పినా ప్రమాదమే. ఎందుకంటే ఎట్లా సత్వగుణం పెంచుకోవాలి అని అడుగుతారు. అప్పుడు శాస్త్రాలలో చూస్తే దొరకదు- ఎందుకంటే అది మహాత్ముల అనుగ్రహంవల్ల మాత్రమే లభిస్తుంది. కనుకనే శ్రీకృష్ణుడు 'తద్విద్ధి ప్రణిపాతేన.....' అని మహాత్ములను సేవించు అని చెప్పారు. వారు మాత్రమే తమనాశ్రయించిన వారిని సత్వగుణం వైపుకు నడిపించి తరింపజేయగలరు. ఈ విషయాన్ని తెలియజేయడానికే బాబా, నానా ఆ శ్లోకం చదువుతున్నప్పుడు మాత్రమే ఆగి, అతనిని అడిగి తానే వివరించి చెప్పారు. అంటే గీతలో ఈ విషయం శ్రీకృష్ణుడు చెప్పకనే చెప్పాడన్న విషయం తెలుసుకోవడానికి గూడా సద్గురువు నాశ్రయించడమే శరణ్యము.



అధ్యాయం-26

భగవంతుడు -సృష్టితత్త్వము



భగవంతునియందు విశ్వాసము అనే విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించినట్లయితే దానికి ముందు వేరొక విశ్వాసముగూడా యిమిడి వుంటుందని మనం గమనించాలి. ఏదైనా ఒక విషయాన్ని మనం సత్యమని అంగీకరించినప్పుడు, అది సంపూర్ణంగా సత్యమని విశ్వసించినపుడు అది సత్యమని నిర్ణయించేటటువంటి మన నిర్ణయంమీద, నిర్ణయించే సామర్థ్యం మీద విశ్వాసముండాలి. అంటే భగవంతుడు వాస్తవంగా వున్నాడు అని నమ్మి దాని ప్రకారం మనం జీవించగలగాలంటే అటువంటి విశ్వాసాన్ని కలిగినటువంటి మన చైతన్యంమీద మనకు విశ్వాసం వుండాలి. డాక్టరుగారిమీద విశ్వాసం లేకపోతే వారిచ్చే మందుమీద విశ్వాసముండదు. మనమీద మనకు విశ్వాసము లోపించినట్లయితే మనం చేసిన నిర్ణయాలమీద మనకు విశ్వాసముండదు. కాబట్టి భగవంతుడు వున్నాడు అని మనం చేసిన నిర్ణయంమీద మనకు పూర్ణమైన విశ్వాసముంటే ఆ నిర్ణయం చేయగలిగిన మన సామర్థ్యంమీద మనకు అపారమైన విశ్వాసం వుండాలి. ఎవరికైతే పరిపూర్ణమైన ఆత్మ విశ్వాసము వుంటుందో వాళ్ళు మాత్రమే భగవంతుని సంపూర్ణంగా విశ్వసించగలరు. దీనిని బట్టే ఈ ఆత్మ, పరమాత్మ అనబడేవి బలహీనుడికి (ఆత్మవిశ్వాసం లేనివాడికి) లభ్యమయ్యేటటువంటివి కాదని, మహాబలునికి (ఆత్మ విశ్వాసం వున్నవాడికి), వివేకికి, ఎంతో ధైర్యశాలికి మాత్రమే లభ్యమవుతాయనీ ఉపనిషత్తులు చెప్పాయి. కాబట్టి ఒకరకంగా చెప్పాలంటే భగవంతుడు వున్నాడన్న విశ్వాసమును మనిషికుండే ఆత్మ విశ్వాసానికి కొలతబద్దగా తీసుకోవచ్చు. ఎవరికైతే ఆత్మవిశ్వాసం సంపూర్ణంగా వుంటుందో, వారు మాత్రమే భగ వంతుని సంపూర్ణంగా విశ్వసించగలరు. ఎవరికైతే తమ విషయమై శంక వుంటుందో, వారు మాత్రమే భగవంతుని యందు గూడా శంక కలిగివుంటారు అని మనం తలచవచ్చు.

అయితే ఈ భగవంతుడు అనే విషయం గూర్చి సామాన్యంగా ఎక్కువమంది ప్రజలలో ఒక అభిప్రాయం వుంటుంది. ఈ పరమాత్మ, భగవంతుడు ఒకడున్నాడని ఎవరో పెద్దలు ఎప్పుడో చెప్పారు. దానిని మనం

అనాదిగా, తరతరాలుగా వింటూ, విశ్వసిస్తూ ఆచరించుకుంటూ పోతున్నాము. మన యింద్రియాలకు, మనస్సుకు గోచరించేటటువంటిది ఈ ఆధునిక విద్య. దీనితో మాత్రమే దానిని పూర్తిగా తెలుసుకోవడం సాధ్యం కాదు. కాబట్టి దాని యొక్క నిరూపణ కోసం ఎదురు చూడకుండానే దానిని విశ్వసిస్తూపోతే చాలు అనేటటువంటి ఒక అభిప్రాయం వున్నది. కాని ఈ కారణంగానే భగవంతుని యందు విశ్వాసాన్ని అంగీకరించడం కొంతమంది మేధావులకు కష్టమవుతుంది. ఇంద్రియాలకు మనస్సుకు గోచరించనటువంటి సత్యాన్ని, మనమెప్పుడూ చూడనటువంటి దానిని నమ్మి జీవితాన్ని ప్రారంభించడమెట్లా? దానిని అనుసరించి మన జీవితమంతా రూపొందించుకున్న తర్వాత జీవిత అవసానదశలో అదంతా అసత్యమని మనకనిపిస్తే ఏమైపోతాము. కనుక తెలియని దానిని గూర్చి విశ్వసించడమెట్లా అనేటటువంటిది మరొక రకమైన యోచన. మానవ జాతినంతటినీ ఈ రెండు రకాలుగా విభజించవచ్చు. కాని రెండింటికీ సమన్వయమే లేదా? కొంతమంది భగవంతుని ఉనికిపట్ల విశ్వాసాన్ని ప్రధానంగా తీసుకుని బయల్దేరేటట్లయితే మరికొంతమంది కేవలం విశ్వాసాన్నే ప్రధానంగా అంగీకరించలేరు. కాబట్టి వీరిరువురూ ఒకరికొకరు సహకరించకపోవడం జరుగుతున్నది. మరి ఈ ఇరువురినీ సమన్వయపరచే మార్గమేలేదా?

ఇక్కడ నేను యింతకుముందు చెప్పిన వాక్యాన్ని మరొక్కసారి గుర్తు చేస్తున్నాను. మనయందు మనకు పూర్ణమైన విశ్వాసమున్నట్లయితే మనందరినీ సమైక్యపరచడానికి అది చాలు. అందుకని ఆ విశ్వాసంపట్ల మనకున్నటువంటి రెండు రకాల అభిప్రాయాలచేత మనం ఒక వ్యక్తితో మరొకరం కలవలేకపోవడమన్నది మన మేధాశక్తికి, మానవతకూ కళంకం అని మాత్రం మనవి చేసుకుంటున్నాను. ఈ పరమాత్మ లేక భగవంతుడు అసలు వున్నాడా? లేడా? వుంటే ఎట్లా వుంటాడు? ఆ భగవంతునిగూర్చి ఏ విధంగా చెప్పబడి వుంది? వాని యొక్క తత్త్వమేమిటి? అని ఆలోచిస్తే దానియొక్క పర్యవసానం ఒకటే వున్నది. ఏది వాస్తవంగా వున్నదో అది భగవంతుడు అని అర్థం. దేనివల్లనైతే ఈ విశ్వమంతా ఏర్పడిందో, దేనివల్లనైతే ఈ విశ్వమిలా కొనసాగుతున్నదో, ఈ రకమైన పరిణామాలు చెందుతున్నదో, దేనియొక్క సామర్థ్యంచేతనైతే మనకు ఈ తెలుసుకునేటటువంటి సామర్థ్యం మనలో వున్నదో అదే పరమాత్మ యొక్క నిర్వచనం. ఇది తెలియకపోవడంచేత అటు సామాన్య ప్రజలుగాని, ఇటు

భగవంతుడనే భావాన్ని అంగీకరించనివారు గాని ఒక పొరపాటు అభిప్రాయానికి గురవు తున్నారు. భగవంతుడనే వాడు ఈ ప్రపంచానికి, మనకూ, ప్రకృతికీ, సంబంధంలేకుండా ఎక్కడో కూర్చుని ఒకయంత్రాన్ని నడిపినట్లు ఈ సృష్టిని నడుపుతుంటాడు అని భగవంతుని ఆస్తిక్యాన్ని అంగీకరించేవాళ్ళు విశ్వసిస్తూ వుంటారు అనే భావన వల్ల కొందరు భగవంతుని అస్తిక్యాన్ని అంగీకరించక పోవడమూ వున్నది. అయితే భగవంతుని ఉనికిని విశ్వసించేవాళ్ళు గూడా కొందరు ఈ భావనతో విశ్వసించేవారూ వున్నారు. ఆ విధంగా నమ్మే వాళ్ళు వుండబట్టి భగవంతుని నమ్మేవాళ్ళంతా యిటువంటి వాళ్ళేనని దైవమనే బావం అటువంటిదేననీ అనుకుని అసలు మొత్తాన్ని కాదనుకునేవారూ వున్నారు. కాని కొంచెం నిదానంగా ఆలోచించి ఈ భగవంతుడు అనేది ఎటువంటిది? అని గమనించినట్లయితే లేదని చెప్పడానికి వీలులేనిది ఏదైతో వున్నదో, దానిని వాళ్ళు భగవంతుడు అన్నారని అర్థమవుతుంది. ఏది లేదని చెప్పినట్లయితే చెప్పడానికి, వినడానికి, వుండడానికి ఏ మాత్రం వీలుండదో ఆదే ఆ భగవంతుడు అని అర్థమవుతుంది. ఇదీ మనం గమనించవలసిన విషయం. ఎప్పుడూ చూడనటు వంటి ఆ భగవంతుణ్ణి మనం నమ్మడమెలా? ఎవరో చూసారట, చెప్పారట అని నమ్మడం సమంజసమా? అయితే అటు వంటిది నిజంగా వున్నదా? లేదా? అని మనం పరిశీలన చేసుకుని ఒకానొక అవగాహనకు రాక ముందు నమ్మడం ఎలా సాధ్యం? మనమెప్పుడూ చూడనటువంటి ఒకానొక వ్యక్తినిగాని, ఆ వ్యక్తియొక్క మంచి తనాన్నిగాని నమ్మడం ఎలా వీలవుతుంది? నిత్యజీవితంలో ఉదాహరణ తీసుకోండి. మనమెక్కడా చూడని ఒక మనిషిని, అతని మంచితనాన్ని కొంచెం గూడా చవిచూడకుండా ఆ వ్యక్తిని ఎలా విశ్వసిస్తాము? అటువంటప్పుడు ఎప్పుడూ చూడని ఆ పరమాత్మను విశ్వసించడమెలా సాధ్యం?

ప్రపంచంలో భగవంతుని యొక్క ఆస్తిక్యాన్ని అంగీకరించిన వివిధ మతాలున్నాయి. క్రైస్తవము, ఇస్లాము, హైందవము, మొదలైన మతాలున్నాయి. ఆ మతాలలో భగవంతుని ప్రత్యక్షంగా చూచిన మహనీయులు ఆ భగవంతుణ్ణి ఎటువంటి గుణాలుగలవానిగా వర్ణించారో తెలుసుకుని, వాటన్నింటిలో సమా నంగా వున్న గుణాలన్నింటినీ తీసుకుని, అటువంటిది అసలు ప్రకృతికి మూలంగా ఆధారంగా ఏమైనా వున్నదా? అని ఆలోచించడం శాస్త్రీయమైన పద్ధతి. అంటే మనమెప్పుడూ చూడనటువంటి ఒక వస్తువును ఇతర వస్తువు

లతోపాటు అవతలి గదిలోపెట్టి ఆ వస్తువున్నదో లేదో చెప్పమంటే ఆ చూచి వచ్చినవాడు చెబుతాడు. ఆ వస్తువు ఫలానా రీతిన, ఫలానా గుణాలు కలిగి వుంది అని. అదే రీతిన మనమెప్పుడూ చూడనటువంటి ఒకానొక తత్త్వం ఈ సృష్టికి మూలంగా వున్నదా లేదా?అని మనం తెలుసుకోవాలంటే దానిని చూచిన వారు, దాని గుణాలు ఏ విధంగా వున్నాయో చెప్పారు. ఆ గుణాలన్నింటినీ సమీకరించుకొని అటువంటి గుణాలు కలిగివున్నటువంటిది ఒకటి నిజంగా వున్నదా, లేదా? అని మనం ఆలోచించవలసి వుంటుంది. అట్లా నిర్ధారణ చేసుకున్న తర్వాత వుండేటటువంటి విశ్వాసము సరియైనది. ఆధునికమైన విద్యకు, ఆలోచనకు శాస్త్రీయమైనటువంటి పరిజ్ఞానానికి యిది సరియైనది. ప్రపంచంలో - ఆస్తికంగా భగవంతుని యొక్క వునికిని అంగీకరించినటువంటి మతాలలో చెప్పినటువంటి భగవంతునియొక్క లక్షణాలను ఆరు, లేక ఏడు లక్షణాలను ప్రధానంగా తీసుకున్నట్లయితే ఆ మతాలన్నీ గూడా భగవంతునిగూర్చి ఒకే విధంగా చెప్పాయని తెలుస్తుంది. భగవంతుడు రూపం లేనివాడు, అయితే ఆయన ఏ రూపమైనా చెందివుండవచ్చు. ఆయన సర్వగతుడు. ఆయనలేని ప్రదేశమే లేదు. అంతటా నిండి వుంటాడు. ఈ సృష్టికి కారకుడు. ఈ సృష్టి స్థితికి గూడా కారకుడు. ఈ సృష్టి లయించినప్పుడు ఆయనలోనే లయించవలసి వుంటుంది. ఆయన సర్వాన్నీ తెలుసుకునే వాడు - భగవంతుని గూర్చిన ఈ విశేషగుణాలు అన్ని మతాలూ చెప్పాయి. వీటిని ఆధారం చేసుకునే అన్ని మతాలవారూ ప్రార్థనలను ఏర్పరచుకున్నారు. కనుక ఈ లక్షణాలు కలిగిన ఒకానొక సత్యం సృష్టికి ఆధారంగా వున్నదా లేదా? అని చూచి, అది వున్నదని నిరూపణ అయినప్పుడు మన మనస్సుకు కూడా వికాసము, ఒకానొక విశ్వాసము ఏర్పడతాయి. ఈ విషయాన్ని ఆధునిక విజ్ఞానం ప్రకారం గూడా కించిత్తు వివరించి చూద్దాము.

నేటి భౌతికశాస్త్రం మనకు చెబుతున్నదేమిటంటే ప్రకృతి యావత్తూ పదార్థంచేత నిర్మింపబడింది. ఈ పదార్థమంతా గూడా ఈ పరమాణువుల చేత చేయబడి వున్నది. ఈ పరమాణువులన్నీ గూడా ఎలక్ట్రాను, ప్రోటాను, న్యూట్రానుల వంటి అంశాలతో చేయబడివున్నాయి. ఈ ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు దేనితో చేయబడి వున్నాయంటే అటు తరంగమనిగాని, యిటు ధార్మికశక్తి అనిగాని చెప్పడానికి వీలులేనటువంటి ఒకానొక తత్త్వంలో చేయబడి

వున్నాయి. దీనిని బట్టి మనకు అర్థమవుతున్నదేమిటంటే ఏ ఒక్క శక్తిచేతన యితే ఈ విశ్వమంతా చేయబడివున్నదో, ఆ ఒక్క శక్తిచేతనే ఈ ఎలక్ట్రాను, ప్రోటాను, న్యూట్రాను మొ॥నవన్నీ చేయబడి వుండాలి. వాటి యొక్క సమ్మేళ నం చేతనే ఈ పరమాణువులు చేయబడి వుండాలి. ఈ పరమాణువుల యొక్క సమ్మేళ నం చేతనే అణువులు చేయబడి వుండాలి. వాటియొక్క ఈ అణువుల యొక్క సమ్మేళనమే ఈ విశ్వం. అంటే ఆ మూలమైనటువంటి కణం ఏదైతే వున్నదో, ఆ ఒక్కదాని చేతనే ఈ విశ్వమంతా చేయబడి వున్నది.

దానికి-యింతకు ముందు మనం భగవంతునికి చెప్పుకున్నటువంటి ఆరు గుణాలలో అయిదు గుణాలు వున్నాయి. భగవంతునికి రూపంలేదు అన్నాము. ఈ శక్తికి గూడా రూపం లేదు. పరమాణువులు దాని రూపమా అంటే కాదు. ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు దానిరూపమా అంటే కాదు - అది ధరించిన కొన్ని రూపాలు మాత్రమే. అసలు ఆ శక్తికి స్వతస్సిద్ధంగా ఏ రూపమూ లేదు. దానిచేత చేయబడనటువంటి, దానిచేత ఆవరించబడనటువంటి వస్తువు ఈ సృష్టిలో ఏదీ లేదు. ఈ సృష్టికి అదే కారణం. ఆ శక్తి ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల రూపం ధరించి, వాటి సమ్మేళనమైనటు వంటి పరమాణువుల రూపం ధరించి, వాటి సమ్మేళనమైనటు వంటి అణువుల రూపం ధరించి, ఈ మహత్తరమైనటువంటి విశ్వం యొక్క రూపం ధరించింది గనుక, ఈ సృష్టికంతటికీ కారణ మైంది. ఆ శక్తి ఆ రీతినే కొనసాగుతూ పరిణామం చెందుతూండడం చేత ఈ సృష్టిజరుగుతున్నది. కాబట్టి వీటన్నింటికీ అదే కారణం. ఎప్పటికైనా ఈ సృష్టిలయించడమంటూ జరిగితే ఆ తత్త్వంలోకి లయించడం తప్ప మరొక అవకాశం లేదు. కాబట్టి రూపరహితుడైన భగవంతుని యొక్క లక్షణం దానికున్నది. సర్వగతుడైనటు వంటి భగవంతుని రెండవ లక్షణం గూడా ఆ శక్తికి వున్నది. సృష్టికి కారణమైనది, స్థితికి కారణమైనది, లయానికి కారణమైనది మొ॥న లక్షణాలన్నీ దానికున్నాయి. అంటే నేటి భౌతిక శాస్త్రం దేనినైతే అంగీకరిస్తున్నదో, ఆ సత్యమంతా గూడా- భగవంతునికి మనం చెప్పుకుంటున్న లక్షణాలన్నీ గూడా - ఆ సత్యానికి వర్తిస్తున్నాయి.

చివరకు ఒక్కచోట మాత్రం సమస్య వచ్చింది. ఈ సృష్టికి మూలమైన ఆ శక్తి జడమైనదా? లేక అన్నింటినీ తెలుసుకుంటూ అనుభవించగల చైతన్య స్వభావం గలదా?- ఇదీ మూలమైన ప్రశ్న. భగవంతుణ్ణి అంగీకరించేవాళ్ళకు, అంగీకరించని వాళ్ళకూ వచ్చేటటువంటి వ్యత్యాసం ఈ ఒక్కచోటే. అటు

భౌతిక శాస్త్రజ్ఞులు, భౌతికవాదులూ, గూడా ఈ సృష్టిమొత్తం ఆ శక్తితోనే చేయబడివుంది అని అంగీకరించి తీరవలసిందే. అంటే భౌతిక శాస్త్ర దృష్ట్యా సర్వానికీ ఒకానొక శక్తి కారణమని అంగీకరించి తీరాలి. అయితే ఆ శక్తి మూలమైన శక్తి గనుక అన్నింటినీ తెలుసుకుంటూ, అన్నింటినీ అనుభవిస్తూ, అన్నింటినీ నిర్ణయిస్తూ వుండగల మనలోని చైతన్యానికి గల ధర్మం కలదైతే, ఆత్మ లేక పరమాత్మ అనబడే గుణాన్ని అంగీకరించినట్లే లెక్క. దానినే భగవంతుడు అన్నారు ఆస్తికులు. అట్లాగాక అటువంటి తెలుసుకునేటటువంటి ఎరుక దానికి లేకపోయినట్లయితే - అంటే అది విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తివంటి జడమైన శక్తి మాత్రమే అయినట్లయితే అప్పుడు భౌతిక వాదాన్నిగాని, భగవంతుడు లేడనేటటువంటి నాస్తికవాదాన్ని గాని సత్యమని మనం అంగీకరించవలసి వుంటుంది. కాబట్టి ఆ శక్తి సచేతనమవునా, కాదా? అన్నది ప్రధానం. అప్పుడు ఒక్క విషయం ఆలోచించవలసి వుంటుంది.

ఈ సృష్టికి మూలమైన శక్తి ఒకానొకటి వున్నదని భౌతిక శాస్త్రజ్ఞులు గూడా అంగీకరిస్తున్నారు. ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు గూడా అన్నింటిలోనూ నిండి వున్నటువంటి, అదృశ్యమైన, అతీతమైన ఒక శక్తి వున్నది. అదే భగవంతుడు అని నమ్ముతున్నారు. మన పెద్దవాళ్ళు పాడే తత్త్వాలను చూస్తే ఆ సంగతి స్పష్టమవుతుంది. అలాగాక కొందరు నేటి భౌతికవాదులు చెబుతున్నట్లు గాలివాన చూసి భయపడికాదు. అగ్నిని చూసి, భూకంపాన్ని చూసి భయపడీ కాదు. అన్నింటిలోనూ నిండి వున్నటువంటి అద్భుతమైన, అగోచరమైన, అతీంద్రియమైన ఒకానొక శక్తి వున్నది. అదే ఈ సృష్టిని నడుపుతున్నది అని తెలిసి దాని యొక్క ప్రీతికోసం, దానియొక్క సంతృప్తి కోసం, దానితో సంయోగం చెందడం కోసం మాత్రమే వాళ్ళు చేస్తున్నారు అని పరిశోధనలు నిరూపిస్తున్నాయి. యాంత్రోపాలజీలో ఈ విషయాలన్నీ వున్నాయి. కాబట్టి నేటి విజ్ఞాన పరిశోధనలనుబట్టి చూస్తే వారిదిగూడా ఊహాగానమే గాని వాస్తవంకాదని తెలుస్తున్నది. ఈ పరిశోధనలను బట్టి చూస్తే 18వ శతాబ్దం చివర, 19వ శతాబ్దం ప్రారంభంలోనూ ఒకానొకరు మతమనేది ఈ విధంగా ప్రారంభం అయి వుంటుంది అని చెప్పారు. కాని జాతిమీద, సంస్కృతిమీద తర్వాత చేసిన పరిశోధనలను బట్టీ అది వారి స్వకల్పితమేనని నిరూపణ అవుతున్నది. ఈ విధంగా యిప్పుడు మనం చెప్పుకున్న విధంగా పైస్థూపరంగా కొద్దిగా మాత్రమే

తీసుకుని, దానిని వివరించుకుంటూ, విమర్శించుకుంటూ ఏ విధమైన నిర్ణయానికి వచ్చామో. యిటువంటి భావాలతోనే అవతలివారు కూడా చేస్తున్నారని తెలిసినప్పుడు మనయొక్క భావాలను సంస్కరించుకో వలసిన ఆవసరం వున్నది. ఆస్తికులు, నాస్తికులు పరస్పరం అవగాహన చేసుకునేటటువంటి అవసరము, సమయము యిప్పుడు వచ్చింది. ఆస్తికులు ఏమంటున్నారంటే ఈ మూలమైన తత్వానికి ఒక ధర్మమున్నదని అంటున్నారు. ఆ ధర్మంలేదని అనడానికి వీలులేదు. ఎందుకంటే ఆ ధర్మం లేకపోతే ఈ సృష్టి జరగడానికి అవకాశంలేదు. ఇట్లాగాక ఆధునికశాస్త్రం ఆధారంగా ఒక్కొక్క సైన్సునూ తీసుకుని సుదీర్ఘంగా ఈ సృష్టియొక్క మూల తత్వాన్ని యింకాబాగా వివరించుకుంటూ పోవచ్చు. ఇప్పుడు చెప్పినవి స్థూలంగా కొద్ది విష యాలు మాత్రమే. దీనిపై యింకా యింకా విశ్లేషించి వివరించుకుంటూ పోయిన కొద్దీ యిదే యింకాబాగా నిరూపణ అవుతూపోతుంది తప్ప మనంప్రక్కకు తొలగి పోయేందుకు ఆధారాలు నాకు తెలిసినంతవరకూ ఎక్కడా దొరకలేదు. అలాగని నాకంతా తెలుసునని కాదు. నేను చూసినంతవరకూ ఎక్కడా లభించ లేదని మాత్రం చెప్పగలను.

కాబట్టి మనం విశ్వసిస్తున్నది నిరూపించలేని ఒకానొక విషయాన్ని కాదు. దేనినైతే నిరూపించడం కష్టమో దానిని, గూర్చి లేదని విశ్వసిస్తున్నామన్నమాట. ఎందుకంటే, ఏది వున్నదో, ఏది లేకపోతే ఈ సృష్టిగాని, నేను గాని, మీరుగాని వుండమో, మాట్లాడడము, చెప్పుకోవడము, వినడమూ అనేవి వుండవో దానిని లేదని అనడమెట్లా? - ఎందుకంటే అది లేదు అన్నప్పుడు నేను మాట్లాడడము, మీరు వినడమూ, నేను చెప్పినది మీరు అవుననిగాని, కాదనిగాని చెప్పడమెలా సాధ్యమవుతుంది? నేను కొన్ని భావాలు చెప్పాలంటే అవి నాకు అర్థం కావాలి. ఆలోచన వుండాలి. మీ అందరికీ గూడా ఆలోచించే, అర్థం చేసుకునే సామర్థ్యం వుండాలి. అప్పుడు మాత్రమే మీతో మాట్లాడడము, మీరు వినడం, మీరు అంగీకరించడము, లేక అంగీకరించకపోవడము జరుగుతుంది. అసలది లేనే లేదంటే మీతో మాట్లాడడమెట్లా సంభవము? ఎందుకంటే ఇది కేవలం భౌతికమే అయితే రసాయనిక పదార్థంలో మాత్రమే ఈ సృష్టి మొత్తం చేయబడినట్లు అవుతుంది. అప్పుడు మనం గూడా రసాయనిక పదార్థం యొక్క కూర్పు మాత్రమేనన్నమాట. అప్పుడు దానియొక్క రసాయనిక ధర్మం మాత్రమే జీవిత

మవుతుందన్నమాట. అదే గనుక నిజమైతే దానికి క్షేత్రమనే గుణం ఎలా వీలవుతుంది? దీనినే Conclusion of categories అంటారు. తత్త్వ శాస్త్రంలో Phylosophical categories అంటారు. అంటే ఏమిటంటే చైతన్యమనేది భౌతికం నుంచి ఏ విధంగానూ ఉత్పన్నం కాజాలదు. కేవలం భౌతికమైనది చైతన్యం నుంచి ఉత్పన్నం కాదు, ఉత్పన్నం చేయదు గూడ. అంటే చైతన్యము, భౌతికము అనేవి పూర్తిగా భిన్నమైనవే. ఈ విషయం బాగా గమనించాలి. అంటే నీరు - మంచుగడ్డ (Ice) అనేవి పూర్తిగా భిన్నమైన పదార్థాలనుకోండి. ఒకదానికొకటి ఏ మాత్రం సంబంధం లేనివని అనుకోండి. అంటే ఏమిటంటే నీరు - ఐసు అనేవి ఒకే పదార్థం యొక్క రెండు స్థితులు కాకుండా పూర్తిగా భిన్నమైనవి గనుక అయితే ఒకదానిలోంచి మరొకటి మారడంగాని, ఒకదానితో ఒకటి సంపర్కం చెందడంగాని సాధ్యంగాదు. అదే రీతిన చైతన్యం వేరు, పదార్థము వేరు గనుక అయితే ఒక చైతన్యం, పదార్థం నుంచి రావడానికి వీలుకాదు-వివరంగా ఆలోచిస్తే యిదంతా భౌతికమే అన్న సిద్ధాంతం చెప్పేది యిదన్న మాట.

కాని ఇందాకటినుంచి మనం చేసుకున్నటువంటి చర్చ యొక్క పర్యవసానమేమిటంటే చైతన్యం తనలో తాను చేసుకునేటటువంటి మార్పులను, ఆ చైతన్యంలో భాగమైన మనసు, వాటిననుభవించేటటువంటి పద్ధతి భౌతికత. కాబట్టి భగవంతుని పట్ల విశ్వాసము ఉపయోగకరమైనదే గాని, సత్యమైనది కాదు అనే భావం సరియైనదికాదు. అది సత్యమైనది అన్నది మాత్రమే విశ్వసించాలి. అది సత్యమైనది అని మనమెందుకు విశ్వసిస్తున్నా మంటే సృష్టి వున్నదని విశ్వసిస్తున్నాము గనుక. సృష్టికి మూలకారణమైన ఒకానొక శక్తి వున్నది అని విశ్వసిస్తున్నాము గనుక. కారణంలేనిదే ఏదీ వుండజాలదని ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం గూడా అంగీకరిస్తున్నది. కాబట్టి సైన్సు కంతా పట్టుకొమ్మ అయినటువంటి కార్యకారణ సంబంధమైన దానిని తీసుకున్నట్లయితే నిమిత్త కారణము, ఉపాదాన కారణము అని వేదాంతంలో రెండు కారణాలు చెబుతారు. అంటే ఒక కుండ తయారు చేయాలంటే తయారుచేసేవాడు ఒక రకమై᳚ కారణము, మట్టి అనేది రెండవ రకమైన కారణము. విడిగా పడివున్న మట్టిని కుండగా తయారు చేయాలంటే ఆ తయారు చేసేవాడు ఒక కారణము. కాని తయారు చేసేవాడు మాత్రమే వుండి, కుండ తయారు చేద్దామనుకున్నంత మాత్రాన మట్టి లేకపోతే తయారు చేయడం వీలుపడదు. అందుకని మట్టిగూడా ఒక కారణం. కాని మట్టి

మాత్రమే వుంటే గూడా చాలదు, చేసేవాడు లేకపోతే. అందుకని కుండ తయారు చేసేవాడు ఒక హేతువు. అలాగే మట్టిగూడా మరొకహేతువు. ఈ రెండు రకాల హేతువు లేక ఏ క్రియా జరుగదు. అయితే కుండను తయారు చేసిన తర్వాత కుండకు ముందుగావున్న మట్టి వున్నదే అది కుండ రూపంలో గూడా కొనసాగు తుంది. అట్లాగే కుండను తయారుచేసినవాడు, ఆ కుండరూపంలోని కూర్పు గూడ అలానే కొనసాగుతాయి.

ఉదాహరణకు పెద్ద పెద్ద భవనాలు ఎప్పుడో కట్టినవి మనం చూస్తూ వుంటాము. ప్రాచీనులు కట్టిన ఆ భవనాలు అలాగే వుండబట్టి ఫలానా వాళ్ళు కట్టారు అని తెలుస్తున్నది. ఎందుకని? చైతన్యవంతమైన వ్యక్తులు plan చేసి కడితే మాత్రమే ప్రకృతిలో అవి అలా వుండడానికి వీలవుతుంది గాని ఎన్నివేల సార్లు హిమాలయ పర్వతాలు విరిగిపడినా, జారిపడినా ఒక్కసారి గూడా, బెడ్ రూమ్, డ్రాయింగ్ రూమ్ మొదలుగాగల యింటిరూపంలో మాత్రం పడదు - when by chance అందుకని ఇటువంటి చిత్ర విచిత్రమైన కూర్పు కలిగిన ఈ విశ్వము, యిటువంటి జీవరాశి, మానవుని యొక్క తత్త్వము - యివన్నీ యింతటి చక్కటి కూర్పుతో ఏర్పడ్డాయంటే - యివన్నీ గుడ్డిగా Blind chance ఏర్పడ్డాయనడానికి అవకాశమే లేదు. అవకాశం వుందని ఎవరైనా వితండంగా వాదించడం మొదలు పెడితే ఏమవుతుందంటే Blind chance కు గూడా తెలివి తేటలు వున్నాయని ఒప్పుకోవలసి వస్తుంది. అదే భగవంతుడంటే. ఎందుకింత విచికిత్స చేస్తున్నానంటే కనపడనిదానిని, మనం చూడలేని దానిని, నిరూపించ లేని దానిని విశ్వసిస్తున్నామనే బలహీనత మనకుండనవసరంలేదు. మనం చూస్తున్న దానిని, అర్థం చేసుకుంటే మరొకటి సత్యం కావడానికి వీలులేనిదానిని మాత్రమే మనం భగవంతుడని విశ్వసిస్తున్నాము, గుర్తుంచుకోడానికి ప్రయత్నం చేస్తున్నాము.

అది (ఆ భగవంతుడు) వున్నాడని మనమంగీకరిస్తే ఉపయోగమేమి టన్నది రెండవ ప్రశ్న. నిజమే. భగవంతుడనేవాడు వున్నాడనుకుందాము. వానిని గుర్తుపెట్టుకోకపోతే ఏం? గుర్తు పెట్టుకోకపోతే మనకు దాహం తీరదా? అన్నం తింటే ఆకలితీరదా? గుర్తు పెట్టుకోవడమెందుకు? పూజలు పునస్కా రాలు ఎందుకు? దానిని ప్రత్యేకంగా మన జీవితానికి ఆశయంగా పెట్టు కుని దానిపరంగా మాత్రమే ధర్మాధర్మాలు పొందడమెందుకు? అట్టి విశ్వాసం

లేకుండా పొందవచ్చుగదా! అన్నది ఒక వాదం. కాని ఒక్క విషయమున్నది. నిర్మోహమాటంగా వేసుకోవలసిన ప్రశ్న ఒకటున్నది. భగవంతుడున్నాడని విశ్వసించేవాళ్ళు, విశ్వసించనివాళ్ళూ గూడా ఒప్పుకునే విషయం ఒకటున్నది. 'మానవుడు సాటి మానవులను మానవత్వంతో చూడాలి. ఏ మనిషీ సాటి మనిషిని పీడించగూడదు. అందరూ కలిసి జాతియొక్క ప్రగతి కోసం ప్రయత్నం చేయాలి అనే సిద్ధాంతాన్ని నిరాకరించే సిద్ధాంతం ఈ ప్రపంచంలో లేదు.

కాని మూలమైన ప్రశ్న ఏమిటంటే - ఇట్టి సిద్ధాంతాన్ని ఎందుకంగీకరించాలి? అన్నది. మానవులం గాబట్టి అంగీకరించాలి అన్నారనుకోండి. అయితే ఆ సిద్ధాంతం తెలుసుకుని, ఆ ప్రకారం జీవిస్తున్నామా? జీవించ గలమా? అని ఆలోచిస్తే పాడుగునా అలా కలిసి జీవిస్తున్నామని ఎక్కువ మందిమి చెప్పలేము. కాని ప్రయత్నం చేయవలసి వున్నది. రాతితో శిల్పాన్ని చెక్కుతున్నాము. క్రమంగా అవుతుంది. ప్రయత్నం చేయగా చేయగా తయార వుతుంది. అలాగే కృషి చేయగా చేయగా ఎప్పటికైనా ఆ స్థితికి వస్తాము అని ఒక ఆశయం పెట్టుకుని బయల్దేరుతున్నాము. మనస్సును, యింద్రియాలను అదుపులో పెట్టుకుంటూ మనస్సును యింకా యింకా నైతిక మార్గంవైపుకు తీసుకు వెళ్ళడానికి అందరం కలిసి కృషిచేస్తున్నాము. మనం నడుస్తూ సాటి వారిని గూడా అలా నడిపించడానికి ప్రయత్నిస్తున్నాము. కాని మానవులం గాబట్టి ఎట్లా బడితే అట్లా జీవించాలని అనుకోవడం లేదు గదా! కనుక మానవులం గాబట్టి అన్నది ఒక వాదం కాదు.

భగవంతుడు అనే దానిని ప్రక్కన బెడితే, మనం సాటివారికోసం ఎందుకు పాటుపడాలి? ధర్మంగా ఎందుకుండాలి? సత్యంగా ఎందుకుండాలి? దయగా ఎందుకుండాలి? మరొకణ్ణి ఎందుకు చంపకూడదు? శాస్త్రీయంగానే ఆలోచిద్దాము. ధర్మం ప్రకృతి సిద్ధమని చెప్పగలమా? ఈ వాదం అసలు నిలబడదు. ఈ అనంత సృష్టిలో పురుగులను కప్ప తింటుంది. కప్పను పాము తింటుంది. పామును ముంగిస తింటుంది. ముంగిసను నక్క తింటుంది. నక్కను మరొకటి తింటుంది. 100 పులిస్తరాకులు బయట పారేసినా ఒక బలమైన కుక్క, వాటిని తరిమేసి, తాను తిని వెళ్ళాకగాని మరొక దానిని రానీయకుండా వుండడానికి ప్రయత్నం చేస్తోంది. ఇటువంటి అనంతమైన జీవరాశి కలిగినటువంటి ఈ ప్రకృతిలో దేనికి బలముంటే అది తక్కిన వాటిని తరిమేసేటటువంటి నిర్మాణం కలిగినటువంటి ఈ ప్రకృతిలో మధ్యలో ఎవడో వచ్చి

నైతిక విలువలు వుండాలి అంటే ఎందుకు వుండాలి? అన్నది ప్రశ్న. మనం సాటివాడితో "నువ్వు, దర్మంగా వుండు, నీకొచ్చిన ధనం రాకపోయినా సరే, నువ్వు నాశనమైపోయినా సరే, నువ్వు ధర్మంగా వుండవలసిందే" నంటే "ఈ ప్రపంచంలో నాలుగు రోజులు నీకు బ్రతకాలనిలేదా? చావడానికి నువ్వు రమ్మంటే వస్తావా"? అని అడుగుతాడు. కాబట్టి ధర్మంగా ఎందుకుండాలి అన్న ప్రశ్నకు సహేతుకమైన సమాధానం మనకు దొరకలేదు. ఆ ప్రశ్నను ప్రక్కనపెట్టి మామూలుగా మనం ఒక్క విషయం ఆలోచిద్దాం. మనమందరం జీవిస్తున్నాము. మొట్టమొదట భుక్తికై పాటుపడుతున్నాము. తిండి, గుడ్డ సంపాదించుకుంటున్నాము. మనము ఎవరిమీద ఆధారపడుతున్నామో, వారిపట్ల మన బాధ్యతలు నిర్వర్తిస్తున్నాము.

ఇదీ మన జీవితం యొక్క ప్రధాన లక్ష్యం. ఇవన్నీ సాధించాక, అందరం కలిసి సమాజానికి ఏమైనా చేయగలమా? అని ఆలోచిస్తున్నాము. అందరూ కాకపోయినా కొందరు అట్లా తాపత్రయపడే వాళ్ళుంటారు. ఈ సమాజాన్ని యింకా బాగుండేలా చేయగలమేమోనని ఆలోచించేవాళ్ళు వుంటారు. తిండి, గుడ్డా ఆశించడమన్నది సృష్టిలోని ప్రతిజీవికి వున్నది. మానవునికీ వున్నది. ఈ రెండూ వున్నాక బాధ్యతలు నిర్వర్తించాలి. ఆ బాధ్యతలు నిర్వర్తించడం పూర్తయ్యాక మానవుడు అంతటితో ఆగడం లేదు. ఇంకా తాపత్రయపడుతూనే వున్నాడు. నాకొస్తున్నది చాలు, ఇంతకంటే శ్రమపడడమెందుకు? నాకు సరిపడినంత వున్నది కదాఅని ఒకడు అనుకోవచ్చు. కాని అతడు శ్రమపడడం యిష్టంలేక మాత్రమే అలా భావించవచ్చు. కాని ఏదో ఒక దానికోసం ప్రయత్నం చేయనివాడు, తాపత్రయపడనివాడూ వుండడు. కాబట్టి జీవించడమే జీవిత లక్ష్యమైతే మానవులందరూ ఏదో ఒకదానిని పొందడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకోసం? తృప్తి కోసం ప్రయత్నం చేస్తున్నారు , శాంతి కోసం ప్రయత్నం చేస్తున్నారు అని చెప్పక తప్పదు. ఎందుకంటే మనకు ఆ రెండూ లభించలేదని తెలుసుగనుక. ఒకవేళ ఎవరైనా తనకు వుందనుకుంటే కాసేపు వూరికే కూర్చోమంటే తెలుస్తుంది. కాసేపు కూర్చోగానే బోరుకొడుతుంది. ఏదో ఒకటి చెయ్యాలని అనిపిస్తుంది. ఎందుకంటే అట్లా ఏదో ఒకటి చేస్తేనే తప్ప తృప్తి, శాంతి వుండదు. కాబట్టి తృప్తిగా వుండడంకోసం, శాంతిగా వుండడం కోసం ఏదో ఒకటి చేస్తూ వుండాలి. భుక్తికి మించి మనమేమి

చేసినా సరే అది ఈ తృప్తి శాంతికోసమే. ఒకడు డబ్బు కూడబెడుతున్నాడంటే, డబ్బు కూడబెట్టడంద్వారా లేమి అనేది లేకుండా వుంటే తృప్తి, శాంతి వుంటుందని భావిస్తున్నాడు గనుక దానికోసం పాటుపడతాడు. అలాగే అధికారం కోసం తాపత్రయ పడేవాళ్ళున్నారు. మరొకరు మరొక దానికోసం. ఇలా ఎవరెన్ని చేసినా సరే వాటిల్లో తృప్తి శాంతి వుంటుందన్న ఉద్దేశ్యంతోనే చేస్తున్నారు. కాబట్టి అందరి చరమలక్ష్యం మాత్రం ఒక్కటే. కాని యిన్ని కోట్లమంది మానవులు, యిన్ని దేశాలలో అనాదిగా ప్రయత్నాలు చేస్తు న్నప్పటికీ - యింతమందిలో తృప్తి, శాంతి నాకు వున్నాయనే వాళ్ళు ఎంతమంది వున్నారు? కాబట్టి మనమంతా గూడా జీవిస్తున్నదెందుకో యిప్పుడు జాగ్రత్తగా గమనిద్దాం. చెప్పుకున్న విషయాన్నే తిరిగి ఒకసారి జ్ఞాపకం చేసుకుందాము. తిండి, గుడ్డ తప్పితే ఆపై చేసిన ప్రయత్నాలన్నీ తృప్తి, శాంతి కోసం మనం చేసే అన్వేషణ అన్నాము. వివాహం చేసుకున్నాము. ఎందుకని? తోడు కావాలి, నా అనేవాళ్ళు, నన్ను కావాలనుకునేవాళ్ళు కొంతమంది కావాలని వుంది, లేకపోతే అశాంతి, ఒంటరితనం కాబట్టి, తృప్తి, శాంతి కోసమే మనం సంసారం కావాలనుకుంటున్నాము. సరే సంసారం కావాలనుకున్నాము. అది బరువు బాధ్యతలలో పడేసింది. వాటినీ భరిస్తావు. ఎందుకని? - ఒకానొక నాటికి పిల్లలు పెద్ద వాళ్ళయితే, వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడితే, అప్పుడు వాళ్ళు మనకు కావలసినవన్నీ చూస్తూ వుంటే తృప్తి శాంతితో వుండవచ్చునన్న ఆశతో జీవిస్తు న్నాము. కాబట్టి జీవనము కూడా దానికోసమే. అలాగాక ఎవడికైతే ఈ జీవితం లో తృప్తి, శాంతి రాదు అని నిర్ధారణ అవుతుందో వాడికి మూడే పద్ధతులుంటాయి. ధైర్యంగల వాడైతే ఆత్మహత్య చేసుకుంటాడు. తృప్తి, శాంతి లభించనపుడు ఈ చాకిరీ దేనికి? తిండి, గుడ్డ, ఆరోగ్యము, ఇల్లు వాకిలీ, భార్యా పిల్లలు - వీటన్నింటి కోసం వెట్టిచాకిరీ చేసినా తృప్తి, శాంతిరాదు అని నిశ్చయంగా తెలిసినపుడు ఇక జీవించడం దేనికి అనిపిస్తుంది. అందుకని ధైర్యంగలవాడు ఆత్మహత్యకు పాల్పడతాడు. అంత ధైర్యంలేని వాడికి ఆలోచించి ఆలోచించి జీవితం అర్థం లేనిదిగా తోస్తుంది. దానితో మతిస్థిమితం తప్పుతుంది. ఆ ఆలోచనలు ఒకస్థాయివరకూ వున్నప్పుడు జీవితం వ్యర్థంగా అనిపించి నిరాశ, నిస్పృహలకు లోనవుతాడు. అది ఒకస్థాయి తప్పినప్పుడు పిచ్చిగా తయారవుతాడు. ఇక అంతగా ఆలోచించనివాడు, చనిపోయేందుకు ధైర్యం లేనివాడు, ఆ సంగతి సాధ్యమైనంత వరకు

మర్చిపోయేందుకు ప్రయత్నిస్తాడు. ఒక్కొక్కడు కొన్ని ఆధ్యాత్మికంగా తయారవుతాడు. ఎందుకంటే మన సంగతి మనం మర్చిపోవలసిన స్థితి ఏర్పడుతుంది. దీనినే మనం కాలక్షేపము అంటాము. కాలమును మరుగు పరచుట, నిక్షేపించుట, క్షిప్ అనే పదానికి మరుగుపరచుట అని అర్థము. కాలక్షేపము అంటే యింతకాలము గడిచిందన్న సంగతి మననుంచి మరుగు పడడము, అంటే మనకు తెలియకుండా పోవడమన్నమాట. సినిమాకెళ్ళి కూర్చుంటే కాలక్షేపమయిందండీ అంటాము. అదే ఇంటిదగ్గర కూర్చుంటే సమయమే గడవదు. బోర్ కొడుతుంది. ఎట్లాగబ్బా అనిపిస్తుంది. రైల్లో కూర్చుని డిటెక్టివ్ తీసుకుని మొదలుపెడితే ప్రక్కవాడు స్టేషన్ వచ్చింది దిగమని చెప్పేదాకా తెలియదు. అప్పుడే వచ్చేసిందా అనిపిస్తుంది. అంటే డిటెక్టివ్ చదువుతుంటే కాలక్షేపం జరిగింది. పేపరు చూస్తుంటే కాలక్షేపం జరిగింది. అలాగే సినిమాకెళ్తే కాలక్షేపం జరిగింది. ఈ కాలక్షేపాలన్నీ ఏమిటంటే తృప్తి, శాంతి కోసం మనందరికీ తపన వుండి, అది ఎట్లా వస్తుందో తెలియక, అది లేకుండా జీవించలేక మనంపడే అగచాట్లన్న మాట. ఎందుకంటే అదిలేకుండా మనం జీవించలేము. ఎందుకంటే తృప్తి, శాంతి లేదని తెలిస్తే మరణించడమే తృప్తి అనిపిస్తుంది. తృప్తి, శాంతులను పొందడానికి మాత్రమే మనిషి జీవించడానికి విలువనిస్తాడు. అది సాధించలేనపుడు జీవితం గుదిబండగా తయారవుతుంది. అందుకని విసిరికొడతాడు. అందుకని తృప్తి, శాంతులకోసం వుండే కోరిక, జీవించడానికుండే కోరికకంటే ప్రియమైనది. జీవితాన్ని ప్రేమిస్తు న్నామంటే తృప్తి, శాంతులు పొందే సాధనంక్రిందమాత్రమే మనం వుపయోగించుకుంటు న్నాము. ఆట్లా విశ్వసించి అనుసరిస్తున్నాము.

ఒకడికొక జబ్బు చేసింది, చాలా భయంకరమైన జబ్బు, దానికి మందులు లేవు. ఆ బాధ భరించడమూ కష్టమే. అప్పుడు డాక్టర్లు ఏం చేస్తారు? నొప్పి తెలియకుండా వుండడానికి మాత్రలు వాడుతుంటారు. అంతకు మించి గత్యంతరం లేదు. ఆట్లాగే మన జీవితంలోగూడా క్షణంనుంచి క్షణం వరకూ దుర్భరమైన ఈ జీవిత కాలగతిని నిక్షేపం చేసుకోడానికుండే కాలక్షేపాలు మన కావశ్యకము అన్నదానికి ఋజువు. మనం తృప్తి, శాంతులు లేకపోతే జీవించ లేము అనడానికి, ఆ తృప్తి శాంతులను మనం ఎన్నిచేసినా పొందడం లేదు సరి కదా, ఏ తృప్తి శాంతులు వస్తాయని ధనం కూడబెట్టామో, అది వచ్చిన దగ్గర

మంచి సమస్యలు పెరుగుతాయేగాని, తరగడం లేదు. అదొక పెద్ద సమస్య. డబ్బులేకపోతే ఒక భయం. వుంటే ఒక భయం. డబ్బులున్నాయని తెలిసాక మన పిల్లలే చెడిపోవడం మొదలుపెడతారు. దానికోసం ఆశించే వారంతా మన చుట్టూ, మన పిల్లల చుట్టూ చేరి కల్లబొల్లి మాటలు చెప్పి, మొత్తం కాజేయాలని చూస్తుంటారు. తీసుకుని వెళ్ళగొట్టనూవచ్చు, యిన్ని చిక్కులను తెచ్చిపెడుతుంది ఆ డబ్బు. మరి దానివల్ల సుఖశాంతులు వుంటాయనుకోవడమెలా? అన్ని విషయాలలోనూ యిలాగే వుంటుంది.

ఒక రాజకుమారుడు చీకూచింతా లేకుండా హాయిగా వున్నాడు. కాని వాడికి ఎట్లా అలవడిందోగాని దొంగతనం చేయడం అలవడింది. రాజుగారి కొడుకుగదా! వాడికి లేనిదేమున్నది? కాని ఎక్కడికి వెళ్ళినా ఏదో ఒకటి దొంగతనం చేసి తీసుకువస్తాడు. ఏ చిన్న వస్తువైనా సరే దొంగిలించి తీరవలసిందే. ఈ సంగతి రాజుగారికి తెలిసింది. ఆ అలవాటు మాన్పించడంకోసం ఎన్నో ప్రయత్నాలు చేసాడు. కాని మాన్పించలేకపోయాడు. రాజుగారికి అదొక సమస్యగా తయారైంది. చివరకు ఆయన తన కుమారునికి ఆ అలవాటు మానిపించిన వాడికి అగ్రహారం యిస్తానని దేశమంతటా చాటింపు వేయించాడు. అయితే చాలామంది భయపడ్డారు, అతనికి దొంగతనం మాన్పించగలిగితే అగ్రహారం వస్తుంది, ఒకవేళ మానిపించలేకపోతే శిక్ష తప్పదుగదా! అందుకని ముందుకు రావడానికి అందరూ భయపడ్డారు. కాని ఒకాయన మాత్రం నేను మానిపిస్తాను అని సాహసించి ముందుకు వచ్చాడు. కొన్నాళ్ళు అతని వెంటవుండి అతని అలవాట్లు, గుణగణాలు గమనించాడు. అతనిలో ఒక సుగుణం కనిపించింది. అతడు ఏదైనా చెయ్యను అని అన్నాడంటే చెయ్యడు. ఆ ఒక్క గుణం ఆలంబనంగా దొరికింది. అంతేచాలు, అతనిని ఈ దొంగతనం చేసే అలవాటునుంచి బయట పడవేయవచ్చని తలచి ఆయన తన వెంట ఆ పిల్లవానిని తీసుకొచ్చి దగ్గర వుంచుకున్నాడు. తర్వాత ఒక పుట్టినరోజు సందర్భం చూచుకుని అతనిని పిలిచి, "నాయనా! నాపట్ల యింత భక్తి శ్రద్ధలతో వున్నావు గదా! మరి నాకోసం ఈ సందర్భంగా దొంగతనం చేయడం మానెయ్య"మన్నాడు. అప్పుడతడు గురువుగారికి నమస్కారం చేసి, "గురువుగారూ! నేను మాట యిచ్చానంటే ప్రాణంపోయినా తప్పను. కాని మీరివ్వమన్నది మాత్రం నావల్లకానిపని. కనుక మరేదైనా చెప్పండి చేస్తాను" అన్నాడు. అప్పుడా గురువుగారు ఆలోచించి, 'పోనీ

బంగారం వస్తువులు మాత్రం దొంగతనం చేయనని మాటయివ్వు చాలు" అన్నారు. అందుకతడు ఒప్పుకుని మాట యిచ్చాడు. ఆ తర్వాత గురువుగారు మరో సందర్భం చూసుకొని వెండివస్తువులు దొంగతనం చేయవద్దని మాట తీసుకున్నారు. ఇలాగే క్రమక్రమంగా ఒక్కొక్క దానిని గురించి మాట తీసుకొని మాన్పిస్తూ వచ్చారు. ఇలా కొంతకాలం గడిచేసరికి పరిసర ప్రాంతాలలో కని పించే అన్నీ పూర్తయినాయి. ఎక్కడికైనా వెళ్ళినాగూడా అతడు ఏమీ తీసుకు రావడం లేదు. ఇక ఫర్వాలేదు. వీడు దొంగతనం మానేశాడు అనుకుని ఆ గురువుగారు అతనిని రాజాగారికి యిక అప్పగిద్దామని అతనిని తీసుకుని బయల్దేరాడు. ఆ రోజుల్లో వాహనాలు లేవు. కాలినడకన వెళ్ళవలసిందే. అడవి మార్గాన వెళ్తున్నారు. ఆ గురువుగారికి కొంతమంది శిష్యులు వున్నారు. దారిలో ఒక శిష్యుని యింట రాత్రి బస చేసారు. మళ్ళీ ఉదయమే బయల్దేరి వెళ్తున్నారు. దారిలో ఒకసారి ఆ రాజకుమారుని సైపంచకు ఏదో మూటకట్టి వున్నట్లు గురువు గారు గమనించారు. ఏమిటది అని అడిగారు. అందుకతడు 'బూడిదండీ గురువుగారు' అన్నాడు. "అదేమిటి? ఎందుకు తెచ్చావు?" అడిగారు గురువు గారు. అందుకతడు, "మీరు చెప్పినవాటిల్లో బూడిద లేదు కదండీ! అందుకని అది పట్టుకొచ్చాను" అన్నాడట. అంటే ఎన్ని రీతుల వాడు దొంగతనం చేయ కుండా అడ్డంకులు పెట్టినా, దాని వెనకాల అతనికి అదిచేయాలన్న ఆలోచన, ఆశ ఎలాగైతే వున్నదో, మనమెన్ని చేసినప్పటికీ, ఎన్నిరకాల అడ్డంకులు వచ్చి నప్పటికీ మనంచేసే పనుల వెనకాల తృప్తి శాంతులు పొందాలన్న ఆలోచన, ఆశ మాత్రం తప్పక వుంటుంది.

ఆ గురువుగారికే మరొక శిష్యుడున్నాడు. అతడు ఆయన చెప్పిన మార్గంలో సాధన చేసుకుంటూ ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరుకున్నాడు. ఒకరాత్రి అతని యింట ఈ గురువుగారు బసచేసారు. తననాస్థాయికి తీసుకు వచ్చిన గురువుగారికి గురు దక్షిణగా ఏదైనా సమర్పించుకోవాలని అతనికని పించింది. తన దగ్గరవున్న పరశువేదిని గురువుగారికి సమర్పించాడు. కాని గురువుగారు స్వీకరించలేదు. "నాకేమీ యివ్వనవసరం లేదు. నువ్వా స్థితిలో వుండు చాలు, అదే నాకు గురుదక్షిణ" అన్నారు. అయితే ఆ శిష్యుడు వూరుకో లేదు. మరొక శిష్యుని ప్రక్కకు పిలిచి, " నాదగ్గర పరశువేది వున్నది. దానికి ఏ లోహాన్నైనా తాకిస్తే బంగారమవుతుంది. దానిని నీకిస్తున్నాను. ఏదైనా అవసరమై

నపుడు దీని సహాయంతో గురువుగారు, మీరు సుఖంగా వుండవచ్చు, దానిని నీదగ్గర వుంచు" అని ఆ శిష్యునికిచ్చాడు. సరే, మళ్ళీ ఆ గురుశిష్యులు అక్కడ నుంచి బయలుదేరారు. కొంత దూరం వెళ్ళాక ఆ శిష్యుడు, "నాకు భయంగా వుంది గురువుగారు" అన్నాడు. "అదేంటిరా, యిప్పటిదాకా బాగానే వున్నావు గదా! ఇప్పుడు ఏమయిందిరా?" అన్నారు గురువుగారు. 'ఏమోనండి, భయంగా వుంది' అన్నాడతడు. గురువుగారు సంగతి గ్రహించారు. అప్పుడు వాడితో, "అయితే ఒక పనిచెయ్యిరా, ఆ భయాన్ని అవతల పారెయ్యి" అన్నారు. అప్పుడు వాడికి అర్థమైంది. దేనినైనా తాకిస్తే చాలు, దానిని బంగారంగా మార్చగలిగే టటువంటి ఆ పరశువేది తన దగ్గరవుందని ఎవరికైనా తెలిస్తే ఎవడైనా వూరికే వుంటాడా? ఎంతకైనా సిద్ధపడతాడు. చంపడానికిగూడా వెనుకాడడు. అదీ వాడి భయం. ఇది లేనప్పుడు ఏ చీకూచింతా లేకుండా వున్నాము. ఇది వుంటే మన శ్శాంతి లేదు. ఇదే నా భయంఅని అతడు గ్రహించాడు. అలాగే తృప్తి, శాంతులు వస్తాయని వేటికోసమైతే మనం ప్రాకులాడుతున్నామో అవన్నీ చీకూ చింతా తెచ్చి పెడతాయేగాని తృప్తి శాంతులనివ్వజాలవు.

ఇంతమందిలో ఎవరూ గూడా నాకున్నది చాలు, యిక ఏమీ అక్కర్లేదు అనకపోవడమే దీనికి ఋజావు. కాబట్టి యింతమంది జీవితమూ దండగేనా? యిక ఎవరికీ తృప్తి, శాంతి అనేది రావడానికి అవకాశమేలేదా? అసలిది సత్యం గాదా? ఇంతమందిలో ఎవరికీ లేదుగాబట్టి అసలట్టిది లేనే లేదా? అది సత్యం కాదని అంగీకరిస్తే మనం జీవించడం అనవసరం. ఇన్ని తంటాలు పడడం అంత కంటే అనవసరం. కాని అది లేదు అనడానికి వీలులేదు. అలాగే తృప్తి, శాంతులు ఇంతమందికీ రావడంలేదు గాబట్టి అట్టివి లేవంటే జీవించడానికి హేతువు లేకుండా పోతుంది. అట్లా అనుకోవడం సమస్య నుండి పారిపోవడ మవుతుంది. అందుకని మన పెద్దలు ఏమన్నారంటే, ఈ తృప్తి, శాంతులు వస్తా యని మనం పడే ఈ పాట్లవలననే అసలు అధర్మము మొ॥నవి సమాజంలో వస్తున్నాయి గమనించుకోమన్నారు. తిండి, గుడ్డ, కుటుంబ బాధ్యతలు నెరవేరితే చాలు అనే దృష్టిపోయి, యింకా యింకా సంపాదిస్తే తృప్తి, శాంతులు వస్తాయని భ్రమించ బట్టి స్వార్థం పెరిగి అధర్మ మార్గాలనవలంబిస్తున్నారు అని పెద్దలు చెప్పారు. అయినా తృప్తి, శాంతులు సాధ్యమవునా, కాదా? అన్న ప్రశ్నకుగూడా వారు సమాధానం చెప్పివున్నారు. గాఢనిద్ర పోతున్నపుడు స్వప్నమైనాలేని

గాఢనిద్ర పోతున్నపుడు స్వప్నమైనాలేని గాఢనిద్రలో ఎటువంటి తపన, చింత లేదు చూచుకో అన్నారు. మెలకువలో వుండగా యిన్ని కోట్లమంది యిన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ రానటువంటి తృప్తి, శాంతి గాఢనిద్రలో ప్రతివాడికీ వస్తున్నది చూచుకోమన్నారు. కాబట్టి అట్టిది లేదనడానికి వీలులేదు. కారణం అది ప్రతివాడికీ అనుభవమవుతున్నది గనుక. ఇది ఫలానా వస్తువు అని ఎందుకనుకుంటున్నాము? అది అందరికీ అట్లాగే అనుభవ మవుతుంది గనుక. అట్లాగే నిద్రలో తృప్తి, శాంతులనేవి వాస్తవము, జీవితంలో ఒకభాగము అని అంగీకరించవలసి వుంటుంది. అయితే నిద్రలో వుంటున్న ఆ తృప్తి, శాంతులు జాగ్రదావస్థలో ఎందుకు రావడం లేదు అన్న ప్రశ్నకు గూడా వాళ్ళు సమాధానం చెప్పారు. ఆ తృప్తి, శాంతులు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలుసు కుంటే యిప్పుడు గూడా పొందడానికి వీలవుతుంది అన్నారు. దాని గురించి గూడా వాళ్ళు దారి చూపారు. మెలకువలో వున్నపుడు సుఖమొచ్చినా, దుఃఖమొచ్చినా గూడా మనలోని 5 జ్ఞానేంద్రియాలు, మనస్సు పనిచేస్తాయి. కాని గాఢనిద్రలో యివి పనిచేయకుండా మూతపడిపోతాయి. మనస్సు పని చేయదు. మనస్సు పనిచేస్తే కలలొస్తాయి. ఇంద్రియాలు పని చేయవు. పనిచేస్తే మెలకువ వస్తుంది. కాబట్టి యివన్నీ కట్టుబడిపోయిన స్థితి గాఢనిద్ర. అంటే సుఖంగాని దుఃఖంగానీ వేటిద్వారానైతే రావడానికి వీలుందో ఆ ద్వారాలన్నీ పూర్తిగా మూసుకుపోయిన స్థితి గాఢనిద్ర. అప్పుడు తృప్తి, శాంతి ఏ ద్వారం గుండా వచ్చాయని మనం చెప్ప గలము? ఏ ద్వారముగుండానూ రావడానికి వీలులేదు. అన్ని ద్వారాలూ మూతబడి పోయాయి. అంటే తృప్తి, శాంతి మనలోనే వున్నాయన్న మాట. బయటనుంచి వచ్చినవి కావు. స్వతస్సిద్ధంగా మనలోనే వున్నది. మనలోనే వుంటే మరి మెలకువ లోనే ఎందుకు లేకుండా పోయాయి? ఒక్కరికి మాత్రమే కాదు. ఇంతమందికి ఎందుకు పోయాయి? ఎవరికీ ఎందుకు అనుభవం కావడంలేదు? దానికి గూడా వారు సమాధానం చెప్పారు. ఒక తొట్టి వుందనుకోండి. ఆ తొట్టి నిండా నీళ్ళు న్నాయి. ఆ నీరు నిశ్చలంగా వున్నపుడు తొట్టి అడుగు భాగం స్పష్టంగా కనబడు తుంది. ఆ నీటిని బాగా కదిలిస్తే తొట్టి అడుగు కన్పించదు. అలాగే మనము ఆ తొట్టివంటి వాళ్ళము. మనలో ఎప్పుడూ వుండినప్పటికీ, గాఢనిద్రలో మాత్రమే అనుభవమయ్యే తృప్తి, శాంతి ఎప్పుడూ వుండే ఆ తొట్టి అడుగువంటిది. ఆ పైన వుండే నీటివంటిది మనస్సు. ఈ మనస్సు

గాఢనిద్రలో నిశ్చలంగా వుండడం చేత, తొట్టి అడుగువంటి ఆ నిశ్చలమైనటువంటి తృప్తి శాంతులు మనకు అనుభవ మవుతున్నాయి. ఇటు మెలకువలోగాని, స్వప్నంలోగాని మనస్సు రకరకాల ఆలోచనలతో కలచివేయడంచేత, మరుగుపడి వుండడంచేత మనకు మెలకువలో అనుభవం కాకుండాపోతున్నది. కాని మనలో వున్నదనడానికి మాత్రం గాఢ నిద్రావస్థ అని పెద్దలు చెప్పారు. కాబట్టి ఎటువంటి ఆలోచనాలేని స్థితికి మనస్సును మెలకువలోనే గనుక తీసుకు వెళ్ళ గలిగితే అప్పుడు జీవితమంతా దేనిమీదైతే ఆశపెట్టుకుని బ్రతుకుతున్నామో అట్టి గాఢనిద్రావస్థలోని తృప్తి శాంతి మనకను భవమవుతుంది. మెలకువలో వుండ గానే గాఢనిద్రలోని స్థితి - అంటే ఎటువంటి భావాలు, ఆలోచనలు లేని స్థితిని పొందడమనే దానిని 'యోగము' అని పెద్దలు చెప్పారు. "యోగః చిత్తవృత్తి నిరోధః"చిత్తవృత్తి నిరోధమే యోగము అని చెప్పారు. అంటే మనస్సులోని ఆలోచనలను నిరోధించగలిగితే శాంతి వస్తుంది అని చెప్పారు. మనము ధనము, కీర్తి సంసారము మొ॥న వాటికోసం ప్రయత్నిస్తూ వున్నది గూడా ఆ తృప్తి, శాంతి కోసమే. కాని వాటివల్ల అధర్మము, అశాంతి పెరుగుతూ వచ్చి జీవితంలో ఎప్పటికీ తృప్తి శాంతులు లేకుండా పోతున్నాయి. వున్నవాడికీ అంతే, లేని వాడికీ అంతే. భయము, దుఃఖము పెరుగుతూ పోతు న్నాయి. కాని యోగములో అట్లాగాదు, దానిని సాధించడం కోసం మనం బ్రతుకు తున్నాము అని తెలిసినప్పుడు ఈ తిండి గుడ్డల కోసం సంసారం కోసం, భార్యా బిడ్డలకోసం పాటు పడుతూనే తృప్తి, శాంతులు పొందగలుగుతాము. లేకపోతే ఇంత వెట్టి చాకిరీ వ్యర్థమైపోతుంది. బ్రతుకంతా జీతంలేని వెట్టిచాకిరీ చేసినట్లు అయిపోతుంది. ఇదంతా సార్థకం కావడం దేనిమీద ఆధారపడివుంది? మనం తృప్తి శాంతులు పొందడం మీద ఆధారపడి వుంది. అందుకని మనబాధ్యతలునెరవేర్చుకోడానికి ఒకప్రక్క ప్రయత్నం చేస్తూ మనస్సునుప్రశాంతి చేకూర్చుకోవడం కోసం గూడా ప్రయత్నం చేయ వలసి వున్నది. మరి మెలకువలో నిద్రావస్థను పొందడం ఎలా? ఎలాగంటే మనస్సు యొక్క సంచలనం చేతగదా తొట్టి అడుగు కనిపించకుండా పోయింది? మనస్సుయొక్క సంచలనంవల్లనే గదా మనలో తృప్తి, శాంతులు లేకుండా పోయాయి? అందుకని మనస్సుయొక్క చలనం ఆగాలి. ఇందుకు ముందుగా ఒకపద్ధతి ప్రకారం ఆలోచిద్దాం. మన మనస్సు అవసరమైన విషయాల గూర్చి ఆలోచిస్తే అర్థమున్నది. మన తిండి, బట్ట, బాధ్యతలకోసం ఆలోచించడంలో

తప్పేమీ లేదు. ఎందుకంటే తిండి లేకపోతే మన జీవితమే వుండదు గనుక. కాని అలాగాక కోటాది కోట్ల ఆలోచనలు వ్యర్థమైనవి వస్తున్నాయి గదా! ముందు వాటిని అదుపులో వుంచడానికి ప్రయత్నించాలి. ఏ ముఖ్యమైన పనీ లేకుండా వూరికే కూర్చున్నామనుకోండి. ఏ విధమైన ఆలోచనలొస్తాయో గమనించండి. వాడిట్లా, వీడిటువంటివాడు, వాడిట్లా మాట్లాడాడు, ఫలానాచోట ఫలానా విషయం జరిగింది యిలాఅన్నీ వ్యర్థమైన ఆలోచనలు వస్తుంటాయి. ఒకడు ఎలాంటి వాడయినా కావచ్చు. లేక చెడ్డవాడే కావచ్చు. వాడిగురించి ఆలోచించడం, మాట్లాడడంవల్ల మన సమయము వ్యర్థమవుతుంది. కాబట్టి అనవసరమైన విషయాలను గూర్చి ఆలోచించడము, మాట్లాడడము ఆపెయ్యాలి.

ఇవన్నీ ఏ విధంగా వస్తాయంటే రాగం వల్ల, ద్వేషంవల్ల, అసూయవల్ల వస్తాయి. వాడెవడో పైకి వస్తున్నాడు. వాడు పైకి రావడ మెందుకు? వాడు పైకి రాకూడదు, నేనే పైకి రావాలి అన్న భావం మనకు కలిగిన తర్వాత వాడి గురించి రకరకాలుగా చెడ్డగా ప్రచారం చేయాలన్న బుద్ధి మనకు కలుగుతుంది. వాడి గురించి చెడుగా ఎవరేమి చెబుతారా, విందామన్న బుద్ధి మనలో పుడుతుంది. ఇక వాటిని తొలగించుకోవడం మన తరం గాదు. తృప్తి, శాంతులు పొందడము, రాగద్వేషాలను తొలగించుకోవడము అసాధ్యమవుతుంది. ఆలోచిస్తే అట్టి ఆలోచనలు ఎంత వ్యర్థమైనవో తెలుస్తుంది. ఇతరుల గురించి ఆ విధంగా ఆలోచించడం వల్ల, మాట్లాడడం వల్ల మనకు ఒరిగేదే మైనా వుందా? అవతలి వాడికి పోయేదీ ఏమైనా వుందా? ఏమీ లేదని కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది. ఈ ఆలోచనలను ప్రయత్నాలను మనం సాధించుకోదలచుకున్న దానిమీద పెట్టుకుంటే సాధించగలుగుతాము. కాబట్టి అసూయపడడం అంతటి వ్యర్థమైనది, అవివేకమైనదీ యింకొకటి లేదు. ఈ విధంగా ఆలోచించుకుంటూ విమర్శ చేసుకుంటూ వస్తే అసూయ ద్వేషాలుతొలగి మనస్సు ప్రశాంతంగా హాయిగా వుంటుంది. కనుక జీవించడంకోసం కావలసిన అవసరాలు, బాధ్యతలు నిర్వర్తించాక తృప్తి, శాంతుల కోసం ప్రయత్నించేవాడు తెలివైనవాడు. అందుకని వాటి కోసం ప్రయత్నించాలి. చిన్న పిల్లవాడు రోడ్డుమీద పడివున్న సిగరెట్టు పెట్టెలు, తగరపు ముక్కలుఅన్నీ ఏరుకొచ్చి ఆడుకుంటాడు. వాడే కొంచెం పెద్ద వాడయ్యాక వాటిని అవతల పారేస్తాడు. అట్లాగే లౌకిక విషయాలలో తృప్తి, శాంతులు వున్నాయనేటటువంటి భ్రాంతిలో వున్నపుడు మనిషివాటికోసం ప్రాకులాడుతాడు.

వీటివలన తృప్తి, శాంతులు ఎన్నటికీ లభించవన్న ఆలోచన కొంచెమైనా వచ్చినప్పుడు అదంతా అనవసరమైన పాకులాట అనిపిస్తుంది. నిజంగా తాను వేటికోసం - ఏ తృప్తి, శాంతుల కోసం అన్వేషిస్తున్నాడో అవి లభించవని తెలిసినపుడు జీవితానికి అర్థం లేదనిపిస్తుంది. అప్పుడు వాటిని పొందడాని కోసం ఇంద్రియ మనో నిగ్రహాల వైపుకు వస్తాడు. ధర్మంగా ఎందుకుండాలి అనేది అప్పుడర్థమవుతుంది. జీవితం యొక్క లక్ష్యం ఏమిటో తెలిసినపుడు ధర్మంగా వుంటాడు. అలాగాక ధర్మంగా వుండాలి గాబట్టి వుండేది ధర్మం గాదు. తొమ్మిది గంటలయింది గాబట్టి వుద్యోగానికి వెళ్ళాలి. వెళ్ళాలి గాబట్టి, డ్యూటీ గాబట్టి వెళ్ళాలి. ఏ పనైనా ఎందుకు చేస్తున్నావు? అనడిగితే ధర్మం గాబట్టి అన్నాడనుకోండి. వాడు గూడా ధర్మాత్ముడు కాడని అన్నారు పెద్దలు. అధర్మమనేది తలంపులోకి రానపుడు వానిని ధర్మాత్ముడు అన్నారు. అంటే అధర్మమైనదేదో, ధర్మమైనదేదో మనసుకు తెలిసి అధర్మమైనదానిని నిగ్రహించి, ధర్మమైన దానిని నిర్వర్తిస్తూ పోవాలి. అది చివరకు ఏ స్థితికి తీసుకు వస్తుందంటే అధర్మమనేది తట్టకుండా వుండే స్థితికి తీసుకువస్తుంది. ఎట్లాగంటే ప్రకృతిలోని కొన్ని పదార్థాలను ఇతర జీవులు తినే వాటిని మనకు తినాలనే తలంపు కూడా రాదు. తినాలని అసలు మనసుకు తట్టదు. అట్లాగే అధర్మమైన వాటిని చేయాలనే తలంపుమనకు రాదన్నమాట. అప్పటికి ధర్మం కుదిరినట్లు లెక్క. అట్టి ధర్మం నిలిచినప్పుడు మనస్సు ప్రశాంతి చెందుతుంది. అది ఎప్పుడు సాధ్యమవుతుందంటే మనస్సుయింద్రియ నిగ్రహాలు సాధించగలిగినప్పుడు. అంటే గాఢ నిద్రావస్థలోని నిశ్చల స్థితిని పొందినప్పుడన్నమాట. అందుకని మన మనస్సు మెలకువలో వున్నప్పుడు గాఢనిద్రావస్థలోని నిశ్చలస్థితికి వెళ్ళలేదు గాబట్టి, అలా ఆ స్థితిని జేరుకోడానికి మనం జీవించి వుండాలి గాబట్టి జీవించ డానికి తిండి, గుడ్డ అవసరం గాబట్టి. అటువంటి స్థితిని పొందడంకోసం మనమీద ఆధార పడేవాళ్ళు గూడా ప్రయత్నించాలి గాబట్టి. అందుకై వాళ్ళు గూడా జీవించాలి గాబట్టి, మనము, మనమీద ఆధారపడేవాళ్ళు జీవించడానికి, కొనసాగించడానికి కావలసినంత వరకూ ప్రయత్నంచేస్తూ తృప్తి, శాంతులను పొందడానికి ప్రయత్నించాలి. ప్రకృతి సిద్ధంగా ఏది తప్పనిసరిగా బాధ్యతగా అవసరమో వాటికోసం ప్రయత్నించిన తర్వాత తక్కిన సమయమంతటినీ మన మనస్సును ఈ విధంగా నిగ్రహించుకు రావడానికి ప్రయత్నం చేయాలి. అనవసరమైన వాటినుంచి మన మనస్సును అవసరమైన ప్రయోజనాల

కోసం మళ్ళించాలి. అప్పుడు అనవసరమైన కోరికలు వాటంతటవే ఆగిపోతాయి. అనవసరములైన దర్పా, అంతస్తు, హోదావంటివి మన మనసులోంచి తొలగిపోతాయి. అప్పుడు వాటికోసం ప్రాకులాడడం తగ్గిపోతుంది. అప్పుడు ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము, వివేకము - ఈ మూడూ ఆ వ్యక్తిలో మేలుకుంటాయి. అప్పుడు సమాజంలో శ్రేయస్సు దానంతటదే వుంటుంది. కనుక మొదట ఈ సృష్టియొక్క మూలతత్త్వమేమిటో, రెండవది, జీవితం యొక్క లక్ష్యమేమిటో, మూడవది, దానియొక్క ఆవశ్యకత ఏమిటో - ఈ మూడూ మనిషికి బాగా అర్థమవాలి. అలా అర్థమైనతర్వాత దానికోసం ప్రయత్నం చేయాలి. మనస్సుకు ఒక అభ్యాసముంది. పదే పదే చేసినటువంటి పని ఎంత అసహ్యమైనదైనా సరే మనిషికి ప్రియమవుతుంది. పసిపిల్లవాడి నోటికి కొంచెం ఆవకాయ రాసి చూడండి ఏమవుతుందో, నాలుక మీద ఆ రుచి పోయిందాకా గగ్గోలు పెట్టి ఏడుస్తాడు. కాని ప్రతిరోజూ కొద్ది కొద్దిగా రుచిచూపిస్తూ వుంటే ఆ తర్వాత ఆ రుచికి అలవాటుపడిపోయి అది లేకపోతే ఏడుస్తాడు. అట్లాగే ఉప్పు, కారం, అలవాటు చేస్తే చప్పిడి పదార్థాలు తినడు. ఏది తింటే భరించలేక చిన్నప్పుడు ఏడ్చాడో, దానినే తినగా తినగా ఇష్టమై కూర్చుంటుంది. అభ్యాసమంటే అట్లాంటిది! అంత కృత్రిమమైనది, అంత ప్రియమైనది. అంత ప్రమాద కరమైనది. అయినా దానిని మనం అభ్యాసముతో ఏ విధంగా ప్రియమైనదిగా చేసుకున్నామో అదే రీతిన దీనినిగూడా అభ్యాసంతోటి, పదే పదే మననం చేసుకోవడంతోటి ఆలోచించడం తోటి ప్రియమైనదిగా చేసుకోగలుగుతాము. 'స్వాధ్యాయ ప్రవచనేచ' అని చెప్పారు పెద్దలు. దీనిని అధ్యయనం చేయడం ద్వారా, అధ్యయనం చేసిన దానిని ప్రక్కవాడికి చెప్పడంద్వారా దానిలో వున్న ప్రయోజనమేమిటో తెలుసుకుంటాము. మనకు తెలిసిన దానిని మరొకరికి చెప్పుకోవడంలో మరొక క్రియ గూడా జరుగుతూ వుంటుంది. దానివలన అవతల వాడికిమాత్రమే మనము బోధించడము లేదు, మన విశ్వాసాన్ని మరొకసారి దృఢపరచుకుంటున్నాము గూడా. అందుకని పెద్దలు నిజమైన జ్ఞానాన్ని గూర్చి తెలుసుకు తీరాలి అని చెప్పారు. నాకు ఇటువంటి విషయంపట్ల ఆసక్తి లేదండి అనడానికి వీలులేదు. ఎందుకని? నీకు జీవితంలో తృప్తి, శాంతులు అక్కర్లేదా? కావాలి. ప్రతివాడికి కావాలి. దానిని గూర్చి కాస్త ఆలోచిస్తే తెలుస్తుంది.

ఎవరినైనా ఒకేచోట కాసేపు కూర్చోబెడితే అలా బయటకు వెళ్ళి

తిరిగొద్దామని అనిపిస్తుంది. అదేమిటంటే బోరు కొడుతుందంటాడు. అంటే బయటకు వెళ్ళి వస్తే శాంతిగా వుంటుంది. వెళ్ళకపోతే అశాంతి ఫీలవుతాడు. అట్లా ఏదో ఒకటి చేస్తుంటేగాని శాంతి వుండదు. అటువంటి అవసరంలేని, ఎప్పుడూ వుండే శాంతికోసమే అందరూ పాటుబడుతున్నారు. కాబట్టి నాకు శాంతి అవసరంలేదు అనడంకంటే హాస్యాస్పదమైనమాట యింకొకటి వుండదు. అది అక్కర్లేనివాడికి జీవితమే అక్కర్లేదు. కాబట్టి భగవంతుడు సత్యమా? అంటే ఈ సృష్టి ఎంత సత్యమో, అంత సత్యము. ఈ సృష్టి ఏ కారణాలచేత చేయ బడిందో ఆ కారణాలు ఎంత సత్యమో అంత సత్యము. ఇది విలువైనదవునా కాదా అంటే మన జీవితంలో తృప్తి, శాంతులనేవి ఎంత విలువైనవో అంత విలువైనది. అందుకని ఆధ్యాత్మికత అంటే ఏమిటో తెలుసుకుని, మెలకువలో వుండగానే నిద్రావస్థలోని తృప్తి, శాంతులు పొందడం ఎలాగో తెలుసుకుని దానిని సాధించడం కోసం క్రమశిక్షణాపూరితమైన తర్ఫీదును అలవరుచు కుంటూ, ఏది ఎందుకు ఎలా చేయాలో తెలుసుకుంటూపోతేనేమో అదే సాధన అవుతుంది. అది తెలియకుండాపోయినపుడు మూఢమైన ఆచారమవుతుంది. మనము పిల్లలకు ఆకాశంగూర్చి, నక్షత్రాల గూర్చి, అవి ఎందుకు అలా మిణుకు మిణుకుమని వెలుగుతుంటాయి, చంద్రుడు అలా తగ్గుతూ, హెచ్చుతూ ఎందుకుంటాడు, భూమి ఎలా వుంటుంది, మనకు కలలు ఎలా వస్తాయి? ఇలాంటి విషయాలన్నీ చెప్పడం ప్రారంభిస్తే పిల్లలు ఎంతో ఆసక్తిగా వింటూ ఇంకా ఇంకా ప్రశ్నలు వేస్తారు. కాని అదేవిషయాన్ని పాఠంగా చెప్పడం ప్రారం భిస్తే వినరు. ఇక్కడ బలవంతముగా చెప్పవలసి వస్తుంది. కాని మనం చెబుతు న్నప్పుడు మననోరు నొప్పి పుట్టవలసిందేగాని, మనం చెప్పలేనంతగా ఎంతో ఆసక్తిగా అడుగుతారు. తెలుసుకోవడమనే ఆసక్తి వలన మనం ఏ విషయాన్నైనా ఆలోచించి తెలుసుకుంటాము. ఒకటి సత్యమని విన్నాము. దానిని గురించి పరిశోధించాము. అంతకంటే శ్రేయస్కరమైనది మరొకటి లేదని తెలిసింది. అప్పుడు మనకు నమ్మకం కలుగుతుంది. ఉదాహరణకు ఫలానా మందు మీరు ఉపయోగించండి, మీకా వ్యాధి నయమవుతుంది అని ఒకరు చెప్పారనుకోండి. చూద్దాములే అని వూరుకోవడమో, లేక ఆ మందులను తెప్పించుకుని వాడ కుండా వుండడమో చేసామనుకోండి. వ్యాధి తగ్గుతుందా? కొంచెంకూడా తగ్గదు. అలాగాక ఆ మందులను వాడి చూస్తామనుకోండి. వ్యాధి తగ్గింది.

అప్పుడు నమ్మకం కలుగుతుంది. అప్పుడు మళ్ళీ అనుమానం వస్తుంది. మనకే తగ్గిందా? లేక ఆ వ్యాధివున్న యింకెవరికైనా తగ్గిందా? తగ్గు తున్నదని తెలిసినపుడు ఆ మందుపట్ల విశ్వాసం కలుగుతుంది. సైన్సులో గూడా అంతే. మనకు గోచరమైన వాటిని, మనము గ్రహించగలిగిన వాటిని తీసుకుని, వాటిమీద ఆధారపడి ఒక ప్రతిపాదనను చేసుకుంటారు. ఆ ప్రతిపాదన మీద ఆధారపడి మళ్ళీ ప్రయోగం చేస్తారు. అపుడు వచ్చిన సమాధానం సరిపోయి నట్లయితే ఆ సిద్ధాంతం సరియైనదన్నమాట. అట్లాగే భగవంతుడు వున్నాడు అని విన్నాము. అలా వున్నాడని చెప్పినవాళ్ళందరూ ఏమేమి చెప్పారో, ఆ భగవంతుని ధర్మాలు ఏమిటో తీసుకుని, ఈనాడు అందరిచేతా అంగీకరించ బడుతున్న ఆధునిక శాస్త్ర విజ్ఞానంద్వారా ఆలోచించాము. అది సత్యమై వుండడంతప్ప యింకొక మార్గంలేదని మన మనస్సుకు ధృవపడింది. అప్పుడు తిరిగి అది ఉపయోగరకరమైనదా కాదా అని ఆలోచిస్తే వుపయోగకరమైనది అని తేలింది. ఈ జీవితానికి తృప్తి, శాంతులు లక్ష్యమని గనుక మనం అంగీక రించి దానిని పొందాలని ప్రయత్నిస్తే ఆ లక్ష్యమనేది మనకు సాధ్యమవుతుంది. అందుకని మనిషికి మాత్రమే ధర్మాధర్మాలు సత్యము. మనిషి మాత్రమే జీవిత గమ్యాన్ని అర్థం చేసుకోగలడు. అర్థం చేసుకుని నాకుకావలసినది ఇది అని తీర్మానించుకోగలడు. అందుకు కావలసినవిధంగా పథకం వేసుకోగలడు, ఆచరించగలడు. తనకు తృప్తి, శాంతులు కావాలి కనుక వాటిని పొందవలసిన మార్గమిది అని తెలుసుకుని దాని కోసం అన్వేషించుకుంటూ ఆ ప్రక్రియలో తనను నిగ్రహించుకుంటూ రాగద్వేషాదులను అదుపులోకి తెచ్చుకోగలడు. ఆ విధంగా సమాజంలో ధర్మాన్ని నిలబెట్టగలుగుతాడు. అట్టి సామర్థ్యం కలవాడు గనుక మనిషి అన్నారు. మనస్సుకలిగిన వాడు గనుక మనిషి. మనస్సు అంటే యిట్టి యోచన. యిది నాకక్కరలేదు, యిది నాకుకావాలి అని యోచించ గలిగినవాడు. అందుకని భగవంతుడంటే వున్నాడని గాని, లేడనిగాని తెలుసు కోవడమనేది నిజమైన జిజ్ఞాస. ఇది విశ్వాసంమీద ప్రశ్న కాదు. ఇక్కడ ఒక పదార్థం వున్నదా? లేదా? అంటే వున్నదనో, లేదనో గుర్తించడమే జిజ్ఞాస. దానిని విశ్వసించడము, వుపయోగించడము తర్వాత సంగతి. అందుకనే మన పెద్దలు స్వాధ్యాయ ప్రవచనాలద్వారా ప్రత్యక్షగోచరము కానిదానిపట్ల విశ్వాసము పొందవలసినది, గుడ్డిగా నమ్మవద్దు అని చెప్పారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఏం చెప్పాడంటే - సత్వగుణము, రజోగుణము, తమోగుణములనేవి వున్నాయి.

రజోగుణము, తమోగుణము గలవారు సరిగాఅర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయరు. అసలు తత్త్వమంటే ఏమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస పేరు సత్వగుణ ప్రధానమైన జిజ్ఞాస, లేక బుద్ధి. మనిషియొక్క తత్త్వమేమిటి?జీవిత పరమార్థ మేమిటి? జీవిత పరమావధి ఏమిటి? అనే ఆలోచించే మనస్సు సాత్విక మైన మనస్సు. అదిచేసే యోచన, జ్ఞానసముపార్జన స్వాత్వికమైనది. దానిని పొందవలెనన్న శ్రద్ధ, సాత్వికమైన శ్రద్ధ. అందుకోసం చేసే కర్మలన్నీ గూడా సాత్వికమైనవి. అట్లాగాకుండా కర్మలు వుండేవారు గుడ్డిగాచేసినా సరియైన ఫలితము రాదు అని గీతలో స్పష్టంగా చెప్పారు. ఉదాహరణకు అన్నదానం చేయడం గురించి యిదివరలో చెప్పుకున్నాము. అందుకని ఆ రీతిన జీవిత పరమావధిని గూర్చి స్పష్టంగా తెలుసుకుని జీవించడం మానవునియొక్క లక్ష్యం. అట్టిది కలిగినవాడు గనుక మనిషి అన్నారు. కనుక యిది సత్యమా, సత్యం కాదా? అనే విచికిత్స మనిషికి సహజమై వుండాలి, లేకపోతే మనిషికి యింతటి శాస్త్ర పరిజ్ఞానం ఎందుకు? నక్షత్రాలు ఎట్లా వుంటే మన కెందుకు? భూమి ఎట్లా వుంటే మనకెందుకు? చంద్రుడు ఎట్లా వుంటే మనకెందుకు? ఈ సైన్సు అంతా ఎందుకు? టెక్నాలజీ ఎందుకు? అంటే ఆ తెలుసుకోవాలనే జిజ్ఞాస. అందుకని యిది నిజంగా వున్నదా? సైన్సు పరంగా నిరూపించ బడిందా? అది చూచినపుడు అది సాధించినవాళ్ళు ఏదైతే చెప్పారో అవన్నీ ఈనాడు సైన్సు పరంగా నిరూపణ అవుతున్నాయి. సిద్ధ నాగార్జునుడు ఏదైతే చెప్పాడో, యిప్పటి ఆధునిక శాస్త్రజ్ఞులు అదే చెబుతున్నారు. వారు చెప్పిన వాటిని రెండింటినీ ప్రక ప్రక్కన పెట్టి చూస్తే ఎవరు చెప్పినదేదో రచయితల పేర్లు చెప్పకపోతే ఎవరూ చెప్పలేరు. ఈ సృష్టియొక్క తత్త్వాన్ని గూర్చి పూర్వపు ఋషులు చెప్పినదానిని యిప్పటి శాస్త్రజ్ఞులు చెప్పినదానిని చూస్తే ఏది పూర్వ ఋషుల అభిప్రాయమో, ఏది ఆధునిక శాస్త్రవేత్తల అభిప్రాయమో తెలుసుకోలేము.

ఎందుకంటే వారు చెప్పిన నిర్వచనాలు ఒకేరకంగా వుండడమే. అదే విధంగా ఇటీవలి కాలంలో గూడ రమణమహర్షి, రామకృష్ణ పరమహంస వంటి వారిని తీసుకున్నట్లయితే అటువంటి మహాత్ములు అన్ని మతాలలోనూ వున్నారు. చిత్రమేమంటే భగవదనుభూతి పొందిన అటువంటి మహాత్ము లందరూ గూడా వేదాంత చర్చగాని, తర్కముగాని చేయలేదు. సూటిగా జీవితంలో ప్రయోగం (experiment) చేసారు. అప్పుడు వాళ్ళు భగవంతుని గూర్చి స్పష్టమైన నిర్వచన

మిచ్చారు. వీరిలో ప్రపంచంలోని అన్ని మతాలకు చెందినవారూ వున్నారు. చూడడానికి ఒక మతం, మరొక మతంతో సిద్ధాంత పరంగా ఏకీభవించదు. కాని ఆ మతాలలోని పరిపూర్ణత చెందిన మహా త్ములు ఆ చరమస్థితిలో తమకు పరమాత్మగూర్చి ఏమనుభవమైందో చెప్పినవి మాత్రము ఒక్కటిగానే వున్నాయి. అదీ ఆశ్చర్యకరమైన విషయం. పాశ్చాత్య దేశాలలోని మహాపండితులలో ఒకరైన అథర్టన్ వివిధ దేశాలలోని పరిపూర్ణులైన మహాత్ముల చరిత్రలు, వారియొక్క అనుభూతులను గూర్చి వివరంగా తెలుసుకుంటూవచ్చి ఒక గొప్ప గ్రంథం వ్రాశారు. అది చదివితే మనకు తెలుస్తుంది - ఒకరు వైష్ణవ సాంప్రదాయంలోని వారై పరిపూర్ణులై వుండవచ్చు. మరొకరు బౌద్ధము, మరొకరు ఇస్లాముకు చెందినవారై వుండవచ్చు. కాని వారికికలిగిన ఆధ్యాత్మికానుభూతి సరిగ్గా ఒకేలాంటి పదజాలంలో చెప్పబడడం చిత్రం. అందుకని ఈ ఆధ్యాత్మికత సత్యమనడానికి నీదగ్గరేమైనా నిరూపణ వుందా? అని అతనిని అడిగితే అతడు: "ప్రపంచంలో ఆధ్యాత్మికానుభూతిని పొందిన వాళ్ళు ఎవరెవరైతే వున్నారో, వాళ్ళందరి అనుభూతీ ఒకేలాగ వుంది గనుక, ఒకే ప్రయోగం చేసిన వాళ్ళందరికీ ఒకే ఫలితం వచ్చినప్పుడు అది సైంటిఫిక్‌గా అంగీకరించడానికి సరిపోతున్నది గనుక దీనిని గూడా అంగీకరించకపోవడానికి అవకాశం లేదు" అన్నాడు.

కాబట్టి వెనుకటిలాగా భగవంతునిపట్ల విశ్వాసము, అమాయకత్వానికీ, మౌఢ్యానికీ సంకేతము అన్న దురభిప్రాయాన్ని సమాజంలోంచి తీసివేయాలి. "ఇది విజ్ఞతకు సంకేతము, మనిషియొక్క ఆలోచనా సరళికి సంకేతము, జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి సంకేతము" అన్న విషయం తెలియ చెప్పాల్సిన బాధ్యత, దానియందు విశ్వాసంకలిగి ఈ సూత్రాలను మూలంగా తీసుకుని కృషి చేయ వలసిన అవసరం అందరిమీదా వున్నదని గమనించాలి. ఈ ప్రయత్నంవల్ల మానవజాతి అంతటికీ ఆత్మవికాసం చూపించేటటువంటి అవకాశము, మనము తరించడానికి అవకాశమూ వున్నాయి గాబట్టి తప్పక అట్టి ప్రయత్నం ప్రారంభమై నప్పుడు సమాజంలోని వ్యక్తుల స్వభావం మారుతూ వచ్చి ధర్మమనేది దానంతట అదే వస్తుంది. కనుక ఈ ఆస్తికతగాని, దైవముయందు విశ్వాసముగాని గుడ్డి నమ్మకము అని, సెంటిమెంటల్ అని, బలహీనత అనీ, వున్న దురభిప్రాయాలను నిర్మూలించవలసినదిగా మనవి చేసుకుంటున్నాను. ఈ విధంగా మనిషి చేసే టటువంటి కృషి చక్కటి యోచనకు సంకేతము, ఆత్మవిశ్వాసానికి, భగవంతుని

పట్ల విశ్వాసానికీ సంకేతము. ఇది మనోవికాసానికి, మనుగడకు అవసరమైనటువంట మూలప్రాతిపదిక, ఇది సత్యము, ఉపయోగము అన్న విషయాన్ని సమాజానికి ఎన్ని విధాల వీలయితే, అన్ని విధాల చెప్పుకుంటూ పోయినట్లయితే, దేనికోసమైతే మనమందరమూ కృషి చేస్తున్నామో దానిని మనమందరమూ కలిసి సాధించగలుగుతామని మరొక్కసారి మనవి చేసుకుంటూ ఇటువంటి సదవకాశమిచ్చిన మీ అందరికీ కృతజ్ఞతాభినందనలు చెబుతూ.......

సెలవు తీసుకుంటున్నాను

ఓం సమర్థసద్గురు సాయినాథాయనమః





శ్రీ సాయిమాస్టర్ !

ప్రియమైన భగవద్భక్తులారా !

అంధకారంలో మగ్గుతున్న మానవాళికి తమ బోధల ద్వారా చైతన్యవంతులను గావించి, తద్వారా అందరి హృదయాలలో జ్ఞాన జ్యోతులను వెలిగించడానికి త్రిమూర్త్యాత్మకుడు మరియు సిద్ధపురుషులందరి రూపంలో మానవాళిని సదా అనుగ్రహించే అనాటి దత్తుడే తిరిగి కలియుగంలో పరమపూజనీయులైన భరద్వాజ మహర్షి రూపంలో తమ తత్త్వాన్ని లోకానికి, ప్రత్యేకించి ఆంధ్రదేశానికి అందించారని ఆచార్యుల వారి ప్రియ శిష్యులైన **బ్రహ్మచారి శ్రీ రామచంద్ర చైతన్య స్వామి** వారు అంటుంటారు.

అట్టి పరమకారుణ్యమూర్తియైన భరద్వాజ మహర్షి వారివారి ఉపన్యాసాల ద్వారా అందించిన సమర్థ సద్గురువైన శ్రీ శిరిడీ సాయి తత్త్వాన్ని ఈ గ్రంథం ద్వారా భగవద్భక్తులైన మీకు భరద్వాజ మహర్షి 14వ ఆరాధనా మహోత్సవ సందర్భముగా అందిస్తున్నాము. ఆచార్యుల వారి అమృతధారను భగవద్భక్తులైన మీరందరూ గ్రోలి తరించాలన్న మా సత్సంకల్పమే యీ గ్రంథ ముద్రణకు ప్రేరణ.

పరమపవిత్రమైన యీ గ్రంథరాజమును భరద్వాజ మహర్షి ధర్మపత్ని మరియు మనందరికీ **"అమ్మ"** అయిన లోకపావని **అలివేలు మంగమ్మ తల్లి** దివ్య పాదపద్మములకు భక్తి శ్రద్ధలతో సమర్పించుకుంటున్నాము.

విశ్వజనని అలివేలు మంగా సమేత భరద్వాజ ఆశ్రమం, శిరిడి.

ప్రచురణ : **శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్**

ఎమ్.ఎమ్. డొంక, ఒంగోలు - 2. ☎ 08592 - 33271.

E-mail : masteruniversal@yahoo.com

Internet : www.saibharadwaja.org www.acharyabharadwaja.org

www.mohanpublications.com

మోహన్ పబ్లికేషన్స్‌లో లభించు
పుస్తకముల పట్టిక
(Book List)

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్రాది
అనేక విషయాలు తెలుసుకోండి...

ఫేస్‌బుక్ **మోహన్ పబ్లికేషన్స్** పేజ్ లైక్ చేయండి.

Like us to follow :
MOHAN PUBLICATIONS
Rajamahendravaram



28.	తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	10-00
29.	శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	36-00
30.	శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	36-00
31.	లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	10-00
32.	శ్రీ సరస్వతీ నిత్యపూజ	10-00
33.	శ్రీ దుర్గానిత్యపూజ	10-00
34.	కాలభైరవ నిత్యపూజ	10-00
35.	శివపూజ	10-00
36.	వీరభద్ర పూజ	10-00
37.	ఆంజనేయ నిత్యపూజ	10-00
38.	నాగేంద్ర స్వామి పూజ	10-00
39.	సుబ్రహ్మణ్య నిత్యపూజ	10-00
40.	రామదేవుని కథ	10-00
41.	శివదేవుని కథ	10-00
42.	లక్ష్మీనరసింహపూజ	10-00
43.	వేంకటేశ్వరపూజ	10-00
44.	బ్రహ్మంగారి నిత్యపూజ	10-00
45.	సూర్య నిత్యపూజ	10-00
46.	నవగ్రహ నిత్యపూజ	10-00
47.	రుక్మిణీ కల్యాణం	25-00
48.	ఉమామహేశ్వర వ్రతం	36-00
49.	శ్రీ కామేశ్వరీ వ్రతం	36-00
50.	16 సోమవారముల వ్రతము	25-00
51.	పార్వతీకల్యాణం	25-00
52.	సహస్రకమలవర్తి వ్రతము	25-00
53.	పంచముఖ ఆంజనేయ పూజావిధానము	36-00
54.	అష్టనాగపూజ	36-00
55.	పూజలు ఎందుకుచేయాలి ?	36-00
56.	ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	36-00
57.	ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	36-00
58.	ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	36-00
59.	ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	36-00
60.	హనుమద్ వ్రతం	36-00
61.	పంచాయతన పూజ	63-00
62.	28 వ్రతములు	120-00

63.	కలశపూజలు (9ఒకేసారి)	150-00
64.	కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో)	....
65.	హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో)	....
66.	గోమాత	40-00

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

1.	శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	45-00
2.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	50-00
3.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	50-00
4.	స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	99-00
5.	లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మీ	63-00
6.	స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్	108-00
7.	సర్వదేవతా స్తోత్రమంజరి	120-00
8.	సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	24-00
9.	విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	25-00
10.	లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్)	36-00
11.	లలితా సహస్రనామములు	24-00
12.	లక్ష్మీ సహస్రనామములు	24-00
13.	దుర్గా సహస్రనామములు	24-00
14.	ఆంజనేయ సహస్రనామములు	24-00
15.	శివ సహస్రనామములు	24-00
16.	విష్ణు సహస్రనామములు	24-00
17.	గణపతి సహస్రనామములు	24-00
18.	సుబ్రహ్మణ్య సహస్రనామములు	24-00
19.	గాయత్రి సహస్రనామములు	24-00
20.	లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	24-00
21.	శ్రీరామా సహస్రనామములు	24-00
22.	సరస్వతి సహస్రనామములు	24-00
23.	సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం	24-00
24.	శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	24-00
25.	మణిద్వీపవర్ణన (పెద్దది)	24-00
26.	సంధ్యావందనం	24-00
27.	మంత్రపుష్పమ్	....
28.	త్రిభాషా హనుమాన్‌చాలీసా	15-00
29.	హనుమాన్ చాలీసా	10-00

30.	మణిద్వీపవర్ణన (పాకెట్)	10-00
31.	ఆరు చాలీసాలు	10-00
32.	శివారాధన (శివస్తోత్రాలు)	10-00
33.	వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	10-00
34.	ఆరుదండకాలు	5-00
35.	వేంకటేశ్వర గోవిందనామములు	5-00
36.	అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	10-00
37.	దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్ధనీస్తోత్రంతో)	10-00
38.	సుందరకాండ (పాకెట్)	10-00
39.	భగవద్గీత మూలం	27-00
40.	రామరక్షాస్తోత్రమ్	15-00
41.	స్తోత్ర రత్నావళి	36-00
42.	పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
43.	పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ)	10-00
44.	పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	10-00
45.	పురాణపండ ఆదిత్య హృదయం	10-00
46.	మంత్రపుష్పం (మినీ)	10-00
47.	శివానందలహరి-సౌందర్యలహరి	36-00
48.	కుజదోషం	10-00
49.	కాలసర్ప దోషం	10-00
50.	మీ అప్పులు తీరాలా?	10-00
51.	దృష్టిదోషాలు నివారణ	10-00
52.	పంచసూక్తములు	10-00
53.	సంధ్యావందనం	10-00
54.	రుద్రనమకమ్-చమకమ్	10-00
55.	గాయత్రీమంత్రాలు	10-00
56.	హయగ్రీవ స్తోత్రమాల	10-00
57.	దక్షిణామూర్తి స్తోత్రమాల	10-00
58.	ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో	10-00
59.	శ్రీసూక్తం పురుష సూక్తం	10-00
60.	నవగ్రహస్తోత్రమాల	36-00
61.	మహాన్యాసమ్	36-00
62.	సుందరకాండ గానామృతం	36-00
63.	గోమాతపూజావిధానము	10-00
64.	ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల	108-00

65.	ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి	108-00
66.	ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల	108-00
67.	శ్రీ కాలభైరవ రక్షా కవచమ్	63-00
68.	అర్చన	40-00
69.	నిత్యదేవతార్చన	40-00
70.	సర్వదేవతా స్తోత్ర నిధి	99-00
71.	శ్రీచక్ర నవవరణార్చన	63-00
72.	చండీ సప్తశతి పారాయణ క్రమం	99-00
73.	శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో	99-00
74.	వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్	63-00
75.	శ్రీ కాలభైరవ వ్రతము	63-00

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

1.	శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	120-00
2.	సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	120-00
3.	శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం	120-00
4.	శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	63-00
5.	శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	63-00
6.	నవనాథ చరిత్ర	99-00
7.	శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
8.	శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	63-00
9.	సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో	30-00
10.	అనఘాదేవీ వ్రతం	30-00
11.	భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	30-00
12.	శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	25-00
13.	శ్రీ సాయిభజనమాల	20-00
14.	శ్రీ సాయి భజన్స్	20-00
15.	శ్రీ సాయిభక్తి గీతాలు	20-00
16.	శిరిడిహారతులు (భావంతో)	20-00
17.	"శ్రీసాయి"కోటి	27-00
18.	"శ్రీసాయిరామ్"కోటి	20-00
19.	శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	10-00
20.	శ్రీ సాయివేయినామాలు	8-00
21.	శ్రీ సాయి హారతులు (పాకెట్)	15-00
22.	శ్రీ సాయి స్తవనమంజరి	10-00
23.	హిందీ శ్రీ సాయి హారతులు	15-00

24.	శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	63-00
25.	ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	15-00
26.	షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	99-00
27.	సాయిసత్యవ్రతం	30-00
28.	సాయి అనుగ్రహమ్	120-00
29.	నవగురువారాల వ్రతకల్పము	15-00
30.	శ్రీదత్తలీలామృతము	99-00
31.	హృదయంలో సాయి	15-00
32.	శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర)	120-00
33.	గజాననమహరాజ్ చరిత్ర	99-00

4. జ్యోతిషాలు

1.	'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	72-00
2.	గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	108.00
3.	ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి)	63.00
4.	ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి)	50.00
5.	ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	12.00
6.	కాలచక్రంజ్యోతిషక్యాలండర్	25.00
7.	గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	25.00
8.	శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	25.00
9.	సాదా క్యాలండర్	5.00
10.	పాకెట్ క్యాలండర్	15.00
11.	తాజకనీలకంఠీయమ్	100-00
12.	కేరళ జ్యోతిష రహస్యాలు	180-00
13.	జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	180-00
14.	మానసాగరి జాతకపద్ధతి	180-00
15.	వరాహమిహిర జాతకపద్ధతి	180-00
16.	వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	99-00
17.	సింపుల్ రెమిడీస్	180-00
18.	శంభు హోరప్రకాశిక	250-00
19.	పూర్వ పరాశరి	100-00
20.	పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200-00
21.	ప్రశ్న సింధు	99-00
22.	నక్షత్ర విశేష ఫలితాలు	63-00
23.	సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా?	180-00
24.	దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా?	180-00

25. ఆయుర్దాయ నిర్ణయం	63-00
26. జాతక గణిత ప్రవేశిక	63-00
27. జ్యోతిషమర్మబోధిని	63-00
28. జ్యోతిష ప్రశ్నోత్తరమాల	63-00
29. ముహూర్తం నిర్ణయించడంఎలా?	63-00
30. జాతక మకరందం	63-00
31. జ్యోతిష సరస్వతి	63-00
32. మీజననకాల విశేషాలు	63-00
33. ముహూర్త విజ్ఞాన భాస్కరం	63-00
34. జ్యోతిష స్వయంబోధిని	63-00
35. శుభముహూర్త శిరోమణి	63-00
36. నక్షత్ర ఫలమంజరి	36-00
37. పంచాంగం చూసే విధానం	36-00
38. సర్వార్థ జ్యోతిషం	36-00
39. ప్రాథమిక జ్యోతిషం	36-00
40. నవరత్నములు శుభయోగములు	36-00
41. శుభశకునాలు	30-00
42. హస్తరేఖాఫలితాలు	36-00
43. సంఖ్యల్లో భవిష్యత్	36-00
44. ముహూర్త దీపిక	99-00
45. పుట్టుమచ్చలు ఫలితాలు	30-00
46. కలలు ఫలితాలు	30-00
47. జాతక చక్రం వేయడం ఎలా?	36-00
48. మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు	250-00
49. జ్యోతిషశాస్త్ర చిట్కాలు	120-00
50. గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050)	999-00
51. ప్రశ్నచండేశ్వరమ్	63-00
52. ద్వాదశభావ ఫలచంద్రిక	250-00
53. జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు)	120-00
54. అంగసాముద్రికం	36-00
55. హస్త సాముద్రికం	63-00
56. లాల్ కితాబ్	99-00
57. శకునశాస్త్రం	63-00
58. ఆధునికప్రశ్నశాస్త్రం	120-00
59. పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	180-00

60.	అష్టకవర్గు (కొండపల్లి)	63-00
61.	బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	250-00
62.	లగ్నరత్నాకరం	63-00
63.	షట్పంచాశిక	120-00
64.	40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	270-00
65.	40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	180-00
66.	40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	180-00
67.	40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	270-00
68.	40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి	250-00
69.	మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి)	270-00
70.	కె.పి.జ్యోతిషం (పరిచయం)	63-00
71.	ముహూర్తచింతామణి	99-00
72.	సూర్యచంద్ర గ్రహణములు	63-00
73.	ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	180-00
74.	అదృష్టరెమెడీస్	144-00
75.	గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	63-00
76.	జ్యోతిష రెమిడీస్	300-00
77.	జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
78.	జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి)	250-00
79.	నాడీజ్యోతిషం	63-00
80.	నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
81.	లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	63-00
82.	గౌతమసంహిత	63-00
83.	హోరరత్నమాల	63-00
84.	జాతకఫల మణిమంజరి	200-00
85.	పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25)	560-00
86.	దశాభుక్తిఫల నిర్ణయం	250-00
87.	వింత జోష్యములు	63-00
88.	షోడశవర్గులు	200-00
89.	రవిగ్రహ సమస్త ప్రభావములు	99-00
90.	చంద్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00
91.	కుజ గ్రహ సమస్త ప్రభావములు	99-00
92.	బుధ గ్రహ సమస్త ప్రభావములు	99-00
93.	గురు గ్రహ సమస్త ప్రభావములు	99-00
94.	శుక్ర గ్రహ సమస్త ప్రభావములు	99-00

95. శని గ్రహ సమస్త ప్రభావములు	99-00
96. రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు	99-00
97. ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు	99-00
98. ముహూర్తమార్తాండం	63-00
99. లఘుజాతకం	63-00
100. జాతకాలంకారము	63-00
101. మేషలగ్న ఫలితములు	99-00
102. వృషభ లగ్న ఫలితములు	99-00
103. మిధున లగ్న ఫలితములు	99-00
104. కర్కాటక లగ్న ఫలితములు	99-00
105. సింహలగ్న ఫలితములు	99-00
106. కన్యలగ్న ఫలితములు	99-00
107. తుల లగ్న ఫలితములు	99-00
108. వృశ్చిక లగ్న ఫలితములు	99-00
109. ధనుస్సు లగ్న ఫలితములు	99-00
110. మకర లగ్న ఫలితములు	99-00
111. కుంభ లగ్న ఫలితములు	99-00
112. మీన లగ్న ఫలితములు	99-00
113. నారద సంహిత	200-00
114. పంచాంగపీఠికలేఖికాగణితం	250-00
115. తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప)	99-00
116. సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా)	200-00
117. రాహు కేతువుల యోగము	99-00
118. ఛాయాగ్రహములు	99-00
119. జ్యోతిషవిజ్ఞాన దీపిక	63-00

బి.వి.రామన్ గారి గ్రంథములు

120. జ్యోతిష విద్యారంభం	50-00
121 గ్రహభావ బలములు	50-00
122. కాలచక్రదశ	50-00
123. అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50-00
124. జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50-00
125. పురోగామి జాతకం	50-00
126. భావార్థరత్నాకరం	75-00
127. భారతీయజ్యోతిష సర్వస్వం	75-00
128. అష్టకవర్గ పద్ధతిః	75-00

129.	జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75-00
130.	ప్రశ్నతంత్ర	75-00
131.	ముహూర్తం	75-00
132.	విశిష్ట జాతకములు	125-00
133.	భారతీయఫలితజ్యోతిషం	125-00
134.	300 ముఖ్యమైన యోగములు	125-00
135.	జాతకంపరిశీలించడంఎలా ?	300-00

రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి
శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు

136.	బృహత్పరాశరహోరాశాస్త్రము-1	200-00
137.	బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200-00
138.	బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200-00
139.	బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200-00
140.	భావార్థరత్నాకరము	100-00
141.	ముహూర్త చింతామణి	100-00
142.	ముహుర్త చింతామణి-పార్టు2	200-00
143.	స్వప్న శాస్త్రము	36-00
144.	శతయోగమంజరి	50-00
145.	వ్రతనిర్ణయకల్పవల్లి	250-00
146.	దైవజ్ఞవల్లభం	75-00
147.	వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం)	250-00
148.	వాస్తుశాస్త్రవివేకము-1	100-00
149.	వాస్తుశాస్త్రవివేకము-2	200-00
150.	వాస్తుశాస్త్రవివేకము-3	100-00
151.	వాస్తుశాస్త్రవివేకము-4	200-00
152.	అనుభవసులభవాస్తు - 1	50-00
153.	అనుభవసులభవాస్తు - 2	100-00
154.	పంచాంగ వివేకము	99-00
155.	వశిష్ఠ సంహిత	360-00
156.	పంచపక్షి శాస్త్రం (కేస్బైండ్)	200-00

5. వాస్తులు

1.	40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180-00
2.	వాస్తుశాస్త్ర రహస్యములు	200-00
3.	వాస్తునుబట్టి మీ ఇల్లు	63-00
4.	మీరూ మీ వాస్తు	63-00

5.	గృహవాస్తు చిట్కాలు	63-00
6.	వాస్తు పూజ	63-00
7.	వాస్తు సూత్రములు	63-00
8.	వాస్తుశాస్త్ర రహస్యాలు	63-00
9.	గృహవాస్తు వర్గులు	99-00
10.	విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	63-00
11.	విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు	99-00
12.	విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా)	180-00
13.	ఆధునిక గృహవాస్తు	99-00
14.	శుభవాస్తు	270-00
15.	వాస్తుయంత్ర రత్నావళి	120-00
16.	వాస్తుశాస్త్రం	120-00
17.	హౌస్ ప్లాన్స్	63-00
18.	గృహనిర్మాణ వాస్తు	63-00
19.	వాస్తు రెమెడీస్	63-00
20.	గృహవాస్తు దర్పణం	63-00
21.	జ్యోతిష-గృహవాస్తుచంద్రిక	200-00
22.	వాస్తురత్నాకరం (కొండపల్లి)	63-00
23.	వాస్తుశిరోమణి ,,	120-00
24.	వాస్తుసంగ్రహమ్ ,,	63-00
25.	పంచవాస్తు పారిజాతం ,,	120-00
26.	వాస్తుడిండిమమ్ ,,	63-00
27.	వాస్తుదుందిభి ,,	120-00
28.	విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్)	250-00
29.	కృష్ణవాస్తుశాస్త్రము	63-00
30.	జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్)	99-00
31.	మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120-00
32.	వాస్తు జ్యోతి	63-00
33.	మన ఇల్లు-మనవాస్తు	99-00
34.	వాస్తవ వాస్తుపూజావిధానము	108-00
35.	వాస్తు దర్పణం	120-00

6. మంత్రశాస్త్రాలు

1.	మంత్రసాధన	63-00
2.	తంత్రజాలం	63-00
3.	మంత్రశక్తి	63-00

4.	దత్తాత్రేయ తంత్రవిద్య	63-00
5.	దత్తాత్రేయ మూలికాతంత్రమ్	63-00
6.	తాంత్రిక పంచాంగం	63-00
7.	యక్షిణీ తంత్రం	63-00
8.	మంత్రానుష్ఠాన చంద్రిక	63-00
9.	సర్వదేవతా మంత్రకవచములు	63-00
10.	మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు)	63-00
11.	సర్వదేవతా మంత్రరత్నావళి	63-00
12.	సదాచార దీపిక	63-00
13.	యోగినీ-వామకేశ్వరతంత్రం	63-00
14.	ప్రపంచసారతంత్రం	63-00
15.	బదనిక తంత్రమ్	63-00
16.	ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	63-00
17.	గుప్త సాధన తంత్రం	63-00
18.	గంధర్వ తంత్రమ్	63-00
19.	సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	63-00
20.	యంత్ర మంత్ర తంత్ర	63-00
21.	పాశుపత తంత్రం	99-00
22.	పంచదశ మహాఖడ్గ తంత్రం	99-00
23.	రుద్రాష్టాధ్యాయః	99-00
24.	మంత్రసిద్ధి	120-00
25.	పరశురామతంత్రమ్	108-00
26.	శ్రీలలితావిలోమ పంచదశీ	108-00
27.	శ్రీ గురు తంత్రం	108-00
28.	గాయత్రీ తంత్రమ్	108-00
29.	మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150-00
30.	శ్రీ దుర్గ తంత్రమ్	200-00
31.	మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	200-00
32.	సర్ప (నాగ)తంత్రం	250-00
33.	హవన తంత్రం	250-00
34.	షోడశనిత్యతంత్రం	250-00
35.	శాక్తేయతంత్రం	250-00
36.	రుద్రయామళతంత్రం	250-00
37.	లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250-00
38.	హిరణ్యశూలినీ తంత్రమ్	250-00

39.	మాయాప్రత్యంగిరా తంత్రమ్	250-00
40.	శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250-00
41.	స్వర్ణాకర్షణభైరవతంత్రం	250-00
42.	కాశీవిశాలాక్షి తంత్రం	250-00
43.	శాంతితంత్రమ్	250-00
44.	యంత్రసిద్ధి	360-00
45.	శ్రీ లక్ష్మీతంత్రమ్	360-00
46.	మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360-00
47.	మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360-00
48.	మంత్రశాస్త్రం (గ్రంథము)	360-00
49.	ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360-00
50.	కామధేనువు తంత్రం	360-00
51.	శూలినీదుర్గాతంత్రం	360-00
52.	శ్రీవిద్య రహస్యం	290-00
53.	కులార్ణవ తంత్రమ్	150-00
54.	ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్)	390-00
55.	సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం)	63-00

7. గ్రంథాలు - ఆరాధనలు

1.	భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	54-00
2.	భగవద్గీత (వచనం)	99-00
3.	భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్	72-00
2.	గణేశ ఆరాధన 1	99-00
3.	గణేశోపాసన 2	99-00
4.	నవగ్రహవైభవం	99-00
5.	నవగ్రహ రెమెడీస్	99-00
6.	నవగ్రహ వేదం	99-00
7.	శనిగ్రహారాధన	99-00
8.	ఆదిత్యారాధన	99-00
9.	సుబ్రహ్మణ్యారాధన	99-00
10.	శ్రీ శివ ఆరాధన	99-00
11.	లక్ష్మీ ఆరాధన	99-00
12.	హనుమదారాధన	99-00
13.	లలితారాధన	99-00
14.	శ్రీ చక్రారాధన	99-00
15.	గాయత్రీ ఆరాధన	99-00

16.	వీరభద్రారాధన	99-00
17.	కుజగ్రహారాధన	99-00
18.	భైరవారాధన	99-00
19.	దైవారాధన	99-00
20.	గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత)	99-00
21.	శ్రీవేంకటేశ్వరాధన	99-00
22.	హయగ్రీవారాధన	99-00
23.	లక్ష్మీనరసింహారాధన	99-00
24.	శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం	99-00
25.	దేవీ లీలామృతం	99-00
26.	పురాణపండ సుందరకాండ వచనం	99-00
27.	పురాణపండ రామాయణం	99-00
28.	పురాణపండ భారతం	99-00
29.	పురాణపండ భాగవతం	99-00
30.	(సూరి) వాల్మీకి రామాయణం	99-00
31.	కాలసర్ప యోగం	99-00
32.	నిత్య జీవితములో రుద్రాక్షలు	99-00
33.	నిత్య జీవితములో నవరత్నాలు	99-00
34.	వేదసూక్తములు	99-00
35.	వేమన పద్యసారామృతం	99-00
36.	పండగలు పర్వదినాలు	99-00
37.	సూక్తిరత్నాలు	99-00
38.	హనుమచ్చరిత్ర	99-00
39.	నవగ్రహ దర్శనమ్	99-00
40.	నిత్యజీవితంలో నవగ్రహాలు	99-00
41.	సాలగ్రామములు	99-00
42.	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	99-00
43.	శనిగ్రహరెమిడీస్	99-00
44.	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	99-00
45.	వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి)	99-00
46.	మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,,	99-00
47.	మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,,	99-00
48.	న్యూమరాలజీ రెమిడీస్	99-00
49.	మూకపంచశతీ	99-00
50.	శ్రీరామకర్ణామృతం	99-00

51.	రహస్యకుక్కుటశాస్త్రం	300-00
52.	ఉపాసన విధానం	99-00
53.	పంచమవేదం మహాభారతం	99-00
54.	దేవుళ్ళ డాట్ కామ్	99-00
55.	గణపతిభాష్యం	99-00
56.	యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	99-00
57.	నవయోగులు	99-00
58.	ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	99-00
59.	సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో)	99-00
60.	సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్)	216-00
61.	సకలదేవతా సహస్రనామములు	99-00
62.	ఆధ్యాత్మిక సూక్తి నిధి	99-00
63.	బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు	99-00
64.	సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు	99-00
65.	శ్రీ లక్ష్మీసన్నిధి	99-00
66.	శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం	99-00
67.	మార్షల్‌ఆర్ట్ స (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	99-00
68.	మ్యాజిక్‌గైడ్	99-00
69.	చదరంగం	99-00
70.	పంచముఖ హనుమత్ వైభవం	63-00
71.	గరుడపురాణం	40-00
72.	మాఘపురాణం	36-00
73.	శివపురాణం	36-00
74.	వైశాఖపురాణం	36-00
75.	కార్తీక పురాణం	36-00
76.	కార్తీక పురాణం (చిన్నది)	25-00
77.	సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	63-00
78.	పెద్దబాలశిక్ష	50-00
79.	గాయత్రీ మహిమ	36-00
80.	వృక్షదేవతలు	63-00
81.	యాజుష స్మార్త సంస్కార చంద్రిక	200-00
82.	సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150-00
83.	చతుర్వేదములు	120-00
84.	నవగ్రహారాధన	120-00
85.	తాళపత్ర సమాహార గోపురం	120-00
86.	మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు)	250-00

87. మానవధర్మములు		120-00
88. వేదమంత్ర సంహిత		120-00
89. సహస్రలింగార్చన		120-00
90. శ్రీ శివగీత		120-00
91. ద్వాదశఉపనిషత్తులు		120-00
92. పురాణపండవారి సౌందర్యలహరి	(కేస్‌బైండ్)	250-00
(శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	సాదా	120-00
93. బృహత్ శివ స్తోత్ర రత్నాకరము		200-00
94. బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము		200-00
95. బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము		200-00
96. కేదారనాధ్ బదరీనాధ్ యాత్రాగైడు		63-00
97. దక్షిణావృత శంఖములు		63-00
98. 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని		36-00
99. ధర్మసింధువు(కేస్‌బైండింగ్)		270-00
100. భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని		99-00
101. చిలుకూరి బాలాజీచరిత్ర		36-00
102. భగవత్‌స్తుతి		63-00
103. సూర్యోపాసన		36-00
104. కాశీఖండం		250-00
105. దేవీభాగవతం		360-00
106. శ్రీ ఆంజనేయం		216-00
107. ధర్మసందేహాలు		216-00
108. ఆధ్యాత్మిక దైవిక వస్తువులు		250-00
109. రామాయణం		600-00
110. పోతన భాగవతం		900-00
111. శివమంత్రములు		63-00

8. వైద్య గ్రంథాలు

1. ఆహారం ఆరోగ్యం	36-00
2. మూలికావైద్య చిట్కాలు	36-00
3. ఆయుర్వేద వైద్య చిట్కాలు	30-00
4. గృహవైద్య రహస్యాలు	36-00
5. గృహవైద్యసారం	36-00
6. హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	63-00
7. ప్రకృతివైద్యం	36-00
8. ఆహారం-వైద్యం	99-00

9.	సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	99-00
10.	ఆయుర్వేదమ్	36-00
11.	ఆయుర్వేద మూలికావైద్యదీపిక	99-00
12.	దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు)	99-00
13.	ఏకమూలికావైద్యం	99-00
14.	అష్టాంగ హృదయం (4భాగాలు)	1200-00
15.	రహస్యసిద్ధయోగవైద్యసారమ్	99-00
16.	ప్రాథమిక హోమియోవైద్యం	99-00
17.	ఒబెసిటి	99-00
18.	హెల్త్‌గైడ్	99-00
19.	ఆయుర్వేదం-జీవనవేదం	99-00
20.	ఫుడ్‌థెరపి	63-00
21.	న్యాచురల్‌థెరపి	99-00
22.	సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	63-00
23.	కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	99-00
24.	యోగామంత్ర	63-00
25.	యోగా మండే టు సండే	63-00
26.	హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	99-00
27.	హెల్త్‌ఫైల్	108-00
28.	వస్తుగుణపాఠం	250-00
29.	రసాయన వాజీకరణ తంత్రం	150-00
30.	వస్తుగుణ మకరందం	400-00
31.	నాటువైద్యం -(కేస్‌బైండ్)	360-00
32.	నాటువైద్యం (చిన్నది)	99-00
33.	ప్రాణాయామము-యోగ	63-00

9. అయ్యప్ప - భవానీ రకాలు

1.	శ్రీ అయ్యప్ప లీలామృతం	30-00
2.	శ్రీ అయ్యప్ప భజనపాటలు	63-00
3.	శ్రీ అయ్యప్ప పూజాకల్పం	20-00
4.	శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	20-00
5.	హారతిగైకొనుమా	40-00
6.	శ్రీ అయ్యప్ప దీక్ష F	10-00
7.	శ్రీ అయ్యప్ప భజనమాల F	10-00
8.	శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	10-00

9.	శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	10-00
10.	భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం)	36-00
11.	దేవీలీలామృతం	99-00
12.	శ్రీ దేవీ పూజాకల్పం	20-00
13.	దేవీ భక్తిగీతాలు	20-00
14.	భవానీదీక్ష P	10-00
15.	దేవీ భక్తిమాల F	10-00
16.	శ్రీ అయ్యప్ప భజనావళి	120-00
17.	అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	24-00

10. భజనలు - కీర్తనలు

1.	అన్నమయ్య కీర్తనలు	20-00
2.	శ్రీరామదాసు కీర్తనలు	20-00
3.	సర్వదేవతా మంగళహారతులు	20-00
4.	వసుంధర మంగళ హారతులు	25-00
5.	సౌభాగ్య దేవతా మంగళహారతులు	36-00
6.	సర్వదేవతా భజనలు	36-00
7.	చిట్టి పొట్టి పాటలు	10-00
8.	జాతీయ గీతాలు	10-00
9.	దేశభక్తి గీతాలు	36-00
10.	పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	36-00
11.	గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	36-00
12.	అన్నమయ్య సంకీర్తనలు	99-00
13.	పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	36-00
14.	భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	36-00
15.	సర్వదేవతాభక్తిమణిమాల	36-00
16.	బతుకమ్మ ఉయ్యాల పాటలు	36-00
17.	అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు)	270-00

11. హిట్స్ సాంగ్స్

1.	ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత	36-00
2.	ఎస్.పి.బాలు భక్తిగీతాలు	36-00
3.	ఘంటసాల సుమధురగీతాలు	99-00
4.	పి. సుశీల సుమధురగీతాలు	99-00

5.	ఎస్.పి. బాలు సుమధురగీతాలు	99-00
6.	ఎస్.జానకి సుమధురగీతాలు	99-00
7.	వేటూరి సుందరరామమూర్తిహిట్స్	99-00
8.	సర్వదేవతా సినీభక్తిగీతాలు	99-00

12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

1.	శ్రీకాంతామణి వంటలు (వెజ్)	63-00
2.	శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	63-00
3.	శాకాహార వంటలు	30-00
4.	మాంసాహారవంటలు	30-00
5.	చిట్టిచిట్కాలు	30-00
6.	అందానికి చిట్కాలు	30-00
7.	పిల్లల పేర్లు (పెద్దది)	30-00
8.	పిల్లల పేర్లు (చిన్నది)	10-00
9.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శాలీబోర్డర్స్	36-00
10.	లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	36-00
11.	చిన్నారులకు చిరుతిళ్ళు	30-00
12.	పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	30-00
13.	పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	30-00
14.	వేపుళ్ళు-ఇగుర్లు	30-00
15.	బ్రేక్‌ఫాస్ట్ వంటలు	30-00
16.	పండుగలలో చేసుకొనే పిండివంటలు	30-00
17.	మైక్రోవోవెన్ వంటలు	99-00
18.	సర్వదేవతాభక్తిమాల	36-00
19.	పిల్లలపేర్లు (బాబు)	36-00
20.	పిల్లలపేర్లు (పాప)	36-00
21.	మోడ్రన్ మెహందీ (గోరింటాకు డిజైన్స్)	36-00
22.	మోడ్రన్ పిల్లలపేర్లు	99-00
23.	నోరూరించే నాన్‌వెజ్‌వంటలు	99-00
24.	మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్)	99-00

వివిధ రకాలు

ఎందరోమహానుభావులు	270-00
యోగాసనాలు	36-00
సూర్యనమస్కారములు	36-00
పొడుపు కథలు (చిన్నవి)	10-00

హిందీ-తెలుగు-స్వబోధిని	20-00
ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	20-00
జనరల్ నాలెడ్జ్	20-00
నూరు ఎక్కాలు	10-00
1-100 టేబుల్ బుక్	10-00
1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు)	4-50
శ్రీరామకోటి	27-00
శ్రీశివకోటి	27-00
మేజిక్	30-00
అంకెలతో గారడీ	30-00
హృదయస్పందన (కవితలు)	30-00
వాత్స్యయన కామసూత్రాలు	36-00
ఎ.పి.టూరిస్ట్ గైడు	36-00
ఇంద్రజాల రహస్యాలు	30-00
మహేంద్రజాల రహస్యాలు	30-00
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	99-00
క్రియాయోగం	36-00
ఆనందంగా జీవిద్దాం	99-00
హరిశ్చంద్ర నాటకం	50-00
వాత్సాయనకామసూత్రాలు	99-00
పంచసాయకం	99-00
రతిరహస్యాలు	99-00
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	99-00
గాయత్రీవిజ్ఞాన్	99-00
చింతామణి (నాటకం)	50-00
బాలనాగమ్మ	50-00
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	36-00
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	50-00
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	36-00
కాళహస్తి గృహవాస్తు చింతామణి	99-00
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	63-00
రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు)	90-00
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	10-00
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	80-00
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	125-00
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	40-00

కాశీరామేశ్వర మజిలీ కథలు		63-00
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)		600-00
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు		595-00
ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు		
విశ్వకర్మ ప్రకాశము		80-00
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	,,	250-00
నారద సంహిత	,,	150-00
వాస్తురాజవల్లభము-మూలానువాదము	,,	60-00
మయమతము - వచనము	,,	80-00
బృహత్సంహిత - వచనము	,,	160-00
వాస్తువిజ్ఞానజ్యోతి		......
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)		....
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు	,,	....
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,	....
మహాదశా పారిజాతం	,,	....
వాస్తు నారాయణీయం	,,	120-00
యోగావళీఖండం	,,	120-00
ముహూర్తసింధువు		150-00
సర్వార్థచంద్రిక (4భాగాలు)		1208-00
మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్)		370-00
నిర్ణయసింధు (2భాగాలు)		590-00
సాయి...	,,	45-00
శ్రీ దుర్గానందలహరి	,,	200-00
ఆరతిసాయిబాబా	,,	11-00
ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి)		500-00
తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర		100-00

సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి
ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.

శ్రీరామ మంత్రానుష్ఠానము	300-00
శ్రీరామనవరాత్రోత్సవకల్పః	300-00
సీతారామ కథా సుధ అయోధ్యకాండ	200-00
సీతారామ కథా సుధ బాలకాండ	150-00
అరణ్యకాండ	100-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు	200-00
స్మార్త కాపర్ది కారికలు	200-00
నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి	200-00
విషవైద్య చింతామణి	200-00

హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః	300-00
సర్వమూలికా గుణరత్నాకరం	300-00
ఆపస్తంబీయ ధర్మసూత్రాలు	300-00
సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం	200-00
గణకరంజని	200-00
సంతాన దీపిక	200-00
తిథినిర్ణయ కాణ్డః	250-00
ముహూర్త దర్పణం	200-00
జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి)	250-00
లఘుతాచకము	200-00
శ్రీ వైఖనస పైతృమేధిక ప్రయోగః	300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం)	400-00
జాతకామృతతసారం	300-00
జాతక బోధిని	300-00
సంగీత విద్యాదర్పణం	300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం	300-00
ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం)	450-00
జాతకరహస్యం	200-00
రాజమార్తాండం	200-00
ఆయుర్దాయదీపిక	200-00
వైద్యామృతం	200-00
అనుపానమంజరీ	200-00
నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః	200-00
చికిత్సరత్నము	200-00
స్వరచింతామణి	200-00
ద్వాదశలోహ భస్మవిధానం	200-00
దైవజ్ఞయశో విభూషణం	200-00
అనుపాన రత్నకరము	200-00
కాలామృతము	250-00
దైవజ్ఞకర్ణామృతము	300-00
రసేంద్ర చింతామణి	300-00
రసరత్న సముచ్చయం	300-00
వస్తుగుణరత్నాకరము	300-00
హోరానుభవదర్పణము	360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము	250-00
స్త్రీజన కల్పవల్లి	450-00
సంగీత సర్వార్థ సంగ్రహం	300-00
సంగీత సుధాసంగ్రహము	250-00
అర్క ప్రకాశము	200-00
సంగీత మార్తాండము	200-00
సంగీత ప్రథమబోధిని	200-00

వైద్యకల్పతరువు	200-00
రసప్రదీపిక	250-00
గణకానందము	250-00
శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో	200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం	200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక	360-00
సంగీతమార్తాండము	250-00
సారావళి	360-00
భేషజకల్పము	200-00
గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి	360-00
జాతకమణి	200-00
సర్వశకున ప్రకాశిక	200-00
యాజుష ప్రయోగ చంద్రిక	250-00
శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ	300-00
వసంతరాజ శకునము	250-00
తొట్టి వైద్యం	450-00
జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం)	300-00
సహస్ర యోగప్రకాశిక	300-00
శ్రీవిద్యారహస్యం	290-00
మహర్షుల చరిత్ర 1,3 300+300	
వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము	250-00
శ్రీఆంజనేయం	216-00
రాశితుల్యవత్సర ఫలితం	200-00
నాడి జ్యోతిష విశ్లేషణ	400-00
రహస్యకుక్కుటశస్త్రం	300-00
స్త్రీ ధర్మరత్న బాండాగారము	200-00
శైవోత్సవరత్నాకరం	300-00
యాజుషప్రయోగ చిన్తామణి	300-00
సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని	300-00
ఆయుర్వేద వైద్య సంగ్రహం	300-00
వశిష్ఠ సంహిత	360-00
హోమియోపతి గృహవైద్యం	200-00
వ్రతచూడామణి	300-00
వైశ్యధర్మప్రకాశిక	300-00
ఆలయ నిత్యార్చన పద్ధతి	200-00
స్మృతిముక్తాఫలం	300-00
ఆపస్థంబయల్లాజీయమ్	300-00
జ్యోతిషశాస్త్రసంగ్రహము	200-00
కర్మవిపాకాఖ్యయం	360-00
ముహుర్త రత్నావళి	250-00
సుదివిలోచనం	300-00
ఉత్తర కాలామృతం	200-00
సర్వవిషయ సర్వస్వసంగ్రహం	200-00